SREEMATH ANDHRA VALMIKI

RAMAYANAMU

KUMARI

పూర్ణ పరాభట్టారికాంబ కాశికాలూర

ANDHRA VALMIKI
VASUDASA SWAMY

SUNDARA KANDAMU

A LITERAL METRICAL TRANSLATION OF
VALMIKI'S SANSKRIT RAMAYANAM

by

VAVILICOLANU SUBBA ROW,
alias VASUDASA SWAMY
late Telugu Pandit, Presidency College, Madras.

AND THE AUTHOR OF

Sree Kumarabhyudayam, Sree Kausalya Parinayam
Bhagavad Gita (Dwipada), Sree Krishna Leelamritamu,
Krishnavatara Thathwamu, Subhadra Vijaya Natakamu,
&c., &c., &c.,

WITH AUTHOR'S OWN COMMENTARY

CALLED

MANDARAM

PUBLISHED BY
Sree Kodanda Rama Sevaka Dharma Samajam,
ANGALAKUDURU - TENALI

(ALL RIGHTS RESERVED)

శ్రీరామాయ నమః.

శ్రీమదాంధ్రవాల్మీకి రామాయణము

సుందరకాండ పీఠిక.

"యదా యదా హి ధర్మస్య, గ్లానిర్భవతి భారత !
అభ్యుత్థాన మధర్మస్య, తదాత్మానం సృజామ్యహమ్."
"పరిత్రాణాయ సాధూనాం, వినాశాయ చ దుష్కృతామ్
ధర్మసంస్థాపనార్థాయ, సంభవామి యుగే యుగే."

ద్వి. ఎప్పు డెప్పుడు ధర్మ మెడరు చెందెడినో, యెప్పు డధర్మంబు వృద్ధి చెందెడినో
యప్పు డప్పుడ నేన యవని సృజింతుఁ, దప్పక నన్ను నో ధర్మజావరజ !
సాధుజనంబుల సంరక్ష సలుప, బాధింప దుష్కృతిపరు లైనవారి
జగతి ధర్మంబు సంస్థాపన సేయ, యుగ యుగంబునఁ బుట్టుచుండుదు నేను.

—ద్విపద భగవద్గీత.

అను నియమము ప్రకారము రావణాది రాక్షసులచే హీనస్థితిని జెందుచున్న ధర్మము నుద్ధరించుటకును, ప్రత్యక్ష దర్శనముఁ గోరుచున్న భరద్వాజ శరభంగ సుతీక్ష్ణాద్యరణ్యవాసుల యభీష్టముఁ దీర్చను, దుష్టరాక్షసులఁ గడతేర్చను భగవంతుఁడు శ్రీరామచంద్రమూర్తిగ నవతరించెను.

శ్లో. అవజానంతి మాం మూఢా, మానుషీం తను మాశ్రితమ్
పరం భావ మజానన్తో, మమ భూత మహేశ్వరమ్.

ద్వి. భూతనియామకమున సమర్థంబు, నాతతమౌ నా మహాభావ మెదను
దెలియఁగఁ జాలని ధీవిరహితులు, వలనుగ మనుజసంబంధ దేహమును
దేకొన్న న న్నుపేక్షింతురు పార్థ! —ద్విపద భగవద్గీత

అన్నట్లు చెప్పినను దుర్యోధనునివంటి మూఢులు దీని నెఱుంగఁజాలరు గాని భరద్వాజ వాల్మీకి ప్రముఖులగు ఋషీశ్వరులు జ్ఞానులు భక్తులు స్వభావముగనే యెఱుంగుచుందురు. మహాత్ము లాత్మార్థ మేలాభమును గోరరు. లభించెనా దానిని లోకమునకంతయు వినియోగపడు మార్గమును ఘటింతురు. కావున వాల్మీకిమహర్షి నారదోపదేశముచేతను జ్ఞానదృష్టిచేతను శ్రీరామాదుల తత్త్వమెఱింగి యంతటితో సంతుష్టిలేక లోకమును దరింపఁజేయఁ దచ్చరిత్రమును గావ్యరూపముగ రచించుచు దానియం దెక్కువ పటిమయుఁ బఠనమువలన నెక్కుడు ఫలముఁ గూర్పఁగోరి దానిని వేదబృంహితము గావించి ప్రణవగాయత్ర్యష్టాక్షరాది మంత్రపూరితముఁ గావించెను.

౨. శ్రీమద్రామాయణమునందలి కాండము లేడిటియందు సుందరకాండ ముత్తమోత్తమమనియు, సకలాభీష్టప్రదమనియు నార్యులు విశ్వసించి శ్రద్ధాభక్తియుక్తముగ ననుదినము పఠించి కృతార్థు లగుచుండుట జగద్విదితము.

శ్రీరామాయణమున నొక్కొక్క కాండమున నొక్కొక్క విశేషము గలదు. వ్యాధులు, కారాగృహ బంధనములు, గ్రహపీడలు, అనపత్యతలు, దారిద్ర్యములో నైన సంకటములన్నియు సుందరకాండ పారాయణమువలనఁ దొలఁగుటయే గాక భుక్తిముక్తులును గలుగును. ఇది పారంపర్యముగ వచ్చిన మూఢవిశ్వాసము గాదు. పరీక్షితము. సిద్ధాంతితము. ప్రత్యక్షము. సహేతుకము.

శ్లో. త్రివర్గఫల కామేన, విపదుత్తరణేచ్ఛునా
శ్రీమత్సుందరకాండస్య, పాఠః కార్యో విజానతా.
శాంతికర్మణి సర్వత్ర, తథా దుస్స్వప్న దర్శనే
గ్రహపీడాసు చోగ్రాసు, రోగేషు విషమేషు చ
అరణ్యే ప్రాంతరేవాపి, శత్రుచోరాగ్ని పీడనే
సర్వాస్వాపత్సు ఘోరాసు, నైతస్మాత్తారకం పరమ్.
శ్రీమత్సుందర కాండస్య, సప్తసర్గాభిపాఠతః
మహారాజ్యాది సంపత్తిం, లభ్యతే దుర్లభాపి వా.
ఆయుష్కామో లభే దాయుః, ర్ధనకామో ధనాన్యపి
శ్రీకామః శ్రియ మాప్నోతి, కీర్తికామ స్తథా కీర్తిమ్.
విద్యాకామ స్తథా విద్యాం, స్త్రీకామశ్చ తథా స్త్రియమ్
ఆరోగ్యకామ స్త్వారోగ్యం, సప్తసర్గాభిపాఠనాత్.
యదా యదా హి రామస్య, వృత్తం పఠతి చేద్బుధః
తదా తదాదౌ "ధర్మా" శ్లోకమ్మూల మనుం జపేత్.
శ్రీరామచరణాంభోజ, ద్వంద్వం ధ్యాయ న్ప్రసన్నధీః
సకృదేవేతి చరమ, శ్లోకం చ శుభదం జపేత్.

అను పురాణవాక్యములు ప్రమాణములు.

3. తక్కిన యందలు దేవతలకంటెను, తక్కిన యన్ని యవతారమూర్తుల కంటెను శ్రీరామమూర్తి శీఘ్రముగఁ బ్రసాదించును. వాత్సల్యము, అభయప్రదాన కరణము, సౌశీల్యము, కరుణ, సత్యసంధత యివి యన్నియు శ్రీరామునందు విశేషముగఁ గలవు.

శ్లో. అనన్యాశ్చింతయంతో మాం, యే జనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం, యోగక్షేమం వహామ్యహమ్
సర్వధర్మాన్ పరిత్యజ్య, మా మేకం శరణం వ్రజ
అహం త్వా సర్వ పాపేభ్యో, మోక్షయిష్యామి మా శుచః.

ద్వి. ఇతర మెయ్యదియైన, హృదిఁ దలంపకయ, క్షితిని నన్నెవ్వారు సేవింతు రట్టి
సతతాభి యుక్తులౌ జనముల కైన, హితత యోగక్షేమ మేన వహింతు.

అన్ని ధర్మంబులఁ ద్యజియించి లెస్స, నన్ను నొక్కని శరణంబును జొరుము,
పన్నుగ సర్వపాపంబులవలన, నిన్ను ముక్తు నొనర్తు నిర్వేదపడకు.

—ద్విపద భగవద్గీత.

అను శ్రీకృష్ణవాక్యములను

శ్లో. మిత్రభావేన సంప్రాప్తం, న త్యజేయం కదాచన
దోషో యద్యపి తస్యస్యా,త్సతా మేత దగర్హితమ్
సకృ దేవ ప్రపన్నాయ, తవాస్మీతి చ యాచతే
అభయం సర్వ భూతేభ్యో, దదామ్యేతద్వ్రతం మమ.

తే. మైత్రి భావించి తానసంప్రాప్తుఁడైన, వాని నెటు లేని చేవిడు వాఁడఁగాను
వాని యెడనుండనేని నేదేని దోష, మద్ది గర్హ్యంబు గాదు సదాళులకును.

క. నీవాఁడని యొకపరియే, యేవాఁడేన్ శరణు వేఁడెనేని సకల భూ
తావళి కభయంబును నే,వావిరి ఘటియింతు నిదియ వ్రతమగు నాకున్

అను రామవాక్యములను

"స్మరణమాత్ర సంతుష్టాయ" యని శ్రీరామకవచమునందలి వాక్యములను బోల్చి చూచిన పై విషయము స్పష్టమగు.

ఇట్టి శ్రీరామునికంటెను ప్రేమస్వరూపిణి సీతాదేవి శీఘ్రప్రసాదిని.

శ్లో. ప్రణిపాత ప్రసన్నాహి మైథిలీ జనకాత్మజా.

కం. ప్రణతి ప్రసన్న జానకి.

శ్లో. న పరః పాప మాదత్తే, పరేషాం పాపకర్మణాం
సమయో రక్షితవ్యస్తు, సంతశ్చారిత్ర భూషణాః
పాపానాం వా శుభానాం వా, వధార్హాణాం ప్లవంగమ!
కార్యం కరుణ మార్యేణ, న కశ్చిన్నాపరాధ్యతి
లోకహింసా విహారాణాం, రక్షసాం కామరూపిణామ్.
కుర్వతా మపి పాపాని, నైవ కార్య మశోభనమ్.

క. తన కపకార మొనర్చిన, మనుజున కపకృతి నొనర్ప మదిఁ దలఁపఁడు స
జ్జనుఁ డీనియతిం బ్రోవఁగఁ, బూనరున్; సజ్జనులు శీలభూషణు లెందున్.

క. కపివర! పుణ్యులలోఁ బా,పపు జనములలోన వధకుఁ బాత్రుల పట్లన్
గృపఁ జూపవలయు సజ్జనుఁ; డపరాధముఁ జేయనట్టి యతఁడుం గలఁడే.

తే. పాపములె చేయుచును గామరూపులగుచు, భువనహింసా విహారులై పొలుచుచున్న
యసురులకుఁ గీడు సేత కార్యంబుగాదు, సుమ్మటన్నను హనుమ యాసుదతి కనిమె-

అను వాక్యములఁ బరిశీలించిన సీతారాములకుఁ గల యంతరము స్పష్టమగు.

ర. రావణాసురుఁడు దేవతాస్త్రీలను మనుష్యస్త్రీలను జెఱపట్టి పతివ్రతల
జెఱిచి దుఃఖపెట్టుచుండ, శ్రీమహాలక్ష్మి సహింపఁజాలక, వేదస్వరమునుండి వేదవతి

యన నయోనిజయై జనియించి. రావణాసురు శపించి, మరల నయోనిజయై సీతయై పుట్టి శ్రీరామునఁ జేపట్టి యాయన వెంట నడవులకు వెళ్ళి, రావణాసురుని మట్టుపెట్టింపఁ గారణముఁ గల్పింప జింకను బట్టితేర భర్తనంపి రావణునకుఁ జిక్కి, వానిని భస్మీకరింపఁ గలిగియు, భస్మీకరింప నొల్లక, భర్తచే నతని సపుత్రమిత్రబాంధవముగఁ జంపించి లోకమున కానందము గలిగించెను. ఎంత దయావతి గాక పరులకై తాను గష్టపడి వారి కష్టముఁ దప్పించునా? లోకమునఁ దండ్రికంటెనుదల్లి దయావతి గదా. ఇఁక జగన్మాతవిషయ మేమిచెప్పవలయును.

౫. రాముని భజించి విసిఁగి "ననుఁ బ్రోవుమని చెప్పవే ఓ సీతమ్మా" యని గోపన యేడ్చువఱకు నాయనకుఁ గారాగృహముక్తి కలుగకపోయెను. భక్తులకెల్ల నిది యనుభవవిదితము.

౬. రామాజ్ఞప్రకారము లక్ష్మణుఁడు సీతాదేవిని వాల్మీకియాశ్రమమున విడిచి పోయెను. ఏటిఒడ్డున నామె యొంటిగ దుఃఖించుచుండ వాల్మీకిశిష్యు లెవ్వతెయో యేడుచుచున్నదని వాల్మీకికిఁ జెప్పిరి. ఆయన యోగదృష్టిచేత సర్వము తెలిసికొని పావుకలైన ధరింపక రిత్తకాళ్ళఁ బరువెత్తివచ్చి యామెను బూజించితోడ్కొనిపోయి మునిస్త్రీల కప్పగించెను. ఆమె మహిమయు నామెకు వచ్చిన నిందయుఁ జూడ వాల్మీకికిఁ గలిగిన పరితాప మింతింత యనరాదు. ఇట్టి పతివ్రత కిట్టి నింద లోకమున నిలువనిచ్చుట సరిగాదనియు, నామె వృత్తము జగద్విదితము చేయవలయుననియు నాలోచించి తద్విధానము సరహస్యముగ నారదుచే నుపదేశము నొంది రామాయణముగ రచించి యామె పుత్రులకే నేర్పి సభలయందెల్లఁ బాడించి యామెను బరీక్షకు నిలువంజేసి యామె యపకీర్తి దొలఁగించి యామె యవతారమూర్తియని లోకమున బ్రసిద్ధిచేసెను. కావుననే శ్రీరామాయణమును వాల్మీకి "సీతాయాశ్చరితం మహత్" అనెను. రామాయణ మేడు కాండములు గుదముట్ట హెచ్చరికతోఁ జదువువారికి వాల్మీకికి రామునియందున్న భక్తి గౌరవముకంటె సీతాదేవియం దెక్కువభక్తిగౌరవము లుండెనని స్ఫురింపక మానదు. కావుననే యామె నధికరించి చెప్పు సుందరకాండము నన్ని విధముల సుందరముగను సారవంతముగను వాల్మీకి యొనర్చెను. సుందరమూర్తి వినాయకుఁ డన్నట్లే సుందరహనుమంతుఁడని పరాశర సంహితయందుఁ గలదు. నామైకదేశే నామగ్రహణమ్మని భీమసేనుని భీముఁడనియు, సత్యభామను భామయనియు ననునట్లే సుందరహనుమంతుని సుందరుఁడనందగు. అతిరూపవతీ సీతా యన్నట్లు సీత త్రిలోకసుందరి కావున సుందరీ సుందరశబ్దముల కీశేషయందుఁ సుందరయనియే నిలుచును కావున సుందరుల నధికరించి చెప్పిన కాండము సుందరకాండము. భగవత్సౌందర్యముగూడ నిందు వర్ణితము.

౭. ఈ కాండమున నాయాఘట్టములను బఠించుటవలని ఫలము తత్త్వసంగ్రహ రామాయణమం దిట్లు చెప్పఁబడినవి.

శ్లో. "సుందరాదిమ సర్గస్థ, హనుమద్విక్రమాదికమ్
శ్రుత్వాపస్మార కుష్ఠాది, భూతభేతాళ నాశనమ్.
సన్నిర్జిత్య పురీం శ్రేష్ఠా, మితి శ్లోకాది మాతరమ్
శ్రుత్వా బంధాద్విముక్తస్సన్, బ్రహ్మ భూయాయ కల్పతే
సీతా సందర్శనం శ్రుత్వా, వీతశోకో భవిష్యతి.
శ్రుత్వాతు త్రిజటాస్వప్నం, దుస్స్వప్నం పశ్యతి ధ్రువమ్
శ్రీరామ ముద్రికాదానం, యే శృణ్వ న్త్యాదరేణతు
నిర్జిత్య శత్రూన్ సంగ్రామే, స్థిరం రాజ్యం వ్రజంతి తే.
ధన్యా దేవా స్సగంధర్వా, స్సిద్ధా ఇత్యత్ర చాదిమమ్
శ్రుత్వా చతుర్దశం వర్గ, మసంగో వాయువ చ్చరేత్
హనూమద్గ్రహణం శ్రుత్వా, బంధా న్ముచ్యేత మానవః
లంకా దాహాద్యనుశ్రుత్వా, తాపత్రయ హతిర్భవేత్.
మంగళాభిముఖ స్యస్మిన్, శ్లోకే యత్ప్రథమాతృకమ్
తద్గాయత్ర్యాః పంచదశం, శ్రుత్వా మద్రూప భాగ్భవేత్
శ్రుత్వాతు పంచమం కాండం, హనుమద్విజయాంకితమ్
ఆంజనేయ ప్రసాదేన, బ్రహ్మలోకం స గచ్ఛతి."

ఉ. ఎవ్వనిచే జనించు జగ, మెవ్వనిలోపల నుండు, లీనమై
యెవ్వని యందు డిందుఁ, బరమేశ్వరుఁ డెవ్వఁడు, మూలకారణం
బెవ్వఁ డనాదిమధ్యలయుఁ డెవ్వఁడు, సర్వముఁ దాన యైనవాఁ
డెవ్వఁడు వాని నాత్మవిభు నీశ్వరు నే శరణంబు వేఁడెదన్.

క. నర్తకునిభంగిఁ బెక్కగు, మూర్తులతో నెవ్వఁడాడు మునులున్ దివిజుల్
కీర్తింప నేర రెవ్వని, వర్తన మొరు లెఱుఁగ రట్టివాని భజింతున్. భాగ.

అని గజేంద్రుఁడు ప్రార్థింప భగవంతుఁడు సాక్షాత్కరించి యతనిబాధ తొలఁగించెను. అట్టులే దేవతలు ప్రార్థింప భగవంతుఁడు శ్రీరాముఁడుగ భూమిపై నవతరించెను. మీఁదఁ జెప్పఁబడిన యనంతకల్యాణగుణములన్నియు శ్రీరాముని యందుఁ గలవని వాల్మీకి యా యా కాండముల నందందు వర్ణించియున్నాఁడు. ఈ సుందరకాండమందు జగత్సంహారకశక్తి రామునందే కలదని,

తే. అధిప! బ్రహ్మస్వభువు చతురాస్యుఁడైనఁ
త్ర్యంబకుఁడు రుద్రుఁడును బురహరుఁడునైన
నింద్రుఁడు మహేంద్రుఁడును సురాధీశుఁడైనఁ
గలన శ్రీరామవధ్యునిఁ గావలేరు.

ఇత్యాది వాక్యములచే స్థాపింపఁబడినది.

౯. 'అజాయమానో బహుధా విజాయతే' యను శ్రుతిప్రకారము భగవంతుఁడగు విష్ణువు "సంభవా మ్యాత్మమాయయా" యన్నట్లు తన మాయచేత నానా రూపములు వహింపగలఁడను విషయము.

తే. అకట ! యవ్యక్త మేక మనంత మగు న,చింత్య విష్ణు సు తేజంబు స్వీయమాయ
వానరాకృతిఁ గైకొని వచ్చెనేమొ, యఖిల రాక్షసకుల వినాశార్థ మిపుడు.

ఇత్యాది వాక్యములచే స్థాపింపఁబడినది. మాయ యనఁగా నద్భుతశక్తి.

౧౦. అర్థపంచకజ్ఞాన మాచార్యువలననే కలుగునని హనుమంతునిచర్య వలన బోధింపఁబడినది. ౧. ప్రాప్యమగు బ్రహ్మస్వరూపము, ౨. జీవాత్మస్వరూపము, ౩. ఉపాయస్వరూపము, ౪. ఫలస్వరూపము, ౫. విరోధిస్వరూపము. ఈ యైదింటికి నర్థపంచకమని పేరు.

౧౧. దశేంద్రియాధిష్ఠితమైన దేహమే లంక. అహంకార మమకారములు రావణ కుంభకర్ణులు. ఇంద్రజిదాదులు కామక్రోధాదులు. ఇందు బంధింపఁబడిన చేతనుఁడే సీత. (స్త్రీప్రాయ మితరత్సర్వమ్మనునది ప్రమాణము) వివేకము తోడ్పాటు గల చేతనుఁడే యింద్రియములకు వశుఁడుగాక భగవంతుని భక్తిచే సేవించి సాయుజ్యము నొందఁగలఁడు. ఈ వివేకమే విభీషణుఁడు. భగవంతుఁడు తన్ను రక్షించునో రక్షింపఁడో యనుసందేహముచేఁ బరితపించుచున్న చేతనునికి నాచార్యుఁడర్థపంచకజ్ఞానము గలిగించి యతని నుజ్జీవింపఁ జేసెనని హనుమచ్చర్యవలన విశదమగుచున్నది. ఆచార్యుని చర్యయుఁ జక్కఁగ నిందు బోధింపఁబడినది.

౧౨. ద్వయ మంత్రములోని శరణ శబ్దార్థ రహస్యమంతయు నిందు వివరింపఁబడినది.

౧౩. గాయత్రీమంత్రములోని 'దేవ' శబ్దార్థ మిందు శ్రీరామ దివ్యమంగళ విగ్రహవర్ణనముచే వర్ణింపఁబడినది.

౧౪. ఈకాండమందు సంసారసాగరము తరింపఁగోరి యాత్మవిచారముఁ జేయు యోగి యభ్యాసాదివిధము హనుమంతుని చర్యవలనఁ దెలియఁదగియున్నది. హనుమత్కపియే మనస్సు. యోగమున కంగము లెనిమిది. యమము, నియమము, ఆసనము, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణ, ధ్యానము, సమాధి. ఇందు మొదటియైదు బాహ్యాంగములు.

అహింస, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యము, అపరిగ్రహము అనునవి యమములు. శౌచము, సంతోషము, తపస్సు, స్వాధ్యాయము, ప్రణిధానము అనునవి నియమములు. పద్మాసనాదులు ఆసనములు. శ్వాసబంధము ప్రాణాయామము. ఇంద్రియములు విషయములయందు వ్యాపింపనీక లోపలి కాకర్షించి చిత్తమున నిలుపుట ప్రత్యాహారము.

యమనియమములు హనుమంతునియం దుండుట సుప్రసిద్ధము. ఆసన ప్రాణాయామములు 3-30 పద్యములయందుఁ గవనగు. ఇవి చదువునపుడు భగవద్గీత యందలి యీ శ్లోకముల ననుసంధించునది.

శ్లో. సమం కాయ శిరో గ్రీవం, ధారయన్నచలం స్థిరమ్.
సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం, దిశశ్చా నవలోకయన్
ప్రశాన్తాత్మా విగతభీ,ర్బ్రహ్మచారివ్రతే స్థితః
మనస్సంయమ్యమచ్చిత్తో, యుక్త ఆసీత మత్పరః.

అభ్యాసమందుఁ బ్రాణాయామముకంటెను బ్రత్యాహారము కష్టసాధ్యము. ప్రాణాయామదశయందుఁ దా నింత లావు పొడుగు గలవాఁడనను స్థూలదేహజ్ఞాన ముండవచ్చును గాని ప్రత్యాహారదశకు వచ్చునప్పటికి దేహ మత్యల్పమైనట్లుగ భావించి (హనుమంతుఁడు పిల్లి యంత యగుట) దేహసంధు లన్ని సడలించినఁ గాని ప్రత్యాహారము సాధ్యముగాదు. శనైశ్శనై రుపరమే త్తన్నట్లు లెంత మెల్లగా మన స్సును లోపలికిఁ బ్రవేశింపఁ జేయవలయుననినను వ్యాధిలోనగు ప్రతిబంధకములలో నేదోయొకటి (లంకారాక్షసి) యడ్డపడుచునే యుండును. దానిని జయింపక యాత్మ దర్శనము సాధ్యముగాదు. ఆత్మసాక్షాత్కారము నొందిన పెద్దలవలనను (సంపాతి) శ్రుతివలనను, ఆత్మ హృదయగుహయం దున్నట్లు తెలిసినను దానిని గనులారఁ గన్గొనుటకై హనుమంతుఁడు రాత్రియందు శ్రమించినట్లు మరల మరల శ్రమింప వలయును. ఇందును భ్రాంతిదర్శనము (మండోదరీదర్శనము) లోనగు విఘ్నములు కలుగును. ఈ గండము లన్ని గడచిన నాత్మదర్శనము కలుగును. ఇట్టులే పోల్చి చూచిన సీతాసంభాషణము, లంకాదహనము, వానరులతో సీతావృత్తాంతము చెప్పుట సీతాదేవియందలి భక్తి - యిట్టివన్నియు యోగాభ్యాసరతుల కనుభవగోచరములు. అభ్యాసు లీ కొంచెము సూచించుటవలననే సర్వము గ్రహించి యానందింపఁ గలరు. కావున నింతతో నీ విషయము విరమించెదను.

౧౫. శ్లో. యే తు సర్వాణి కర్మాణి, మయి సన్న్యస్య మత్పరాః
అనన్యే నైవ యోగేన, మాం ధ్యాయంత ఉపాసతే
తేషా మహం సముద్ధర్తా, మృత్యుసంసారసాగరాత్
భవామి న చిరాత్పార్థ, మయ్యావేశితచేతసామ్
మయ్యేవ మన ఆధత్స్వ, మయి బుద్ధిం నివేశయ
నివసిష్యసి మయ్యేవ, అత ఊర్ధ్వం న సంశయః.

ద్వి. అన్ని కర్మముల నాయందున యునిచి, నన్నె పరుఁడుగ ననన్యయోగమున
నన్ను ధ్యానించుచు న న్ను పాసించు, చున్నారొ వారల నొపి నాయందు
మనసుంచువారల మరణంబుతోడ, మొనయు సంసార సముద్రమునుండి
చెచ్చెరఁ దరియింపఁ జేయుదుఁ బార్థ, నిచ్చలు నాయందె నిలుపు మనంబు

నాయందె నిలుపు మనయమును బుద్ధిఁ, బాయక యింకమీఁదఁ బార్థ! నాయందె
నిలువంగఁ గల విది నిక్కంబు సుమ్ము, వలదు సందేహంబు వసుధేశతనయ.

—ద్విపద భగవద్గీత.

అను భక్తియోగవిషయమైన భగవద్గీతా వాక్యములను సీతాదేవి చర్యలోఁ బోల్చిచూచిన పరభక్తివిషయము స్పష్టపడును.

౧౬. సీతాదేవిచర్య ప్రపత్తియు సూచించుచున్నది.

శ్లో॥ అనన్యసాధ్యే స్వాభీష్టే, మహావిశ్వాసపూర్వకమ్
తదేకోపాయతా యాచ్ఞా, ప్రపత్తిశ్శరణాగతిః.

అని శరణాగతి లక్షణము.

సీతాదేవికోరిక రామసమాగమము అనన్యసాధ్యము. రాముఁ డెట్లయినఁ దన్ను రక్షించుననుట సీతాదేవికి నమ్మకము. కావుననే యితరోపాయము (హనుమంతుని వెంటఁబోవుట) యను మార్గ మంగీకరింపదయ్యె.

౧౭. భక్తియోగ ముద్యానసంచారమువలె మనోహర మైన మార్గమనియు యోగమార్గము నిరాలంబనముగ సముద్రము దాఁటుటవంటి దుస్సాధ ఘోరకార్యమనియు నీ కాండమువలనఁ దెలియఁ దగియున్నది.

శ్లో॥ మనుష్యాణాం సహస్రేషు, కశ్చిద్యతతి సిద్ధయే
యతతామపి సిద్ధానాం, కశ్చిన్మాం వేత్తి తత్త్వతః.

అన్నట్లు లన్నికోట్లకపులలో హనుమంతుఁ డొకఁడే కార్యసిద్ధి నొందఁగలిగెను.

యోగమార్గసంచరిష్ణువునకు "ధైర్యము స్మృతియు వారక దాక్ష్యము ధృష్టి" దృఢముగఁ గలిగినఁ గాని కడతేఱ లేదు. ఇట్టివానికి మొదటివిఘ్నము తన హితుల వలననే కలుగును వీని మార్గకష్టము తెలిసిన మిత్రులు లితఁడింత దుస్సాధ కార్యమునకుఁ బూనెనే యెట్లులగునో యను సందేహముచే వీని దృఢవ్యవసాయమునకు సాహాయ్య రూపకవిఘ్నము కలిగింతురు. అది విఘ్నమే కావున దాని నభ్యాసి యంగీకరింపఁ దగదు. (మైనాకచరిత్ర) అది గెలిచినతరువాత వీని శుద్ధిశక్తిఁ బరీక్షింప దేవతలే విఘ్నములు కలిగింతురు. (సురస). వానికిని లోఁపడరాదు. ఇదియైనపిమ్మట భూత గ్రహములు వీనిని బీడించును. (సింహికావృత్తాంతము). దీనిని జదువువారు జరిగిన కార్యమునకుఁ దగిన కారణములు కల్పించి వ్రాయుచున్నారని భ్రమింపవచ్చును. అభ్యాసపరు లట్లు తలఁపరు. ఈ విషయమై వివేకానందస్వాములవారి జీవితములోని యీ వాక్యముల ననువదించుట యప్రస్తుతము గాదు.

'Tradition has it that the tree is protected, as it were, by a *Bhairava* or a powerful spirit, who prevents any one who is not pure from meditating there. Even Totapuri and Noren experienced great difficulty, as it is said, in concentrating of their minds on Reality there. Some powerful force seemed bent on driving them forth..

In the instance of Noren, however, it was different. Finding that something opposed him in his desire to centre his mind upon God, he took a flaming brand from the meditation fire before him and struck the ground with such violence and with such intensity of emotion that he swooned. When he emerged from that state, however, he found that he could meditate with ease

Later another man endeavoured to do that which saints had done, and he became mad. He could not endure the forms which came in the course of the meditation upon the Terrible one, who dances the Dance of Death and Destruction."

ఇట్టి యోగసిద్ధిని హనుమంతుఁడు పరభక్తికి సాధనముగఁ జేసికొనెను.

౧౮. సుందరకాండమునఁ బ్రథమాక్షరము 'త'. కాండము నందలి కడపటి యక్షరము 'త'. ఇది 'తత్' అనుదానిని బోధించుచున్నది.

మొదటి శ్లోకము.

శ్లో. తతో రావణనీతాయాః, సీతాయాశ్శత్రుకర్శనః.
ఇయేష పద మన్వేష్టుం, చారణా చరితే పథి.

క. తరువాత రావణాసుర, వరనీత ధరాత్మజాతపదము న్వెదకన్.
గురుచారణమార్గంబున, నరుగఁగ నృపమాత గర్శితారి దలంచెన్.

కడపటి శ్లోకము.

శ్లో. తతో మయా వాగ్భి రదీన భాషిణా, శివాభి రిష్టాభి రభిప్రసాదితా
జగామ శాంతిం మమ మైథిలాత్మజా, తవాపి శోకేన తథాభిపీడితా.

తే. తత భవద్దుఃఖమునకును • దరణిగోత్ర,
వార్ధిచంద్రమ! యట్లు తా • బాధపడుచు
శుభము నిష్టంబు నగు నాదు • సూక్తి ధృతి నొ,
సంగ శ్రీరామ వహియించె • శాంతి సీత.

ఇది గాక సుందరకాండమునఁ బ్రతిసర్గమున మొదటి యక్షరము సకారమో తకారమో యుండును. లేదా యా శ్లోకమున సీత యను శబ్దముగాని తత్పర్యాయ పదముగాని యుండును. అదియుఁ దప్పిన రెండవశ్లోకము మొదటియక్షరము స, త, తప్పదు.

ఈ స,త-లు సీతయని సూచించుట స్పష్టమేకదా. సీతయేకదా సుందరకాండమున కధిష్ఠాన దేవత. సీతాయాః శ్చరితం మహత్తన్నట్లు శ్రీరామాయణమంతయు సీతామాహాత్మ్యమే తెలిపినను నందు సుందరకాండము నాయకరత్నము కదా. సీత= ఓమ్ అని సాంఖ్యశాస్త్రప్రకార మగుచున్నది. ఈ ఓం తత్ సత్ ల ప్రయోజనము భగవద్గీతయం దిట్లు చెప్పఁబడినది.

శ్లో. ఓం తత్స దితి నిర్దేశో, బ్రహ్మణ స్త్రివిధస్స్మృతః
బ్రాహ్మణా స్తేన వేదాశ్చ, యజ్ఞాశ్చ విహితాః పురా

తస్మా దోమిత్యుదాహృత్య, యజ్ఞదానతపః క్రియాః
ప్రవర్తన్తే విధానోక్తాః, సతతం బ్రహ్మవాదినామ్.
త దిత్యనభిసంధాయ, ఫలం యజ్ఞ తపః క్రియాః
దానక్రియాశ్చ వివిధాః, క్రియన్తే మోక్షకాంక్షిభిః.

ద్వి. ఓమ్మని తత్తనియును సత్తటంచు, నిమ్మూఁడువిధముల నెసఁగుచునుండు
బ్రహ్మనిర్దేశంబు; పరఁగెఁ దద్యుక్తి, బ్రాహ్మణుల్ శ్రుతులు నధ్వరములు పూర్వ;
మట్టులుగాన నోమ్మని మున్ను పల్కి, పట్టుగ నా బ్రహ్మవాదుల విధులఁ
బలుకంగఁ బడినతపంబు దానంబు, కలితయజ్ఞము లెల్లకాలంబు జరగు;
తత్తని ఫలకాంక్షఁ దవులక ముక్తి, హత్తఁ గోరినవారు యజ్ఞముల్ తపము
వివిధ దానక్రియా విసరంబు లెల్ల, నవనీతనందన! యాచరించెదరు.

—ద్విపద భగవద్గీత.

వీనిని బర్యాలోచించి చూచినచో సుందరకాండ పఠనమువలన భుక్తి, ముక్తులు కలుగుట యేమి వింత! శ్రద్ధయు భక్తియు నుండినఁ జాలును.

అల్పశక్తము కించిజ్ఞమునైన నామనస్సునకు గోచరించినవఱకు పరివర్తనమందు నాకు సాధ్యమైనవఱకు మూలమునఁ గల విశేషరహస్యము లాంధ్రమునను బొందు పఱిచితిని. లోపములున్నచోఁ దెలుపు మహాత్ములపాదములకు నమస్కరించి వానిని గ్రహించి కృతార్థుఁడ నయ్యెద. సంస్కృతరామాయణము నర్థము గ్రహించి పారాయణ మొనర్చుట సర్వశ్రేయస్కరము. ఏతద్గ్రంథకర్తను గృతార్థునిఁ జేయఁ గాఁ బోలుఁ గొందఱు పుణ్యు లాంధ్రవాల్మీకిరామాయణమునే పారాయణ మొనర్చితి మనియు, దానివలననే తమ కోరికలు కొనసాగినవనియు వ్రాసిరి. అర్థము తెలియని చదువు వ్యర్థము. అర్థము తెలియక మనసు రంజిల్లదు. మనసు రంజిల్లక భక్తి కుదురదు.

క. ఆయాదేశమువారికి, నాయాదేశంబుభాష నమరినకావ్యం
బాయతపురుషార్థంబులఁ, బాయక సమకూర్చు దేవభాషయుఁబోలెన్.
క. సురభాషార్థము తెలియని, తరుణులకును శూద్రులకును దమతమ నీమం
బరఁగినమాటలఁ జెప్పిన, వరకావ్యము పఠనమున కవశ్యంబయ్యెన్.

—అప్పకవి.

అని యుండుటచే సుబోధమగు నీ గ్రంథము పఠించుటచే వీరికి సత్ఫలము కలుగుట ధర్మమే కదా. మూలమునందున్న మంత్ర, బీజాక్షరాదు లిందు నుండుటయే దానికిఁ గారణము.

భగవంతుఁ డిట్టివారికి సకల శ్రేయస్సులు నొసంగునుగాక. దైవభక్తి లోకమున వర్ధిల్లుగాక.

ఇట్లు ప్రార్థించు,
శ్రీరామచరణానందుండుఁడు, భక్తచరణపరిచరణుఁడు,
వా మ దా మఁ డు.

శ్రీలక్ష్మీనృసింహాయ నమః.

అథ శ్రీ ఆపదుద్ధారక హనుమత్ స్తవరాజమ్.

శ్రీ గురుభ్యో నమః॥ హరిః ఓం॥ వసిష్ఠ ఉవాచ॥ సాధుశ్రుతం హనుమతశ్చరితం దురి
తాపహమ్। హనూమత్ స్తవరాజం మే వద దేవర్షి సత్తమ॥ ౧

శ్రీ నారద ఉవాచ॥ ఆపదుద్ధారకం నామ స్తవరాజ మిమం మునే। కథయామి
హనూమంతం వక్ష్యేహం వేధసా కృతం॥

అస్య శ్రీఆపదుద్ధారక హనుమత్స్తవరాజ మహామంత్రస్య బ్రహ్మాఋషిః॥ప్రకృతి
చ్ఛందః॥ ఆపదుద్ధారకో భగవా న్మారుతి ర్దేవతా । రం (ఓం శ్రీం రం) ఇతిబీజం। లం
ఇతిశక్తిః॥ క్లీం ఇతి కీలకం॥ శ్రీహనుమదంతర్గత శ్రీసీతాపతి శ్రీరామచంద్ర ప్రసాద
సిద్ధ్యర్థే జపే వినియోగః॥ ఓం రం (ఓం శ్రీం రం) ఓం లం ఓం క్లీం హనుమతే అంగు
ష్ఠాభ్యాం నమః॥ ఓం రం (ఓం శ్రీం రం) ఓం లం ఓం క్లీం వృషాకపయే తర్జనీభ్యాం
నమః॥ ఓం రం (ఓం శ్రీం రం) ఓం లం ఓం క్లీం మారుతాత్మజాయ మధ్యమాభ్యాం
నమః॥ ఓం రం (ఓం శ్రీం రం) ఓం లం ఓం క్లీం అంజనాసూనవే అనామికాభ్యాం
నమః॥ ఓం రం (ఓం శ్రీం రం) ఓం లం ఓం క్లీం ఏకవీరాయ కనిష్ఠికాభ్యాం నమః।
ఓం రం (ఓం శ్రీం రం) ఓం లం ఓం క్లీం పంచముఖాయ కరతలకరపృష్ఠాభ్యాం
నమః। ఏవం హృదయాదిన్యాసః । భూర్భువస్సువరోం । ఇతి దిగ్బంధః॥అథ ధ్యానం॥
ఆద్యాది లక్ష్మీపతి పాదజాతి మమానుపావర్త్త కృతాదిచర్యమ్। శ్రీ పారిజాత
ద్రుమమూలవాసం క్లేశాపహం సంకలయామి చిత్తే॥

బ్రహ్మో ఉవాచ॥ ఆద్యాది శ్రీరమేశాంఘ్ర్యమలకమలజాంగుష్ఠమూలాభిజాతో ।
యో ఘోరాదీ ననేకాన్ క్షపయదతిరుషాన్ రాక్షసా న్వీక్షయన్ స్వాన్ । యస్యా
హ్వస్రానవాగీ నఖిలసురగణా నుద్ధథానాపదో గ్రయం । తం వందే వజ్రకాయం
హరివరతనయం మారుతిం స్వేష్టసిద్ధ్యై॥ ౧

యోజనం తాఖ్యాసనాంతర్మణిగణఖచితా మోదనీయే చ పూర్వేతీరే కల్పద్రుమస్య
ద్యుమణిరమణితాయాం లసచ్చిత్రవేద్యాం॥ ఆనందాఖ్యాభిరామే రమయా దతి
తరాం సంస్తువన్నంగరాజం॥ తం వందే॥ ౨

యస్మిన్వారం తాపసాఖ్యే ద్విజవరజఠరే జాతమాత్రో వివస్వాన్ । ఆత్మానం దీప్య
మానః స్థిర (శిర)కృతవపుషా క్రోధితే నాత్మపిత్రా।సంశప్తో దృప్తరూపం హరివర
వదనం ప్రాప్య శ్రీశాంఘ్రి మాప్తః॥ తం వందే॥ ౩

య శ్వేతద్వీపమధ్యే సురవరనికరై రీక్ష్యమాణం రమేశం।ధ్యాయన్ కృత్వా తపోగ్రం
తదుచిత వచసా ప్రాప్యలోకా ననేకాన్ । ఈశస్యావేశినస్యా జనన జనన (విజయ)
తాం నందయన్నంజనాయాః॥ తం వందే॥ ౪

యో లోకద్యోతనాయ ప్రభవతి తరణిం వారుణీం వీక్ష్యభానోః॥ యంత్రం మం
త్రార్థ్య కాలే ఫలమితి సుధియా ధావమానోత్త రేణ। వక్త్రేణాశాడితో ద్రాగపత
దితిమతిం ఖ్యాపయిత్వాచ భద్రాం॥ తం వందే॥ ౫

యో ధాత్రా సంస్మృతో వా ఉరుతరగిరిమా సానుజాతో వనాంతం। వీక్ష్యాబ్జం స్వాన
నాబ్జం హ్యురుతరకుపితో వజ్రసంజ్వాలనాసే। బద్ధ్వా మజ్జో దధౌ తద్గురు యువతి
కృతో మోచయంతం కృపాంతం॥ తం వందే॥ ౬

య స్సుగ్రీవేణ సాకం తరువరనికటే ఋశ్యమూకే వసన్ సన్। సంప్రాప్తో రాఘ
వేశం కపివరవసనే తేన సంయోజ్య సఖ్యే। విఖ్యాతం వాలినం తం రఘుకుల
రమణే నార్దయామాసవంతం॥ తం వందే॥ ౭

యో ముద్రాం రామదత్తామపి చలితమనాస్సన్నిధాయ స్వమూర్ధ్ని। ప్రాప్యాం
భోధిం తమబ్ధిం గురుతర వపుషా మేషమాత్రాకతీత్య। గత్వా లంకా మశోకే
విశకలిత మతిం తోషయామాస సీతాం॥ తం వందే॥ ౮

యో హత్వాక్షం పరోక్షే క్షుభితమభిగతాన్ రాక్షసా న్మాతృఘాతైః। విక్షిప్యో
ఒక్షో భ్యరక్షః శరకృతరశనాం ప్రాప్య స్వేచ్ఛావశేన। పుచ్ఛాగ్రే దీపితేన జ్వాల
దనలరుచా దీపయామాస లంకాం॥ తం వందే॥ ౯

యో గత్వాథాంతరంగే రఘుపతి దయితాం తోషయిత్వాచ వృత్తం। దత్తం చిహ్నం
గృహీత్వా పునరమరపథా (పిరమతా)లంఘయిత్వా తమ(ద్రా) బ్ధిం। ప్రాప్యేశం
ప్రత్యయాయ జ్వలదనలనిభం ప్రార్పయామాస చిహ్నం ॥ తం వందే। ౧౦

యో లబ్ధ్వా రామ సీతాం ప్రతి రఘుపతినా ప్రేషితః ప్రాప్య లంకాం। నిశ్శంకం రావ
ణేన ప్రతిగిర ముదుణా చోత్తరేణ ప్రభాష్య। తద్భాషాం ప్రేక్ష్య రోషాదథపున
రపత త్ఖేచరై రేకవీరః ॥తం వందే॥ ౧౧

యో గత్వైకోరువీరః పథి వరవపుషం మర్దయిత్వా సురారీన్। గత్వాద్రిం ద్రోణ
భద్రం తదుపరి దితిజాం శ్చాను (తు) రోషాత్ప్రహార్య। తం గృహ్య గత్యభానా
ఉదయతి సుధియా జీవయామాస శేషం ॥తం వందే॥ ౧౨

యో లింగం వారణాశ్యాః చిరమిహహారిసం (స్థిరమనుపవయన్) స్థాపితే వాలుకేశం
దృష్ట్వా తూష్ణీం నివిష్టో హరినరకృపయా తత్పురస్థాపయిత్వా। తద్యాత్రాపూర్ణ
పుణ్యాం దిశతి భువిసతాం సర్వదా ద్యాపి దేవ॥ తం వందే॥ ౧౩

యో దేహం త్యక్తుకామో జ్వలదనలనిభం శ్యామసుభ్యాతయిత్వా రామోదార్యా
భ్యాగమిష్య త్యహహ ప్రియసఖే మాత్యజామకమస్వా। ఇత్యుక్త్వా శ్రీశవాక్యం
భరతమతియశాః రక్షయామాస శిష్టః। తం వందే॥ ౧౪

యో యోధ్యాం పాలయిత్వా రఘుకులతిలకే స్వీయధామప్రవిష్టే. ద్రష్టుం విశ్వం
పురోధాఃపథితబహుమనాః భక్తిభావేన రామే। ఖండే కింపూరుషాఖ్యే హృదయ
సరసిజే ధ్యాయమానోవ్యతస్థే (నావితస్థే)॥ తం వందే॥ ౧౫

యో భీమం చాశ్వమేధే దృఢతరవపుషా పూరుషాఖ్యం మృగేంద్రం హ్యానేతుం
గమ్యమానం తనురుహత్రితయం తస్య దత్వాకృపావాన్। తత్పాతోద్భూతలిం
గార్చనజనమిషతో రక్షయామాస తోషాత్॥ తం వందే॥ ౧౬

యో హ్యేవం ద్వాదశాబ్దానివ లఘుగణితాన్ బ్రహ్మకల్పానతీత్య। ప్రీత్యా శ్రీ
రామాంఘ్రిసేవానవరతమహిమాహ్యప్తలబ్ధబ్రహ్మచర్యం గార్హస్థ్యం ప్రాప్యబ్రహ్మ
సకల జనకృద్వ్యద్భవిష్యత్యనీహః॥ తం వందే॥ ౧౭

యః పాటీరోదరాఖ్యే శిఖరి శిఖరగే కాననే దత్తవాక్యాత్। అగ్రేహస్తిధ్వజిన్యాం
స్ఫుటతరరథ సేనాట్టహాసేన సైన్యం। కృత్వా స్తబ్ధం మహాత్మా రిపుగణవిజయం
చాకరోద్దుర్జయం వై॥ తం వందే॥ ౧౮

యస్త్వీద్ధం న్యాయమార్గం నిజనియమమనాః సంవ్రజన్నిర్గమాయ। వానప్రస్థాశ్రిమ
స్థః శతధృతిరథతంచాశ్రమంసంప్రపూర్య। పారివ్రాజ్యక్రమేణ తుంభితతనుభవే
ద్వ్యద్వియుక్తో భవేత॥ తం వందే॥ ౧౯

యో భక్తానన్యవే త్యభవభయమపహాయాతికష్టంచ కష్టాత్॥ సంతాన్యాభీష్టసిద్ధిం
హరిగురుభజనే భావశుద్ధించ దత్వా। కృత్వా శ్రీరామాంఘ్రిభక్త్యాన్వితరతినియతిజ్ఞాన
వైరాగ్యధర్మాన్॥ తం వందే॥ ౨౦

నారద ఉవాచ॥ ఇదం హనుమతస్తోత్రం ఆపదుద్ధారనామకం। కృతం యద్బ్ర
హ్మణాపూర్వం ప్రత్యహం యఃపఠేత్కాలే।స్నాత్వా శుచిస్సమాసీనః త్రివారం నియ
మాన్వితః।నతస్యాభిభవం క్వాపి శ్రీహనూమత్ప్రసాదతః। సంకటే విషమే ప్రాప్తే
కారాగారప్రవేశనే।శత్రుమధ్యే సభామధ్యే సింహవ్యాఘ్రారివేష్టితే। మహదాపత్స
ముత్పాతే ప్రాప్తే రాజభయేపి చ। శతవారం పఠేదేత త్స్తోత్రాహన్ముచ్యతే నరః।
ప్రసూతికాలే నారీణాం సంకటే చ సుమంత్రితం। ప్రాశయేదుదకం సాపి సుప్రసూర్భ
వతి క్షణాత్। పుమాన్సృతుమతీం నారీం ఆమాసం స్నానకాలతః ॥త్రివారం మంత్రి
తం తీర్థం పాయయిత్వాప్నుయాత్సుతం। విప్రో వినయసంపన్నో బాహుజోఽతి

పరాక్రమం ॥ వైశ్యో హ్యతిధనాఢ్యస్స్యాత్ శూద్రస్సుఖమవాప్నుయాత్ ।విద్యా
కామో లభేద్విద్యాం రోగీ రోగాత్ప్రముచ్యతే । జపం మంత్రసహస్రేణ జపసిద్ధి ర్భ
వేద్ధ్రువం । శతవారం పఠేన్మంత్రం ఆదావష్టాక్షరం పునః । ఏకవారం త్రివారం వా
యావన్మంత్ర మనన్యధీః ॥ ఓం హనూమా స్ఫట్ స్వాహా॥ ఇత్యష్టాక్షరమంత్రతః॥ ఏవం
చ సంపుటీకృత్వా స్తవరాజమిమం మునే। తేనసిద్ధి మవాప్నోతినాన్యథాసిద్ధిమేష్యతి ।
దశాంశం తర్పణం కుర్యా త్పునశ్చర్యాపరోన్వహం । తర్పణస్య దశాంశేన పరమా
న్నాహుతిః స్మృతా॥ ప్రతిశ్లోకం చజుహుయా త్పాయసం గోఘృతేనచ । ప్రతి
శ్లోకం యథైశ్చాకం తర్పయేత్ శుద్ధవారిణా । భోజయేచ్చ శతం విప్రా శ్శక్త్య
భావేకవింశతిం । ఋత్విగ్భ్యోదక్షిణాం దద్యా దాచార్యాయచగాంవరాం । నవరా
త్రం జితాహారోదృఢభక్తిర్జితేంద్రియః । శ్రీహనూమత్ప్రసాదేన తస్యలక్ష్మీ స్థిరాభ
వేత్ ॥హనూమా నంజనాసూనుర్మారుతిశ్చ వ్యపాశపిః ॥ వజ్రకాయ స్తపస్వీచ సీతా
శోకవినాశనః॥ లక్ష్మణప్రాణదాతా చ రామకార్యధురంధరః ॥మాసకల్పబ్రహ్మచారీ॥
పంచాస్యో భక్తవత్సలః (రక్షకః) । ద్వాదశైతానినామాని భక్త్యా నిత్యం హనూ
మతః ॥యః పఠేత్ప్రయతో భక్త్యా సదేవై రపిపూజ్యతే। ప్రాతస్నాత్వాభానువారే
హనూమత్స్తవరాజకం । యః పఠే త్సతతం భక్త్యా సర్వసిద్ధి మవాప్నుయాత్ ॥

ఇతి శ్రీ బ్రహ్మాండపురాణే బ్రహ్మ నారద సంవాదే ఆపదుద్ధారక
హనుమత్ స్తోత్రం సంపూర్ణం.

శ్రీ కృష్ణార్పణ మస్తు.

శ్రీ సీతాపతయే శ్రీ రామచంద్రాయ నమః.

అథ శ్రీ రామాష్టకమ్.

శ్రీ గురుభ్యోనమః ॥హరిః ఓం॥ శ్రీమతాం కుశలస్సర్వం శ్రేయో లక్ష్మీపతి రఘూత్తమాయం
దీనబంధు ర్దయాసింధు స్స రామో మే ప్రసీదతు॥ ౧

దేవేంద్రప్రేరితో యేన జీవితం దత్తవాన్పురా । వనేచరాణాం భృత్యానాం
సరామో॥ ౨

ధన్వంతరి రితిఖ్యాతో నిర్జరాణాం సుధాం దదౌ। యో భక్తవత్సలశ్శ్రీమాన్సరామో॥
విశ్వామిత్రాభీష్టసిద్ధిం యో కరో త్ప్రార్థిత స్సదా । ప్రసన్న హృదయోభూత్వా
సరామో॥ ౪

విభీషణో ఽసురస్వామీ లంకాసామ్రాజ్యవైభవమ్ । యేనాభయంచ సంప్రాప్త
స్సరామో॥ ౫

యస్య కారుణ్యలేశార్థం బ్రహ్మాదిసురపుంగవాః । శ్రేయసే ఽజస్రమిచ్ఛంతి సరామో॥
భ్రాతృభిః పూజిత స్సీతాయుక్త స్త్రైలోక్యరంజకః । సర్వసంపత్కరో నిత్యం
సరామో॥ ౭

భయేభ్యస్త్రియతే సద్య స్సిద్ధిం ప్రాప్నోతి మానవః । యస్యస్మరణ మాత్రేణ
సరామో॥ ౮

ఏతద్రామాష్టకం భక్త్యా యో జపేన్మ్యాసురోత్తమ । స వశీకృతబ్రహ్మాండ స్తస్యా
ఽసాధ్యం కిమ త్రహో॥ ౯

ఇతి శ్రీ బ్రహ్మకైవర్తే వసిష్ఠేంద్రద్యుమ్నసంవాదే
రామాష్టకం సంపూర్ణం.

శ్రీ కృష్ణార్పణ మస్తు.

శ్రీరస్తు.

శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణము

(మ ం ద ర ము)

విషయసూచిక

మందరకాండము

సర్గసంఖ్య.			పుటసంఖ్య.
1	హనుమంతుఁడు మహేంద్ర పర్వతమున విహరించుట		10
,,	హనుమంతు విక్రమమునకు మహేంద్రాద్రి చీకాకు పడుట	....	9
,,	హనుమంతుఁ డాకాశంబున కెగిరి కపులచే సెలవు దీసికొనుట	....	25
,,	హనుమద్గమన వేగ వర్ణనము	....	26
,,	సముద్రుఁడు హనుమంతునకుఁ దోడ్పడ యోచించుట	....	35
,,	సముద్రుఁడు మైనాకునితో సంభాషించుట	....	37
,,	మైనాకుఁ డాంజనేయున కెదురుగ వచ్చుట	....	38
,,	మైనాకుఁడు తన పూర్వ వృత్తాంతము హనుమకుఁ దెల్పుట	....	42
,,	హనుమంతునకు సురస యడ్డుపడుట	....	46
,,	హనుమంతుఁడు సురసనోటఁ జొచ్చి వెడలుట	....	50
,,	ఆంజనేయుఁడు సింహికను వధించుట	....	53
,,	హనుమంతుఁడు లంకాతీరంబును జూచుట	....	56
2	హనుమంతుఁడు లంకాపురి వెలుపలి యుద్యానంబుల విహరించుట	....	60
,,	హనుమంతుఁడు లంకను జూచుట	....	65
,,	హనుమంతుఁడు లంకను జూచి నివ్వెరగొనుట	....	67
,,	హనుమంతుఁడు లంకలోఁ జొచ్చు నుపాయంబు యోచించుట	....	68
,,	హనుమంతుఁడు లంకలోఁ బ్రవేశించుట	....	73
3	హనుమంతుఁడు ప్రాకారంబునఁ జేరి యాలోచించుట	....	77
,,	హనుమంతుఁడు లంకాధిదేవతను జయించుట	....	79
,,	లంక దన్ను రక్షింప హనుమంతుని వేఁడుట	....	82
4	హనుమంతుఁడు లంకలో సంచరించుట	....	83
5	చంద్ర వర్ణనము	....	91
,,	హనుమంతుఁడు లంకలో రాక్షస స్త్రీ పురుషులఁ జూచుట	....	96
6	హనుమంతుఁడు రావణాలయంబుఁ జూచుట	....	104
,,	హనుమ రాక్షసముఖ్యుల యిండ్లయందు సీతాదేవిని వెదకుట	....	107
,,	హనుమంతుఁడు రావణ గృహంబుఁ జొచ్చుట	....	108
7	హనుమంతుఁడు నగళ్ళలో సంచరించుట	....	111

సర్గసంఖ్య.			పుటసంఖ్య.
7	హనుమంతుఁడు పుష్పకవిమానముఁ జూచుట	....	112
8	పుష్పకవిమాన వర్ణనము	....	116
9	హనుమంతుఁడు రావణుని యంతఃపురంబుఁ జూచుట	....	118
,,	నిద్రించు రావణుని యంతఃపురస్త్రీలను హనుమంతుఁడు జూచుట	....	125
10	హనుమంతుఁడు నిద్రించు రావణునిఁ జూచుట	....	139
,,	హనుమంతుఁడు నిద్రించు రావణు భార్యలఁజూచుట	....	144
,,	హనుమంతుఁడు మందోదరిని జూచుట	....	146
11	హనుమ సీతాదేవిని పానశాలయందు మఱల వెదకుట	....	150
,,	పరాంగనా దర్శనంబునకు హనుమంతుఁడు చింతించుట	....	155
12	హనుమంతుఁడు సీతాదేవిని గానక విచారపడుట	....	158
,,	హనుమ యుత్సాహంబు వహించి మఱల సీతాదేవిని వెదకుట	....	161
13	హనుమ ప్రాకారంబుఁజేరి సీతాదేవి గానరామికి వ్యసనపడుట	....	163
,,	సీతాదేవి లేదని శ్రీరామునితోఁ జెప్పినఁ గలుగు ననర్థకంబుల హనుమంతుఁడు యోచించుట	....	166
,,	హనుమంతుఁడు ప్రాణత్యాగముఁ జేయ యోచించుట	....	171
,,	హనుమంతుఁ డశోకవనంబును జూచుట	....	175
14	హనుమంతుఁ డశోకవనంబునఁ బ్రవేశించుట	....	179
,,	హనుమంతుఁ డశోకవనంబున విహరించుట	....	183
15	హనుమంతుఁ డశోకవనంబున సీతాదేవిని వెదకుట	....	189
,,	హనుమంతుఁడు సీతాదేవిని జూచుట	....	192
,,	హనుమంతుఁడు సీతాదేవిని జూచి తనలో వితర్కించుకొనుట	....	194
,,	హనుమ తాను చూచిన స్త్రీ సీతాదేవి యని నిశ్చయించుకొనుట	....	198
16	హనుమంతుఁడు సీతాదేవి స్థితికి దుఃఖించుట	....	208
17	హనుమంతుఁడు సీతాదేవికిఁ గాపున్న రాక్షసస్త్రీలఁ జూచుట	....	227
,,	హనుమంతుఁడు సీతాదేవిని జూచి సంతోషించుట	....	230
18	రావణుఁ డశోకవనంబునకు వచ్చుట	....	233
19	రావణుఁడు సీతాదేవిని చేరఁబోవుట	....	239
20	రావణుఁడు తనకోరికను సీతాదేవికిఁ జెప్పుట	....	244
21	సీతాదేవి రావణునకు బుద్ధి చెప్పుట	....	253
22	రావణుఁడు సీతాదేవిని బెదరించుట	....	271
,,	సీతాదేవి రావణునిఁ బరుషంబులు పలుకుట	....	273
,,	రావణుఁడు సీతాదేవిపై నాగ్రహపడుట	....	276
,,	ధాన్యమాలిని రావణున కడ్డము వచ్చుట	....	280
23	రాక్షసస్త్రీలు సీతాదేవికి బోధించుట	....	282
24	రాక్షసస్త్రీలు సీతాదేవిని బెదరించుట	....	285
,,	సీతాదేవి రాక్షసస్త్రీలకుఁ దన మనోనిశ్చయముఁ దెలుపుట	....	286
,,	రాక్షసస్త్రీలు సీతాదేవిని గఱకు లాడుట	...	293
25	రాక్షసస్త్రీల మాటలకు భయపడి సీతాదేవి యేడ్చుట	....	299
26	సీతాదేవి శ్రీరామునిఁ దలంచుకొని దుఃఖించుట	....	306
,,	సీతాదేవి రాక్షసస్త్రీలకుఁ బరుషంబుగఁ బ్రత్యుత్తర మిచ్చుట	....	309

సర్గసంఖ్య.			పుటసంఖ్య.
27	త్రిజట తన స్వప్నవృత్తాంతము రాక్షసస్త్రీలకుఁ జెప్పుట	....	322
28	సీతాదేవి శ్రీరాముఁడు రామికి ననేకవిధములఁ బరితపించుట	....	339
29	మరణోద్యుక్తయగు సీతాదేవికి శుభశకునంబు లగుట	....	350
30	సీతాదేవితో నెట్లు భాషింపఁ దగు నని హనుమ యోజించుట	....	355
31	హనుమ సీతాదేవి వినునట్లు శ్రీరాముఁ బ్రశంసించుట	....	364
32	సీతాదేవి హనుమంతునిఁ జూచి భయపడుట	....	368
33	హనుమంతుఁడు సీతాదేవితో సంభాషించుట	....	372
„	సీతాదేవి హనుమంతునితోఁ దన వృత్తాంతముఁ జెప్పుట	....	377
34	హనుమంతుఁడు సీతాదేవికి శ్రీరామలక్ష్మణుల కుశలవార్తఁ దెలుపుట	....	380
„	సీతాదేవి హనుమంతుని రావణుఁ డని శంకించుట	....	382
„	హనుమంతుఁడు సీతాదేవికి సందేహము దీఱునట్లు భాషించుట	....	385
35	సీతాదేవి హనుమంతుని శ్రీరామ లక్ష్మణుల చిహ్నంబు లడుగుట	....	389
„	సీతాదేవికి హనుమంతుఁడు శ్రీరామ సుగ్రీవుల సమాగమ విధంబుఁ జెప్పుట		402
„	శ్రీరాముని విరహతాపము హనుమంతుఁడు సీతాదేవికిఁ జెప్పుట	....	404
„	హనుమంతుఁడు సీతాదేవితోఁదమ కామె యునికి దెలిసినవిధంబుఁ జెప్పుట		408
„	హనుమంతుఁడు సీతాదేవికిఁ దన జన్మవృత్తాంతముఁ జెప్పుట	....	411
36	హనుమంతుఁడు సీతాదేవికిఁ శ్రీరామముద్రిక నిచ్చుట	....	413
„	సీతాదేవి హనుమంతునిఁ బ్రశంసించి శ్రీరామాదుల కుశలం బడుగుట	....	416
36	హనుమంతుఁడు సీతాదేవికి ధైర్యోక్తులు చెప్పుట	....	424
37	సీతాదేవి హనుమంతునకు రావణుఁడు పెట్టిన గడువు నెఱింగించుట	....	429
„	* హనుమంతుఁడు సీతాదేవిని దన వీఁపున నెత్తికొని పోయెదనని చెప్పుట		433
„	హనుమంతుఁడు సీతాదేవికిఁ దన దేహముఁ బెంచి చూపుట	....	435
„	హనుమంతునితోఁడ సీతాదేవి తాను రామికిఁ గారణము చెప్పుట	....	437
38	సీతాదేవి చెప్పిన కారణములను విని హనుమంతుఁ డామెను బ్రశంసించుట		446
„	సీతాదేవి హనుమంతునకుఁ గాకాసుర వృత్తాంతముఁ జెప్పుట	....	448
„	సీతాదేవి హనుమంతునితో శ్రీరామలక్ష్మణులకు సందేశవార్తలు చెప్పి పంపుట		460
„	సీతాదేవి హనుమంతుని చేతికిఁ దన చూడామణి నిచ్చుట	....	466
39	సీతాదేవి తన్నుగుఱించి శ్రీరామునికిఁ దెలుప హనుమంతుని వేడుట	....	467
„	సీతాదేవి తన సందేహమును హనుమంతునితోఁ జెప్పుట	....	471
„	హనుమంతుఁడు సీతాదేవి సందేహము దీర్చుట	....	475
40	సీతాదేవి శ్రీరాము నుద్దేశించి హనుమంతునితోఁ బలుకుట	....	479
„	హనుమంతుఁడు మఱలిపోవుటకు సీతాదేవిని సెల వడుగుట	....	482
„	సీతాదేవి హనుమంతుఁడు క్రిమ్మఱిపోవుటకు ననుమతించుట	....	484
41	హనుమంతుఁడు కార్యశేషం బాలోచించుట	....	486
„	హనుమంతుఁ డశోకవనంబుఁ బాడుచేయుట	....	491
42	రాక్షసస్త్రీలు హనుమంతు వృత్తాంతము సీతాదేవి నడుగుట	....	492
„	రాక్షసస్త్రీ లశోకవనంబు పాడగుట రావణునకుఁ దెలుపుట	....	495
„	రావణుఁడు హనుమంతుని మీఁదికిఁ గింకరులఁ బంపుట	....	497
„	హనుమంతుని జయఘోషము	....	498
43	హనుమంతుఁడు ప్రాసాదమును విఱుగఁదన్నుట	....	501

వర్గసంఖ్య			పుటసంఖ్య.
43	హనుమంతుఁడు చైత్యపాలకులఁ జంపుట	....	502
44	హనుమంతుఁడు జంబుమాలిని వధించుట	....	504
45	హనుమంతుఁడు మంత్రి పుత్రుల నేడ్వురఁ జంపుట	....	507
46	హనుమంతుని మీఁదికి రావణుఁడు సేనానాయకుల నేవురఁ బంపుట	....	509
,,	హనుమంతుఁడు సేనానాయకుల నేవురఁ జంపుట	....	512
47	హనుమంతుని మీఁదికి రావణు డక్షకుమారునిఁ బంపుట	....	515
,,	హనుమంతుఁ డక్షకుమారునిఁ జంపుట	....	517
48	రావణుఁ డింద్రజిత్తును హనుమంతు మీఁదికిఁ బంపుట	....	522
,,	ఇంద్రజిత్తు హనుమంతుని మీఁదికి యుద్ధమునకుఁ బోవుట	....	530
48	ఇంద్రజిత్తు హనుమంతుని బ్రహ్మాస్త్రమున బంధించుట	....	534
,,	రాక్షసులు హనుమంతునిఁ గట్టి రావణు నొద్దకుఁ దీసికొని పోవుట	....	535
49	హనుమంతుఁడు రావణుని సభలోఁ జూచుట	....	539
50	రావణుఁడు హనుమంతునిఁ జూచి యోచించుట	....	544
,,	ప్రహస్తుఁడు హనుమంతుని ప్రశ్నించుట	....	545
,,	హనుమంతుఁడు రావణునకుఁ దన వృత్తాంతముఁ జెప్పుట	....	546
51	హనుమంతుఁడు రావణునకుఁ దాను లంకకు వచ్చిన కారణముఁ దెల్పుట		547
,,	హనుమంతుఁడు రావణునకు బుద్ధి చెప్పుట	....	550
52	విభీషణుఁడు రావణుతో దూతను జంపరా దని చెప్పుట	....	565
58	రావణుఁడు హనుమంతుని తోఁకఁ గాల్ప నాజ్ఞచేయుట	....	571
,,	రాక్షసులు తోఁకఁ గాల్చుచుండ హనుమ యాలోచించుట	....	572
,,	సీతాదేవి యగ్నిహోత్రుని బ్రార్థించుట	....	574
,,	అగ్ని చల్లనై నందునకు హనుమంతుఁ డాశ్చర్యపడుట	....	577
54	హనుమంతుఁడు లంకఁ గాల్చుట	....	579
,,	రాక్షస విలాపము	....	585
55	హనుమంతుఁడు సీతాదేవి దగ్ధ యయ్యెనని పరితాపపడుట	....	589
,,	హనుమంతుఁడు సీతాదేవిని నగ్ని దహింపఁజాలఁడని నిశ్చయించుట	....	593
56	హనుమంతుఁడు మరల సీతాదేవిని సందర్శించుట	....	597
,,	సీతాదేవి సెలవుగొని మరలి హనుమంతుఁ డరిష్టాద్రి నెక్కుట	....	599
57	హనుమంతుఁడు మరల సముద్రము లంఘించుట	....	603
,,	హనుమంతుని సింహనాదము కపులు విని హర్షించుట	....	606
,,	హనుమంతుఁడు మందరాద్రిపై దిగుట	....	608
,,	హనుమ కపులతోఁ దాను సీతాదేవిని జూచితి నని చెప్పుట	....	610
58	హనుమంతుఁడు తాను లంకకుఁ బోయి వచ్చిన విధం బంతయుఁ గపులకుఁ జెప్పుట	....	613
59	హనుమంతుఁడు సీతాదేవిని దోడ్కొని వచ్చి శ్రీరాముని దర్శించుట యుక్తమని చెప్పుట	...	624
,,	హనుమంతుఁడు కపులకు సీతాదేవి స్థితిని దెలుపుట	....	628
60	అంగదుఁడు సీతాదేవిని దోడ్కొని వచ్చుటకు సమ్మతించుట	....	631
61	కపులు కిష్కింధకుఁ బోవుమార్గమున మధువనంబుఁ జూచుట	....	632
,,	కపులు మధువనంబుఁ జొచ్చుట	....	633

సర్గసంఖ్య			పుటసంఖ్య.
61	దధిముఖుండు కపుల వారించుట	....	635
62	అంగద హనుమంతుల ప్రాపునఁ గపులు మధువనంబున నిచ్చకొలంది సంచరించుట	....	636
,,	అంగదుఁడు దధిముఖునిఁ దన్నుట	....	639
63	దధిముఖాది వనపాలకులు సుగ్రీవునితోఁ గపుల దుశ్చేష్టలు దెల్పుట	....	641
,,	సుగ్రీవుఁడు లక్ష్మణుతో హనుమదాదులు మధువనంబున విహరించుటఁ దెల్పుట		642
,,	సుగ్రీవుఁడు కపులకుఁ ద్వరగ రండని దధిముఖుచే వార్తఁ బంపుట	....	644
64	అంగదాదులు సుగ్రీవుకడకుఁ బోవుట	....	645
,,	సుగ్రీవుఁడు రామునకు ధైర్యోక్తులు చెప్పుట	....	648
,,	హనుమంతుఁడు శ్రీరామునకు సీతాదేవిస్థితిఁ దెలుపుట	....	649
65	హనుమంతుఁడు శ్రీరామునకు సీతాదేవి లంకయందున్న దని తెల్పుట	....	652
,,	హనుమంతుఁడు శ్రీరామునితో సీతాదేవి వాక్యంబులు దెల్పుట	....	653
66	శ్రీరాముఁడు సీతాదేవి చూడామణిని జూచి దుఃఖించుట	....	655
67	హనుమంతుఁడు శ్రీరామునకుఁ గాకాసుర వృత్తాంతం బభిజ్ఞానంబుఁ దెల్పుట		658
,,	సీతాదేవిని దా నూరార్చిన విధంబు హనుమంతుఁడు శ్రీరామునకుఁ దెల్పుట		660
,,	సీతాదేవిసందేశ వాక్యములు హనుమంతుఁడు శ్రీరామునకుఁ దెలుపుట		662
68	హనుమంతుఁడు సీతాదేవితోఁ దనకునైన సంభాషణముఁ దెల్పుట	....	662
,,	సుందరకాండాంత పద్యములు	....	660

"Paper used for the Printing of these Books was made available by the Govt. of India at Concessional Rates"

శ్రీః.

శ్రీ సీతా లక్ష్మణ భరత శత్రుఘ్న హనుమత్సమేత శ్రీరామచన్ద్ర పరబ్రహ్మణే నమః.

శ్రీహయగ్రీవ ప్రసన్న

శ్రీశారదాయై నమః

శ్రీమతే రామానుజాయ నమః.

శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణము

సుందరకాండము

శరణ! యోజవంజవ
దాశరథి గురుతరి శరణ్య•ధారా! శ్రద్ధా
శ్రీశస్త్ర భక్తి తరవ
న్యా! శర్మద జానకీ మ•నోంబుజధామా! ౧

మందరము

సీ॥ పదియు నొక్కండవ • భావ వత్సరమున, మాతండ్రి మముఁబాసి•మరణమొందఁ
చిన్నజనకుచేతఁ • బ్రేమ రక్షింపించెఁ, బదియు మూఁడవయేఁట•భయద మగుచు
నేఁటికి విడువని • నిష్ఠుర రోగానఁ, జావకే యుండఁగఁ • జక్కఁగాచె
నలువదేడవయేఁటఁ • జలుపుచు విధురుఁగా, యోగమార్గంబున • బాగుపఱిచె
గీ. నేఁబదెనిమిది యేఁటఁ దా•నెలమిఁ బిలిచి, తనదు కైంకర్యమున యంద•తద్దనిలిపె
జన్మసార్థకముగ రామ•చంద్రవిభుఁడు, నేఁడు వ్రాయించుకొనుచున్న•వాఁడు దీని

కం. డెందంబున రఘుపతి పద, వందారుఁడ నగుచు స్వాంధ్ర•వాల్మీకి కృతిన్
సుందర కాండము వ్యాఖ్యను, మందరము రచింతు రామ•మాధవు కరుణన్.

అర్థము. శ్రీ సుందరకాండమును శ్రీరామచంద్రమూర్తికిఁ గవి వినిపింప వారిని సంబోధించుచున్నాఁడు.

శ్రీ శబ్దము కాండాదియందు మంగళకరము గావునఁ బ్రయోగింపఁబడెను.

శ్రీ = నిత్యానపాయినియై యే కాలమందైనను భర్తను వదలియుండని లక్ష్మీదేవికి - శరణ = నివాసస్థానమైనవాఁడా! శ్రీ నివాసుఁడా యనుట- 'శరణం గృహ రక్షిత్రో'' యని యమరకోశము. "రాఘవత్వే భవేత్సీతా రుక్మిణీ కృష్ణ జన్మని" యను విష్ణుపురాణ వాక్యము నిట ననుసంధించునది. ఇచ్చట శరణ శబ్దము మంత్ర రత్న మందలిది. ఈ కాండమందు నా శబ్దార్థమే విశదీకరింపఁ బడునని యీ పద ప్రయోగము సూచించు చున్నది. ఆజవంజవ = సంసారమనెడి, దాశరథి = సముద్రమునకు, దాశ = బెస్తల, రథి = వాహనములైన యోడలఁగలది. రథములు గలది రథి. అనఁగా సంసార సముద్రమునకు గురు=(౧) గొప్పదగు (౨) ఆచార్యుఁ డనెడి, తరి = ఓడకు, కర్ణధారా = ఓడనడుపువాఁడా!—సముద్రమును దాటఁ గోరిన వారికిఁ బెద్దనావ నడపు వానివలె సంసారమును దాటఁగోరిన వారికి నాచార్య ముఖమున సద్జ్ఞానము గలిగించి వారి నందుండి దాటించు వాఁడా, గురువనువాఁడు- ఓడ-ఓడలభించి నంతమాత్రముననే మనము సముద్రమును దాటలేము. దాని నడుపువాఁడుండవలెను. అతఁడే భగవంతుఁడు. నావ యెట్లోడవాని స్వాధీనమై వాఁడు నడుపునట్లు నడచునో గురువు భగవదాజ్ఞాబద్ధుఁడై భగవదాజ్ఞ లగు శ్రుతి స్మృతి శాసనముల ప్రకారము వర్తించువాఁడై యుండవలెను గాని భగవ దాశ్రితుఁడు గానివాఁడు, శాస్త్రజ్ఞానము లేనివాఁడు గురువుగా నుండరాదు. దేశి కుఁడు భగవత్ప్రేరితుఁడై యుండవలెనని భావము. శ్రద్ధా (శ్రీ) = శ్రద్ధయనఁగా మహా విశ్వాసము. నన్నవశ్య మావలియొడ్డు చేర్చును గాని చేర్పకపోఁడను దృఢమైన నమ్మకము. అట్టి శ్రద్ధయనెడి సంపద - శస్త = ప్రశస్తమైన - భక్తి = ప్రేమ పూర్వకమైన సేవ యనెడి - శ్రద్ధాసంపత్తి - శస్తభక్తి-పరమభక్తి చెప్పఁబడుటచేఁ బ్రపత్తిభక్తి చెప్పఁబడెను.

ఈ కాండమున సీతాదేవియందుఁ గానవచ్చునవి ప్రేమయుఁ, బ్రపత్తియుఁ గదా. తరవణ్యా=దాఁటించుట కీయఁబడు కూలి గలవాఁడా - ఓడ నడపువానికి ధనరూపకమైన కూలి యిచ్చినచో భగవంతుని కిచ్చుకూలి శ్రద్ధాభక్తులని భావము. అవి తప్ప మఱి యే కూలియు నాయన యాశింపఁడు. ఆ కూలి యీయకుండిన నాయన దాఁటింపఁడు. ఇట్లు దాఁటిపోయిన రాఁగల లాభ మేమి యనిన, శర్మము= మోక్షసుఖము, శర్మద = సుఖము నిచ్చువాఁడా! జానకీమనోంబుజధామా = సీతా

దేవి మనస్సనెడి కమలమే గృహముగాఁ గలవాఁడా - ఆమెచే నెప్పుడు స్మరింపఁబడు వాఁడా - ఈ కాండమందు సీతాదేవి చేసిన కార్యమిదియె కదా-వివిధమైన కర్మము గలుగునందురా-భగవద్దంపతి ప్రాప్తియే సుఖమని భావము. అంతకు మించిన సుఖ సంతోషములు లేవు. హనుమంతుఁడు మహాయోగియు, మహాజ్ఞానియు నగుట నిర్వివాద విషయము. అంతటివాఁడు కూడ పోవునపుడు రామముద్రికయు వచ్చునపుడు సీతా చూడామణియు ధరించి సముద్రమును దాఁటెను. లంకలో నున్నప్పుడు తా నంతటి గొప్పవాఁడయ్యు భగవద్దాస్యము యోగమునకంటె జ్ఞానమునకంటె గొప్పది యగుట నెఱింగినవాఁ డగుటచే లజ్జ విడిచి 'దాసోహం కోసలేంద్రస్య' దాసుఁడ రామచంద్రుని కని రహస్యముగఁగాదు, దిక్కులు మాఱు మ్రోగునట్లు చాటించెను. రామదాసుఁడ నని యెప్పుడు హనుమంతుఁడు చెప్పెనో యప్పుడే రక్షాభరము తమయందున్నదని యంగీకరించినవారై 'శీతో భవ హనూమతః' అగ్నిహోత్రుఁడా! హనుమంతునకుఁ జల్లగాఁ గావలసిన దని యాజ్ఞాపించెను. అగ్ని వెంటనే చల్లబడెను. రామచంద్రమూర్తితో సముద్రుఁడు 'అవని నభోఽనిలానలపయస్సులు శాశ్వతమైన మార్గమున్ దవిలి స్వభావ మేమియును దప్పవ యట్టులు నే నగాధ మప్లవమును నౌటనాసహజభావము దీనిని దప్పరాదు ' అనఁగలిగెనుగాని, 'శీతోభవ' చల్లన గమ్మని సీత యనఁగానే నా స్వభావము దాహక గుణమును నేను వదలలే నని చెప్ప నంతటి ధైర్య మగ్నిహోత్రునకు లేదయ్యెను. దీనివలన రామబాణములకన్నను సీతాదేవి వాక్కమోఘ మని యేర్పడుచున్నది. ఈ స్వభావములు గిభావములు, చూచుచుండిన దాసోహమ్మను వారు తమయందు వైచిన భారము నెట్లు సీతారాములు నిర్వహింపఁగలరు. 'యత్ర రామో భయంనాత్ర నాస్తి తత్ర పరాభవః' యను వాక్యమెట్లు సార్థక పడఁగలదు? ఒకని కొక యధికార మిచ్చినప్రభు వా యధికారమును మరలఁ దీసికొనలేఁడా? అట్టులే యగ్నికి దాహకగుణ మిచ్చినవారు మరల ననివార్య సందర్భముల నివారింపలేరా?

శ్రీరామ దాసోహమ్మను షడక్షరీమంత్రముచే హనుమంతుఁడు లంకయం దే బాధయు రాక్షసులచేఁ జెందఁడయ్యె. అట్టులే జీవాత్మయు దేహమున నుండువేళ శ్రీరామ దాసోహ మ్మనెనేని దేనివలనను బాధచెందఁడు. సుఖముగ సంసారము దాఁటి రామ పాదసన్నిధిఁ జేరఁగలఁడు. ఈ పంచాక్షరియందలి కడపటి వర్ణము ప్రథమాగ్ని బీజముతోను, ప్రథమ ద్వితీయ దీర్ఘస్వరములతోను గలిసిన నసాధ్య సాధనమునకు, సర్వభూతోచ్చాటనమునకు సమర్థము లగుచుండ షడక్షర మంత్ర మహిమ నెఱుఁగ నెవ్వరితరము?

సాంఖ్య శాస్త్రప్రకారము రామశబ్దమును శోధించి తెలియవచ్చిన విశేషములు బాలకాండమున వ్రాయఁబడెను. అట్టులే శ్రీ, సీతాశబ్దములను శోధింతము.

రామ ౨, ౫ అనియు ౨ + ౫ = ౭ ప్రణవ మనియు నీ లోనగు విషయములు పూర్వము వ్రాయఁబడెను. ఆ ప్రకారము చూడిన శ్రీ = శ + ర = ౫ + ౨ = ౭ ఆ యంకెలే యీ పర్యవసానముగా నేర్పడి శ్రీ = రామ యని సూచించుచున్నది. అనఁగా నిరువురయందు సమత్వము ద్యోతితము. ఈ సందర్భమున, "యథా మయా జగద్వ్యాప్తం; స్వరూపేణ స్వభావతః। తయా వ్యాప్త మిదం విశ్వం, నియంత్రీచ తథేశ్వరీ" స్వరూపముచే, స్వభావముచే నాచే నెట్లు ప్రపంచము వ్యాపింపఁబడి యున్నదో యట్లులే యీమెచేతను వ్యాపింపఁబడియున్నది. ఆమెయే ప్రపంచమునకు నియంత్రి, ఆమెయే యీశ్వరి, 'నిత్యైవేషా జగన్మాతా, విష్ణో శ్శ్రీరనపాయినీ।కిమత్ర బహునోక్తేన, సంక్షేపేణేద ముచ్యతే। దేవతిర్యఙ్మనుష్యేషు, పున్నామా భగవాన్ హరిః। స్త్రీ నామ్నీ లక్ష్మీ మైత్రేయ, నానయో ర్విద్యతే పరమ్॥' ఈ జగన్మాత విష్ణువునకు నిత్యానపాయిని. పెక్కుమాటలవలన లాభమేమి? సంక్షేపముగాఁ జెప్పెదను. దేవతలందు, మనుష్యులందు, బశుపక్ష్యాదులందు మగవారిపేర్లు గలవి విష్ణువు, స్త్రీపేర్లు గలవి లక్ష్మి. ఈ యిరువురకంటెఁ బరమైనది లేదు. 'సర్వేషామేవ లోకానా మీశ్వరీ మమ వల్లభా। అస్యా మమచ శేషం హి, విభూతి రుభయాత్మికా॥' అన్ని లోకములకు నా ప్రియురాలే యీశ్వరి. నిత్యవిభూతి, లీలావిభూతి (ప్రపంచము) యను రెండు విభూతులు ఆమెకు నాకు శేషములై యున్నవి. 'అస్యేశానా జగతః' ఈ ప్రపంచమునకు నీశానయగు నీమె 'ఈశానాం జగతా మధీశ దయితాం' ఇత్యాది ప్రమాణములచే లక్ష్మీనారాయణులు సీతారాము లిరువురు సమాను లని యేర్పడు చున్నది.

లోకే స్త్రీవాచకం యావత్, తత్సర్వం జానకీ శుభా। పున్నామ వాచకం యావత్, తత్సర్వం త్వం హి రాఘవ। తస్మాల్లోకత్రయే దేవయువాభ్యాం నాస్తి కించన॥ అధ్యాత్మ, 3.

రామా! లోకమున పురుష వాచకములన్నియు నీవు, స్త్రీవాచకము లన్నియు సీతాదేవి, కావున మూఁడు లోకంబు లందు మీ యిరువుర కంటె వేఱైనది లేదు.

రామ = ౫౨. శ్రీ = ౫౨ - ౨౭ + ౨౫ = ౫౨. ఇరువదియేడవ వాఁడు భగవంతుఁడు. ౨౫ = చేతనాచేతనాత్మక మగు (౨౪ + ౧ = ౨౫) తత్త్వము. ౨౭+౨౫=౫౨ రామయైనట్టే శ్రీ = ౫౨ తెలుపుచున్నది. ఇదియును లక్ష్మీనారాయణుల సమత్వము తెలుపుచున్నది. ఈ యర్థమునే సీతయను శబ్దము సుస్పష్టముగఁ దెలుపుచున్నది. సీ+త=౭+౬=౧౩=వర్ణ సమామ్నాయ మందలి పదుమూఁడవ యక్షరము ప్రణవము. ఈ ౭౬ ను ముందుచెప్పిన ప్రకారము విభజించితిమేని ౨౭ + ౨౫+౨౪=౭౬ అగుచున్నది. ఇది చిదచిదీశ్వర తత్త్వముల మూఁటిని దెలుపుచు

వీని శేషీభావమును సూచించు చున్నది. ఇంతకంటెఁ బరమై, మాహాత్మ్యము కలది మఱేది కలదు ?

సీతాశబ్దము 'రసోవైస' యను శ్రుత్యర్థమును బోధించు చున్నది. 'రసో వైసః' అనఁగా భగవంతుఁడు ఆనందము నిశ్చయము అని యర్థము. అట్టులే సకారమునకు స్త్రీలింగ రూపము సీ-కావున సీ శబ్దమునకు భగవతి లక్ష్మీదేవి యని యర్థము- 'సా చ లక్ష్మీః బుద్ధిః ప్రోక్తా' యని ఏకాక్షర కోశమునందుఁ గలదు. అట్టులే తకారమునకు నిశ్చయ మని యర్థము.

'కరుణాయాంతు తా స్త్రియా'మ్మని నానా. ర. యందుఁగలదు. తా శబ్దమునకు దయ యని యర్థము కలదు.

కావున సీతా శబ్దమునకు లక్ష్మీదేవి కేవల దయావతి యని యేర్పడుచున్నది. "లక్ష్మ్యా సహ హృషీకేశో దేవ్యా కారుణ్యరూపయా। రక్షక స్సర్వ సిద్ధాంతే వేదాంతేపిచ గీయతే" యని ప్రమాణము గలదు.

సీతాదేవి యెట్టి దయావతియో రామాయణము చదివినవారికిఁ జెప్పవలసిన పనియే లేదు.

సీతాశబ్దమునందువలె సకార తకారములు గల శబ్దములు సతీ, సత్, సేతు, సత్య యను నవి కానవచ్చుచున్నవి. వీని యర్థమునకు సీతాదేవికి సంబంధము గలదేమో చూతము. సతీ = 'సతీ సాధ్వీ పతివ్రతా' అమరకోశము. సతీశబ్దము సాధారణముగఁ బతివ్రతకుఁ బేరు. దర్శనాదేవ పాపం స్యతీతి సతీ = దర్శనమాత్రమునవే పాపములు పోఁగొట్టునది సతి. ఇది సామాన్యసతుల లక్షణము. అందు సీతాదేవి యెటువంటిసతియో రామాయణజ్ఞులకుఁ జెప్పవలసిన పనియేలేదు. ఒకసారి యామె కటాక్షము మనమీఁదఁ బడినను, ఆమె దర్శనము మన కొకసారి కలిగినను మన పాపములెల్ల నశించి కృతకృత్యుల మగుటయందు నేమి సందేహము గలదు. ఆమె దర్శన ప్రాప్తిలేనప్పుడు అట్టి పుణ్యాత్మురాలిచరిత్ర పఠించుటయు సర్వపాపహరము.

సేతు = నీళ్ళుపోకుండ రెండొడ్డులకు నడుమ నడ్డముగఁ గట్టఁబడుకట్టకు సేతు వనిపేరు. ఈయన కట్టలు కట్టుట యం దుద్దేశ్యమేమి ? (౧) నీళ్ళు వ్యర్థముగఁ బోకుండ మరలించి పైరుపచ్చలు వృద్ధిచేసికొని బాగుపడుట. అట్టులే సీతాదేవిని మన మాశ్రయించితిమేని మనజన్మ ప్రవాహములు వ్యర్థములై పోక ఫలించునట్లు చేసి యైహికసుఖములను గలిగించును. (౨) రెండవయుద్దేశ మీయొడ్డున నుండువా రావలియొడ్డునకుఁబోవుటకు నిరపాయమైన సదుపాయము. ఒక గొప్పనదిని మనమీఁదియో, నడిచియో దాటిపోవచ్చును. ఇది యాబాల గోపాల మందఱకు సాధ్య మగునది కాదు. అపాయములతోఁ గూడినది. ధన పరజన సాహాయ్య మపేక్షించునవి పడవలు,

సేతు వట్టిది గాదు. ఇది నిరపాయము. ఇది యాబాలగోపాలము బాలురకు, వృద్ధులకు, స్త్రీలకుఁ, బురుషులకు, ధన పరజన సాహాయ్య మపేక్షింపని సుసాధనమై నమ్మకమైన యుపాయము. సీతాదేవియు భగవత్ప్రాప్తిఁ గోరి తన్నాశ్రయించు వారి కిట్టిదే. కావుననే యామెను బురుషకారముగా భక్తులు ప్రపన్నులు నాశ్రయింతురు. ఈ సందర్భమున నుపనిషద్వాక్యములు స్మరణీయములు.

అమృతస్య పరం సేతుం = ఈ పరబ్రహ్మము సంసారసముద్రమును దాటించి మోక్షమును బొందించుట కొఱకు సాధన భూత మగు గొప్పసేతు వని తెలిసికొనుము.

అమృతస్యైష సేతుః । ఏషాం లోకానా మసంభేదాయ = సినోతి, బధ్నాతి స్వస్మిన్ సర్వం చిదచిద్వస్తు జాత మితి సేతుః = చిదచిద్విశిష్ట మగు సర్వమును దన యందు బంధించు కొనునది సేతువు.

ఏతం సేతుం తీర్త్వా = ఈ సేతువు నాశ్రయించి దానిని దాటవలయునే కాని యన్యోపాయముచేఁ గాదు.

ఇఁక సత్యమనఁగా నేమియో చూతము. సకారో జీవ నిర్దేశ - స్తకారః పర వాచకః । తయో స్సంసర్గ శక్తిర్య స్తస్మా త్సత్య ఉదాహృతః॥ సకారమునను జీవుఁ డనియు, తకారమునను బరబ్రహ్మ మనియు యకారము ఈ రెంటిని జేర్చు శక్తి యనియు నర్థము. ఈ యాకారమునకు లక్ష్మియని యర్థము. కావున లక్ష్మీదేవియే జీవాత్మను బరమాత్మతోఁ బొందించునది.

సత్ = ఈమె యెవతె? ఇట్టి ప్రభావ మీమెయందుఁ గలుగఁ గారణ మేమి? ఈమె నమ్మకముగ నద్దరిచేర్చునని నమ్ముటెట్లు? ఉపనిషత్తులందు, ఆకులు, కొమ్మలు, కాయలు, పండ్లతోడ మహావృక్ష మగు శక్తి మఱ్ఱివిత్తనమం దెట్లున్నదో; యట్లు చిదచిదాత్మక ప్రపంచ మంతయు నామరూపములచే వేర్పఱుపరాని భగవంతుని యందు లీనమైయుండు దశ నసత్తనియు, నామరూప భేదములతోఁ బ్రపంచముగఁ బరిణమించిన దశ సత్తనియుఁ జెప్పఁబడెను. సూక్ష్మ చిదచిద్విశిష్టుఁ డగు బ్రహ్మ మసత్తు, స్థూల చిదచిద్విశిష్ట బ్రహ్మము సత్తు. మనకు గోచరించునది యంతయుఁ జిదచిద్విశిష్టమే. అనఁగా జీవులతోను బ్రకృతితోను గూడియుండునదే. ఈ రెంటికిని నంతర్యామిగా నుండు వాఁ డీశ్వరుఁడు, ఆయన మన కన్నులకుఁ గానరాఁడు. అయినను మనము చేరవలసిన దాయననే. ఈ పద్యమున జానకీమనోంబుజభానూ యను వాక్య మీయర్థమునే సూచించుచున్నది. ఎట్లు చేరుట? ఆయన గృహస్థుని వంటి వాఁడు. జీవ ప్రకృతులు గృహము. ఆయన గృహాంతర్భాగమునఁ దన యిష్టులతో, శిష్టులతో సంతోషముగఁ గాలక్షేపము చేయుచుండును. గృహకృత్యములు పుత్ర మిత్ర భృత్య పోషణాదు లాయన భార్య విచారించుచుఁ బతివ్రత కావున భర్త

కే విచారము లేకుండునట్లు లానందముతోఁ గాలము గడుపు నట్లు సర్వకార్యములు నిర్వహించు చుండును. అట్టి భార్యయే లక్ష్మీదేవి - భర్తను విడక సర్వదా యాయనను నానందము గలుగ వ్యవహరించును. ప్రపంచ వ్యవహారము నిర్వహించును. జీవ ప్రకృతులు రెండును ఆమె యాజ్ఞానుసారము వర్తించునవే. ఇందు జీవులు బిడ్డలు, ఇల్లు, ఇంటిచుట్టు తోఁటయందలి వినోదవస్తువులు ప్రకృతి. బిడ్డలు తోఁటలో వినోద వస్తువులతోఁ గ్రీడించుచుండ నామె తనపనిలోఁ దానుండును. ఎప్పుడు బిడ్డ లాఁకలిగొని యాటవస్తువు లావలఁ బాఱవైచి యమ్మా యని బిగ్గ నేడ్తురో యప్పు డమ్మ వచ్చి వాకిలి దీసి వారిని లోపలికి రానిచ్చి పాలిచ్చి పోషించును. కావుననే యీమెను చైతన్యస్తన్యదాయిని యని గ్రంథములు చెప్పుచున్నవి. ఈ బిడ్డలు మఱల నాటలకుఁ బోరాదని తలఁచి భక్తిగలవారై మాతాపితృ సేవాపరాయణు లగుదు రేని మఱల నాటలకుఁ బంపక తండ్రి కప్పగించి యాసేవయందే యుండుఁడనును. ఈ బిడ్డల కపాయము పాముల వలననో పులులవలననో, దొంగలవలననో శత్రువుల వలననో కలిగి వారు ఘోషించి రేని యప్పుడు తండ్రి దానిని వారింపఁగల వారిని దన వారిని బంపనైనఁ బంపును. ఇదే యంశావతారము. లేకయంతటి గొప్పకార్యమైన యెడలఁ దానే బయలు దేఱి కావలసిన యుడుపులు, పరికరములు తన భార్య యొసఁగఁగాఁ బరిగ్రహించి సందర్భోచిత వేషముతో నంతఃపురము విడిచి సోపానములు దిగి యిల్లు విడిచి బిడ్డలయొద్దకు వచ్చి యుపాయముఁ దప్పించి బిడ్డల రక్షించి మఱల లోపలికిఁబోయి యావేషముదీసి వేయును. ఇది పూర్ణావతారము. భర్తయొద్దకుఁ బోఁదలఁచినవారి కెవ్వరికైనను నామె యనుగ్రహించి తలుపుదీయు వఱకు లోపలఁ బ్రవేశింప సాధ్యపడదు. ఈతలుపు దానే తీయనైనఁ దీయును. లేక భర్తచేఁ బంపఁబడిన వానిచేనైనఁ దీయఁజేయును. (వీఁడే యాచార్యుఁడు) అంతియకాని మనమై స్వశక్తిచే నెన్ని కల్పములకైనఁ బోఁజాలము. మన యేడుపులు విని మనస్సు కరఁగి యామె తలుపులు దీయవలె. మనము లోపలికిఁ బోవలె. ఇది తప్ప వేఱు మార్గములేదు. మీఁదఁ జెప్పిన తలుపులనే నామరూపములచే వ్యాపించియుండు దీనినే మాయయని, ప్రకృతియని, కర్మమని నానావిధములఁ బిలుతురు. ఇదియంతయు శ్రీదేవి చిద్విలాసము, భగవచ్ఛక్తియే, అన్యము గాదు. కావున భగవత్ప్రాప్తి గోరువారికి శ్రీదేవి యనుగ్రహ మనివార్యము. భగవంతుఁడు పంపిన యాచార్యుఁడైనను ఈమె యనుగ్రహములేదేని యేకార్యముఁ జేయఁజాలఁడు. వెలికిఁ బోనులేఁడు. లోపలికి రానులేఁడు. ఇట్లున్నను శ్రీదేవి భర్త సంకల్పప్రకారమే సమస్తకార్యములు చేయునుగాని యతిక్రమించి యేమియుఁ జేయదు. కావుననే భగవత్సంకల్పమే శ్రీ, శ్రీయే భగవత్సంకల్ప మందురు. భగవద్వ్యవహార మంతయు నీమెమూలమున జరుగవలసినదే. "మయాధ్యక్షేణ ప్రకృతిస్సూయతే సచరాచరమ్। మమ యోని ర్మహద్బ్రహ్మ తస్మిన్ గర్భం దధామ్యహమ్।

హేతునానేన కౌంతేయ జగద్విపరివర్తతే, భ. గీ. ౯-౧౦ భగవత్కరుణాస్వరూపిణి యైన యీశక్తినే సాత్త్వికులు శ్రీయని, లక్ష్మియని కొలుతురు. ఈ పద్యమందలి శ్రీ శరణమను వాక్య మీయర్థమునే సూచించుచున్నది. తామసులు వారి చిత్తవృత్తి ననుసరించి ఘోరరూపిణిగా కాళీచండీత్యాది నామములఁ బిలుతురు. ఆమె తృప్తికని హింసాది ఘోరకార్యములను జేయుదురు. కాకాసురుని ప్రత్యక్ష పురుషకారము చేతను, జటాయువు సేవచేతను, సుగ్రీవుని నాభరణములు వైచుటచేతను, సకుటుంబముగ విభీషణుఁ డానుకూల్యము వహించి ప్రాతికూల్యము విసర్జించుటచేతను, సీతానుగ్రహమునకుఁ బాత్రులైరని యెఱిఁగియే రామచంద్రమూర్తియు వారల ననుగ్రహించెను. ఆమె యనుగ్రహింపని వారిని దండించెను. కావున రామ కటాక్షప్రాప్తికి సీతానుగ్రహ మావశ్యక మగుచున్నది. ఓయీ! "ఏకమేవాద్వితీయం బ్రహ్మ" యని బ్రహ్మయొక్కఁడే సర్వకారణ మని చెప్పుచుండఁగా నీవు లక్ష్మీనారాయణులని యిద్దఱఁ జెప్పుచున్నావే. అది శ్రుతి విరోధము గాదా? యందురేమో — కాదు. నీవు చేసిన యర్థము శ్రుతి విరోధము. ఏక మను శబ్దమే నేను జెప్పిన యర్థము బోధించుచున్నది. అ-ఇ-ఉ ల వంటిది కాదు, ఏకారము. ఈ మూఁడక్షరములను నీవు విభజింపలేవు. అవి సంధిగతములు గావు. ఏకారము అ + ఈకారముల సంధిచే నైనది. అకారమునకు విష్ణువు, ఈకారమునకు లక్ష్మియని యర్థము. అట్లులే ప్రణవమందలి ఓకారము అ + ఉలచే నయినది. లక్ష్మీనారాయణులనే తెలుపుచున్నది. అట్లైన ప్రపంచమున కిరువురు ప్రభువులైరి గదా యందురేమో. ఒక రాష్ట్రమునకు నిరువురు స్వతంత్ర రాజు లుండిన హానికరము గాని, రాజు, యువరాజు లుండిన నేమి హాని కలదు. సూర్యుఁడు, ఎండ యుండిన లోకమున కేహాని గలిగినది. లక్ష్మిదేవి పతివ్రత గావున భర్తృ సంకల్పము ననుసరించి పోవుచుండును గాని యాయనను ధిక్కరించిపోదు. కావున నేహానియు లేదు. ఎండలేని సూర్యుఁడున్నాఁడని నీవు చెప్పెదవు. ఎండతోడ సూర్యుఁ డున్నాఁడనియు నెండలోకి పోక సూర్యదర్శనము కలుగదనియు నేను చెప్పుచున్నాను. ఎండచే లోకతంత్ర మంతయు జరుగుచున్నది కాని యెండలేని సూర్యబింబముచే గాదు. మన కారోగ్యకారణ మెండయే కాని యెండలేని సూర్యుఁడుకాఁడు. ఈ కాండమును బఠించువారు:—

(౧) బద్ధజీవ తారతమ్యము.

(౧) లంకలోనుండు రాక్షసస్త్రీలు. (౨) చెఱయందుంపఁబడి తప్పించుకొని పోవ నిష్టము కలిగియుఁ బోలేని దేవతాస్త్రీలు. (౩) సీతాదేవి కర్మవశమునఁ బ్రవేశించియు నందు లగ్నగాక ప్రసన్నయై భగవత్సహాయముచేఁ దప్పించుకొన్నది. (౪) హనుమంతుఁడు స్వేచ్ఛగాఁ బ్రవేశించి యందుఁ దగులు కొనక దానిని దగ్ధము చేసి వచ్చినవాఁడు. ఇట్టివారు మహాత్ములు, ఋషులు. ఈ నాలుగు విధములైన జీవాత్మలు సుందరకాండమున వివరింపఁబడినారు.

(౨) జీవాత్మ పరమాత్మలకుఁ గల సంబంధము సీతారాముల సంబంధము వంటిది.

(౩) జీవాత్మ తరణోపాయము- ఇది సీతాదేవి చర్యవలన నెఱుఁగనగు.

(౪) శిష్యాచార్య లక్షణములు- సీతాంజనేయ చర్యలవలన నెఱుఁగనగు.

(౫) జీవాత్మలకు సేవ్యుఁడు నిర్విశిష్టరాముఁడా? సీతావిశిష్టరాముఁడా? హనుమంతుని చర్యవలన నెఱుఁగనగు.

(౬) ఆత్మావలోకన పరుఁడైన యోగిలక్షణము హనుమంతుని చర్యవలనఁ దెలియనగు.

(౭) సీతాదేవి యుపాయమా? ఉపేయమా? రెండునా?

(౮) యోగికిఁ బ్రపన్నునకు భేదమేమి?

ఈ ముఖ్యవిషయములకుఁ బ్రశ్నోత్తరము గోరి చదువవలయును. ఇన్నిటికిఁ బ్రశ్నోత్తరము లిందుఁగలవు. ఈ విషయములు బాగుగ మనస్సున నాటుటకై దీని నెన్ని మార్లైనఁ బారాయణము చేయవలయును. మీఁద వ్రాసినదంతయు నప్రస్తుత ప్రశంస గాదు. సీతా హనుమంతుల విషయము- వీరి నిరువుర విడిచిన వారికి రామచంద్రానుగ్రహప్రాప్తి లేదు. సుందరకాండ మీ యిరువుర చరిత్రమే చెప్పుచున్నది. కావుననే యీ కాండము తక్కిన కాండములకంటె నెక్కువగా జనులచే నాదరింపఁబడు చున్నది. ఆ కారణముచేతనే దీనికి సుందర కాండ మని పేరు. సుందరశబ్దమునకు "సుతరాం ఆద్రియత ఇతి సుందరం, ద్రుఙ్ ఆదరే. మిక్కిలి సంతోష పెట్టునది" యని లింగాభట్టీయము. పారాయణరూపముగా జనులచే నాదరింపఁబడునది. వారి వారి యిష్టార్థములు నెఱవేర్చి సంతోషపెట్టునది సుందరకాండమే కదా. కావున సుందర శబ్దమునకు ధాత్వర్థము సంపూర్ణముగా పరిపోవుచున్నది. ఈ విశేషము దీనియందుఁ గలదని తెలుపుటకే తక్కిన కాండములకు స్థలమును బట్టియో కార్యమును బట్టియో బాలకాండమని, యయోధ్యాకాండ మని, యరణ్యకాండమని. కిష్కింధాకాండ మని, యుద్ధకాండమని, పేరు పెట్టినట్లు పెట్టక వాల్మీకి సుందరకాండ మనియెను.

మీఁద వ్రాసిన విషయములు మనస్సునందుంచుకొని యీ పద్యము చదివినచోఁ దాత్పర్యము సుస్పష్టమగును.

తా త్ప ర్య ము.

శ్రీదేవికి వాసస్థానమైనవాఁడా! సంసారసముద్రము దాటుటకు గురువను గొప్ప పడవను నడుపు నారకాటీ! అట్లు సంసారసాగరము దాటించుటకుఁ జేవుగా శ్రద్ధాభక్తు లనుగ్రహించు వాఁడా! శాశ్వత సుఖము నిచ్చువాఁడా! జానకీదేవి హృదయ కమలమందు వాసము చేయువాఁడా!

ఈ కాండాది పద్యమునందు నీ కాండమునఁ బ్రతిపాదింపఁ బడిన యర్థము గలదు. భగవంతుఁడు సంసారిచేతనుని రక్షించుటకై యాచార్యుని సంపాదించె ననుట పూర్వకాండార్థము. సంసారిచేతను నుద్ధరింప నాచార్యుఁడు చేయు ప్రయత్న మీ కాండమునఁ జెప్పఁబడినది. ఈ యర్థమును నాజవంజవాది వాక్యము సూచించును. గురుతరి హనుమంతుఁ డనియుఁ, గర్ణధారుఁడు శ్రీరామచంద్రమూర్తి యనియుఁ దెలియఁగవలెను. శ్రీశరణ యనుటచే శ్రియఃపతిత్వ మనెడి బాలకాండార్థము' కల్యాణగుణాకరత్వ మనెడి యయోధ్యాకాండార్థమును, సజ్జన రక్షకత్వ మనెడి యరణ్య కాండార్థమును సూచితము. ఆజవంజవేత్యాది పూర్వకాండార్థము నీ కాండార్థమును సూచించును. శ్రద్ధేత్యాది పదము యుద్ధకాండార్థమైన ప్రపత్తిని దెలుపును. శర్మద యనునది ప్రపత్తి ఫలమును, జానకీత్యాది పదము ప్రాప్యస్వరూపమును సూచించును. కాఁగా నీ పద్యమునందు నేతత్కాండార్థము ప్రధానముగను బూర్వోత్తర కాండార్థములు తత్సహకారులుగను వివక్షితములు.

అవతారిక :— శ్రీరామచంద్రమూర్తి పరాత్పరుఁ డనుటకు నసాధారణమగు సమస్తకల్యాణగుణాకరత్వము కిష్కింధాకాండమునందుఁ జెప్పఁబడెను. ఈ కాండమున నాయనకుఁగల సర్వసంహారకత్వ మనెడి గుణము 'అధిప బ్రహ్మస్వభువు చతురాస్యుఁడైన' వను పద్యంబునఁ జెప్పఁగలఁడు అని కొందఱు చెప్పుచున్నారు. పూర్వకాండమున మిత్ర రక్షణము సర్వథా చేయవలయు నని చెప్పఁబడెను. ఈ కాండమందు దూతకృత్యము, పతివ్రతా లక్షణము చెప్పఁబడుచున్నదని మఱికొందఱు, ఆత్మావలోకన తత్పరుఁడైన యోగి చర్యయు, ఆత్మచేయు భగవదనుసంధానవిధము, ఆత్మదర్శనము గల యోగి దేహాభిమానత్యాగము ధ్వనితము.

మొదటి సర్గమందుఁ జక్కఁబఱుప వలసిన శిష్యుని నాచార్యుఁడు వెదకు విధము చెప్పఁబడుచున్నది.

—• హనుమంతుఁడు మహేంద్రపర్వతంబున విహరించుట •—

క. తరువాత రావణాసుర, వరనీత ధరాత్మజాత•పదము న్వెదకన్
గురుచారణమార్గంబున, నరుగఁగ నృపదూత గర్వి•తారి తలంచెన్. ౨

అర్థము. తరువాతన్ = జాంబవంతునిచేఁ బ్రేరింపఁబడి సముద్రోల్లంఘనము చేయ నుత్సహించి మహేంద్రనగమునఁ జేరిన తరువాత, రావణ + అసురవర + నీతన్ = రావణుఁడనెడి రాక్షసశ్రేష్ఠుని చేతఁ దీసికొని పోఁబడిన, ధరాత్మజాత = భూదేవియందు జనించిన సీతాదేవియొక్క, పదమున్ = ఉన్నస్థలమును, గురు = గొప్పదగు, చారణ = ఆకాశమందు సంచరించు చారణు లను దేవజాతులయొక్క, మార్గంబునన్ = త్రోవయందు, నృపదూత = రామచంద్రమూర్తి దూతయగు

హనుమంతుఁడు; ఈయన యెట్టివాఁడన, కర్శితారి = నశింపఁజేయఁబడిన శత్రువులు గలవాఁడు; అవ్యవహిత భవిష్యత్తునకు వర్తమానభూతము లగు, సు. వ్యా. వాక్య. ౪౧ సూ. "మదర్థే త్యక్తజీవితాః" 'హా హతోఽస్మి' అన్నట్లు, దీనిచే నీయన శత్రుసంహారముచేసి పూనిన కార్యము సాధింపఁగలఁ డని సూచితము.

తరువాత కర్శితారి నృపదూత రావణాసురవరనీత ధరాత్మజాతపదము వెదకన్ గురుచారణ మార్గంబున నరుగఁదలచెను అని యన్వయక్రమము.

ఆచార్యపరమైన యర్థము:— శిష్యుఁ డున్నచోటు వెదకునట్టి యాచార్య స్వరూపముకూడ నిందుఁ జెప్పఁబడెను. తరువాతన్ = భగవంతుఁ డనుజ్ఞయిచ్చి పంపిన పిదప, భగవదాజ్ఞలేక యెవఁడును నాచార్యత్వము వహింపరాదని దీనివలన నేర్పడుచున్నది. ఈ యర్థమును నృపదూత యను శబ్దము స్థాపించుచున్నది. నృప= నృ = నరులను, జీవకోటులను, ప = పాలించువాఁడు. అనఁగా జీవాత్మల కీశ్వరుఁడై వానియం దంతర్యామియై ప్రేరకుఁడై యుండువాఁడు. అట్టివాఁడు భగవంతుఁడు. అయన దూత– 'సందేశహరో దూత' యని యమర కోశము. సందేశ మనఁగా నోటి మాట. దానిని గొనిపోవువాఁడు సందేశ హరుఁడు. వీనికే దూతయని పేరు. 'దూతః దూఙ్ పరితాపే' వీనిచేత శత్రువు తపింపఁ జేయఁబడును. అనుటచే దూతయగువాఁడు తన స్వామి చెప్పిన మాట చెప్పుటయేకాక, శత్రువులు నిరోధించినను వారిని బాధించి మరల వచ్చి తాను జేసిన కార్యము చెప్పఁగలవాఁడై యుండవలెను. ఇట్టివానికి దూత యని పేరు. అటుగాక యచ్చటికిఁ బోయి శత్రువులచేతఁ జిక్కి చచ్చువాఁడు దూతగాఁ బోరాదు. గురు విట్టివాఁడై శిష్యసందేహముల నెల్లఁ దీర్పఁగలవాఁడై యుండవలెఁ గాని శిష్యున కెక్కడ సందేహమో గురువున కక్కడనే యట్లున్నట్టుండ రాదు. అట్టివాఁడు గురువుగా నుండ యోగ్యుఁడుకాఁడు. భగవంతునిచే నాజ్ఞాపింపఁ బడిన గురు వెట్టి లక్షణములు గలవాఁడై యుండుననిన: కర్శిత+అరి= (౧) కృశింపఁ జేయఁబడిన కామక్రోధాదు లను నరిషడ్వర్గము గలవాఁడై యుండును. (౨) గురువు సార్థక నామధేయుఁడై యుండవలెను. "గుశబ్దస్త్వంధకార స్స్యాత్ । రుశబ్ద స్తన్నిరోధకః । అంధకార నిరోధిత్వా, ద్గురు రిత్యభిధీయతే." గు శబ్దమునకు నజ్ఞాన మను చీఁకటియని యర్థము. రు శబ్దమునకు దాని నిరోధించువాఁడని యర్థము శిష్యు నజ్ఞానాంధకారముఁ బోఁగొట్టువాఁడు గురువని యర్థము. మఱియు గురు వెట్టివాఁడై యుండవలయు ననిన గురుచారణమార్గంబున నరుఁగఁదలఁచువాఁడుగా నుండవలయును. గురువులయిన చారణులు పోయిన మార్గమునఁ బోవువాఁడుగా నుండ వలయునుగాని తద్భిన్న మార్గమున వర్తించువాఁడుగా నుండరాదు. చారణు లనఁగా, చారయంతి ఇతి చారణాః = ధర్మము ననుష్ఠించువారు కావునఁ జారణులు అని వ్యుత్పత్తి. అనఁగాఁ బూర్వాచార్యులని యర్థము. వారి మార్గంబునన్ = వా

రనుష్ఠించిన విధమును, 'పోవందగుఁ బెద్దవారు పోయెడి త్రోవన్' అన్నట్లు శిష్టుల సదాచారమునం దున్నవాఁడని యర్థము.

ఈ విధముగ గురు లక్షణము చెప్పఁబడెను. భగవదాజ్ఞ కలదనుటను రామ ముద్రికయుఁ గర్వితారి యనుటను దిసమొలల సుందరుల రావణాంతఃపురమునఁ జూచినను మనసు చలింపమియు, లంకాదహనాక్ష కుమారాది వధయు గురుచారణ మార్గమున ననుటచే దూతకృత్యము ధర్మశాస్త్రమున కవిరోధముగఁ జేయుటయుఁ దెలిపెడిని.

ఇందుఁ బూర్వాచార పరాయణత్వమునకే ప్రాధాన్య మీయఁబడె నని తలంపరాదు. ధర్మ నిర్ణయమందుఁ బరాశరుఁడు.

కల్పే కల్పే క్షయోత్పత్త్యౌ బ్రహ్మ విష్ణు మహేశ్వరాః, శ్రుతిస్మృతిసదాచార నిర్ణేతారశ్చ సర్వదా. మనువు, ౨, ౬. "వేదోఖిలో ధర్మమూలం స్మృతి శీలేచ తద్విదామ్, ఆచారశ్చైవ సాధూనా మాత్మన స్తుష్టి రేవచ.

వ్యాసులు:— ధర్మమూలం వేద మాహుః, గ్రంథరాశి మకృత్రిమమ్, తద్విదాం స్మృతిశీలేచ, సాధ్వాచారం మనః ప్రియమ్.

శ్రుతి స్స్మృతి స్సదాచారః స్వస్యచప్రియమాత్మనః, సమ్యక్సంకల్పజః కామో, ధర్మమూల మిదం స్మృతమ్॥ యాజ్ఞవల్క్యుఁడు.

ఈవిధముగ శ్రుతి - స్మృతి - సదాచారము, మనువు చెప్పిన శీలమే యాజ్ఞవల్క్యుఁడు చెప్పిన సమ్యక్సంకల్పజకామమని వీరమిత్రోదయుఁడు సమర్థించెను.

కావున శ్రుతి, స్మృతి, సదాచారము, స్వప్రియము, శీలము ననునవి ధర్మ నిర్ణయమునందుఁ బ్రమాణములు. 'శ్రుతి స్మృతి ర్మమైవాజ్ఞా' యను ప్రమాణము చొప్పున హనుమ ద్విషయమున రామాజ్ఞ కలదు. అది రాజాజ్ఞ కావున వేదానుశాసనమే. సదాచార మనునది గురుచారణ మార్గ గమనముచేఁ జెప్పబడెను. శీల మనునది అస్ఖలిత బ్రహ్మచర్యముచేఁ జెప్పఁబడెను. ఇచ్చట స్వప్రియమునకుఁ గారణము లేదు. ఏలన— ఈ మార్గముల దేనిచేతను బరిష్కారము గాక యటుచేసిన బాగా యిటు చేసిన బాగా యను ధర్మసందేహము వచ్చినపుడు కామక్రోధ లోభములకుఁ బాలుపడని తన పరిశుద్ధాంతఃకరణము ప్రమాణము. ఇచ్చట నట్టి సందేహము లేదు.

శిష్టాచార మనఁగా:—

ధర్మేణాఽధిగతో యైస్తు, వేదః సపరిబృంహణః ।
తే శిష్టా బ్రాహ్మణా జ్ఞేయాః శ్రుతి ప్రత్యక్ష హేతవః. ౧౨-౧౦౯

ధర్మమార్గమున ననఁగా గురు ముఖముగానో, వృద్ధసేవ చేసియో, మీమాంస, ధర్మశాస్త్రము, ఇతిహాస పురాణములతోడ వేద మెఱింగి దానిని

బత్యక్షము చేసికొని యర్థజ్ఞానము గలిగి చెప్పఁగలవారు శిష్యులు. ఈ విధముగ నాచార్య లక్షణ పరిపూర్తి హనుమంతునందుఁ గలదనియు, నట్టివాఁడు శిష్యాన్వేషణ మం దర్హుఁడనియుఁ జెప్పబడెను.

ఇక శిష్య లక్షణము చెప్పఁబడును. శిష్యుని ప్రథమ లక్షణము సీతవలె నుండుట. స్త్రీ లోల చెప్పఁబడె నన, 'స్త్రీ ప్రాయ మితర త్సర్వం, జగద్బ్రహ్మ పురస్సర'మ్మన్నట్టు భగవంతుఁ డొకఁడే పురుషుఁడు. తక్కిన జీవకోటు లన్నియు భర్తకు భార్య పరతంత్రయైనట్లు భగవంతునకుఁ బరతంత్రములే. ధారణపోషణాదుల కాయనపై నాధారపడి యుండునవే. ఇట్లు చెప్పుటచే భగవత్ప్రాప్తికోరు జీవాత్మ తాను స్వతంత్రుఁడ నని తలఁపక తాను సర్వవిధముల భగవంతునకుఁ బరతంత్రుఁడనని యాయనపై యోగక్షేమముల కన్నిఁటికి నాధారపడి యుండవలయును. 'నిర్యోగక్షేమ ఆత్మవాన్' అని కదా భ. గీ. చెప్పుచున్నది. ఇట్టి భావములేని జీవాత్మకు భగవత్ప్రాప్తి లేదు. హనుమంతుఁడు నేను నీవుపైఁ గూర్చుండఁ బెట్టుకొని పోయెద రమ్మని పిలిచినపుడు పోకయుండుటయు, రావణాసురుని రామాజ్ఞలేక నిన్ను భస్మముచేయకని చెప్పుటచేతను, స్వరక్షణభారము రామచంద్రమూర్తిపై వైచి యుండుటచేతను సీతాపారతంత్ర్య మెఱుఁగనగు. ధరాత్మజాత = ఈ విశేషణము మీఁదఁ జెప్పిన జీవాత్మయొక్క స్వరూపస్వభావములఁ దెలుపుచున్నది. భూమియందుఁ బుట్టిన దనుటచే నయోనిజత్వము దెలుపు టయ్యె. అట్టులే జీవుఁడు నయోనిజుఁడే కదా. ఆ కారణముచే జీవుఁడు నిత్యుఁ డనియు నేర్పడెను. సీత యనఁగా నాఁగటిచాలు. ఇది భూజాత, భూమియందుఁ బుట్టినదే కదా. అంతియేకాక భూమియే యాధారముగాఁ గలదై భూమిని విడిచి యుండ లేనిదియు, విడిచిన స్వరూపనాశమై పోవునదియుఁగదా. అట్టులే జీవుఁడును దనకుఁ గారణమై యాధారమైన భగవంతుని విడిచెనేని స్వరూప నాశమై పోవునని భావము. ధరాత్మజాత యనునది వృక్షమును దెలుపును. వృక్షము భూమియందుఁబుట్టి భూమియే యాధారముగఁ గలదై భూమికిఁ బరతంత్రమై యుండునుగదా. అట్టులే జీవుఁడును. ఈ విషయమున ముండకోపనిషత్తునందలి యీ మంత్రము స్మరింపనగు.

'యథోర్ణనాభి స్సృజతే గృహ్ణతేచ । యథా పృథివ్యా మోషధయ స్సంభవంతి । యథాసతః పురుషః కేశలోమాని । తథాఽక్షరా త్సంభవతీహ విశ్వమ్॥ ఏ ప్రకారము సాలెపురుగు తంతువులను దన దేహమునుండి విడుచునో మరల గ్రహించునో, యే ప్రకారము భూమినుండి వృక్షములు జనించునో, యెట్లు పురుషునందు వెండ్రుకలు పుట్టునో యట్లు భగవంతునుండి ప్రపంచము పుట్టుచున్నది. ధరాత్మజాత పద మీ యర్థమునే మఱియొక విధముగను దెలుపుచున్నది. ఎట్లన :— ఆత్మశబ్దమునకు విష్ణువని యర్థము. 'ఆత్మాయత్నో, ధృతి, స్వాంత, స్వభావ, పరమాత్మసు – జీవబుద్ధి శరీరేషు॥' నానా. 'బ్రహ్మేతి పరమాత్మేతి భగవానితి కథ్యతే. దీనికిఁ బ్రయోగము

"దత్తం దూర్వాససం సోమ మాత్మేశబ్రహ్మసంభవాన్" దత్తాత్రేయుఁడు దుర్వాసుఁడు, చంద్రుఁడు అత్మకు, శివునకు, బ్రహ్మకు సంభవించిరి. ఇచ్చట నాత్మ యనఁగా స్పష్టముగ విష్ణువే. కావున ధర+ఆత్మజాత, యన్నప్పుడు సర్వము ధరించు విష్ణువునకు జనించినవాఁడు జీవుఁడని యర్థము. ఇట్లు చెప్పుటచే వృక్షము లెల్ల భూమికిఁ బరతంత్రములో, యాధేయములో యట్లులే జీవకోటులు భగవంతున కని యర్థము. పదమును = స్థానమును, సంసారమండల మందీ జీవుఁ డెచ్చట నున్నాఁడో యని వెదకఁబోవఁ దలఁచెను. పద శబ్దమునకుఁ జిహ్నమనియు నర్థము గలదు. ఓయి! జీవాత్మలన్నియు భగవ దంశములే కదా. ప్రపంచము జీవకోటితో నిండి యున్నదికదా! ఇఁక వెదకనేల యందురేమో. లోకములో నందఱు నాత్మవంతులే. అయినను వాఁడాత్మవంతుఁడైనాఁ డన్నప్పుడు తా నాత్మయని దేహము గాదని యాత్మజ్ఞానము గలవాఁడని యెట్లు లర్థమో యట్లులే ధరాత్మజాత యన్నప్పుడు తనకు భగవంతుఁ డాధార మనియుఁ దా నాధేయ మనియుఁ బరతంత్రుఁ డనియు జ్ఞానముగల జీవుఁడు చెప్పఁబడెను. ఇట్టి జ్ఞానము గలిగి భగవత్ప్రాప్తి గోరు జీవుఁ డెచ్చట నున్నాఁడో యని యాచార్యుఁడు వెదకు నని భావము. పద మనఁగాఁ జిహ్నమని యర్థము. కావున నట్టి చిహ్నములు సజ్జన సంభాషణము, సాంగత్యము, భగవన్నామోచ్చారణము లోనైన చిహ్నములు. "విష్ణోః కటాక్షశ్చాద్వేష అభిముఖ్యం చ సాత్త్వికైః। సంభాషణం షడేతాని హ్యాచార్యప్రాప్తిహేతవః॥" అను వాక్య మిచ్చట ననుసంధింపవలె. ఇట్టి చిహ్నము లెవని యందుఁ గలవని యాచార్యుఁడు వెదకును. ఇట్టి జీవుఁడు తన స్వరూపము మఱచి రావణాసురవర నీతుఁ డయ్యెనని చెప్పఁబడెను. రావయతి = చెడుమాటలఁ జెప్పించునది. ఇట్టివాఁడు రావణుఁడు, కామ క్రోధములకు వశుఁడై తెలివిలేని మాటలాడు వాఁడు అనఁగా యుక్తాయుక్త పరిజ్ఞానము లేని వాఁడని భావము. వీఁడు అసురవరుఁడు; అసురుఁడు అనఁగాఁ బ్రాణములఁ గొనువాఁడు. అసూన్=ప్రాణాన్, రాంతి = గృహ్ణంతి, రా= ఆదానే, అట్టివారిలో శ్రేష్ఠుఁడు. అసురవరుఁడు అవివేకముచేఁ బరుల హింసించువాఁడని భావము. ఇట్టి వానిచే, నీత=స్వాధీన పఱుచు కొనఁబడినది. భగవత్పరతంత్రుఁడై భగవంతునకు నాశ్రితుఁడై యుండవలసిన జీవుఁడు కామముచే హింసా స్వభావుఁడగు నవివేకికి లోఁబడె నని భావము. ఇట్లు లోఁబడి తన యవివేకమునకై యేడ్చు జీవుని వెదక నాచార్యుఁడు ప్రయత్నించు నని భావము.

తాత్పర్యము.

జాంబవంతుఁడు ప్రేరించిన పిమ్మట హనుమంతుఁడు వానరులతో మహేంద్రనగ మెక్కి లంకకుఁ బోవ మనస్సుచే సంకల్పించిన దానిని గార్య రూపముగాఁ బరిణమింపఁజేయ రావణాసురునిచే హరింపఁబడిన భూపుత్రియగు సీత యుండు స్థానమును వెదకుటకై రామచంద్రమూర్తి దూతయు శత్రు సంహారకుఁడు నగు హనుమంతుఁడు

చారణ సంఘములు సంచరించు నాకాశమార్గంబునఁ బోవఁదలఁచెను. ధరాత్మజాత పదము వెదక ననుటచే నటువంటి పతివ్రతాశిరోమణి పాదదర్శనమైనను దాను కృతకృత్యుండ నని హనుమంతుఁడు తలఁచె నని సూచితము. దీనివలన సీతామాహాత్మ్యము, హనుమంతుని భక్తివినయములు తేటపడు చున్నవి. కావున భక్త ప్రపన్నులకు సీతారాము లిరువురు సేవ్యులే.

ఈ కాండము తకారము తోడఁ బ్రారంభించి తకారముతో సాంతము చేయ బడెను. ఈ పద్యమునందు గాయత్రియందలి పండ్రెండవ యక్షరము గలదు.

క. నిక్కించి తలయు మెడయును, జక్కఁగ నాఁబోతువోలెఁ • జారుతరుండై
యెక్కుడ నెవరి కశక్యము, నుక్కుడ మగుపని యొనర్ప • నూహించి మదిన్. ౩

అర్థము. నిక్కించి = పొడుగగునట్లు సాఁచి, ఆఁబోతు = ఆవుపోతు, కోడె, చారుతరుండై = మిగుల మనోహరుఁడై, ఉక్కుడము = గొప్పది. అశక్యము = ఇతరులకుఁ జేయ సాధ్యముగానిది. దీనికిఁ గర్త నాలుగవ పద్యమందలి కపికులేశ్వరుఁ డనునది. ఆ పద్యముతో నేకాన్వయము.

తా త్ప ర్య ము.

తాను బోవలసిన మార్గముఁ బొడఁజూచుటకుఁ గాను తల మెడ నిక్కఁబెట్టి మదించిన కోడె వలె మిక్కిలి మనోహరుఁడై యేకాలమం దే దేశమం దెవ్వరికైనను జేయుటకు సాధ్యము గాని గొప్పపని చేయవలయు నని మనస్సునఁ దలఁచినవాఁడై.

కం. మెచ్చుగు వైడూర్యము రుచి, నచ్చపుఁజలినీటిఁబోలి • యందం బగుచున్
హెచ్చినపచ్చికపట్టుల, నిచ్చగ విహరించెఁ గపికు • లేశ్వరుఁ డెలమిన్. ౪

అర్థము. రుచిన్ = కాంతితో, పచ్చికపట్టు = కొంచెము తెలుపుతోఁ గూడిన మూఁకుపచ్చరంగు కలది, కావున వైడూర్య వర్ణము కలది యనుట. చలినీటిఁ బోలెన్ = అను నుపమానముచేఁ బచ్చిక పట్టునకు శైత్య మార్దవములు వివక్షితములు, పచ్చిక పట్టులన్ = పచ్చిక మొలచిన చోటులందు, కపికులేశ్వరుఁడు = వానర జాతియందు శ్రేష్ఠుఁడు.

తా త్ప ర్య ము.

వానర శ్రేష్ఠుఁ డగు హనుమంతుఁడు నిర్మలమైన చల్లని నీటి వలె శైత్యము, మార్దవము గలిగి శ్రేష్ఠమైన వైడూర్యముల కాంతి గలిగి యందముచే నతిశయించిన పచ్చిక పట్టులందు సంతోషముతో నిటునటు ముందు వెనుకకుఁ బచారము సలిపెను.

ఈ తిరుగుట ప్రొద్దుపోక వ్యర్థముగఁ దిరుగుట గాదు. దీర్ఘముగ నాలోచించు వారిటు తిరుగుట గలదు.

కం. బెదరించుచు వికిరంబుల, నదలించుచు మృగగణంబు • నక్కున నేలం
బొదలించుచుఁ దరువుల మలఁ, గదలించుచు రేఁగు వెలిమొ • కం బనఁ దిరిగెన్. ౫

అర్థము. వికిరంబులన్ = పక్షులను, అక్కునన్ = రొమ్ముచే, తరువులన్ = చెట్లను, రేఁగు = విజృంభించు, వెలిమెకము = సింహము. మలన్ = పర్వతమును, పొదలించుచున్ = విఱుఁగఁ ద్రోయుచు; ఇప్పుడు మనుష్యులవలె రెండుకాళ్ళచేఁ గాక వానరుని వలె నాలుగు పాదముల నడచెనని తోఁచుచున్నది.

తా త్ప ర్య ము

హనుమంతుఁడు పక్షుల బెదరించుచు, మృగసమూహమును వదలించుచు రొమ్ము పార్శ్వభాగంబులచేఁ జెట్లు విఱిగి నేలఁబడ ద్రొబ్బుచుఁ, గొండను నూఁగులాడించుచు విజృంభించిన సింహమువలెఁ దిరిగెను.

చం. అసితము లోహితంబును సి•తాసితవర్ణము నాకుపచ్చనై
పొసఁగెడి పెక్కురంగులను • బొంపిరిపోవుడి ధాతుకోటిచేఁ
బసగల యక్షకిన్నరసు•పర్వసుపర్వనిభాహినిర్ఝరీ
విసరపరిష్క్రియావితతి • విస్తృతిచే హృదయంగమంబునై. ౬

అర్థము. అసితము = నలుపు, లోహితము = ఎఱుపు, సితాసిత వర్ణము = తెలుపు నలుపు కలిసిన చిత్రపువన్నె, పొంపిరిపోవుడి = అతిశయించెడి, ధాతుకోటిచేన్ = పర్వత సంబంధ ధాతువులచే (లోహాదులచే) సుపర్వ = దేవతలయు, సుపర్వనిభ = దేవతలతో సమానములయిన, అహి = పాములయు, నిర్ఝరీ = దేవతా స్త్రీలయు, విసర = సమూహములచేతను, పరిష్క్రియా = వారు ధరించిన యలంకారములయొక్క, వితతి = సమూహముల, విస్తృతిచేన్ = విస్తారముచేతను, హృదయంగమంబునై = మనస్సు నాకర్షించునదియై, (మహేంద్రనగముతో నన్వయము) ఇది మహేంద్రపర్వతవర్ణనము. తా త్ప ర్య ము.

నలుపు, తెలుపు, నలుపు తెలుపు గలిసిన చిత్రవర్ణము, ఆకుపచ్చగల పెక్కురంగులచే వృద్ధిచెందిన లోహాదులచేతను, మృత్తికాదులచేతను, మిగులకాంతిగల యాభరణములచే నలంకరించుకొన్న యక్షులు, కిన్నరులు, దేవతలు, దేవతాసములైన పన్నగులు, దేవతాస్త్రీలు వీరి గుంపులచేతను మనోహరమై.

క. మత్తిలి నాగవరంబులు, నెత్తఱిఁ జరియించు నామ•హేంద్రనగమునన్
జిత్త మిగురొత్త మనువున, హత్తిన నాగంబువోలె • నతఁడు వెలింగెన్. ౭

అర్థము. మత్తిలి = మదించి, నాగవరంబులు = శ్రేష్ఠము లయిన యేనుఁగులు, ఎత్తఱిన్ = ఏకాలమందును, ఇగురొత్తన్ = సంతోషముచే నతిశయింపగా, హత్తిన = ఉండిన, నాగంబు = ఏనుఁగు.

తా త్ప ర్య ము.

మదించిన యేనుఁగులు సర్వకాలములందు సంచరించు నామహేంద్ర పర్వతమునందు సంతోష మతిశయించుచు నుండ మకుఁగులోని యేనుఁగువలె విచ్చలవిడి సంచరించుచు హనుమంతుఁడు ప్రకాశించెను.

The Mahendra range, so called from Indra, the tutelary god of the East, is identified with the Eastern Ghats, which run in a succession of ranges from Orissa in a South and Westerly direction almost along the Eastern Coast of the Deccan until they lose themselves in the Malaya range to which it is linked by the Nilagiris and the Palni hills on the South. According to Valmiki both Hanuman and Rama passed on from the Malaya to the Mahendra Range, on the sea coast opposite which, on the other side of the channel, was Lanka. It is thus evident that the Southern extensions of the Mahendra Range, known at present under various names such as Kumbhakamdrug (opposite lake Pulicat), Nagari Nose, Jawadi Hills, Kalrayan, Pachmalais, Kolla-malais and Alagar hills (near Madura) formed the natural Eastern barrier of the Deccan, which kept off the Bay; and that the low irregular tracts which now lie between the hills and the Sea, as the deltas of the Pennar (Pinakini) and the Vellar, the Coleroon, the Kaveri and the Viaga, were, like lower Bengal, subsequent formations due to alluvial deposits of the rivers and recess of the sea. The channel which seperat d Lanka from the main land probably evtended at that time up to the spurs of the Mahendra range (Alagar hills) near modern Madura, and was 100 Jojans (nearly 150 miles) in extent and was studded with islets and shoals, as described in the Ramayana. The causeway constructed by Rama would thus appear to have been very nearly along the lower course of the Vaiga (not mentioned in the Ramayana) which flows through Ramnad into the sea, opposite Rameswaram The distance between India and Ceylon at present is about 60 miles. [The Ancient Geography of Asia P. P. 43 and 44]

క౦. రవికిని బాకవిరోధికిఁ, బవనునకు స్వయంభువునకుఁ • బలువేల్పులకున్
సవినయముగ నతి నొనర్చి, పవమానసుతుండు చనఁగఁ • బయనం బగుచున్. ౮

అర్థము. రవికిని = సూర్యునకు, పాక విరోధికిన్ = పాకుఁడను రాక్షసుని జంపిన యింద్రునకు, పవనునకున్ = వాయుదేవునకు, స్వయంభువునకున్ = బ్రహ్మకు, పలువేల్పులకున్ = నానా దేవతలకు, నతి = నమస్కారము, పవమాన సుతుండు = వాయుపుత్రుఁడు, ఆంజనేయుఁడు పయనము = ప్రయాణ శబ్దభవము, రవి = ఈయన విద్యాగురువు. కావునఁ దొలుత నమస్కరించెను. దీనిచే నేకార్యము నందైనను గురు నమస్కారము గావించియే తరువాత దేవతాది నమస్కారము గావింపవలె నని సూచితము. పాకవిరోధి = తాను రాక్షసులతో విరోధింపఁ బోవు చున్నాఁడు కావున రాక్షసవిరోధి యగు నింద్రుని సాహాయ్యము గోరి నమస్కరించెను.

తండ్రి గావున నాయన బలవేగములు గలుగ వాయుదేవునకు నమస్కరించెను. బ్రహ్మాస్త్రమువలన బాధలేకుండ బ్రహ్మను బ్రార్థించెను. ఇచ్చటనొకవరుస

గాన వచ్చెడిని, బాల్యమందుఁ దాను సూర్యుని గ్రహింపఁ బోవ నింద్రుఁడు వజ్రాయుధముతోఁ గొట్టఁగా వాయువు స్తంభించి నపుడు బ్రహ్మాదులు వచ్చి వరము లిచ్చిరి. కావున నా నలుగురి పేర్లు వరుసగాఁ జెప్పబడెను. ఆ నాఁడు మీ రిచ్చిన వరము లీనాఁడు ఫలింప ననుగ్రహింపుఁ డని వారిని బ్రార్థించెను. దీనిచేఁ గార్యారంభమందు గురువునకు నిష్టదేవతలకు నమస్కరించుట విధియని యేర్పడు చున్నది.

తా త్ప ర్య ము.

సూర్యునకు, నింద్రునకు, వాయుదేవునకు, బ్రహ్మకుఁ, దక్కిన దేవతలకు నఁజలితో నమస్కరించి యాంజనేయుఁడు ప్రయాణమై.

కం. తూరుపుముఖమై తండ్రికి, మారుతునకు నంజలిని స • మర్పించి క్రియా
తూరుఁడు దక్షిణదిశగా, నీరనిధి న్దాఁట మేను • నెఱి నిగిడించెన్. ౯

అర్థము. మారుతునకున్ = వాయుదేవునకు, క్రియాతూరుఁడు = ఇంతవఱకు నేమాటలు చెప్పెనో దానిని సాధింపఁ గలవాఁడు, నీరనిధిన్ = సముద్రమును, నిగిడించెన్ = పెంచెన్, మీఁది పద్యమందు వాయుదేవునకు దేవతాభావముతో నమస్కరించెను. ఈ పద్యమం దాయన తండ్రి కావున జనక భావముతో నమస్కరించెను. కావుననే 'తండ్రికి' నను పదము చేర్పఁబడెను.

దీని వలన గురుదేవతలకు వలెఁ బ్రత్యక్షదేవత తండ్రికిని నమస్కరింపవలె నని సూచితము. తా నిప్పుడు దక్షిణముఖమై యున్నాఁడు. దక్షిణాభిముఖుఁడై నమస్కరింపరాదు. గావునఁ దూర్పు తిరిగి నమస్కరించి మరల దక్షిణ ముఖముగఁ దిరిగెను. శుభకార్యము లన్నియుఁ దూర్పు ఉత్తరము తిరిగి చేయవలెను. అశుభకార్యము దక్షిణముఖమై చేయవలెను. నిద్రకు నుత్తరము నిషిద్ధము.

తా త్ప ర్య ము.

తూరుపు దిక్కు తిరిగి తండ్రి యగు వాయుదేవునకు నంజలిజోడించి నమస్కరించి కార్యసాధన మందు సమర్థుఁడగు హనుమంతుఁడు మరల దక్షిణ ముఖము తిరిగి సముద్రమును దాఁటుటకు దేహమును బెంచెను.

కం. ప్లవనకృతనిశ్చయుం డై, పవమానసుతుండు రాము • పనికై తన్నుం
బ్లవగతతి గనఁగఁ బర్వపు, దివసంబున జలధి యనఁగ • దేహము పెంచెన్. ౧౦

ప్లవన=దాఁటుటయందు, కృత=చేయఁబడిన, నిశ్చయుండు = నిశ్చయముగలవాఁడు, ప్లవగ తతి = వానర సమూహము, పర్వపు దివసంబునన్ = పున్నమనాఁటి యందు.

తా త్ప ర్య ము.

హనుమంతుఁడు రాముని కార్యము సాధింప సముద్రమును దాఁట నిశ్చయించు కొన్నవాఁడై వానరు లందఱుఁ జూచుచుండఁ బున్నమనాఁటి సముద్రమువలె దేహమును బెంచెను.

—• హనుమంతు విక్రమమునకు మహేంద్రాద్రి చీకాకుపడుట •—

కం. కొలఁదికి మీఱు శరీరము, పొలుపారఁగ నబ్ధి దాటు•పూనికను మహా
బలసుతుఁడు పర్వతముఁ జే, తులతోఁ జరణములతోడఁ • దూఁగాడించెన్. ౧౧

అర్థము. మహాబలసుతుఁడు = వాయువు కుమారుఁడు, తూఁగాడించెన్ = ఊఁగు లాడించెను. ఇది శబ్దపల్లవ క్రియ తూఁగు+ఆడు=తూఁగాడు.

తా త్ప ర్య ము.

మితిమీఱిన శరీరముతో, సముద్రమును దాటు పూనికతో హనుమంతుఁడు రెండుచేతులతోను గాళ్ళతోను గొండను నూఁగు లాడించెను.

కం. అచలం బయ్యె ముహూర్తము, ప్రచలిత మయ్యెం గపీంద్ర•పరిపీడిత మై
యచలారుహములు సుమనో, నిచయంబుల నెల్ల రాల్చె • నిండం గొండన్.

అర్థము. అచలము = కదలనిది, పర్వతము. ప్రచలితము = మిగులఁ గదలినది. పరిపీడితము = మిగుల బాధింపఁబడినది. బలవంతముగ నూఁచుటచే నని భావము. అచలారుహములు = వృక్షములు, అచలా = భూమి, సుమనోనిచయంబులన్ = పూలగుంపును.

తా త్ప ర్య ము.

ఆ మహేంద్రపర్వతము కదలని దయ్యు హనుమంతుఁడు బలవంతముగా నూఁచుటచే మిగులఁ గదలిన దయ్యెను. పర్వతము ముందు వెనుకకు నూఁగుటచే దానియందలి చెట్లన్నియుఁ బూలను గొండనిండ జలజల రాల్చెను.

కం. అమ్మహిజమ్ముల రాలిన, ఘుమ్మను క్రొత్తావి బుగులు•కొను కుసుమసమూ
హమ్ముల పెల్లునఁ బుష్పమ, యమ్ముగ శైలమ్ము దనరె • నతిరమ్యంబై. ౧౩

అర్థము. మహిజమ్ములన్ = చెట్లనుండి. క్రొత్తావి=క్రొత్తవాసన, క్రొత్త + తావి = క్రొత్తావి, బుగులుకొను = పరిమళించు, కుసుమ = పూవుల, పెల్లునన్= అతిశయముచే, పుష్పమయమ్ముగన్ = పూలతో నిండినదిగ.

తా త్ప ర్య ము.

ఘుమ్మని క్రొత్తవాసనలచేఁ బరిమళించు పూలు విస్తారముగఁ జెట్లనుండి రాలుటచే నా పర్వతము పూలపర్వతము వలె మిగుల నందమై యుండెను.

కం. ఉత్తమవీర్యుం డగు కపి, సత్త్వముచేఁ బీడ చెంది • శైలంబు జలం
బత్తఱిఁ గార్చెను మదమును, మత్తమతంగజము కార్చు•మాడ్కిం బెలుచన్. ౧౪

తా త్ప ర్య ము.

ఉత్తమ పరాక్రమముగల కపి నాయకునిచేఁ బీడింపఁబడి యా పర్వతము మదించిన యేనుఁగు మదము కార్చునట్లు నీళ్ళవంకలు పాఱునట్లు చేసెను.

కం. వడ వడ వడఁకెడి శైలము, నడుమను మడికాసు పైఁడి • నవ్యాంజన ముం
డెడి పొరలచాళ్లు కానం,బడియెను దరతరమ ముసుఁగుఁ • బాపిన భంగిన్. ౧౫

అర్థము. మడికాసు = వెండి, నవ్యాంజనము = క్రొత్తకాటుక, ఇది మిగుల నలుపై యుండును.

తా త్ప ర్య ము

గడగడలాడుచున్న కొండనడుమ వెండి బంగారు క్రొత్త కాటుకవంటి లోహము లుండెడి పొరల చాళ్ళు ముసుఁగు దీసి వేసిన కానవచ్చు నట్లొకటి వెంట నొకటి కానవచ్చెను. ఆయారాలు పగులు నప్పటికి వానిలోనుండి యీ విధములైన చాలు కనఁబడిన వని భావము.

క. ధగ ధగ మను నడిజ్వాలను, బొగఁ గ్రక్కెడి వహ్నిభంగిఁ • బొరి మణిసిలలన్
దగు పెనుబండలఁ ద్రోచెను, దిగువబడ మహేంద్రనగ మ•తిద్రుతరీతిన్. ౧౭

అర్థము. వహ్ని = అగ్ని, అతిద్రుతరీతిన్ = మిగుల వేగముతో, నడిజ్వాల= అగ్నిహోత్రమునకు కాళి, కరాళి, విస్ఫులింగిని, ధూమ్రవర్ణ, విశ్వరుచి, లోహిత, మనోజవ యని యేడు విధముల జ్వాలలు గలవు. దానిలో నడిమిది ధూమ్రవర్ణయని కొందఱు, అగ్నిహోత్రము మండునప్పు డంచున నుండు జ్వాలలు పొగతోఁ గూడి యుండును. నడిమి జ్వాల పొగలేక యుండును. దానివలె నని కొందఱు.

తా త్ప ర్య ము.

మండెడు నగ్నిహోత్రము నడిమిజ్వాలచే భగభగమని మండు మంట లంచు జ్వాలలచేఁ బొగను నెట్లు క్రక్కునో యట్టులే పర్వతము నడుమ మణిసిలలను నంచునఁ బెద్ద బండలను గ్రక్కెను.

క్రక్కుట వాంతి చేసికొనుట యివి ముఖ్యార్థమున జుగుప్సాకరములు కావునఁ బ్రయోగింపరాదు. గౌణార్థమునఁ బ్రయోగింప నగు.

నిష్ఠ్యూతోద్గీర్ణ వాంతాది గౌణవృత్తివ్యపాశ్రయమ్
అతిసుందర మన్యత్ర గ్రామ్యకక్షాం విగాహతే.

కం. గడగడ టాడఁగ శైలము, వడఁబడి గుహాలందుఁ బొదలు • వనసత్త్వంబుల్
దొడిఁబడి యడలెడు రవముల, బుడిబుడి నిగిడించె దెసలుఁ • బుడమియు నిండన్.

అర్థము. వనసత్త్వంబుల్ = అడవిమృగములు, వడఁబడి = బాధపడి, తొడిఁబడి = తొట్రుపాటుచెంది, అడలెడు రవములన్ = ఏడ్పుధ్వనులను, బుడిబుడిన్ = తత్తఱపాటుతో, నిగిడించెన్ = వ్యాపింపఁజేసెను.

తా త్ప ర్య ము.

ఆ కొండ గడగడ వడఁకఁగా బాధపడి గుహాలందున్న యడవి మృగములు తొట్రుపడి యేడ్పు ధ్వనులచే భూమి యాకాశము వ్యాపింపఁజేసెను.

చం. ప్రకటమహేంద్రసానునగ • భాగచరిష్ణుభుజంగకోటి స్వ
స్తికవరలక్షణోల్లసిత • తీవ్రఫణంబుల విచ్చి యుగ్రపా
వకనిభమౌ విషంబు నట • వారక హోక్కునఁ గ్రక్కి గుండులన్
వికటరదంబులం గొఱుకఁ • బెళ్లఁ బటీలున వేయితున్కలై. ౧౮

అర్థము. ప్రకట=ప్రసిద్ధమైన, మహేంద్ర పర్వతము యొక్క, సాను నగ = చఱియల యందును, పర్వత ప్రదేశమందును, చరిష్ణు=సంచరించు, భుజంగకోటి = పాముల సమూహము, భుజగము రూ. భుజంగము, స్వస్తిక = పాము పడగపై నర్ధ చంద్రాకారముగ నుండు మచ్చయనెడి, వరలక్షణ = గొప్ప గుర్తుచేత, ఉల్లసిత= ప్రకాశింపఁ జేయఁబడిన, తీవ్ర ఫణంబులన్=భయంకరములైన పడగలను, హొక్కనన్=ఇది వాంతియందలి యనుకరణ ధ్వని, వికటరదంబులన్=వంకరలగు కోఱలచేఁ గొఱుకన్=కోపముచే గట్టిగఁ గఱవఁగా, వెళ్లెన్=ఎగిరిపడెను.

తా త్ప ర్య ము.

ఆపర్వతము చఱులయందును దక్కిన ప్రదేశములందు సంచరించు పాములు స్వస్తిక చిహ్నములచేఁ బ్రకాశించు పడగలు విచ్చి భయంకరమైన యగ్నితో సమానమైన విషమును హొక్కున సమీపమందున్న గుండులను గోపముచేఁ దమ దంతములచేఁ గొఱుకఁగా నవి విషము వేఁడిమికి వేయిముక్కలై యెగిరి పడెను.

కం. విషమవిషమేని నొక్కొ- వి, విషమున నగమూలికలు శ॰మింపఁగ నై యా
విషముం బాపఁగ నోపవు, విషధరవిష మూర ! యెంత ॰ విషమవిషంబో. ౧౯

అర్థము. విషమ విషమేని = మిక్కిలి క్రూరమైన విషమునైనను, నగమూలికలు = పర్వతము నందలి వేళ్ళు, శమింపఁగనై = హరింప శక్తి కలిగియు, విషధర విషము=పాముల విషము, విషమ విషమంబో = క్రూర విషమో.

తా త్ప ర్య ము.

ఆ పర్వత మందలి యోషధు లెంత క్రూరమైన పాము విషమునైనను నిమిష ములో హరింపఁగలవు. అట్టి లయ్యు నా పాముల విషము నణఁప లేని వయ్యెను. ఆ పాములవిష మెంత క్రూరమో,

ఉ. బ్రద్దలువాఱు నోటు కుధ॰రం బను నివ్వెఱఁ గాందిశీకు లై
గ్రద్దనఁ బానపాత్రకర॰క ప్రకరంబులు భక్ష్యలేహ్యముల్
పద్దఱఁ బైఁడిపిళ్ళ మొల॰బాకులు నార్షభ చర్మఖేటముల్
రద్దు చెలంగ సర్వముఁ గ॰లంక యథాస్థితి వీడి కోనలన్. ౨౦

అర్థము. ఓటు = సందేహార్థము, కుధరము = పర్వతము, నివ్వెఱ = నిండు వెఱన్ = నిండు భయముచే, కాందిశీకులై = పరువెత్తుచున్నవారై, పాన పాత్ర = మద్యము త్రాగెడి పాత్రము, కరక = గిండివంటి పాత్రలయు, ప్రకరంబులు = సమూహములు, లేహ్యముల్ = నాలుకతో నాకి తినునవి, పద్దు+అఱ = పంతము చెడునట్లు, ఆర్షభచర్మఖేటముల్ = ఎద్దుతోళ్లతోఁ జేయఁబడిన డాలులు, రద్దు = అల్లరి, కలంకన్=కలవరపాటుచే, యథాస్థితి = ఉన్నవున్నట్లు.

తా త్ప ర్య ము.

కొండ బ్రద్దలుగాఁ బగులునో యేమో యను భయముచే వారువారు, మద్యముద్రాగు పాత్రములను, గిండీలను. భక్ష్యములను లేహ్యములను బంగారు పిడులుగల మొలయందుఁ జెక్కుకొను బాకులు, ఎద్దుచర్మముతోఁ జేయఁబడిన డాలులు, కలవరపాటుచే వీని నన్నిఁటి నున్నవున్నట్టు కొనలందు వదలి సందడిగాఁ బరువెత్తువారైరి. పై పద్యముతో నన్వయము.

కం. హారంబులు కంకణ కే,యూరంబులు ఘల్లులార•వోద్భటపటుమం
జీరంబులు నవసుమనో, హారంబులు ధగితపారిహార్యము లమరన్. ౨౫

అర్థము. కేయూరంబులు = బాహుపురులు, ఘల్లులారవ = ఘల్లు ఘల్లు మను ధ్వనిచే, ఉద్భట = అతిశయించిన, పటు = దృఢములైన, మంజీరంబులు = అందెలు, నవ=క్రొత్తవగు, సుమనోహారంబులు = పూలసరములు. ధగిత = ధగ ధగమను, పారిహార్యములు=కడియములు, అమరన్=ఒప్పఁగా.

తా త్ప ర్య ము.

హారములు, కంకణములు, భుజకీర్తులు, ఘల్లు ఘల్లుమను కాలియందెలు,క్రొత్త పూలదండలు, ధగధగమని ప్రకాశించు కడియము లొప్పుచుండఁగా, దేహముమీఁద నుండునవి తప్పఁ దక్కిన వన్నియు విడిచి పోయి రని భావము.

తే. అంగనలు కూడరాఁగ వి•ద్యాధరులును, రక్తమాల్యానులేపన•రక్తనయన
పుష్కరాక్షులుహారముల్•పాదలమెడల,నభ్రమునకుద్గమింద్రుమ•త్తాత్మలగుచు.

అర్థము. రక్తమాల్యానులేపన = ఎర్రని పూలదండలు, మైపూఁతలు; రక్త నయన= త్రాగుటచే నెఱ్ఱనయిన కన్నులుగల, పుష్కరాక్షులు = స్త్రీలు, అభ్ర మునకున్ = ఆకాశమునకు, ఉద్గమింద్రు = ఎగసి పోయిరి, మత్తాత్ములు=మత్తుచే దేహములు దెలియనివారు.

తా త్ప ర్య ము.

వారి వారి స్త్రీలు కూడ రాఁగా, విద్యాధరులును, ఎఱ్ఱనిపూలదండలు, ఎఱ్ఱని మైపూఁతలు, ఎఱ్ఱని కన్నులుగల స్త్రీలు మెడలందు హారములు కదలు చుండ మత్తుచే దేహము లెఱుఁగక యాకాశమున కెగిరిరి.

కం. సస్మితలై రమణులతో, విస్మితలై వాన రేంద్రకు • వికటపుఁగృతికిన్
విస్మృతలై సురశాత్రవ, ఘస్మరునిం గనిరి వాలుఁ•గంటులు మింటన్. ౨౬

అర్థము. సస్మితలై=చిఱు నవ్వుతోఁగూడినవారై,రమణులతో=ప్రియులతో, విస్మితలై = ఆశ్చర్యపడినవారై, వికటపుఁగృతికై = భయంకరమైన కార్యమునకు, విస్మృతలై = దేహములు మఱచినవారై, సురశాత్రవ = దేవతలకు విరోధులగు, రాక్షసుల-ఘస్మరునిన్=భక్షించువానిననఁగాఁ జంపువానిని, వాలుగంటులు= స్త్రీలు.

తా త్ప ర్య ము.

ఆ స్త్రీలాకాశమందుఁ దమ ప్రియులతోఁ నిలిచి నవ్వుచు, హనుమంతుని భయంకర కార్యమున కాశ్చర్య పడుచు, దేహములు మఱచినవారై రాక్షస హంత యగు హనుమంతుఁ జూచిరి.

కం. విద్యాధరపరమర్షులు, విద్యలవిభవంబు వెలయ • బృందంబులుగా
నై ద్యోవీథిని నిలఁబడి, చోద్యంబుగఁ గనిరి నగము • చో ప్పావేశన్. ౨౮

అర్థము. బృందంబులుగా = గుంపులుగా, ద్యోవీథిని = ఆకాశమార్గమందు, 'ద్యోవాహిని'యని ఎలకూచి బాలసరస్వతి దశావతార స్తోత్రములందుఁ బ్రయోగించి యున్నాఁడు. 'ద్యూత్తంభ ద్గిరికల్పితావతరణద్యోవాహినీసంగమో,' యని కూర్మావతార వర్ణనము. విద్యాధర పరమర్షులు = గొప్పఋషుల వలె శ్రేష్ఠులగు విద్యాధరులు. ఇచ్చటఁ బరమర్షి శబ్దము శ్రేష్ఠార్థకము. ఉపమిత సమాసము. విద్యాధరులు, పరమర్షులు, అని ద్వంద్వము చెప్పరాదు. విద్యాధరు లాకర్ణించిరని మీఁది పద్యంబునఁ గలదు. తా త్ప ర్య ము

గొప్పఋషులవలె శ్రేష్ఠులగు విద్యాధరులు తమ తమ యణిమాది విద్యల బలముచే గుంపులు గుంపులుగా నాకాశమున నిలువఁబడి యప్పుడు పర్వతమంత విధమును జూచిరి.

శా. ఆకర్ణించిరి సిద్ధచారణసమూ • హంబుల్ వచింపంగ శై
లాకారుం డదె యంజనాసుతుఁడు రా • మార్థంబుఁ గీశార్థ మ
స్తోకాశూర్ధతి దుష్కరంపుఁగృతికై • దుష్ప్రాప మా వార్ధి కా
న్నా కూలంబును జేర నెంచెఁ గనుఁగొం • డా యంచు విద్యాధరుల్. ౨౯

అర్థము. ఆకర్ణించిరి = వినిరి, దీనికిఁ గర్తృపదము విద్యాధరులు, శైలాకారుఁడు=పర్వతమంత దేహము గలవాఁడు, కీశార్థంబు = వానరుల కొఱకు, హనుమంతుఁడు సీతకై సముద్రము దాఁటి పోవుట కేవల రాముని నిమిత్తమే కాదు. వానరుల ప్రాణరక్షణము చేయవలసి యున్నది. కావున నిపు డిది వారి కార్యమే యయ్యెను. అస్తోక=గొప్పది యగు, ఆశూర్ధతి = వేగాతిశయముచే, దుష్కరంపుఁ గృతి=చేయ మిగులఁ గష్టమైన కార్యము, దుష్ప్రాపము = సులభముగాఁ బొంద రానిది, నాలుగవ పాదంబునఁ బ్లుతయతి. ఇట్లు సిద్ధచారణ సమూహములు చెప్పఁగా విద్యాధరు లాకర్ణించి రని యన్వయము.

తా త్ప ర్య ము.

ఆంజనేయుఁడు పర్వతాకారము గలవాఁడై రామునియొక్కయు, వానరుల యొక్కయుఁ గార్యార్థము మిగులఁ గష్టసాధ్యమైన సముద్రమును దాఁటి యావలి యొడ్డునకు మహావేగముతోఁ బోవుట యను నసాధ్యకార్యము చేయఁబూనెను, చూడుఁడీ యని సిద్ధులు చారణులు చెప్పుచుండ విద్యాధరులు వినిరి.

తే. ఆ మహాత్ముల మాటల • నాలకించి, పర్వతాగ్రమునం దున్న • ప్లవగవరుని
నప్రమేయునిఁ గాంచి వి • ద్యాధరాళి, యద్భుతైకరసాతివ • శాత్మ మయ్యె. ౨౯

అర్థము. అప్రమేయుని = ప్రమాణము చెప్పరాని దేహముగల వానిని, అద్భుతైకరస=ఆశ్చర్యమే ప్రధానము గాఁగల రసమువలన, అతివశాత్మము = మిగుల వశపడిన మనస్సు గలది.

తా త్ప ర్య ము.

ఆ మహాత్ముల మాటలు విని పర్వతముపై నున్న కొలఁది చెప్పరాని శరీరము గల హనుమంతుని గని విద్యాధరులు మిగుల నాశ్చర్యపడిరి.

తే. కొండవలె నుండు నాకపి • కుంజరుండు, మేను విదలించి రోమవి • తానములను
విఱచి వర్షాగమాభ్రంబు • విధముదోఁప, బిట్టుఁ జెమె నిస్వనము దిశల్ • దట్టుచుండ.

అర్థము. రోమవితానములను = వెండ్రుకల సమూహమును, వర్షాగమాభ్రంబు=వానకాలమందలి మబ్బు. నిస్వనము=ధ్వని.

తా త్ప ర్య ము.

కొండవలె దేహము పెంచిన యా కపిశ్రేష్ఠుఁడు దేహము విదలించి వెండ్రుకలు రాల్చి వానకాలమందలి మేఘమువలె ధ్వనిని దిక్కులు నిండునట్లు గర్జించెను,

కం. రోమాంకురసంచితమై, భీమం బై యానుపూర్వి • వృత్తం బయి యు
ద్దామం బగు లాంగూలముఁ, బాముని గరుటాలమంతు • భంగి విదిర్చెన్. ౩౦

అర్థము. రోమాంకురసంచితమై = మొలకలవలె నిలువఁబడియున్న వెండ్రుకలచే నిండినదై, అనుపూర్వివృత్తంబయి = మొదటినుండి తుదదాఁక గుండ్రమై. ఉద్దామంబు = గొప్పది, లాంగూలము = తోఁక, గరుటాలమంతుభంగిన్ = గరుత్మంతునివలె, విదిర్చెన్ = విదలించెను.

తా త్ప ర్య ము.

మొలకలవలె నిట్టపొడిచిన వెండ్రుకలచే నిండినదై భయంకరమై మొదటి నుండి తుదదాఁక వర్తులమై గొప్పదియగు తోఁకను గరుత్మంతుఁడు పామును విదలించినట్లు విదలించెను.

క. భీమజవు భుగ్నవాలము, దామోదరహయగృహీత • దర్వీకరమో
నా మహనీయుని వీఁపునఁ, దా మెఱయుచు నుండె నద్భు • తం బగురీతిన్. ౩౧

అర్థము. భీమజవు = భయంకరమైన వేగముగల హనుమంతుని యొక్క, భుగ్నవాలము = వంగినతోక, దామోదర హయ = విష్ణువాహనమైన గరుత్మంతునిచే, గృహీత=పట్టుకొనఁబడిన, దర్వీకరమో=పామో. ఉత్ప్రేక్షాలంకారము.

తా త్ప ర్య ము.

భయంకర వేగము గల హనుమంతుని వంగిన తోఁక గరుత్మంతుఁడు పట్టుకొన్న పామువలె నాయన వీఁపుపై నాశ్చర్యకరముగ మెఱయు చుండెను.

—• హనుమంతుఁ డాకాశంబున కెగిరి కపులచే సెలవు దీసికొనుట. •—

సీ. పరిఘనిభంబులౌ • బాహువుల్ స్తంభించి, భుజములు సొడయును • బొరి ముడించి
మోఁకాళ్లు లర్ధంబు • ముంగలగా వంచి, పాదముల్ జోడించి • వడిఁ గుదించి
వీనుల స్రుక్కించి • పెదవుల బిగియించి, కటిభాగమును లోను • గాఁగఁ గుంచి
కనుఱెప్పలెగయించి • కడుదవ్వుదిలకించి, యూర్ధ్వముఖంగాల్లి • లూఁదియుంచి
తే. యూర్పు బిగియించి తమిమీఁఱ • నురవసించి,
బయలఁ జూపు రహించి ని • ర్భయత మించి
కార్యముఁ దలంచి తన పరా • క్రమము నెంచి
పెంపు వహియించి యట్టె కు • ప్పించి మొగసె. ౩౦

అర్థము. పరిఘనిభంబులు = ఇనుపకట్ల గుదియలతో సమానములు, పొరి= మిక్కిలి, ముడించి = ముడుఁచుకొనునట్లు చేసి, కుదించి=కుదియఁజేసి, స్రుక్కించి = ముడుఁచుకొని, తిలకించి=చూచి. ఉరవసించి=వేగిరపడి, స్వభావోక్త్యలంకారము.

తా త్ప ర్య ము.

హనుమంతుఁడు సముద్రముదాఁట నుద్యుక్తుఁడై యినుపకట్ల గుదియలవంటి రెండుబాహువులు కదలకపట్టి భుజములు సొడ ముడిఁచికొని సగము మోఁకాళ్ళు ముందరివైపు వంచి రెండుపాదము లొక్కచోనుంచి కుదియఁజేసి చెవులు స్రుక్కఁ జేసి పెదవులు బిగించి నడుము లోపలికిఁదీసి కంటి ఱెప్పలు పైకెత్తి దూరమునందు దృష్టినిలిపి పర్వతమునందుఁ గాళ్లు బిగఁదన్ని, శ్వాస బిగించి సముద్రముదాఁటు కోరికతో వేగిరపడి బయలఁ జూపు నిలిపి చేయవలసిన కార్యము దానికిఁదగిన తన పరాక్రమము యోజించి భయము లేదు కార్యము సాధింపఁగలనని ధైర్యము గలవాఁడై గొప్పతనము వహించి యట్టె చివ్వున గుప్పించి మొగయఁబూనెను.

కం. ఎగయుచు నచ్చట నుండెను,నగచరనాయకులతోడ • హర్షంబున నా
శుగతనయుం డిట్లనుఁ దన,మగతనపుంబలిమిఁ దెలుపు • మాటలతోడన్. ౩౧

అర్థము. ఆశుగతనయుఁడు = వాయుపుత్రుఁడు, మాటలతోడన్ + అనున్= తృతీయ కర్థేవ మర్థము, ప్రకృత్యాచారుః అను సంస్కృత ప్రయోగము వంటిది. అనున్=ఈ క్రియకు ముఖ్యకర్మము వక్ష్యమాణవృత్తాంతము.

తా త్ప ర్య ము.

ఇట్లెగయుటకై పూని యచ్చట నున్న వానర ముఖ్యులతో సంతోషముతోఁ దన పౌరుషబలము దెలియున ట్లిట్లనెను.

ఉ. చొచ్చెర వాయువేగ మగు • శ్రీరఘురాముశరంబునట్లు నేఁ
జొచ్చెద లంక, నందు నృప • సుందరి గన్పడకున్న నాకముం
జొచ్చెద నిక్కె, నందు సతిఁ • జూడమి గల్గినఁ గట్టి రావణుం
దెచ్చెద, నట్లు లైన నృప • దేవిని దోడ్కొనివచ్చెదం జుఁడీ. ౩౨

అర్థము. శ్రీరఘురాము శరంబువల్లు = రామచంద్రమూర్తి బాణమువలె, ఈ దృష్టాంతముచేఁ దనకు వేగాతిశయము గలదనియుఁ దన ప్రయత్నము వ్యర్థము కాదనియుఁ దన కడ్డములేదనియు అవలియొడ్డు చేరువఱకు నడుమ నిలువ ననియు సూచితము. ౪౮ వ పద్యమునందు 'ప్రతిన సల్పితిఁ బ్రోవను నిల్వనంచు'నని చెప్పిన వాక్యమున కిదియే ప్రమాణము. ఇది వాల్మీకి శైలి విధానము.

తా త్ప ర్య ము.

మిత్రులారా! వాయువేగము గల రామచంద్రమూర్తి బాణము వలె లంకఁ బ్రవేశించెదను. అచ్చట సీతాదేవి కనఁబడదాయెనా యిదే విధముగా స్వర్గమునకుఁ బోయెదను. అక్కడ సీతాదేవి కానరాకున్న రావణుఁ గట్టి తెచ్చెదను. ఏవిధముగ నైన సీతాదేవిని బిలుచుకొని వచ్చెదను.

కం. తెచ్చెద లంకను నిచటికిఁ, ద్రొచ్చెద రావణునిఁబట్టి • క్రూరతమై నే
వచ్చెద సెల విచ్చెదరే, హెచ్చెదఁ గృతకృత్యతను గ•పీశ్వరులారా! 33

అర్థము. ద్రొచ్చెదను = నేల గుంతఁదీసి పాతి పెట్టెదను. వచ్చెదను=పోయి వచ్చెదను. ఆంధ్ర లోకోక్తి.

తా త్ప ర్య ము.

వానర శ్రేష్ఠులారా! నే నొకఁడనే సీతాదేవిని లంకయందు వెదుక జాగగు నట్లుండిన లంక నే యిచ్చటికిఁ దెచ్చెదను. రావణుఁ డడ్డము వచ్చెనా వానిని దయ లేక గోతిలో వేసి పాతి పెట్టెదను. పోయివచ్చెదను సెలవిచ్చెదరా. ఎటులైనను గార్యము సాధించెదను.

—• హనుమద్గమన వేగ వర్ణనము •—

చ. అనుచుఁ జిఱునవ్వు నగుచుఁ • దయాత్మను దన్వినతాత్మజాతుఁగా
ననుకొని పోవు వేగమున • కాతనితోన ద్రుమంబు లెల్లఁ జ
య్యన సుమపక్షి యుక్తముగ • నభ్రపథంబున కుద్గమించి తోఁ
జనె దవు పోవుచుట్టమును • సాగఁగ నంపెడి బంధులో యనన్. 3౪

అర్థము. ఆత్మను=తన మనస్సునందు,వినతాత్మజాతుఁగాన్=గరుత్మంతునిఁగా, ద్రుమంబులు = చెట్లు, సుమ పక్షి యుక్తముగన్=పూవులతో, పక్షులతో. అభ్ర పథంబునకున్=ఆకాశ మార్గమునకు. తోఁజనెన్=వెంటఁబోయెను. దవు=దూరము, రూ. దవ్వు.

తా త్ప ర్య ము.

ఈ ప్రకారము చెప్పి చివాలున నెగసి తన్ను గరుత్మంతునిఁగాఁ దలఁచుచు వేగముగఁ బోఁగా నా వేగమునకుఁ గొండమీఁది చెట్లు పూలతోఁ బక్షులతో నాకాశమున కెగిరి దూరము పోవు చుట్టమును సాగనంప వెంటఁబోవు బంధులవలె నతని వెంటఁబోయెను.

క. దళవాయిని వెనుకొనియెడి, దళము లనన్ సాలవృక్ష•తతు లవ్వేళన్
దళముగ వెన్నంటె మహా,బలసుతమహితోరువేగ•భగ్నము లగుచున్. 3౫

దళవాయి=సేనానాయకుఁడు, దళములు=సేనలు, దళముగన్ = దట్టముగ, మహాబలసుత=వాయుపుత్రుని, మహిత=గొప్పదగు, ఊరువేగ = తొడలవేగముచే, భగ్నములు=విఱిగినవి.

తా త్ప ర్య ము.

సేనానాయకుని వెంటఁబోవు సేనలవలె మద్దిచెట్లగుంపులు దట్టముగ నా సమయమందు నాంజనేయుని తొడల వేగముచే విఱిగి వెంబడి పోయెను.

క. దండిగఁ బూచిన కొమ్మల, కాండంబులతోడ నొప్పు•తమ్మోరుహావితతుల్
దండ నరుదేరఁ గపివే, తండము గిరివోలె నద్భు•తంబుగఁ దోఁచెన్. 3౬

అర్థము. కాండంబులతోడన్ = సమూహములతో, తమ్మోరుహా వితతుల్ = చెట్ల సమూహములు, దండ = సమీపమున, కపివేతండము = కపిశ్రేష్ఠుఁడు, వేతండము. రూ-వేదండము - భామినీ విలాసము. ౧-౬౨.

తా త్ప ర్య ము.

విస్తారముగఁ బూచిన కొమ్మలగుంపులు గల చెట్ల సమూహములు తన సమీపమున రాఁగా హనుమంతుఁడు కొండవలె నాశ్చర్యకరముగఁ గానవచ్చెను.

క. దంభోళిధరునిపటుసం,రంభంబున జలధి మునుఁగు•గ్రావము లటు లా
యంభోధిఁ బడి గుభాలున, నంభస్సుల సారవద్ద్రు•మాళి మునింగెన్. 3౭

అర్థము. దంభోళిధరుని=వజ్రాయుధము ధరించిన యింద్రుని, పటు సంరంభమునన్=అధిక వేగముచే, గ్రావములు = పర్వతములు, అంభస్సులన్=నీటియందు, సారవద్ద్రుమాళి=సారవంతములైన చెట్లగుంపులు.

తా త్ప ర్య ము.

తన తెక్కల ఖండింపఁ బూనిన యింద్రుని వేగమునకు వెఱచి సముద్రములో మునుఁగు కొండలవలె సారవంతములై భారము గల చెట్లు సముద్రములో గుభాలున బడి మునిఁగెను.

క. జలధరనిభుఁ డగు తెక్కపి, కలితాంకురయుక్తకుసుమ•గణములతోడన్
విలసించె మిణుంగురుపు,వ్వులతో నిశ రాణ మీఱు • భూధర మనఁగన్. 3౮

అర్థము. జలధర నిభుఁడు = మేఘముతో సమానుఁడు, కలిత+అంకుర+యుక్త=మొగ్గలతోను, మొలకలతోను గూడిన, కుసుమ గణముల తోడన్=పూల గుంపులతో.

తా త్ప ర్య ము.

మేఘమువంటి యా హనుమంతుఁడు మొగ్గలతో మొలకలతోఁ గూడిన పూలతో మిణుఁగురు పురువులతో రాత్రియందుఁ బ్రకాశించు కొండవలె నుండెను.

క. ఉరవడిఁ జన లే కెడలిన, ధరణీరుహకోటి ముక్త • తతపుష్పం బై
తొరఁగె జలంబుల నుదకపు,టిరవువరకు సాగనంపు • హితచయ మనఁగన్. ౩౯

అర్థము. ఎడలిన = వేగము తగ్గిన, ధరణీరుహకోటి = చెట్లసమూహములు ముక్తతత పుష్పంబై = విడువఁబడిన విస్తారమగు పుష్పములుగలదై, ఉదకపుటిరవు వఱకున్ = నీళ్లుండు స్థలమువఱకు, చెఱువు, కాలువ, ఏఱు మొదలైనవి. బంధువులను, హితులను సాగనంపువారు నీళ్ళడ్డము వచ్చువఱకే పోవలయును. అవలఁ బోరాదు. 'ఉదకాంతాత్ స్నిగ్ధో బంధు మను వ్రజే' త్తని శాస్త్రము.

తా త్ప ర్య ము.

భారమగుట వేగముగఁ బోలేక వెనుకఁబడిన చెట్లగుంపులు రాలిపోయిన పూలు గలవై నీళ్లడ్డము వచ్చు వఱకు బంధువుల సాగనంపి కన్నీళ్లు గార్చుచు నిలిచి పోవు హితులవలె నీళ్లలోఁబడెను.

ఉ. ఆ కపిగాలి నుత్థితము • లై బడి నేఁగియుఁ దేలి కొటచే
స్తోకసుమంబు లెల్ల పడిఁ • దోయధిఁ గూలెఁ బరస్సహస్ర మై
ప్రాకట తార కాశతవి • రాజిత మైన నభంబుపోల్కి నీ
రాకర మప్పు డొప్పెఁ బ్రస • వౌఘము లెల్లెడ నిండియుండుటన్. ౪౦

అర్థము. ఉత్థితములై = ఎగిరినవై, బడి=వెంబడి, స్తోకసుమంబులు = చిన్న పూలు, పరస్సహస్రము = వేయికి మించినవి; 'పరశ్శతాద్యాస్తే యేషాం పరా సంఖ్యా శతాధికాత్' అమరుఁడు. 'బ్రహ్మదయో బ్రహ్మహితాయ తప్త్వా పరస్స హస్రం శరద స్తపాంసి' భవభూతి. ప్రాకట=స్పష్టముగాఁ బ్రకాశించు, తారకాశత= అనేక నక్షత్రములచే, విరాజితము = ప్రకాశించునది, నభంబు = ఆకాశము, నీరాక రము = సముద్రము, ప్రసవ+ఓఘము=పూలగుంపు.

తా త్ప ర్య ము.

బరువుగా నుండు చెట్లు ముందుగాఁ బడిపోఁగాఁ దేలికయైనవి పూవులు గాలి కెగసి హనుమంతుని వెంబడి మఱి కొంతదూరము పోయి యందు వేల కొలఁది పూవులు సముద్రములో రాలఁగా నప్పు డా సముద్రము పూలచే నిండినదై నక్షత్ర ములచేఁ బ్రకాశించు నాకాశమువలె నుండెను.

క. నానావర్ణవిరాజిత, సూనావృతుఁ డైన వాయు • సూనుఁడు పోలెచెన్
మానుగ మెఱపులతోడ న,నూనం బగు తోయదమున • కుద్దిగ నగుచున్. ౪౧

అర్థము. నానావర్ణ=పెక్కువన్నెలచే, విరాజిత=ప్రకాశించు, సూన = పుష్ప ములచే, ఆవృతుఁడు=కప్పఁబడినవాఁడు, అనూనము = కొఱఁతలేని, తోయదము = మేఘము.

తా త్ప ర్య ము.

పెక్కురంగుల పూలతోఁ గప్పఁబడిన హనుమంతుఁడు మెఱపులతో నిండిన మేఘమువలె నుండెను.

క. మారుతసుతువేగంబున, నే రాలెడు వివిధపుష్ప • బృందములోడన్
నీరధి యుదయత్తారా, వారమనోహరనభంబు • వడువున నొప్పెన్. ౪౨

అర్థము. ఉదయత్ =ఉదయించుచున్న. తారావార = నక్షత్రసమూహముచే, మనోహర = ఇంపైన, నభంబు = ఆకాశము.

తాత్పర్యము.

ఆంజనేయుని వేగముచే వెంటవెంట రాలుచున్న నానావిధములైన పుష్ప సమూహములతో సముద్ర ముదయించుచున్న నక్షత్రముల గుంపులతోఁ బ్రకాశించు నాకాశమువలె నుండెను.

తే. ఉడుపథంబునఁ బోవు వా • యుజుని చాఁపఁబడిన కేల్దోయిగనుపట్టె • భయదమగుచుఁ
బర్వతమునుండి తల నిక్క • పఱచి పఱచు, నైదుతలలమహోఫణు • లట్టు లగుచు. ౪౩

అర్థము. ఉడుపథము=నక్షత్రమార్గము, ఆకాశము. ఇది హనుమంతుని హస్త వర్ణనము.

తాత్పర్యము.

ఆకాశమునందుఁ బోవుచుండు హనుమంతునిచేఁ జాఁపబడిన రెండు చేతులు పర్వతమునుండి తల నిక్కఁబెట్టి పెరువెత్తు నైదుతలల పాములవలె నుండెను. అయిదు వ్రేళ్లు ఐదు తలల వలె నుండె నని పోలిక.

క. తివ్వనఁ దరించి చనుచో, నవ్వనచరుఁ డూర్మిసహిత • మంబునిధిం దా
నవ్వియదధ్వముఁ ద్రావెడు, నవ్వడువునఁ దోఁచు చుండె • నత్యుగ్రగతులన్. ౪౪

అర్థము. ఊర్మిసహితము=అలలతోఁగూడినది. వియత్ +అధ్వము=ఆకాశ మార్గము.

తాత్పర్యము.

అలలతోఁగూడిన సముద్రమును తివ్వనదాఁటి యాకాశమునఁ బోవు హను మంతుఁడు ఆకాశమును, సముద్రమును త్రావుచుఁ బోవుచున్నాఁడాయేమి యన్నట్టు లుండెను. ఆయన వేగమునకు నవి రెండును గడచి పోవుచుండెను.

ఉ. మండుచు నుండు కొండపెను • మంటలు నా, యుగపత్సముద్భవో
ద్దండదివానిశాకర వి • ధంబున, మించులఁబోలి గుండ్రనై
వెండియుఁ బింగళంబు లయి • వెల్గెడి నేత్రము లొప్ప వాయుపు
త్రుండు సురాధ్వగామి యయి • తోరపువీఁకను బోవుచుండఁగన్. ౪౫

అర్థము. యుగపత్ =ఏకకాలమున, సముద్భవ=పుట్టిన, ఉద్దండ=(ప్రకాశముచే) అతిశయించిన, దివానిశాకరవిధంబునన్, దివాకర నిశాకరవిధంబున=సూర్యచంద్రుల వలె, మించులన్=మెఱుపులను, పింగళములు = ఎఱుపు పసుపు గలిసినవి, సురాధ్వ గామి=ఆకాశమునఁ బోవువాఁడు. తోరపు వీఁకను=అధికపరాక్రమముచే, పింగళత యందు మాత్రమే పెనుమంటలు, మించులు ఉపమానములు. దివాకర నిశాకరులు

వర్తులత పింగళతయం దుపమానములు, ఇది యథాతోపమ. ఉదయించువేళ సూర్యచంద్రులు ఎఱ్ఱగానే యుందురు. ఇది హనుమంతుని నేత్రవర్ణనము.

తాత్పర్యము.

హనుమంతుఁడు మిగుల వేగమున నాకాశమున బోవునపు డాయన కన్నులు మండుచున్న కొండల యందలి పెద్ద మంటలో యేకకాలమం దుదయించిన సూర్యచంద్రులో యున్నట్లు గుండ్రమై పింగళ వర్ణములై యుండెను.

తే. ఎఱ్ఱవాలున మెఱయు క•పీంద్రువదన, బింబ మెఱ్ఱని నాసికఁ • బెనుపు మీఱె
సంజకెంజాయ సోఁకున • సవురు మిగులు, నరుణదీధితిమండల • మనఁగ నపుడు.

అర్థము. అరుణ దీధితి=సూర్యుని, ఇది హనుమంతుని నాసిక వర్ణనము.

తాత్పర్యము.

ఎఱ్ఱని కాంతిగల హనుమంతుని ముఖమందు నెఱ్ఱని ముక్కు సంజ కెంజాయలు వ్యాపింపఁగా నందుఁ గానవచ్చు నెఱ్ఱని సూర్యబింబము వలె నుండెను.

క. పవమానతనూభవుఁ డిటు, ప్లవమానుం డగుచు నార్చ • లాంగూలంబున్
దివి నది వెలిఁగె సముచ్ఛ్రిత, దివిజాధిపతిధ్వజంబు•తీరుగ గురుతన్. ౪౭

అర్థము. ప్లవమానుండు=దాఁటుచున్నవాఁడు, అర్చన్ = ఆడింపఁగా, లాంగూలంబున్=తోఁకను, గురుతన్=గొప్పతనమందు, సముచ్ఛ్రిత=ఎత్తఁబడిన, దివిజాధిపతి=ఇంద్రుని, ధ్వజంబు=జెండా, ఇది హనుమంతుని తోఁక వర్ణనము.

తాత్పర్యము.

ఈ ప్రకార మాంజనేయుఁడు సముద్రము దాఁటిపోవుచుఁ దోఁక నాడింపఁగా గొప్పతనమునందు నాకాశమందది యెత్తఁబడిన యింద్రధ్వజమువలెఁ బ్రకాశించెను.

క. వెలిఁగెడి వెలికోఱలతో, వలయాకారంబు గొనిన•వాలముతో ని
స్తులమతియగు హనుమంతుఁడు, జలజాప్తుఁడు పరిధి నున్న•చందముఁ దాల్చెన్.

అర్థము. వలయాకారంబు = గుండ్రము, జలజాప్తుఁడు = సూర్యుఁడు• పరిధిన్ = పరివేషమునందు.

తాత్పర్యము

వెలుపలఁ బ్రకాశించు కోఱలతోను గుండ్రముగాఁ దన్నుఁ జుట్టుకొన్న తోఁకతోను హనుమంతుఁడు పరివేషము నడుమ నున్న సూర్యునివలె నుండెను.

క. నెఱమెఱుఁగుడాలు పిఱుఁదుల, ముఱికంబున నొప్పెఁ గీశ•ముఖ్యుఁడు దాఁ జే
గుఱుధాతువులను శైలము, తెఱపలు తెఱపలుగ నైన • తెఱఁగులు దోఁపన్.

అర్థము. నెఱ = పూర్ణమైన, డాలు = కాంతి, ముఱికంబునన్=నిక్కుచేత, జేగుఱు = ఎఱ్ఱని.

తాత్పర్యము.

పూర్ణమైన యెఱ్ఱని కాంతిగల పిఱుఁదుల నిక్కుచే హనుమంతుఁడు ఎఱ్ఱని

ధాతువులచేఁ బర్వతము, తెట్టెలు తెట్టెలుగా నున్న విధముఁ దోఁపఁజేయుచుండెను.

క. ఒడిసెలతావలె దివిఁ జని, యెడికరువలిముద్దుఁగొడుకు • నిరుమడిసందిన్
వెడలెడిగాడుపు మేఘము, వెడిదపుటులు మనఁగ మొరసె • భీషణభంగిన్. ౫౦

అర్థము. ఒడిసెల=రాలు విసరివేయుటకై యల్లఁబడిన త్రాడు, రూ. వడిసెల కరువలి=గాలి, ఇరుమడి సందిన్=రెండు చంకల నుండి.

తా త్ప ర్య ము.

ఒడిసెలతో వేసిన చివ్వునఁబోవు రాయివలె, బోవుచున్న హనుమంతుని రెండు చంకల నుండి వెడలు గాలి మేఘముల యుఱుములవలె భయంకరముగ ధ్వనించెను.

తే. ఉత్తరమునుండి దక్షిణం•బొత్తికొనుచు,చుక్క-కరిగెడి పెనుఁదోఁక•చుక్క-వోలెఁ
దాను బెనుఁదోఁకతోడనె•మ్మేను వెలుఁగ,లంకవైపుగఁ బఱచె ని•శ్శంకమతిని. ౫౧

అర్థములు. ఒత్తికొనుచున్ = ఆక్రమించుకొనుచు.

తా త్ప ర్య ము.

ఉత్తరము నుండి దక్షిణమునకై పోవు తోఁకచుక్క-వలె నాంజనేయుఁడు పెద్దతోఁకతో దేహము ప్రకాశించు చుండ లంకవైపుగ జంకులేక పోయెను. తోఁక చుక్క- యుపమానము లంక కనిష్టసూచకము.

తే. నింగితెరువునఁ జనెడి ప•తంగునట్లు, పొంగిపఱచుచు నున్న ప్ల•వంగుఁ డొప్పె
నడుమునను ద్రాటఁ గట్టంగఁ•బడుట దీర్ఘ,భూతమైన మదోత్క-ట•రీతి దవర.

అర్థము. నింగి=ఆకాశము, పతంగునట్లు=సూర్యునివలె, దీర్ఘభూతము = నిడివిగా సాఁగినది, మదోత్క-టము=ఏనుఁగు.

తా త్ప ర్య ము.

ఆకాశమార్గమునఁ బోవుచున్న సూర్యునివలె వేగముగఁ బరువు పాఱుచున్న వానరుఁడు నడుమునను ద్రాడుగట్టఁగా నిడివిగా సాఁగు నేనుఁగువలె దీర్ఘకాయుఁడై తోఁచెను.

క. అంబువులం బ్రతిబింబం, బంబరమున రూపు వెలయ • హనుమంతుం డ
ర్థంబు జలంబుల మునిఁగి జ,వంబున గాలికిని బోవు•ప్లవ మనఁ దోఁచెన్. ౫౩

అర్థము. అంబువులన్=నీటియందు, అంబరమునన్=ఆకాశమందు, ప్లవము = పడవ.

తా త్ప ర్య ము.

ఆకాశమున రూపము, దాని నీడ సముద్రము నీళ్ళయందుండుటచే హనుమంతుఁడు సగము నీళ్ళలో మునిఁగి సగము వెలికి గానవచ్చు పడవవలె నుండెను.

తే. గాడ్పుకొడుకఁడు చనినమా•ర్గంబు సర్వ, మతని మహితోరువేగంబు•కతనఁ జేసి
యల్లకల్లోల మగుచు వా•ర్ధాకరమునఁ, బొలిచె నోన్మాద భంగిని•గలఁగఁబడుచు.

అర్థము. గాడ్పు కొడుకుఁడు = వాయుకుమారుఁడు, కొడుకు శబ్దము బిడ్డాదులలోఁ జేరినది. బిడ్డాదులకు డుజ్జును విభాషవగు, సు. వ్యా. అచ్ఛిక. ౫ సూ. కతనఁ జేసి=కారణముచేత.

తా త్ప ర్య ము.

వాయుపుత్రుఁడు పోయిన మార్గమంతయును సముద్రమున నాయన తొడల వేగముచే గ్రిందు మీఁదు మీఁదు క్రిందుగఁ దాఱుమాఱై పిచ్చి పట్టిన వానివలె నుండెను. పిచ్చిపట్టిన వాఁడు తల దిరిగి పడుచు లేచుచు నోట నురుగు గ్రక్కుచుఁ బెద్దగా శబ్దించుచుండువట్లు సముద్రము భ్రమణ ఫేన ఘోషణములఁ గలదై యుండెనని భావము.

క. మి న్నప్పళింప నెగిరెడి, మున్నీటికరళ్ళఁ బ్లవగ•ముఖ్యుఁడు తనమే
న న్నిగిడెడి కరువలిచేఁ, దన్నుచు వడిఁ బోవుచుండె•దారుణభంగిన్. ౫౫

అర్థములు. అప్పళింపన్=తాఁకుటకు, కరళ్ళన్ = అలలను, కరువలిచే = గాలిచే.

తా త్ప ర్య ము.

ఆకాశ మంట నెగురు సముద్రముయొక్క యలలను హనుమంతుఁడు తన దేహమునుండి కలిగిన గాలిచేఁ దన్నుచుఁ బోవుచుండెను.

ఉ. వానరవర్య వేగభవ•వాయువునున్ జలదౌఘసంభవం
బౌనము నొక్కటై జలధిఁ • దద్దయుఁ దాఁ గలగుండు వెట్టెఁ బెం
పౌన నభంగభంగనిచ•యంబుల లాగెడి నాఁగ, నంజనా
సూనుఁడు మింటి మంటిగరు•సున్ విభజించెడి నాఁగ దాఁటుచోన్. ౫౬

అర్థము. వేగభవ = వేగముచేఁగలిగిన, జలదౌఘసంభవ = మేఘములవలనఁ గలిగిన వాయువు, కలగుండు వెట్టెన్ = కలవర పఱిచెన్, పెంపౌనన్=పెంపుగలుగ, అభంగ=భంగములేని, భంగ నిచయంబులన్ = అలల సమూహములను, గరుసున్=ఎల్లను. పొలిమేరను.

తా త్ప ర్య ము.

వానర శ్రేష్ఠుఁడగు హనుమంతుఁడు పోవుటచేఁ గలిగిన వాయువు మేఘములు పోవుటచేఁ గలుగు వాయువు రెండు నేకముగఁ గలిసి సముద్రమును గలవరపఱిచెను. హనుమంతుఁడు సముద్రము దాఁటునపుడు గొప్పతనము గలుగునట్లు నిండు తరఁగల గుంపులను లాఁగు చున్నాఁడో, యాకాశమునకు భూమికి నెల్ల యేర్పాటు చేయుచున్నాఁడో యన్నట్లుండెను.

క. ఉన్నతి మేరువు మందర,ము న్నగు మున్నీటియలల • మునుకొని వడిఁ దా
నెన్నుచుఁ బోయెడినో యనఁ, గ్రన్నన తరియింపసాగెఁ • గడిమి దలిర్పన్. ౫౭

అర్థము. మున్నీటి = సముద్రముయొక్క, మును+నీరు = మున్నీరు, తొలుత సృజింపఁబడిన నీరు, అప ఏవ ససర్జాదౌ (౨) ఆకాశము నుండి పడు వాననీళ్ళు,

వళ్ళ నీళ్ళు, ఊటనీళ్లు గలసినది యని యైనఁ జెప్పవచ్చును. మూఁడు + నీరు = మున్నీరు, ఎన్నుచున్ = లెక్కపెట్టుచు, క్రన్నన = శీఘ్రముగ, కడిమి = పరాక్రమము, తలిర్పన్ = అతిశయింపఁగా.

తా త్ప ర్య ము.

ఎత్తునందు మేరు మందర పర్వతములతో సమానము లయిన సముద్రపుటలల లెక్కపెట్టుచుఁ బోవుచున్నాఁడేమో యనునట్లు అలల మీఁదుగ హనుమంతుఁడు వేగమునఁ బోయెను.

క. పవనజజవనజపవనము, దివికిని మున్నీటినీటి • దెలిబిందులుగా
సవురుగ నెగఁజిమ్మిన నవి, సవనధరము లగుచుఁ దోఁచె • శరదభ్రములై. ౫౮

అర్థము. పవనజ=వాయుపుత్రునియొక్క, జవనజ = వేగమువలనఁబుట్టిన, పవనము=గాలి, తెలిబిందులుగాన్ = తెల్లని తుంపురులుగా, సవనధరములు=మేఘములతో గూడినవి, శరదభ్రములై =శరత్కాల మేఘములై.

తా త్ప ర్య ము.

హనుమంతుని వేగమువలనఁ గలిగిన వాయువు సముద్రము నీటిని దెల్లని తుంపరలుగా నాకాశమునకు నెగఁజిమ్మఁగా నవి శరత్కాలమేఘములవలె మేఘములతోఁగూడినవై కానవచ్చెను.

క. చేలము దొలంప దేహికి, వాలాయము దోఁచు నవయవంబులభంగిన్
నీళ్లేలు చనఁ దిమికచ్ఛప, పాళియు ఝషనక్రవితతి • స్పష్టం బయ్యెన్. ౫౯

అర్థము. ఝష=చేఁపలయు, నక్ర=మొసళ్ళయు, వితతి=సమూహము.

తా త్ప ర్య ము.

మనుష్యునకు వస్త్రము దీసివేయఁగా నవయవములు గానవచ్చునట్లు సముద్రమునందలి నీళ్లాకాశమున కెగిరిపోఁగాఁ దిములు, తాఁబేళ్లు, చేఁపలు, మొసళ్ళు గానవచ్చెను. తాఁబేళ్లు బిడాగాళ్లు, చేఁపలు కన్నులు, మొసళ్లు పిక్కలు.

క. నింగిని జనియెడి వానరపుంగవుఁ గని కడలిలోని • భుజగంబులు భీ
తిం గదురఁగ గరుడుం డను,చుం గళవళ మంది కుంది • సొమ్మలు బోయెన్. ౬౦

అర్థము. సొమ్మలు = మూర్ఛలు.

తా త్ప ర్య ము.

ఆకాశమునఁబోవు హనుమంతునిఁ జూచి సముద్రములోని పాములు గరుత్మంతుఁడు వోవుచున్నాఁ డని భయపడి కలవరపాటుచెంది మూర్ఛపోయెను. (ఈ యభిప్రాయము ననుసరించి కాఁబోలు నాముక్తమాల్యదయందుఁ గృష్ణదేవరాయలు 'ఘనటత్పయోబ్ధి వీక్ష్యరసాతలాన్యోన్య పిండీకృతాంగ భీతాండజము'లని వ్రాసెను.

క. పవిమాపడ వెడలుపు ము,ప్పదియామడ నిడివి యగుచుఁ • బరఁగి రుచిరమై
యుదధిని బావని నీడ వి,శదఘనఘనపంక్తి యనఁగఁ • జనుచుండె బడిన్. ౬౧

అర్థము. ఉదధిని = సముద్రమందు, పావని=ఆంజనేయుని, విశద = నిర్మలమై, ఘన=దట్టమైన, ఘనపంక్తి=మేఘము చాలు, బడిన్ = వెంబడి.

తా త్ప ర్య ము.

ఆంజనేయుఁడు సముద్రము దాటునప్పుడు ఆయన నీడ సముద్రమునందుఁ బదియామడ వెడలుపు, ముప్పది యామడ పొడుగై నిర్మలమై, దట్టమైన మేఘము చాలువలె నాయన వెంబడి పోయెను.

ఇందుఁ జెప్పఁబడినది నీడ పరిమాణమే కాని ప్రతిఫలించిన దేహపరిమాణము గాదు. ముప్పది యామడ దేహము గలవాఁడు మూఁడంజలలో లంకచేరి యుండ వచ్చును గదా యని సందేహింపరాదు. ఇది యుదయకాలము కావున నీడలు దీర్ఘములై యుండును. నీటికి సమీపమునఁ బోయి యుండిన నీడ యంత పెద్దదై యుండదు. గాన చాల నెత్తునఁ బోవుటచే నీడయుఁ జాల పెద్దదై యుండును.

క. అంబరభాగంబున నా,లంబవిహీనతను గపికు•లప్రవరుఁడు పో
వం బక్షయుక్తభూమిధ,రం బన నొప్పారియుండె • రభసోద్ధతి మై. ౬౨

అర్థము. ఆలంబ విహీనతను = నిరాధారముగ, పక్షయుక్త భూమిధరంబు= తెక్కలుగల పర్వతము, రెండు చేతులే తెక్కలు.

తా త్ప ర్య ము.

ఆకాశమునందు నిరాధారముగఁ బోవు హనుమంతుఁడు తెక్కలు గల పర్వతము వేగముగఁ బోవునట్లు కానవచ్చెను.

సీ. బలశాలి వడి నేగు•వార్ధిమార్గం బెల్ల. ద్రోణీకృతం బయి • తోఁచు చుండెఁ
బక్షుల నడుమను • బక్షిరాజనఁ బోవు, కపి మొగుల్ దూలించె • గాడ్పునట్లు
వలిముఖాకృష్టాభ్ర•ములు సితాసితరక్త,మాంజిష్ఠవర్ణముల్ • మలసె మింట
మఱుఁగుచు మెఱయుచు•మబ్బుల నడుమను. జంద్రుని యనఁగిశ•చంద్రుఁడమరె
తే. వనధి జవమున లంఘించు • ప్లవగుమీఁద
సురలు దనుజులు గంధర్వ•వరులు విరులు
గురిసి రర్కుఁడు తాపంబుఁ • గూర్పఁడయ్యె
హనుమ కనిలుండు వీచె రా•మార్గముగను. ౬౩

అర్థము. ద్రోణీకృతము=దోనెవలెఁ జేయఁబడినది. వలిముఖ = వానరునిచే, ఆకృష్ట=ఆకర్షింపఁబడిన, అభ్రములు = మేఘములు, సిత+అసిత+రక్త+మాంజిష్ఠ వర్ణముల్=తెలుపు, నలుపు, ఎఱుపు, ఎఱుపు తెలుపు కలిసిన వన్నెలు, మఱుఁగుచు= చాటుగఁబోవుచు, మెఱయుచు=ప్రకాశించుచు, దీనివలన మేఘములకంటె నెత్తుగఁ బోయె నని సూచితము. విరులు=పుష్పములు.

తా త్ప ర్య ము.

బలవంతుఁడైన హనుమంతుఁడు వేగమునఁబోవు నామార్గమంతయుఁ దోనెవలె

నడుమ పల్లము ఈవలావల నెత్తుగాఁగలదై కానవచ్చుచుండెను. (కదలని నీటిమీఁద మనము గట్టిగ నూఁదితి మేని నీటియందు గుంత యేర్పడును. ఆవిధముగ) పక్షులనడుమ గరుత్మంతుని వలెఁ బోవు హనుమంతుఁడు పెద్ద వాయువువలె మేఘములను జెదరఁ దోలెను. వానరుచే నాకర్షింపఁబడిన మేఘములు తెలుపు, నలుపు, ఎఱుపు నానావర్ణ ములు గలవయ్యెను. మేఘముల నడుమఁ బోవునపుడు చంద్రునివలెఁ గొంతసేపు కాన వచ్చి కొంతసేపు కానరాక యుండెను. ఆంజనేయుమీఁద, దనుజులు, గంధర్వులు, దేవ తలు పూలు గురియించిరి. రాక్షసులకు దానవులకు విరోధము కలదు. వారలనుగూడ రావణుఁ డణఁగఁ ద్రొక్కెను. సూర్యుఁడు వేఁడిమి చూపఁడయ్యె. (మధ్యాహ్న సమ యము) రామకార్యము సుఖముగ హనుమంతుఁడు చేయుటకై యాయనకు శ్రమము దోఁపకుండునట్లు వాయువు చల్లగా వీచెను. నిర్వంచనముగా భగవత్కైంకర్యము చేయువారికి దేవత లందఱు సాహాయ్యము చేయుదురని సూచితము.

చ. బళి బళి యంచు మెచ్చిరి సు • పర్వులు, బాపురె యంచు స్తోత్రముల్
చలిపిరి కిన్నరుల్, మునులు • చాఁగురె యంచుఁ బ్రశంస చేసి, రా
త్మల సయిఁసైఁ యటంచు విబు • ధప్రకరంబు పొగడ్త గూర్చె య
క్షులు కడుమేలు మే లనిరి • కొంకక యబ్ధిఁ దరించు కైసరిన్. ౭౮

అర్థము. సుపర్వులు=దేవతలు, సయిఁసైఁయటంచున్=ఇం దనునాసికోచ్చా రణము సూచింప నర్థానుస్వారము లుంపఁబడినవి, కైసరిన్ = కేసరి కుమారుని కైసరిన్, ఈ ద్వితీయ మెచ్చిరి యను క్రియతో నన్వయించు నపుడు కారకవిభక్తి; తక్కిన క్రియలతో నన్వయించునపుడు 'గూర్చి' యను దానిని జేర్చుకొని యుపపద విభక్తి యగును.

తా త్ప ర్య ము.

జంకు గొంకు లేక సముద్రమును దాఁటుచున్న కేసరిపుత్రునిఁ జూచి దేవతలు బళిబళీ యని మెచ్చుకొనిరి. మునులు చాఁగురెయని శ్లాఘించిరి. సైఁసైఁయని దేవతా సమూహము స్తుతించెను. యక్షులు మేలు మేలని నుతించిరి.

—• సముద్రుఁడు హనుమంతునకుఁ దోడ్పడ యోజించుట •—

క. అరిగెడు కపికేసరిఁ గే.సరిసుతుఁ గని వనధి యెట్లు • సలుపవలయు నీ
తరుణంబున సాహ్యము నీ,హరి కని యిక్ష్వాకుగౌర • వార్థి దలంచెన్. ౭౯

అర్థము. కపికేసరి=కపిసింహము, తరుణంబునన్=సమయమందు, సాహ్యము= తోడుపాటు, ఇక్ష్వాకు గౌరవార్థి = ఇక్ష్వాకు వంశము వారి గౌరవము గోరువాఁడు, వనధి=సముద్రుఁడు.

తా త్ప ర్య ము.

ఈ ప్రకారము పోవుచున్న కపిశ్రేష్ఠునిఁ జూచి యిక్ష్వాకువంశము వారి గౌర వముఁ గోరు సముద్రుఁడు ఇక్ష్వాకువంశ సంభవుఁడైన శ్రీరామచంద్రమూర్తి

కార్యార్థమై యీయన పోవుచున్నాఁడే. రామకార్యము నేను జేయఁజాల కున్నను చేసెడి మహానుభావులకైన సాహాయ్యము చేయవలయును గదా. ఈసమయమున నే నీయన కేవిధముగఁ దాను దోడు పడఁగల నని యాలోచించెను.

ఉ. పోఁడిమిఁ గాంచితిన్ సగర • భూమిధవర్షభుచేత నేను మున్
వీఁడును దత్కులోద్భవుఁడు • విశ్రుతుఁ డౌ రఘునాథుకార్యమై
వాఁడిచెలంగ నేగెడి న • వారణలీల, శ్రమంబు వాయఁగా
నేఁ డిట మేలు చేయ నగు • నిర్మలరాగపురస్సరంబుగన్. ౬౬

అర్థము. ఇక్ష్వాకు గౌరవార్థి యనుటకుఁ గారణము చెప్పుచున్నాఁడు.

పోఁడిమిన్=అభివృద్ధిని, భూమిధవ+ఋషభుచే = భూమిధవర్షభుచే = రాజ శ్రేష్ఠునిచే, తత్కులోద్భవుఁడు = ఆ వంశమునందుఁ బుట్టిన వాఁడు, విశ్రుతుఁడు= ప్రసిద్ధుఁడు, వాఁడి=పరాక్రమము, అవారణలీలన్ = అడ్డములేని క్రీడగా, రాగపురస్సరంబుగన్=అనురాగపూర్వకముగా.

తా త్ప ర్య ము.

నేను బూర్వ మా సగర చక్రవర్తిచే బాగు పడినవాఁడను. వీఁడా! యా వంశమందే పుట్టి ప్రసిద్ధికెక్కిన రామచంద్రమూర్తి కార్యము చేయ నడ్డము లేక పరాక్రమించి పోవుచున్నాఁడు. కావున వీనికి గష్టము దోఁపకుండునట్లు గాసి దీరునట్లు ప్రేమపూర్వకముగఁ జేయుట మేలు.

క. అక్కమలాక్షుని దూతకుఁ, జక్కనిసాయంబు నేను • జలుపన పోనిన్
జీకొట్టరె జగ మెల్లను. నక్కటికములేని 'జడధి' • యంచును నన్నున్. ౬౭

అర్థము. కమలాక్షుని దూతకున్ = కమలములవంటి కన్నులుగల శ్రీరామచంద్రమూర్తి దూతకు, ఇది పుండరీకాక్ష శబ్దము స్ఫురింపఁజేసెడిని. అనఁగా భగవంతుని దూత కని భావము. సాయంబు = తోడుపాటు, సాహాయ్యశబ్దభవము. చలుపను+అ+పనిన్ = చేయకయే పోయినయెడల, చీకొట్టరె = చీచీ యని నిందింపరా? రూ, చీకొట్టు, అక్కటికము=దయ, జడధి=మందబుద్ధి, లడల కభేదము గావున జలధి జడధి యయ్యె. "జడనిధి యను తెలిమాటుఁ గటు వెడలి నిలిచినట్టి యీట వెలఁదియ పోలెన్" ప్రభా. ప్ర.

తా త్ప ర్య ము.

ఆ పుండరీకాక్షుని దూతకు నేను సరియైన సాహాయ్యము చేయకయే పోయిన యెడల లోకమంతయు సముద్రుఁడు దయ, బుద్ధి లేనివాఁడని నిందింపరా? భగవత్కార్యమునకుఁ దోడుపడ శక్తి గలిగియుఁ దోడుపడఁడేని కృతఘ్నకరణ దోషము ప్రాప్తించుటయేగాక లోకనిందలకుఁ బాలుపడి యపకీర్తి పాలుగావలసి వచ్చునని భావము.

క. బడలిక నిచ్చటఁ బాసినఁ, గడు సుకరం బితఁడు దాఁటఁ • గడమ న టంచున్
జడనిధి దలఁచుచుఁ దనలో, నడఁగిన మైనాకుఁ జూచి • యాదటఁ బలికెన్. ౭౮

అర్థము. ఆదటన్ = ప్రీతితో.

తాత్పర్యము.

ఇచ్చట బడలిక పాపుకొనినా తక్కినదంతయు సులభముగా దాఁటవచ్చును. అని తలఁచుచుఁ దనలో దాగియున్న మైనాక పర్వతమును జూచి యిట్లనెను. మైనాకుఁడు మేనకకు కుమారుఁడు. హిమవంతునకు జన్మించినవాఁడు. పార్వతి తోడఁ బుట్టువు.

— • సముద్రుఁడు మైనాకునితో సంభాషించుట • —

ఉ. ఓయి హిరణ్యనాభ! విను • మొక్కటి చెప్పెద మర్త్యలోకమున్
డాయక యుండఁగా నసుర • నాథు లధోభువనంబునుండి, ని
న్నాయసభీకరోరుపరి • ఘాకృతి నిల్పినవాఁడు వేలుపు
ఱ్ఱాయఁడు, నీవ నేర్తు వలు • ప్రక్కఁ బతంగ మనంగఁ బోవఁగన్. ౭౯

అర్థము. హిరణ్యనాభ=హిరణ్మయములైన నాభులు గలవాఁడా; అనగా బంగారు శిఖరములు గలవాఁడా, నాభి = అధ్యక్షుఁడు, ప్రధానుఁడు, పర్వతమున కధ్యక్షము శిఖరము కావున నిది నాభి శబ్దార్థమయ్యెను. "నాభి రధ్యక్ష కస్తూర్యోః" అని దర్ప నిఘంటువు. "నాభిః ప్రధానే ప్రాణ్యంగే కస్తూర్యాం క్షత్రియే నృపే" నానా. ర. ఒక్కటి=చెప్పఁబోవు వృత్తాంతము, అధోభువనము=పాతాళము, ఆయస= ఉక్కుచే శేయఁబడిన, భీకర=భయంకరమైన, ఉరు = గొప్పదగు, పరిఘ+ఆకృతి = ఇనుపకట్ల గుదియవలె, వేలుపుఱ్ఱాయఁడు=దేవతల ప్రభువు = దేవేంద్రుఁడు, స్థిరము పరమోగ్రవపుసును నగాగమము గలదు, గరుడవ న్మరుదువలె, పతంగము=పక్షి.

తాత్పర్యము.

ఓయి! బంగారు శిఖరములు గల మైనాకా! నీకొక వార్త చెప్పెద వినుము. పాతాళలోకము నుండి రాక్షసులు భూలోకమునకు రాక యుండునట్లు నిన్నింద్రుఁడు ఉక్కుగుదియ వలె నడ్డముగా నుంచెను. పక్షివలె నే ప్రక్కనైనఁ బోవ నీకు సామర్థ్యముగలదు.

సీ. రామకార్యార్థమై • భీమకష్టుఁడు హనూమానుండు చనెడి నం • బరము నొరసి
నాకు సంపూజ్యు లి • క్ష్వాకుకులోద్భవుల్, పరమపూజ్యులు నీకుఁ • బర్వతేంద్ర!
నెయ్యంబుమై నీవు • తియ్యఁదనంబున, సాచివ్య మొక్కటి • చలుప వలయుఁ
గావింపఁ దగుపనిఁ • గావింప కుండినఁ, గోపింత్రు సజ్జనుల్ • గూళ యనుచు

తే. లెమ్ము జలములయందుండి • లీల నీవు, మనకు నతిథియుఁ బూజ్యుండు • మారుతాత్మ
భవుఁడు గావున నెను రేగి • బడలిక చన నతని ధరియింపు శిరమున • హర్షమునను.

అర్థము. సాచివ్యము = సాహాయ్యము.

తా త్ప ర్య ము.

రామచంద్రమూర్తి కార్యము సాధింప భయంకర కర్మము చేయు హనుమంతుఁ డాకాశమంటి పోవుచున్నాఁడు. ఇక్ష్వాకువంశమునఁ బుట్టినవారు నాకుఁ బూజ్యులు. నాయందు నీవు సుఖముగా నుండుటచే నేను నీకుఁ బూజ్యుఁడను గదా. ఆ కారణముచే నిక్ష్వాకువంశము వారు నీకుఁ బరమ పూజ్యులు. స్నేహము చేతను సౌమ్యభావమునను నీ సమయంబున నీవు నా కొక సాహాయ్యము చేయుము. చేయవలసిన పని చేయని వాని దుష్టుఁ డని సత్పురుషులు కోపింతురు. కావునఁ జేయక తప్పదు. హనుమంతుఁడు మన కతిథి, పూజ్యుఁడు కావున నీవు నీళ్ళలో నుండి లేచి యాయనకు నెదురుగఁబోయి గాసి దీరునట్లు శిరమున ధరింపుము. దీనివలనఁ దాను భగవత్కార్యము చేయ నాశక్తి యుండియుఁ జేయలేనివాఁడు చేయఁగల వానిని బ్రేరించి వానిచే నా కార్యము చేయింపవలెను. అతిథిని మఱి యేవిధముగ నుపచరింప లేనివాఁడు మంచి మాటలచేతను కూర్చుండుట కాసన మిచ్చుటచేతను దాహమును మంచి నీళ్ళిచ్చుటచేతనైన నాదరింపవలె నని సూచితము.

ఉ. ఇంచుక సేద దేఱి మఱి • యేగెడిఁ గాక కొదం దరింప, యో
జించి రఘూత్తమోత్తము సు•శీలతయున్ సతి గోలుపోక రా
త్రించరు నీటికై చనెడి•ధీరకపీంద్రుని పెన్ శ్రమంబు మో
దించుచు నీటనుండి యరు•దెమ్మిఁక లెమ్ము శుభమ్ము నీ కగున్. ౮౧

అర్థము. సేద=గాసి, కొదన్=కొంత సముద్రమును.

తా త్ప ర్య ము.

ఇట్లు నీవు చేసితివేని కొంచెము బడలిక తీర్చుకొని తరువాతఁ దక్షిణ సముద్రముఁ దాటిపోవును గాక. రామచంద్రుని మంచి నడవడి, ఆయన భార్యను బోఁగొట్టుకొనుట, రావణాసురు పట్టనమునకై పోయెడి ధీరుఁడైన వానరేంద్రుని శ్రమము నాలోచించి సంతోషముతో నీటినుండి రమ్ము, లెమ్ము, నీకు మేలగునుగాక.

—• మైనాకుఁ డాంజనేయున కెదురుగ వచ్చుట •—

చ. అను లవణాంబురాశినుడు • లా నగవల్లభుఁ డాలకించి తీ
వ్రవన మొగులుం బగల్చు రవిఁ • బోలుచు నీ రిరుపాయ చీలఁగా
ఘనతరనాగకిన్నరని•కాయసమంచితబాలభానుబిం
బనిభసుకూటకాంతి నసి•వర్ణ నభంబు సువర్ణతం గనన్. ౮౨

అర్థము. ఇరుపాయ=రెండుచీలికలుగా, నికాయ = సమూహముచే, సమంచిత=ఒప్పుచున్న, బాలభానునిభ = లేఁతసూర్యునితో సమానమైన, సుకూట = మంచి శిఖరముల, ఘనతర, సమంచిత, నిభ: ఇవి కూట విశేషణములు. అసివర్ణ నభంబు=కత్తివన్నెగల యాకాశము, కత్తులు నలుపని కవి సమయము. సువర్ణతన్ = బంగారు తనమును, బంగారు కాంతి.

తా త్ప ర్య ము.

ఈ ప్రకారము చెప్పుచున్న లవణసముద్రముమాట లా పర్వతశ్రేష్ఠుఁడు విని చివాలున మేఘములను బగలఁదీసికొని వచ్చు సూర్యునివలె నీళ్లు రెండు ఖండము లుగాఁ జీలఁగా నాగులు కిన్నరులు వీరల సమూహముచేఁ బ్రకాశించునదియు లేఁత సూర్యుని కాంతిగలదియు గొప్పదియు నగు శిఖరము కాంతి వల్లని యాకాశము బంగారువన్నె కలదికాఁగా.

ఉ. ఉప్పరవీథికి న్నగయ • నుగ్రమరీచిశతంబుపోల్కిఁ దా
నొప్పుచు మార్గమధ్యమున • నుండు మహాగిరిఁ గాంచి విఘ్న మి
ట్లుప్పతిలెం గదే యనుచు • నుగ్రభయంకరవేగ యుక్తుఁడై
యొప్పి ఢీకీలువందగిలె • నోలుచు సోలుచుఁ గొండ స్రుక్కఁగన్. ౮౩

అర్థము. ఉప్పర వీథికిన్ = ఆకాశమునకు, ఉగ్రమరీచి శతంబు = నూర్వుర సూర్యులు, ఉప్పతిలెన్=కలిగెను, ఒప్పి=హుమ్మనిధ్వనించి, ఓలుచు=విలపించుచు సోలుచున్=పడుచు, స్రుక్కఁగన్=బాధపడఁగా.

తా త్ప ర్య ము.

ఆకాశమున కెగయఁగాఁ ద్రోవ కడ్డముగ నూర్వుర సూర్యుల కాంతితో నిలు వగా విఘ్నము వచ్చెరా యని తలఁచి వేగ మతిశయింపఁజేసి హుంకరించి ఢీకీలున ఢీకొట్టగా మైనాకుఁడు విలపించుచు శోషిల్లుచు స్రుక్కెను.

క. పిడుగువలెఁ దాకఁ గళవళ,పడి గాలికి మబ్బుగతిఁ • బఱచియు నాదం
పడి పొంగి నుతిఁచెగి యాతని,వడిఁ బ్రీతిని బర్వతంబు • వనదాధ్వమునన్. ౮౪

అర్థము. వనద+అధ్వమునన్=మేఘమార్గమున=ఆకాశమందు.

తా త్ప ర్య ము.

హనుమంతుఁడు పిడుగు దాఁకినట్లు తాఁకఁగా మైనాకుఁడు కళవళించి గాలికి మబ్బువలె దూరము కొట్టుకొని పోయియు, నాయన వేగము బలము నెఱిఁగి మనస్సులో సంతోషించి పైకిఁ బొంగుచుఁ బ్రీతుఁడై యాకాశమునందు.

ఆ. మానవరూపంబున నిజ,సానుశిఖరమున నిలిచి • మారుతతనయా!
వానరవల్లభ! దుష్కర, మైనపనిం జలిపితి వ•హా యే మందున్. ౮౫

అర్థము. మానవ రూపంబునన్=మనుష్యాకారముతో.

తా త్ప ర్య ము.

మనుష్యస్వరూపముతోఁ దన శిఖరమందు నిలిచి యిట్లనియె.'వాయునందనా! వానరశ్రేష్ఠా! యెంతటి యసాధ్యమైన పని చేసితివి. అహా! నీ శక్తి నే నే మని పొగడుదును.

పర్వతములకు నదులకు మొదలై నవానికి వెలుపలఁగానవచ్చు రాలు నీళ్లు మొద లయినవి శరీరములనియు, నధిష్ఠాన దేవత వేఱుగా నందే యుండుననియు నెఱుఁగవలె.

ఉ. నిర్మలతేజ! నీ బలము • నీ వడిఁ జూచిన మెచ్చు వచ్చె, నా
శర్మసుకూటపాళి దగ • పాయఁగ నిల్చి యభేచ్ఛ మేగుమీ
శర్మముఁ గూర్చు వారలకు • శర్మము సేఁత సనాతనంబు నౌ
ధర్మము గాన సాగరుఁడు • తద్దయుఁ బ్రత్యుపకారచిత్తుఁడై. ౭౬

అర్థము. శర్మసుకూట పాళిన్=బంగారు శిఖరముల సమూహమందు, దగ=శ్రమము, శర్మము = మేలు, సనాతనంబు = శాశ్వతము, ప్రత్యుపకారచిత్తుఁడై = మఱు మేలు చేయ మనస్సు గలవాఁడై.

తా త్ప ర్య ము.

శుద్ధమైన తేజస్సు గలవాఁడా! నీ బలము నీ వేగము చూచి మెచ్చుకొంటిని. నా బంగరు శిఖరము లందు నీ శ్రమము పోవునట్లు నిలిచి యావల నీయిష్టము వచ్చి నట్లు పొమ్ము. నా మీఁద నీ కింత ప్రేమ యెట్లు గలిగెనందువా? మేలు చేసిన వారికి మఱు మేలు చేయుట సనాతన ధర్మము. కాఁబట్టి సముద్రుఁడు మఱుమేలు చేయఁ గోరినవాఁడై.

ఉ. తా రఘువంశజాత వసు•ధాపతిచేఁ బరివర్ధితాత్ముఁడై
పేరిమిఁ గంట, నీవు రఘు•వీరుని కార్యము దీర్పఁ బోవుటన్
గూరిమి నీకు సాయ మొన•గూర్చి బహూకృతి నొందఁ గోరి నన్
జేరి సగౌరవోక్తి నగ•శేఖర! యల్లదె మింటఁ గంటివే. ౭౭

అర్థము. బహూకృతి = గౌరవము.

తా త్ప ర్య ము.

ఆయన మఱుమేలు చేయుటకు నేనేమియు నాయనకు ముందుపకారము చేయలేదుగదా యందువేమో. సముద్రుఁడు తాను రఘువంశమునఁ బుట్టిన సగరుఁ డనుఁ రాజుచే వృద్ధిపొంది, యా నిమిత్తమున సాగరుఁడను పేరువహించి యుండుటయు నీవు రఘువంశమునఁ బుట్టిన రామచంద్రమూర్తి కార్యము చేయఁబోవుచుండుటయుఁ జూచి, నీకు సాహాయ్యము చేసిన, వారికిఁ జేసినట్లగు నని తలఁచి యా విధమున సాగరుఁడు కృతజ్ఞుఁడను గౌరవము నొందఁగోరి నన్నుఁ బిలిచి సగౌరవవాక్యముల నిట్లనెను. పర్వతోత్తమా! యదిగోఁ జూచితివా యాకాశంబున.

క. అనఘుఁడు కపివీరుఁడు యో, జనశతముం దాఁటఁ బూనెఁ • జయ్యన నీవుం
జను మెదురుగ నీ శిఖరా, వని బలిసి వాసి కడమ • వడగొనక చనున్. ౭౮

అర్థము. కడమ=తక్కినదూరము, వడగొనక=గాసిలేక.

తా త్ప ర్య ము.

రామకార్య ధురంధరుఁ డగుటచేఁ బుణ్యాత్ముఁడైన వానర వీరుఁడు నూఱు యోజనముల దూరము దాఁట ప్రయత్నించి పోవుచున్నాఁడు. నీవు త్వరగా

నెదురుగఁ బోయి నీ శిఖరమునందు నిలువుము. అందు విశ్రమించి గాసి దీఱిన పిదప తక్కినది కష్టములేక దాఁటుము.

ఉ. అచ్చపుఁ బ్రేమ నిట్టు లతఁ • డాడిన మారుతపుత్ర! నీకుఁగా
వచ్చితి, నిందు నిల్చి ఫల•వర్గముఁ దియ్యని కందమూలముల్
మెచ్చిక నారగింపుము, శ్ర•మం బఱ పోయిగ విశ్రమింపుమీ
గ్రచ్చఱ వెండి యేగ సుక•రం బగు శేషము వానరేశ్వరా! ౭౯

—అర్థము. సుగమము.

తాత్పర్యము.

వాయు నందనా! ఆయన యీ ప్రకారము నిర్మలమైన ప్రేమచేఁ జెప్పఁగా నీ నిమిత్తమై నేను వచ్చితిని. ఇచ్చట నిల్చి ఫల సమూహములను, తియ్యని కంద మూలములను నాయందలి ప్రేమచే నారగింపుము. బడలిక దీఱునట్లు విశ్రమింపుము. ఆవల నీవు తక్కిన దూరము వేగముగా, సులభముగాఁ బోవ సాధ్యపడును.

ఉ. క్రొత్తల నైన సజ్జనులఁ • గూరిమిఁ బూజ యొనర్చుటల్ సుధీ
సత్తము లెల్ల మెత్తురు ప్ర•శస్త మటం చది యిట్టులుండ దే
వోత్తముఁడున్ మహాత్ముఁడు బ•లోగ్రుఁడు నౌ పవమానపుత్ర! నా
కత్తఱి విందవైతివి గ్ర•హింపుమ యింపుగ నాతిథేయమున్. ౮౦

• అర్థము. క్రొత్తలనైనన్ = క్రొత్తవారినైనను, విందవు=అతిథివి, ఆతిథేయమున్ = అతిథి సత్కారమును.

తాత్పర్యము.

క్రొత్తవారినైనను సత్పురుషులను ప్రేమతోఁ బూజించు కార్యములను బుద్ధిమంతులగు సత్పురుషులు శ్లాఘ్యమైనవని మెచ్చుకొందురు. అతిథి గుణవంతుఁడగు నేని క్రొత్త ప్రాంత విచారము చేయరాదు. అదట్లులుండనీ, ఆ కారణముగాక నేను బూజించుటకు వేఱొక కారణము గలదు. దేవతలందు శ్రేష్ఠుఁడును (త్వమేవం ప్రత్యక్షం బ్రహ్మాసి) మహాత్ముఁడును బలమున భయంకరుఁడు నగు వాయుదేవునకు నీవు పుత్రుఁడవు. నీ యోగ్యత నాకుఁ దెలిసినను తెలియక పోయినను నీ తండ్రి యోగ్యతను బట్టియైన నేను నిన్నుఁ బూజింపవలెను. అట్టి మహానుభావునికొడుకవైన నీవు మా కతిథి వైతివి. కావున నే నిచ్చు నతిథిసత్కారము గ్రహింపుము. ఎట్టివాఁడైనను అతిథిపూజ్యుఁడు. అందు సజ్జనుఁడు విశేషపూజ్యుఁడు. అందు సద్వంశ ప్రసూతుఁడు పరమపూజ్యుఁడు. ఈ మూఁడును నీయందుఁ గలవు. కావున నీవు నాకుఁ బూజ్యుఁడవు.

తే. ధర్మజిజ్ఞాసువులకును • ధర్మవిదుల, కతిథి సామాన్యుఁ డయ్యుఁ బూ•జార్హుఁడగును
జెప్ప నేటికి నీవంటి • శిష్టు; మనకు, బాంధవం బొప్పు నేఁ గ్రొత్త • వాఁడఁగాను. ౮౧

అర్థము. దీనినే చెప్పుచున్నాఁడు. ధర్మజిజ్ఞాసువులకున్=ధర్మ మెఱుఁగఁ గోరిక గలవారికిని; ధర్మవిదులకు=ధర్మము తెలిసినవారికిని, సామాన్యుఁడయ్యు=గొప్పవాఁడు కాకున్నను.

తా త్ప ర్య ము.

ధర్మ మిట్టిదని తెలియకపోయినను, తెలిసికొనఁ గోరిక గలవారికిని, ధర్మము చక్కగా తెలిసినవారికిని సామాన్యుఁడైన యతిథియుఁ బూజ్యుఁడే. అట్లుండ నీవంటి సాధుపురుషుఁడు పూజ్యుఁ డని వేఱుగఁ జెప్పవలెనా? మన యిరువురకు సంబంధ మింతమాత్రమే గాదు. నేను గ్రొత్తవాఁడఁగాను. నీకుఁ గావలసిన వాఁడనే.

క. ఆశుగమనమునఁ బోలెద, వాశుగమనములను నిన్ను • వర్ణించినచో
నా శుభచరితునిఁ బవనుని, నే శక్త్యర్హతిని బూజ • నెఱపిన యటు లౌ. ౮౨

అర్థము. ఆశు+గమనమునన్=త్వరగాఁ బోవుటయందు. ఆశుగ+మనముల = వాయువును, మనస్సును.

తా త్ప ర్య ము.

నీవు వాయువేగ మనోవేగములఁ బోఁగలవు. నిన్ను నేను బూజించితినా లోకక్షేమకరమైన వడవడిగల వాయుదేవుని బూజించిన వాఁడ నగుదును.

—• మైనాకుఁడు తన పూర్వవృత్తాంతము హనుమకుఁ దెల్పుట •—

సీ. కలదు దీనికి నొండు•కారణం బది విను, మహాత్మ! నాతండ్రి! • యాంజనేయ
పూర్వము కృతయుగం•బున గిరుల్ తెక్కలు వెలయఁ దార్క్ష్యానిల • వేగయుక్తి
విచ్చలవిడి విను•వీధిఁ జరింపఁగఁ, దలలపైఁ బడు నంచుఁ దలఁకె నెల్ల
మునులును దేవతల్ • మున్నుగాఁ గల భూత,కోటి యంతట శత•కోటిఁ బూని
తే. వాసవుఁడు క్రుద్ధుఁ డగుచు గ్రా•వముల తెక్క-
లెల్లఁ దుత్తునియలు చేసి • యొసఁగి నాదు
వంకఁ గవియుడు మాతండ్రి • పరమకరుణఁ
జిమ్మి కొనివచ్చి ననుఁ ద్రోచె • సింధువునను. ౮౩

అర్థము. తార్క్ష్యానిల వేగయుక్తిన్=గరుడుని యొక్కయు,వాయువుయొక్కయు వేగము వంటి వేగముతోఁ గూడినవి, తార్క్ష్యుఁడు = తృక్షుఁడను ముని కొడుకు తార్క్ష్యుఁడు. శతకోటి = నూఱంచులు గలది వజ్రాయుధము. గ్రావముల = పర్వతముల యొక్క, తుత్తునియలు = తునియలు+తునియలు తుత్తునియలు = తున కలు తునుకలు, సింధువునను=సముద్రమునందు.

తా త్ప ర్య ము.

నేను నిన్నుఁ బూజించుటకు మఱియొక కారణముగలదు, వినుము. పూర్వము కృతయుగంబునఁ గొండలకెల్ల తెక్కలుండెను. అవిగరుడానిల వేగమున నాకాశమున

విచ్చలవిడిసంచరింపఁగా నవి తమ తలలమీఁదఁ బడునేమో యని మునులును, దేవతలు చాలభయపడుచుండిరి. అది యెఱిఁగి యింద్రుఁడు వజ్రాయుధముచేవాని ఱెక్కలనెల్ల తునుకలుగా నఱికి నా ఱెక్కలు ఖండించుటకు నాదెస వచ్చెను. అప్పుడు మీ తండ్రి వాయుదేవుఁడు నన్నుఁ దెచ్చుకొని వచ్చి సముద్రములో నైచి రక్షించెను.

క. ఎఱకలపోఁడిమి దఱుఁగక, వఱలెద నిట నీదు తండ్రి • వాత్సల్యముచే
నెఱిఁగితె మనసంబంధము, నెఱిఁ బూజ్యుఁడు నీదు తండ్రి • ని న్నాకతనన్. ౮౪

అర్థము. ఎఱకల=ఱెక్కల యొక్క, పోఁడిమి=అందము.

తా త్ప ర్య ము.

ఆ కారణముచే నేను ఱెక్కల యందము చెడక యుండి యిచ్చట నున్నాను. దీనికి మీ తండ్రి వాత్సల్యమే కారణము. మన సంబంధము తెలిసినదా! ఈ కారణముచే నీ తండ్రి నాకుఁ బూజ్యుఁడు. నిన్నా కారణముచే (గౌరవించెదను.)

ఉ. పావని! గౌరవించెదను • బాయక కూరిమి నాదుమైత్రి సం
భావనఁ జేసి, నా యిడు స • పర్యల నెల్ల గ్రహించి ప్రీతిమై,
వావిరి సేద దేఱి, నను, • వారినిధిం బరితుష్టచిత్తులం
గా వెలయింపు, ప్రీతుఁడవు • గమ్ము, ఘటింపుము ప్రీతి మాకునున్. ౮౫

అర్థము. సపర్యలు=శుశ్రూషలు, సత్కారములు.

తా త్ప ర్య ము.

వాయు కుమారా! యీ కారణముచే నిన్ను గౌరవించెదను. నా మైత్రిని వ్యర్థపుచ్చక నీవు గౌరవింపుము. నేను జేయు సత్కారముల గ్రహించి బడలిక తీర్చుకొని నన్ను, సముద్రుని సంతోషింపఁ జేయుము. నీవును బ్రీతుఁడవు కమ్ము.

క. నా చేయుపూజఁ గొనుమీ, పాచుకొనుము గాసి గాడ్పు • పట్టీ! నిన్నుం
జూచుటచే ముద మందితి, యాచించెద నాదు ప్రీతి • సార్థకపఱుపన్. ౮౬

తా త్ప ర్య ము.

నేను జేయు పూజ గ్రహింపుము. నీవు బడలిక పాపుకొనుము. నిన్నుఁ జూచుటచే సంతోషము గలిగి నా ప్రీతి సార్థకము చేయ యాచించెదను.

చ. అన నగరాజ! నీ వొసఁగు • నట్టి సపర్యలు వచ్చె, మోదముం
గనితి, నిలంగరాదు, ననుఁ • గార్యము కాలము తీవరించెడిన్
జనియెడిఁ బ్రొద్దు, నేఁ బలిన • చల్పితిఁ ద్రోవను నిల్వనందుఁ, గా
వునఁ జనెదన్ మదిం గినియఁ • బోకుము నిల్వనటంచు మిత్రమా! ౮౭

తా త్ప ర్య ము.

ఈ ప్రకారము మైనాకుఁడు చెప్పఁగా హనుమంతుఁ డిట్లనియె. పర్వతోత్తమా! నీవు చేయు సత్కారము లంగీకరించిన వాఁడ నేనైతిని అన్నరసము కన్న నాదరణ రసము మేలు గావున నీమంచి మాటల చేతనే సపర్యల నంగీకరించిన ఫలము నీకుఁ

గలదయ్యెను. సంతోషించితిని. నేను నిలువఁగూడదు. ఏలనఁ గార్యము కాలము నన్నుఁ దొందర పెట్టుచున్నది. చేయవలసిన కార్యము చాల నున్నది. ప్రొద్దా గ్రుంకఁ బోవు చున్నది. ఇక్కడ నాలసించితి నేని నేను గార్యము చేయుటకుఁ జాలినంత ప్రొద్దులేదు. అదియును గాక నేను ద్రోవలో నిలువ నని వానరులతోఁ బ్రతిజ్ఞ చేసితిని. (చూ. ప. ౩౭) కావునఁ బోయెదను. నేను నిల్వలే దని మిత్రమా! కోపింపకుము.

చ. అని పవమానవందనుఁడు • నాదర మారఁగ శైలరాజముం
దనకరపల్లవంబునను • దద్ద స్పృశించి హాసన్ముఖాబ్జుఁ డై
చనియెద నంచు వీడ్కొని భృ•శత్వర నూర్ధ్వము దాఁటి వేగి నై
వననిధిశైలరాజశుభ•వాక్కులు గైకొని పూజితుండు నై. ౮౮

అర్థము. కరపల్లవంబునను=చిగురువంటిచేతితో, హాసన్ముఖాబ్జుఁడై = నవ్వు చున్న ముఖాబ్జముగలవాఁడై, భృశత్వరన్ = అతివేగమున, వననిధి = సముద్రుని యొక్కయు, శైలరాజ=మైనాకుని యొక్కయు.

తా త్ప ర్య ము.

ఇట్లుచెప్పి హనుమంతుఁడు ప్రీతితో మైనాకునిఁ దనచేతితోఁదాఁకి నవ్వుమోము గలవాఁడై పోయి వచ్చెద నని సెలవు తీసికొని మిగుల వేగమున నంతకుఁ బై కెగిసి సముద్రమైనాకుల యాశీర్వచనములు పొందినవాఁడై.

క. అంబరమార్గమున నిరా,లంబనముగ వాయుసూతి • లక్షించుచు భూ
ధ్రంబును జనె; రెండవకా,ర్యంబును దుష్కరముఁ జూచి• యమరులు పొగడన్.

తా త్ప ర్య ము.

ఆకాశమునందు నిరాధారముగ నాంజనేయుఁడు మైనాకుని జూచుచుఁ బోయెను. రెండవ యసాధ్య కార్యమును జూచి దేవతలు పొగడిరి.

మొదటి కష్టకార్యము, సముద్రము దాఁటుట. రెండవది కొండ యడ్డుపడినను ఛేదించుకొని నిలువక పోవుట.

క. మైనాకుఁ డొనర్చిన స్నే,హానూనకృతిం దలంచి • యంబరవీథిన్
గానఁగ నిలిచిన నాకౌ, కోనికరము పొగడె,నద్రి•కుంజరు నంతన్. ౯౦

అర్థము స్నేహానూనకృతిన్ = స్నేహముచేనైన గొప్ప కార్యమును, నాకౌకోనికరము=దేవతా సమూహము, అద్రికుంజరున్=పర్వతశ్రేష్ఠుని, మైనాకుని.

తా త్ప ర్య ము.

మైనాకుఁడు చేసిన స్నేహపూర్ణమైన కార్యమును జూచి యాకాశమందు నీ వినోదము చూడ నిలిచిన దేవతాసమూహము మైనాకుని బొగడిరి.

ఉ. నాకవిభుండు దానికి న•నంతముదంబును బొంది నెండి మై
నాకునిఁ జూచి యో కనక•నాథ! నినుం గని సంతసించితిన్

నీ కథయం బాసంగితి వి•నిర్మలనీతి యథాసుఖంబుగా
లోకమునం జెలంగు భయ•లోలత మానుము మానసంబునన్. ౯౧

తా త్ప ర్య ము.

ఆ మాటలు విని యింద్రుఁడు మిగుల సంతోషపడి వచ్చి మైనాకునిఁ జూచి యో సువర్ణనాభ! 'నిన్నుఁజూచి మిగుల సంతోషించితిని. నావలన నీకిఁక భయము లేకుండ వరమిచ్చితిని. నీవు సంకోచములేక లోకంబున సుఖంపుము. మనస్సునందైన భయపడ వలదు.'

చ. ఎటు లొకొ నూఱుయోజనము • లీతఁడు వార్ధిఁ దరించు నంచు లోఁ
దటతట గగ్గె మాకు నెఱి•ధైర్యము మై నతఁ డేగుచుండినన్
దిటముగ రాముకార్యమును • దీర్పఁగ దూతగఁ బోవు మారుతిన్
దటుకున నాదరించితివి • తద్దయు మెచ్చితి నీకు నచ్చెలీ. ౯౨

అర్థములు. తటతట=భయముచే గుండెలు కొట్టుకొనుట యందు ధ్వన్యనుకరణము=భయము, నెఱి=నిండు, నీకు మెచ్చితిన్ = నిన్ను మెచ్చితిని, ద్వితీయకు మాఱు షష్ఠి. షష్ఠీ స్థానకం బగు కువర్ణకం బొక్కొక్కచో ద్వితీయాది విభక్తులకు మాఱుగాఁ దత్తదర్థంబులఁ జూపట్టెడిఁ (త్రికా-౧౭సూ)

తా త్ప ర్య ము.

హనుమంతుఁడు నిండుధైర్యముతోఁ బోవుచుండినను నీతఁడెట్లు నూఱు యోజనముల సముద్రము దాఁటఁగలఁడని భయముచే మా గుండెలు కొట్టుకొను చుండెను. ఆ విధముగ రాముని కార్యముఁ దీర్ప దూతగఁ బోవుచున్న హనుమంతుని నాలస్యము లేక సమయమున నాదరించితివి. నీ కార్యము స్నేహితుఁడా! మెచ్చితిని.

క. అనుచు శచీవల్లభుఁ డిటు, తనుఁ బల్కిన లబ్ధవరుఁడు • ధరవల్లభుఁ డా
త్మను గలరి నెలసెఁ బదపడి, హనుమంతుఁడు బోవు చుండె • నంబరవీథిన్. ౯౩

అర్థములు. లబ్ధవరుఁడు=వరముపొందినవాఁడు. ధరవల్లభుఁడు=పర్వతశ్రేష్ఠము.

తా త్ప ర్య ము.

అని యీ ప్రకారము దేవేంద్రుఁడు తనతోఁ జెప్పఁగా మైనాకుఁడు వరము పొందినవాఁడై భయము విడిచి సంతోషించెను. హనుమంతుఁ డాకాశమునఁ బోవుచుండెను. దీనిచే భగవత్సేవకులకు దేవతలు సాహాయ్యపడుదురు. 'శ్రేయాంసి బహు విఘ్నాని' శ్రేయస్కర కార్యములకు విఘ్నములు మెండు. సంసారమును దరింప నాత్మావలోకనపరుఁడై యోగ మభ్యసించువానిఁ జూచి నిద్రాహారములు మాని వాఁడు చేయు కృషి చూచి యిట్లయిన వీఁడు చెడునేమో యని భయపడి ప్రేమ చేతనే వానికి నిషిద్ధ వస్తువులు తినఁబెట్టి భోగములు మఱపి తమవలె నుండఁ జేయ నేవేవియో కుచేష్టలు వాని యాప్తబంధువులే తొలుతఁ జేయుదురు. కారణము ప్రేమమైనను విఘ్నము విఘ్నమే. కావున వీనిని లక్ష్యము చేయరాదు. మంచిమాటల

తోనే వారిని సమాధాన పఱిచి చెదరించి తాను దిరిగి చూడక వెనుకంజ పెట్టక కృషిచేయవలెను. భాగవతుల నిష్ఠ యిట్టిదై యుండవలెను. అది విఘ్నకారుల విష యమున దయాదాక్షిణ్య మెఱుఁగదు.

—• హనుమంతునకు సురస యడ్డపడుట •—

చ. సురఋషిసిద్ధు లెల్లఁ గపి•శూరు బలంబు నెఱుంగఁ గోరి భా
స్కరనిభ నాగమాత సుర•సం గని యల్లది కంటె వాయుజుం
డురుతరవేగయుక్తిని మ•హోదధి దాఁటెడి, దైత్యరూపవై
సరగున నేగి యడ్డపడి • జాగొనరింపు ముహూర్తమాత్రమున్. ౯౪

అర్థములు. భాస్కరనిభ=సూర్యునితో సమానమైనది, నాగమాత=నాగులకుఁ దల్లియైనది. ఉరుతరవేగ యుక్తిని=మిగుల గొప్పదగు వేగముతో, విఘ్నముచేఁ గాల హరణమైన కారణముచే హనుమంతుఁడు మునుపటికంటె వేగముగఁ బోవఁబూనెనని భావము.

తా త్ప ర్య ము.

దేవతలు, ఋషులు, సిద్ధులు, మొదలగు వారీయన యెట్లొంటరిగాసాహసించి పోవుచున్నాఁడే రావణుని గెలిచి రాఁగలఁడా? సముద్రమైన నంతయు దాటఁగలఁడా? యీయన బల మే మాత్రమో తెలిసికొందమని యాలోచించి సూర్యకాంతిగల నాగమాతను సురసను జూచి యదిగోఁ జూచితివా? హనుమంతుఁడు మిగుల వేగ ముతో సముద్రము దాటుచున్నాఁడు. నీవు దైత్య స్త్రీవై పోయి యతని కడ్డపడి ముహూర్త మాత్ర మాలస్య మగునట్లు చేయుము.

క. కోఱలు, నాకాశంబును మాటెడువక్త్రింబు, కావి • నుఱు మిడిగ్రుడ్లై,
మాఱొడ్డి నిలుము యుక్తిని, మీటెడినో కాక చిక్కి • మిడుకాడెడినో. ౯౫

అర్థములు. మాటెడు=రాచుకొను, స్పృశించు, వక్త్రింబు=నోరు, కావి=ఎఱ్ఱని నుఱు=నాశముచేయు, మాఱు+ఒడ్డి=ఎదిరించి.

తా త్ప ర్య ము.

కోఱలు, నాకాశము నంటు నోరు ఎఱ్ఱనివై చూపులచేతనే యెదుటివారిని జంపు మిడిగ్రుడ్లు కలదానవై త్రోవ కడ్డముగ నెదిరించి నిలువుము. యుక్తిచే నిన్ను దాటిపోవునో, లేక నీచే జిక్కి పోలేక మిణుకరించునో.

ఉ. చూతము గాక యన్న సుర•సుందరి వల్లె యటంచుఁ గంధిపై
భూతభయావహం బగు న•పూర్వవికారవిరూప మైన రూ
పాతతరీతి రక్కసియ•యట్లు ధరించి చరించుచున్ జవో
పేతముగాఁగ వాయుసుతుఁ • డేగెడి మార్గము నడ్డకట్టుచున్. ౯౬

అర్థములు. వల్లె=అట్లె కానిండు, ఇది యంగీకారము సూచించును.కంధిపై= సముద్రముమీఁద, భూత భయావహంబు = ప్రాణులకు భయము కలిగించునది.

అపూర్వ=మును పెన్నఁడు విన్నది కన్నది కానిది. వికారము=చూడ భయంకరమైనది విరూప=వంకరటింకరమైనది, రక్కసియు యట్లు = రాక్షసివలెనే, జవోపేతముగాఁగ వేగముతోఁగూడినట్లుగ.

తా త్ప ర్య ము.

చూత మని చెప్పఁగా నా దేవతా స్త్రీ సరియని యంగీకరించి ప్రాణికోటికి భయంకరమై మును పెవ్వరు నెన్నఁడు వినని కనని వికారము విరూపము నగు పెద్ద రూపము ధరించి యాకాశమందుఁ దిరుగుచు వేగముగఁ బోయి యాంజనేయుఁడు పోవు మార్గమున కడ్డముగ నిలిచి,

ఉ. ఇట్లను వానరేంద్ర! యెట • కేగెదు నిల్వుము, నాకు నిన్ను నీ
పట్ల విధించినారలు సు•పర్వులు భోజ్యము గాఁగ, నన్ను నీ
వెట్లును మీఱ లేవు, నొరసు•మీ వదనంబును, మ్రింగి వైతు, ము
చ్చట్లిఁక సాగ వన్న సుర•సం గని పావని మోమ్మఁ గేలునన్. ౯౭

తా త్ప ర్య ము.

ఇట్లు చెప్పెను. వానర శ్రేష్ఠా! యెందుఁబోవుచున్నావు. నిలువుము. ఏలం దువా ! దేవతలు నిన్ను నా కాహారముగాఁ గల్పించినారు. కావున నన్ను మీఱి నీవు పోలేవు. నా నోరఁ జొరఁబడుము. మ్రింగెదను. ఇఁక ముచ్చటలతోఁ బనిలేదు. అని సురస చెప్పఁగా నామె వేషము చూచి యిది సహజ రాక్షసి గాదు. కృత్రిమ రాక్షసి. ఎవతయో నన్నుఁ బరీక్షింప వచ్చినది. నిజముగా నిది నన్నుఁ దినుటకై వచ్చి యుండినఁ దానే నన్నెత్తి నోట వేసికొని యుండును గాని నన్ను నోటిలోఁ జొరఁబడు మని కోరునా ? ఈమెతో మనము విరోధింపరాదని తలఁచి యాంజ నేయుఁడు రెండు చేతులు జోడించి నమస్కరించి.

శా. దేవీ! శ్రీరఘురామచంద్రుఁ డటవీ•దేశంబునన్ భార్య సీ
తావామాక్షియుఁ దోడు లక్ష్మణుఁడు రాఁ • దానుండఁ గ్రవ్యాదవై
రావిష్టుండును నన్యకార్యరతుఁ డౌ•నా రాము నిల్లాలి ర
త్నో వర్యుండు హరించె రావణుఁడు; నేఁ • జూడంగ సాధ్వీమణిన్. ౯౮

అర్థములు. క్రవ్యాద వైరావిష్టుండును = మాంసభక్షకులగు రాక్షసులందు విరోధభావము గలవాఁడు. (దీనిచే ఖరసంహారాది సూచితము) అన్యకార్యరతుఁడు= మఱియొక పనియందు మనస్సుంచినవాఁడు (ఇది మారీచవధ సూచించును.)

తా త్ప ర్య ము.

దేవీ ! శ్రీరామచంద్రమూర్తి సీతాలక్ష్మణులతో నరణ్యమందు సంచరించు చుండఁగా రాక్షసులందు ద్వేషబుద్ధిగల రామచంద్రమూర్తి కార్యాంతరాసక్తుఁడై యున్న సమయంబున నాయనభార్యను సీతను రావణాసురుఁడు హరించెను. ఆ పతి వ్రతను నేను జూడఁ బోయెదను.

ఉ. రామునియాజ్ఞఁ బోయెదను • రామునిరాజ్యమునందు నుండుటన్
రామరో! నీకును దగవు • రామునికార్యముఁ దీర్పఁ గావునన్
సేమముగాఁగ నేఁ జనఁగఁ • జేయుము, కా దని తేని జానకీ
క్షేమముఁ దెల్పి రామునకుఁ • జెచ్చెర నీ వదనంబుఁ జొచ్చెదన్. ౯౯

తాత్పర్యము.

శ్రీరామచంద్రమూర్తి యాజ్ఞ నొప్పున నేను బోవుచున్నాను. నీవును ఆయన దేశమం దున్నదానవు కావున నీవు నాయన కార్యముఁ జక్కఁజేయఁదగును. ఏమి చేయు మందువా నన్ను క్షేమముగాఁ బోనిమ్ము. ఆ సాహాయ్యము చాలును. అట్లు కాదందువా జానకీదేవిని జూచి యామె కుశలవార్త రామునకుఁ దెలిపి వచ్చి నీ నోరఁ బ్రవేశించెదను.

క. నిక్కము నమ్ము మ టంచన, నెక్కఁడిమాటలు కపీంద్ర • యిప్పుడు నాచేఁ
జిక్కియుఁ బోవం గలవే, గ్రక్కున జీవంబుతో వ•రం బిది నాకున్. ౧౦౦

అర్థములు. నిక్కము=నిజము.

తాత్పర్యము.

నిజము నమ్మమని చెప్పఁగా నావె యివేటి మాటలు. ఇప్పుడు నాచేఁ జిక్కియు నీవు తప్పించుకొని ప్రాణముతోఁ బోఁగలవా? ఇది నాకు వరము.

ఇది మొదలు ౧౦౭ వఱకుఁ బ్రక్షిప్తము. ఏలన నింకు సురసయు, ఆంజనేయుఁ డిరువురు నూఱామడ వెడలుపున నోరు దేహము పెంచినట్లు చెప్పఁబడెను. సముద్రము వెడలుపు నూఱామడ. వీరి నోరు దేహము నూఱామడదైన వీరిదేహము లెంతదై యుండవలెను. ఇప్పుడు వీరు సముద్రమధ్యమున నున్నవారు. వీరు నూఱామడ పెరిగియుండిన నాప్రక్క రాక్షసులకు నీప్రక్క వానరులకుఁ గూడఁ గనఁబడి యుండవలెను. అట్లయిన ననర్థకము తప్పదు. కావున నిది యెవరో తెలివి మాలిన వాఁడు వ్రాసినదిగా గ్రహింపవలెను.

ఈ ప్రక్షిప్తములకుఁ గారణ మేమని యాలోచింపఁ గొందఱ యభిప్రాయ మేమన:—

ప్రక్షిప్తములకుఁ గారణములు రెండు. స్వమతాభినివేశము, పౌరాణిక వినోద క్రీడ. భారతము "నారాయణకథా మిమా"మ్మని వ్యాసులు చెప్పినను దమతమ మత ప్రశస్తికై యితర మతముల వారు తమ తమ యిష్ట దేవతలకుఁ బరత్వము చెప్పుచుఁ గొన్ని యధ్యాయము లందందు నిఱికించిరి. భారత మందలి ప్రక్షిప్తముల కిది ముఖ్యకారణము. రామాయణ విషయమున నట్లు చేయ సాధ్య పడక యా యా మతములవారు వారి వారి మతానుసారముగ వాల్మీకి పేరు పెట్టి యితర ఋషుల పేరు పెట్టి వేలు వేలు రామాయణముల వ్రాసికొనిరి, కావున నట్టివి రామాయణమందు లేవు. రామాయణమును వాల్మీకి

రచించిన పిమ్మటఁ జాలకాలము వేదమువలెనే దానియందు శ్రద్ధగలవారు ముఖస్థము చేసి యుండిరి గాని లిఖిత రూపమున లేదు. ఒకవేళ యుండినను ఎందో యపురూప ముగ నుండెడిది. రామాయణము సర్వజనీనగ్రంథ మగుటచేఁ బౌరాణికులు లోకు లకు దానిఁ జెప్పసాగిరి. ఇట్లు చెప్పుటయందు వినెడి వారి కింపుగ నుండి వారి మనస్సు నాకర్షించుట రావణ సీతారామ హనుమదాదుల మహిమ విశేషముగ లేనివి పోనివి యా యా పౌరాణికుల బుద్ధి చమత్కారము కొలఁదియో, బుద్ధిహీనత కొలఁదియో, క్రొత్తవి కల్పించి చెప్పుచుండిరి. అవల నెవరో మహానుభావులు రామా యణమును లిఖితరూపముగ లోకమున వెలయింప నందందుఁ గలవి చేర్చి యన్నిఁటి యందు సమానముగా నున్న భాగములను మూలముగాఁ జేసి కొన్ని కొన్ని ప్రతు లందున్న వానిని ప్రక్షిప్తము లని చెప్పిరి. ఈ సురసవిషయము, కాలనేమివిషయము పౌరాణికులు వర్ణించి చెప్పునపుడు పామర జనము లెంతయానందింతురో చెప్పవలసిన పని లేదు. ఈ ప్రక్షిప్త శ్లోక కారులు తెలివితక్కువ వారగుటచే వారి దొంగతనము కనిపెట్ట సాధ్యమగుచున్నది. ఈ ప్రక్షిప్తములు అధిక పాఠము లుత్తర కాండమున దండిగఁ గలవు. పూర్వ వ్యాఖ్యాతలు ప్రక్షిప్తముల నెల్ల వేఱు పఱిచిరి.

చ. [అని యిటు కామరూపిణి సు•రాంగన పల్కి తనంత నిచ్చమైఁ
జనియెడి యాంజనేయుఁ గని • సత్వ మెఱుంగఁగఁ గోరి యోరి వే
చనియెద వెందు? నా వదన•పద్మమునం జొరఁబోలు, మిట్లుగా
వనజభవుం డొసంగె మును • వానరనాథ! వరంబుఁ బ్రీతితోన్. ౧౦౧

క. అని బిఱబిఱ జని వదనం,బును దెఱచి మహత్తనూజ•ముంగల నిలువం
గని కోపంబున నేనీ, వను గ్రుంగెడినోరు మూపు • నారీ! యనుచున్. ౧౦౨

చ. ఒక్క పదియామడల్ నిడివి • యొప్పఁగ దేహముఁ బెంచి నిల్చినన్
వికటకరాళవక్త్రమును • నెల్కొ యిర్వదియామ డొప్పఁగా
నకటిలరీతిఁ జేయ నమ•రాంగనయుం, గని వాయుసూనుఁడున్
దిశమిక్ లేక పెంచెఁ దన•దేహము ముప్పదియోజనంబులన్. ౧౦౩

క. నలువదియామడ వేల్పుం, జెలువయు వా దెఱవఁ గీశ•సింహుఁడు పెంచెన్
వలనుగ నేఁబదియామడ, వల సతి నోర్విచ్చె నఱువ•దామడ గాఁగన్. ౧౦౪

క. డెబ్బదియామడ క్రోఁతుల, గబ్బియు మెయి పెంచె నమర•కాంతయు విచ్చెన్
గొబ్బున నెనుబదియామడ, నబ్బలియుఁడు తొంబదామ • డాయత మగుచున్.

క. ఒప్పఁగ మెయిఁ బెంచిన సతి, యప్పుడ నూఱామడగను • నాస్యకుహరమున్
విప్పుగ విచ్చెను నన్నుం, దప్పించుకొనంగ నీకుఁ • దరమా క్రోఁతీ.] ౧౦౬

౧౦౧ మొదలు ౧౦౬ వఱకుఁ దాత్పర్యము. ఈ ప్రకారము కామరూపిణి యగు దేవతా స్త్రీ చెప్పి తన త్రోవన తాను నిలువక పోవుచున్న హనుమంతుని బల మెఱుఁగఁ గోరి 'యోరీ! నీ వెందురా పోయెదవు : నా నోర నీవు చొచ్చవలసి

నట్లు బ్రహ్మ నాకు వరమిచ్చెను' అని శీఘ్రమున వచ్చుచుపోయి నోరు తెఱచికొని యాంజనేయుని ముందు నిలువఁగా హనుమంతుఁడు కోపించి నన్ను మ్రింగఁగల నీ నోరేదో చూపుమని యొక పది యామడ నిడివిగాఁ దన దేహము పెంపఁగా నది తన నోరిర్వది యామడ వెడలుపుగాఁ జేసెను. హనుమంతుఁడు తన దేహమును ముప్పది యామడ నిడివి గలదిగాఁ జేసెను. అది దాని నోరు నలువదామడ వెడలుపు చేసెను. ఆయన యేఁబదామడ పొడవయ్యెను. దాని నోరు అఱువది యామడ వెడలుపయ్యెను. ఆయన దేహము డెబ్బది యామడ దీర్ఘమయ్యెను. దాని నోరు ఎనుబది యామడ వెడలుపయ్యెను. ఆయన తొంబది యామడ దీర్ఘముఁగ దేహము పెంచెను. అది నూఱామడగాఁ దన నోరు విచ్చి నన్నుఁ దప్పించుకొని నీ వెందుఁ బోనెదవురా క్రోఁతీ యనెను.

తే. అనుచు విచ్చిన వదనంబు • ననిలసుతుఁడు, బుద్ధిమద్వర్యుఁడు [సమస్త • భూతనిచయ
భయదనరకాభదీర్ఘ జి • హ్వాయుత]గాంచి, తత్క్షణము కొంచెపఱుచుదుఁ • దనదు మేను.

తా త్ప ర్య ము.

అని సురస నోరు తెఱవఁగా బుద్ధిమంతుఁడైన యాంజనేయుఁడు చూచి తత్క్షణమే తన దేహము కొంచెముగాఁ జేసెను. దీనివలన హనుమంతునందు నణిమాది సిద్ధులు గలవని యేర్పడు చున్నది.

—• హనుమంతుఁడు సురసనోటఁ జొచ్చి వెడలుట •—

క. అంగుటమునంత యయి కపి,పుంగవుఁడు తటాలఁజొచ్చి • హాలఁతుక నోరన్
జంగున వెలి వచ్చెను రయ,చంగుం డభ్రమున నిలిచి • సతి కిట్లనియెన్. ౧౦౩

అర్థములు. అంగుటము నంత=బొటనవ్రేలియంత, అంగుష్ఠ శబ్దభవము అంగుటము, రయ చంగుఁడు=వేగమున సమర్థుఁడు.

తా త్ప ర్య ము.

వానర శ్రేష్ఠుఁడగు హనుమంతుఁడు బొటన వ్రేలంత రూపము ధరించిన వాఁడై వేగమున సమర్థుఁడగుటచేఁ దటాలున నామె నోటఁజొచ్చి యామె నోరు మూసికొను లోపలఁ జంగున బయటికి దూఁకి యాకాశమున నిలిచి యిట్లనెను.

శా. తల్లీ ! నీవదనంబుఁ జొచ్చితిని, స • త్యం బయ్యె నీ కోర్కి, చం
చల్లీలం గరుణించి నాదగు నమ • స్కారంబుఁ గైకొమ్ము, నే
నుల్లాసంబుగ జానకి న్వెదకు న • ద్యోగంబునం బోదు, నీ
యుల్లంబందు శుభంబు సంఘటనగా • నూహింపు దాక్షాయణీ. ౧౦౪

అర్థములు. వదనంబు=నోరు, దాక్షాయణీ=దక్షుని కూఁతురా! హనుమంతుఁడిట్లు సంబోధించుటచే నామె తాను దక్షుని కూఁతు రని చెప్పియుండవలెను. ఈ యొక్క మాట చేతనే హనుమంతుఁడు నీ వెవ్వతె వని యడుగుట లోనగు ప్రశ్నలు

నేను దక్షుని కూఁతురని యామె చెప్పుటలోనగు సంభాషణ మూహ్యము, గావున ముందు చెప్పలేదు. ఈ కారణము చేతనే హనుమంతుఁ డామెను రాక్షసి యని భావింపక సగౌరవముగ నమస్కరించి సంభాషించెను. ఇది వాల్మీకి శైలిభక్కి.

తా త్ప ర్య ము.

తల్లీ! దాక్షాయణీ! నీవు కోరిన ప్రకారము నీ నోరఁ బ్రవేశించితిని. నీకు బ్రహ్మయిచ్చిన వరము సత్యమయ్యెను. నా యందు దయయుంచి నా నమస్కార మంగీకరింపుము. నేను సంతోషముతో సీతను వెదకు పని మీఁదఁ బోయెదను. నీ మనస్సునందు నేను బోవు కార్యమున మేలు కలుగునట్లు సంకల్పింపుము.

క. పలుక నిటు రాహువదనము, వెలువడు శశి యట్లు నోరు • వెడలుచు వేల్పుం
జెలువ హనుమంతుఁ గనుఁగొని, యలరుచు నిట్లనియె నైజ•మగు నాకృతితోన్.

తా త్ప ర్య ము.

ఈ విధముగ హనుమంతుఁడు చెప్పగా రాహువు నోరఁబడి వెడలిన చంద్రుని వలెఁ దన నోటఁబడి వెలుపలరాఁగా నా దేవతాస్త్రీ మిగుల సంతోషించి తన సహజ స్వరూపమును ధరించినదై.

క. సౌమ్యా హనుమ! యథాసౌఖ్యమ్ముగ నీ కెల్లపనులుఁ • గడుసుకరము లౌ
నిమ్ముగ రాముని ముద్దుం, గుమ్మను బతితోడ వేగ • కూర్పుము వత్సా! ౧౧౧

తా త్ప ర్య ము.

నాయనా! హనుమంతా! సౌఖ్యముగఁ బోయిరమ్ము. నీ కన్ని కార్యములు మిగుల శ్రమము లేకయే ఫలించును. రామచంద్రమూర్తి భార్యను భర్తతోడ వేగకూర్పుము.

తే. అనుచు వచియించి చనియె న•య్యమరవనిత, దేవతాదులు చూచి తృ•తీయమైన
యాంజనేయుని దుస్సాధ • మైన పనిని, మేలు మే లని మిక్కిలి • మెచ్చి రపుడు.

అర్థములు. దుస్సాధము = సాధింపఁ గష్టమైనది.

తా త్ప ర్య ము.

అని చెప్పి యా దేవతా స్త్రీ పోయెను. దేవతలు మొదలగువా రాంజనేయుని దుష్కరమైన యా మూఁడవ పనిని జూచి మేలు మేలని మిక్కిలి మెచ్చిరి.

ముముక్షువగు యోగిని భాగవతుని దేవతలు పరీక్షించుటకై విఘ్నములు కల్పింతురు. వీనిని భక్తిచేతనే తప్పించుకొనవలెను.

క. అవల నదృశ్య మగు పా, రావారము వదలి విహ•గాధిపజవుఁడై
ద్యోవీథికి లంఘించి భ, యావహ మగురీతిఁ జనియె • నంజనసుతుఁడున్. ౧౧౩

అర్థములు. అవల=సురస వెడలిపోయిన తరువాత, అదృశ్యము=అలక్ష్యపెట్ట రానిది, పారావారము=సముద్రము, విహగాధిపజవుఁడై = పక్షిరాజగు గరుత్మంతుని వేగమువంటి వేగము గలవాఁడై, ద్యోవీథికిన్=ఆకాశమార్గమునకు, భయావహము= చూచువారికి భయము కలిగించునది.

తాత్పర్యము.

సురస పోయిన తరువాత నలక్ష్యము చేయరాని సముద్రమును వదలి గరుడ వేగుఁడై యాకాశమునకు లంఘించి భయంకర విధముగా నాంజనేయుఁడు చనినెను. సముద్రము వదలి యాకాశమునకు లంఘించి యనుటచే సురసతోడి వ్యవహారము నీటి మట్టమునకుఁ బైగా జరిగెను గాని మేఘమండలమునఁ గాదని యేర్పడు చున్నది.

సీ. దొంతరగా నున్న • తోరంపుమబ్బులు, పరువులు వాఱెడి • పక్షికులము
సంగీతసుకళావి • శారదాచార్యులు, రాణ నొప్పారు నై • రావతంబు
బెబ్బులి యేనుంగు • బొబ్బ మెకంబులు, నెక్కిరింతలు గాఁగ • నెసఁగువారు
మహనీయ మైన వి • మానంబు లశనివ, జ్రోద్భవశిఖశిఖా • ప్రోచ్చయములు
తే. నాక మరిగెడి కృతపుణ్యు • లౌ మహాను
భావజనములు సందడి • బాటగములు
హవ్యమును మోసికొని చను • హవ్యవహుఁడు
చంద్రసూర్యగ్రహోడున • క్షత్రములును. ౧౧౪

అర్థములు. దొంతరగాన్ = దొంతులు దొంతులుగా నొక దానిపై నొకటి, తోరంపు = గొప్పవగు, సంగీత సుకళా విశారదాచార్యులు = సంగీత విద్యయందు నేర్పుగల తుంబురుఁడు మొదలుగాఁ గల యాచార్యులు, ఐరావతంబు = ఇంద్ర ధనుస్సు. "ఇంద్రాయుధం శక్రధనుస్తదేవ ఋజు రోహితం ఐరావతం చ విద్యుత్తు చంచలాచపలాపిచ" అని వైజయంతి. ఋజువు, దీర్ఘమైన యింద్రధనుస్సు ఐరావత మనఁబడును. బొబ్బ మెకంబులు=సింహములు, ఎక్కిరింతలు = వాహనములు, అశని వజ్రోద్భవ శిఖశిఖా ప్రోచ్చయములు=పిడుగు వజ్రాయుధము కలియుటచేఁ బుట్టిన నిప్పుమంటల సమూహములు, కృతపుణ్యులు = పుణ్యము చేసినవారు, మహానుభావ = గొప్ప మహిమగల, సందడి = క్రిక్కిరిసిన జనుల గుంపుగల, హవ్యవహుఁడు = అగ్నిహోత్రుఁడు, చంద్రసూర్యాదులు గ్రహములు, ఉడు = తక్కిన సామాన్య నక్షత్రములు, అశ్విన్యాదులు నక్షత్రములు.

తాత్పర్యము.

దొంతులు దొంతులుగా నొకదానిపై నొకటియున్న గొప్ప మబ్బులు, పరువెత్తుచున్న పక్షులు, సంగీత విద్యానిపుణులైన తుంబురుఁడు లోనగువారు, కాంతిచే వెలుఁగు నింద్ర ధనుస్సు, పెద్దపులి యేనుఁగు సింహము వీనిని వాహనములుగాఁ గలవారు, గొప్ప విమానములు, వజ్రము పిడుగులు వీని రాపిడిచేఁబుట్టిన మంటలు, స్వర్గమునకుఁబోవు పుణ్యాత్ములు, వీరిచే నడుము లేకుండు బాటలు, దేవతలకు హవ్యమును మోచికొనిపోవు నగ్నిహోత్రుఁడు, చంద్ర సూర్యాది గ్రహములు, సామాన్యములైన చుక్కలు, అశ్విన్యాది నక్షత్రములు, ఇదియును రాఁబోవు రెండుపద్యంబులు ఆకాశవర్ణనము.

ఉ. దేవమునిప్రకాండములు • దివ్యనభశ్చరనాగయక్షవి
శ్వావసు కిన్నరాదులు ది•శాగజముల్ రవిచంద్రు లేగు మేల్
త్రోవలు మీఱఁగా నఖిల•లోకవితానవితాన మై శివం
బై వనజాసనాకలిత • మై రహి మించు నభఃపథంబునన్. ౧౧౫

అర్థములు. దేవముని ప్రకాండములు=దేవర్షి శ్రేష్ఠులు. నభశ్చర=ఆకాశమందు సంచరించువారు, విశ్వావసువు = గంధర్వరాజు, దిశాగజముల్ = దిక్కులయందుండు నైరావతాదు లేనుఁగులు, అఖిలలోకవితాన వితానమై=సమస్తలోకములకు మేల్కట్టు (చాందినీ) వంటిదై, శివంబై=శుభకరమై, వనజాసన+ఆకలితము=బ్రహ్మచే సృజింపఁబడినది, నభఃపథంబునన్=ఆకాశమార్గమున.

తా త్ప ర్య ము.

దేవర్షిశ్రేష్ఠులు, దేవతలు, ఆకాశసంచారులు, నాగులు, యక్షులు, విశ్వావసువు లోనగు దేవగంధర్వులు, కిన్నరులు లోనగువారు దిగ్గజములు, సూర్యచంద్రాదులు పోవుమార్గములు అతిశయింపఁగా నన్నిలోకములకు మేల్కట్టువంటిదై బ్రహ్మ నిర్మితమై ప్రకాశించు నాకాశమార్గమున.

క. గరుటామంతునిపోలిక, పరగున ఱెక్కలు గలట్టి•శైలం బనఁగా
నరిగె నిరాలంబనగతి, మరుదాత్మజుఁ డుఱక దివిజ•మార్గము వెలుఁగన్. ౧౧౬

అర్థములు. ఉఱక=లక్ష్యములేక, దివిజమార్గము=ఆకాశము.

తా త్ప ర్య ము.

గరుత్మంతునివలె ఱెక్కలు గల కొండవలె నిరాధారముగ లక్ష్యము లేక యాకాశమును బ్రకాశింపఁజేయుచు హనుమంతుఁడు పోయెను.

—• ఆంజనేయుఁడు సింహికను వధించుట. •—

క. రంహోజ్జృంభితవానర,సింహుం డరుగంగఁ జూచి • చింతించె మదిన్
సింహిక యను పెనురక్కసి, యంహోభావమున నెంత•యనఘాత్మికనో. ౧౧౭

అర్థములు. రంహోజ్జృంభిత=రంహస్=వేగముచే, జృంభిత = అతిశయించిన, అంహోభావమునన్=పాపిష్ఠ మగు మనస్సుచేత, మధ్యమపదలోపి కర్మధారయము.

తా త్ప ర్య ము.

వేగాతిశయము గల వానరశ్రేష్ఠుఁడు పోవుచుండుట చూచి సింహిక యను రాక్షసి పాపబుద్ధిచే నిట్టు లాలోచించెను. ఆహా! నేనెంత పుణ్యాత్మురాలనో.

ఉ. ఎన్నిదినంబులో కడచె • నింతయుఁ గూడు లభింప కయ్యె నా
కిన్నిదినాల కేన్ దొరకె • నిట్టిమహాద్భుత సత్త్వ మంచు నాఁ
కొన్నతనంబునం జెఱఁగి • క్రూరపురక్కస యాంజనేయుఛా
య న్నెఱి నిగ్రహింపఁ బడ•నాత్మజుఁ డాత్మ విషాద మూరఁగన్. ౧౧౮

అర్థములు. సత్త్వము=జంతువు, ఆఁకొన్నతనంబునన్=ఆఁకలిచే, 'పిల్లాఁకొన్న తనాన నే నోఁకడనే భిక్షాననున్ వత్తునో', భీమేశ్వర.

తా త్ప ర్య ము.

కొంచెమైన నాహారము దొరకక యెన్నిదినములో యాఁగెను. ఇన్నాళ్ళకైనను నిట్టి యత్యాశ్చర్య కరమైన జంతువు లభించెను, అని యాఁకలిచేఁ బెరిఁగి క్రూర రాక్షసి తన నీడను బట్టుకొనఁగా హనుమంతుఁడు మనస్సులో దుఃఖ మతిశయింపఁగా.

తే. ఓరుగాలికి నెదురేగు•నోడ నైతి
గుంటు పడియెను వేగంబు • కూలె బల మి
దేమి యొకొ యంచు నటు నిటు • చెల్లఁ జూచి
కనియెఁ బెనుభూత మొక్కండు • కడలి లేవ. ౧౧౯

తా త్ప ర్య ము.

ఓరుగాలికి నెదురుగాఁ బోవు నోడవలె నైతిని. నా వేగము తగ్గెను. బలము చెడెను. దీనికేమి కారణ మని నాలుగు ప్రక్కలఁ జూచి యొక పెద్ద భూతము సముద్రములో నుండి లేచు చుండఁగా జూచెను.

క. సుగ్రీవుఁడు చెప్పిన ఛా,యాగ్రాహియ దీవ సంది•యం బేమి య టం
చుగ్రుం డై మెయి పెంచె మ,హాగ్రావము నట్లు ప్రావృ•డంబుద మనఁగన్. ౧౨౦

అర్థములు. ఛాయాగ్రాహి=నీడను బట్టునది, గ్రావము=పర్వతము, ప్రావృట్+అంబుదము=వానకాలమందలి మేఘము.

తా త్ప ర్య ము.

ఈ సముద్రమున నీచోట నీడను బట్టు నంగారక యను గ్రహ మున్నదని సుగ్రీవుఁడు చెప్పెను గదా. అదియే యిది సందేహము లేదు, అని కోపించి భయంకరుఁడై పెద్దకొండవలె, వానకాలపు మబ్బువలె దేహము నెత్తుగా వెడలుపుగాఁ బెంచెను.

ఉ. ప్రేలక మేను పెంచు కపి•వీరవరుం గని దైత్యకాంత పా
తాళగుహాంతరాభ మగు • దారుణవక్త్రము విచ్చి కార్మొయిల్
లీలను గర్జ సేసి యవ•లీలగఁ ద గ్రసియింప రాఁగ న
య్యాలరిభూతమున్ భయద•మా మెయియున్ వివృతాస్యమర్మముల్. ౧౨౧

అర్థములు. ప్రేలక = వెనుదీయక, పాతాళగుహాంతరాభము=పాతాళ గుహలోపలి భాగముతో సమానమైనది, వక్త్రము=నోరు, కార్మొయిల్ లీల=వానమబ్బువలె, గ్రసియింపన్=భక్షించుటకు, అలరి=చెడ్డ, మెయి=దేహము, వివృత=తెఱవఁబడిన, అస్య=నోరు, మర్మముల్=ప్రాణస్థానములు.

తాత్పర్యము.

దేహమంత కంతకు వదలక పెంచు చున్న హనుమంతుని జూచి రాక్షసి పాతాళ గుహవంటి భయంకరమైన నోరు తెఱచి వానమబ్బువలె గర్జించి సునాయాసముగఁ దన్నుఁ దినుటకు రాఁగా నా చెష్ట భూతమును భయంకర దేహమును విచ్చిన నోరును మర్మస్థానములు.

దేహము నోరు ప్రాణస్థానములఁ బరిశీలించుట శీఘ్రవధోపాయమున నెచ్చట నేమిచేసిన నది వెంటనే చచ్చు నని చూచుటకే.

క. కని వజ్రకాయుఁ డల్పపుఁదనువునఁ దద్వివృతవక్త్రదరిఁ బడఁ; దివిజుల్
ఘనుఁ డితఁడు పర్వమున రాహువిధాతను బడెడి చంద్రునొప్పున నకటా. ౧౨౨

అర్థములు. వజ్రకాయుఁడు=వజ్రమువలెఁ గఠినమైన దేహముకలవాఁడు. అది మింగినను దానికిఁ బ్రాణాపాయమే కాని జీర్ణము నగు రానివాఁడు. వజ్రము తాఁకునఁ గొండలైన నెట్లు పిండియగునో యట్టి తాఁకు గలవాఁడు, అల్పపుఁదనువున్ = చిన్న దేహమున, తత్=అరాక్షసియొక్క, వివృత=తెఱవఁబడిన, వక్త్ర=నోరనెడి, దరిన్= గుహయందు, పర్వమునన్=పున్నమనాఁడు.

తాత్పర్యము.

ఇట్లు చూచి వజ్రమువంటి దేహముగల యాంజనేయుఁడు చిన్నశరీరము గలవాఁడై దాని తెఱచిన నోరను గుహయందుఁ దటాలునఁ బడెను. దేవత లదిచూచి పున్నమనాఁటి చంద్రుఁడు రాహువు నోటఁబడినట్టు లయ్యో యింతటి గొప్పవాఁడు.

క. రక్కసివాతం బడియెనె, యుక్కతి యని వగవఁ బ్రేవు లుగ్రనఖాళిన్
గ్రక్కున మనోజవంబున, వెక్కసముగఁ జెఱికి కపియు వెలికిన్ దూఁకెన్. ౧౨౩

అర్థములు. ఉక్కతి=ఉక్కు+అతి=పరాక్రమము చెడి. మనోజవంబునన్ = మనస్సు వేగమువంటి వేగముతో, వెక్కసముగన్=సహింపరానట్లుగ.

తాత్పర్యము.

రాక్షసి నోటఁబడినాఁగదా యని వ్యసనపడుచుండఁగా దాని ప్రేవులను వాఁడియైన గోళ్ళచే మనోవేగమున నతిశీఘ్రముగ దానికి సహింపరాని విధముగఁ జెఱికి యది నోరు మూయులోపల హనుమ బయట దూఁకెను.

ఉ. ధీరత నేర్పుచూపులను దిగ్గన దానిమదం బడంచి, యా
కారము తొల్లి యట్ల కొని క్రమ్మఱఁ బోవుచు నుండె, మర్మసం
వారము ద్రెవ్వ రక్కసియు వారినిధిం బడి బిద్దినన్ నభ
శ్చారులు వాయుసూనుఁ గని చాఁగు బళీ వినుతెప్పచేసి రా. ౧౨౪

అర్థములు. ధీరతన్ = ధైర్యముచేత, నేర్పు = బుద్ధి చమత్కారము చేత, చూపులన్=దూరమునుండియే యెదుటివారి మర్మము నొక్కసారి చూచుటచేతనే తెలిసికొనఁగల చూపుచేత, దిగ్గన=తటాలున, తొల్లియట్ల = పూర్వమున్న విధముగ,

పెద్దదేహమును, మర్మసంహారము=ప్రాణస్థానముల సమూహము, త్రెవ్వన్ = తెగి పోఁగా, బిద్దినన్ = చావఁగా, నభశ్చరులు=ఆకాశమున సంచరించువారు, చాఁగు బళీ=ఇది ప్రశంసార్థకము.

తాత్పర్యము.

ఎదుటివారు దిగ్భ్రమ గొనునట్లు చేయు ధైర్యము బుద్ధి చమత్కారము దృష్టి బలము వీనిచే నా రాక్షసి గర్వమణఁచి పూర్వమున్న యాకారము మరల గ్రహించి మునుపటివలెఁ బోవుచుండెను. మర్మస్థానములు తెగిపోవుటచే రాక్షసి సముద్రములోఁ బడి చచ్చెను. అదిచూచి దేవతలు లోనగు నాకాశ సంచారులు హనుమంతుని జూచి బలే బలే చక్కఁగాఁ జేసితివి. సరి సరి.

ఉ. వానరలోకనాయక! భ◆వత్కృత మన్యదురాపదంబు, నీ
యూనిన కార్యముం దలఁప ◆ నొయ్యనఁ బొమ్ము శుభంబు గల్గు, నె
వ్వానికి ధైర్యము న్మతియు ◆ వారక దాక్ష్యము దృష్టి నీవలెన్
జానుగఁ గల్గు వానికి న◆సాధ్యము లే దది యెట్టి కార్యమేన్. ౧౨౫

అర్థములు. భవత్+కృతంబు=నీచేఁ జేయఁబడినది, అన్యదురాపదంబు=ఇతరులకు సాధ్యముకానిది, దాక్ష్యము=సామర్థ్యము, దృష్టి = ఎదుటివారి మర్మము తెలిసికొనఁగల సూక్ష్మదృష్టి.

తాత్పర్యము.

కపీంద్రా! నీవు చేసిన కార్య మితరులకు సాధ్యమగునది కాదు. నీవు పూనిన పని నెఱవేర్ప నిఁక వేగముగఁ బొమ్ము. నీకు మేలుగలుగును. ఎట్లుచేసిన కార్యము సాధ్యమగునా యని యాలోచించు బుద్ధి చమత్కారము, ఆ యాలోచనను గొనసాగించు సామర్థ్యము ఎదుటివారి రహస్యము తెలిసికొనఁగల చూపుగల వానికి నే కార్యమైన నసాధ్యముకాదు. ఈ రాక్షసి (సింహిక=అంగారక)చరిత్రము ముముక్షువునకు దుష్టగ్రహ భూతములచేత దుష్టజనులచేతఁ గలుగు బాధను సూచించుచున్నది. ఇట్టి విరోధ భావము గలవారి యందు దయాగౌరవములు చూపరాదు. వారిని హతము చేయుటే తగిన కార్యము.

—◆ హనుమంతుఁడు లంకాతీరంబును జూచుట. ◆—

చ. అని విని వారిభాషణము ◆ లంజనపుత్త్రుఁడు స్వప్రయోజనం
బును స్మరియించుచుం జనుచుఁ ◆ బుల్గులఱేనివిధాన నంబరం
బున దిగుచుం గనుంగొనియె ◆ భూరితరోరుమనోజ్ఞ భూమిజా
తనివహసుందరంబును ని◆తాంతవిశాలముఁ బ్రాప్తతీరమున్. ౧౨౬

అర్థములు. పుల్గులఱేని విధానన్=గరుత్మంతునివలె, దిగుచున్ = ఆకాశమున నుండినచో రాక్షసులకుఁ గానవత్తునని యాలోచించి నీటిమట్టమునకు సరిగా దూరము

నుండియే దిగ నారంభించెను. భూరితర = గొప్పవై, ఉరుమనోజ్ఞ = మిగులనందమైన, భూమిజాతనివహ = చెట్లసమూహముచే, సుందరమున్ = అందమైనదానిని, నితాంత విశాలము = మిగుల వెడల్పైనది, ప్రాప్తతీరమున్ = సమీపమందుండు గట్టును, స్వప్రయోజనము = ఎక్కడ నెట్లుచేసినఁ దనకార్యము కొనసాగునో యట్లువర్తించుట. కావుననే సురసాసింహికలయందు స్త్రీత్వదోషము సమానమైనను సురసను జయింపవలె నని తలఁచెను. సింహికను జంపఁదలఁచెను.

తాత్పర్యము.

వారిమాటలు విని హనుమంతుఁడు తానువచ్చిన కార్యము నెరవేర్చు నుపాయ మాలోచించుచు గరుత్మంతుఁడు నేలవ్రాలునపుడు దిగునటు లాకాశమునుండి దిగుచు గొప్పచెట్లచే నందమై మిగుల విశాలమై తాను దిగవలసిన తీరమును సమీపమందుఁ జూచెను.

చ. కనుఁగొని తత్ప్రదేశమునఁ • గ్రమతరంబుఁ దదంతరీపమం
దును మలయాద్రిపొంతఁ గల • తోరపుఁదోఁపులు గల్గుసీమలున్
వనచరవీరవల్లభుఁడు • వారిధిఁ దీరముఁ దీరజాగముల్
వనధిసతుల్ పతిం గలయ • వచ్చిన వారిముఖప్రదేశముల్. ౧౨౭

అర్థములు. తదంతరీపము = ద్వీపము, నీటి నడుమనుండు మిట్ట ప్రదేశము, నాలుగు ప్రక్కల నీళ్లుగల భూమి, తీరజాగముల్ = తీరమునందుఁ బుట్టిన చెట్లు, వనధి సతుల్ = సముద్రము భార్యలు, ఏళ్లు, పతిన్ = భర్తయగు సముద్రుని, వారి ముఖ ప్రదేశముల్ = నదీ ముఖద్వారములు, ఏళ్లు సముద్రములోఁ గలియు ప్రదేశములు.

మలయ మను నొక పర్వతము లంక యందును గలదు. నదు లనియో ఏళ్ళనియో యొకచిన్నమాటఁ జెప్పినఁ జాలునే 'వనధి సతుల్ పతింగలయ వచ్చిన వారి ముఖప్రదేశముల్' అని యింత దీర్ఘముగఁ జెప్పనేల? భర్తలను గలియఁగోరి వచ్చిన వారి యనఁగా ముత్తైదువుల ముఖదర్శన మయ్యె ననుట శుభశకునము సూచించుచున్నది. నదులు వచ్చి సముద్రములోఁ గలిసినట్లు సీతాదేవి భర్తతోఁ గలియు నని సూచితము. వచ్చినవారి = వచ్చినట్టి స్త్రీలయొక్క యనియు నర్థము గ్రహింపనగు. అప్పుడు 'వారి' తెనుఁగు పదమగును. వీరు సతులు అనఁగాఁ బతివ్రతలు కావున భర్తనే కలియవచ్చిరని భావము.

తాత్పర్యము.

చూచి యా ప్రదేశమందు మిగుల మనోహరమైన ద్వీపమందుఁ గల మలయ పర్వతము సమీపమునఁ గల గొప్ప తోఁపులు గల ప్రదేశములును సముద్రమును దానియొడ్డును నొడ్డునందుఁగల చెట్లను నదులు సముద్రమును గలయుచోటులు. పై పద్యముతో నన్వయము.

సముద్రమున కావలినొడ్డున నీవలినొడ్డున మలయ పర్వతము లున్నట్లు చెప్పుటచే నొకానొక కాలమున లంకయు దక్షిణ హిందూస్థానము నేకమై నడుమ సముద్రము లేక యుండె నను వారి యభిప్రాయము సాధువని తోఁచఁజేయుచున్నది.

"The islands of Rameswaram and Mannar, and the chain of islets and sand banks between them, called Adam's Bridge, appear to be remnants of the natural land connection between the main land of India and Ceylon, which existed in some recent geological epoch. There is no doubt of the fact that Ceylon once formed a part of the Deccan. The existence in Ceylon of Indian elephants (elephas Indicus) and other animals and vegetables, natural to southern India, proves the former connection of Ceylon to India. If that were not the case, elephants and other land animals, could not have crossed the sea to make the island of Ceylon their habitat. The Eastern Archpelago once formed a part and parcel of the Continent of Asia. But by the gradual subsidence of land, from volcanic action, to the bottom of the sea, portion of the south and south Eastern Asia got detached from the mainland and became islands. The separation of Ceylon, and the islands of the Archipelago took place, I think, at the same geological epoch and by the same cause or causes. It will appear from a study of the map of Asia that the subsidence took place in a latitudinal belt almost Parallel to the Equator, on both sides of it, seperating Ceylon, Sumatra, Java, Borneo, Celibes and a host of smaller islands from the manland of Asia. It will also appear that the Malaya Peninsula very narrowly escaped complete detachment from this volcanic disturbance. It will also appear from a study of geographical distribution of animal and vegetable life in the south and south eastern par's of the Asiatic continent, and the islands, that most of them, got detached from the mainland by subsidence and that some of them, on the other hand, have spung up from the bottom of the sea by upheaval (vide Wallace, Malay Archipelago; Island life and Geographical distribution of animals 2 Vols. Hackils, History of Creation. 2 Vols.

క. అంగుమెయి నాకసంబును, బ్రుంగఁగ గమకించు తనశరీరంబు మహో-
ద్భంగురతయుఁ గని తనలో,నం గానుపుట్టి యోజనాపరుఁ డయ్యెన్. ౧.౨౮

అర్థములు. అంగుమెయిన్=చక్కఁగా, గమకించు=యత్నించు, మహోద్భంగురత=మిగుల నభివృద్ధి, యోజనాపరుఁడయ్యెన్=ఆలోచించినవాఁ డయ్యెను. 'యోచన' యనుశబ్దము సంస్కృతమున లేదని పండితు లందురు. యకారాదులు తెనుఁగున లేవు కావున యోచన యనునది తెలుఁగు శబ్దమును గాదు.

తాత్పర్యము.

చక్కఁగా నాకాశంబును బ్రుంగుటకై యత్నించు తన శరీరముయొక్క యభివృద్ధి చూచి హనుమంతుఁడు తనలో నిట్లు లాలోచించెను.

ఉ. ఈమెయిపెంపు నా దగువ • హీనజవంబును గాంచి రాక్షసుల్
దా మొకవింతగాఁగ నను • దద్దయుఁ జూడఁగఁ గోరుచుండ్రు, నే
నేమెయిఁ గార్యముం బలుప • నేర్పను నంచు మహాద్రిసన్నిభం
బౌ మెయి వానరాధిపుఁడు • నా క్షణమందున సంగ్రహించుచున్. ౧౨౯

అర్థములు. మెయిపెంపు = దేహముయొక్క గొప్పతనము, అహీనజవంబు= మిగుల వేగము, వింతగాఁగ=ఆశ్చర్యకరమైన క్రొత్తవస్తువుగా.

తా త్ప ర్య ము.

ఈ నా పెద్ద శరీరము నా యీ వేగము రాక్షసులు చూచిరా నన్నొక వింత జంతువువలెఁ జూడ మిగుల వేడుక పడుచు నా చుట్టు తిరుగు చుందురు. అప్పుడు నేనెట్లు సీతాన్వేషణ కార్యము చేయఁగలను, అని కొండవలె నున్న తన దేహమును హనుమంతుఁడు తత్క్షణమే చిన్నదిగాఁ జేసెను.

ఆ. వీతమోహుఁ డగుచు • వెలసిన యాత్మజ్ఞు పోల్కి స్వస్వరూప • మును ధరించె
బలిని నడఁగఁ ద్రొక్కి • ప్రబలు త్రివిక్రముఁ, డాత్మరూపధారి • యయిన యట్లు.

అర్థములు. వీతమోహుఁడు=అజ్ఞానము వదలినవాఁడు, ఆత్మజ్ఞు పోల్కి = ఆత్మజ్ఞానము కలవాని వలె.

తా త్ప ర్య ము.

అవయవముల పొడుగు గల యీ దేహమే నేనను నజ్ఞానము గలవాఁడు ఆత్మ లక్షణ మెఱింగి యీ దేహము నేను గాను, నేనాత్మస్వరూపుడను అని తన యథార్థ స్వరూపజ్ఞానమున నిలిచినట్లు త్రివిక్రమావతారంబున బలి నణఁగఁద్రొక్కి విష్ణువు మరలఁ దన స్వరూపమును గ్రహించినట్లు హనుమంతుఁడు తన స్వస్వరూపమును ధరించెను.

ఉత్సాహము. చారువివిధరూపధారి • సాగరప్రతీరమున్
జేరి దుర్జయుండు పూని • నైజరూపుఁ గార్యమున్
సారె దలఁచి తననురూపుఁ • జక్కఁ జూచి కేతకే
లారుహాళి సొంపు నింపు • లంబభూధరంబునన్. ౧౩౦

అర్థములు. చారు వివిధరూపధారి=మనోహరమై యనేక విధములైన రూపములు ధరించువాఁడు, ఇచ్చటనే గాక యింకెకడఁ బూర్వము కూడ హనుమంతుని రూపము సుందర మనియే చెప్పఁబడెను. హనుమంతుఁడు సుందరుఁడగుటను, సీతాదేవి సుందరి యగుటను సుందరశ్చ, సుందరీచ = సుందరౌయని యేకశేషచే వీరికి సంబంధించినది కావున దీనికి సుందరకాండ మని పేరు పెట్టఁబడెనేమో! సాగర ప్రతీరమున్ = సముద్రపు టావలి యొడ్డును 'ప్రతిముఖే స్థితం తీరం ప్రతీర'మ్మని వ్యుత్పత్తి. దుర్జయుఁడు=జయింపరానివాఁడు, నైజరూపు=తన సహజ స్వరూపమును, కేతక+ఇలారుహాళి = మొగలిచెట్లు, లంబ భూధరంబునన్ = లంబ పర్వతమునందు.

ఉత్సాహమునకు నేడు సూర్యగణములు, నొక గురువు. ఐదవ గణము మొదటి యక్షరము యతి. హనుమంతుని యుత్సాహము దెలుప నుత్సాహము వ్రాయఁబడెను.

పంచచామరము. సుకూటవాటికాగ్రసీమఁ • జూచి దూఁకి యొద్దునన్
త్రికూటభూధరాగ్రసీమ • దేవతాధిరాట్పురీ
నికాశమైన లంకనున్ వ•నీసమూహరాజ పా
వకాత్మమిత్రపుత్రుఁ డప్డు•పాఱఁజూచెఁ జక్కఁగన్. ౧౩౨

అర్థములు. సుకూట వాటికాగ్ర సీమన్ = మంచి శిఖర ప్రదేశముల కొన యందు, దూఁకి = దుమికి, ఆకాశమునుండి, త్రికూట భూధరాగ్ర సీమన్ = త్రికూట మను పర్వతము యొక్క పై భాగమందు, దేవతాధి రాట్ పురీ నికాశము = ఇంద్రుని పట్టనముతో సమానము, వనీ సమూహ రాజిన్ = వన సమూహములచేఁ బ్రకాశించు దానిని.

తాత్పర్యము.

మంచి శిఖర ప్రదేశముల కొనను జూచి యొద్దున దూఁకి త్రికూట పర్వతము కొన యందు దేవేంద్రు పట్టనముతో సరియై వనసమూహములచేఁ బ్రకాశించు లంకను హనుమంతుఁడు పాఱఁజూచెను.

పంచ చామరమునకు జర జర జగలు, తొమ్మిదింట యతి, రామార్థమై సముద్ర లంఘనము చేసిన మహానుభావునకుఁ బంచచామరసేవ కవి చేసెను.

—• ౨-వ సర్గము. హనుమంతుఁడు లంకాపురి వెలుపలి యుద్యానంబుల విహరించుట •—

క. తరియింపరానిరత్నా,కరముం దరియించి సుఖము•గాఁగఁ ద్రికూటో
ద్ధరశిఖరాగ్రంబునఁ గే,సరిసూనుఁడు లంకఁ గాంచి • స్వస్థత నొందెన్. ౧౩౩

తాత్పర్యము.

దాఁటుట కితరులకు సాధ్యముగాని సముద్రమును సుఖముగా, దాఁటి త్రికూట పర్వత శిఖరంబున నుండు లంకఁగాంచి హనుమంతుఁడు కుదుటఁబడిన మనస్సుగల వాఁడయ్యెను.

హనుమంతుఁడు సముద్రమును నాకాశమార్గమున లంఘించె నని స్పష్టముగ రామాయణము చెప్పుచున్నను నెగిరి దాఁటలేదు, ఈది పోయినాఁడని వాదించు మూఢులుకూడఁ గలరు.

క. లలితోద్యానస్థలముల, జలజలఁ బయి రాల్ప భూజ•సంతానము పు
వ్వులు వలపులు వెదచల్లుచుఁ, జొలిచె న్వానరవరుండు • పుష్పమయుండై. ౧౩౪

అర్థములు. లలిత+ఉద్యానస్థలములన్ = మనోహరములయినతోఁటలయందు,

భూజసంతానము=చెట్లసమూహము, భూజ (సీత) యొక్క దుఃఖము బాపుటకై పోవు హనుమంతునిమీఁద, భూజ సంతతి=పుష్పములు, వల్లుట సముచితమే కదా, వలపులు=వాసనలు.

తా త్ప ర్య ము.

అరబయలఁ దిరిగిన రాక్షసులు చూతురను తలంపుతో నుద్యానవృక్షముల మాటునఁ దిరుగుచున్న యాంజనేయునిపై వృక్షములు జలజల పూవులు రాల్పఁగా వాని సువాసనల వ్యాపింపజేయుచుఁ బూలతో నిండినవాఁడై యాయన యొప్పు చుండెను. పుష్పాభిషేకము శుభసూచకమే.

క. ఇట్టులు నూఱామడ యొక, పెట్ట వడిం దాఁటి బాహు•విక్రమపరుఁడై
నిట్టూర్పైనను విడువఁడు, కొట్టఁబడఁడు గాసిఁ గీశ•కుంజరుఁ డంతన్. ౧౩౫

తా త్ప ర్య ము.

ఈ ప్రకారము నూఱుయోజనము లొక్కసారిగ నడుమ విశ్రమింపక బాహు బలముచేతనే వేగముగ దాఁటి హనుమంతుఁడు హుస్సబ్బాయని నిట్టూర్పైన విడి చిన వాఁడు కాఁడు. అలసిన వాఁడును గాఁడు. హనుమంతుఁడు నూఱు యోజనముల సముద్రమును దాఁటెనని స్పష్టముగ రామాయణమునఁ గలదు.

ఇప్పుడు సముద్రమంత వెడలుపు లేదు. కావున రావణాసురుని లంక యిది యగునా యని కొందఱి సందేహము.

"There is a place called *Nikumbhila* about 40 miles from Colombo. It is associated with a Jagna or sacrifice performed by *Indrajit*. The Asoka forest of Ravana where Sita is kept is still in existence and I was told by a Brahman of Jaffna that there is an image of Sita, which is still worshipped. There is a rock in the waters at Point-de-Galle whioh goes by the name of Ravana Kotta-" D. N Gangli's trip to Colombo.

Buddhist Text Society's Journal Vol. III Pt. I Ap. 2.

దీనివలన నింద్రజిత్తు హోమము చేసిన నికుంభిలయు సీతాదేవి యుండిన యశోక వనము నేటికి నున్నట్టును నందు సీతాదేవి పూజింపఁబడు చున్నదనియు రావణకోట యను స్థలమున్నట్టు స్పష్టమగు చున్నది. దీనివలన నిప్పటి సింహళ ద్వీపమే మునుపటి లంకయని నమ్మఁదగి యున్నది.

ఇప్పుడు సింహళ ద్వీపమునకు మన దేశమునకు నడుమ సముద్రము వెడలుపు అఱువది మైళ్ళే యున్నది. నూఱు యోజనము లెక్కడ? అఱువది మైళ్ళెక్కడ యని సందేహము బాధింపకపోదు. యోజనము కొలతఁ యెంతైనది నిష్కర్ష లేక యున్నది. కొన్ని చోటుల నాలుగుమైళ్లు, కొన్నిచోటుల నెనిమిది మైళ్లు, కొన్ని చోటుల రెండున్నర మైలున్నట్టు కొందఱు వ్రాసి యున్నారు. తెనుఁగున ఆమడయు కొన్ని దేశములఁ బదిమైళ్లు, కొన్ని మండలముల నెనిమిది మైళ్లు కొలఁత గలదై

యున్నది. క్రోశమిట్టిదేయై యున్నది. ఇప్పటి మైళ్లు (1760 గజములు మైలు అను పరిమాణము) గలవి పూర్వమందు లేవు. కావున యోజనమున కిన్ని మైళ్ళని నిర్ధారింప సాధ్యము కాకున్నది. ఇప్పుడు సముద్రము అఱువది మైళ్లే యున్నను రామాయణ కాలమున సముద్ర మింత మాత్రమే కాదు. ఇప్పటి మధురకుఁ గొంచెము దూరములోనే దక్షిణమున సముద్ర ముండినది. సముద్రభాగము విశేషముగఁ బూడి యిప్పుడు నేల యైనది యని శాస్త్రవేత్తలు వ్రాసి యున్నారు.

"It thus appears that rocks and islets and fordable shoals existed in the channel, even at that time The feat of connecting the gaps to construct a cause-way was not impossible with Sugriva, who had almost all the resources of Southern India at his command"

ఇప్పటి రామనాథపురమునకు దక్షిణభాగమంతయుఁ బూర్వము సముద్రముగానే యుండెను. కావునఁ సుగ్రీవుఁ డంగదాదులకుఁ జెప్పినపుడు "పాండ్యకవాటావనిఁ బరికింపుఁడీ" యని చెప్పి వెంటనే "వననిధి తీరముం గదిసి" యని చెప్పెనుగాని యడవులఁగాని కొండలఁగాని యూళ్ళఁగాని చెప్పినవాఁడు కాఁడు. మఱియొక విషయము. పూర్వమునందు దీనితో సమానముగ బడమట నుండు నిప్పటి మళయాళదేశము తిరువాన్కూరు లోనైనది సముద్రమున మునిఁగియుండెననియు బరశురాముఁడు కోరఁగా సముద్రుఁ డా ప్రదేశమును నాయన కిచ్చెననియుఁ బురాణములఁ గలదు. కావున నిప్పటి తిరువాన్కూరు పూర్వము సముద్రములో మునిఁగియుండెనేని యిప్పటి తిరునల్వెల్లి, మధురమండలమున దక్షిణభాగము సముద్రమున మునిఁగియుండుట యేమిచిత్రము? అదియును గాక రామాయణమునఁ జెప్పఁబడిన త్రికూటము, లంబ పర్వతము సువేల యనునవి లంకకు దక్షిణభాగంబున నున్నవి కాని యుత్తర భాగంబున లేవు. కావున నిప్పటి లంకయందలి యుత్తరభాగముకూడ సముద్రమున మునిఁగియే యుండవలెను. లేదా హనుమంతుఁ డీ ప్రదేశమును విడిచి చక్కఁగా నచ్చటికైనఁ బోయి యుండవలెను. ఈ పర్వతముచుట్టు సముద్రము చెప్పఁబడెనే కాని నేల గ్రామము లున్నట్లు వాల్మీకి చెప్పలేదు. సువేల యను పదమే సముద్రతీర దేశమని తెలుపుచున్నది. లంకయందలి యిప్పటి యుత్తరపు రేవునకుఁ ద్రికూటమునకు నాలుమైళ్ళకుఁ బైగా నున్నది. కావున హనుమంతుఁడు దాఁటినది రెండువందల యేఁబది మైళ్ళని యేర్పడుచున్నది. కావున నాలు యోజనము లనఁగా రమారమి రెండువందల యేఁబదిమైళ్ళని గ్రహింపనగు. దీనివలన నిప్పుడు మహేంద్రనగరము రామాయణమునకు సంబంధించిన మఱి కొన్ని ప్రదేశములు తీర్థవాసులచేఁ జూపఁబడునవి కృత్రిమము లని స్పష్టపడుచున్నది. ఇచ్చట నింకొక విషయ మాలోచింపవలసి యున్నది. అకంపనుఁడు శూర్పణఖ లోనగు రాక్షసులు లంకకుఁ బోవుచు వచ్చుచు నుండిరి. రావణుఁడు పంచవటి నుండి లంకకు బోయెను. వీరి కార్యము

ప్రశంసింపఁబడలేదు. హనుమంతుని కార్యము మాత్రము ప్రశంసింపఁబడు చున్నది. ఏల ?

రాక్షసులు స్వభావమునఁ గామచారులు. వారు విద్యాబలముచేఁ బోవుచు వచ్చుచుండిరి. అది గొప్ప కార్యముకాదు. హనుమంతుఁడు కేవల భుజబలము చేతనే దాఁటినవాఁడు అని రామాయణమునఁ జెప్పఁబడెను. కావున నిది ప్రశస్తము. రావణాసురుఁ డొక ముసలి గ్రద్ధ యడ్డము రాఁగానే తికమకలాడెను. హనుమంతుఁడు మూఁడు గండములు తప్పించుకొనెను. హనుమంతుఁడు సంజీవనికై పోయిన దూరము చూచినపు డిది యొక లెక్కగాదు. తరువాతఁ జేసినది యసాధ్య కార్యము.

ఉ. ఆమడ లెన్నివే లయిన • నశ్రమలీలఁ దరింప నేర్తు నా
 యామడ యేమి లెక్క యని • యాత్మఁ దలంచుచు మంజువాసనా
 స్తోమము నింపుతోఁటలును • జొక్కపుఁబచ్చిక పట్టు స్వల్పపుం
 భూమిధరంబులు న్గనుచుఁ • బోయి నగాగ్రమునుండి కన్గొనెన్. ౧౩౭

అర్థములు. మంజువాసనాస్తోమము = మనోహరమైన పరిమళముల సమూహము.

తాత్పర్యము.

ప్రయాసము లేక యెన్నివేల యామడ లయిన దాఁటఁగలను. నూఱామడ లక్ష్యమా యనుకొనుచుఁ బరిమళించు తోఁటలును నిర్మలమైన పచ్చిక ప్రదేశములను జిన్న చిన్న గుట్టలను జూచుచుఁబోయి హనుమంతుఁడు కొండమీఁదినుండి చూచెను.

ఉ. గోఁగులు దేవదారులును • గొండవిసెల్ చిఱునిమ్మ మల్లియల్
 రేఁగు లరంట్లు గన్నెరులుఁ • బ్రేంకణముల్ కదుముల్ మొగళ్లునున్
 వీఁగఁగ బూచి కాచి యర•విచ్చిన మొగ్గలఁ బూపపిండెలన్
 ప్రేఁగున నేలఁ బ్రాఁకు పృథి•వీరుహపాళులు నాటతోఁటలున్. ౧౩౮

అర్థములు. పూప పిండెలు=లేఁతపిందెలు, ప్రేఁగున = బరువుచే, పృథివీరుహపాళులు=చెట్లవరుసలు, ఆటతోఁటలు=ఉద్యాన వనములు; (తాత్పర్యము స్పష్టము.)

క. రెమ్మలుఁ గొనకొమ్మలుఁ బవనమ్మునకుఁ జలించు నవియు • నవ్యములు శకుంతమ్ములు నిండఁగఁ గనుహృ,ద్యమ్ములు నగు పాదపముల•హనుమఁడు గాంచెన్.

అర్థములు. శకుంతమ్ములు = పక్షులు, కనున్ = మిక్కిలి, హృద్యమ్ములు= మనోహరములు, పాదపములన్=చెట్లను.

తాత్పర్యము.

గాలికిఁ గదలు రెమ్మలు కొనకొమ్మలు క్రొత్తలై చూడ నింపైన పక్షులు గల వృక్షముల హనుమంతుఁడు చూచెను.

హనుమఁడు = హనుమచ్ఛబ్దతత్సమము. హనుమ, హనుమఁడు తద్భవము అనుమ, అనుమఁడు.

ఉ. అంచలుఁ గన్నెలేళ్లు నళి•నావళి కల్వలచాలు లొప్పు న
త్యంచిత మైన దిగ్గియలు • నైకవిధంబులు నాటపట్టులున్
మంచిమదుంగు లెల్లపుడు • మానక పూచుచుఁ గాచుచెట్లచే
మించువనాళిఁ బద్మముల•మేలిమిఁ గన్న యగడ్తలుం గనెన్. ౧౩౯

అర్థములు. నళినావళి = కమలముల గుంపులు, దిగ్గియలు=దిగుడు బావులు, నైక విధంబులు = అనేక విధములగు.

తాత్పర్యము.

హంసలు, కన్నెలేళ్లు కమలములు కలువలు గల దిగుడు బావులును అనేక విధములైన క్రీడాస్థలములును మంచి మదుఁగులు, ఎప్పుడు పూచు కాచు చెట్లు గల తోఁటలు కమలములచే నిండిన యగడ్తలు హనుమంతుఁడు చూచెను.

సీ. సీతను బ్రుచ్చిలిం•చిన కారణంబున, రావణుం డెంతయు • రక్ష నునుప
నెల్లచోటుల మార్గ•ణేష్వాసపాణు లై, నడయాడు రాక్షస•నాయకులును
గనకమయంబు ప్రా•కారంబు చుట్టంగ, గ్రహముల శారదా•భ్రముల నెనయు
నగుగృహంబులు పాండు•రాంచత్ప్రతోళులు, నట్టశతము వైజ•యంతిపంక్తి
తే. వింత లగు పైడితీఁగల • వేడ్కఁ గొలుపు,తోరణంబులు గలిగి ని•స్తుల్య మగుచు
గగనమున స్వర్గ మనఁగ లం•కాపురంబు, కొండశిఖరంబుపేటున • నుండుకతన.

అర్థములు. మార్గణ+ఇష్వాస+పాణు లై=బాణములు విండ్లు చేత ధరించిన వారై, నడయాడు=సంచరించు, శారదాభ్రముల=శరత్కాల మేఘములను, ఎనయు= సరిపోవు, పాండుర=తెల్లని, అంచత్=ప్రకాశించు, ప్రతోళులు = పెద్దవీథులు, అట్ట శతము = ప్రాకారములపై యుద్ధార్థము కట్టఁబడిన యెత్తుప్రదేశము లనేకములు, వైజయంతి పంక్తి=టెక్కెముల వరుస, పైడితీఁగలన్=తీఁగలవంటి బంగారు రేఖలచే.

తాత్పర్యము.

సీతను దాను దొంగిలించి తెచ్చిన కారణముచే రావణుఁడు మిక్కిలిగఁ గాపుంచఁగా సమస్త ప్రదేశముల విల్లు బాణములు ధరించి తిరుగు రాక్షసశ్రేష్ఠులును బంగారు మయమైన ప్రాకారము చుట్టు కొనఁగా గ్రహములను శరత్కాల మేఘములను బోలు యిండ్లను తెల్లని పెద్దవీథులును, నూర్ల కొలఁది యట్టములును వానిమీఁద ధ్వజములును తీఁగలవలె బంగారుతోఁ జేయఁబడిన తోరణములు గలదై యసమానమై యాకాశమున వ్రేలు స్వర్గమో యన్నట్లు లుండు లంకాపురము కొండశిఖరము పేటున నుండుటచే.

అయోధ్యకు సాకేత మను పేరు లంకకు సింహళ మను పేరు ఇటీవల వచ్చినవే కాని ప్రాఁతపేర్లు కావు. లంకకు సింహళమను పేరువచ్చిన కారణము,అది యిప్పుడు సిలోను అయిన కారణ మిట్లు చెప్పఁబడెను.

"In the seventh century of our era, Ceylon was known by the name of Seng kia-lo or Sinhala, which was said to be derived from the lion-descended Sinhala. whose son Vijaya is fabled to have conquered the island on the very day of Buddha's death, in B. C. 543 .... Its existence was first made known to the European world by the ,expedition of Alexander, under the name of Taprabane.............................The true form however would appear to be Tambapanni or red-leaved from the Sanskrit Tampra-Parni. Ptolemy calls the island Salika (corrupt from Simhalaka). Ammianus calls it Serendives, which is the same as the Sieladiba of Kosmas, derived Sihala-dipa, the Pali form of Simhal dvipa. Abe Rahin gives the form Singal-dib, or Sirindib, which is the Serendiu of European Sailors. From the same source came the Arabic L'lan and our own Ceylon" Cum. Geo. An. India P. 557.

—• హనుమంతుఁడు లంకఁ జూచుట •—

ఉ. వ్రేలెడి నే మొకో గగన • వీథి నటం చన నొప్పుదాని, నీ
లీల నభంబునందు నవ • లీలగ నేగుచు నున్న దేమొ నాఁ
గా లగుదాని, సంతతని • శాచరనాయకగాఢరక్షితం
బై లలి మీఱు పట్టనవ • రాద్యము దుర్గచయానవద్యమున్. ౧౮౧

అర్థములు. సంతత=ఎడఁదెగక, నిశాచరనాయక=రావణుచే, గాఢ=మిక్కిలి, రక్షితంబు = కాపాడఁబడునది, పట్టనవరాద్యము=శ్రేష్ఠమైన పట్టనములందు మొదటిది; దుర్గచయ=కోటల సమూహములచే, అనవద్యము=లోపములేనిది.

తాత్పర్యము.

ఆకాశమున వ్రేలాడుచున్నదో, యాకాశమున నవలీలగా నెగిరిపోవుచున్నదో యున్నట్టులుండు దానిని, రావణుఁడు విడువని కాపు పెట్టుటచే రక్షింపఁబడునఁ గోటల లోపము లేక గొప్పపట్టనములందు మొదటిదని యెంచఁబడఁదగిన దానిని.

క. తొలుదొల్తఁ గుబేరునకున్, నిలయంబై యున్నదాని • నెఱి యిట్లనుచున్
దలఁపున నైనను నెన్నఁగ, నలవిపడనిదాని సుకృత • మై స్పష్టంబై. ౧౮౨

అర్థములు. తొలుదొల్తన్ = మొట్టమొదట, నిలయము = వాసస్థానము, నెఱిన్=అందమునందు, సుకృతమై=చక్కఁగా నిర్మింపఁబడినదై, విశదమై.

తాత్పర్యము..

తొలుత విశ్వకర్మచే నిర్మింపఁబడి కుబేరునకుఁ గొలుత వాసస్థానమై యందమున నిట్టిదని మనస్సుచేనైన నూహింపరానిదై యున్నదానిని.

క. ప్రాకారజఘనయును న, స్తోకజలనవీనపటయు • శూలగురుశత
ఘ్నీకుంతలపాశయు న,ట్టాకలితవతంస యగుచు • నంగనకరణిన్. ౧౮౩

అర్థములు. ప్రాకార జఘన=ప్రాకారమనెడి మొలగలది. అస్తోక=అధికమైన, జల=అగడ్తయందలి నీళ్ళనెడి, నవీనపటయు=క్రొత్తచీరగలది, శూల గురు శతఘ్న కుంతలపాశయు=శూలములు గొప్పశతఘ్నులనెడి కొప్పుగలది, పాశశబ్దము క్షత్రాది శబ్దములకుఁ బరముగా నుండెనా నిందను దెలుపును. క్షత్రపాశుఁడనఁగా క్షత్రి యాధముఁ డని యర్థము. కర్ణ శబ్దము పైనుండెనేని బంగారుసొమ్మని యర్థము. కర్ణ పాశము అనఁగా కర్ణభూషణము, కచము కేశము కుంతలములకుఁ బరముగా నుండిన కొప్పని యర్థము. కచపాశము, కేశపాశము, కుంతలపాశము అనఁగాఁ గొప్పు. అట్ట+ఆకలిత+వతంస=అట్టములచేతఁ జేయఁబడిన శిరోభూషణముగలది. అట్టములే శిరోభూషణము లని భావము. ఇట్టి దగుటచే స్త్రీవలెను నున్నదని భావము.

తాత్పర్యము.

కోట గోడ యను మొలయు దానిని జుట్టి యగడ్తల నీళ్ళనెడి చీరయు శూలములు శతఘ్నులు అనెడి కొప్పును అట్టము లనెడి శిరోభూషణము గలిగి స్త్రీవలెనై.

ఉ. తీరుప విశ్వకర్మయు మ • దిన్ సురవైరులచేత వాయుభు
గ్వారముచేత భోగవతి • కైవడి నొప్పు పురంబు నుత్తర
ద్వారముఁ జేరి రౌప్యధర • తద్విధి నింగిని రాయు నున్నతా
గారము లొప్పు భీకరవి • కారసురారిచమూసమూహముల్. ౧౪౪

అర్థములు. తీరుపన్ = నిర్మాణము చేయఁగా, వాయుభుక్ + వారము = పాముల సమూహము, భోగవతి=పాతాళములోని సర్పముల ముఖ్యపట్టనము, రౌప్య ధర తద్విధిన్ = వెండికొండవలె, ఉన్నతాగారములు=ఎత్తైన యిండ్లు, భీకర=భయము కలిగించు, వికార సురారి=అసహ్యములైన రూపములు గల రాక్షసుల, చమూ సమూహముల్ =సేనల గుంపులు.

తాత్పర్యము.

విశ్వకర్మ నిర్మింపఁగాఁ బాములచే నిండిన భోగవతివలె రాక్షసులచే నిండిన లంకానగరము నుత్తర ద్వారముఁ జేరి కైలాస పర్వతమువలె నాకాశమును దాఁకు చున్న యెత్తైన యిండ్లు గలిగి భయంకరాకారములు గల రాక్షస సేనా సమూహములు.

ఉ. పట్టిసశూలపాణు లయి • పాములు పెన్గుహఁ గాచు భంగిగా
నెట్టన కాచులంకను వి • నిర్మల మై సొబగారు లంకకున్
బెట్టనికందకం బనఁగఁ • బేర్మి నెసంగు మహార్ణవంబునున్
జుట్టును జూచి నిర్జరని • షూదను రావణుశౌర్య మెంచుచున్. ౧౪౫

అర్థములు. పట్టిస శూల పాణులయి=అడ్డకత్తులను శూలములను జేతియందు

ధరించి, పెట్టని కందకంబు=మనుష్యులు నిర్మింపని యగడ్త, మహార్ణవము=పెద్ద సముద్రము, నిర్జర నిషూదను=దేవతల హింసించిన వానియొక్క.

తాత్పర్యము.

చేతులందు నడ్డకత్తులు శూలములు ధరించి పాములు గుహను గాచు విధముగ రాక్షసులు కాచుచున్న లంకను, దానికి మనుష్యులు నిర్మింపని యగడ్తయై చుట్టి యుండు పెద్ద సముద్రమును జూచి దేవతల జయించిన రావణుని శౌర్య మింతిదిగదా యని తలంచుచు తనలోఁ దానిట్లనుకొను చున్నాఁడు.

—• హనుమంతుఁడు లంకను జూచి నివ్వెఱగొనుట. •—

క. ఏలీలఁ గపులు వత్తురు, వాలాయము వచ్చి రేని • వ్యర్థక్లేశము లై
తూలఁగలవారు తరమే, యీ లంకన్ వేల్పుగముల • కేనియు గెలువన్. ౧౪౬

అర్థములు. వాలాయము=నిర్బంధముగ.

తాత్పర్యము.

ఈలంకకు వానరులందఱు నేవిధముగ రాఁగలరు. ఇంత సముద్ర మందఱు దాఁటి రాగలరా? ఒకవేళ నిర్బంధముగా రాఁగలరని తలంచినను వారి ప్రయాసము వ్యర్థమై వారు చిన్నబోవలసినవారే. ఏలన నీ లంక దేవతాసమూహములకైన గెలువ సాధ్యమా? కాదు.

క. అనుపమబలుఁ డారాముఁడె, చనుదెంచియు నిటకు నేమి • చలుపం గలుగున్
ఘనదుర్గము విషమము గా, వనపాలితమైన నగర • వర్యము లంకన్. ౧౪౭

తాత్పర్యము.

వానరుల మాట యటుండ నీ యనుపమానబలుఁ డగు రామచంద్రమూర్తియే యిచ్చటికి వచ్చిన వాఁడనుకో, వచ్చి ప్రవేశింపరాని సంకట స్థలమందుండి రావణుఁడు రక్షించు లంక నేమి చేయఁగలఁడు?

ఉ. మంచితనంబుమాటలకు • మానుగ లే దవకాశ మేనియున్
లంచము లిత్త మన్న విధ • లంబ యగున్, మఱి వారిలోనఁ గ
ల్పించి పరస్పరంబుఁ గడు • వేఱిమి చూడ నసాధ్య, మెంత యో
జించిన రాక్షసావళులఁ • జివ్వను గెల్వ నశక్య మేరికిన్. ౧౪౮

అర్థములు. అవకాశము=ఎడము, వేఱిమి=భేదము. చివ్వను=యుద్ధమందు.

తాత్పర్యము.

మనలో మనకేల విరోధము సీత నియ్యఁడని మంచి తనముగా మాటలాడుటకు సందులేదు. మంచిమాటలకు వీరు చెవి నిచ్చువారు కారు. ఏలన బలమదోన్మత్తులు సామమునఁ జిక్కబడుదురా? అదిగాక దానముచే వశపఱచుకొందమనిన లంచము లిచ్చుటయు వ్యర్థమే. ఏలన ధనకాంక్ష గలవారుగదా లంచము

లాశింతురు. వీరి కైశ్వర్యము పుష్కలముగా నున్నది. ఒకరి డబ్బుతో వీరికేమిపని ? ఒకవేళ యిత్తమన్నను నింతకంటె నెక్కువ యైశ్వర్యము రామచంద్రునొద్ద నేమి గలదు ? అటుగానున్న భేదోపాయముచే వారిలో వారికిఁ గలహము పెట్టుదమన్న నదియు నసాధ్యమే. ఏలన భేదములు కల్పించుటకు వారి మర్మములు లోపాలోపములు ముందు తెలియవలె. వారిలోఁ గొందఱు పరిచితులు కావలె. వీరి మర్మము తెలియు టెట్లు? అవి తెలిసికొనుటకు వీరిలోఁ గలసిమెలసి యుండు టెట్లు? అది యెన్నాళ్ళ కార్యము? నన్నుఁ జూడఁగానే యందఱు నేకకలహమునకు వత్తురే కాని యూరక యుండ నిత్తురా ! కావున భేదోపాయము వ్యర్థమే. పోనీ యుద్ధములో గెల్తమనిన నెంత యోజించినను నదియు సాధ్యముకాదు. ౧౦౦౬. పద్యము చూడుమది. క్రమక్రమముగ నభిప్రాయ మెట్లు మారెనో తెలియును.

క. నీలుం డంగదుఁ డేన్ మతి, శాలి ప్రభువు సూర్యసుతుఁడు • జలనిధి దాటం
గా లంకాపురిఁ జేరఁగ, జాలెద మా మాత్ర నేమి• సాధ్యము సేయన్. ౧౮౯

తాత్పర్యము.

ఏ యుపాయము చేయుటకైన నిచటికి రాఁగల వారెవ్వరు ? నీలుఁడు, అంగదుఁడు, నేను, బుద్ధిశాలి ప్రభువు సుగ్రీవుఁడు యీ నలుగురము సముద్రము దాటగలము. లంకకు రాఁగలము. ఈ నలుగురితో నే కార్యము కాఁగలదు ?

క. ఇంతకు శ్రీరఘురాముని, కాంతామణి జీవయుతయొ • కాదో యీ వృ
త్తాంత మెఱిఁగి సీతను గని, చింతించెదఁ గాక యవలి• చేఁత తెఱంగుల్. ౧౯౦

తాత్పర్యము.

ఇంతకు నీ లంకను సాధించు నుపాయ మిప్పు డాలోచించి నేమి చేయను ఇందు సీత యున్నదో లేదో, ఉండినఁ బ్రాణములో నున్నదో లేదో? ఆ విషయము నిశ్చయము చేసికొనికదా యావల సీతాదేవి యిందుండిన లంక సాధించు నుపాయ మాలోచింపవలె. ఇప్పుడు నేను చేయవలసిన యాలోచన యదికాదు. సీతాదేవి నెట్లు చూతునా యాలోచింపవలె. ఆ నిమిత్తమై లంకలో నెట్లు ప్రవేశింపవలె. ఇది నేను చేయవలసిన యాలోచన.

—• హనుమంతుఁడు లంకలోఁ జొచ్చు నుపాయంబు యోజించుట. •—

సీ. ఎటులు ప్రవర్తింప • నెంతయు మేలగు, రాముని కార్య మా•క్రమముఁ గూర్చి
శృంగాగ్రసీమ నా•సీనుఁడై యొక్క ముహూర్తంబు చింతించి • యుగ్ర మిట్టి
రూపంబుఁ దాల్చి • క్రూరరాక్షసమహా, వాహినీగుప్తమై • వఱలు లంకఁ
జొఱఁగ నసాధ్యంబు • సురవైరు లందఱు, వీర్యవంతులు మహా•భీమబలులు

తే. జానకిని గోయుచోట నీ•సర్వదైత్య, తతుల వంచించి విదితావి•దితము లైన
వేషములఁ గొని మాపటి•వేళయందుఁ, జొచ్చి కార్యంబుఁ దీర్పఁగ•వచ్చునాకు.

అర్థములు. మహావాహినీ గుప్తము=గొప్పసేనచే రక్షింపఁబడినది, విదితా విదితములు=వెలికిఁ దెలియవచ్చినవి తెలియరానివి.

తాత్పర్యము.

నే నే యాలోచన చేసినను రామచంద్రమూర్తి కార్యము మేలగునో యట్టి యాలోచన చేయవలె. ఆ విధముగా నడువవలె. అది యెట్లగునా యని శిఖరము కొనభాగమునఁ గూర్చుండి కొంచెమునే పాలోచించి లంకలోకిఁ బోకతప్పదు. ఎట్లు పోదును? ఈ భయంకరరూపముతోఁ గ్రూరు లగు రాక్షసులసేనలచే రక్షింపఁబడు లంకఁ బ్రవేశించుట యసాధ్యమగును. నన్నుఁ జూడఁగానే కలహమునకు వత్తురు. లోపలికి రానిత్తురా? రానీయరు. జయించి పోద మనిన నందఱు రాక్షసులు మహా బలపరాక్రమములు గలవారు. కావున బహిరంగముగాఁ బోవుట నీతిగాదు. వీరికిఁ దెలియ రాకుండునట్లు వీరిని వంచించి లోపలికిఁ బోయి కానఁబడవలసిన చోటఁ గానఁబడుచు, గానఁబడరానిచోటులఁ గానరాకయుండు వేషముల ధరించి రాత్రివేళ కార్యము చక్కఁ జేసికొనుట బాగు.

వాలి వధవిషయమున రామచంద్రు నధిక్షేపించు మహానుభావులు హనుమంతుఁడు పిఱికి, మోసగాఁడు, దానివలన నిట్టి కుత్రాలోచన చేసెను. పౌరుష శాలినైన బహిరంగముగా నున్న రూపునఁ బోఁజా యని యేలొకో యింకను నాక్షేపింప కున్నవారు. ఈ విషయము ముందు వ్రాయఁబడును.

మ. అని చింతించు, దురాసదం బయినదై • త్యాధీశు తత్పట్టనం
బును దా నట్టె గనుంగొనుం, బిదప నూ • ర్పుల్ పుచ్చుఁ బల్మాఱు, నా
హనుమానుం డెటు కన్నుఁ బ్రామి ఖలు ర • క్షోధీశు, ధాత్రీసుతన్
గనఁగా నే నొకఁ డొంటిదాని, నెటు లే • గార్యంబు సాధింతునో. ౧౫౨

అర్థములు. దురాసదము=ప్రవేశింప రానిది, ఊర్పుల్ పుచ్చున్=నిట్టూర్పులు విడుచును, అంత సముద్రముదాటి నిట్టూర్పు విడువని వాఁడిప్పుడు నిట్టూర్పులు విడుచుటచే దానికంటె నిది కష్టతర కార్య మని యూయనకుఁ దోఁచెను. కనుఁ బ్రామి=కన్నులు మూసి=మోసగించి.

తాత్పర్యము.

ఈ ప్రకార మాలోచించును. ప్రవేశింప సాధ్యముగాని యా రాక్షసేశ్వరు నగరమును దా నూరక తెప్పవాల్పక చూచును. చూచి చూచి మిగులఁ గష్ట కార్య మని తోఁపఁగా బలుమాఱు నిట్టూర్పులు విడుచుచు రావణాసురుని కన్నులలో నెటులు మిరపపొడి కొట్టి కన్నులు మూసి మోసగింతును. ఒంటరిగా నుండు సీత నే నెట్లు చూడఁగలను. నే నెట్టు లీకార్యము సాధింపఁగలను!

క. ఏనెట్టులొఁచు పనులేన్, భానునిఁ గనుఁగొన్నతమము • పగిదిం జెడెడున్
వానిని దేశము కాలము, జ్ఞానము లేనట్టిమాత • నలుపఁ గడఁగినన్. ౧౫౩

తా త్ప ర్య ము.

కాలదేశముల జ్ఞానములేక యేకాలమున నే దేశమున నెట్లు ప్రవర్తింపవల యునో యోచింపక పనిచేయు దూత యతని జ్ఞానహీనతచే సక్రమప్రయత్నముచే సాధ్య మని తోఁచిన పనికూడ సూర్యుని యెదుట చీఁకటి చెడునట్లు చెడఁజేయును.

క. దీని నిటు సల్ప సఫలం, బౌ నని ప్రాజ్ఞులు విధించి • నట్టిది కార్యం
బైనను జెఱుచును బండిత, మానియయినదూత శక్తి • మంతుఁడు గామిన్. ౧౫౪

అర్థములు. పండితమాని=పండితుఁడు కాకున్నను బండితుఁడ నని తలఁచు వాఁడు.

తా త్ప ర్య ము.

ఈ కార్య మీ ప్రకారము చేసినఁ దప్పక ఫలించునని బుద్ధిమంతులు నిశ్చ యించి విధించిన కార్యము కూడ పండితమాని యగువాఁడు కార్యము చేయు సామర్థ్యము లేనివాఁడై కార్యమును బ్రాజ్ఞుల యాలోచనమును గూడ విఫలము చేయును. నే నెట్లు కార్యము సాధింతును? ఈ నింద నాకెట్లు రాకుండును? అని హనుమంతుఁడు మఱియు నాలోచించు చున్నాఁడు.

దూతం చైవ ప్రకుర్వీత, సర్వశాస్త్రవిశారదమ్
ఇంగితాకార చేష్టజ్ఞం, శుచిం దక్షం కులోద్గతమ్.

ఐహికాముష్మిక శాస్త్రముల నెల్ల నెఱిఁగిన వాఁడును, ఇతరుల మనస్సు నెఱుఁగుమాటలనేర్పు స్వభావము ఆకారము చేష్టలు మొదలగువాని సంజ్ఞలు నెఱిఁగిన వాఁడును, అర్థదాన స్త్రీ విషయంబులఁ బరిశుద్ధుఁడును, నేర్పరియు, సద్వంశమునఁ బుట్టినవాఁడును, నగు వానిని దూతగాఁ బంపవలెను.

'అనురక్తః శుచి ర్దక్షః స్మృతిమాన్ దేశకాలవిత్ వపుష్మాన్ వీతభీ ర్వాగ్మీ దూతో రాజ్ఞః ప్రశస్యతే' అందఱియం దనురాగము గలవాఁడును, ధన స్త్రీ విష యంబుల శుచియును నేర్పరియు జ్ఞప్తిగలవాఁడు దేశకాలముల నెఱిఁగినవాఁడు చక్కని దేహముగలవాఁడు భయములేనివాఁడు మాటలయందు నేర్పరియగువాఁడు దూతగా నుండఁదగును. ఇన్నిగుణములు హనుమంతునందుఁ గల వనుట యా యా సందర్భముల నెఱుఁగనగు. మను ౭-౬౩-౬౪ శ్లో.

సీ. కార్య మేరీతిని • గావింప మే లగుఁ, దెలివి హాయక యెట్లు • దీర్పఁ గలనొ
లవణార్ణవంబును • లంఘించు టది యెల్ల, నే రీతి వ్యర్థమై • యేగ కుండుఁ
జూచిరా నన్ను నీ • సురవైరు లంతతోఁ, గాకుష్ఠు కార్యంబు • గాకు చెందు
నసురరూపముఁ గొన్న • నైన గుర్తింతురు, పరరూపములమాటఁ • బలుక నేల

తే. రాక్షసాళికిఁ దెలియంగ • రాక యుండు, నట్టి దొకటియు లేదు య • థార్థ మిందు
గాలి యైనను వీరలు • కాన కుండ, మలయు ననుమాట కల్ల నా • మతికిఁ జూడ.

అర్థములు. కాకుచెందున్ = వ్యర్థమగును.

తా త్ప ర్య ము.

ఏవిధముగఁ గార్యము చేసిన నా ప్రయత్నము సఫలమగును. ఈపగటి వేళనే ప్రవేశింతునా? రాత్రి వేళఁ బ్రవేశింతునా? ఈ రూపముతోఁ బ్రవేశింతునా? రూపము మార్తునా? దీనిని వివేకము చెడకుండ నెట్లు నెఱవేర్పఁ గలను? ఏవిధముగ నేను బ్రవర్తించిన సముద్రము దాటివచ్చుట వ్యర్థము కాకుండును. ఇట్లు దాటివచ్చిన వాఁడ నే కార్యము చేయక యెట్లుండ వచ్చును? ఇప్పుడే యీ రూపముతో నే పోదునా? నన్ను రాక్షసులు చూచిరా రాముకార్యము సీతను వెదకుట యనునది చెడి పోవును. రాక్షస రూపము ధరించి పోదునా? లంకలోని వారందఱు వారికిఁ దెలిసినవారే. వీఁడెవఁడో క్రొత్తవాఁడు వచ్చినాఁడని శోధించి బాధించి వాస్తవము నెఱుఁగఁ గలరు. ఇఁక మఱియొక రూపముతోఁ బోయిన వారు తెలిసికొనుటయందు సందేహమేమి? ఇప్పుడు నేనే విధముగఁ బోయినను రాక్షసులకుఁ దెలియనిది లేదు కావున నవశ్యము తెలిసికొందురు. ఈ రాక్షసులకుఁ దెలియకుండ గాలియు లంకలో సంచరింప లేదని నా యభిప్రాయము. అంత హెచ్చరిక గలవారై యున్నారు.

క. నా యాకృతితో నిచ్చట,నే యుండినయట్టు లైన • నేఁ జెడుట నిజం
బా యనఘరామకార్య మ,పాయంబును బొందుఁ గాన • బని యది యగునే.

తా త్ప ర్య ము.

• ఇప్పుడు లంకలోనికిఁ బోవలయు. ఈ రూపముతో నిచ్చట నేయుందునా? అట్లున్నను వారెవరైన నన్నుఁ గనిపెట్టుదురు. నాకు వారు గానవచ్చినప్పుడు నేను వారికిఁ గానరాకుందునా? కావున వారికి నేఁ గనబడుట నిజము. వారిచ్చటికి వచ్చుటే నిజము. నేను, రాముకార్యముకూడఁ జెడుట నిజము. కావున నది సరియగు కార్యము కాదు.”

ఉ. కావున నిట్లు గ్రమ్ముకును • గై కొని గుజ్జప్లవంగరూపము
ర్రావణుపట్టనంబును దు • రాసదమున్ వెసఁ జొచ్చి యందు ర
క్షోవసథంబుల న్నెమకి • యా జనకాత్మజ, రాముకార్యసం
భావన మీఱువాఁడ నని • పావని దాఁ దలపోసె యాత్మలోన్. ౧౫౭

అర్థములు. ఇర్లు=చీఁకట్లు, గుజ్జ=పొట్టి,ప్లవంగరూపము=క్రోతిరూపాకారము, రక్షోవసథంబులన్=రాక్షసులయిండ్లను, నెమకి=వెదకి.

తా త్ప ర్య ము.

ఇప్పు డీ రూపముతో లంకలోనికిఁబోవుట తప్పు. ఇక్కడ నుండుట తప్పు. కావునఁ జీకటి క్రమ్ముకొనుకు నిండే మాటునుండి యీవలఁ బిల్లక్రోతినై సులభముగఁ జొరరాని, రావణుపట్టణంబునఁ బ్రవేశించి సీతను రాక్షసుల యిండ్లయందు వెదకెదను. అట్లైన రాముకార్యము చేసినవాఁడ నను గౌరవముచే నతిశయింపఁగలను, అని హనుమంతుఁడు తనలో నాలోచించి.

తే. ఎప్పు డెప్పుడు గ్రుంకునో • యీదినేశుఁ
డెప్పుడెప్పుడు వైదేహి • నేను జూతు
ననుచు నెదురు చూచుచు నుండ • నస్తమించెఁ
బద్మినీబాంధవుం డంతఁ • బశ్చిమాద్రి. ౪౯

అర్థములు. పద్మినీ బాంధవుడు=సూర్యుఁడు, సూర్యుడు పద్మినీ బాంధవుఁ డగుటచేతను సీతాదేవి పద్మిని యగుటచేతను నేనింక నుండిన నామె కార్యము నెఱవేఱదని తలంచి సూర్యుఁ డస్తమించెను.

తాత్పర్యము.

ఆలోచన కుదురుటచే నిఁక నా యాలోచన కార్యరూపముగఁ బరిణమింప జేయఁ దొందర పడుచున్నాఁడు. ఎప్పు డీ సూర్యుఁడు గ్రుంకునా ఎప్పుడు నేను సీతను జూతునా యని ప్రొద్దుగ్రుంకుట కెదురుచూచుచుండఁగా సూర్యుఁడు పడమటికొం డపై నస్తమించెను.

౮ వ పద్యమందుఁ దూర్పు తిరిగి సూర్యునకు నమస్కరించి హనుమంతుఁడు లంక దాటుట యత్నించె ననుటచే నుదయ మేడెనిమిది గంటల ప్రొద్దైన నై యుండ వలెను. అభిజిత్తునందు బయలుదేఱె నాఁడనినచో మధ్యాహ్నము నీడ ౫౧ వ పద్యమునఁ జెప్పినంత యుండఁజాలదు. పడమటి సూర్యుని జెప్పుదమా యనిన నంత నీడ పడుటకు నాలుగుగంటల ప్రొద్దైన నై యుండవలయును. తీరమున దిగి వనము లందు సంచరించి కొండ యెక్కి యింత యాలోచన చేసినను ఇంకను బ్రొద్దు గ్రుంక లేదని చెప్పుటచేఁ దీరమున దిగు నప్పటికి నాలుగు గంటల ప్రొద్దై యుండును. కావున నుదయ మెనిమిది గంటలకు బయలుదేఱి నాలుగు గంటలకుఁ దీరమున దిగెనని చెప్పవచ్చును. అటయిన నెనిమిది గంటల కాలము సముద్రము దాటుట యందుఁ బట్టెనని యెంచవగు. ఇందొక గంట కాలమైన విఘ్నములచే వ్యర్థమైయుండు ననుకొన్నను నేడు గంటల కాలములో రెండువందల యేఁబది మైళ్ళు ప్రయాణించె నని యెంచవగు. అనఁగా సరాసరి గంటకు నధమపక్షమున ముప్పదియాఱు మైళ్ళు పోయెనని చెప్పనగు. ఇది గొప్పగాదు. మరలి వచ్చునప్పు డింతదూర మొక గంటలో వచ్చెను.

తే. సూర్యుఁ డస్తగతుండైనఁ • జూచి పిదప, హనుమ యద్భుతగతిఁబిల్లి • యంతరూపుఁ
గొనిప్రదోష కాలంబున • దనుజపురముఁ, జొచ్చెనొకగంతు వెసవైచి • చూచె దాని.

అర్థములు. ప్రదోషకాలంబునన్ = "త్రిముహూర్తం ప్రదోషస్స్యా ద్భానావస్తంగతే సతి" సూర్యాస్తమానానంతరము మూఁడు ముహూర్తముల కాలము ప్రదోష మనఁబడును. "ప్రదోషో స్తమయా దూర్ధ్వం ఘటికాద్వయ మిష్యతే" ఇది గాడమతము. చొచ్చెన్=ప్రవేశింపఁ బ్రయత్నించెను. లంకా ప్రవేశము ౧౮ ర వ

పద్యంబునఁ జెప్పఁబడును గావున నిచటఁ దత్ప్రయత్నమున దానికి సమీపమునకుఁ బోయె నని గ్రహింపవలయును.

తా త్ప ర్య ము.

సూర్యుఁ డస్తమింపఁగాఁ జూచి పిదప హనుమంతుడు పిల్లియంతరూపము ధరించి ప్రదోష కాలంబున లంకఁ బ్రవేశించుటకై దానికి సమీపప్రదేశమునకు నొక గంతు వైచెను. అనఁగాఁ గొండదిగి నడచిరాలేదని భావము.

> "భోజనం మైథునం యానం, మభ్యంగం హరిదర్శనమ్
> అన్యాని శుభ కార్యాణి, ప్రదోషే నైవకారయేత్."

భోజనము, మైథునము, ప్రయాణము, తలంటు, హరిదర్శనము మొదలగు శుభకార్యములను బ్రదోషవేళ చేయరాదుకదా! ఎట్లు హనుమంతుఁ డీ కార్యము చేయఁబూనెను?

> 'అర్చకాన్ పరిచారాంశ్చ, వైష్ణవాన్ జ్ఞానినో యతీన్
> దాసీదాసాదికాంశ్చైవ, ప్రదోషో నతు బాధతే.'

అర్చకులను, బరిచారకులను, వైష్ణవులను, జ్ఞానులను, సన్న్యాసులను, దాసీదాసులను, బ్రదోషము బాధింపదను నపవాదముండుటచే హనుమంతుఁడు జ్ఞానియు వైష్ణవుఁడు రామదాసుఁడు నగుటచే స్వామికార్యమందుఁ బ్రదోషబాధ యాయనకు లేదు.

—• హనుమంతుఁడు లంకలోఁ బ్రవేశించుట. • —

సీ. నలుచదరంబులై • నలువొందుబాటలు, ప్రాసాదమాలావి•రాజితములు
స్వర్ణరాజతమహా• స్తంభశోభితములు, శాతకుంభగవాక్ష•సంయుతంబు
లగుచు నే డెనిమిది•యంతస్తు లేపారు, గంధర్వనగరనీ•కాశసౌధ
పాళులు గలిగి స•త్స్ఫటికసుసంకీర్ణ, కనక వైడూర్యము•క్తాప్రవాళ

తే. భూమికాసురమందిర•పుంజ మమరఁ, జిత్రతోరణ పంక్తులు • చెలువు మీఱ
నెపుడు సమలంకృతం బయి•యాఢ్యశౌర్య, నిష్ఠురోదగ్రరాక్షసా•న్వీత మగుచు.

అర్థములు. ప్రాసాద మాలా విరాజితములు=ఇది బాటలకు విశేషణము = మేడల వరుసలచేఁ బ్రకాశించునవి, ఇది నాలవపాదమందలి కలిగినో నన్వయము. స్వర్ణ రాజత మహా స్తంభశోభితములు=బంగారు వెండిలోఁ జేయఁబడిన గొప్ప స్తంభములచేఁ బ్రకాశించు నవియు, శాతకుంభ గవాక్షసంయుతములు=బంగారు కిటికీలతోఁ గూడినవియు, గంధర్వనగర నీకాశ = గంధర్వనగరములతో సమానమైన, సౌధపాళులు = మేడల వరుసలు, గంధర్వనగరము = రత్నమయములైన గోపురముల మేడలవలె నాకాశమున నొకప్పుడు మబ్బులు కనఁబడును. అట్టి సన్నివేశమును గంధర్వనగర మని పేరు. అది చూచుటకు మిగుల నాశ్చర్యకరముగ నుండును.

"అనేక రత్నాకృతి ఖే విరాజితే, పురం పతాకాధ్వజ తోరణాన్వితమ్,
యదాతదా హస్తి మనుష్యవాజినాం పిబ త్యపూర్వం రణే వసుంధరా."

యను వాక్యము ప్రమాణము.

అది కనఁబడె నేని భూమి నెత్తుటఁ దడియును. సత్ +స్ఫటికము=మంచిస్ఫటిక ములతో, సుసంకీర్ణ=బాగుగా వ్యాపించిన, కనక వైడూర్య ముక్తాప్రవాళభూషిత = బంగారు, వైడూర్యములు, ముత్యములు, పగడములు వీనిచే నలంకరింపబడిన, అసుర మందిర పుంజంబు=రాక్షసుల యిండ్ల గుంపులను, ఈడ్య=కొనియాడఁదగిన, శౌర్య= పరాక్రమముచే, నిష్ఠుర=కఠినులును, ఉదగ్ర=భయంకరులు నగు, రాక్షస=రాక్షసు లచే, అన్వితము=కూడినది.

తా త్ప ర్య ము.

మేడలవరుసలచే ప్రకాశించుచు నలుచదరంబులైన బాటలును, బంగారు వెండి స్తంభములచేఁ బ్రకాశించుచు బంగారు కిటికీలు గలిగి ఏడెనిమిది యంతస్తులు గలవై గంధర్వ నగరములవలె నుండు మేడలును గలిగి స్ఫటికములు పఱువఁబడినవై బంగారు, వైడూర్యములు, ముత్తెములు, పగడములు వీనిచే నలంకరింపఁబడిన రాక్ష సుల యిండ్లవరుస లొప్పుచుండఁగాఁ జిత్రములైన తోరణములు గలిగి సర్వదా యలంకరింపఁబడి శ్లాఘింపఁదగి పరాక్రమము గల కఠినులైన రాక్షసులచేఁ గూడినదై.

తే. అద్భుతంబు నచింత్య మై • యసురనాథ
రక్షితం బైన లంకాపు•రంబుఁ జక్కఁ
గాంచి దైన్యంబు నొందియు • తన్మారుతాజుఁ
గనఁగఁ గోరుట సంతోష•కలితుఁ డయ్యె. ౧౬.౧

అర్థములు. అద్భుతంబు = ఆశ్చర్యకర మైనది, అచింత్యము = ఇట్టిదని యూహింప రానిది- చక్కఁగాంచి = ఇదివఱకు దూరమునుండి చూచిన వాఁడు ఇప్పుడు సమీపమునకు వచ్చి చూచుచున్నాఁడు కావున బాగుగఁ గనఁబడెను.

తా త్ప ర్య ము.

ఆశ్చర్యకరమై యిట్టిదని యాలోచించి తెలిసికొన రానిదై రావణాసురుచేత రక్షితంబైన లంకాపురమును సమీపమునకు వచ్చిన వాఁ డగుటచేఁ జక్కఁగా జూచి దీని నేమి? సాధించుట యన నేమి? ఇది సాధ్యముగునదిగాఁ దోఁపలేదే యని వ్యసన పడిన వాఁడయ్యు సీతాదేవి యిందున్నదికదా; ఆమెను నేను దర్శింప వలెగదా యను కోరికతో సంతోషించిన వాఁడయ్యెను.

క. కువలయ బాంధవుఁ డప్పుడు, ప్లవగునకుం దోడుపడెనకి•భావంబున నా
భువి దివిఁ గాంతులఁ గప్పుచు, నవురుగఁ దోతెంచెఁ జక్క•చాలులనడుమన్.

అర్థములు. కువలయ బాంధవుఁడు = కలువల చుట్టము, చంద్రుఁడు.

తాత్పర్యము.

అప్పుడు చంద్రుడు సముద్రమైనాక సూర్యులవలె హనుమంతునకు దోడు పడుటకై వచ్చెనా యేమి యన్నట్లు భూమిని నాకాశమును గాంతులచేఁ గప్పుచుఁ జుక్కలనడుమఁ జక్కఁగాఁ గానవచ్చెను. ఇది ఫాల్గుణశుద్ధ త్రయోదశీ తిథి. రాత్రి పేడున్నర గంటలకాలము. ఆశ్వయుజశుద్ధ త్రయోదశి రాత్రి తొమ్మిది గంటలవేళఁ జంద్రునిఁ జూచుచు నీ వ్యాఖ్య వ్రాయఁబడెను. చంద్రబింబము నిర్మలముగానున్నది. వెన్నెలయు శుభ్రముగా నున్నది.

తరలము. జలజకాంతియుఁ బాలడాలు బి•సంబు డంబును నింబుగాఁ
కలికిరూపునఁ గానవచ్చి ప్ర•కాశమానుఁడు నో శశిన్
వలిముఖాగ్రణి సారసాకర•వారిఁ గ్రీడఁ జరించు నా
జలజసంభవు తేజి యట్టులు • సంతసంబునఁ గన్గొనెన్. ౧౬.౩

అర్థములు. జలజకాంతియు = శంఖము యొక్క కాంతి, పాలడాలు = పాలకాంతి, బిసంబు డంబు = తామరతూఁడు కాంతి, ఇంబుగన్=మనోహరముగా, కలికి రూపునన్ = ఒప్పిదమైన యాకారముచే, సారసాకర వారిన్ = తామరకొలని నీటియందు, జలజసంభవు తేజి = బ్రహ్మవాహనము హంస.

తాత్పర్యము.

శంఖము, పాలు, తామర తూఁడు వీనివంటి తెల్లని కాంతి గలవాఁడై మనోహరరూపంబునఁ గాన వచ్చి ప్రకాశించు చంద్రుని వానరశ్రేష్ఠుఁ డగు హనుమంతుండు తామరకొలని నీటియందుఁ గ్రీడించు హంసవలె సంతోషముతోఁ గనుఁగొనెను.

తరలము - నభరసజజగ - పండ్రెండవయింట యతి, "కౌముదీ వితానము నంబరమంత వెదఁజల్లుచు విష్ణుపద మధ్యగతుండగు నంశుమంతునిఁ జూచె ననియు గలదు గాన నస్తమయ పర్యంతము వెలుపల నుండియు ప్రదోషసమయమున లంకను బ్రవేశించు వఱకు చంద్రుఁడు విశేషకాంతి గలవాఁడుగా నుండెననియు, మీఁది మీఁదికిఁ బోవుచుండె ననియు, శంఖక్షీర సమాన వర్ణములు గలవాఁ డనియు, వర్ణించినందున నస్తమయమునకుఁ బూర్వమే యుదయింపని యెడల ప్రదోషసమయము (రాత్రి ౹ గడియల) వఱకు మధ్యంగతుఁడుగ నుండఁజాలఁడు గాన పగలిరువదినాలుగు గడియలకు నుదయించిన యెడ చంద్రోదయానంతరము 10 గడియలకు (రాత్రి ౹ గడియలకు) ఖగోళమున మీఁది మీఁదికి రాఁగల వాఁడుగ నుండును. కాంతియు విశేషముగ నుండును గాన నదియు వసం॥ ఫాల్గున శుద్ధ త్రయోదశి యని నిర్ణయింప వచ్చును. ఒకవేళ తత్పూర్వము దశమి మొదలగు తిథులనుగాని తత్పరము చతుర్దశి మొదలగు తిథులనుగాని గ్రహించితిమా యొక విధమున వ్యవధాన మధికముగను, ఇంకొకవిధమున వ్యవధానము లేకుండుటయుం

గలుగును. లంకనుండి వాయుసూనుఁడే తెంచిన మఱుదినము యుద్ధయాత్ర నిర్ణయమునకు విరోధము రాకుండ విచారించినచో నీ త్రయోదశి తిథియే యుక్తము గాన స్థిరపఱుపనైనది" (శ్రీరామ కాలనిర్ణయ బోధిని పు. ౨౯.)

3-వ సర్గము.

సీ. లంబమానాంబుద•లంబలంబాగ్రంబు, నందుండి రేయి వ•నావళులను
జారుతోయంబుల • శారదాబ్దప్రఖ్య, భవనంబులను నబ్ధి•పవనములను
సాగరోపమమహో•చటుల ఘోషంబుల, రమ్యసుద్వారతో•రణచయముల
మందమారుతముల • మహితజాంబూనద, మయగృహప్రాకార•మంటపములఁ

తే. గింకిణీజాలరవములఁ • గీర్తి తేంద్ర
నగరనిభ మయి నిస్తుల • నాగరాజ
రక్షితాహిపురాభమై • రమణ మీఱు
పట్టనముఁ జొచ్చెఁ గన్గొంచుఁ • బ్రాజ్ఞవరుఁడు. ౧-౪

అర్థములు. ౧-౪ పద్యమందు హనుమంతుఁడు లంకాప్రవేశమునకు యత్నించి పురము సమీపమునకుఁ బోయెనని చెప్పఁబడెను. దానినే విపులీకరించుచున్నాఁడు.

లంబమాన = వ్రేలాడుచున్న, అంబుద = మేఘమువలె, లంబ=దీర్ఘమైన, లంబాగ్రమునందుండి = లంబపర్వతముకొననుండి, శారదాబ్దప్రఖ్య = శరత్కాల మేఘములవంటి, భవనంబులను = మేడలచేతను, సాగరోపమ = సముద్రధ్వనితో సమానమైన, అబ్ధిపవనములను=సముద్రపుగాలిచేతను, మహోచటుల ఘోషంబులన్= గొప్పదై సర్వత్రవ్యాపించిన శబ్దముచేతను, రమ్య= మనోహరములయిన. సుద్వార తోరణచయములన్ = మంచివాకిండ్లు తోరణములచేతను, మందమారుతములన్ = మెల్లనిగాలిచేతను, మహిత = గొప్పవగు, జాంబూనదమయ = బంగారుతో నిండిన, గృహప్రాకారమంటపములన్ = ఇండ్లు ప్రాకారములు మంటపములచేతను, కింకిణీజాల రవములన్=చిఱుగజ్జెలగుంపుల ధ్వనులచేతను, కీర్తిత = పొగడ్తకెక్కిన, ఇంద్రనగర నిభము=అమరావతి సమానము, నిస్తుల = అసమానమైన, నాగరాజరక్షిత = సర్పరాజగు వాసుకిచే రక్షింపఁబడిన, అహిపురాభమై=భోగవతీపట్టణముతో సమానమై, ప్రాజ్ఞవరుఁడు=బుద్ధిమంతులలో శ్రేష్ఠుఁడు. ఇది కర్తృ పదము.

తాత్పర్యము.

బుద్ధిమంతులలో శ్రేష్ఠుఁడగు హనుమంతుఁడు రాత్రికాలమున వ్రేలాడుచున్న పర్వతమువలె దీర్ఘమైన లంబ పర్వత శిఖరమునుండి వనముల వరుసలను, మనోహరములైన నీళ్ళచేతను శరత్కాలమేఘమువలెఁ దెల్లనగు నిండ్లచేతను సముద్రఘోషముతో సమానమైన గొప్ప ధ్వనులచేతను ఇంపైన వాకిండ్లు తోరణములచేతను మెల్లగా వీచు గాలులచేతను, బంగారు మయములైన గొప్ప యిండ్లు, చుట్టుగోడలు,

మంటపముల చేతను, చిఱుగజ్జెల రవళిచేతను పొగడ్తకెక్కిన యమరావతీ భోగవతీ పురములతో సమానమై యందముచేత నతిశయించు లంకాపట్టణమును బ్రవేశింప నారంభించెను.

క. అలకాపురముం బోలుచు, సలలిత మై పుష్టసైన్య•సంఘుష్టం బై
కలితతటిద్ఘన మై గ, జ్జెలరవములఁ దీఱె నౌర • చిత్రం బనుచున్. ౧౬

అర్థములు. సలలితమై చక్కఁదనముతోఁ గూడినదై, పుష్టసైన్య సంఘుష్టంబై = బలసిన సేనలచే ధ్వనింపఁబడినదై, కలితతటిత్ ఘనమై = మెఱుపులతోఁ గూడిన మేఘము వంటిదై.

తాత్పర్యము.

అలకాపురముతో సమానమై, యందమై బాగుగఁ బోషింపఁబడుటచే బలసిన సేనల ధ్వని గలదై, మెఱుపులతోఁ గూడిన మేఘము వంటిదై, గజ్జెల ధ్వనులచే నతిశయించి యున్నది. ఏమీ చిత్రము. ఇది హనుమంతుని స్వగతము. కవి వాక్యము గాదు.

—• హనుమంతుఁడు ప్రాకారంబునఁ జేరి యాలోచించుట •—

సీ. చని యిట్లు ప్రాకార•సన్నివేశముఁ జేరి, కలయంగఁ గాంచె లం•కాపురంబు
స్వర్ణకవాటముల్ • వైడూర్యవేదికల్, గురువజ్రముక్తాశ్మ•కుట్టిమంబు
లపరంజిమెఱుగుదిం•డ్లమలసోపానముల్, మింటి కెగురుమాడ్కి•మెఱయుచున్న
వరచతుశ్శాలలు • వరహంసమాయూర, కలకలార్భటులు నా•కసము నిండఁ

తే. తూర్యభూషణరవములు • తోరములుగఁ, గలిమి వస్వౌకసార నాఁ•గ్రమమైన
విబుధశాత్రవనగరంబు•పెంపునకును, మదిని హర్షించి యా పావ•మాని దలఁచు.

అర్థములు. ప్రాకార సన్నివేశము = ప్రాకార సమీపమున నున్న బయలు, వేదికల్ = అరుఁగులు, గురువజ్ర ముక్తాశ్మ కుట్టిమంబులు = గొప్పవగు వజ్రములు ముత్తెములు వీనిచేతను నితర రత్నముల చేతను గట్టఁబడిన నేలలును, వరచతుశ్శాలలు = శ్రేష్ఠములై నలు దిక్కులయందు నభిముఖముగా నడుగు నెడము విడిచి కట్టిన యిండ్లు. "సంజవనం త్వి దమ్ చతుశ్శాలమ్" అని యమరకోశమున చతుశ్శాల శబ్దము నపుంసకముగాఁ బఠింపఁబడినను పా. చతుశ్శాలా యని లింగాభట్టీయము. ఆబంతో వా ఇతి వాక్లీబత్వమ్ అని సుధా. తూర్య=వాద్యముల, 'వస్వౌకసారా = ఇంద్రపురము శక్రస్య పూర్వస్యాం దిశి మైపురీ' తూర్పుదిక్కున నుండు ఇంద్రునిపురము. "వస్వౌకసార" అను పురాణ వచనము, వస్వౌకసారా శక్రస్య యామ్యా సంయమినీ తథా, సుఖా జలేశస్య, సోమస్య చ విభావతీ" యను విష్ణు పురాణ వచనము స్మరించునది.

ఇంద్రుని పట్టనముపేరు వస్వౌకసార, యముని పట్టనము సంయమని, వరు

గుని పట్టనము సుఖ, సోముని పట్టనము విభావతి, అలకాపురికిని వస్వౌకసార యను పేరుగలదు. పావమాని = ఆంజనేయుఁడు, పవమానపుత్రుఁడు = పావమాని, అపత్యార్థకతద్ధితము.

తాత్పర్యము.

ఇట్లు మనస్సులో ననుకొనుచుఁబోయి ప్రాకారసమీపమున నున్న బయలు చేరి లంకాపుర మంతయుఁ బాఱఁజూచెను. బంగారు తలుపులు, వైడూర్యపు టరుఁగులు, గొప్ప వజ్రములచే ముత్యములచే నితర రత్నములచేఁ గట్టఁబడిన నేలలు, బంగారు టొఱగు దిండ్లు, శుభ్రములైన సోపానములు, ఆకాశమునకెగిరి పోవుచున్నట్టులుండు భవంతులు, హంసలయు, నెమిళ్ళయుఁ గలకల ధ్వనులు నాకాశము నిండ, వాద్యములయు భూషణములయు చప్పుడులు నతిశయింపఁగా నింద్రుని పురమునఁ దగి మనోహరమైన రావణుని పట్టనము గొప్పదనమును మిగుల సంతోషించి హనుమంతుఁ డిట్లు తలఁచెను.

ఉ. ఎప్పుడు విచ్చుకత్తులు వ•హించి చరించు బలంబు గావఁగా
నిప్పురి గెల్వ శక్య మగు•నే పరు లేరికి నైన బల్మి నై
జొప్పడు నంగద ద్వివిద•సూర్యజమైంద సుషేణఋక్షులున్
దప్పక తూఱఁగాఁ గుముద•తక్కుశపర్వులుఁ గేతుమాలుఁడేన్. ౧౯

అర్థములు. బలంబు = సేన, తూఱఁగాన్ = ప్రవేశింపఁగా.

తాత్పర్యము.

ఒఱదూసిన కత్తులు చేతఁబట్టుకొని తిరుగుచున్న సేన రక్షించుచున్న యీ పట్టనము బలముచే గెల్వ నెవరికి సాధ్యముగాదు గాని దీనిని నంగదుఁడు ద్వివిదుఁడు సుగ్రీవుఁడు మైందుఁడు సుషేణుఁడు ఋక్షుఁడు కుముదుఁడు కుశపర్వుఁడు కేతుమాలుఁడు వీరు ప్రవేశింపఁగలరు. తొలుత లంకాపురిని జూడఁగానే హనుమంతుఁ డధైర్యపడి నలుగురు మాత్రము (౧౪౯ ప.) సముద్రముదాఁటి లంకయొద్దకు రాఁగలరని తలఁచెను. ఇప్పుడు తొమ్మిదిమంది లంకలోఁ బ్రవేశింపఁ గలరని తలఁచుచున్నాఁడు. కార్యభార మెఱుంగని మూఢుఁడు తొలుత నుత్తరకుమార ప్రజ్ఞలు పలికి యావలఁ గార్యము చేయవలసి వచ్చినప్పుడు వెల్లకిలఁబడును. ఆలోచనగల బుద్ధిమంతుఁడు కార్యభార మాలోచించి యీ కార్యము మనవలన నగునా యని తొలుత జంకును. కార్యము చేయక తప్పదు కావునఁ బనిలో దిగి కొంచెము కొంచెము చేయసాగి క్రమక్రమముగా ధైర్యము తెచ్చుకొని కార్యమంతయు సాధించును. ఇన్ని యాలోచనలు చేసిన వాఁడు తుదకుఁ దా నొక్కఁడే రాక్షసుల నందఱను జయించి లంక కాల్చి వచ్చెనుగదా. ఇది కార్యసాధకుల లక్షణము.

క. అని బలశాలుల వానరు, లను నెన్ని సుమిత్రాసుతుబ•లంబును శ్రీరా
ముని శౌర్యగరిమ దలఁచుచు, ననఘుఁడు సంతుష్టచిత్తుఁ•డగుచుం బిదపన్.

తాత్పర్యము.

ఈ ప్రకారము లంకకు రాఁగల బలవంతు లగు వానరుల లెక్కించి లక్ష్మణుని బలము శ్రీరామచంద్రమూర్తి శౌర్యము నాలోచించి భయములేదు, వారువచ్చిన జయింపఁగలరని సంతోషించిన వాఁడయ్యెను.

రామ లక్ష్మణులైన నను నిచ్చట నేమిచేయఁగల రని యధైర్యము పడిన వాని కిప్పుడు కొంచెము ధైర్యము వచ్చెను.

క. వెండియుఁ గని మణివాసో, మండిత గోష్ఠావతంస • మణి యంత్రసభా
కాండ స్తని భూషితవే, తండగమన యట్లు వెలయు • దశకంఠపురిఁ. ౧౯

అర్థములు. మణివాసస్ మండిత=రత్నములను వస్త్రములచేతను నలంకరింపఁ బడినది. గోష్ఠావతంస=పశువుల కొట్టము లనెడి యలంకారముగలది, యంత్రసభా కాండ స్తని=యంత్రగృహ సమూహము లనెడి స్తనముల గలది. కావుననే; భూషిత వేతండగమన=అలంకరింపఁబడిన స్త్రీ.

తాత్పర్యము.

మఱియు సమీపించి పోయి మణు లను వస్త్రములచేఁ గప్పఁబడినదియుఁ బశువుల కొట్టము లనెడి శిరోభూషణముల గలదియు యంత్రశాల లనెడి స్తనములు గలదియునై యలంకరింపఁబడిన స్త్రీవలె నుండు రావణుని పట్టనమును జూచెను.

లంకా నగరమును స్త్రీగా వర్ణించుట లంకాధిదేవత రాక సూచించుటకే. లంక స్త్రీవలె నున్నది గదా యనుకొనఁగానే లంక స్త్రీయై రానేవచ్చెను.

—• హనుమంతుఁడు లంకాధిదేవతను జయించుట. •—

క. నవరత్నకలితశాలా, నివహానిరస్తాంధకార • నిచయం బగు నా
దివిజారిపురముఁ జొచ్చెడి, ప్లవగు నిజాకార మూని • లంకయుఁ జూచెన్. ౨౦

అర్థములు. నవరత్నకలిత=నవరత్నములతో నిర్మింపఁబడిన, శాలానివహ = ఇండ్లసమూహముచే, నిరస్తాంధకార నిచయంబు = కొట్టివేయఁబడిన చీఁకటి గుంపు గలది. నిజాకారము = తన స్వస్వరూపము.

తాత్పర్యము.

నవరత్నములచేఁ గట్టఁబడిన యిండ్ల సమూహములచేఁ జీఁకటి యనునది లేకుండఁ జేయుచున్న యా రావణాసురుని పురము నందుఁ బ్రవేశించు వానరుని లంకాధి దేవత లంక యను పేరు గలది తన స్వస్వరూపములోఁ జూచెను. లంకను హనుమ చూచెను. హనుమను లంక చూచెను.

చ. కనుఁగొని కింక లంకయు వి • కారముఖంబును ఘోరరూపముం
బెనఁగొన లేచి, యా ప్లవగ • పేరున కడ్డము నిల్చి, గర్జలన్
నినుచుచుః బల్కెనోరి విను • నీల్గక మున్నె యెవండ వీ వహో
వనచర యేమి కార్యముగ • వచ్చితి విచ్చటికి న్వచింపరా. ౨౧

అర్థములు. కింకన్ = కోపముచే. లంక యనునది గ్రామదేవత. గ్రామము రక్షించుచు నూరి వెలుపల నుండును.

తా త్ప ర్య ము.

ఇట్లుమాచి లంక కోపించి చూచుట కసహ్యమైన ముఖము భయంకర రూపము దాలిచి హనుమంతున కడ్డమువచ్చి నిలఁబడి సింహనాదములు చేయుచు నిట్లులనెను. ఓరీ ! నీ వెవ్వఁడవు ? ఏమిపనిగా నిచటికి వచ్చితివి? నీవు చావకముందే చెప్పుము.

క. ఏవేళల నేవోటుల, రావణబలగుప్త మగుచుఁ • గ్రాలెడులంకన్
నీవా చొచ్చెడివాఁడవు, దేవాదులు చొచ్చి బ్రతుకఁ • దెరువుం గలదే. ౧౭౨

అర్థములు. రావణబలగుప్తము=రావణు సేనలచే రక్షింపబడునది.

తా త్ప ర్య ము.

అన్నివేళలందును నన్నిస్థలములందును రావణుని సేనలు రక్షించుచున్నలంకను నీవా ప్రవేశింపఁ గలవాఁడవు. దేవతలు లోనగువారు ప్రవేశించి బ్రదుకఁగలరా ?

చ. అనిన వచింతు నా చరిత • మంతయు నైన విరూపనేత్రవై
పని మొదిగల్గి యీ నగరి • వాకిట నుండెద ? వేల యొప్పుచున్
నను నిటు లడ్డగించెదవు • నా కిది తెల్పు మటన్న నా మరు
• త్తనయునిఁ గాంచి లంక యనె • దారుణభాషలఁ గ్రోధదీప్తయై. ౧౭౩

తా త్ప ర్య ము.

అని యిట్లు లంక యడుగఁగా హనుమంతుఁ డిట్లనెను. ఓసీ ! నా కథ చెప్పెదనుగాని యీ వికారపుఁగన్నులతో నీ పట్టనము వాకిటనుండు నీ వెవ రెవు! ఏల యిందున్నావు? ఏల యీ ప్రకారము ఒప్పుచు నా కడ్డము వచ్చెదవు ? ఊరనియుండిన నెవరైన రాక పోక యుండురా ? చెప్పవలసిన దని యడుగఁగా నా మారుతిని జూచి భయంకరవాక్యములచేఁ గోపముచే మండిపడుచు లంక యిట్లనియె.

ఉ. రావణునాజ్ఞ మోచి నగ • రం బిది కాచెద నెల్లవేళలన్
నీ విటు కన్నుఁ బ్రామి నను • నేరుతె దీనిఁ జొరంగ ? నిప్పుడే
చావఁ గలాఁడ వోరి వన • చారి! స్వయంబుగ నేన లంకరా
నా విధ మింత, నీకథ వి • నన్ వచియింపు మటన్న నాతఁడున్. ౧౭౪

అర్థములు. కన్నుఁబ్రామి=మోసగించి.

తా త్ప ర్య ము.

రావణాసురు నాజ్ఞ శిరసావహించి నే నీ పట్టనము సర్వకాలముల రక్షించెదను. నన్నుఁ గన్నులు కప్పి నీవు ప్రవేశింప సాధ్యమా? ఓరీ కోఁతీ ! నీ విప్పుడే చావఁగలవు. నేనే లంకనురా. ఇది నా చరిత్రము. నీ వెవ్వఁడవో యిఁకఁ జెప్పుము.

ఉ. లంక వచించినట్టి నుడు • ల న్విని కొండవ నిల్చి యింతయేన్
జంకక యోషిదాకృతి నె • సంగెడు దానిని జూచి వాహినీ
సంకులితాట్టగోపురవి • శాల గృహాంగణనిష్కుటోత్కరా
లంకృత యైన తనర్చు పురి • లంకఁ గనుంగొను వేడ్క వచ్చితిన్. ౧౭౫

అర్థములు. నుడులన్=మాటలను, యోషిదాకృతిన్=స్త్రీరూపమున, వాహినీ=సేనలతో, సంకులిత=సంకులమైనదై (సమ్మర్దమైనదై) అట్ట = యుద్ధార్థము వాకిటి మండపము మీఁదఁగాని, కోత్తళముమీఁదఁగాని యేర్పడిన గదులచేతను, అంగణ = ముంగిళ్ళచేతను, నిష్కుట=ఇంటిచుట్టు నుండు తోఁటలచేతను, అలంకృతయై=అలంకరింపఁబడినదియై.

తాత్పర్యము.

లంక చెప్పినమాటలు విని హనుమంతుఁడు కొండవలెఁ గదలక ధైర్యమున నిలిచి కొంచెమైనను సందేహింపక స్త్రీ యాకారముతో వచ్చినదానిని జూచి సేనలతోఁగూడిన యట్టములచేతను గోపురములు వెడలుపాటి యిండ్లు ముంగిళ్లు తోఁటలు వీనిచేతను నందమైన లంకను జూచి పోవు కోరికతో వచ్చితిని.

క. నావుడు నను నిర్జింపక, యే వడువున నీవు దుర్మ • తీ! చూచెద నీ
రావణపాలితపుర మని, యీ విధమునఁ బరుషభాష • లింతి యనంగన్. ౧౭౬

అర్థములు. నిర్జింపక=గెలువక, ఏవడువున=ఏవిధముగ.

తాత్పర్యము.

అని హనుమంతుఁడు చెప్పఁగా నదియును నన్ను గెలువక యేవిధముగా నో ద్రోహబుద్ధి గలవాఁడా! రావణుఁడు రక్షించు పురములోనికిఁ బోఁగలవు, అని యీ విధముగా నది కఠినముగా మాటలాడఁగా.

క. రక్కసిఁ గనుగొని యిట్లను, నక్కపివీరుండు పురము • నంతయుఁ గని నే
గ్రక్కున వచ్చినత్రోవం, ద్రొక్కెద నన లంక భయద • రోషార్భటులన్. ౧౭౭

తాత్పర్యము.

ఆ రాక్షసిని జూచి హనుమంతుఁ డిట్లనెను. ఓసీ! నే నీ పట్టణమంతయుఁ జూచి శీఘ్రముగా వచ్చిన త్రోవఁబోయెదను, అని చెప్పఁగా లంక భయంకరమైన రోషముచేఁ గలుగు ధ్వనులు చేయుచు.

క. అరచేతఁ గొట్టె వానర, వరునిం గపి యిట్లు దెబ్బ • పడి బొబ్బిడుచున్
దరుణి యని తీవ్రరోష, స్ఫురితుఁడు గా కెడమముష్టిఁ • బొడిచెం గినుకన్. ౧౭౮

తాత్పర్యము.

అరచేతితో వానరశ్రేష్ఠుని గొట్టెను. ఇట్లు దెబ్బదిని బొబ్బపెట్టి యిద్ది యాఁడుది, దీనిమీఁదనా నా బలము చూపవలె నని తలఁచి విశేషము కోపింపక యెడమచేతి పిడికిట దానిని బొడిచెను.

—• లంక దన్ను రక్షింప హనుమంతుని వేఁడుట. •—

క. ఆముష్టిఘాతముననే, భూమింబడ వివృతవక్త్రిఁ • బొలఁతుక ననుకం
పామతిఁ గనెఁ బావని యా, భామిని గతగర్వ యగుచుఁ • బలికె నతనితోన్.

అర్థములు. వివృతవక్త్రి=నోరు తెఱచుకొనినది.

తాత్పర్యము.

ఆ పిడికిటి పోటుననే యది నోరు తెఱచికొని నేలమీదఁ బడఁగా హనుమంతుడు దానిని దయతోఁ జూచెను. అదియును గర్వ ముడిగినదై యాయనతో నిట్టు లనెను.

క. కరుణింప వయ్య వానర,వర! కావుము నన్ను వీర్య • వంతుఁడ వెందున్
దరుణులఁ జంపఁగ రా దను, మరియాదను దాఁట రెపుడు • మహితబలాఢ్యుల్.

తాత్పర్యము.

వానరేంద్రా! నన్నుఁ గావుము. నా యందు దయ దలఁపుము. నీవు విశేష పరాక్రమ వంతుఁడవు. విశేష బల సంపద గలవారు స్త్రీలను జంపరాదను మరియాదను దాఁటరు.

చ. అగచరలోకపుంగవ! స్వ • యమ్ముగ లంకను నేను, పోరిలోఁ
దెగి నను గెల్చి తీవు భవ • దీయపరాక్రమ మేర్పడంగ; ని
న్నగచరుఁ డెవ్వఁ డే గెలుచు • నాఁడు మొదల్ సురవైరికోటికిం
దెగుదలకార్య మబ్బెడి న • నెన్ విధి మున్ను వరంబు లిచ్చుచోన్. ౧౮౧

అర్థములు. అగచర లోకపుంగవ = వానరశ్రేష్ఠా, తెగుదల = నాశమైపోవు విధి = బ్రహ్మదేవుఁడు.

తాత్పర్యము.

వానరశ్రేష్ఠుఁడా! నేనే లంకను. యుద్ధమునందు సాహిసించి నీ బలపరాక్రమములచే నన్నే గెల్చితివఁట. ఇఁక రాక్షసులకీ కష్టమా? నాకు బ్రహ్మదేవుఁడు నగరప్రతిష్ఠయందు వరములిచ్చు సమయంబున నిన్ను నేనాఁడు సీతాదేవిని వెదకుచు క్రోఁతి వచ్చి గెలుచునో యానాఁడు మొదలు లంక నాశ మగునని చెప్పెను.

ఉ. సత్యముఁ జెప్పితి న్విధియు • సత్యము పల్కెను దప్ప దేమిటన్
దైత్యులకున్ దశాస్యునకు • ధారుణికన్యక కారణంబుగా
మృత్యువు దాపరించె నిఁక • నేఁగుము పట్టన మెల్లఁ జూచుమీ
కృత్యము లెల్లఁ దీర్చుకొను • మీ మది చొప్పునఁ గీశపుంగవా. ౧౮౨

తాత్పర్యము.

వానరశ్రేష్ఠుఁడా! నేను సత్యము చెప్పితిని. బ్రహ్మదేవుఁడు యథార్థమే చెప్పెను. అది యేమి చేసినను తప్పదు. సీతాదేవి కారణంబుగా రాక్షసులకు రావణునకు

చావు సమీపించెను. ఇఁక నీవు పురములోనికిఁ బొమ్ము. పట్టణమంతయుఁ జూడుము. నీయిష్ట ప్రకారము నీకుఁ గావలసిన పను లన్నియుఁ జేయుము.

క. శాపోపహతం బగు లం, కాపురముం జొచ్చి జనక • కన్యకఁ గన ని
చ్ఛాపూర్తి నొందవఁ గపికుల, దీప! యథాసుఖముగాఁగ • ద్రిమ్మరు మనినన్.

అర్థములు. శాపోపహతము = నందికేశ్వరుని యొక్కయు, పతివ్రతల యొక్కయు శాపముచేఁ గొట్టఁ బడినది.

తాత్పర్యము.

పతివ్రతలు లోనగు వారి శాపముచేఁ గొట్టఁబడిన లంకాపురముఁ బ్రవేశించి సీతను జూచుటకై నీ కోరిక దీర యథాసుఖముగఁ దిరుగుము, అని చెప్పఁగా;

లంకయును హనుమంతుఁడు బొబ్బలు పెట్టిరి. ఒకరి నొకరు కొట్టిరి. ఇది రాక్షసుల కేల తెలియలేదు. గ్రామ దేవతల యాలయము లూరికి వెలుపల నుండును. ఆ దేవతలు రారాని వారు గ్రామపు పొలిమేర దాఁటి రాకుండఁ బొలిమేర గాచి యుందురు. ఇది యూరి వెలుపలి వృత్తాంతము. దానిలో రాత్రివేళ. ఊరివారి యఱపులలో నీ యఱపులు వారికి వినఁబడి యుండవు. అదియును గాక నెవ్వరు లేనిచోటఁగదా హనుమంతుఁడు ప్రవేశింప యత్నించెను. హనుమంతుఁడు చెప్పక పోయినను బ్రహ్మదేవుని వాక్యముల వలన హనుమంతుఁడు సీతాదేవికై వచ్చెనని లంక తెలిసికొనెను.

లం. ఇది పృథివీ బీజాక్షరము. కావున పృథివీ తత్త్వమును దెలుపు చున్నది. అది కలది లంక=అనఁగా దేహము. హనుమంతుఁడు లంక జయించె ననుటచేఁ దన యందాత్మను వెదకు వాఁడు తొలుత దేహమును జయింపవలె నని యేర్పడు చున్నది. దేహమును జయింపని వాని కాత్మావలోకనము లేదు. ఈ యర్థ మీ క్రింద పద్యమునఁ గాననగును.

—• ౪-వ సర్గము. హనుమంతుఁడు లంకలో సంచరించుట •—

తే. సత్యవిక్రముఁ డైన కే•సరిసుతుండు, కామరూపిణి లంకను • కడిమి గెలిచి
తదయు కాపత్తనంబున•ద్వారమునను, జొచ్చెఁ బ్రాకారమును దాఁటి•శూరవరుఁడు.

అర్థములు. సత్యవిక్రముఁడు = వంచనము లేని పరాక్రమము గలవాఁడు, సత్యమే పరాక్రమముగాఁ గలవాఁడు. కామరూపిణిన్ =కోరిన రూపమెత్తఁగలదానిని. కడిమిన్ =పరాక్రమముచే. అద్వారమునను=వాకిటిలోనుండి గాక యితరమార్గమున. దీనివలన హనుమంతుఁడు రాక్షససంచారము లేనిచోట లంకలోఁ బ్రవేశింప యత్నించె ననియు, ఆ కారణముచే లంకా పరాజయము రాక్షసు లెఱుంగరనియుఁ దెలియ నగు. శత్రుస్థానమును నద్వారముగఁ బ్రవేశింపవలె నని రాజనీతి. కాన హనుమంతుఁడును నద్వారమున లంకఁ బ్రవేశించెను గాని వెఱచి కాదు. 'గ్రామంవా నగరం వాపి,

పత్తనం వా పరస్యహి, విశేషాత్సమయే సౌమ్య, నద్వారేణ విశే న్నృప' యని ప్రమాణము. జరాసంధుని మీఁదికి యుద్ధమునకుఁ బోయినపుడు శ్రీకృష్ణ భీమార్జునులు నద్వారములనే కదా ప్రవేశించిరి. 'అద్వారేణ రిపో ర్గేహం, ద్వారేణ సుహృదో గృహాన్, ప్రవిశంతి నరా ధీరా, ద్వారాణ్యేతాని ధర్మతః॥ భార. సభా.

ఇందు ముముక్షు వగు యోగిచర్య సూచితము. ఎట్లనః— ఆత్మావలోకన పరుఁడు సత్యవిక్రముఁడై యుండవలయును. ఇచ్చట సత్యమనునది యమములు కన్నిఁటికి నుపలక్షణము. 'సత్యేన లభ్య స్తపసా హ్యేష ఆత్మా సమ్యక్ జ్ఞానేన బ్రహ్మచర్యేణ నిత్యం, అంతశ్శరీరే జ్యోతిర్మయోహి శుభ్రో యం పశ్యంతి యతయః క్షీణదోషాః॥ సత్యమేవ జయతే నానృతం, సత్యేన పంథా వితతో దేవయానః,' అను ముండకోపనిషత్తు ప్రకారము ఆత్మ సత్యముచేత తపస్సుచేత జ్ఞానముచేత బ్రహ్మచర్యముచేత లభించును. ఇన్నియు హనుమంతునందుఁ గలవు. కావున సత్యమనునది యిన్నిఁటికి నుపలక్షణము. విక్రమ శబ్దము = 'నాయమాత్మా బలహీనేన లభ్యః' బలహీనులకు నాత్మ లభింపదు అను శ్రుత్యర్థమును బోధించుచున్నది. కేసరిసుతుండు = సింహపుఁ బిల్ల. ఇది సాహసము కలిమి తెలుపుచున్నది.

లంక యగు దేహము ప్రకృతి పరిణామము అది కామరూపిణి గదా. లంకా రక్షః పురీశాఖా శాకినీ కులటాసుచ ॥నానా॥ లంకా శబ్దమునకు అంకటాలనియు నర్థము గలదు. ఈ జీవుని నీ జన్మమున ననుసరించియున్న దేహము మఱుజన్మంబున మఱియొక జీవు నాశ్రయించును. ఈ విధముగ జన్మజన్మమున వేలువేలు జీవుల నాశ్రయించును గావున నీ దేహము అంకటాలి వంటిదే. కడిమిన్=బలముచే నిర్బంధపెట్టి యనఁగా తపస్సుచే దేహమును గెలువవలయును గాని సౌమ్యమార్గమున గెలువరాదనుట సూచితము. పత్తనము=దేహము. పత్ఌ గతౌ అను ధాతువువలన బుట్టినది. దీనికిఁ బోవునది యని యర్థము. దేహము నశించునదియేకదా.

అద్వారమునను=దేహము లోనికిఁ బోవుటకు నవద్వారములు గలవు. ఆత్మయందు మనస్సు పోవుటకీ ద్వారములు పనికిరావు గదా.

ప్రాకారమును దాఁటి=ప్ర+ఆకారము=స్థూలదేహమును భేదించెననిభావము.

క. అగచరపతిహితకరణుం, డగచరవరుఁ డరులమూర్ధ•మందున్ బలిమిన్
దగఁదన డాకాలిని మున్నుగ నుంచి దశాస్యపురము•నం జొచ్చె నిసిన్. ౧౮౫

అర్థములు. అగచరపతి = సుగ్రీవునకు, హితకరణుండు=మేలుచేయువాఁడు, అగచరవరుఁడు=వానరశ్రేష్ఠుఁ డగు హనుమంతుఁడు, అరుల=శత్రువులయొక్క, మూర్ధమందున్=తలలయందు, బలిమిన్=బలముచే, డాకాలిని = ఎడమకాలిని, మున్నుగ నుంచి=ముందుగాఁబెట్టి, నిసిన్=రాత్రివేళ, ఒకఁడు శత్రుదేశమును బ్రవేశించునపుడెడమకాలు ముందుంచవలెను. మేలుకోరు వారియింటఁ బ్రవేశించునపుడు కుడికాలు ముందుంచవలెను. హనుమంతుఁ డీ నీతి ననుసరించెను.

'ప్రయాణ కాలేచ గృహ ప్రవేశే, వివాహకాలేపిచ దక్షిణాంఘ్రిః, కృత్వాఽగ్రతః శత్రుపురప్రవేశే, వామం నిదధ్యా చ్చరణం నృపాలః॥ అని బృహస్పతి వాక్యమిచ్చటఁ బ్రమాణము.

క. పూవులచే ముత్తెంబుల,చే వెలసెడిరాచబాటఁ • జేరి మనోజ్ఞం
జా వీను నాల్గుప్రక్కలఁ, బావని తిలకించి మెచ్చె • భాగ్యోన్నతికిన్. ౧౮౬

తాత్పర్యము.

ఊరిలోనికిఁ బోవుటకై పూవుల చేతను, ముత్తెముల చేతను నొప్పుచున్న రాచబాట చేరి మనోహరమైన యా పట్టనము నాలుగు ప్రక్కలఁ జూచి దాని భాగ్యాధిక్యమునకు నాంజనేయుఁడు మెచ్చుకొనెను.

సీ. తోరంబుగా మ్రోయు•తూర్యనాదంబులఁ, బకపకనవ్వుల•ప్రాభవముల
వజ్రాంకుశనికాశ•వజ్రజాలవిభూష,ణాంచితగృహపయో•దాళికలన
మేఘాళిచే నొప్పు•మిన్నునా విలసిల్లి, మఱి సితాబ్దాభ మై•మహిమమీఱు
స్వస్తికపద్మాఖ్య•వర్ధమానాకృతిఁ, గొమరొప్పు రాక్షస•కూటవితతిఁ
తే. జిత్రమాల్యాభరణములఁ • జెన్నుమీఱు
పురిని గనుఁగొని సంతోష•భరితుఁ డగుచు
సూర్యభవహితకరణుండు • నొచ్చి చూడఁ
గఁ దగె శ్రీరాఘవార్థంబు • కరము నలరె. ౧౮౭

అర్థములు. నవ్వుల ప్రాభవములన్ = నవ్వుల యతిశయములచే, వజ్రాంకుశనికాశ= (౧) వజ్రాయుధాకారము కలవియును, అంకుశముల వంటివియును, (౨) వజ్రముల్లతోఁ జేయబడిన యంకుశములు. (౩) వజ్రమంకుశముగాఁ గల నైరావతము వంటివి, దానివలె శుభ్రమైనవి, వజ్రజాల=వజ్రమణుల సమూహము చేతను, విభూషణ=సొమ్ముల చేతను, అంచిత = ఒప్పిన, గృహపయోద = గొప్ప యిండ్లయొక్క, పయోద శబ్దము శ్రేష వాచకము, ఉపమిత సమాసము, అళి=సమూహముయొక్క, కలనన్=కూడిక చేత, సిత+అబ్ద+అభమై= తెల్లని మబ్బుతో సమానమై, స్వస్తిక, పద్మాఖ్య వర్ధమానాకృతిన్=స్వస్తికమని, పద్మమని వర్ధమానమని రాజ గృహముల పేర్లు, యాకారముల పేర్లు, నలు చదరముగా నున్న రాచ నగరికి స్వస్తికమని పేరు. 'చతుశ్శాలా చతుర్ద్వారా సర్వతోభద్రసంజ్ఞితా। పశ్చిమద్వార రహితా మధ్యావర్తా హయాననా। దక్షిణ ద్వార రహితా వర్ధమానా ధనప్రదా। ప్రాగ్ద్వారరహితా స్వస్తికాఖ్యా పుత్రధనప్రదా॥' యను వాక్య మిటఁ బ్రమాణము. పడమటి వాకిలి లేనిది మధ్యము, దక్షిణ ద్వారము లేనిది వర్ధమానము. తూర్పు ద్వారము లేనిది స్వస్తికము, కూట వితతి = ఇండ్ల సమూహము. శ్రీరాఘవార్థంబు=శ్రీరామచంద్రమూర్తి కార్యార్థమై.

తా త్ప ర్య ము.

విశేషముగ ధ్వనించు వీణెలయు, తాళములయు, మేళములయు ధ్వనులచేతను, బకపక నవ్వుల యతిశయములచేతను, వజ్రాంకుశ సమానములైన వజ్రములచేతను, సొమ్ములచేతను నొప్పుచున్న మేలియిండ్లచేతను, మేఘములచే నొప్పు నాకాశమో యనువట్లు ప్రకాశించి తెల్లని మేఘకాంతి కలిగి యతిశయ మహిమగల స్వస్తికము, పద్మము, వర్ధమానము వను నాకారములు గల రాక్షసుల యిండ్ల సమూహముల చేతను, చిత్రములైన మాల్యములచేతను, భూషణములచేతను కాంతిగల పట్టణమును జూచి మిగుల సంతోషించి సుగ్రీవునకు మేలుచేయగోరు హనుమంతుఁడు శ్రీరామ కార్యార్థమై లోపలికిఁ బోయి చూచుచుఁ బ్రయత్నించి మిగుల సంతోషించెను.

తే. ఈగతిని నింటి కింటికి • నేగుచోటఁ, గనియె నానావిధాకృతుల్ • గలిగి వెలయు
మందిరంబులు ననమాన • సుందరములు, నయనపర్వంబుగా వాయు • నందనుండు.

తా త్ప ర్య ము.

ఈ విధముగ నింటింటికిఁ బోవుచుఁ బెక్కు రూపములు గలిగి యసమానములు సుందరంబులు నగు నిండ్లను గన్నుల పండువుగా వాయుపుత్రుఁడు చూచెను.

ఉ. వీనుల కింపు గూరుప ది • విన్ సురకన్యలువోలె నందుఁ ద్రి
స్థానమనోహరస్వరయు • తంబుగ మాదసమృద్ధదైత్యకాం
తానన లోలి గానరస • మాదట నించుట హారిరత్న కాం
చీనినదంబు నూపురవి • శిష్టఝుళంఝుళ శింజితంబులున్. ౧౪౯

అర్థములు. త్రిస్థాన = ఱొమ్ము, కంఠము, శిరము, ఈ మూఁడు స్థానములఁ బుట్టిన, మనోహర=మనస్సు నాకర్షించు, స్వరయుతంబుగన్=మంద్ర మధ్యమ తార స్వరములతో, మాద, రూ. మదము = మదముచే వృద్ధిపొందిన, దైత్యకాంతానలు= రాక్షస స్త్రీలు, ఆదటన్=ప్రేమతో, హారి=మనోహరమైన, రత్నకాంచీనినదంబు = రత్నములు చెక్కిన యొడ్డాణముల ధ్వని. నూపుర = అందెల, విశిష్ట=శ్రేష్ఠమైన, ఝుళంఝుళ శింజితంబులున్=ఝుళంఝుళ ధ్వనులు, వీరు చిత్రిణీజాతి స్త్రీలు.
"వ్రజతి రతిసుఖార్థం చిత్రిణీ మగ్రయామే, భజతి దినరజన్యోర్హస్తినీం చ ద్వితీయే గమయతిచ తృతీయే శంఖినీ మార్ధ్రభావం రమయతి రమణీనాం పద్మినీం తుర్యయామే." రాత్రి మొదటి యామమున రతి గోరునది చిత్రిణి, రెండవజామునఁ గోరునది హస్తిని, మూఁడవజామునఁ గోరునది శంఖిని, నాలుగవజామునఁ గోరునది పద్మిని.

తా త్ప ర్య ము.

స్వర్గమునందు దేవతాస్త్రీల వలె లంకయందు ఱొమ్ము కంఠము శిరము నను మూఁడు స్థానములయందుఁ బుట్టిన మనోహరమైన మంద్ర మధ్యమ తార ములను స్వరములతోఁ గూడినట్లు పూర్ణమదము గల రాక్షస స్త్రీ లాసక్తితోఁ జేయు గాన ధ్వనులును మనోహరములయి రత్నములు చెక్కఁబడిన యొడ్డాణములందలి చిఱుగజ్జెల ధ్వనులును, అందెల ఝుళంఝుళ ధ్వనులును.

సీ. సోపాననాదముల్ • శూరభుజాస్ఫాలనంబులు భీమకం•ఠరవములును
జాపకమాంత్రిక•స్వనము లాకర్ణించె, స్వాధ్యాయరతుల ని•శాచరేంద్ర
సంస్తవశీలురఁ • జక్కఁగఁ గనుఁగొని, రాజమార్గస్థచ•క్రముల రాజ
చారుల గర్జన్ని•శాటుల దీక్షిత,జటిలముండుల వృష•చర్మధరుల
తే. దర్భముష్టిప్రహారణుల • దహనకుండ
సాధనులఁ గూటముద్గర • శస్త్రధరుల
నొంటి కన్నొకఁ- చెవియు లం•బోదరములు
వ్రేలురొమ్ములుఁ గలవారి • వేడ్కఁగనియె. ౧౫

అర్థములు. సోపాననాదముల్ = స్వర్ణరత్నమయములైన మెట్లకు నందెలు లోనైనవి తగులఁగాఁ గలిగిన ధ్వనులును, సోపానము రూ. సౌపానము. శూరభుజాస్ఫాలనంబులు=శూరులు భుజములు అప్పళించు ధ్వనులు, భీమకంఠరవములును = భయంకర కంఠధ్వనులును, జాపక మాంత్రికస్వరములు = జపముచేయువారి యొక్కయు, వేదాది మంత్రము లుచ్చరించు వారియొక్కయు ధ్వనులును,స్వాధ్యాయరతులన్ = వేదాధ్యయనము చేయువారలను, నిశాచరేంద్ర సంస్తవ శీలురను = రావణుని పొగడువారిని, రాజమార్గస్థచక్రములను = రాచబాటలయందు నడుమ గుంపులుగఁ జేరినవారిని, రాజచారులన్ =వేగువాండ్రను, గర్జన్నిశాటులన్ =సింహనాదము చేయు రాక్షసులను, దీక్షిత జటిలముండులను=దీక్షవహించిన జడదారులను; బోడులను,* వృషచర్మధరులన్ =ఎద్దు చర్మమును ధరించినవారిని, దర్భముష్టిప్రహరణులన్ = దర్భలను పిడికిళ్ళలో నాయుధములుగా నుంచుకొన్న వారిని, దర్భను చేత నుంచుకొని సత్కార్యానుష్ఠానము చేసిన శత్రువులు నశింతురు.

* యథావజ్రం హరేః పాణౌ, తథా విప్రకరే కుశః
ఇంద్రునిచేతి వజ్రాయుధ మెట్టిదో బ్రాహ్మణునిచేతి దర్భయట్టిది. దహనకుండ సాధనులన్ = నిప్పుగుండమే యాయుధముగాఁ గలవారిని, శత్రునాశార్థము నిప్పుగుండమున హోమము చేసి కృత్యను గలిగింతురు గావున వాని నాయుధముగాఁ జెప్పెను. లంబోదరములు=వ్రేలాడు పొట్టలు.

తా త్ప ర్య ము.

అందెలు మెట్టెలు పాముజీలు లోనగు కాలియాభరణములు మెట్లకుఁ దగులఁగాఁ బుట్టిన చప్పుడులు శూరులు భుజములు తట్టుకొనఁగాఁ బుట్టిన ధ్వనులు వీరుల భయంకరములైన సింహనాదములు జపములు చేయు వారియొక్కయు మాంత్రికుల యొక్కయు ధ్వనులను వినెను. వేదాధ్యయనము చేయువారలను, రావణు పొగడు స్వభావము గల వారలను (వీరు రాక్షస వంది మాగధులు) రాచబాటల నడుమ నిలఁబడిన గుంపులను, వేగు వాండ్రను, గర్జించు రాక్షసులను, దీక్ష గొన్న వారిని జడలు పెంచుకొన్నవారిని, బోడి తలల వారిని (రాక్షస సన్న్యాసులు) ఎద్దు చర్మ

ములను ధరించిన వారిని దర్భ పిడికిళ్లు నగ్నికుండములు నాయుధములుగాఁ గలవారిని సమ్మెటలు ఇనుప గుదియలు ధరించిన వారిని, ఒంటికన్ను, ఒంటిచెవి, వ్రేలాడు పొట్టలు, వ్రేలాడుచుండు రొమ్ములు గలవారిని హనుమంతుఁడు చూచెను.

సీ. వికటకరాళుల • విపులకోదండుల, వామనులను భగ్న•వక్త్రయుతుల
ఖడ్గుల ముసలులఁ•గవచులఁ బరిఘాయు,ధులను శతఘ్న్యాయు•ధులను మఱియు
నాధికస్థూలుల • నాతికృశాంగుల, నాతిదీర్ఘుల నాతి • హ్రస్వులను
నాతిగౌరాంగుల • నాతికృష్ణాంగుల, నాతివామనులను • నాతికుబ్జ
తే. కులను బహురూపులను విరూ•పుల సురూపు
లను సువర్చసులను బతా•కినిచయముల
ధ్వజుల వివిధాయుధుల శక్తి•కుజధరులను
బట్టి సాయుధులను గాడ్పు•పట్టి గనియె. ౧౯

అర్థములు. వికట కరాళులన్ = భయంకరములైన మిట్లపండ్లవాండ్రను, విపుల కోదండుల=పెద్దవిండ్లను ధరించినవారిని, వామనులను = పొట్టివారిని, భగ్న వక్త్రయుతులన్=వంకరయగు నోళ్ళతోఁగూడిన వారిని, ఖడ్గులన్=ఖడ్గముల ధరించిన వారిని, ముసలులన్ = రోఁకండ్లను ధరించినవారిని, కవచులన్ = కవచముల దొడిగిన వారిని, పరిఘాయుధులను = ఇనుపకట్ల గుదియలు ధరించినవారిని, శతఘ్న్యాయుధులను = శతఘ్నులాయుధములుగాఁ గలవారిని, 'అయః కంటక సంఛన్నా శతఘ్నీ పరికీర్తితా' వైజయంతి. మేకుల యినుపగద శతఘ్ని యనఁబడును. నాధిక స్థూలులన్=మిక్కిలి స్థూలములు కాని దేహములు గలవారిని, నాతికృశాంగులన్ = మిక్కిలి కృశింపని దేహములు గలవారిని, నాతిదీర్ఘులన్ = మిక్కిలి పొడవు కాని వారిని, నాతిహ్రస్వులను = మిక్కిలి పొట్టిగాని వారిని, నాతిగౌరాంగులన్=మిగులఁ దెల్లని కాని శరీరము గలవారిని, నాతికృష్ణాంగులను = మిగుల నలుపుగాని వారిని, నాతివామనులను = మఱుగుజ్జులు కాని వారిని, నాతికుబ్జకులను = విశేషము గూని లేని వారిని, బహురూపులను = అనేకవిధములైన యాకారములు గలవారిని, సురూపులను = చక్కఁదనము గలవారిని, సువర్చసులను=మంచి కాంతి గలవారిని, పతాకినిచయములను = చిన్నధ్వజములు పట్టుకొన్నవారిని, ధ్వజులన్ = పెద్దజెండాలను బట్టుకొన్న వారిని, వివిధాయుధులను = పెక్కుతెగల యాయుధములను ధరించినవారిని, శక్తి కుజధరులను = శక్తులను చెట్లను ధరించిన వారిని, పట్టిసాయుధులను=కటారులాయుధములుగాఁ గలవారిని, గాడ్పుపట్టి = వాయుపుత్రుఁడు, కనియెన్=చూచెను.

తాత్పర్యము.

మిట్టపండ్ల వాండ్రను, పెద్దవిండ్ల వాండ్రను, పొట్టివాండ్రను, వంకర నోటి వాండ్రను, బాకులు రోఁకండ్లు గుదియలు ఇనుపముండ్ల గదలు ఆయుధములుగఁ గల

వాండ్రను, కవచములు తొడిగినవాండ్రను, మిక్కిలి లావులేనివాండ్రను, మిక్కిలి కృశించినవారుగాని వాండ్రను, మిగులఁ బొడవుగాని వాండ్రను, మిగులఁ బొట్టిగాని వాండ్రను, మిక్కిలి పసిమిలేని దేహముల వాండ్రను, కాఱు నలుపుగాని వాండ్రను, మిక్కిలి పొట్టిగాని వాండ్రను, మిక్కిలి గూనులుగాని వాండ్రను, అనేక రూపములు గల వారిని, వికార రూపములుగల వాండ్రను, సుందరులను, సుకాంతులను, గుర్తులు లేని టెక్కెములు గలవాండ్రను, గుర్తులుగల టెక్కెముల వాండ్రను, నానాయుధ ములవాండ్రను, శక్తులు వృక్షములు ధరించినవాండ్రను, కటారులను గలవారిని వాయునందనుఁడు చూచెను.

తే. క్షేపణీపాశకరుల నా• లేపరతుల, మాల్యవిలసితతనుల న•మూల్యభూరి
భూషణుల స్వైరుల ననేక•వేషయుతుల, వేలకోలఁదులఁ గనియెనా•భీమబలుఁడు.

అర్థములు. క్షేపణీ పాశకరులను = వలలను పాశాయుధములను చేత ధరించిన వారిని, ఆలేపరతులన్ = గంధము పూసికొనుటయం దాశగలవారిని, మాల్య విలసిత తనులన్=పూలదండలచేఁ బ్రకాశించు దేహములు గలవారిని, అమూల్య= వెలలేని, భూరిభూషణులను=గొప్పసొమ్ములు ధరించిన వారిని, స్వైరులన్ = స్వేచ్ఛగా సంచ రించువారిని, అనేక వేషయుతులన్=పలువిధము లయిన వేషములు వేసినవారిని.

తా త్ప ర్య ము.

వలలు, పాశములు చేత గల వారిని, దండిగ గంధము పూసి కొన్న వారిని, పూలదండలు ధరించిన వారిని, వెలలేని గొప్ప యాభరణముల నలంకరించు కొన్న వారిని, నిష్టముకొలఁది తిరుగువారిని, నానావిధాలంకారములు చేసికొనిన వారిని, వేలకోలఁదులను నా భయంకరబలము గల హనుమ చూచెను.

అ. భయదశూలధరుల • వజ్రహస్తకులను, బంక్తికంఠు నాజ్ఞఁ • బట్టనమున
నడిమిగుల్మ మగుచుఁ•గడుహెచ్చరిక నింటి,ముందు గ్రాలఁగనియె•మూలబలము.

అర్థములు. భయదశూల ధరులన్=భయంకరములైన శూలములను ధరించిన వారిని, వజ్రహస్తకులను = వజ్రాయుధములను ధరించిన వారిని (ఇవి యింద్రుని వజ్రములు గావు. ఆ యాకారముగ సిద్ధము చేసినవి) జూచెను. నడిమిగుల్మము = పట్టనము నడుమ నున్న సైన్య సమూహము.

తా త్ప ర్య ము.

భయంకరములైన మువ్మొనయాయుధముల ధరించిన వారిని ఇంద్రుని వజ్రము వంటి యాయుధములు చేతియందుఁ గల వారిని జూచెను. మఱియు రావ ణుని యాజ్ఞప్రకారము పట్టనము నడుమ రావణుని యింటిముందు హెచ్చరికగల మూల బలము (Reserved force) ను జూచెను.

క. బంగరుతోరణములను జెలంగుచు గిరిశిఖరసీమ•లన్ వెలిదమ్ముల్
రంగగు నగద్యుతోద వెలింగెడిప్రాకారమున ల•లిం గొమ రొప్పన్. ౧౯౪

అర్థములు. వెలిదమ్మిల్ = తెల్లతామరలు, రంగగు = అందమైన, ఈ మూఁడు పద్యము లేకాన్వయము; ఇందలి విశేషణములకు రాణివాసము (౮౬ వ. ప.) విశేష్యము.

తా త్ప ర్య ము.

బంగారు తోరణములు గలిగి కొండ శిఖరములందుఁ దెల్లఁదామరలు గల యగడ్తలతో వెలింగెడి ప్రాకారము గలదై.

చ. అమరనివాసతుల్య మయి • హారినినాదయుతంబునై తురం
గమపటుహేషితంబు నయి • క్రమవిభూషణశింజితంబు నై
విమలవిమానయానరథ•విశ్రుతవారణమత్తపక్షిసం
ఘమృగమనోహరంబు నయి • గ్రాలు మహాబలయోధగుప్తమున్. ౮౫

అర్థములు. అమరనివాస తుల్యమయి=స్వర్గముతో సమానమై, నినాదము = ధ్వని, తురంగమ పటుహేషితంబు నయి=గుఱ్ఱముల గొప్ప సకిలింపులుగలదై, క్రమ విభూషణ శింజితంబునై = మనోజ్ఞములైన యాభరణముల ధ్వనులు గలదై, విమానము = ఆకాశమున సంచరించు వాహనము, యానము = పల్లకి మొదలయినవి, వారణ=ఏనుఁగులు, మహాబల యోధగుప్తమున్ = మిగుల బలముగల యోధులచే రక్షింపఁబడినది.

తా త్ప ర్య ము.

స్వర్గముతో సమానమై మనోహర ధ్వనులతోఁ గూడినదై గుఱ్ఱముల గట్టి సకిలింతలు గలదై, మనోహరమైన భూషణ ధ్వనులు గలదై, ఆకాశ యానములు పల్లకులు తేర్లు ప్రసిద్ధి కెక్కిన యేనుఁగులు మదించిన పక్షిసంఘములు జింకలు వీనిచే నందమై మిగుల బలవంతులగు యుద్ధభటులచే రక్షింపఁబడినదై.

వంశస్థము. సహేమరత్నోజ్జ్వల•చక్రవాళమున్, మహార్హముక్తామణి•మండితాంతమున్
మహాఽసితాభ్రాగురు•మంజుగంధమై, రహించు రక్షోధిపు•రాణివాసమున్.

అర్థములు. సహేమ రత్నోజ్జ్వల చక్రవాళమున్ = బంగారుతోఁగూడి రత్నములచే వెలింగెడి ప్రాకార వలయము గలదానిని, మహార్హ=మిక్కిలి వెలగల, ముక్తామణి = ముత్యములచే మణులచే, మండితాంతమున్ = అలంకరింపఁబడిన లోపలి భాగముగలదానిని, మహాఽసిత=మిగుల నలుపైన, అభ్ర=మబ్బువంటి రంగుగల, అగురు = అగురు చెక్కముక్క, మంజుగంధమై = మనోహరమైన వాసనగలదై, రహించు=ప్రకాశించు, రాణివాసమున్ = అంతఃపురమును, పై పద్యములోని కనుఁగొని తో నన్వయము. వంశస్థము. జత జరగణములు. ఎనిమిదింట యతి.

తా త్ప ర్య ము.

బంగారుతోఁగూడిన రత్నములచేఁ బ్రకాశించు ప్రాకారవలయము గలదియును, మిగుల వెలగల ముత్యములచేతను రత్నములచేతను నలంకరింపఁబడిన మధ్య

భాగము గలదియును, కారుమబ్బువలె నల్లనైన యగురు చెక్కల కమ్మనివాసన గలదియు నయిన రావణుని అంతఃపురమును జూచెను.

—• ౫-వ సర్గము. చంద్రవర్ణనము •—

క. కనుఁగొని కేసరిసూనుఁడు, చనె లోనికి రామచంద్రు•సతి నెమకంగా
వినువీదిని మధ్యంబున, జనలోచనపర్వముగను • జంద్రుఁడు వెలిఁగెన్. ౧౯౪

అర్థములు. లోనికిఁజనెన్=లోపలికిఁ బోయెను. అనుటచే నింతవఱకుఁ బట్టణమున సంచరించెననియు రావణు నంతఃపురము వెలుపలి నుండి చూచి యిప్పుడు లోపలఁ బ్రవేశించెననియు నెఱుఁగవలెను. వినువీదిని మధ్యంబునన్ = ఆకాశమధ్యమందు, జనలోచన పర్వముగను = జనుల కనుల పండువుగ, శుద్ధత్రయోదశినాఁడు ఆకాశ మధ్యంబునఁ జంద్రుఁడు వెలిఁగె ననుటచే నిప్పుడు సరిగా తొమ్మిదిన్నరగంట యని యేర్పడు చున్నది.

లయగ్రాహి. అంత హనుమంతుఁడు న•భోంతరమునం గనియె
వింత లగు వెన్నెలల•కాంతులు వెలుంగన్
గాంత మగుమంద వృష • కాంతునిగతిన్ మలయు
చంతట జగంబున ని•తాంతరుచి మీఱన్
స్వాంతములు హాయి గొన • సంతసమునన్ జలధి
కాంతుఁడు తరంగముల • గంతులిడున ట్లా
శాంతముల నంటునటు • లెంతయును జేయు నుడు
కాంతు జనసంచయదు•రంతదురితాంతున్. ౧౯౫

అర్థములు. అంత హనుమంతుఁ డుడుకాంతుని నభోంతరమునం గనియె నని యన్వయము. తక్కిన పదములలోఁ గొన్ని క్రియాంతములు గలవి. మఱికొన్నియును కాంతునితో నన్వయించును. వెలుఁగన్, మీఱన్—ఇవి మలయుచు నను దానితో నన్వయించును. మలయుచున్—చేయుతో నన్వయించును. చేయు—ఉడుకాంతుని విశేషణము. నభోంతరమున=ఆకాశమధ్యమందు. మందన్ = మందయందు, వృష కాంతునిగతిన్ = పెద్దయెద్దువలె, నితాంతరుచి = మిగులఁ గాంతి, స్వాంతములు = మనస్సులు, జలధికాంతుఁడు = సముద్రరాజు, తరంగములన్ = అలలచే, ఆశాంతములన్=దిక్కులకొనలయందు, ఉడుకాంతున్=నక్షత్ర పతిని, చంద్రుని, జన సంచయ=మనుష్యసమూహముల, దురంత = అంతములేని, దురితాంతున్ = పాపముల నాశముఁ జేయువానిని.

తాత్పర్యము.

అంతట హనుమంతుఁడు ఆకాశ మధ్యమందుఁ జంద్రుని జూచెను. ఎట్టి చంద్రుని ననిన-వినోదకరమైన వెన్నెల కాంతులు వెలుఁగఁగ నందమైన మంద

యందు వృషభమువలె సంచరించుచుఁ బ్రపంచ మందంతట తన విశేషకాంతి వ్యాపింపఁగా నా కారణమున జనముల మనస్సులు సుఖపడగా సముద్రుడు మహోత్సాహంబు నొంది నృత్యమాడు చున్నాఁడా యన్నట్లు అతని సిద్ధయుగళచే దిక్కుల నంటు చున్నట్లు చేయుచు జన సమూహముల యంతము లేని దుఃఖము నాశము చేయుచుండు చంద్రుని జూచెను. చంద్రుఁడు సంతోషకారి గావున నాయనను జూచిన వారికి సంతోషము కలుగు నని భావము. లయగ్రాహి:— భజసన, భజసన భయ గణములు. ఈపద్యమందుఁ బ్రాస యతియే కాని యతిలేదు. ఇది సమవృత్తము లందుఁ జేరినది కాదు. మాలికా వృత్తములందుఁ జేరినది.

ఇంబడరఁగా భజసనంబులకుదన్ భజసనంబుల పదంపడి భయంబులు లయ గ్రాహిం బరఁగు బ్రాసవిరమంబు నలుమాఱు గుదురం బటుకవీశులు తిరంబుగ వచింతుర్. క॥ ముప్పదితొమ్మిది మాత్రల, ముప్పది యక్కరముల పదముల యంఘ్రులు నాల్గొప్ప యతిప్రాసంబులు, గుప్ప లయగ్రాహి యనఁగఁ గోమలాంగ హరీ. అప్పకవీయము. ౪ అ.

చారుమతి. ఏ కాంతి పొల్చునో మ•హీస్థలి మందరస్థమై
యే కాంతి సంజ రహి•యించు నదీశ్వరస్థమై
యేకాంతి యొప్పు సర•సీస్థసరోరుహస్థమై
యాకాంతి యప్డు పొలు•పారె నిశాకరస్థమై ౧౯౯

అర్థములు. మందరస్థము = మందర పర్వతమందుండునది, సంజన్ = సాయం కాలమందు, నదీశ్వరస్థము = సముద్రమందుండునది, సరసీస్థ సరోరుహస్థము = సరసులందుఁ బ్రకాశించు కమలములందుండునది, నిశాకరస్థము=చంద్రునియందుండు నది, పదార్థ వృత్తి నిదర్శనాలంకారము. ఉపమానగుణమే యుపమేయమందుఁ జెప్పఁబడెను.

తాత్పర్యము.

భూమియందు మందర పర్వతంబున నెట్టి కాంతి యుండునో, సాయంకాలమున సముద్రమునం దెట్టి కాంతి యుండునో, సరస్సులందలి కమలంబులం దే కాంతి యుండునో యటువంటి కాంతి యప్పుడు చంద్రునం దుండెను.

ఉ. రాజతపంజరస్థ మగు•రాజమరాళము భంగి, మందర
భ్రాజితకందరస్థమృగ•రాజమునై ఖరి, భూరిదుర్మదో
ర్వీజకుంజరస్థుఁ డగు•వీరువిధంబునఁ, జంద్రుఁ డొప్పెడన్
రాజిలె నంబరస్థుఁ డయి • రాజముఖవదనాభిరాముఁడై. ౨౦౦

అర్థములు. రాజత పంజరస్థము = వెండి పంజరమందున్న, రాజ మరాళము భంగిన్=రాజహంసవలె, వెన్నెలచే నాకాశము తెలుపై యుందు చంద్రుఁడుండుటచే

నీ యుపమానము సార్థకము. పంజరములందుఁ జిలుకలు గోరు వంకలు లోనైన వానినేగాక హంసలనుగూడ నుంతురు.

"కృష్ణత్వదీయ పద పంకజ పంజరాంత మద్యైవ మేవిశతు మానసరాజహంసః" ముకుందమాల. వెండి పంజరమందలి తెల్లని హంస యనుటచే వనుగుణాలంకారము. మందరప్రభాజితకందరస్థ=మందర పర్వతమందుఁ బ్రకాశించు గుహయందున్న, మృగ రాజము వైఖరి = సింహమువలె, సింహము తెలుపు, మందరము తెలుపు కావున నీ యుపమానము. భూరి = గొప్పదై, దుర్మద = చెడ్డ మదముచే, ఉద్వేజక = భయము కలిగించు, కుంజరస్థుఁడు = ఏనుఁగుపైనుండు వాఁడు, వీరు విధంబునన్ = వీరునివలె, ఆకాశము స్వభావమున వలుపు గావున నీ యుపమానము. అంబరస్థుఁడయి = ఆకాశమందున్నవాఁడై, ఇందు సాధారణ ధర్మము చెప్పలేదు కావున లుప్తోపమాలంకారము. రాజముఖి వదనాభిరాముఁడై-రాజముఖీ = (చంద్రునివంటి ముఖముగల) స్త్రీల, వదన = ముఖమువలె, అభిరాముఁడై=మనోహరమైన వాఁడై, స్త్రీలముఖమువంటివాఁడు చంద్రుఁ డనుటచే నుపమేయోపమాలంకారము. ఉపమానోపమేయములు పర్యాయంబునఁ గల్పించిన నుపమేయోపమయగు. ఇందు చంద్రునివంటి ముఖము, ముఖమువంటి చంద్రుఁడని కల్పింపఁ బడెను.

తాత్పర్యము.

వెండి పంజరమందలి హంసవలె, మందర గుహయందున్న సింహమువలె, నేనుఁగుపైనున్న వీరునివలె నాకాశమునఁ జంద్రుఁడు, చంద్రముఖుల ముఖమువలె మనోహరుఁడై యుండెను.

చ. బలిసినతీక్ష్ణశృంగవృష • భంబువరంబు విధంబు దోఁపఁగా
సలలితహేమశృంగ మగు • సామజరాజము నోజఁ బాండురో
జ్జ్వలితమహోచ్చ శృంగకర • సాధరనాథు విధానఁ జంద్రుఁడున్
వెలసెను బూర్ణశృంగుఁ డయి • విశ్వమనోజ్ఞవిభానుమంగుఁడై. ౨౦౧

అర్థములు. తీక్ష్ణశృంగ వృషభంబు=వాఁడికొమ్ములుగల యెద్దు, హేమ శృంగ మగు=బంగారుకొమ్ములుగల, సామజరాజము నోజన్=గొప్ప యేనుఁగువలె, పాండు రోజ్జ్వలిత=తెల్లగాఁ బ్రకాశించెడి, మహోచ్చ=మిక్కిలి యెత్తైన. శృంగక=శిఖరము గల, రసాధరనాథువిధానన్=శ్రేష్ఠమగు పర్వతమువలె, పూర్ణశృంగుఁడయి = నిండిన కొమ్ములుగలవాఁడు, పాడ్యమి విదియ తదియలందు చంద్రుని కొనలు తెలిసినట్లు త్రయోదశినాఁడు స్పష్టముగాఁ దెలియవు. కొంచెము తక్కువగాఁ బూర్ణబింబము వలె నుండును. ఇచ్చట శృంగ మనఁగా గిరణము లని చెప్పుట సరిగాను. విశ్వ=లోకులకు, మనోజ్ఞ = ఇంపైన, విభా = కాంతిచే, అనుమంగుఁడై = కూడిన

వాఁడై, ఉత్తర శృంగమని, దక్షిణశృంగమని చంద్రుని కొనలకుఁ బేర్లు. ఇట్టి శృంగములు గల వాఁ డిప్పుడు శృంగములు లేనివాఁడై ప్రకాశించె నని భావము.

తా త్ప ర్య ము.

బలసిన వాఁడి కొమ్ములుగల యెద్దువలె బంగారు కొమ్ములు గల యేనుఁగువలె తెల్లని యెత్తైన శిఖరములు గల కొండవలె నుండు చంద్రుఁ డిప్పుడు పరిపూర్ణశృంగుఁడై లోకముల కింపైన కాంతి గలవాఁడై ప్రకాశించెను.

వంశస్థము. వినష్టశీతోదక•బిందుపంకుఁడున్, ఘనగ్రహగ్రాహవి•నష్టపంకుఁడున్
వినోదలక్ష్మ్యాశ్రయ•నిర్మలాంకుఁడున్, వినిద్రరుగ్యుక్తిఁజ•నెన్ శశాంకుఁడున్.

అర్థములు. వినష్ట = నశించిన, ఇది పంక విశేషణము, శీతోదక = మంచుయొక్క, బిందు=తుంపరలను, పంకుఁడు=మాలిన్యము కలవాఁడు, అట్టి మాలిన్యము లేదని భావము. ఇది చంద్రుని యందు సూర్యకిరణ సంబంధము చేత నని యెఱుఁగునది. ఇట్లుచెప్పుటచే మంచుకాలము పోయినదనిభావము. కావున నిది ఫాల్గునమధ్యమే. ఘనగ్రహ గ్రాహ వినష్టపంకుఁడున్=(౧) ఘనగ్రహ=గొప్ప గ్రహములైన బృహస్పత్యాదులను, గ్రాహ = తనకిరణములచేఁ గప్పుటచేత, వినష్ట=నశించిన, పంకుఁడున్= కాంతి హీనత కలవాఁడు, తన కిరణములచే నితరగ్రహములను గాంతి తగ్గించి, తాను చక్కఁగ వెలుఁగుచున్నాఁడని భావము. (౨) ఘనగ్రహ=గొప్పగ్రహమైన సూర్యునియొక్క, గ్రాహ = కిరణ సంబంధముచే, వినష్ట = నశించిన, పంకుఁడున్ = చీఁకటి గలవాఁడును. సూర్యకిరణ సంబంధముచేఁ దాను వెలుఁగుచుఁ జీఁకటిని దొలఁగించుచున్నాఁడని భావము. 'సలిలమయే శశిని రవే ర్దీధితయో మూర్ఛితా స్తమోనైశం। క్షపయంతి దర్పణోదర నిహితా ఇవమందిరస్యాంతః॥' అను వరహామిహిరాచార్యుని వాక్యము ప్రమాణము. సూర్యకాంతి యద్దముపైఁ బడి నేని యెట్లు ప్రతిఫలించునో యట్లే జలమయమైన చంద్రునియందుఁ బడిన సూర్యకాంతి ప్రతిఫలించి వెన్నెలగా వ్యాపించును.

వినోద లక్ష్మ్యాశ్రయ నిర్మలాంకుఁడున్=వినోద=ఆశ్చర్యకరమైన, లక్ష్మి= కాంతి విశేషమునకు, ఆశ్రయుఁడు కావున నిర్మలమైన కళంకముగలవాఁడు,అంకము= చిహ్నము, కళంకము తెల్లగా నున్న చంద్రునియందు నతని కళంకము పరభాగము చెంది వెలుఁగుచున్నదని భావము. శశాంకుఁడున్ = కుందేటివంటి మచ్చగలవాఁడు. చంద్రునియందు భూచ్ఛాయ కుందేటివలెఁ బ్రతిఫలించుచున్నది. "లోకచ్ఛాయ మయం లక్ష్మ తవాంకే శశసన్నిభమ్" అని హరివంశము. 'భూచ్ఛాయ మైచ్ఛ ష్పరే' బిల్హణుఁడు. వినిద్రరుక్+యుక్తిన్=అధిక కాంతితోఁగూడిన వాఁడయి.

తా త్ప ర్య ము.

నశించిన మంచు బిందువుల మాలిన్యము కలవాఁడును, తన కాంతిచే బృహ

స్వాతి మొదలగు పెద్ద గ్రహములకాంతి గప్పినవాఁడును, ఆశ్చర్యకరమైన కాంతి కాశ్రయమై నిర్మలమైన యంకము గలవాఁడునై విశేష కాంతితోఁ జంద్రుఁడుపొలసెను.

క. చంద్రుఁడు విపులశిలాస్థమృ, గేంద్రుఁడునా, భీమసమర•పృథ్వీగతనా
గేంద్రుఁడునా, రాజ్యప్తి న, రేంద్రుఁడునా, వెలసె సితఖ•గేంద్రుని మాడ్కిన్.

అర్థములు. విపుల శిలాస్థ మృగేంద్రుఁడు = విశాలమైన రాతిమీఁద నుండు సింహము, భీమసమరపృథ్వీగత = భయంకరయుద్ధభూమియందున్న, నాగేంద్రుఁడు = పెద్దయేనుఁగు, సితఖగేంద్రుని మాడ్కిన్ = తెల్లని పక్షిరాజమువలె, హంసవలె.

తా త్ప ర్య ము.

విశాలమైన బండపైఁ గూర్చుండిన సింహమో, భయంకర యుద్ధభూమి యందున్న పెద్దయేనుఁగో, (ఐరావతము) రాజ్యము లభించిన రాజో యనునట్లు, హంసము వలెఁ బ్రకాశించెను.

దీనివలనఁ జంద్రబింబము నిర్మలముగా నుండె నని భావము.

శా. రాజద్రాజవినష్టదోషము,సురా•రాతిప్రవారామిష
భ్రాజద్భోజనవృత్తదోషము, లస•ద్రామాభిరామేరితో
ద్యేజన్మానసదేశ దోష, ముగుచున్ • వేడ్కఁ బ్రదోషంబు స్వా
రాజావాససమానతోషణము నై • రాజిల్లెఁ దేజంబునన్. ౨౦౮

అర్థములు. రాజత్ = ప్రకాశించుచున్న, రాజ=చంద్రునిచే; వినష్ట=నాశమైన, దోషము = చీఁకటి గలది, సురారాతి ప్రవార = రాక్షస సమూహములయు, ఆమిష భ్రాజత్ + భోజన = మాంసమును జక్కఁగా భుజించువారియు, వృత్త దోషము = కలిగిన దోషము కలది, సంచార మనెడి దోషము గలది. రాత్రులందు రాక్షసులయు, మాంసభక్షకము లయిన మృగములయు సంచారము కలది. లసత్ = ప్రకాశించు, రామా+అభిరామ = స్త్రీ పురుషుల, ఈరిత = ప్రేరింపఁబడిన, ఉద్యేజత్ = మన్మథతాపముచే భయ పడుచున్న, మానసదేశ = మనస్సునందు, దోషము = దోషము, ప్రణయ కలహము గలది. చంద్రుఁడు విరహిణీ విరహులకు భయంకరుఁడు గదా. ప్రదోషంబు = ప్రదోషకాలము. ఈ దినము త్రయోదశి.

"త్రయోదశీ యదా రాత్రౌ, యామ త్రయనిశాముఖే ప్రదోష ఇతి విజ్ఞేయో, జ్ఞానార్థీ మాన మాచరేత్।" అను వాక్యమును బట్టి యిప్పుడు తొమ్మిదిన్నర గంటయే యగుటచేఁ బ్రదోషమున్నది కాని పోలేదు. కొందఱు తలఁచినట్టులది యర్ధరాత్రము గాదు. స్వారాజ = స్వర్+రాజ = స్వారాజ=ఇంద్రుని, ఆవాస = నివాసమైన స్వర్గముతో సమానముగా, తోషణము=సంతోషము కలిగించునది.

తా త్ప ర్య ము.

ఆ ప్రదోషకాలము ప్రకాశించు చంద్రునిచే నాశమైన చీఁకటి గలదియు రాక్షసులయు, మాంసము భుజించు మృగములయు సంచారము గలదియు స్త్రీ పురు

షుల మదన తాపముచేఁ గలిగిన మనస్సునందలి ప్రణయకోపము గలదియునై స్వర్గ లోక సంతోషము వంటి సంతోషమును తన తేజస్సుచేఁ గలిగించెను.

ఉ. అత్తఱిఁ దంత్రినాద మల • రారెను గర్ణసుఖప్రవృత్తమై
చిత్తరి మొత్తముల్ నిదుర • పెల్చన నొప్పె హృదీశవృత్తమై
హత్తెను గ్రూరశీలపిశి • తాశనసంఘము రౌద్రవృత్తమై
తత్తఱచే వియుక్తవని • తాతతి గుందె సుమేషుకృత్తమై. ౨౦౫

అర్థములు. అత్తఱిన్ = ఆ సమయమందు, తంత్రినాదము=వీణెలు వాయింపఁగాఁ బుట్టిన నాదము, కర్ణసుఖ ప్రవృత్తమై = చెవులకు సుఖము కలిగించునదియై, చిత్తరి మొత్తముల్=స్త్రీల గుంపులు, పెల్చన = అతిశయముచే, హృదీశవృత్తమై= భర్తల ననుసరించునదియై, క్రూరశీల=హింసాస్వభావముగల, పిశితాశన సంఘము = మాంసము భక్షించువారిసమూహము, రౌద్రవృత్తమై=భయంకర వ్యాపారముగలదై, హత్తెను=ఒప్పెను, వియుక్త వనితాతతి=భర్తల విడిచియుండు స్త్రీజనము, సుమేషు కృత్తమై=మన్మథుని పూల బాణములచేఁ జీల్పఁబడినదై, కుందెన్=దుఃఖించెను.

తా త్ప ర్య ము.

ఆ సమయంబునఁ గర్ణ రసాయనంబుగా వీణానాదము వినవచ్చెను. శృంగార చేష్టలు గల యువతులు నిద్ర యతిశయముచే భర్తల ననుసరించిరి. హింసాశక్తిగల మాంసభక్షక సంఘము రౌద్రకార్యములు చేయసాగెను. భర్తలను విడిచియుండు స్త్రీలు మన్మథతాపముచే తత్తఱలాడి దుఃఖించిరి.

క. గృహములు మత్తోన్మత్తని,వహములు రథగజతురంగ • భద్రాసనసం
గ్రహములు శుభవీరరమా,వహములు గనుఁగొనియెఁ బ్లవగ • వల్లభుఁ డచటన్.

అర్థములు. మత్త+ఉన్మత్త+నివహములు=మత్త = మద్యపానముచే దేహములు తెలియనివారలయు, ఉన్మత్త = చేయవలసిన కార్యముల మఱచిన వారలయు, నివహములు=సమూహములు, భద్రాసన = శుభకరములయినవాని సంపాదన కలది, శుభ = క్షేమకరములైన, వీరరమా = వీరలక్ష్మిని, ఆవహములు = కల్గినవి. గృహములకు విశేషణములు. త్రిప్రాసకందము.

తా త్ప ర్య ము.

మత్తులు నున్మత్తులు గలవియు, తేరులేనుఁగులు గుఱ్ఱములు శుభాసనములు వీని సంపాదన గలవియు, వీరలక్ష్మిని గలవియు నగు గృహములను వానరపతి కనుఁ గొనియెను.

—• హనుమంతుఁడు లంకలో రాక్షసస్త్రీపురుషులఁ జూచుట •—

క. ఆక్షేపంబుల గురుభుజ,విక్షేపంబులను మత్తవివిధాలాపా
ధిక్షేపంబుల నన్యా,ధిక్షేపంబులఁ జెలంగు • దితిజులఁ గాంచెన్. ౨౦౬

అర్థములు. ఆక్షేపంబులన్=పరిహాసముల చేతను, భుజవిక్షేపంబులను=ఒకరిపై నొకరు చేతులు వేసికొనుట చేతను, మత్త = మద్యపానముచే దేహము తెలియక చేసెడి, వివిధాలాపాధిక్షేపంబులన్ = నానావిధములైన మాటలు చెప్పుటచేతను, అన్యాధిక్షేపంబులన్=ఇతరులను బెదరించుట చేతను.

తా త్ప ర్య ము.

ఒకరి నొకరు పరిహాస మాడుచు నొకరిపై నొకరు పూలో రాలో వేసికొనుచు మత్తతచేత నోటికి వచ్చినట్లు నానాభాషణము లాడుచు నితరులను బెదరించు రాక్షసులఁ జూచెను.

ఉ. ఆొమ్ములు విచ్చి దేహము లె•ఱుంగక కూర్కెడివారి,స్త్రీలగా
త్రమ్ములఁ గాలుఁ జేయి రుచి•రమ్ముగ నైచి పరున్నవారి, రూ
పమ్ములు పెంపెక్కుతులుగ • భాసిలువారిని, సారభూరిచా
పమ్ములు మీటువారిఁ, గనెఁ • బావని పౌరనిశావిహారులన్. ౨౦౮

తా త్ప ర్య ము.

ఆొమ్ములు తెఱచుకొని నెల్లకిలఁ బండుకొని నిద్ర పోవువారిని స్త్రీల దేహమ్ములపై నొక కాలు నొక చేయి నైచి ప్రక్కఁదిరిగి పండుకొన్నవారిని, నానా విధముల నలంకరించుకొన్నవారిని దృఢములైన పెద్ద విండ్లను మీటు వారిని పురవాసులైన రాత్రించరు లగు రాక్షసులను మారుతి జూచెను.

ఉ. ముచ్చట లాడువారి, నగు•ముద్దుమొగంబులవారి, నిద్ర క
న్గ్రిచ్చెడివారిఁ, జందనము•నోహర లేపముఁ బూయువారి, లో
నెచ్చిన నర్మకోపమున • నెంతయు నూర్చుచు నున్నవారి, సాం
పమ్మవడంగఁ గాంతులను • బ్రార్థన చేసెడివారిఁ గన్గొనెన్. ౨౦౯

అర్థములు నర్మకోపము = భార్యాభర్తల ప్రేమ రూపక కోపము, ప్రణయ కోపము.

తా త్ప ర్య ము.

ముచ్చట లాడుచున్న వారిని, నవ్వు ముద్దుమొగము గలవారిని నిద్రచే తెప్పలు మూఁతలు పడువారిని తమ భర్తలకు గంధము మొదలగు మనోహరములైన లేపములఁ బూయువారిని, భర్తలమీఁదఁ గోపగించి వారు పలుకరింప లేదని శ్వాసములు పుచ్చువారిని (కలహాంతరిత నాయిక) భర్తలను రతికై ప్రార్థించెడివారిని స్త్రీలను హనుమంతుఁడు చూచెను.

క. వినదద్గజములు సభ్య. ప్రణమత్పూజ్యులు హ్రదాంత•రస్థితఘూఘూ
వినదత్ఖగములను బోలెడి,వినిశ్వసద్వీరభటులు • వెలయఁగఁ బురిలోన్. ౨౧౦

అర్థములు. వినదత్ + గజములు = ధ్వనించుచున్న యేనుఁగులు, సభ్య ప్రణమత్ పూజ్యులు = పెద్దలకు నమస్కరించు పెద్దలు, హ్రదాంతర స్థిత = మడుఁ

గులోనుండు, ఘూఘూనివదత్భుజులను = ఘూఘూ యను చున్న పాములను, వినిశ్వసత్ =ఊర్పులు పుచ్చుచున్న, వీరభటులు=వీరులగు భటులు.

తాత్పర్యము.

విశేషముగ ఘీంకారములు చేయు నేనుఁగులు పెద్దలకు నమస్కరించు పెద్దలు, మనుఁగులో నుండి ఘూత్కారములు చేయు పాములవలె నూర్పులు పుచ్చు వీర భటులు, వీరిని బుద్ధిమంతుఁడు హనుమంతుఁడు చూచెను.

సీ. సంవిత్ప్రధానుల • సంశ్రద్ధధానుల, రుచిరాభిధానుల • రూఢినిట్లు
విశ్వప్రధానుల • వివిధవిధానులఁ, బరి యాతుధానులఁ • బుగమనోజ్ఞ
రూపుల స్వగుణానురూపుల • రూపుల లసమాన,రూపుల బహుగుణ • దీపితులను
మఱియు విరూపుల • మానితపరిశుద్ధ,భావలను మహాను • భావురాంద్రఁ
ఆ. భావనాధిసక్త • భావలఁ దారకా,పటలలసితసుప్ర • భావలను స
వీరాసుతుఁడు గాంచె • సౌరతరానంద,యుక్తి సౌధరాజి • నుప్పరిగల. ౨౧౧

అర్థములు. సంవిత్ప్రధానులన్ = గొప్ప బుద్ధిగలవారిని, సంశ్రద్ధధానుల = శాస్త్రములందు మిగుల శ్రద్ధగలవారిని; సంవిత్ప్రధానులని వెంటనే సంశ్రద్ధధానులనుటచే సంవిత్ప్రధానులనఁగా వేదబాహ్యులగు శూన్యవాదులగు బౌద్ధులనియు, సంశ్రద్ధధానులనుటచే శాస్త్ర విశ్వాసము గల యాస్తికులనియుఁ దోఁచుచున్నది. శూన్యవాదులగు బౌద్ధుల సంవిత్తు శుష్కాద్వైత వేదాంతుల వ్యావహారిక సత్యము రెండు సమానములు. జాబాలి చేసిన యీ వాదమునే శ్రీరామచంద్రమూర్తి ఖండించి యాయనను జీవాట్లుపెట్టెను. ఈ కారణముచే నిది బౌద్ధమతాంతరమని వ్రాయఁబడెనని తలఁపరాదు. కడపటి శాక్య బుద్ధుఁడు తానేడవ బుద్ధుఁడనని తనకు ముందు తనవంటి వారార్గురు పోయిరని చెప్పెను. (చూ. అయో. ౨౮౬౫-౨౮౬౭ ప) రుచిరాభిధానులన్ = మంచిపేర్లుగలవారిని, విశ్వప్రధానులన్ = ప్రపంచమున మేటులను, వీరు సాంఖ్యులని తోఁచెడి, వివిధ విధానులన్ = అనేకాకారములు గలవారిని, యాతుధానులన్ = రాక్షసులను, పురుమనోజ్ఞరూపులన్ = మిగుల నందమయిన యాకారములఁ గలవారిని, స్వగుణానురూపులన్ =తమగుణము నకుఁ దగిన వ్యవహారములు గలవారిని, అసమాన రూపులన్ = ప్రకాశించు రూపములు గల వారిని, బహుగుణ దీపితులన్ = అనేక గుణములచే వెలుఁగు వారిని, విరూపులన్ = వికారరూపములఁ గలవారిని, యాతుధానులఁ గనుఁగొనెనని యన్వయము. ఇక స్త్రీలం వర్ణింపఁబడు చున్నారు. మానిత పరిశుద్ధభావలను=గౌరవింపఁబడు నిర్మలమైన మనస్సులు గలవారిని, మహానుభావురాంద్రన్ =పాతివ్రత్యమను గొప్పమహిమగల వారలను, పావనాధి సక్తభావలన్ =భర్తలయందుఁ బరిశుద్ధమైన ప్రేమగలవారిని, తారకాపటల=నక్షత్ర సమూహములవలె, లసిత = ప్రకాశించు

సుప్రభావలను = దొడ్డవైభవము గలవారిని, ఉప్పరిగలన్ = మేడలయందు, ఉపరి గృహము = తద్భవము ఉప్పరిగ.

తా త్ప ర్య ము.

గొప్పబుద్ధి గలవారిని శాస్త్రవిశ్వాసము గలవారిని మంచిపేర్లు గలవారిని ప్రపంచమున మేటులను, అనేకాకారములు గలవారిని తమ గుణములకుఁ దగిన కార్యములు చేయువారిని ప్రకాశించు రూపములు గలవారిని అనేక గుణములచే వెలుఁగు వారిని వికార రూపములఁగలవారిని రాక్షసులను జూచెను. మఱియు నిర్మల మనసు గలవారలును పాతివ్రత్య మహిమ గలవారలును భర్తలందుఁ బరిశుద్ధమైన ప్రేమ గలవారును నక్షత్రముల వలె వెలుఁగు వారలును నగు స్త్రీలను సౌధముల మేడలయందు హనుమంతుఁడు చూచెను.

చ. భరితత్రపోపగూఢలను • భాస్వరమోహరసైకరూఢలన్
 వరరమణోపగూఢలను • వల్లభమోహనకార్యమూఢలన్
 సురుచిసుమోపగూఢకవి•సుందరలం బ్రమదోపగూఢలన్
 వరమతిభర్తృబోధలను • వానరనేత గనె న్నవోఢలన్. ౨౧౨

అర్థములు. భరితత్రపా + ఉపగూఢలను = సంపూర్ణమైన సిగ్గుచే నావరింపఁ బడిన వారిని, వీరు ముగ్ధనాయికలు, భాస్వర = ప్రకాశించు, మోహరసైక రూఢలన్ = ప్రేమరసమే ప్రధానముగాఁ గలవారిని, వీరు మధ్యనాయికలు, వర రమణోపగూఢలను = అందముగల తమ భర్తలచేఁ గౌఁగిలింపబడిన వారిని, వీరు ప్రౌఢ నాయికలు, వల్లభ మోహన కార్యమూఢలన్ = తమ భర్తలను మోహింప జేయు విధము తెలియని వారిని, వీరు బాలనాయికలు. సురుచి = మంచి కాంతిగల, సుమోపగూఢ = పువ్వులచేఁ గప్పఁబడిన, కవిసుందరలన్ = ఆడు పక్షులవలె నందమైన వారిని, ప్రమద + ఉపగూఢలన్ = సంతోషముచేఁ గ్రమ్మఁకొనఁబడిన వారిని, వరమతి భర్తృ+ఉపోఢలను = గొప్పబుద్ధిగల భర్తలచేఁ బోషింపఁబడు వారిని, నవోఢలన్=స్త్రీలను.

ముగ్ధా మధ్యా ప్రౌఢా నాయికల లక్షణము నీ పద్యంబున నెఱుఁగనగును.

'నవనవకామ యౌవన సనాథయు నల్పరతంబు గల్గు న
య్యువిదయె ముగ్ధ; మధ్య సదృశోదిత యౌవనకామయై రతాం
త వివశయౌ లతాంగి; సతత ప్రథితోల్బణ కామ యౌవనో
త్సవయు రతాది మోహమును దాల్చుతలోదరి ప్రౌఢ దానగున్. నరస. భూ.

తా త్ప ర్య ము.

సంపూర్ణమైన సిగ్గుచే నావరింపఁబడిన వారిని, ప్రేమరసము ప్రధానముగాఁ గల వారిని, ప్రియముగల భర్తలచేఁ గౌఁగిలింపఁబడిన వారిని, భర్తలను మోహింపఁ జేయు విధము దెలియని వారిని, చక్కని కాంతిగల పువ్వులచేఁ గప్పఁబడిన యౌఁదు

పక్షులవలె నందమైన వారిని మిగుల సంతోషముచేఁ గ్రమ్ముకొనఁబడిన వారిని, బుద్ధిమంతులగు భర్తలచేఁ బోషింపఁబడు వారిని, వయస్సు స్త్రీలను, మారుతి చూచెను.

చ. కనకగృహోపవిష్టలను • గాంతధవాంకసుఖోపవిష్టలన్
వినయకృతాత్మనాథసమ•భీష్టల ధర్మకళావిశిష్టలన్
ఘనమదనాభివిష్టల వి•కారవిమారమనోజ్ఞ చేష్టలన్
గనిమె నివిష్టలం బవను•గాదిలిపట్టి నితాంతహృష్టలన్. ౨౧౩

అర్థములు.

కనకగృహ + ఉపవిష్టలను = బంగారు మేడలలోఁ గూర్చుండిన వారిని, కాంతధవాంక సుఖోపవిష్టలన్ = అందముగల భర్తల తొడలలోఁ గూర్చుండిన వారిని, వినయ కృతాత్మనాథ సమభీష్టలన్ = అణఁకువచేతఁ జేయఁబడిన తమ భర్తల కోరికలఁ గలవారిని, ధర్మకళావిశిష్టలన్ = ధర్మశాస్త్రజ్ఞానమందు గొప్ప వారిని, ధర్మకార్యములఁ జేయువారిని, ఘన మదనాభివిష్టలన్ = విశేషించి మద నునిచే నావేశింపఁ బడిన వారిని, వికార విమార మనోజ్ఞ చేష్టలన్=వికార విమార= చెడనివి, మనోజ్ఞ=ఇంపైన, చేష్టలన్=చేతలుగలవారిని, నివిష్టలన్=పెండ్లి కాఁబడిన స్త్రీలను, 'నివేశ శిబిరోద్వాహన్యాసేషు'' అని విశ్వనిఘంటువు.

తాత్పర్యము.

బంగారు మేడలందుఁ గూర్చుండినవారిని, భర్తల తొడలలోఁ గూర్చుండిన వారిని, అణఁకువచేత పతుల యిష్టకార్యములఁ జేయువారిని, ధర్మశాస్త్రమునందుఁ బ్రవీణలై ధర్మకార్యములు చేయువారిని, కామావేశము గలవారిని, నిలుకడ యయినవియు నింపైనవియునగు చేష్టలు చేయువారిని, వివాహములైనవారిని, మిగుల సంతోషించి యుండువారిని హనుమంతుఁడు చూచెను.

ఉ. కాంతసువర్ణవర్ణలను • గాంతవియోగవశీకృవర్ణలన్
గాంతవకేళ్యుదీర్ణలను • స్యన్నకుచాంశుకగౌరవర్ణలన్
గ్లాంతిగళత్సువర్ణలను • నాయకవిద్ధసుగంధిమూర్ణలన్
భ్రాంతవికీర్ణచూర్ణకచ•చారుదృగబ్జనిగారకర్ణలన్. ౨౧౪

అర్థములు. కాంతసువర్ణ వర్ణలను=అందమైన బంగారువంటి వన్నెగలవారిని, కాంత వియోగ=భర్త నెడఁబాసి యుండుటచే, వశీకృవర్ణలన్ = తెల్లని వన్నెగల వారిని, ఇది వైవర్ణ్యమను సాత్త్వికభావము. కాంతవకేళి=కంతుసంబంధము కాంత వము,సంబంధార్థక మత్వర్థీయము. అనఁగా మన్మథసంబంధమైన యాటలందు, ఉదీర్ణ లను=గొప్పవారిని, స్యన్నకుచాంశుక గౌరవర్ణలన్ =స్యన్న=జారిన, కుచాంశుక= పైఁటలు గలవారగుటచే, గౌరవర్ణలన్ = తెలియవచ్చు కుచ ప్రదేశమందలి పచ్చని కాంతి గలవారిని, దీనివలన రాక్షస స్త్రీలకు రైకలులేవని యేర్పడుచున్నది.

సీతకును రవిక లున్నట్లు ప్రమాణము గానరాదు. కావుననే మఱియూళ స్త్రీలు తమ దనాది యార్యాచార మను చున్నారు. క్లాంతి = రతిశ్రమచే, గళత్ = చెదరిపోయిన, కరఁగిపోయిన, సుపర్ణలను = చెంపలందు స్తనములందు వ్రాయఁబడిన మకరికా పత్రములు గల వారిని, ఇప్పుడు కొందఱు స్త్రీలు పచ్చపొడిపించు కొన్నట్లు పూర్వకాలమందు కస్తురి కుంకుమపువ్వు మొదలయిన వాని లేపముతో చెంపలందును స్తనములందును మొసళ్ళవలెఁ జేపలవలె స్త్రీలు చిత్రములు వ్రాసికొను చుండిరి. నాయక విద్ధ = భర్తలచే విసరి చల్లఁబడిన, సుగంధి చూర్ణలన్ = మంచి వాసనగల గంధపొడి గలవారిని, శ్రాంత వికీర్ణ చూర్ణ కచలను, చారు దృగబ్జ నిగార కర్ణలన్; అని విశేషణోభయ పదము. శ్రాంత = సురత శ్రమ కలవారు గనుకనే, వికీర్ణ = చెదరిన, చూర్ణకచ = ముంగురులు గలవారిని, చారు = అందమైన, దృగబ్జ = కమలములవంటి కన్నులచే; నిగార = మ్రింగఁ బడిన, కర్ణలన్=చెవులుగల వారిని, కన్నులు దీర్ఘములై చెవుల దాఁక వ్యాపించి యున్నవని భావము. పై పద్యముతో నేకాన్వయము.

తా త్ప ర్య ము.

అందమైన బంగారు వంటి దేహకాంతిగల వారిని, భర్త నెడఁ బాసిన విరహ తాపముచే తెల్లబాఱిన వారిని, మన్మథకేళియం దాఱితేఱిన వారిని, పైఁటలు జాఱిపోవుటచేఁ గానవచ్చు పచ్చని స్తనములుఁ గలవారిని, రతిశ్రమముచేఁ గరఁగిపోయిన మకరికా పత్రములు గలవారిని, భర్త గంధపొడి చల్లిన వారిని, రతిబడలికచేఁ జిందర వందరలైన ముంగురులు గలవారిని చెవులదాఁక వ్యాపించిన నిడు పాటి కన్నులుగల వారిని.

ఉ. రామలఁ బ్రాప్తనాథపరి•రంభణహృష్టమనోభిరామలన్
శ్యామల నాత్మమందిరవి•హారకళాపరమాభిరామలన్
సోమలగాత్రవల్లు లగు•కోమలఁ బ్రేమరసైకధామలన్
రాముని మాత గన్గొనియె • రాక్షసకేళిగృహాళిసీమలన్. ౨౧౫

అర్థములు. ప్రాప్తనాథ=స్త్రీలచే స్వయముగాఁబోయి పొందఁబడిన, భర్తల యొక్క, పరిరంభణ = కౌఁగిలింతలచే, హృష్టమనోభిరామలన్ = సంతోషించిన మనస్సుచే నొప్పినవారిని, శ్యామలన్ = నడిమి వయస్సువారిని, 'శ్యామా యౌవన మధ్యస్థా' అమరుఁడు. ఆత్మమందిర = తమ యిండ్లయందే విహారకళా=విహరించు వారగుటచే, పరమాభిరామలన్=మిగుల మనోహరలైన వారిని, వీరు సంపదచే నెండకన్ను వాన కన్నెఱుఁగక యున్నవారో, లేక ఘోషాలో (పరదా పద్ధతిచే నిల్లు విడిచి వెలుపలఁబోని కులపాలికలో) తాము వెలుపలఁబోక తమ యిండ్లకే విటుల రప్పించుకొను వేశ్య లని కొందఱ యభిప్రాయము. కోమలగాత్ర వల్లులగు=మృదువైన తీఁగలవంటి దేహముగల, కోమలన్=స్త్రీలను, రూ. కొమ్మ. ప్రేమరసైకధామలన్ =

ప్రేమరసమునకే స్థానములైనవారిని, ఇట్టి రామలన్=స్త్రీలను, రాక్షసకేళి గృహాళి సీమలన్=రాక్షస కేళి గృహ ప్రదేశములందు, రాముని దూత = హనుమంతుఁడు, కన్గొనియెన్ = చూచెను.

తా త్ప ర్య ము.

భర్తలయొద్దకు దామే పోయి వారిచేఁ గౌఁగిలింపఁబడి సంతోషించిన మనస్సు గలవారిని, పక్షిప్రాయపు వారిని, తమ యిండ్ల యందే విహరించు వారిని, తీఁగవలె మృదువైన దేహములు గల స్త్రీలను, విశేషప్రేమకు స్థానమైన వారిని, రాక్షసుల పడక టిండ్లయందుఁ గ్రీడామందిరంబులందు హనుమంతుఁడు చూచెను.

క. బాలికలన్ శశినిభముఖ,మాలికలన్ వక్రపక్ష్మ•మంజులతరదృ
క్పాళికలం గని భూషణ,మాలికలం జంచలార•మాజాలకలన్. ౨౧౬

అర్థములు. బాలికలన్ = పడుచులను, శశినిభ ముఖ పాలికలన్ = చంద్రునితో సమానమైన ముఖముల వరుసలు గలవారిని, వక్రపక్ష్మ = ముత్తెపుఁ జిప్పల వలె వంకరమైన కనుఱెప్పల వెంట్రుకలచే, మంజులతర = మిగుల నందమైన, దృక్ + పాళికలన్ = కన్నుల సమూహములు గలవారిని, భూషణ మాలికలన్ = ఆభరణముల వరుసలు గలవారిని, చంచలారమా జాలకలన్ = మెఱుపుకాంతుల సమూహము గలవారిని.

తా త్ప ర్య ము.

లేత ప్రాయపు పడుచులను, చంద్రునివంటి ముఖములు గలవారిని, వంకరలగు కను ఱెప్పల వెంట్రుకలు గల కన్నులు గల వారిని భూషణముల ధరించిన వారిని మెఱుపు తీఁగల వంటి వారిని స్త్రీలను హనుమంతుఁడు చూచెను.

సీతను వెదకుచున్న హనుమంతుఁడు స్త్రీల ముఖనేత్రములఁ జూచుట వీరు దేవ జాతులా, మనుష్యులా, రాక్షసస్త్రీలా, యని పరీక్షించుటకును, ఆభరణ పరీక్ష, సీతాభరణ స్వరూపము నిర్ధారించుట కనియును దెలియవగు. సీతాదేవిని జూచి నపుడు ఈమె సీతయని నిర్ణయించుట యందామె యాభరణము లొక ముఖ్య విష యముగా హనుమంతుఁడు గ్రహించె నని 'జానకి సొమ్ము లటంచును, మానవ విభు దేవి పలికె మా కవిమొల్లన్, గానఁగ నయ్యెడిఁ గుజశాఖానికరము లందు వ్రేలి కలికికి నటుతన్,' అని చెప్పఁగలఁడు.

క. సీతను రాజాన్వయసం,జాతను బరమాభిజాత • సద్వ్రతపూతన్
స్ఫీతస్ఫుటలతికానిభ,జాతను గపి మానసాభి•జాతఁ గనండున్. ౨౧౭

అర్థములు. రాజాన్వయ సంజాతను = రాజవంశమునఁ బుట్టిన దానిని, పరమాభిజాత = మిక్కిలి మనోహరమగు దానిని, సద్వ్రత పూతన్ = మంచివ్రతము చేఁ బవిత్రురాలిని; భర్తృ వియోగమందు బతివ్రతయగు స్త్రీ యెట్లుండవలెనో యట్లుండు దానిని; స్ఫీత స్ఫుటలతికానిభజాతను = కొంచెము లావై స్పష్టముగఁ

గనఁబడెడి సన్నని తీఁగవంటి దేహము గలదానిని. జాతశబ్దము జన్మాశ్రయ దేహలాక్షణికము. మానసాభిజాతను=(౧) అయోనిజను (౨) వేదవతీ జన్మమున సీతగాఁ దాను బుట్టవలెనని సంకల్పించుకొని పుట్టినదానిని (మా. ఉత్తర. ప ౩౫. ౩౯౦ప.)

'సంభవా మ్యాత్మ మాయయా'యని భగవంతుఁడు తన సంకల్పముచేఁ దాను జనించినట్లు లక్ష్మియును దన సంకల్పముచే జనించునని భావము.

తాత్పర్యము.

తానుజూచిన స్త్రీలయందు హనుమంతుఁడు రాజవంశమునఁ బుట్టినదానిని ఒకవేళఁ బుట్టినను అంతటి మనోహరను, ఒకవేళ నంతటి మనోహర యయినను భర్త సమీపమున లేనపుడు పతివ్రత యెట్టులుండవలెనో యట్టు లుండుదానిని దీఁగవంటి దేహము గలదానిని స్వసంకల్పముచే నయోనిజగా బుట్టినదానిని జూడలేదు.

సీ. వరసనాతనపథ•స్థిరసన్నివిష్టను, ప్రాణేశముఖలోక•నైకహృష్టఁ
గామాభివిష్ట సు•కాంతావిశిష్టను, నాత్మవల్లభహృద•యప్రవిష్ట
విరహతాపోద్భవా•విరళాశ్రుకంఠిని, రమ్యపక్ష్మల నభి•రక్తకంఠఁ
దరుణిఁ బురావరో•త్తమనిష్కకంఠిని, నిష్కూటసంచర•న్నీలకంఠి
తే. నబ్జరేఖనుబోలె న•వ్యక్తరేఖ, పాంసుపరిదిగ్ధ మగు నవ•ధర్మరేఖ
వ్రణమునను లెస్సనాటిన•బాణరేఖ, యనిలభిన్నాభ్రరేఖనాఁ • దనరుదాని.

అర్థములు. వర = శ్రేష్ఠమైన, సనాతన = శాశ్వతమై, యనాదియైన, పథ= మార్గమున, పతివ్రతల మార్గమున, స్థిరసన్నివిష్టను = స్థిరముగా నుండుదానిని, ప్రాణేశముఖ లోకనైకహృష్టన్ = భర్తముఖము చూచుటచేతనే సంతోషించునది, తక్కినదేదియు నామెకు సంతోషకరముగా దని భావము, కామాభివిష్టను=కనుకనే భర్తతోఁగలియవలెనను పట్టుదల గలదానిని,సుకాంతావిశిష్టను=చక్కని యంగనలలోఁ గొప్పదానిని, ఆత్మవల్లభ హృదయ ప్రవిష్టను=తన భర్త హృదయమందుఁ బ్రవేశించియుండు దానిని, విరహతాపోద్భవ = వియోగతాపముచేఁ గలిగిన, అవిరళ= దట్టమైన, అశ్రు=కన్నీటిచే నడ్డగింపఁబడిన, కంఠిని=కంఠముగల, తేక, తడిసినకంఠము గలదానిని, రమ్యపక్ష్మల=అందమైన ఱెప్పలుగలదానిని, అభిరక్తకంఠిన్ =రంజకమైన కంఠధ్వని గలదానిని, తరుణిన్ =ప్రాయపుదానిని, పురా + వర + ఉత్తమనిష్క-కంఠిని=పూర్వము భర్తయొద్ద నున్నప్పుడు కోరఁబడునదియు శ్రేష్ఠమైన పతకము మెడయందుఁ గల దానిని, నిష్కూట సంచరన్నీలకంఠ = వనమునందు సంచరించు నాఁడునెమలివంటిదానిని, అబ్జరేఖనుబోలెన్ = చంద్రరేఖవలె, పాడ్యమినాఁటి చంద్రునివలె, అవ్యక్తరేఖన్ = స్పష్టముగాఁ గానరాని యాకారముగల దానిని, పాంసుపరిదిగ్ధమగు=దుమ్ముచేఁ గప్పఁబడిన, నవధర్మరేఖ=క్రొత్త బంగారు సలాకువంటి దానిని, పారిశుద్ధ్యము స్వభావము, మాలిన్య మాగంతుక మని యీ యుప

మానము దెలిపెడిని, వ్రణము = పుండు, అనిల భిన్న=గాలిచేఁ జెదరఁ గొట్టబడిన, అభ్ర రేఖ=సన్న మేఘము.

తా త్ప ర్య ము.

శ్రేష్ఠమైన సనాతన ధర్మమార్గమందు స్థిరముగా నుండుదానిని, భర్త ముఖము చూచుట చేతనే సంతోషించు దానిని, కావుననే ఆయనను గూడుట యందుఁ బట్టుదల గలదానిని, అందగత్తెలలో శ్రేష్ఠురాలైన దానిని, భర్త హృదయమందుఁ బ్రవేశించి యుండుదానిని, విరహతాపముచే జనించిన కన్నీటిచేఁ దడిసిన కంఠము గల దానిని, అందమైన తెప్పలు గల దానిని, రంజకమయిన కంఠస్వరము గల దానిని, ప్రాయపు దానిని, పూర్వమునందుఁ గోరఁబడిన శ్రేష్ఠమగు పతకము గల దానిని, వనమునఁ దిరుగు నాఁడు నెమలివంటి దానిని, పాడ్యమి నాటి చంద్రుని వలెఁ గాంతి హీనమై శుష్కించి స్పష్టముగఁ గానరాని దానిని, ధూళిగప్పిన క్రొత్త బంగారుకడ్డివంటి దానిని, పుండునందు గ్రుచ్చుకొన్న బాణము వంటి దానిని, (అంత బాధపడు దానిని,) గాలికిఁ జిందరవందరయైన సన్న మేఘమువంటి దానిని, సీతాదేవిని హనుమంతుఁడు చూచిన వాఁడు కాఁడయ్యెను.

దోదకము. సీతను రాముని • శ్రీతరళాక్షిన్, వాతతనూజుఁడు • పట్టనమందున్
భీతిల కారసి • వేదిజ లేమిన్, జాతమహావ్యథ • సంకటమందెన్. ౨౧౯

అర్థములు. అరసి = వెదకి, వేదిజ = సీత, వేది రూపాంతరము వేదీ. యజ్ఞము చేయుచోటఁ బుట్టినది. దోదకమునకు మూఁడు భగణములు, రెండు గురువులు, ఏడింట యతి.

తా త్ప ర్య ము.

శ్రీరామచంద్రమూర్తి భార్యయగు సీతాదేవిని భయపడక యన్ని రహస్య స్థలము లందుఁ గూడ వెదకియుఁ గానరామిని మిగుల సంకట పడెను.

—• ౬-వ సర్గము. హనుమంతుఁడు రావణాలయంబుఁ జూచుట. •—

తే. వెదకి వెదకియు రాక్షస • నిలయములను
సీతఁ గానక సవిషాద • చిత్తుఁ డగుచుఁ
గామరూపంబుఁ దాల్చి లా • ఘవము మెఱయ
వెండి నొకమాఱు పావని • వెదకఁ దొడఁగె. ౨౨౦

తా త్ప ర్య ము.

రాక్షసుల యిండ్లయందు సీతాదేవిని వెదకివెదకి గానక దుఃఖితుఁడగుచుఁ గోరిన రూపము ధరించి మునుపటికంటె హెచ్చరికగాను వేగముగను మఱియొకసారి వెదక నారంభించెను.

క. కేసరులు గావ నెల్లెడ, భాసిల్లు మహావనంబు • భాతిని దుష్ప్ర-
రాసురసంఘము గావఁగ, వాసిం గని యర్క-వర్ణ • వప్రావృత మై. ౨౨౧

అర్థములు. అర్క-వర్ణవప్రావృతమై=సూర్యకాంతిగల ప్రాకారముచేఁ జుట్టఁబడినదై, ఇది దివిజారి భవనమునకు విశేషణము.

తా త్ప ర్య ము.

సింహములు గావఁగా నిరపాయముగా నుండు వనమువలె మిగులఁ గ్రూరులగు రాక్షసులు గాచుటచేఁ గీర్తిఁగని సూర్యునికాంతిగల ప్రాకారముచేఁ జుట్టఁబడి-

సీ. దేదీప్యమాన మౌ • దివిజారిభవనంబుఁ, గని ముక్కునను వ్రేలు•గదియఁ జేర్చి
రూప్యకోపహితాభి•రూపమణీహేమ,భూషితతోరణ•పుంజ మగుచుఁ
జిత్రకక్ష్యంబులఁ • జెలువారి రుచిర మౌ,ద్వారపంక్తులచే సు•దార మగుచు
వారణారూఢు లౌ•బరికాండ్రచేతను, శ్రమ మెఱుంగని శూర•రాజిచేత
తే. శోభితం బయి త్రొక్కని•చోట్ల త్రొక్కు-
యుగ్యములచేతఁ బలులయు • నుగ్రసింహ
ములయుఁ జర్మములను గప్పు • మొనసి దాంత
కాంచనాంచిత మగు రథ•గణముచేత. ౨౨౨

అర్థములు. దివిజారి భవనంబుఁ గని = రావణునింటినిఁ జూచి, రావణు గృహము హనుమంతుఁడు ప్రవేశించినట్లు ముందు చెప్పఁబడెను. మఱల నిప్పుడు చూచెనని చెప్పఁ బిలయునిన మొదట రావణాంతఃపురమందు సీత యున్నదని చెప్పుటచేత నందు వెదకుద మని ప్రవేశించెనుగాని జాముర్రాత్రియే యయి యుండుటచే నందఱు నిద్రింపక మేలుకొని యుండిరి. ఆ కారణముచే మఱల వెలుపలికి వచ్చి లంకాపురమున వెదకెను. గనుకనే లంకాపుర స్త్రీలు మొదలయినవారు వర్ణింపఁబడిరి. ఇప్పు డంతకంటెఁ బ్రొద్దు పోయిన కారణముచే మఱల రావణు గృహము నొద్దకు వచ్చెనని గ్రహింపవలయును.

దేదీప్యమానము = తళతళ ప్రకాశించునది. రూప్యక+ఉపహిత = వెండిచేఁ జేయఁబడినదియు, అభిరూపమణీ హేమభూషిత = మంచి రత్నములచేతను, బంగారుచేతను నలంకరింపఁబడినది, తోరణపుంజము = తోరణముల సమూహము గలది, చిత్రకక్ష్యంబులు = వింతలగు తొట్టికట్లు, వారణారూఢులు = ఏనుఁగుల నెక్కినవారు, బరికాండ్రచేతను = మావటివాండ్రచేతను, త్రొక్కనిచోట్ల త్రొక్కు=మిగుల వేగముగఁబోవు, యుగ్యములచేత = తేజికిగట్టెడి గుఱ్ఱములచేత, దాంతకాంచన అంచితమగు = దంతములచేతను బంగారుచేతను ప్రకాశించునదియు.

తా త్ప ర్య ము.

ధగద్ధగాయమానముగ వెలుఁగుచున్న రావణు గృహముఁ జూచి యాశ్చర్యమున ముక్కుపై వ్రేలుంచుకొని వెండితోఁ జేయఁబడి నదియు, మేలైన రత్నములు బంగారు చేతను నలంకరింపఁబడినదియు నగు తోరణ సమూహము కలిగి వింతలగు తొట్టికట్లు కలిగి యందమయిన ద్వారములచే, విశేషించి యేనుఁగు లెక్కిన మావ

టీల చేతను, కష్టము తెలియని శూరులచేతను, శోభించి యతివేగముగఁ బోవు తేరి గుఱ్ఱములచేతఁ బులులయు సింహములయుఁ జర్మములచేఁ గప్పఁబడి దంతము బంగారుతోఁ బ్రకాశించు తేర్ల గుంపులచేత.

సీ. రహి మీఱుచు నమూల్య•రత్నసమాకీర్ణ,మై పరార్థ్యాసన • మగుచు మఱియు
నతిరథావాస మై • యతులరథంబులు, నతులపీఠంబులు • నమర బహువి
విధమృగంబులచేత • వికిరసంఘముచేతఁ, బరిపూర్ణ మగుచు ని•ర్భయత రేఁగు
నంతపాలురచేత • నభిరక్షితం బయి, యాత్మ కెక్కి-న మెచ్చు•లాఁడు లొప్ప
తే. బలుపు వెన్నెలపులుఁగుల•బవిసి యార్పు
కన్నుఁగవ లొప్పు ప్రమదల•కనకరత్న
భూషణంబులరావున • బోడము నులివు
లబ్ధిరావంబు నటు లుండు•మనుచు నుండ. ౨౨౩

అర్థములు. రహిమీఱుచు=బాగుమీఱుచు, అమూల్యరత్న సమాకీర్ణమై = వెలలేని మణులచేఁ గూడినదై, పరార్థ్యాసన = గొప్ప పీఠములు గలది, అతిరథ + ఆవాసమై=అతిరథులకు స్థానమై, పెక్కు-విలుకాండ్రతోఁ బోరెడి యోధుఁడు అతిరథుఁడు, వికిర = పక్షుల, అంతపాలురచేతన్=గృహము వెలుపల రక్షించువారిచేత, ఉలివులు=ధ్వనులు, అటు లుండు మనుచు=తిరస్క-రించుచు.

"స్పర్థతే, జయతి, ద్వేష్టి, ద్రుహ్యతి, ప్రతిగర్జతి, ఆక్రోశ త్యవజానాతి, కదర్థయతి, నిందతి, తస్య చానుకరోతీతి శబ్దాః సాదృశ్యవాచకాః । ఉపమాయా ఇమే ప్రోక్తాః కవీనాం బుద్ధిసంపదాః॥" దండి. కావున నిది యుపమావాచక మని యెఱుఁగునది.

తాత్పర్యము.

బాగు మీఱి వెలలేని రత్నములచే నిండినదై పెద్దపీఁటలుగలిగి, యతిరథులకు వాసస్థానమై యసమానములైన తేర్లు, పీఁటలు నొప్పుచుండ, అనేక విధములైన మృగములచేతను, పక్షుల గుంపులచేతను, నిండి భయములేక విజృంభించు వెలుపలి కావలివారిచేఁ జక్క-ఁగఁ గాపాడఁబడి మనస్సునకుఁ దృప్తిని గలిగించు మెప్పులకుప్పలగు స్త్రీలను గలదై, బలసిన చకోర పక్షులతో సమానములైన కన్నులుగల స్త్రీల బంగారు, మణుల భూషణముల రాపిడిచేఁ బుట్టిన ధ్వనులు సముద్రధ్వనులను బోలియుండ.

తే. చందనాగరుధూపవా•సనలు నిండ, భేరికామర్దలధ్వనుల్ • బోరుకొనఁగ
నిశిచరావిరతాభ్యర్చ్య•నీయ మగుచు, నబ్ధిగంభీర మగు రావ•ణాలయంబు. ౨౨౪

అర్థములు. నిశిచర = రాక్షసులచే, అవిరత = ఎడఁతెగక, అభ్యర్చనీయ మగుచు = పూజింపఁబడినదై, అబ్ధి గంభీరము = సముద్రమువలె గంభీరమైనది.

తాత్పర్యము.

చందనము, అగరు వీని ధూపముల వాసనలు నిండఁగా భేరులయు, మద్దెలలయు ధ్వను లతిశయింప, రాక్షసులచే సర్వదా పూజింపఁబడుచు సముద్రమువలె గంభీరమైన రావణ గృహము.

క. పొంకంబుగ హయవారణ,సంకులమై వివిధరత్న•జాలక వేశ్మా
లంకృత మపుడానిని గని, లంకాభరణంబుగాఁ ద•లఁచి నికటమునన్. ౨౨౫

అర్థములు. హయవారణ సంకులమై=గుఱ్ఱములచే, ఏనుఁగులచే నిండినదై; వివిధ రత్నజాలక = నానావిధములయిన మణులు, గవాక్షములు గల యిండ్లచే నలంకరింపఁబడిన దానిని; నిది లంకకు నలంకారమైనదని తలఁచి దాని సమీపమున,

చ. వెదకెను రాక్షసావళుల • వీడును వీడును వాడ వాడయున్
వదలక తోఁట తోఁటయును • వానరవర్యుఁడు దొడ్డి దొడ్డియున్
గొదకొని మేడ మేడయును • గూటము కూటము మూల మూలయున్
మది వెఱలేక తా విసివి • మానక కార్యభరంబు పెంపునన్. ౨౨౬

అర్థములు. రాక్షసావళుల = రావణు సోదరులు మున్నగు రాక్షసుల, గొదకొని = త్వరపడి, వెఱలేక=భయముపడక, విసివి మానక=విసుఁగుచే వదలక.

తాత్పర్యము.

సులభము.

—• హనుమ రాక్షసముఖ్యుల యిండ్లయందు సీతాదేవిని వెదకుట. •—

సీ. వేగ ప్రహస్తుని•వీటికి లంఘించి, మొలమి మహాపార్శ్వు•నిక్క కేగి
కందతుల్యము కుంభ•కర్ణుసౌధముఁ జొచ్చి, యల విభీషణు వాస • మధిగమించి
యట మహోదరవిరూ•పాక్ష విద్యుజ్జిహ్వు. లిండ్లు విద్యున్మాలి•గృహము నరసి
వజ్రదంష్ట్రునిశాల • వలనొప్పఁగా రోసి, శుకసారణులసభల్ సారిది • నెమకి
తే. యింద్రజిత్తునివేశ్మంబు • నెల్ల వెదకి, జంబుమాలి సుమాలుల•సదనములను
రశ్మికేతువుసూర్యశా•త్రవుల నెలవు, వజ్రకాయునిగేహంబు • వరుసఁజూచి. ౨౨౭

అర్థములు. ఇక్క = ఇల్లు, కందతుల్యము = మేఘముతో సమానము. కం + ద = నీళ్ళ నిచ్చునది, శాల = గృహము. వేశ్మంబు = గృహము.

తాత్పర్యము.

శీఘ్రముగఁ బ్రహస్తునింటికి దాఁటి, మహాపార్శ్వ ప్రింటికి నెగిరి, మేఘముతో సమానమైన కుంభకర్ణు గృహము ప్రవేశించి, విభీషణు నిల్లు చొచ్చి, మహోదర విరూపాక్ష విద్యుజ్జిహ్వ విద్యున్మాలి వజ్రదంష్ట్ర శుకసారణులయు, నింద్రజిత్తు జంబుమాలి సుమాలి రశ్మికేతువు సూర్యశత్రువు వజ్రకాయుఁడు వీరల యిండ్లు వెదకి.

సీ. బలులు ధూమ్రాక్షసం•పాతినామకులు వి,ద్యుద్రూపభీములు • నుగ్రులైన
ఘనుఁడు విఘనుఁడు వి•కటుఁడు వక్రుండును, శఠశుకనాస ర•క్షఃప్రవరులు

బ్రహ్మకర్ణుండు దంష్ట్రిధ్వజగ్రీవయు,ద్ధోన్మత్తమత్తులు • నునుటు మీఱు
రోమశుండును మఱి•క్రూరవిద్యుజ్జిహ్వ,హస్తిముఖేంద్రజి•హ్వప్రవరులు
సీ. శోణితాక్షపిశాచులు • శూరుఁ డైన, యా కరాళుండు నివసించు•నాలయముల
వరుస దప్పక యా గంధ•వహసుతుండు, తగవు మఱవక వెదకె నీ•శావధూటి.

అర్థములు. ఊనుట = గర్వము.

తాత్పర్యము.

బలవంతులైన ధూమ్రాక్షుఁడు, సంపాతి, విద్యుద్రూపుఁడు, భీముఁడు,ఘనుఁడు విఘనుఁడు, వికటుఁడు, వక్రుఁడు, శఠుఁడు, శుకనాసుఁడు, బ్రహ్మకర్ణుఁడు,దంష్ట్రిధ్వజ, గ్రీవ, యుద్ధోన్మత్త మత్తులు, రోమశుఁడు, విద్యుజ్జిహ్వ హస్తి ముఖేంద్రజిహ్వులు, శోణితాక్షుఁడు, పిశాచుఁడు, కరాళుఁడు, వీరుండు, గృహముల నన్నిఁటిని వరుస దప్పక హనుమంతుఁడు వెదకెను.

—• హనుమంతుఁడు రావణగృహంబుఁ జొచ్చుట. •—

ఉ. ఈ విధి వారు వారు వసి•యించు గృహంబుల నెల్ల రోసి యా
పావని పాశతోమరకృ•పాణసుముద్గరశూలహస్తలై
కావలికాచుస్త్రీల నుప•కంఠమునన్ శయనించువారి ర
క్షోవిభుమందిరంబునను • జూచి తదంతరసీమలోపలన్. ౨౯

అర్థములు. తోమర=చిల్లకోలయను నాయుధము, కృపాణ=కత్తి.

తాత్పర్యము.

ఈ ప్రకారము వారు వారు కాపురముండు నిండ్లయందు వెదకి యాంజనేయుఁడు పాశములను, చిల్లకోలలను, కత్తులను, ముద్గరములను, శూలములను, చేతి యందు ధరియించి కావలియుండు స్త్రీలను సమీపమున శయనించువారిని రావణు గృహముందుఁజూచి దాని లోపలి ప్రదేశమందు.

క. నానావిధసాధనముల, మానుగ ధరియించు యుద్ధ•మర్మజ్ఞుల ర
క్షోనిచయము రక్తసితా,జానేయంబులను జూచె • జవనాఢ్యములన్. ౩౦

అర్థములు. రక్తసిత+ఆజానేయములను =ఎఱ్ఱని, తెల్లని యుత్తమజాతి గుఱ్ఱములను,యుద్ధమర్మజ్ఞుల, రక్షోనిచయము='మహాత్సమూహార్థక శబ్దం బమహాత్కార్య యుక్తంబయ్యె తద్విశేషణ క్రియలు మహాత్కార్య రూగ్యంబులు విభావనగు' త్రి. శ. ౧౭. జవనాఢ్యములన్=వేగసంపత్తిగలవి.

తాత్పర్యము.

అనేకవిధము లయిన యాయుధముల ధరించి యుద్ధ రహస్యము తెలిసిన రాక్షస సమూహములను, అతి వేగముగఁ బోఁగల ఎఱ్ఱని, తెల్లని యుత్తమజాతి గుఱ్ఱములను హనుమంతుఁడు చూచెను.

క. పరగజపీడాకరములఁ, బరసేనామర్దనముల • వరకులజములన్
హరిహయగజనిభములఁ గే,సరిసూనుఁడు గాంచె రూప•సంపన్నములన్. ౨౩౧

అర్థములు. పరగజ పీడాకరములన్ = శత్రువుల యేనుఁగులను బాధించునవి, పరసేనా మర్దనములన్ = శత్రుసేనలఁ జంపునవి. వరకులజములన్ = గొప్పకులము లందుఁ బుట్టినవి; హరిహయగజ=ఇంద్రుని యేనుఁగగు నైరావతముతో, నిభములన్ =సమానములైనవి, రూపసంపన్నములన్=ఆకార సంపత్తి గలవానిని.

తాత్పర్యము.

శత్రువుల యేనుఁగులను, శత్రుసైన్యములను నాశము చేయునవియు, నుత్తమ జాతిఁ బుట్టినవియు, నింద్రుని యైరావతముతో సమానమైనవియు, నాకారపుష్టి గలవియు నగు నేనుఁగుల హనుమంతుఁడు చూచెను.

క. కురిసెడు జలదములో యనఁ, దొరఁగెడినిర్ఝరచయంబు•తోడి గిరు లనఁ
గురుగర్జన్మేఘము లనఁ, బరఁగెడి పరదుర్జయముల • కారణములన్. ౨౩౨

అర్థములు. నిర్ఝరచయంబులు=కొండవంకలు, గర్జత్ + మేఘములు=ఉఱుము చున్న మేఘములు, పరదుర్జయములు=ఇతరులకు జయింపరానివి, కారణములన్= ఉత్తమ గజములను.

తాత్పర్యము.

వాన కురిసెడి మేఘములో, సెలయేళ్లు పాఱిన కొండలో యనునట్లు మదము కాఱుచున్నట్టివియు, గొప్పగా నుఱుము మేఘములవలె ఘీంకరించునవియు, వేఱు గజములకు, శత్రువులకు జయింపరానివి యగు శ్రేష్ఠములైన యేనుఁగులను మారుతి చూచెను.

సీ. తతకాంచనపరిష్కృ•తంబులౌ తరుణార్క-,సన్నిభ వాహినీ•సంఘములను
నైకాకృతుల నొప్పు•నాందోళికలను వి,చిత్రలతాగేహ•చిత్రనిలయ
కేళీగృహంబులఁ • గ్రీడింప దారుప,ర్వతములఁ గామకా•రణగృహముల
మంజుదివాగృహ•మందరప్రఖ్యమ,యూరతలంబుల;•నొప్పు విటాలు
తే. యుక్కుముల దండములను బా•టించి చూడఁ
దగిన నిధిజాలముల నొప్పి • ధగధగాయ
మాన మగుచుఁ గైలాసస•మాన మైన
రావణుని వీడు గనుఁగొనె • రాముదూత. ౨౩౩

అర్థములు. పరిష్కృతంబులు=అలంకరింపఁబడినవి, తరుణార్క-సన్నిభ=లేఁత సూర్యునితో సమానములైన, వాహినీ=సేనల, నైకాకృతులన్=అనేకాకారములను, ఆందోళికలన్=పల్లకులను, దారు పర్వతములను = కొయ్యలతోఁ జేయఁబడిన కృత్రిమ క్రీడా పర్వతములను, కామకారణ గృహములన్=కామము గలిగించు నిండ్లను, దివా

గృహ=పగలు క్రీడింపఁ గట్టఁబడిన యిండ్లను, మందరప్రఖ్య = మందర పర్వతముతో సమానమైన, మయూర తలంబులన్ = నెంపుడు నెమిళ్ళ నివాసస్థలములను.

తా త్ప ర్య ము.

విస్తారముగ బంగారుచే నలంకరింపఁబడి బాలసూర్యునితో సమానములైన సేనల సమూహములను, అనేకరూపములు గల పల్లకీలను, చిత్రముగా నల్లిన తీఁగలచే నిర్మింపఁబడిన యిండ్లను, చిత్రములైన క్రీడా గృహంబులను క్రీడించుటకై కొయ్యలచే నిర్మింపఁబడిన పర్వతములను, కామము వృద్ధిచేయు నిండ్లను, పగటివేళఁ గ్రీడింప ననువైన యిండ్లను, నెంపుడు నెమిళ్లుండుటకై కట్టఁబడిన మందరముతో సమానమైన ప్రదేశములను, ధ్వజదండములను, నిధుల సమూహములను గలిగి ధగధగ మని ప్రకాశించుచుఁ గైలాసముతోఁ సమానమైన రావణుని యింటిని రాము మాత చూచెను.

క. సురశాత్రవు తేజముచేఁ, బరమమణీనికరదీప్తి • పటలంబులచే
భరితం బయి రావణుమం,దిరము వెలింగెను గరాళి • దినకరుమాడ్కిన్. ౨౩౪

అర్థములు. సురశాత్రవు = దేవ విరోధియగు రావణుని యొక్క, పరమ మణీ నికర = ఉత్తమములైన రత్నసమూహముల యొక్క, దీప్తి పటలంబులచేన్ = కాంతి సమూహములచే. భరితంబయి = నిండి, కరాళిన్ = కిరణములచే, దినకరు మాడ్కిన్ = సూర్యునివలె.

తా త్ప ర్య ము.

కిరణములచే సూర్యుఁడు ప్రకాశించునట్లు దేవవిరోధి తేజముచేతను, జాతి రత్నములకాంతుల సమూహములచేతను, రావణుమందిరము ప్రకాశించెను.

క. ప్రాసాదసంఘయుతమై, భాసురమణిభాజనాళి • భరితంబై మ
ధ్వాసవసుపరిక్లిన్నం,బై సరసమృదంగనాద•మై కడువిరిసై. ౨౩౫

అర్థములు. భాజనాళి = పాత్రల సమూహముచే, భరితంబై = నిండి, మధ్వాసవ = తియ్యని సారాయముచే, పరిక్లిన్నంబై =తడిసినదై, మృదంగనాదమై= మద్దల ధ్వనులు గలదై, విరిసై = వెడలునై.

తా త్ప ర్య ము.

మేడల, యిండ్ల గుంపులు గలదై ప్రకాశించు రత్నములచేఁ జేయఁబడిన పాత్రములతో నిండి తియ్యని సారాయములతోఁ దడిసి యానందకరమైన మద్దెల ధ్వనులు గలదై వెడలునై.

ఉ. బంగరుసెజ్జలుం దళుకు•బంగరుపాత్రలుఁ జిత్తచోరమ
త్తాంగజఘోటికానిభవ•రాంగనలున్ మణికాంచినూపురా
రంగరవంబులుం గలిగి • బాధమనోరమమై విశాలమై
యంగను రావణాసురగృ•హంబువరంబును గాంచి దానిలోన్. ౨౩౬

అర్థములు. సెజ్జ=పానుపు, శయ్యా శబ్దభవము (సజ్జ=ఇల్లు) మత్త=మదించిన, అంగజఘోటికానిభ=మన్మథుని యొఁకు గుఱ్ఱములతో (చిలుకలతో) సమానలైన, వరాంగనలుఁ=ఉత్తమ స్త్రీలును, మణికాంచి = మణులు చెక్కిన మొలనూళ్ళ యొక్కయు, నూపుర=అందెలయొక్కయు, అభంగరవంబులు = విడువని ధ్వనులు, (లక్ష్మణునకు కిష్కింధలోఁ బట్టిన దశ హనుమంతునకు లంకలోఁ బట్టెను) బాధ మనోరమములై=మిగుల మనోహరమై, కాంచీ-కాంచి యని రెండు రూపంబులు గలవు. (చూ. కుమా. సం. 1-37-8_55; మేఘ. 28. శిశు. 9 82, రఘు. 6_48) "కాంచి దామ పిహితైక కరోరుః" అని మాఘుఁడు. 'క్వచిత్ కాంచిః ఇత్యపిపాఠః' అని త్రికాండశేషవ్యాఖ్య. ఏకయష్టి ర్భవేత్కాంచీ, మేఖలా త్వష్టయష్టికా, రసనా షోడశసరా కలాపః పంచవింశకః" ఒంటి సరము మొలనూలు కాంచి, ఎనిమిది సరములది మేఖల, పదాఱుసరములు గలది రసన (రశన) ఇరువదియైదుసరములు గలది కలాపము, అని మొలనూళ్ళ భేదములు.

తాత్పర్యము.

బంగారు పానుపులు, మెఱుఁగు బంగరు పాత్రములు, మనస్సును దొంగిలించు చిలుకలవంటి యుత్తమ స్త్రీలు, వారి మొలనూళ్ళయు, నందెలయు ధ్వనులు, (ఇది పురుషాయిత క్రీడ తెలిపెడిని) గలిగి మిగుల మనోహరమై విశాలమై యందమైన రావణాసురుని యుత్తమ గృహములఁ జూచి దానిలో పానుపులు, పానపాత్రములు, వరాంగనలు, రతిక్రీడలు తెలుపుటచే స్త్రీలు పురుషు లందఱు తమ పడుకటిండ్లలోఁ బండుకొని యున్నారనియు వెలుపలఁ దిరుగువారు లేరనియు సూచన.

— ౭-వ సర్గము. హనుమంతుఁడు నగళ్ళలో సంచరించుట. —

మధురగతిరగడ.

మారుతి గన్గొనె • మందిరజాలము, హారివిదూరజ•హాటకజాలముఁ
జపలాలతికా•శకునవిహారము, నిపుణప్రావృ•ణ్ణీరదవారము
వలెఁ బలుదెఱఁగుల • భాసిలు శాలలఁ, గలితాంబుజఘన•కార్ముకశాలల
రమణీయం బయి • క్రాలు విశాలల, విమలగృహోపరి•విలసచ్ఛాలలఁ
బరమసురత్న•భ్రాజిత మగుచును, బురుహూతాదిక•పూజిత మగుచును
వరమును దోషవి•వర్జిత మగుచును, వరయఁగ నాత్మబ•లార్జిత మగుచును
మయదానవ వర•మతి నిర్మితమై, మణిమయభూషా•మండిత మగుచును
భాసిలు గృహముల • భావని గాంచెను, ఏసముఁ గొంకక • వేడ్కఁ జరించెను.

అర్థములు. మందిరజాలము = ఇండ్లసమూహము, హారి = మనోహరమైన, విదూరజ = వైదూర్యములతోను, హాటక = పైఁడితోను జేయఁబడిన, జాలము= కిటికీలు గలదియు, చపలాలతికా = మెఱుపులవంటి తీఁగెలు గలదియు, శకున = పక్షులయొక్క; విహారము = సంచారము గలదియు; ప్రావృట్ =

వానకాలమందలి, నీరదవారమువలె = మేఘసమూహమువలె, కలితాంబుజ ఘన కార్ముక శాలలన్=శంఖములతోను, గొప్ప విండ్లతోను గూడిన శాలలను, విమల= శుద్ధమైన, గృహోపరి = ఇండ్లమీఁద, విలసత్ =ప్రకాశించు, శాలల = భవంతులను, పురుహూతాదిక = ఇంద్రుడు మొదలగువారిచే, ఆత్మ బలార్జితము=తన భుజబలముచే కుబేరుని జయించి సంపాదించినది, మయదానవ = మయుఁడను దానవుని యొక్క, వరమతి = బుద్ధి చాతుర్యముచే, నిర్మితమై=కట్టఁబడినవై, పూర్వము లంక విశ్వకర్మ కృతమని చెప్పఁబడెను. ఇప్పుడు మయదానవకృత మని చెప్పఁబడెను. లంకానగరమును తొలుతఁ గుబేరునకై విశ్వకర్మ నిర్మించెను. అవల రావణుఁడు దాని నాక్రమించిన తరువాత వాని కనుకూలముగ వాని యాజ్ఞచే మయుఁడు తన బుద్ధి చమత్కారము కొలఁది నెక్కువ గృహములు కట్టెను. ఈ యిల్లు తన యిష్టానుసారము రావణుఁడు స్వయముగఁ గట్టించుకొన్నది.

మధురగతి రగడ- "నాలుగు మాత్రలు నాటిన గణములు నాలుగు రెంటికి నవి విరమణములు గలసి మధురగతికి నలును జగణము తొలఁగిన ధృత కౌస్తుభక విరమణము." అప్ప.

తాత్పర్యము.

మనోహరములైన వైడూర్యములచేతను బంగారుచేతను, నిర్మింపఁబడినవియు, మెఱుపుఁదీఁగలవంటివై పక్షులు విహరించునవియు నగు నిండ్ల సమూహములను, గొప్ప వర్షాకాల మేఘమువలె నానావిధముల నొప్పు శాలలను, శంఖములు పెద్ద విండ్లుగల శాలలను, మిగుల విశాలములైనవానిని, ఇండ్ల మీఁదఁ గట్టఁబడిన భవంతులను, హనుమంతుఁడు చూచెను. జాతి రత్నములచేఁ బ్రకాశించుచు, ఇంద్రాదులచేఁ బూజింపఁబడుచు, నట్టి వాస్తుదోషము లేనిదై, తన భుజబలముచేఁ గుబేరుని గెలిచి సంపాదించినదై మయుఁడను దానవునిచే నతని బుద్ధి చమత్కారము కొలఁది నిర్మింపఁబడినదై రత్నములచే నిండిన భూషణములచే నలంకరింపఁబడి ప్రకాశించు గృహములను వాయుపుత్రుఁడు చూచి వానియందు జంకు గొంకు లేక విహరించెను.

—• హనుమంతుఁడు పుష్పకవిమానముఁ జూచుట •—

వృషభగతిరగడ.

ఘనఘనాఘనకలితరూపము • కాంచనాంచిత చారురూపము
దనుజనాథబలానురూపము • ధాత్రి నప్రతిరూపరూపము
ధారిణీగస్వర్ణప్రకీర్ణము • తతవిభాబహురత్నకీర్ణము
చారుతరుకుసుమావకీర్ణము • క్షౌద్ర మనఁగ రజోవికీర్ణము
చంచలాంగీదీప్యమానము • చంచలాయుతఘనసమానము
అంచితసితఖగోహ్యమానము • నగు విమానమునను ననూనము
నగ మనన్ బహుధాతుచిత్రము • నైకవర్ణపతాకచిత్రము

గగన మన గ్రహచంద్రచిత్రముఁ • గనె విమానము రత్నచిత్రము
ధరణి పర్వతరాజపూర్ణము • ధరము వృక్షవితానపూర్ణము
ధరణిరుహము సుమౌఘపూర్ణము • తతసుమావళి పత్రపూర్ణము
భాసురసుమగపుష్కరంబులు • పక్షికలయుతనిష్కుటంబులు
కేసరాన్వితపుష్కరంబులు • గృహము లచ్ఛ స్ఫాటికరంబులు
అకుపచ్చవిహంగమంబులు • హారిజాత్యతురంగమంబులు
నైకరత్నభుజంగమంబులు • నవ్యరుచి నభసంగమంబులు. ౨౩౮

ఇచటఁ గుబేరుని జయించి తెచ్చిన పుష్పక విమానము వర్ణింపఁబడుచున్నది.

ఘన = గొప్పదియగు, ఘనాఘన = వర్షాకాలమేఘమువలె, కలితరూపము = ఒప్పిన యాకారము గలది, కాంచనాంచిత = బంగారుచేఁ బ్రకాశించు, చారు రూపము=మనోహరమైన రూపము గలది, దనుజ నాథ = రావణునియొక్క బల = బలమునకు, అనురూపము = తగినది, అప్రతిరూప = ఎదురులేని, రూపము = సౌందర్యముగలది, ధారిణీగస్వః ప్రకీర్ణము = దైవవశమున భూమి మీఁద జాఱిపడిన స్వర్గము వంటిది, తతవిభా = విస్తార కాంతిగల, రత్నకీర్ణము = రత్నములతోఁ గూడినది, చారుతరకుసుమ = మిగుల మనోహరమయిన పుష్పములచే, అవకీర్ణము = వ్యాపించినది; క్షౌద్రమనఁగన్ = తేనెయో యన్నట్లు, రజోవికీర్ణము = పుష్పాదిచే నిండినది. "మాక్షికం తైలవర్ణంస్యాత్, ఘృతవర్ణంతు పౌత్తికమ్, విజ్ఞేయం భ్రామరం శ్వేతం, క్షౌద్రంతు కపిలం మతమ్" మాక్షికమను తేన తైలవర్ణము గలది. పౌత్తికమను తేన నేతివర్ణము గలది, భ్రామరమను తేన తెలుపువన్నె గలది. క్షౌద్రమను తేన కపిల వర్ణము గలది. చంచలాంగీ = మెఱుపువంటి దేహముగల స్త్రీలచే, దీప్యమానము = ప్రకాశింపఁ జేయఁబడినది. చంచలాయుత = మెఱుపులతోఁ గూడిన, ఘనసమానము = మేఘముతో సరిపోయినది. అంచిత = ప్రకాశించు, సితఖగ = హంసలచే, ఊహ్యమానము = మోయఁబడుచున్నది. అగు విమానమునకు, అనూనము=తక్కువకానిది, అనఁగా సమానమైనది, నగమనన్ = పర్వతమువలె, నైకవర్ణపయోదచిత్రము = నానావర్ణములు గల మేఘమువలె వింతనైనది, గ్రహచంద్ర చిత్రము = సూర్యచంద్రులచే చిత్రింపఁబడినది, ధరము= పర్వతము, వితాన = సమూహము, సుమౌఘ = పూలరాశి, భాసుర+సుమగ+పుష్కరంబులు = కాంతిగల పుష్పములతోఁ గూడిన జలములు, కల = అవ్యక్త మధుర ధ్వని, నిష్కుటంబులు = ఉద్యానవనములు, కేసరాన్విత పుష్కరంబులు = అకరువులతోఁ గూడిన కమలములు, అచ్ఛ = నిర్మలమైన, స్ఫాటికరంబులు = కాంతుల కిరణములు గలది, విహంగమంబులు = పక్షులు, హారి = ఇంపైన, జాత్యతురంగమంబులు = ఉత్తమాశ్వములు, నైకరత్న భుజంగమంబులు = అనేక రత్నములతోఁ జేయఁబడిన పాములు, నవ్యరుచి = మనోజ్ఞ కాంతిగల, నభసంగమం

బులు = పక్షులు, నభసి + గచ్ఛంతి = ఆకాశమునఁ బోవునవి కావున నభసంగ మములు.

తా త్ప ర్య ము.

గొప్ప వర్షాకాల మేఘమువంటి యాకారము గలది, బంగారుచేఁ బ్రకాశించు మనోహరాకారము గలది, రావణాసురుని బలమునకుఁ దగినది, కావుననే భూమి యందు దానికి సమానమైనది లేనిది, ఆకాశమునుండి జారిపడిన స్వర్గమా యేమి యనదగినది, విస్తారకాంతిగల యనేక రత్నములతోఁ గూడినది, మనోహరము లైన పుష్పములచే వ్యాపించినది, తేనెవలెఁ బుప్పొడిచే నిండినది, మెఱుపులతోఁ గూడిన మేఘమువలె మెఱుపుఁదీఁగలవంటి దేహములు గల స్త్రీలచేఁ బ్రకాశించునది. హంసలు మోసికొనిపోవు బ్రహ్మవిమానమునకు సమానమైనది. పర్వతమా యన్నట్టు లనేకగైరికధాతువులచే వింతమైనది, గనుక నానావర్ణ ములుగల మేఘమువలెఁ జిత్రమైనది, ఆకాశ మనునట్లు సూర్య చంద్రులు చిత్రింపఁ బడినది, ఇట్టి రత్నచిత్రమైన విమానమును హనుమంతుఁడు చూచెను. అందు భూమి పర్వతముల వరుసలచే నిండినది, పర్వతములు వృక్షసమూహములచే నిండినది, వృక్ష ములు పూల రాసులచే నిండినవి, పూలరాసు లాకులతో నిండినవి, భూమి-పర్వత ములు లోనైనవి చిత్తరువులని గ్రహింపవలెను. (ఈ రెండు పాదములందు నేకావళి యలంకారము) పూర్వ పూర్వ వస్తువునకు నుత్తరోత్తర వస్తువు విశేషణ మయ్యెనేని యేకావళి యగును. పూలతో నిండిన నీళ్లు; పక్షి కలకలధ్వనులతో నిండినతోఁటలు, ఆకులతోడి కమలములు, కాంతులు వెదజల్లు గృహములు, ఆకుపచ్చ పక్షులు, ఉత్తమ జాతి గుఱ్ఱములు, అనేకరత్నములతోఁ జేయఁబడిన పాములు, ఆయా పక్షివర్ణమునకుఁ దగినట్లు రత్నములతోఁ జేయఁబడిన పక్షులు అందుఁ జిత్రింపఁ బడెను. వృషభగతి రగడ=ఇరువది యెనిమిదిలఘువులు, పదునేనిట విశ్రాంతియు; గూర్చిన నిరవగు వృషగతి పద్మాధిప, యది విను మాదరమున ముదమునఁ ఇందు లఘువు లనుటచే నన్నియు లఘువు లుండవలెనని యెంచరాదు. గురువునకు రెండు లఘువులవంతున లెక్కింపవచ్చును.

క. సాక్షాత్సుమనస్సాయక,పక్షములు ప్రవాళకనక•పక్షములు లస
త్పక్షములు కుసుమకీలిత, పక్షములు సలీలవక్ర•పక్షము లమరన్. ౧౩

అర్థములు. మీఁదఁ గడపటఁ జెప్పిన పక్షు లిందు వర్ణింపఁబడు చున్నవి. సాక్షాత్ సుమనస్సాయక పక్షములు = ప్రత్యక్షముగ మన్మథునకు సహాయమ్ము లగునవి, వానిని జూడఁగానే కామము జనించునని భావము. ప్రవాళకనక పక్షములు = పగడములతోను; బంగారు తోను దీర్పఁబడిన ఱెక్కలు గలవి. ఱెక్కల కొనలందు బంగారు కూర్పఁబడినదని భావము. 'కం. ఱెక్కల కొనలం గలిగిన, యుక్కాంచన మాసపడియెడే వృష నీ కే యక్కట దీనం దీరెడు" నని

శృంగారనై పథము. కుసుమ కీలిత పక్షములు = పూలతోఁ జేసిన, కూర్పఁబడిన ఱెక్కలు గలవి, సలీలవక్రపక్షములు = విలాసముగా వంకరగా నుండు ఱెక్కలు గలవి. పూర్తిగా ముడుచుకోక పూర్తిగా చాఁచుకోక కొంచెముగా విచ్చిన ఱెక్కలని భావము.

తా త్ప ర్య ము.

కామ ముద్దీపింపఁ జేయుటయందు మన్మథునకు సహాయపడునవి, ఱెక్కల కొనలందు పగడములు బంగారు కూర్పఁబడినవి, ఆ కారణముచేఁ బ్రకాశించునవి. బంగారుతోను, పగడములతోను జేయఁబడిన పూలు చెక్కబడినవి. మీఁదఁ జెప్పఁబడిన పక్షు లిట్లున్నవని భావము.

క. తమయంతఁ గరులు నుసుఁదొం,డములన్ నెఱవిచ్చియు కలువ • వనలఁ గొలని నీ
రము గొని యభిషేకింపఁగఁ, గమలాంచితహస్తయైన • కమలాపతితోన్. ౨౮౦

తా త్ప ర్య ము.

ఏనుఁగులు తమ తమ తొండములతో దమంతఁదామే బాగుగ విచ్చిన కలువ పూలను నీరు తీసికొని యభిషేకింపఁగాఁ గమలము చేత ధరించిన లక్ష్మీదేవితో ఈ ప్రకారము శిల్పము చేయఁబడి యున్నదని భావము.

క. కమ్మనివలపులు గల వృక్షమ్మన మాధవదరీద్ధ • శైల మ్మన హృ
త్సమ్మతపుష్పవిమానం, బమ్మరుదాత్మజుఁడు గాంచి • యబ్బురపడినెన్. ౨౮౧

అర్థములు. అమరన్ – అనునది పూర్వ పద్యమునుండి గ్రాహ్యము అమరన్ హృత్సమ్మత పదముతో నన్వయము, వలపులు=వాసనలు, మాధవ=వసంత కాలమందలి, దరీద్ధ=గుహలచేఁ బ్రకాశించు, శైలమ్మనన్ = పర్వతమో యనునట్లు, హృత్సమ్మత=హృదయమున కిష్టమైన, అబ్బురపడినెన్=ఆశ్చర్యపడినెను.

తా త్ప ర్య ము.

సువాసనలు గల వృక్షమో, వసంతకాలమున గుహలచే నొప్పు పర్వతమో యనఁదగిన, హృదయమున కిష్టమైన పుష్పక విమానమును హనుమంతుఁడుచూచి దాని రచన కాశ్చర్య పడెను. మాధవ కాలమందలి గుహయనుటచే నాకాలమందలి పుష్పవాసనతోఁ గూడి యుండుట వివక్షితము. దానిచుట్టి యెంతదిరిగినను రావణుఁడు స్త్రీలతో నుండు స్థలము కానరాలేదు. ఆ విమానము పరిమితి తెలియలేదు కావున నాశ్చర్యపడె నని భావము.

క. ఎంతయు వింతలు పురమున, దంతటఁ గనుఁగొనుచు నరిగి • యరిగి మహీజా
కాంతను గనక సునేత్రుఁడు, చింతాయుతుఁ డయ్యె నేమి • చేయుదు ననుచున్.

అర్థములు. సునేత్రుఁడు=(౧) బహు దూరముననున్న సూక్ష్మ వస్తువునైనఁ జక్కఁగాఁ జూడఁగల దృష్టి పాటవము గలవాఁడు. దగ్గఱకుఁబోయి తిరుగవేసి మరల వేసి చూడవలసిన పనిలేదని భావము. ఈదృష్టి పాటవ మీయనయందు విశేషించి

యున్నట్లు ౧౨౫ వ పద్యమునఁ జెప్పఁబడెను. (౨) ఒకసారి చూచిన మాత్రాన సమస్త వస్తువులను మరలఁ జూడవలసిన పనిలేక కరతలామలకముగా గ్రహించును.

తా త్ప ర్య ము.

ఆ పట్టనమందు సమస్త ప్రదేశములు తిరిగి తిరిగి యెన్ని వింతలో చూచెను గాని యీ సునేత్రుఁడు సీతాదేవి గానరామిని నిఁకనేమి చేయుదునా యని మిగుల విచార గ్రస్తుఁడయ్యెను.

—• ౮-వ సర్గము. పుష్పకవిమానవర్ణనము •—

ఉ. ఆ నిలయంబులోన నడు•మంతరమందు విచిత్రరత్నసం
తానధగద్ధగాయితసు•తప్తసువర్ణమనోహరంబు నై
మానికమార్గసంచరణ•మానిత మప్రతిమం బమేయమున్
భానుపథైకలక్ష్యమును • బావని గాంచె విమానరత్నమున్. ౨౮౩

పుష్పకవిమాన వర్ణనమే యింకను జేయుచున్నాఁడు. ఆ నిలయంబులోన= పుష్పకాధారమైన రావణుగృహంబు లోపల, సుతప్తసువర్ణ = పుటము వేయఁబడిన బంగారు, వైమానిక మార్గ=దేవతలు సంచరించు నాకాశమందు, సంచరణ= సంచరించుటచేత, మానితము = గౌరవింపఁబడినది. అప్రతిమము = అసమానమైనది, అమేయము = పరిమితి చెప్పరానిది, భానుపథైకలక్ష్యము = సూర్యుఁడు సంచరించు మార్గమే తనకుఁ బ్రధాన లక్ష్యముగాఁ గలది. విశేషముగ నాకాశమందే సంచరించునది యని భావము. ఆకాశసంచారము గలది యీ యింటి నడుమ గల దనుటచే నా విమానము భూమి మీఁద నాకాశమునఁ గూడ నుండఁ గలదని భావము. దేవతల విమానములు కొన్ని భూమి మీఁదికి రాఁజాలవు. భూమి యందలివి యాకాశమునకుఁ బోలేవు. ఇది యట్లు గాదు అని భావము.

తా త్ప ర్య ము.

పుష్పకాధారమైన యీ యింటిలో నడిమిభాగంబున వింతవింతలైన మణుల గుంపులచే ధగద్ధగ మనిమెఱయు పుటము వేసిన బంగారువలె మనోహరమై యాకాశ మార్గమునఁ బోఁగల దగుటచే గౌరవింపఁబడు నదియై యాకారణముచే నసమానమై పరిమాణమందు విస్తారమై యాకాశమందే విశేషముగ సంచరించు శ్రేష్ఠమైన విమానమును హనుమంతుఁడు చూచెను.

ఉ. అందు నమేయకౌశలసు•యత్నముతోడ నొనర్పనట్టి దే
దంతును లేదు దివ్యమణి•హీరవినాకృతి యెందు లేదు త
త్సుందరతాగుణంబు గన • ద్యోచరయానములందుఁ గల్గ దెం
దెందుఁ గనంగ నబ్బ ముద•యింపక పోదు నితాంత మేరికిన్. ౨౮౪

అర్థములు. అమేయకౌశల=మిగుల నేర్పుతోను, సుయత్నముతోడ = విశేష

ప్రయత్నముతోడను, హీరవినాకృతము=వజ్రములు లేనిదిగాఁ జేయఁబడినవి,ద్యోచర యానములందు=దేవతల విమానములందు.

తాత్పర్యము.

ఆ విమానమందు మిగుల నేర్పుతోను, నతి ప్రయత్నముతోను జేయఁబడనిది యేదియు లేదు. ఎందును లేదు. దేవతాసంబంధమైన మణులు వజ్రములుగూర్పనిదియు లేదు. దాని సౌందర్యము దేవతల విమానమందును లేదు. ఏ ప్రదేశమును జూచినను చూచినవారికి మిగులనాశ్చర్యము గలిగింపక పోదు.

సీ. విపులతపంబున • విక్రమంబున నార్జి,తం బయి హృత్సమా•ధానముగను
జరియించుచు ననేక•సంస్థాననిర్మితం, బై సర్వతో మనో•హరము నగుచు
దుర్వార మై వాయు•తుల్యజవంబు నై, కృతపుణ్యమహితాత్మ•గేహ మనఁగ
నొప్పుచుఁ జిత్రకూ•టోత్కరమండితం, బై హృద్య మై శర•దంబుజారి

తే. ధవళ మై కుండలాలంకృ•తముఖ గగన, చరనిశాచరచారువి•శాలనయన
భూరిజవనదురాధర్ష•భూతగణస,హస్రవాహిత మయి యొప్పు•నట్టి దాని. ౮-౯

అర్థములు. హృత్సమాధానముగను = మనస్సునకుఁ దృప్తికరముగ, అనేక సంస్థాన నిర్మితంబై = గోపురములు, ప్రాకారములు లోనగు ననేక సన్నివేశములచే నేర్పఱుపఁబడి, సర్వతోమనోహరము = అన్ని ప్రదేశముల నన్ని విషయముల మనస్సు నాకర్షించునది, దుర్వారము=గమనమం దడ్డము లేనిది, వాయుతుల్య జవంబునై=వాయువేగముతోఁ బోఁగలదై, కృతపుణ్య=పుణ్యము చేసిన, మహితాత్మ= గొప్ప మనస్సుగల యుత్తమ పురుషుల, గేహము=ఇల్లు, అనఁగా స్వర్గమో యను నట్లు, చిత్రకూటోత్కర మండితంబై =చిత్రములైన యనేక శిఖరములచే నలంకరింపఁ బడి, హృద్యమై=హృదయమునకు సంతోషకరమై, శరదంబుజారి ధవళమై=శరత్కాల చంద్రునివలెఁ దెల్లనై, కుండలాలంకృత ముఖ = కుండలములచే నలంకరింపఁబడిన ముఖములను, గగన చర నిశాచర=దేవతలు రాక్షసులు గలవియు, చారు విశాల నయన = మనోహరమైన వెడలుపాటి కన్నులు గలవియును, భూరి జవన= అధిక వేగము గలవానివలెఁ గానవచ్చునవియు, దురాధర్ష = తిరస్కరింపరాని, భూతగణసహస్ర = గోపురములను మోయు బొమ్మలవలెఁ బ్రతిమారూపముగ నున్న పిశాచములచే, వాహితము = మోయఁబడునది, ఇందుఁ జెప్పఁబడిన భూతగణములు ప్రాణములతో నుండునవి కావు. ఆకాశమునఁ బోవుదాని నొకరు మోయనేల? అదియును గాక రావణుని యంతఃపురమున జీవించి యుండు మగవారుండరాదు. కావున నివి నిర్జీవములైన బొమ్మలనియే గ్రహింపవగు. ప్రయాణమై పోవునపు డెవరైన మోయవలసిన పని యుండును గాని కదలక యొక చోట నుండునపు డెవరు మోయవలసిన పని యేమి యున్నది? ఈ విమానము యంత్ర బలమున నడచునుగాని భూతములు మోచికొని పోవుటచేఁ గాదు. దీనిని

నడపువాఁడును గలఁడు. ఉత్తరకాండమునఁ జూచునది. (ప. ౯౦౬) ఇది యిప్పటి యంత్రసాధ్య విమానముల వంటిది.

తా త్ప ర్య ము.

గొప్ప తపస్సువలన గలిగిన పరాక్రమముచే సంపాదింపఁబడి హృదయ సమ్మతముగఁ దిరుగఁ గలదై, గోపుర ప్రాకారాదులు గలిగి యెందుఁ జూచినను అన్ని ముఖముల మనోహరమై వాయువేగము గల దగుటచే నివారింపరానిదై, స్వర్గమో యనునట్లు లొప్పుచుఁ జిత్ర శిఖరములచే నలంకరింపఁబడి శరత్కాల చంద్రునివలెఁ దెల్లనై, కావుననే యింపై, కుండలములచే నలంకరింపఁబడిన ముఖములు గలిగి దేవతా రాక్షసాకారములు పెద్దకన్నులు నధికవేగము గలిగి తిరస్కరింపరాని వేలకొలఁది భూత సమూహములచే మోయఁబడు దానిని.

క. సురభిసుమసుందరం బై, సురభిత మై సురభికంబు • సుందర మగుచున్
సురశిల్పివినిర్మిత మై, పరఁగెడి పుష్పకవిమాన•వరముం గనుచున్. ౨౪౬

అర్థములు. సురభిసుమ సుందరంబై = వసంతకాలపుష్పమువలె నందంబై, సురభితమై = మంచి వాసనగలదై, సురభికంబు = వసంతకాలముకంటె, సురశిల్పి వినిర్మితంబై = విశ్వకర్మచే నిర్మింపఁబడినదై.

తా త్ప ర్య ము.

వసంతకాల పుష్పమువలె సుందరమై, పరిమళముగలదై, వసంతకాలముకంటె సుందరమై, విశ్వకర్మ నిర్మితమైన విమానశ్రేష్ఠమును జూచుచు.

—• ౯-వ సర్గము. హనుమంతుఁడు రావణుని యంతఃపురంబుఁ జూచుట. •—

తే. ఆ విమానంబు మధ్యంబు•నందు నర్ధ, యోజనము విస్తృతియు నొక్క•యోజనంబు
నిడివి గలపంక్తికంఠుమం•దిరముఁ జొచ్చి, యాయతాక్షిని వెదకెహ•తారికులుఁడు.

అర్థములు. హతారికులుఁడు = చంపబడిన శత్రు సమూహము గలవాఁడు.

తా త్ప ర్య ము.

ఆ విమానము నడుమ నర్ధ యోజనము వెడలుపు, ఒక యోజనము నిడుపు గల రావణాసురుఁడు కాఁపురము చేయు నిల్లు సొచ్చి యందు హనుమంతుఁడు సీతాదేవిని వెదకెను.

క. పెక్కులు మాడుగు లొప్పెడి, రక్కస నాయకులనగరఁ • గ్రమముగఁ గని పే
రుక్కు గల ద్రోహు లిండ్లను, గ్రక్కున జేఁడుంచు పీటఁ•గవఁగఁ దొడంగెన్. ౨౪౭

అర్థములు. మాడుగులు = మేడలు, ద్రోహులు = రాక్షసులు.

తా త్ప ర్య ము.

పెక్కులు మేడలు గల రావణుని నగరు నందు వరుసగ బలవంతులగు రాక్షసుల యిండ్లయందు రావణుఁ డుండు నింటియందును వెదక నారంభించెను.

సీ. మూఁడును నాల్గు కో•మ్ములు గలయేనుఁగు, లెడ మెడముగఁ గట్టఁ•బడుచునుంట
యుద్ధృతాయుధు లైన•యోధులు గాచుట, యసురనాయకుని భా•ర్యాళిచేత
విక్రమాహృతపృథి•వీధవకన్యకా, బృందంబుచేఁ బరి•వృతము నగుట
తిమితిమింగిలనక్ర•దీర్ఘ ఝషాకులో, దధి నాఁగఁ గల్లోలి•తంబు నగుట
ఆ. శ్రీదు లక్ష్మి, యింద్రు•సిరియును; సర్వంబు, వాయ కుంట వాని•బంధు లిండ్ల
యమకుబేరవరుణ•రమయు నంతకు మిన్న, వెలయు చుంటఁ గనియె • వీరవరుఁడు.

అర్థములు. ఉద్ధృతాయుధులు = ఎత్తఁబడిన యాయుధములు గలవారు; విక్రమ=పరాక్రమముచే, ఆహృత=అపహరింపఁ బడిన, పృథ్వీధవ కన్యకాబృందంబుచే=రాచకన్నియల సమూహముచే, పరివృతము = ఆవరింపఁబడినది, తిమింగిల = తిమినిమ్రింగెడి పెద్దచేఁపచేత, దీనిని మ్రింగెడి చేఁపకు తిమింగిల మని పేరు, నక్ర=మొసళ్ళచేత, దీర్ఘఝషా=నిడివి చేఁపలచేత, ఆకుల=కలఁతచెందిన, ఉదధినాఁగన్=సముద్రమో యనునట్లు, కల్లోలితంబు=అల్లకల్లోలమైనది, శ్రీదు=కుబేరునియొక్క, రమ=సంపద, మిన్న=హెచ్చుగ.

తాత్పర్యము.

ఆ యింటియందు మూఁడుకొమ్ములు, నాలుగు కొమ్ములు గల యేనుఁగులు దూరము దూరముగఁ గట్టఁబడి యుండుటను, యుద్ధమునకు సిద్ధపడి యెత్తఁబడిన యాయుధములు గల యోధులు గాచుచుండుటను, రావణుని భార్యలచేత, వాఁడు బలాత్కారముగ నపహరించి తెచ్చిన రాచకన్నెలచేత నావరింపఁబడి యుండుటను, తిమితిమింగిలము మొసళ్ళు నిడుపాటి చేఁపలు వీనిచేఁ గలఁత నొందిన సముద్రమువలె నల్లకల్లోలమై యుండుటను, కుబేరుని సంపదయు, నింద్రుని నైశ్వర్యము, సర్వదిక్పాలుర లక్ష్మి వాని యింటను, వాని బంధువుల యిండ్లయందు యమ కుబేర వరుణుల సంపద యొక్కొక్కరి యింట నొక్కొక్క దిక్పతి సంపద వదలక యంతకంటె నెక్కువగా నుండుటయు హనుమంతుఁడు చూచెను.

ఉ. ఆ సొబగారు మేడనడు•మంతర మం దొగి విశ్వకర్మ దా
నాసిగ మింటఁ దొల్దొలుత • వారిజగర్భునకై రచించె నా
నాసుమణీయుతంబుగ న•నంతర మా ధనదుండు నీరజా
తాసనుఁ గొల్చి చేకొనియె; నాతని గెల్చి రణాంగణంబునన్. ౨౫౦

పుష్పకవిమానము పూర్వచరిత్ర చెప్పఁబడుచున్నది.

తాత్పర్యము.

ఆ యందమైన మేడ నడుమ నుండు పుష్పకమును దొలుత విశ్వకర్మ బ్రహ్మదేవునకుఁగాను మంచి రత్నములచే నాకాశమున నిర్మించెను. దాని నాయన యూవలఁ దన్ను సేవించిన కుబేరున కిచ్చెను. ఆయనను యుద్ధభూమి యందు గెల్చి,

సీ. రావణుఁ డుగ్రత • గ్రహియించినదియు నీహామృగయుక్తమై • యమరు నదియుఁ
గార్తస్వర స్తంభ • కమనీయ మగునది, ధగధగత్కాంతులఁ • దనరు నదియు
మేరుమందరముల • మేలిమి గగనంబు, రాయు కూటాలయ • రాజిచేత
సమలంకృతం బయి • సవురు మీఱెడునది, నడిమింటిసూర్యుని • వన్నెనదియుఁ
తే. కనకసోపానపంక్తులఁ • గ్రమవేదికలను వాతాయనంబులఁ • గలితనీల
విద్రుమాంచిత మౌక్తిక • వితతి స్థగిత,మైన పుష్పకతల మెక్కె హనుమ యపుడు.

అర్థములు. ఈహామృగయుక్తమై = కృత్రిమములైన జింకల యాకారము గల బొమ్మలతోఁ గూడినది, కార్తస్వర స్తంభకమనీయము = బంగారు కంబములచే నందమైనది, మేలిమి = ఎత్తైన, కూటాలయరాజిచేతన్ = కొలువుకూటముల సమూహముచేత, క్రమవేదికలన్ = అందమైన యరుఁగుల చేతను, వాతాయనంబులన్ = కిటికీల చేతను, నీల ఇంద్రనీల మహానీల నీలమణులచేతను నీలములు ఇంద్రనీలము లని మహానీలములని నీల మణులని మూఁడు తెగలు గలవు. అందు పాలను నీలముగఁ జేయునది ఇంద్ర నీలము. దీనిని పాలలో వేసినచోఁ బాలు నీల ముగాఁ గనబడును. దీనికి క్షీరగ్రాహి యని పేరు. నీలము మీఁద పచ్చిగడ్డి పోఁచగాని, పొట్టుగాని, గసగసాలు గాని యుంచి యూఁదిన దలక్రిందుగఁ ద్రిప్పి నను బడిపోవదేని దానిని తృణగ్రాహి యందురు. సింహళ ద్వీపమునఁ బుట్టినది మహానీలము. 'క్షీరమధ్యే క్షిపే న్నీలం క్షీరంచే న్నీలతాం వ్రజేత్ । ఇంద్రనీల మితి ఖ్యాత మితి చాగస్త్య భాషితమ్ । సింహళాకరసంభూతా మహానీలా ఇతి స్మృతాః' అని రత్నశాస్త్రము. విద్రుమము=పగడము.

ఇంద్రనీలము నెమలి కంఠచ్ఛాయ గలదై యుండును. మహానీలము వెన్న వెదురాకు,పూవువలె నుండును. నీలమణి నల్ల విష్ణుక్రాంతమువలె నుండును.

పగడములు సముద్రము నీటిలో దీఁగల వలె నల్లుకొని యుండును.

స్థగితము = చెక్కఁబడిన నేలగలది.

తాత్పర్యము.

రావణుఁడు గ్రహించినదియుఁ, గృత్రిమపు జింకలవంటి బొమ్మ లమర్పఁబడి నదియు, బంగారు కంబములు గలదియు, ధగ ధగ మను కాంతులు గలదియు, మేరు మందరపర్వతముల వలె నెత్తుగుటచే నాకాశమును రాసుకొను కొలువు కూటములచే నలంకరింపఁ బడినదియు మిట్ట మధ్యాహ్నమున సూర్యునివలెఁ బ్రకాశించు నదియు, బంగారు మెట్లు అరుఁగులు కిటికీలు గలదియు, నీలములు, పగడములు, మంచి ముత్యములు వీనిచేఁ జెక్కఁబడినదియు నగు పుష్పక ప్రదేశము మీఁద హనుమంతుఁ డెక్కెను.

ఉ. ఆ మెడ దత్స్యపానవిధి•ధాన్న వినిర్గతక్రమవాసనల్
వాయుతనూభవుం గదిసి • స్వాంతము రంజిల బంధురీతిగా

నీయెడ నున్నవాఁడు దను•జేశ్వరుఁ డిట్టిటు రమ్ము రమ్మటం
చా యతివీరునిం బిలుచు•నట్టులు రాజిలె సోఁడు ముట్టుచున్. ౨౫.

అర్థములు. భక్ష్యపానవివిధాన్నవినిర్గతకమ్రవాసనల్ = భక్ష్యముల నుండియు, పానముల నుండియు వివిధాన్నముల నుండియు బయలు వెడలిన కమ్మని వాసనలు, సోఁడు = నడినెత్తి.

తాత్పర్యము.

ఆ సమయమందు పిండివంటలు, అప్పచ్చులు, పాకములు, పులిహోర, దధ్యోదనము, కేసరీభాత్, వాంగీభాత్ లోనగు వివిధములైన యన్నములు-వీని నుండి వెలువడిన కమ్మని వాసనలు హనుమంతుని కెదుర్కొని వచ్చి యతని మనస్సు సంతోషపడునట్లు బంధువువలె రావణాసురుఁ డిచ్చట నున్నవాఁడు మా వెంటరమ్ము చూపెదమని పిలుచునట్టులు తలకెక్కినట్లు వ్యాపించి యుండెను. వాయువశమున వాసనలు కొట్టును. వాయువు హనుమంతునకుఁ జుట్టమే కదా. ఇది మొదలు నాలుగు పద్యములు కలాపకము.

సీ. అట కేగి వరశుభా•యత మయి కాంత నాఁ, గాంత నై ప్రియనిజ•కాంతవోలె
నమహారికిని మనో•హర మయి రత్న సో•పానవిక్భృత మయి • వైఁడిజాల
కంబుల నీటయి • కనుఁబటికపురాల, ని మ్మయి దంతపు•బొమ్మ లమరి
పవడముల్ ముత్యముల్ • బంగారు వెండియుఁ, బటిమఁదీర్చిన స్తంభ•పటలి గలిగి
తే. సమము చక్కన యెత్తును • జాను మీఱు.కంబముల మింటి కేగి రెడి•కరణి వెలసి
యిలను గలిగినచిత్రంబు • లెల్ల వ్రాయఁ, బడిన చిత్రకంబళములై •పఱపు గలిగి.

అర్థములు. కాంతనాన్ = స్త్రీవలె, విక్భృతము = కట్టఁబడినది, పవడముల్ ముత్యముల్ బంగారు వెండియు బటిమ = ఇది సమస్తపదము, చక్కన = వంకరలేనిది, పఱపు = వెడలుపు, ముత్యములు = ఇవి మేఘములందు, పాము పడగలందు, వెదుళ్ళయందుఁ, జేపలందు, నేనుఁగు కుంభములందుఁ జెఱకులందు శంఖములందు, పంది కోఱలందు, ముత్తెపు జిప్పలందుఁ బుట్టును. మేఘమునందుఁ బుట్టునవి మనుష్యులకు లభింపవు.

"నీరదముల్ దిగంతములు నిండి పటుస్ఫుటగర్జితంబు లే
పార మహోగ్రవృష్టి గురియం బ్రభవించు నితాంతకాంతితో
నారయఁ గుక్కుటాండ సదృశమై పసు ముత్యము లంతరిక్ష సం
చారులు పట్టుకొందురు వెసన్ వసుధం బడకుండ నేర్పునన్॥"

పాము పడగలోని ముత్తెము గురిగింజ వన్నెగలది. వెదురునందుఁ బుట్టునది నక్షత్రకాంతి గలది. ఇది స్త్రీ వశీకరణమం దుపయోగపడును. ఇది మినుపగింజంత యుండును. చేఁపతల యందుండునది వెండివలె తెల్లమల్లె పూవువలె నుండును. దీనికి నిష్ప్రభయములేదు. ఏనుఁగు కుంభములందుండునది యుసిరికకాయయంత యుండును.

వెల్లిచేఱకు నందుఁ బుట్టునది ప్రేంకణపుఁబూవు ఛాయగలది. పంది కొమ్మునం దుండునది రేఁగుఁ బండంత యుండును, కుంకుమ చ్ఛాయగలది. వెదురుముత్తెములు కోడిగ్రుడ్డంత యుండును. ఇది మంత్రసాధకులకు లభించును. స్వాతియందు ముత్తెపుఁ జిప్పలలోఁబడిన వానచినుకులు మంచిముత్యము లగును. వర్షబిందువు కొలఁది ముత్తెము. ఇందు శృంగశశుక్తు లందుఁ బుట్టినవి యెఱ్ఱగాను, రావణ శుక్తులందుఁ బుట్టినవి బంగారు వన్నె కలవిగా నుండును. తామ్రపర్ణి శుక్తియందలివి తెల్లగా నుండును. పూర్వకాలమున నానాదేశములవారు పాశ్చాత్యులు వీని వ్యాపారమునకై యీదేశమునకు వచ్చుచుండిరి. వీనిలో ఆణి, సుతారము, సుపాణి యనునవి మంచి జాతులు.

తాత్పర్యము.

ఆ వాసనజాడ పట్టి పోయి యందు మిక్కిలి యింపై పొడవై సుందరివలెఁ బ్రియమై రావణాసురునికి దన ప్రియభార్యవలె మనోహరమై రత్నసోపానములు బంగారు కిటికీలు దంతపు బొమ్మలు పగడములయు ముత్యములయు బంగారు వెండు లయు పటుత్వముచేఁ దీర్చిన స్తంభములు గలదై సమమై వంకర లేనిదై యెత్తైన కంబములచే నాకాశమున కెగిరిపోవుచున్న దానివలె నొప్పి భూమి యందుగల చిత్రములన్ని వ్రాయఁబడిన కంబళ్ళు గలిగి వెడలుపై.

ఉ. ఘుమ్మని కమ్మవాసనలు • గ్రమ్మ నితాంతశకుంతనాద మ
భ్రమ్మును ముట్టఁగా మృదువు•పాన్పులు వన్నెలు మీఱ శుభ్ర మై
నెమ్మది రావణాసురుఁడు • నిచ్చ చరించెడి ధామ మౌచు ధూ
పమ్ముల ధూమ్రమ మై శబల•భంగి విచిత్రసువర్ణజాత మై. ౨౪౮

అర్థములు. నితాంతశకుంతనాదము = అతిశయించిన పక్షులధ్వని, అభ్రము= ఆకాశము, ధూమ్రము = నలుపు ఎక్కువగాఁ గలసిన యెఱుపు, శబలభంగిన్= కామధేనువువలె, దీనివలననిది చిత్రవర్ణముగలదియెగాక సర్వకామముల నిచ్చునది యని సూచితము. విచిత్ర సువర్ణజాతము=చిత్రమైన మంచి రంగులు గలది.

తాత్పర్యము.

ఘుమ్మని కమ్మని వాసనలు వ్యాపింపఁగాఁ బక్షులధ్వనులు విశేషించి యా కాశమును దగులు చుండఁగా మెత్తని పఱుపులు తెల్లనై కాంతి లీను చుండఁగా రావణాసురుఁడు సంతోషముతోఁ దిరిగెడి యిల్లై సాంబ్రాణి యగరు దశాంగము వీని పొగలచే ధూమ్రవర్ణము గలదై శబలవలెఁ జిత్రమై మంచి రంగులు గలదై.

క. మదికిని నతిసంహ్లాద, ప్రద మై రంగులకు మేలి•రం గొసఁగుచు శో
కదళనసమర్థ మై స,మ్మద మై కాంతులకు జనన • మందిర మగుచున్. ౨౪౯

అర్థములు. అతి సంహ్లాదప్రదము = మిగుల సంతోషము గలిగించునది, శోకదళన సమర్థము=శోకమును బాపుటయందు శక్తి గలదై.

తాత్పర్యము.

మనస్సునకు మిగుల సంతోషము గలిగించునదియై వన్నెలకు వన్నెగలిగించునదియై సమ్మదమగుటచే శోకించువారిశోకము నణఁచునదియై కాంతులకుఁ బుట్టినిల్లై.

క. రావణపాలిత భవనము, పావని పంచేంద్రియముల • పాళికి నవు దై
　దా విషయంబులచే మో, దావాప్తిం గూర్చెఁ దల్లి•యనువున నతనిన్. ౨౫౭

అర్థములు. రావణపాలిత భవనము = రావణుఁడు రక్షించు గృహము, పంచేంద్రియముల పాళి = త్వక్కు, కన్నులు, చెవులు, నాలుక, నాసిక: వీనికి, ఐదౌ విషయంబులచే=స్పర్శ, రూప, శబ్ద, రస, గంధము లను నైదింటిచే.

తాత్పర్యము.

రావణుఁడు రక్షించు నా యిల్లు హనుమంతునికి వినుట కింపైన ధ్వనులచేత వీనులకును, కనుట కింపైన రూపములచేఁ గన్నులకును, తాఁకుటకు నింపైన వానిచేఁ జర్మమునకును, సువాసనలచే నాసికకును నోట నీరూరించుటచే నాలుకకును దల్లి వలెఁ దృప్తి కలిగించెను. ఈ పంచేంద్రియ సుఖములు భార్యవలనఁ గలుగవచ్చును. అటుగాక తల్లివలె ననుటచే హనుమంతుని జితేంద్రియత్వము ప్రకటితము.

ఈ నాలుగుపద్యములు కలాపకము.

"కులకం బహుభిః శ్లోకైః, సాకాంక్షైః రేకవాక్యతా
ద్వాభ్యాంతు యుగ్మకం నామ, తుల్యార్థాభ్యాంతు చుంబకమ్."

అనియు

'ద్వాభ్యాం యుగ్మమితి ప్రోక్తం, త్రిభిః శ్లోకై ర్విశేషకమ్
కలాపకం చతుర్భి స్స్యాత్, తదూర్ధ్వం కులకం స్మృతమ్.'

ఏకాన్వయము గల రెండు పద్యములకు యుగ్మకమనియు మూఁటికి విశేషకమనియు నాల్గింటికి కలాపకమనియు నంతకుఁ బైపడిన కులకమనియుఁ బేర్లు.

క. నాకమొ కాకుండిన సుర,లోకమొ హరిహయునిపురమొ • లోకేశుమహా
　లోకమొ యగు సిద్ధం బని; యా కపి యటు చనుచు నెదుట • నద్భుతకాంతిన్.

అర్థములు. నాకమొ = సామాన్యముగా స్వర్గలోకమో, సురలోకమొ = అందు ముఖ్యులగున ముప్పది మువ్వురు దేవత లుండు స్థలమో, హరిహయుని పురమొ = అందు నింద్రుఁడు స్వయముగా నుండు ప్రదేశమో, లోకేశు మహా లోకమొ = బ్రహ్మలోకమో, సిద్ధము = నిశ్చయము.

తాత్పర్యము.

ఇదియేమి? పుణ్యముచేసినవారు పోయియుండు సామాన్య దేవలోకమా? అటుగాక ముఖ్యదేవతలు ముప్పదిమువ్వు రుండు స్థలమా? అటుగాక యింద్రుఁడు స్వయముగా నివసించు నిల్లా? కాక బ్రహ్మలోకమో నిశ్చయమని హనుమంతుఁ డాలో

చించుచుఁబోయి యెదుట నాశ్చర్యమైన కాంతిచే 'కనుఁగొనె'తో నన్వయము.

మానిని. జూదమునం దెనుజూదరి కోడి వ•సుల్ దెసదోఁపక చింతిలు నా
జూదరియట్టులు నిశ్చలతం గను • సొన్ను ప్రదీపములన్ జగతిన్
మాదిరి లేక వెలుంగు మణీకృత • మంజులదీపులు సెమ్మెలుఁ దా
మోదము మీఱఁ గనుంగొనె వానర • ముఖ్యుఁడు తద్భవనాంతమునన్.

అర్థములు. వసుల్ = ధనములను, సొన్నుప్రదీపములు = బంగారు దీపములు స్వర్ణశబ్దభవము సొన్ను రూ. సొన్నము. సమాసంబున సొన్నా యనియు రూపముగలదు. సొన్నాటంకములు, మణీకృత మంజుల దీపులు = రత్నములతోఁ జేయఁబడిన యందమైన దీపములు, దీపము లనఁగా దీపపు స్తంభములనియైనఁ జెప్ప వచ్చును. లేక రత్నములనే దీపాకృతులుగా నేర్పఱిచిరనియు జీవమణులు కావున నవియే కాంతులు ప్రసరింపఁజేయుచుండె ననియు గ్రహింపనగు. సెమ్మె లను శబ్ద సాహచర్యముచే నీయర్థమే గ్రాహ్యము,

మానిని:—ఏడు భగణములు గురువు. పదుమూఁడవ స్థానమున యతి.

తా త్ప ర్య ము.

నేర్పరి యగు జూదగానికిఁ దన సర్వస్వ మోడిపోయి యేమిచేయుటకు దిక్కు-దోఁపక చింతలో మునిఁగిన జూదరివలెఁ గదలక మెదలకుండు బంగారు దీపములను బ్రపంచమునందు సమానమైనవి లేక ప్రకాశించు మణులచేఁ జేయఁబడిన దీపములను సెమ్మెలును హనుమంతుఁ డా యింటి యందుఁ గనుఁగొనెను.

సుగంధి. దీపకాంతి దైత్యకాంతు • దేహకాంతిఁ దద్వపు
స్తాపనీయభూషణాళి • సారకాంత కాంతులన్
బాపు! మందు చుండునట్లు • ప్రజ్వరిల్లె శాల, యా
యేపుఁ జూచి మెచ్చె నంజ • నేష్టపుత్రుఁ డాత్మలోన్. ౨౫

అర్థములు. తద్వపుః = రావణాసురుని దేహమందు ధరింపఁబడిన, తాపనీయ = బంగారుతోఁ జేయఁబడిన, భూషణాళి = సొమ్ముల వరుసలయొక్క-, సారకాంత = సత్తుగలిగి, మనోహరమైన, కాంతులన్ = కాంతులచేతను, బాపు=ఔరా ఆశ్చర్యార్థకము రూ. బాపురే.

తా త్ప ర్య ము.

దీపములకాంతి రావణాసురుని దేహకాంతి వాఁడు ధరించిన బంగారు సొమ్ముల కాంతి యివి యన్నియుఁ గలిసి యా శాల మండుచున్నట్లు వెలుఁగుచుండెను. అవి శేషముఁ జూచి హనుమంతుఁ డౌరా యని తనలో మెచ్చుకొనెను. సుగంధి:- రజరజర గణములు. తొమ్మిదింట యతి. ఉత్సాహమునకు దీనికి విశేషము భేదములేదు. సుగంధులన్నియు నుత్సాహములేకాని యుత్సాహములన్నియు సుగంధులుకావు. అందు నగణమున కెడమున్నది. ఇందులేదు.

—• నిద్రించు రావణునియంతఃపుర స్త్రీలను హనుమంతుఁడు చూచుట •—

రసమంజరి. పరిపరివిధముల • భాసిలు చేలల్, సరగలుఁ బలుపలు • చందపులీలల్
పరఁగెడి యువతులు • పానసుకేళీ, పరతను నిదురను • బండఁగఁ జూచెన్.

అర్థములు. సరగలు = హారములు.

తా త్ప ర్య ము.-

నానావిధములుగఁ బ్రకాశించు చీరలు హారములు నానావిధ విలాసములు గల వయస్సు స్త్రీలు పానక్రీడాసక్తులై బాగుగఁ ద్రాగి నిద్రపోవుచుండ హనుమంతుఁడు చూచెను. రసమంజరి. నసనసగురువు గణములు. తొమ్మిదింట యతి.

స్రగ్విణి. సద్దు లేకుండఁగా • జారుభూషాతతుల్
ముద్దియల్ నిద్దురన్ • మున్గి వర్తింపఁగాఁ
దద్దయంచల్ మిళిం • దంబులున్ లేనిమేల్
ముద్దుఁబద్మాకరం • బో యనన్ రాజిలెన్. ౨౬౧

అర్థము. మిళిందంబులు = తుమ్మెదలు.

తా త్ప ర్య ము.

స్త్రీలు బాగుగ నిదురించుటచే వారు ధరించిన సొమ్ములు సద్దుచేయకుండఁగా హంసలు తుమ్మెదలులేని యందమైన కొలనివలె నా మందిర ముండెను.

హంసలు - స్త్రీలు. తుమ్మెదలు - వారి యాభరణము.

స్రగ్విణి. నాలుగు రగణములు - ఏడింట యతి.

క. ముకుళితనయనంబులు నిం చుకయుఁ వెలిఁ దోఁపనట్టి • పొలుగు రదంబుల్
ప్రకటసరోజాతామో,ద కలితవదనములు గలుగు • తరుణులఁ జూచెన్. ౨౬౨

అర్థములు. ముకుళిత = ముకుచుకొనిన, మూసికొనిన, రదంబుల్ = దంతములు, సరోజాత = పద్మముల, ఆమోద కలిత = వాసనగల, వదనములు = ముఖములు, తరుణులన్ = స్త్రీలను. తా త్ప ర్య ము.

మూసికొనఁబడిన కన్నులు, కొంచెమైన వెలికిఁ గానరాని యందమైన దంతములు విస్తారముగ పద్మముల వాసనగల ముఖములుగలఁ స్త్రీలఁ జూచెను. నోళ్ళు తెఱచుకొని పండ్లు వెళ్ళఁబెట్టి నిదురించుట యధమస్త్రీల లక్షణము. పద్మవాసన చెప్పుటచే వీరు పద్మినీజాతి స్త్రీలని యేర్పడుచున్నది. పద్మినీ పద్మగంధా.

క. తామరలువోలె వారల, మోములు వికసించు నుదయ • మున రుచిరముగన్
యామిని యగుడున్ మఱి తా,మే ముకుళితదళము లయిన • మొలమిం గూర్చెన్.

అర్థములు. యామిని = రాత్రి, ముకుళితదళములు = ముడుచుకొనిన ఱేకులు.

తా త్ప ర్య ము.

వారి కన్నులుదయమున వికసించి రాత్రి కాఁగానే తమంతఁదామే ముడుచుకొను కమలముల వలె సంతోషము కలిగించెను.

క. వీరల మోములు నిజముగ, నీరసములు గాక యున్న • షట్చరణంబుల్
నీరజములవలె నేలా, పారెడు నీవదనములను సంప్రార్థించున్. ౨౬౪

తా త్ప ర్య ము.

వీరలముఖములు నిజముగ, గమలములే. అటుగాకయున్నఁ దుమ్మెదలు కమలములనువలె నేల వీని చుట్టు తిరుగుచున్నవి.

క. అందము చందము మఱి చ,ల్లందనమును బరిమళంబు • లలితాకృతులున్
సుందరము లగుటఁ బంకజ,బృందముపో ముఖము లనుచు • నెంచెను గపియున్.

తా త్ప ర్య ము.

అందముయొక్క విధము చల్లఁదనము సువాసన మనోజ్ఞమైన యాకారము ఇవియన్నియు సుందరములేయైన కారణముచే వారి ముఖములు నిజముగఁ బద్మములే యని తలఁచెను. 'పో' యనునది నిశ్చయార్థమును దెలుపును.

'కమల ముకుళమృద్వీ ఫుల్లరాజీవగంధ
స్సురత పయసి యస్యా స్సౌరభం దివ్య మంగే
చకిత మృగ దృగాభే ప్రాంతరక్తే చ నేత్రే
స్తనయుగళ మనర్ఘ్యం శ్రీఫలశ్రీవిడంబి ॥
తిల కుసుమ సమానం బిభ్రతీ నాసికాగ్రం
ద్విజ గురు సురపూజా శ్రద్ధధానా సదైవ
కువలయ దళ కాంతిః కాపి చాంపేయగౌరీ
వికచ కమలకోశాకార కామాతపత్రా
వ్రజతి మృదుసలీలం రాజహంసీవ తన్వీ
త్రివళి లలితమధ్యా హంసవాణీ సువేషా
మృదుశుచిలఘు భుంక్తే మానినీ గాఢలజ్జా,
ధవళ కుసుమవాసో వల్లభా పద్మినీస్యాత్.

అని పద్మినీ జాతి స్త్రీ లక్షణము.

పద్మినీ జాతి స్త్రీలు తొలి మూఁడు జాములందు భర్తలతోఁ గలియుదు. ఈ కాలమందు వీరు నిద్రించుచున్నారని చెప్పుటచేతను వీరు పద్మినులనియే చెప్పవగును. 'రమయతి రమణీయాం పద్మినీ తుర్యయామే' యని లక్షణము.

క. తారాగణరాజిత మగుశారదతారాపథంబు • చందంబున దే
వారివరమందిరము కాం,తారత్నగణంబుచేతఁ • దద్దయు వెలిఁగెన్. ౨౬౬

అర్థములు. తారాగణరాజితము = నక్షత్రసమూహముచేఁ బ్రకాశించునది. శారద తారాపథంబు = శరత్కాలమందలి యాకాశము.

తా త్ప ర్య ము.

నక్షత్ర సముహముచే శరత్కాలమందలి యాకాశము ప్రకాశించునట్లు స్త్రీ

రత్నములచే రావణాసురుని యిల్లు ప్రకాశించెను. రావణాసురుఁడు చంద్రుఁడనియు స్త్రీలు నక్షత్రము లనియు గ్రహింప నగు.

శా. ఆరాజీవవిలోచనాపరివృతుం • డై రాక్షసాధీశుఁకున్
తారాసంవృతకైరవాప్తుఁ డన న•త్యంతంబు శోభిల్లె బా
లారత్నంబులఁ బుణ్యవిచ్యుతిని నే•లన్ వ్రాలు తారాళిగా
ధీరాగ్రేసరుఁ డా మరుత్తనయుఁ డెం•తే నెంచెఁ జిత్తంబునన్. ౨౬౭

అర్థములు. రాజీవ విలోచనా = కమలములవంటి కన్నులుగల స్త్రీలచే, పరివృతుండై = చుట్టఁబడినవాఁడై, తారాసంవృత = నక్షత్రములచేఁ జుట్టఁబడిన, కైరవాప్తుఁడనన్ = చంద్రుఁడో యన్నట్లు, పుణ్యవిచ్యుతిని = పుణ్యము క్షయించిన కారణమున, ధీరాగ్రేసరుఁడు=ధైర్యము గలవారిలో మొదటివాఁడు.

తా త్ప ర్య ము.

కమలములవంటి ముఖములుగల యా స్త్రీలచేఁ జుట్టఁబడిన రావణుఁడు నక్షత్రములచేఁ జుట్టఁబడిన చంద్రుఁడో యను నట్లుండెనుగాని పుణ్యము క్షయించి పోఁగా నేల రాలిన నక్షత్రముల వలె నా స్త్రీలను ధైర్యవంతులలో శ్రేష్ఠుఁ డగు హనుమంతుఁడు తలఁచెను. వీరు శీఘ్రకాలమందే విధవలు కాఁబోవుచున్నారు కావున హనుమంతుఁడట్లు తలఁచెను.

౨౬౫ వ పద్యమందు బలవంతముగ హరింపఁబడిన స్త్రీలు రావణునింట నున్నట్లు చెప్పఁబడెను. ఇది వారి స్థితి తెలుపుచున్నది. ఉత్తమజాతి క్షత్రియస్త్రీలు రాక్షసునితో సంభోగింపవలసి వచ్చుట వారి పుణ్యక్షయముచేతనేకదా. దీనివలన నుత్తమజాతిస్త్రీ లధమజాతి పురుషులతోఁ గలియరాదని సూచితము. 'క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి' యనికదా భగవంతుఁడు చెప్పెను.

క. తళుకు తళుక్కను వెనుఁదా,రలవన్నె ప్రసాదగరిమ • ప్రభయును ఘన మై
చెలువారు చుండె రావణు,నిలయంబునఁ గూర్కు చున్న • నెలఁతుకలందున్.

తా త్ప ర్య ము.

తళుకు తళుక్కను నక్షత్రముల గొప్ప రూపము వారి నైర్మల్యము వాని కాంతి ఘనమై రావణునింట నిద్రించుచున్న స్త్రీల యందుఁ గానవచ్చెను.

క. పానవ్యాయామంబుల, మీనాంకుని యుద్ధమునను • మెయి స్రగ్భూషల్
పేనుకొన రాలిపడినను, మే నెఱుఁగక కూర్కు వందు•మెలఁతలపింకుల్. ౨౬౯

అర్థములు. పానవ్యాయామంబులన్ = మద్యపానానంతరము జరుగుకార్యము లందు, మీనాంకుని యుద్ధమునను = రతియందు, స్రక్ + భూషల్ = హారములు సొమ్ములు.

తా త్ప ర్య ము.

పానానంతరము జరగిన రతికేళులందుఁ దమ దేహ మందున్న హారములు

ఆభరణములు పెనవేసికొని నేలరాలినను దేహము తెలియక స్త్రీసమూహము నిదు రించెను. హనుమంతుఁడు సంచరించు నీ కాలము రెండవజాము. కావున నీ స్త్రీలు హస్తినీజాతి స్త్రీలని సూచన.

'భజతి దినరజన్యోర్హస్తినీంచ ద్వితీయే' యని రతిశాస్త్రము.

సీ. జాఱఁగ దిలకంబు • నవు రొప్పు నారులు, వందియ లూడిన • యబ్జముఖులు
ప్రక్కల రాలిన • వరమాల్యములచెలుల్, చీరలు నడలిన • చేడియలును
త్రెస్సిన మంచిము • త్తియపుఁ బేరుల నకుల్, నునిఁగిన మొలనూళ్ళ • తోయజాస్య
లలసట దీఱంగ • నల్లఁ బండినగుజ్జుపుం బిల్లలను బోలు • పువ్వుఁబోండ్లు
తే. తళుకుఁగమ్మలు దాల్చిన • తలిరుఁబోండ్లు, నలఁగి తెగియుండుదండల • చెలువుదీరి
కానఁ గరి త్రెంచి వైచినఁ • గ్రాలు పూల, తీగలనఁబోలి కొందరు • తేజరిలిరి.

అర్థములు. త్రెస్సిన = తెగిపోయిన, కానన్ = అడవియందు, నారులు, అబ్జముఖులు, చెలులు, చేడియలు, నకులు, తోయజాస్యలు, పువ్వుఁబోండ్లు ఇవి యన్నియు స్త్రీపర్యాయ నామములు.

తా త్ప ర్య ము.

కొందఱ స్త్రీలకుఁ జెమటవలనఁ దిలకము కరఁగిపోయెను. కొందఱకుఁ గాలి యందె లూడెను. కొందఱకు మెడలోని దండలు ప్రక్కల రాలియుండెను. కొంద ఱకు చీరలు వదలుపడి జాఱి యుండెను. కొందఱు మెడలోని ముత్యాలదండలు తెగి నేలరాలి యుండెను. కొందఱ మొలనూళ్ళు నునిఁగి యుండెను. కొందఱు అలసిన గుజ్జుపుఁ బిల్లలవలెఁ బండికొని యుండిరి. కొందఱు తళుకుఁగమ్మలు ధరించి యుండిరి. రతిశాస్త్రప్రకారము చుంబనప్రదేశములలో చెవులు చేరవు. కావునఁ జెవుల కే హానియు లేదు. అవి రతియం దుపయోగపడునవి కావు. కావున కమ్మలు హానిలేక యథాప్రకారమున్నట్లు చెప్పఁబడెను. ఈ సందర్భమున నీ శ్లోకము స్మరింప నగును. "కమలే కమలం తదుపరి కమలం తస్మిన్ కమలం విమలం భాతి, అమునా యమునా కరధృత వదనా చుంబన సమయే శ్రుతిరివ భాతి" కొందఱు దండలు తెగియుండుటచే నడవియందు నేనుఁగు త్రెంచివేయఁగా నొప్పు పూల తీఁగలవలె నుండిరి.

క. ముద్దియలు సూర్కఁ గొందఱు, ముద్దుఁజనుంగవలఁ దెఱచు • ము త్తెపుఁబేరుల్
తద్దయు రవిశశికరముల, కుద్దిగ నయి సూర్కునంచ • లొప్పుం జూపెన్. ౨౭౧

తా త్ప ర్య ము.

కొందఱు స్త్రీలు నిద్రించునపుడు వారి యందమైన చనుదోయి యందలి హెచ్చు ముత్యాలదండలు సూర్యచంద్రకిరణముల కాంతిగలవై నిద్రించు హంసల వలె నుండెను. మిట్టలు, వట్రువలు, శ్వేతములు నగుటచే నీ యుపమానము.

క. ఇంబుగఁ గొండలఁ వైడూర్యంబులు కాదంబపక్షు•ల ట్లొప్పఁ, రథాం
గంబులగతిఁ గొండల గ్రీ•వంబులఁ దనరారు చుండె • బంగరుసరముల్. ౨౭౨

అర్థములు. కాదంబపక్షులు = పొగచాయగల ముక్కు కాళ్లు రెక్కలు గల హంసలు, రథాంగంబులు = చక్రవాకములు.

తా త్ప ర్య ము.

కొండలు స్త్రీలు ధరించిన వైడూర్యంబులు కాదంబపక్షుల వలె నుండెను. కొండల మెడల యందున్న బంగారు సరములు చక్రవాకములవలె నుండెను.

వైడూర్య లక్షణము. గీ. పగలు గొందిఁ గానఁబడిన బిడాలంపుఁ గన్నువోలె వెలుఁగు గలిగి మాలు । తిరిగినట్టు మీఁది తెలుపారు వైడూర్య రత్నమున కతి ప్రయత్నమునను॥

క. కొండలు మెడలం దాల్చిన, యందపు వైడూర్య వితతు • లంచలరీతిన్
గొండల బంగరుసరములు, సుందరచక్రముల రీతి • సొబగున వెలసెన్. ౨౭౩

అర్థములు. చక్రములు = చక్రవాకములు.

తా త్ప ర్య ము.

సులభము.

క. అంచలచేఁ గారండవ,చంచచ్చక్రములచేత • సైకతములచేఁ
బ్రాంచన్నదు లన జఘనో, దంచిత లయి సతులు వెలసి•రా భవనమునన్. ౨౭౪

అర్థములు. అంచలచేన్ = హంసలచేతను, కారండవ = కన్నెలేళ్ళచేతను, చంచత్ + చక్రములచేతను = చలించుచున్న చక్రవాక పక్షులచేతను, సైకతముల చేతన్ = ఇసుక దిబ్బలచేత, ప్రాంచత్ +నదులనన్ = ప్రకాశించు నదు లనునట్లు, జఘనోదంచితలయి = నడుముల ముందటి భాగము గలవారై, 'జఘనం కామినీ శ్రోణి పురోభాగే కటిస్థలే' వైజయంతి. భవనమునన్ = ఇంటియందు చక్రములకు స్తనములకు, ఇసుక దిబ్బలకు, పిఱుదులకు నుపమానోపమేయములు.

తా త్ప ర్య ము.

హంసలచేతను, గన్నెలేళ్ళచేతను, చక్రవాకములచేతను, ఇసుక దిబ్బలచేతను నొప్పునదులవలె జఘనములచే నొప్పు స్త్రీలా యింట నుండిరి. ఈ యర్థమునే క్రింది పద్యమున వివరించుచున్నాఁడు.

చ. ప్రకట సువర్ణభూషణసు•పద్మచయంబులఁ జారుకింకిణీ
ముకుళములన్ మనోగ్రసన • మోహనశీల విలాసవక్రరు
క్ప్రకరతటంబులై నిదురఁ • గ్రాలెడు బాలలు పోల్ప నేఱు ల
ట్లకలుషరీతిఁ గ్రాలిరి వి•హారభరశ్రమ నష్టచిత్తలై. ౨౭౫

అర్థములు. ప్రకట సువర్ణభూషణ = స్పష్టముగాఁ దెలియుచున్న బంగారు సొమ్ములనెడి, సుపద్మచయంబులు = మంచి కమల సమూహములు, చారు కింకిణీ

ముకుళములు = అందములైన చిఱుగజ్జెలనెడి మొగ్గలు; మనోగ్రసన = మనస్సును హరించునట్టియు, మోహనశీల = మోహింపఁజేయు స్వభావము గలట్టియు; విలాస = శృంగారచేష్టలనెడి, నక్ర = మొసళ్ళను, మొసళ్ళు జంతువుల వశపఱుచు కొనునట్లు లీ శృంగారచేష్టలే పురుషుల వశపఱుచుకొనునవి కావున నవి మొసళ్ళ వంటివి. ఈ చేష్టలే భావములు. సుందరులే దశయందున్నను ఏ చేష్టలు చేసినను చేయకున్నను నది యొక్క విలాసముగనే పురుషులకుఁ దోఁచును. మధురవాణి లేడ్చినను శ్రవ్యముగా నున్నట్లు సుందరుల యే వికారములైనను విలాసముగానే తోఁచును. రుక్ప్రకర శటంబులై =కాంతి సమూహము లొడ్డులై; స్త్రీలు నిదురించు చున్నను వాసనావశమున నిట్టివి కలుగును. విహారభరశ్రమ నష్ట చిత్తలై = క్రీడాతి శయముచేఁ గల్గిన శ్రమముచే స్వాధీనము తప్పిన మనస్సు గలవారై.

తాత్పర్యము.

బంగారు సొమ్ము లనెడి వికసించినకమలములు, నొడ్డాణము లందలి చిఱుగజ్జె లనెడి మొగ్గలు, మనస్సును గ్రుంగునట్టి మోహింపఁజేయు స్వభావముగల శృంగార చేష్ట లనెడి మొసళ్ళను, కాంతులనెడి యొడ్డులు గలిగి నిద్రించు బాలికలు క్రీడాతిశయ ముచే నలసి పరవశలై యేఱులవలె నుండిరి.

బాలలు - 'బాలా స్యాత్ షోడశాబ్దాత్తదుపరి తరుణీ వింశతే ర్యావదూర్ధ్వం ప్రౌఢాస్యా త్పంచపంచాశదవధి పరతో వృద్ధతా మేతి నారీ.' పదునాఱు సంవత్సర ములకుఁ బైబడినది బాల యనియు నిరువది యేండ్లకుఁ బైబడినది తరుణి యనియు, ఆపై నేఁబదియైదు వఱకుఁ బ్రౌఢయనియు ఆపై వయస్సుది వృద్ధయనియుఁ జెప్ప బడును. ముప్పది యేండ్లవఱకుఁ దరుణి యని యొకపాఠము గలదు. ఇట్లు చెప్పుటచేఁ బదునాఱు సంవత్సరములకుఁ దక్కువ వయస్సుది రతికి యోగ్యురాలు కాదని శాస్త్రాభిప్రాయము. ప్రథమ రజస్వల యెప్పుడైనను బదునాఱవ సంవత్సరము వచ్చువఱకు గర్భాధానము చేయరాదు.

చ. గురుకుచ చూచుకంబులను • గోమలహృద్యతరాంగపాళులన్
సరసమణీమయాభరణ•సంఘము లెంతయు నొప్పు మీఱ నె
త్తరుణులు నిద్ర వోవు నెడ • దర్పకదర్ప వినష్టచిత్తులై
పురుషులు మీఁద వోలిపడు • పొల్పు వహించి మనోహరంబుగన్. ౨౭౬

అర్థములు. గురు = గొప్పవగు, కుచ చూచుకంబులన్=చన్నులందు, వాని ముక్కులందును, కోమల = సుకుమారమైన. హృద్యతర = మిగుల మనోజ్ఞమైన, అంగపాళులన్ = అవయవ ప్రదేశములందును, సరస = శృంగారముతోఁ గూడిన, మణీమయాభరణ సంఘములు=రత్నములతో నిండిన సొమ్ములగుంపులు, ఎంతయున్= మిక్కిలి, దర్పక దర్పవినష్టచిత్తులై = మన్మథుని ప్రతాపముచే నశించిన మనస్సు గలవారై.

తాత్పర్యము.

గొప్పవగు స్తనములందును, చనుముక్కులందును, సుకుమారములై మిగుల మనోహరములైన యవయవములందును ధరింపఁబడిన యందములైన రత్నాభరణముల సమూహములు ఆ స్త్రీలు నిద్రపోవునపుడు వారిని జూచిన మగవారు మదన వికారముచేఁ బరవశులై వారిమీఁదఁ బడునంతటి యొప్పుగలవై యుండెను.

ఈకారణముచేతనే స్త్రీలు నిదురించునపుడు పురుషులు చూడరా దను నియమ మేర్పడెను. స్త్రీలును వెల్లకిలఁ బరుండరాదు.

క. అయ్యెడ నిదురించెడు న,త్తొయ్యలులముఖములనుండి • తొలఁకెడి యూర్పుల్
పయ్యెదచెంగులచేఁ దా, మొయ్యన వీచోపు లిడెను • యోషాస్యములన్. ౨౮౭

అర్థములు. తొయ్యలుల = స్త్రీలయొక్క, ఒయ్యన = మెల్లగా, వీచోపులు = వింజామరలు, యోషాస్యములన్ = స్త్రీల ముఖములందు.

తాత్పర్యము.

ఆ సమయమున నిదురించు స్త్రీల ముఖముల నుండి వెలువడు నూర్పు గాలులచేఁ గదలుచున్న పైఁటకొంగులు ఆ స్త్రీల ముఖములపై వింజామరలు వేయుచున్నట్లు లుండెను.

వీరి కెవ్వరికి రైకలు లేవనుట స్పష్టము.

క. నానావర్ణ సువర్ణస, తీనవ్యముఖాబ్జములను • దీవ్యచ్ఛుభసై
చానివహము మదనపతా,కానికరము నట్లు వెలిఁగెఁ • గమనీయంబై. ౨౮౮

అర్థములు. నానావర్ణ సువర్ణ = పలు తెగలగు మంచి కాంతులు గల, సతీ = స్త్రీలయొక్క, నవ్యముఖాబ్జములను = అందమైన ముఖకమలములను, దీవ్యత్ = ప్రకాశించు, శుభసైచానివహము = అందమైన పైఁటల సమూహములు, మదన పతాకానికరము నట్లు = మన్మథుని ధ్వజముల గుంపువలె.

తాత్పర్యము.

పలు తెగలగు మంచి కాంతులు గల స్త్రీల యందమైన ముఖకమలములందుఁ బ్రకాశించుచున్న పైఁటలు మదనుని ధ్వజములవలె నందములై యుండెను.

పై పద్యమునందలి యీ పద్యమునందలి వర్ణనమును బట్టి యీ స్త్రీలు ముఖములపై పైఁటలు కప్పుకొని నిదురించు చుండిరని యేర్పడుచున్నది. అటుగాకున్న తొమ్ముల మీఁది పైఁట లూర్పుగాలికిఁ గదలుటగాని ముఖములకు వీచోపు లిడుటగాని తటస్థింపదు.

క. ఇందుముఖీ ముఖనిర్గత, మంద సుగంధవహసర్గ • మండిత మగుచున్
మందంబుగఁ గదలెను గురు,విందమణీరుచిరము లగు • వెలఁగల కమ్మల్. ౨౮౯

అర్థములు. ఇందుముఖీ = చంద్రునివంటి ముఖముగల యా స్త్రీలయొక్క, ముఖ = ముఖములనుండి, నిర్గత = బయలు వెడలిన, మంద = మెల్లనైన, సుగంధవహ =

మంచిగాలియొక్క, సర్గ = కూడికచే, మండితము = అలంకరింపఁబడినది, మంద ముగ=కొంచెముగ, కురువిందమణిరుచిరములు=కెంపులచే నందములు.

తా త్ప ర్య ము.

ఆస్త్రీల ముఖమునుండి వెడలుచున్న కమ్మని వాయువుచే నలంకరింపఁబడినవై వెలగల కెంపులు కమ్మలు కొంచెముగఁ గదలెను.

కురువిందము పద్మరాగములందు భేదము.

సీ. ఉదయార్కబింబ సముజ్జ్వల ప్రభగల్గి, కరమొప్పు పద్మరాగంబు పోవలు
అసమాన దాడిమీ కుసుమ మంజరిచాయ, గలిగి శోభిల్లు సౌగంధికంబు
సలలిత మత్తకోకిల లోచనద్యుతి, నలరారుఁ గురువింద మనెడి కెంపు
మండిత శశమాంస ఖండంబు గతి నున్న, మంద తేజంబగు మాంసగంధి
గీ. నలుపు నెఱ్ఱదనము మిళితమై నెగడెను, వాలు గలిగినదియు నీలగంధి
లాలు లేక కోమలం బను సంజ్ఞలు, గ్రాలు కెంపు చాల రంగు లేక.
క. ధరఁ బద్మరాగ మెందును, దొరకదు కలియుగమునందుఁ • దోచిన వ్రేఁగై
నిరుపమ రుచి నిర్మలమగుఁ, గురువిందపుఁ గెంపు గలదు • కోరి భజింపన్.

(రత్నపరీక్ష.)

క. చక్కెరకల్వాలవులు వెలఁ గ్రక్కెడు నచ్చిగురుఁబోండ్ల • కమ్మనియూర్పుల్
మిక్కిలి రావణుమీఁదను, జక్కఁగ విహరించెఁ గైపు•సంపద లోలయన్. ౨౮౦

అర్థములు. చక్కెరకల్వాలవులు = చక్కెరతో జేసిన కల్లువాసనలు, చక్కెర యొక్కయు, కల్లుయొక్కయు సువాసనలు, చిగురుఁబోండ్ల = స్త్రీలయొక్క, కైపు సంపద = మదాతిశయము.

తా త్ప ర్య ము.

చక్కెర కల్లువాసనలు గొట్టుచున్న యాస్త్రీల కమ్మని శ్వాసములు మదాతి శయముచే రావణుమీఁద వ్యాపించెను. దీనివలన హనుమంతుఁడు రావణు సమీ పించు చున్నాఁడని సూచన.

సీ. రావణాననము లన్ • భ్రాంతిని సవతుల, ముఖముల ముద్దిడు • ముద్దరాండ్ర
నధిపుఁడే ముద్దిడె • న భ్రమ మత్తున, సవతాండ్రఁ జుంబించు • ధవసురతలఁ
బడుకలు పైఁటలు • కడియాలచేతులు, దిండ్లుగా నిదురించు • తీఁగఁబోండ్లఁ
దమయురంబుల నుంచి•తలలు నిద్రించుచెల్వాల తొమ్మలను జేయి•వైచు సతుల
తే. నొఱపు మెఱయంగ నొక్కర్తు • కుచువుమీఁద
శిరము ఘటియించి కూర్కెడి • చెలువతొమ్మ
నందుఁ గేల్వైచి నిదురించు • నిందుముఖుల
నందుఁ గనుఁగొనె నంజనా•నందనుండు. ౨౮౧

తాత్పర్యము.

కన్నులు మూసికొని నిదురించుచుండుటచే రావణుని ముఖము లను భ్రాంతిచే సవతుల ముఖములను గొందఱు ముద్దుపెట్టుకొనుచుండిరి. వారిట్లు ముద్దుపెట్టుటచేఁ దమ మగఁడే ముద్దిడెనని తలఁచి మత్తువలనఁ గలిగిన భ్రమచే నది మఱియొక సవతిని ముద్దుపెట్టెను. నిద్దురసుబ్బు విశేషించి పీడించుటచే పలుపులు పఱచుకొనుట కవకాశములేక వానినే తలక్రింద దిండుగాఁ బెట్టుకొని కొందఱు – పైఁటలు పఱచుకొని కొందఱు– కడియాలచేతులు తలక్రిందఁబెట్టుకొని కొందఱు నిదురించుచుండిరి. తమ తొమ్ములమీఁదఁ దలయుంచి కొందఱు స్త్రీలు నిదురింపఁగా వారి తొమ్ములపైఁ జేతులువైచి కొందఱు నిద్రించిరి. ఒకదాని తొడమీఁద మఱియొకతె తలయుంచి నిద్రింపఁగా దాని తొమ్ముమీఁద నది చేయివైచి నిద్రించెను. ఇట్టి స్త్రీలనెల్ల హనుమంతుఁడు చూచెను.

ఉ. సారెకుఁ ద్రావి మేను లవ•శంబుగ నొండొరుమీఁదఁ బార్శ్వపృ
 ష్ఠోరుకటీ ప్రదేశముల • నుంచి సుమాంబకరాగమగ్న లౌ
 వారును సూత్రబద్ధమద•బంభరశోభితమాలికారుచిన్
 వారక యొక్కొకర్తుకను • బాహులఁ గట్టి పెనంగు కేశినుల్. ౨౮౨

అర్థములు. పార్శ్వ = ప్రక్కలు, పృష్ఠ = వీఁపులు, ఊరు = తొడలు, కటి = నడుము, సుమాంబకరాగ = మన్మథకామమునందు, మగ్నలు = మునిఁగినవారు, సూత్రబద్ధ = దారముచేఁ గట్టఁబడినదియు, మద = మదించిన, బంభర= తుమ్మెదలచే, శోభిత = ప్రకాశించునదియు, మాలికారుచిః = పూలరసముయొక్క కాంతితో, ఒక్కొకర్తుకను = ఒకతె మఱియొక్క దానిని, కేశినుల్ = నల్లని యందమైన తలవెంట్రుకలు గల స్త్రీలను.

తాత్పర్యము.

పలుమాఱు త్రావి దేహములు తమ స్వాధీనము తప్పి పోఁగా నొకతెమీఁద నింకొకతె ప్రక్కలు వీఁపు తొడలు నడుము లుంచి మన్మథకామమున మునిఁగినవారిని, నారచేఁ గట్టఁబడి తుమ్మెదలచేఁ బ్రకాశించు పూలదండలవలెఁ జేతులు చేతులు కలిసియున్నట్లు పెనవేసికొనిన కబరీవతులను హనుమంతుఁడు చూచెను. చేతులు పెనవేయుట సూత్రముచేఁ గట్టఁబడుట, కొప్పులు తుమ్మెదలు, మాలికలు స్త్రీలు.

చ. సలలితమందమారుతవ•శంబునఁ గూడి పెనంగుతీఁగలన్
 గలసిన స్కంధసంతతుల • నవ్యసుమౌఘములన్ మిళిందపం
 క్తులఁ జెలువారి చైత్రమునఁ • దోరపుఁగాంతిని మీఱు నవ్వనీ
 విలసనము న్వహించె సుర•వీరవిరోధివధూవనం బటన్. ౨౮౩

అర్థములు. సలలిత మందమారుతవశంబున = ఇంపైన మెల్లని గాలి

కారణముగా, స్కంధసంతతులన్ = చెట్లబోదెల, సుమ+ఓఘములన్ = పూల సమూహములను, మిళింద = తుమ్మెదల, సద్వనీవిలసనమున్ = మంచి యుద్యానము యొక్క చక్కఁదనమును, సురవీర విరోధి = రావణునియొక్క, వధూవనము = స్త్రీ వనము.

తా త్ప ర్య ము.

రావణుని స్త్రీ లను వనము మనోహరమైన మెల్లని గాలిచే నొకదానితో నొకటి పెనవేసికొనిన తీఁగలతోఁ గలసిన బోదెలను పూలసమూహములను దుమ్మెద గుంపులను గల చైత్రమాసమున వికాసముతోఁ గూడిన వనమువలె నుండెను.

ఇచ్చట మన్మథోద్రేకము మందమారుతము తీఁగలు, చేతులు, స్కంధములు బొమ్మలు నడుములు గల దేహభాగములు సుమములు వారు ధరించిన పూవులు, తుమ్మెదలు తలవెండ్రుకలుగా నుపమానోపమేయంబుల గ్రహించునది.

ఆ. మెలఁతలచట నత్తి•మిల్లిన లీలలు, చూడ నవయవములు•సొబగు మీఱు
వస్త్రమాల్యములును • వారి వారి వ టంచు, వేఱుపఱుపరాక • బెరసి యుండె.

అర్థములు. అత్తిమిల్లిన=పరుండిన, లీలలు=విధములు, బెరసి=కలసి.

తా త్ప ర్య ము.

స్త్రీలచ్చటఁ బండుకొనిన విధము చూడఁగా కాళ్ళు చేతులు వస్త్రములు మాల్యములు ఇది దీనిది అవి దానివి యని వేఱు వేఱుగఁ జెప్పరానట్లు కలిసి యుండెను.

క. ఆ మందిరమణిదీపము, లామిదితలరూపు జెప్ప•లార్పక జగతీ
స్తోమభయదుండు గూర్కఁగఁ, గామము చనఁ జూచు మాడ్కి•గ్రాలెవచలతన్.

అర్థములు. ఆ మందిర = ఆయింటియందలి, జగతీస్తోమభయదుండు = లోకములకన్నిఁటికి భయము కలిగించువాఁడు, కామముచనన్ = కోరికదీరునట్లు, ఉత్ప్రేక్షాలంకారము.

తా త్ప ర్య ము.

ఆయింట మణి దీపములు చలింపక యేకాగ్రముగ వెలుఁగుచుండు విధము చూడ లోకభయంకరుఁడైన రావణుఁడు నిద్రించుచున్న కారణముచే భయముదీఱి కోరికదీర నవి వాని స్త్రీలను జూచుచున్నవా యేమి యన్నట్టులుండెను.

ఇట్లు చెప్పుటచే రావణుఁడు మేలుకొనియున్నప్పు డా స్త్రీలను దీపములుకూడ నిర్భయముగాఁ జూడఁజాలవని భావము.

ఉ. కాముని బారి కోహటిలి • కైవస మైన నృపర్షిదైత్యక
న్యామణులున్ సుదాంగనలు • నాహవకాంతను దెచ్చినట్టి కాం
తామణులున్ స్మరాసుగహ•తప్రమదల్ సురవైరి చుట్టు ని
ద్రామదపారవశ్యమున • రంజిలు చుండిరి తత్థ్సలంబునన్. ౨౮౬

అర్థములు. ఈ స్త్రీ లందఱు రాక్షసస్త్రీలు, రావణాసురుఁడు యథావిధి వివాహ మాడినవారా యనినఁ గాదను చున్నాఁడు. కామునిబారికి = మన్మథుని దాడికి, ఓహటిలి = భయపడి, కైవసము = స్వాధీనము, నృప=రాజులయొక్కయు, ఋషి = ఋషులయొక్కయు, నృపర్షి = రాజర్షులయొక్కయు, దైత్య = దైత్యుల యొక్కయు, కన్యామణులన్ = కన్యకలు, సురాంగనలు = దేవతాస్త్రీలు, ఆహవ కాంక్షను=యుద్ధమందలి కోరికచే, అనఁగా కొందఱు యుద్ధమునకు రాక ముఖము తప్పించుటచే వారిని యుద్ధమున కీడ్చుటకై వారి స్త్రీల నపహరించి తెచ్చెనని భావము. స్మరాశుగహత ప్రమదల్ = మదన బాణములచేఁ గొట్టఁబడిన స్త్రీలు, నిద్రామదపారవశ్యమున = నిద్రమబ్బుచే దేహములు తెలియని వారై.

తా త్ప ర్య ము.

ఆప్రదేశమందు మన్మథతాపము సహింపలేక స్వాధీన పడిన రాజుల ఋషుల దైత్యుల కన్యకలును దేవతాస్త్రీలును యుద్ధమునందలి కోరికచేఁ దెచ్చిన స్త్రీలును కామముగలస్త్రీలును నిద్రమబ్బుచేదేహము తెలియక రావణాసురునిచుట్టుపడియుండిరి.

ఇట్లు చెప్పుటచే నీ గుంపులోఁ గొందఱు స్త్రీలు తమంతటఁ దామే రావణు వరించి వచ్చిరి. కొందఱు బలాత్కారముగఁ దేఁబడి మరల వారు తమ బంధువుల గలిసికొను ప్రాప్తి లేమిచే వ్రతము చెడినను సుఖము దక్కవలెఁ గులము చెడినను గూడు పుట్టవలె నన్న సామెతచొప్పున వస్తులఁ జావలేక వానిబాధపడలేక కామము వ్యర్థము చేయనొల్లక వానికి వశపడిరని యేర్పడుచున్నది. కాని మండోదరివలె ధర్మపద్ధతిని వివాహ మాడినవారు కారని భావము.

చ. ప్రమదలలో సురారి ప్రస • భంబున దెచ్చిన దన్యకామ ము
  న్నమగనిఁ బొందినట్టి చెలి • యక్కడ లే దొకసీత దక్కఁగా
  సమరవిరోధిఁ గాంచి తమ • యంతన తాము తదీయ శౌర్యమున్
  రమయు గుణంబు మెచ్చి తమి • రాములు వచ్చిరి వానిఁ గూడఁగన్. ౨౫౭

అర్థములు. ప్రమదలలో = స్త్రీలలో, ప్రసభంబునన్ = బలాత్కారముగ, అన్యకామ=ఇతరపురుషులందుఁ గామముగలది.

తా త్ప ర్య ము.

ఆ స్త్రీలలో బలాత్కారముగఁ దేఁబడినది, ఇతర పురుషునందు మోహము గలది, పూర్వము మగనితోఁ గలిసినది సీతదక్క వేఱొక్కతెయు లేదు. అచ్చట నున్నవా రందఱు రావణుఁజూచి వాని శౌర్యము సంపద గుణము మెచ్చి వానిని గూడ వారంతటవారే వచ్చిరి.

ఇట్లు చెప్పుటచే నా గుంపులో నిట్టివారు లేరని యర్థమేకాని రావణుఁ డెవ్వ తెను బలాత్కరించి తేలేదని యర్థముగాదు. ఏలనః—

౧. రావణాసురుఁడు పరస్త్రీలను గాముకుఁడై బాధించె ననుటకు వేదవతీ చరిత్రము ప్రమాణము.

౨. దశరథుని యజ్ఞకాలమున దేవతల శరణాగతియందు రావణుఁడు దేవతాస్త్రీల హింసించెనని చెప్పుట ప్రమాణము.

౩. రావణుఁడు రంభాది స్త్రీలను జెఱుచుట నలకూబర బ్రహ్మలచే శాప గ్రస్తుఁడగుట ప్రమాణము.

౪. మందోదరీ విలాపంబున

'దేవాసుర నృ కన్యానా మాహర్తారం తత స్తతః.

దేవతల, అసురుల, మనుష్యుల కన్యల హరించినవాఁడని యుండుట ప్రమాణము.

౫. అన్నను విడిచి వచ్చితివని యింద్రజిత్తు విభీషణు నాక్షేపించినపుడు:—

పరధనములఁ బరదారల హరియించుట,
పరవిత్తమపహరించుట - పరదారలఁ గోరుచుంట.

యివి రావణు దోషములని యతఁడు ప్రత్యుత్తరమిచ్చెను.

హింసా పరస్వహరణే పరదారాభిమర్శనం
పరస్వానాంచ హరణం పరదారాభిమర్శనం
ఏతే దోషా మమభ్రాతు ర్జీవితైశ్వర్యనాశనాః.

యుద్ధ. ౮౭౮ సర్గము.

౬. ఉత్తరకాండమున ౪౯-౩ మొదలు పద్యములఁ జూచునది.

చ. చనుచును రావణుండు బల • సంపద పొంపిరివోవుచుండఁ గ్రొ
వ్వునఁ దనమార్గమందు నృప • పుష్కరనేత్రల మౌని కన్యలన్
దనుజ కులాంగనామణుల • దైవతకాంతల వీరు వారనం
చన కగపడ్డ సుందరుల • యౌవతముం గులకన్యకాతతిన్. ౪౯-౩

చ. బలిమిని ముట్టి యడ్డపడు • బంధువులం బడఁగొట్టి కేలుఁ గొ
ప్పులు బిగఁబట్టి యచ్చెలులు • బ్రుయ్యఁగఁ దిట్టఁగ మొత్తుకోఁగ నీ
డ్గిలఁబడ నీడ్చికొం చరిగి • పుష్పక పుష్పకఁ బుష్పకంబునన్. ౪౯-౪

క. ఈ నెఱిఁ బన్నగకన్యల, మానవభామలను నసుర • మానినులన్ ర
క్షోనారుల యక్షసతుల, దానవ యోషల విమాన • తలముం జేర్చెన్. ౪౯-౫

౭. అరణ్యకాండమున ౩౨ వ సర్గమందు.

"పురీం భోగవతీం ప్రాప్య పరాజిత్యచ వాసుకిం । తక్షకస్య ప్రియాం భార్యాం పరాజిత్య జహార యః'' యని చెప్పఁబడెను.

౮. రావణుఁడు సీతాదేవితో,

'పరదారగమనకేళియుఁ బరదారాపహరణంబు పద్మదళాక్షీ పరఁగుఁ గుల ధర్మమయి' యని చెప్పెను. (సుందర ౫౧౯ వ ప.)

అచ్చటచ్చట నాఁచికొనుచుఁ దెచ్చిన నాయెల్ల లెలనలలో న్యగ్రమహిషివి గమ్ము. (సుందర. ౫౨౭)

'ఖస్త్రీనా ముత్తమ స్త్రీణా మాహృతానా మిత స్తతః సర్వాసామేవ భద్రంతే మమాగ్రమహిషీ భవ. (సుందర. ౨౦ వ స. ౧౫ శ్లో.)

౯. రావణుని శూర్పణఖ చూచినపుడు వాని గుణవర్ణనమందు 'పరదా రాభిమర్శన'మ్మని చెప్పఁబడెను.

౧౦. పంక్తికంఠుఁడు బలిమిని బట్టినట్టి నాగకన్యలలోన జానకియు లేదు. (సుందర. ౩౫౭ వ. ప.)

ఇత్యాద్యనేక ప్రమాణములచే రావణుఁడు పరస్త్రీల వంటని సదాచార సంపన్నుండని తలఁపరాదు. కావున నిచ్చటి మాటకేమి యర్థమనిన నాపడుకటింటిలో వాని నొల్లని స్త్రీలు లేరనియేకాని యట్టివారు వేఱు స్థలమునందు లేరని యర్థము కాదు. ఈ స్త్రీలలోనే వానియందుఁ బ్రేమలేనివారు లేకపోలేదు. చూ. సుం. ౫౭౬.

రావణుఁడు సీతాదేవిని బెదరించినపు డామె దుఃఖింపఁగా నీ స్త్రీలలోఁ గొందఱు సీతాదేవికి ధైర్యము వచ్చునట్లు కన్నులచే ముఖములచేఁ బెదవులచేఁ దల యూఁచుటచే లోపడవలదని సైఁగలుచేసిరి. వానియందు నిజమైన కామము గలవారట్లు చేయుదురా? వేఱు రక్షకులులేక గతిలేక వీనికిఁ జిక్కితిమి, అనుభవింత మని వారు వాని కనుకూలలుగా నుండిరి కాని వాస్తవపు మక్కువచేఁగాదు. అట్లు లోపడనివారిని వాఁడనేక హింసలఁ బెట్టెను.

ఉ. లేదు కురూప యందు నకు•లీనయు లే దుపచారసత్క్రియా
మోదితచిత్త గాని యొక•ముగ్ధ యదక్షిణ లేదు చూడఁగా
లేదు విహీనసత్త్వయును • లీలల భర్త కకామనీయయున్
లే దల రావణాసురుని•లేమలయం దొకభార్య యేనియున్. ౨౮౮

అర్థములు. అకులీన = మంచి వంశమందుఁ బుట్టనిది, ఉపచార సత్క్రియా మోదితచిత్త=ఉపచారముచే సంతోషింపని మనస్సుగలది, అదక్షిణ = సామర్థ్యము లేనిది, విహీనసత్త్వ=బలములేనిది, అకామనీయ=కామింపరానిది.

తా త్ప ర్య ము.

ఆ రావణు భార్యలందు నొకతెయైన కురూపగాని యుత్తమ వంశమందుఁ బుట్టనిదికాని యుపచారములచే సంతోషింపని ముగ్ధగాని భర్తను వశపఱుచుకోలేని మధ్యగాని బలము లేనిది ప్రౌఢగానిది గాని శృంగారచేష్టలచే భర్తకుఁ గామింపదగ నిది గాని లేదు.

లీల=అధిపుని యలఘు గుణానుకృతి లీల యనఁబడును. ఇచ్చట లీల లను నది శృంగారచేష్టల కన్నిఁటికి నుపలక్షణము. అవి యేవన:—

కం॥ ఇల భావ హావ హేలా, విలాస మాధుర్య ధైర్య • విభ్రమలలా,
కిలికించిత మోట్టాయిత, లలితాదులు చేష్టలగుఁ ద•లంపఁగ మఱియున్.

గీ. వెలయు బిబ్బోక విచ్ఛిత్తి విహృతి చకిత, హసిత కుట్టమిత కుతూహలాదులనఁగఁ
గలవుమఱియందు భావంబువెలయుచుండుమహిరసజ్ఞానయోగ్యతామాత్రమగుచు.
నర. భూ.

క. ఈ రావణు భార్యలవలె, శ్రీరాముని ధర్మపత్ని • చేరినచో దే
వారాతి సుకృతి యనెడు వి,చారం బుదయించె హరికి • సద్బుద్ధి కటన్. అర్థ

తాత్పర్యము.

(౧) ఈ రావణుని వాని భార్యలవలె శ్రీరాముని నాయన ధర్మపత్ని సీతాదేవి చేరినచో రావణుఁ డర్పించుటచేఁ గలిసికొననేని, ఈ దేవారాతి = రావణుఁడు, సుకృతి = మంచికార్యము చేసినవాఁడగును, హనుమంతుఁడు సద్బుద్ధి = మంచి బుద్ధిగలవాఁడగుటచే నిట్టి యాలోచన దోఁచెను. రావణుఁడు సీతను రామున కిచ్చి యామెను సుఖ పఱిచెనేని తాను బుణ్యవంతుఁ డగునని హనుమకుఁ దోఁచెనని భావము.

(౨) చేరినచో = రామచంద్రుని వివాహము కాకముందే వీని యొద్ద జేరి యుండినచో ననఁగా వివాహమాడి యుండినచో నని యర్థము అనఁగా సీతాదేవి యీస్త్రీలవలె శ్రీరామచంద్రుని దాను వరింపకముందే యీ రావణుని వరించి యుండెనేని వీఁడు పుణ్యాత్ముఁడై యుండునుగదా యని సుబుద్ధియైన హనుమకుఁ దోఁచెను. ఇచ్చట సుబుద్ధి యను ప్రయోగముచే నిది కపిత్వమువలనఁ గలిగిన చపలతయే గాని స్వభావ సిద్ధము గాదని భావము. ఇట్టి దుర్బుద్ధి పుట్టినందునకు హనుమ పశ్చాత్తాప పడుచున్నాఁడు.

వ్యసనపడి ఇత్యాదిగాఁ బై పద్యమున కవతారిక, అవనిజ, అసదృశగుణ విశిష్ట= సాటిలేని పాతివ్రత్యముచే నందఱ మించినది (అని తలఁచి) అతఁడు వ్యసనపడి = ముందు కలిగిన దురాలోచనకుఁ బశ్చాత్తాప పడి, మఱియున్ అయ్యో! అసమాత్ముఁడు = విషమబుద్ధిగల రావణాసురుఁడు, ఆమె యెడ, అసత్కార్యంబున్ =దుష్కార్యమును జేసెఁ గదా యని చింతించెనని పై పద్యముతో నన్వయము.

(౩) రావణు భార్య లితరులచే నపహరింపఁబడక సదా భర్తతోఁ గూడి యెట్లు సుఖపడుచున్నారో యట్లే సీతయు సదా భర్తతోఁగూడి సుఖించు చుండినచో రావణునైశ్వర్యము చెడకుండును గదా యని, సుబుద్ధికిన్ = శత్రువులకును మేలుకోరు హనుమంతునకుఁ దోఁచెను. మఱియు నాలోచించు చున్నాఁడని పై పద్యమున కవతారిక. అవనిజ యసదృశ గుణవిశిష్టగదా, అయ్యో, మహాకుల

జాతుఁడయ్యును విషమబుద్ధిగల రావణుఁడు ఆమెయెడ నసత్కార్య మొనరించెఁగదా యని వ్యసనపడి చింతించుచు నని యన్వయము.

సీత దృఢమనస్కురాలు గావున నామె పాతివ్రత్యమున కే లోపము గలుగదు కాని యామెకు లేనిపోని యపవాదము మాత్రము వీఁడు కలిగించెఁగదా యని వ్యసనపడుచు నాలోచించె నని భావము.

(౪) రావణు భార్యలవలె సీత రావణుచే నపహరింపఁబడక సదా భర్తతోఁ గూడి యుండినచో రావణుఁడు సుకృతియై యుండు నని హనుమ మొదట నాలోచించెను. నిరతిశయ సౌందర్యవంతురాలైన సీతను రాక్షసస్త్రీ సామ్య మెంచి నందువఁ దా నామెకు హీనోపమాన మిచ్చిన ట్లనుకొని హనుమ దుఃఖించుచున్నాఁడు. అని పై పద్యమున కవతారిక. అవనిజ అసదృశ గుణ విశిష్టగదా యని యాతఁడు పశ్చాత్తాపముచే వ్యసనపడి మఱియుఁ జింతించు చున్నాఁడు.

అయోధ్యా యిత్యాదిగా, అయోధ్యా సీతాపహరణముచే సీతని రాజ్యమంతయు నశించునుగదా యని యన్వయము.

ఇది గోవిందరాజీయము ననుసరించి వ్రాయఁబడెను.

హనుమంతుఁడు సద్బుద్ధి యయ్యు నాయన కొక దుర్బుద్ధి పుట్టెను.

ఈ రావణుని భార్యలవలె, రావణుని యీ భార్యవలె, శ్రీరాముని ధర్మపత్నియుఁ జేరి యుండినచో నీ దేవారాతి పుణ్యాత్ముఁడై యుండును గదా యను నాలోచన గలిగి.

క. వ్యసనపడి మఱియు నాతం,డసదృశసద్గుణవిశిష్ట • యవనిజ యయో్యా
యసమాత్ముఁ డామె యెడ రా,క్షసరా జొనరించెఁగా య•సత్కర్మంబున్. ౨౯౦

తా త్ప ర్య ము.

అట్టి యాలోచన గలిగిన దానికై అసమానమైన పాతివ్రత్యమున గొప్పదియు అవనిజ-అయోనిజ- భూమియందుఁ బుట్టినది, ఆ ప్రకారము చేయునాయని పాపాలోచనము నాకేల గలిగె నని వ్యసనపడి యట్టి పతివ్రతయందు వీఁడు తననాశముకొఱకు విషమబుద్ధి గలవాఁడై చేయరాని పని చేసెఁగదా యనుకొనెను.

—• ౧౦ వ సర్గము. హనుమంతుఁడు నిద్రించు రావణునిఁ జూచుట. •—

క. అని చింతించుచుఁ జూచుచు, జనుచుం బలుఁగులను రత్న•సమితుల గొనబై
కనకవిమూరజదాంతా,సనములఁ జిత్రాంగములను • సవు రగుదానిన్. ౨౯౧

అర్థములు. పలుఁగులను = స్ఫటికములను, కనకవిమూరజ దాంతాసనములన్ = బంగారు వైడూర్యములు ఏనుఁగు దంతములతోఁ జేయఁబడిన యాసనములను, చిత్రాంగములను=చిత్రాసనములచేతను, సవురు=అందము.

తా త్ప ర్య ము.

అని యాలోచించుచుఁ జూచుచుఁ బోవుచు స్ఫటికములచేతను బంగారు

వైడూర్యములు, దంతములు, వీనిచేతను జేయఁబడిన యాసనములచేతను జిత్రాంగముల చేతను నందమైనదానిని, ఇదియు ముందుపద్యము రావణుని శయ్యావర్ణనము.

ఉ. పలుసైన పలుపులఁ • బట్టుదిండ్లును గల్గి, మహిత మై దేదీప్య•మాన మగుచు
నొక్కచో నవ్యమా•లోదారహరికాంక, సన్నిభ పాండరచ్ఛత్ర మమర
జాతరూపఖచిత•సారసాప్తప్రభా, శోకమాలాపంక్తి•సుందర మయి
వీవనల్ విసరెడి•వెలఁదిబొమ్మల నొప్పి, వరధూప పంక్తులఁ • బరిఢవిల్లి
తే. మేఁకపిల్లల చర్మముల్ • మీఁద బఱచి, పూలదండల నెల్లెడఁ • బొనరఁజుట్టి
కనఁగ సురనాథశయ్యాని•కాశమైన, యసురపతిమంచము గనె•హనుమ యచట.

అర్థములు. పలుపు = వెడలుపు, నవ్యమాలోదార = విశేషముగఁ గ్రొత్త మాలికలచే నలంకరింపఁబడి, హరికాంక సన్నిభ = చంద్రునితో సమానమైనదై, పాండరచ్ఛత్రము = తెల్లగొడుగు, జాతరూపఖచిత = బంగారుచేఁ జెక్కఁబడిన సారసాప్తప్రభా = సూర్యకాంతిగల, అశోకమాలాపంక్తి = అశోక పుష్పముల మాలికలచే నందమై, వెలఁదిబొమ్మలు = ఆఁడుబొమ్మలు, యంత్రము బలమున బొమ్మలు వీవనలు విసరుచున్నవని భావము. శిల్పచమత్కారము శ్లాఘింపఁదగినది కదా. ఇవి బొమ్మలేకాని రాక్షసస్త్రీలుగావు. స్త్రీలే నైయుండిన హనుమ సమీపించుటకుఁ జూచుటకు సాధ్యమైయుండదు. వరధూప పంక్తులన్ = శ్రేష్ఠమైన ధూపములచే నొప్పి.

తాత్పర్యము.

వెడలుపాటి పలుపులు పట్టుదిండ్లు గలిగి గొప్పదై ప్రకాశించునదై యొక చోట పూలమాలలచే నలంకరింపఁబడిన చంద్రబింబమువలెఁ దెల్లనైన శ్వేతచ్ఛత్ర మొప్పుచుండఁగా బంగారుతోఁ జెక్కఁబడి సూర్యకాంతిగల యశోకపుష్పముల పంక్తులచే నందమై విసనకఱ్ఱలు విసరుచున్న యాఁడుబొమ్మలు గలిగి అగరు మహిసాక్షీ ధూపములచే నొప్పి మేఁకపిల్లల చర్మములు మీఁదఁ బఱచి చుట్టు పూలదండలు గట్టి చూచుటకు నింద్రుని పానుపుతో పరిఢవిల్లుచున్న రావణుని మంచమును హనుమంతుఁడు కనుఁగొనెను.

సీ. ఆ మహనీయశ•య్యాతలంబునయందుఁ, గారుమేఘము నవ్వు•కాంతివాఁడు
గ్రొత్తతళుకులఁ దేఱు • కుండలంబులవాఁడు, కావిపాఱిన పెద్ద•కనులవాఁడు
సంజకెంజాయ స•కలంపాంబుదమురీతిఁ, బొరి నెఱ్ఱగందంపుఁ•బూఁతవాఁడు
దివ్యపరిష్కార•దేదీప్యమానుండు, రూపసియును గామ•రూపధరుఁడు
ఆ. అసురకన్యలకును బ్రియుం • డైనయాతఁ
డాడి మాపట మిక్కిలి • యలయువాఁడు
మేలిసొమ్ముల మెఱసెడి • మేనివాఁడు
రావణుఁడు నిద్దురింప మ•ర్కటుఁడు గనియె.

అర్థములు. సశంపాంబుదము = మెఱుపులతోఁ గూడిన మేఘము, పరిష్కార = ఆభరణములచే, రూపసి = అందగాఁడు, ఆడి = క్రీడించి, మాపటన్ = రాత్రివేళ.

తా త్ప ర్య ము.

ఆపెద్ద పానుపు మీఁద వర్షాకాలమేఘము వలె నల్లని దేహకాంతి గలవాఁడును క్రొత్తకాంతులచేఁ జేటయగు కుండలములు గలవాఁడును, ఎఱ్ఱనైన పెద్ద కన్నుల వాఁడును, సంధ్యాకాలపు రాగము మెఱుపుతోడి మేఘమువలె విస్తారముగ నెఱ్ఱ గంధమును బూసికొన్నవాఁడును, దివ్యాభరణములచేఁ బ్రకాశించువాఁడును, సుందరుఁడును, కోరిన రూపము ధరించువాఁడును, అసుర స్త్రీలకును బ్రియుఁడైనవాఁడును, రాత్రివేళ యాడి యలసిన వాఁడును, శ్రేష్ఠములైన సొమ్ములచే మెఱయుచున్న దేహముగలవాఁడును నగు రావణుఁడు నిదురింపఁగా హనుమంతుఁడు చూచెను.

తే. రజతచేలంబువాని దీ॰ర్ఘంబు లైన, బాహువులవాని భూరుహా॰వనకుడుంగ
సహితమందర మనఁగను ॰ జాలువాని, నెల్ల రాక్షసులకు సుఖ ॰ మిడెడువాని.

అర్థములు. రజతచేలంబువానిన్ = వెండిసరిగ వస్త్రము ధరించినవానిని, భూరుహావన = చెట్లతో నిండిన వనములతోను, కుడుంగ=పొదలతోను, సహిత = కూడిన, మందర మనఁగను=మందరపర్వత మనునట్లు.

తా త్ప ర్య ము.

వెండిసరిగ గల వస్త్రమువాని నిడుపాటి చేతులవాని చెట్లు దట్టముగాఁగల వనములతోను పొదలతోను గూడిన మందరము వంటి వాని రాక్షసుల కందఱకు సుఖమిచ్చువాని.

ఉ. పెద్దగ దంతివోలె బుస॰పెట్టెడువానిని, పానమత్తతన్
నిద్దురగొన్నవాని, రణ॰నిష్ఠును, రావణు జూసి భీతిమైఁ
దద్దయు దద్దరిల్లె హరి ॰ దయ్యముఁ జూచి వడంకు కోఁచ నా
నొద్దకి కేల వచ్చితి న॰రో యని పానుపు డిగ్గి యంతటన్. ౨౬౫

అర్థములు. దంతి=ఏనుగు, దద్దరిల్లెన్=తల్బిబ్బుపడెను, కోఁచ=పిటికి.

తా త్ప ర్య ము.

ఏనుఁగువలెఁ బెద్దగ బుసపెట్టుచున్నవానిని, త్రాగిన మత్తుచేత నిదురించు వానిని, యుద్ధమందుఁ గఠినుఁడైనవానిని, రావణు సమీపించి భయపడి దయ్యమును జూచి వణఁకు పిటికివానివలె మిగులఁ దబ్బిబ్బుపడెను. అయ్యో! యీ పాపిదగ్గఱ కేలవచ్చితి నని పానుపుదిగి తరువాత.

దీనివలనఁ బాపాత్ముల సమీపింపరాదని యేర్పడుచున్నది.

ఉ. చెచ్చెర వేదికాంతరముఁ ॰ జేరి కనుంగొనె నిద్దురించు నా
కుచ్చితు, దచ్ఛయంబు మద॰కుంజరయుక్తరుషుర్ప్రకాశ మై

మెచ్చులు గొల్పె, నవ్యాద న•మేయపరాక్రమకీర్తి యుక్తముల్
నిచ్చలుఁ గాంచనాంగదమ•ణీమయభూషణ భూషితంబులున్. ౧౯

అర్థములు. వేదికాంతరము = వేఁబోకయరుఁగు, తచ్ఛయము = అపానువు, మదకుంజరయుక్త=మదించిన యేనుఁగుతో గూఁడిన, ఝరీప్రకాశమై = ప్రవాహము యొక్క కాంతిగలదై, నిచ్చలు=ఎల్లప్పుడు, నిత్య శబ్దభవము - రూ - నిచ్చ.

తా త్ప ర్య ము.

శీఘ్రముగ మతియొక యరుఁగుమీఁదికిఁబోయి నిద్రపోవుచున్న యా కుచ్చి తుని జూచెను. మదించిన యేనుఁగుతోఁగూడిన ప్రవాహమువలె వాని పానువు శ్లాఘ్యమైయుండెను. విస్తారమైన పరాక్రమము వలనఁ గలిగిన కీర్తితోఁగూడినవియు బంగారు భుజకీర్తులు రత్నమయములైన యాభరణములచే నలంకరింపఁబడినవియు.

సీ. అగుచును నింద్రధ్వ•జాభంబు లగువాని, నైరావతవిషాణ•హతులచేతఁ
గాయ గాచినవాని • ఘనశతారాహతి, నోర్చు నంసంబుల • నొప్పువాని
విష్ణుచక్రక్షతి • వెలయుచుండెడివాని, సబలసంగతసమాం•సములవాని
నమలచిహ్నాత్తన•ఖాంగుష్ఠములవాని, గుదియలఁ బోలిన•కొమరువానిఁ

తే. గరికరాకృతి గల గరి•గరికవాని, నైదుపడగల పాముల•యట్లు పాన్పు
నెరసి పడియుండువానిఁ గుండేటినల్ల, బోలు కమ్మనిగందంపుఁ•బూతవాని.

అర్థములు. ఇంద్రధ్వజాభంబులు = ఇంద్రధ్వజముతో సమానములు; ఐరావత విషాణహతులచేత = ఐరావతముయొక్క కొమ్ములదెబ్బలచే, ఘనశతారాహతి = గొప్ప వజ్రాయుధము దెబ్బలను, అంసంబులు = మూఁపులు, విష్ణుచక్రక్షతి = విష్ణుచక్రముయొక్క గాయములచే, సబల సంగత = బలముతోఁగూడిన, సమాంసములవానిని = సమములైన మూఁపులవానిని, అమలచిహ్నాత్త = నిర్మలములైన లక్షణములు గల, నఖాంగుష్ఠములవానిన్ = గోళ్ళు బొటనవ్రేళ్ళు గలవానిని, గరగరికవాని = అందముగలవాని,ఐదుపడగల పాములట్లు=చేతి యైదువ్రేళ్ళు నైదు పడగలని భావము. నల్ల=నెత్తురు.

విష్ణుచక్రక్షతి యనుటను శ్రీమహావిష్ణువుయొక్క సుదర్శనము వలననైన గాయమనియు రావణుఁడు విష్ణువును జయించె ననియుఁ గొందఱు చెప్పుదురు. రావణునకు విష్ణువునకు యుద్ధము జరిగినట్లు రామాయణమున లేదు. అంతియ కాక యింద్రుఁడు తన్నుఁదోడుపడ రమ్మని పిలిచినపుడు నేను యుద్ధమునకు వచ్చితినేని జంపికాని రాను. ఇప్పుడు వాని జంప వలనుపడదు. కాలాంతరముననే చంపెదనని సమాధానము చెప్పి పంపిన ట్లుత్తర రామాయణమున ౭౦౭-౭౦౮-౭౦౯ పద్యంబులఁ జూడుఁడు. ఈ కారణముచే విష్ణుని సుదర్శన మిచటఁ జెప్పరాదు. విష్ణుచక్రమను నస్త్రమును విశ్వామిత్రుఁడు శ్రీరామచంద్రమూర్తి కుపదేశించినట్లు బాలకాండము ౭౭౨ పద్యమునఁ గలదు. ఈ విష్ణుచక్రమును విశ్వామిత్రుఁడు వసిష్ఠునిపైఁ

ప్రయోగింపఁగా వ్యర్థమై పోయినట్లు కాల. ౧౦౭౦ వ పద్యంబునఁ గలదు. కావుననిది యీయాయుధమే కాని సుదర్శన చక్రముగాదు. సుదర్శన మనునది భగవత్సంకల్ప రూపకము. అది విశ్వామిత్రున కెట్లు లభించె. వసిష్ఠునిచే హత మెట్లయ్యె. నామ సామ్యముచేఁ బ్రమాద పడరాదు.

తాత్పర్యము.

అగుచు నింద్రధ్వజముతో సమానము లగునవియు, ఇంద్రుని వాహనమైన యైరావతము కొమ్ముల పోట్లచే కాయలు గాచినవియు, గొప్పవజ్రాయుధము దెబ్బల సహించిన మూఁపురములు గలవియు, విష్ణుచక్ర మను నాయుధముచే గాయపడినవియు, బలముగలిగి సమములైన మూఁపులు గలవియు, నిర్మల లక్షణములు గల గోళ్లు బొటనవేళ్లు గలవియు గుదియలఁ బోలినవియు నేనుఁగు తొండములవంటి యందము గలవియు, నైదుపడగల పాములఁ బోలునవియు, పానుపుపై నావరించి పడియుండు నవియు, కుందేటి నెత్తురువంటి యెఱ్ఱని గంధము పూయఁబడినవియు.

సీ. మృగవిలోలాక్షీవి•మృదితంబు లగువాని, మంచిగంధపుఁబరిమళమువాని
యక్షపన్నగనిర్జ•రాసురగంధర్వ, పటలి హో హో యనఁ • బ్రబలువాని
మందరాచలశృంగ•మధ్యసీమను సూర్కు-, క్రుద్ధాహు లన భీతి • గొలుపువానిఁ
గ్రవ్యాదనాథుక•రంబుల రెంటిని, బావని కనుఁగొనె • బాహుయుగము
తే. కల్గిన సశిఖరమందర•క్ష్మాధ్ర మనఁగఁ, గ్రాలు రావణు వదనని•ర్గతము లైన
చూతపున్నాగవకుళాన్న•సురభితములు, శ్వాసపవనముల్ నిండారె•సదనమునను.

అర్థములు. మృగవిలోలాక్షీ = జింక కన్నులవలెఁ జలించు కన్నులుగల స్త్రీలచే, విమృదితంబులు = ఆలింగనాదులు చేసికొనఁబడినవి, క్రుద్ధాహులు = కోపించిన పాములు, క్రవ్యాదనాథు = రాక్షసపతియొక్క-, క్ష్మాధ్రము = పర్వతము, నిర్గతములు = బయలువెడలినవి' సురభితములు=సువాసన గలవియు.

తాత్పర్యము.

స్త్రీలచేఁ గౌఁగిలింపఁబడినవియు, మంచిగంధము వాసనగలవియు, యక్షుల పన్నగుల దేవతల యసురుల గంధర్వుల సమూహము విలపింపఁజేసినవియు మందర పర్వతము శిఖరము నడుమ నిద్రించు కోపించిన పాములవలె భయపెట్టునవియు, నగు రాక్షసేశ్వరుని రెండుచేతులను హనుమంతుఁడు చూచెను. రెండుబాహువులుండుటచే శిఖరములతోఁ గూడిన మందర పర్వతమువలె నుండు రావణుని నోరనుండి వెడలు చున్న మామిడి పున్నాగము పొగడ వీనితోఁ జేయఁబడిన సారాయము త్రాగుటచే నా వాసన గల యూర్పు లిల్లు నిండియుండెను.

ఈ పద్యమునందు రావణున కొక తల, రెండు చేతు లున్నట్లు చెప్పఁ బడెను. ఈ తలల, చేతుల విచారము ౧౧౩౪ వ్యాఖ్యయందుఁ జేయఁబడును.

సీ. ఒకతోర నొఱఁగిన యుజ్జ్వలన్మౌక్తిక, కాంచనమకుటంబు • మించువానిఁ
కుండలజ్వలితాస్య • మండలంబుఁ గలానిఁ, గ్రూరసర్పమువోలె • రోఁజువాని
రక్తచందనదిగ్ధ • రమణీయహారసం, సక్త విశాలవ • క్షంబు వాని
నొకవంక వ్రాలిన • తెల్లనైన వెలిపట్టుఁ, బుట్టంబు ముంగొంగు • పొలుచువాని
ఆ. విలువ లేని పైఁడి • వలువఁ గట్టినవాని, మినుపపెద్దకుప్ప • నెనయు వాని
గంగ నడుమ నిదుర • నంగం బెఱుంగని, ద్వీపము నాఁగ మిగుల • వెలుఁగువాని.

అర్థములు. కాంచనమకుటంబు = బంగారు కిరీటము, కుండల = చెవి పోగులచే, జ్వలిత = ప్రకాశించు, ఆస్యమండలము = ముఖబింబము, రక్తచందన దిగ్ధ = ఎఱ్ఱగంధముచేఁ బూయఁబడిన, రమణీయ = మనోహరమైన, హారసంసక్త = హారములతోఁ గూడిన, విశాలవక్షంబువాని = వెడలుపాటి ఱొమ్ముగలవాని, ద్వీపము = ఏనుఁగు.

తాత్పర్యము.

పండుకొన్న కారణముచే నొకప్రక్కకు నొఱగిన- ప్రకాశించు ముత్యములు గల బంగారు కిరీటంబు గలవాఁడును, చెవుల కుండలములచేఁ బ్రకాశించు ముఖ మండలము గలవాఁడును, క్రూరమైన పామువలె బుసగొట్టువాఁడును, ఎఱ్ఱగంధపుఁ బూఁత గలిగి యందమైన హారములతోఁ గూడిన వెడలుపాటి ఱొమ్ముగల వాఁడును, నొకప్రక్క వ్రేలిన యందమైన తెల్లని పట్టువస్త్రము ముంగొంగు గల వాఁడును, వెలలేని బంగారు సరిగ వస్త్రముగట్టినవాఁడును, మినుములరాశివలె నున్న వాఁడును, గంగనడుమ నిద్దురగొని దేహము దెలియని యేనుఁగువలె నుండువాఁడును.

క. నాలుగు దిక్కులఁ దమరుచి, వాలాయము నిండ వెలుఁగు • వరదీపములన్
నాలుగిట మెఱయ మెయి శం,పాలలితాబ్దంబు పగిది • భాసిలువానిన్. ౩౦౦

అర్థములు. శంపాలలితాబ్దంబు = మెఱపుచే నందమైన మేఘము. ✓

తాత్పర్యము.

నాలుగు దిక్కులందుఁ దమకాంతి వ్యాపింపఁజేయు నాలుగు దీపములచే మెఱయుచున్న దేహముతో మెఱుఁగులతోఁ గూడిన మేఘమువలె నున్నవానిని.

—• హనుమంతుఁడు నిద్రించు రావణుభార్యలఁ జూచుట. •—

తే. అసురవల్లభు నాతని • యంఘ్రిమూల,మునను బండినయాతని • ముద్దరాండ్ర
రాక్షసాధీశు దివ్యహ • ర్మ్యంబునందుఁ,గాంచెఁ బవమానసూతి ని • ష్కలుషమతిని.

అర్థములు. అంఘ్రిమూలమునను = పాదముల కడ, నిష్కలుషమతిని = పాపములేని మనస్సుతో.

తాత్పర్యము.

రావణాసురుని, వాని కాళ్ళయొద్దఁ బండుకొనిన యాతని స్త్రీలను, రావణాసురు నింట నిర్మల మనస్సుతో నాంజనేయుఁడు చూచెను.

క. కమ్మలతో వాడని మా,ల్యమ్ములతో నిండునెలను • హసియించెడు నా
స్యమ్ములతో వల ముద్దుం, గుమ్మలఁ గనుఁగొనియె గాలి•కొడు కవ్వేళన్. ౩౦౨

తాత్పర్యము.

ఈ స్త్రీలు వర్ణింపఁబడుచున్నారు. కమ్మలతోను, వాడిపోని పూలదండలతోను, పున్నమ చంద్రుని నవ్వు ముఖములతోను నుండు స్త్రీలను హనుమంతుఁడు చూచెను.

క. ఇంబుగఁ దాల్చి యాభర,ణంబుల వీణాదివాద•నంబుల శుభనృ
త్తంబులఁ జతురలఁ బత్యం,కంబులపై నిదురగొనెడి•కాంతలఁ గనియెన్. ౩౦౩

తాత్పర్యము.

మనోహరముగ నాభరణంబుల ధరించి వీణాదుల వాయించుట యందును, నృత్యములందును నేర్పుగలవారిని, పతి తొడలపైఁ బండుకొని యుండగాఁ జూచెను.

ముందుఁ జెప్పఁబడినవారు రావణునకు దూరముగా నేలఁబడియుండినవారు. వీ రంతకంటె నుత్తములు గావున రావణు సమీపంబున వానిని తొడలమీఁదనే తల యుంచి పండుకొనిరి.

క. అంగనల వీను లందుఁ జె,లంగెడి వైడూర్యకుండ•లంబులు మఱి యా
చెంగట వెలుంగు బంగరు,టంగదములు గాంచె వాన•రాగ్రణి యచటన్. ౩౦౪

తాత్పర్యము.

ఆ స్త్రీల చెవులందు వైడూర్యముల కుండలంబులు వారి సమీపమున బంగారు భుజకీర్తులు హనుమంతుఁడు గనుఁగొనెను.

క. ఇందురుచిఁ గేరు ముఖములు,సుందరతఁ దళుక్కు మనెడి • చొక్కపుఁగమ్మల్
మందిరమును దారాగణ,తుందిల గగనంబుమాడ్కిఁ • దోఁచించెఁ గడున్. ౩౦౫

తాత్పర్యము.

చంద్రుని పరిహసించు ముఖములు, సౌందర్యముచేఁ దళుక్కు మను కమ్మలు ఆ యింటిని నక్షత్రసమూహములచే నిండిన యాకాశమును బోలి యుండఁ జేసెను.

క. హాలారతిఁ గేళిగతి, లీలారతిఁ దేలివట్టి • లీలావతు ల
వ్వేళను మే నెఱుఁగక కడుఁ,సొలిరి యిం దందు నిదుర • తోరముగాఁగన్.౩౦౬

అర్థములు. హాలారతిన్ = మద్యపానాసక్తిని, కేళిగతిన్ = క్రీడలందు, లీలారతిన్=విలాసముతోఁ గూడిన రతియందు, లీలారతి యనుటచే, చౌశీతి బంధములు సూచితము. లీలావతులు = శృంగారవతులు. స్త్రీలు.

తాత్పర్యము.

మద్యము బాగుగఁ ద్రావి, నృత్యాదులు సలిపి, ధేనుకాది బంధముల భర్తతో రతి సలిపిన స్త్రీలు నిద్దుర పెల్లున దేహములు తెలియక యందందుఁ బడి నిద్రించిరి.

క. మత్తచకోరాంబక వర,నృత్తకళాశీల యగుట • నే యభినయ సం
పత్తి మును వెలసె నిద్రా,యత్తయునై తదభినయమె • యనువుగఁ దాల్చెన్.

అర్థములు. మత్తచకోరాంబక = మదించిన చకోరములవంటి కన్నులుగలది, వరనృత్తకళాశీల=నాట్యము చక్కఁగా నాడుట స్వభావముగాఁ గలది.

తాత్పర్యము.

నాట్యమునందు సామర్థ్యము గల యొకతె యాడునప్పుడే హస్తగ్రీవాభినయము చూపెనో నిద్రించి నపుడును నా యభినయమే చూపించుచుండెను.

క. వెల్లువఁ బోవుచుఁ బోతము, ఫుల్లనళిని యాశ్రయించు•పోలుపున నిదురన్
హల్లకపాణి యొకతె కర,పల్లవములఁ గౌఁగిటన్ వి•పంచిం గూర్చెన్. ౩౦౭

అర్థములు. పోతమును = పడవను, ఫుల్లనళిన = వికసించిన తామరతీఁగ, హల్లకపాణి=చెంగలువ వంటి యఱచేయి గలది, విపంచిన్=వీణను.

తాత్పర్యము.

ఏటివెంటఁ బోవు వికసించిన తామరతీఁగ పడవను చుట్టుకొన్నట్టు లొకహల్లకపాణి తన చిగురువంటి చేతులతో వీణను గౌఁగిలించి పండుకొనెను.

క. కటంబున నొక కంజా,తేక్షణ మడ్డుకము నుంచి • యెలమిని శిశువున్
గటమునఁ జేర్చి పండు మృ,గేక్షణ యన నిద్దురించె • నెలమిం గొనుచున్. ౩౦౮

అర్థములు. కటంబునన్ = చంకయందు, మడ్డుకము=తుడుము.

తాత్పర్యము.

ఒకతె చంకయందుఁ దుడు ముంచుకొని శిశువును జంక నుంచుకొని నిదురించు స్త్రీవలె సంతోషముతోఁ బండుకొనెను.

క. చిరకాలాగతు వల్లభుఁ, గరముల బిగిఁ గౌఁగిలించు•కామిని కరణిన్
గురుకుచ యొకర్తు పటహముఁ, గరముల బిగఁ గ్రుచ్చి నిదుర•కైపునఁ జొక్కెన్.

అర్థములు. చిరకాలాగతున్ = దీర్ఘకాలమునకు వచ్చినవానిని, పటహము = తప్పెట, కైపునన్ = మత్తుచే.

తాత్పర్యము.

దేశాంతరము పోయి యుండి చాలఁగాలమునకు వచ్చిన భర్తను గౌఁగిలించు కామినివలె గొప్ప స్తనములు గల స్త్రీ యొకతె తప్పెటను గట్టిగఁ గౌఁగిలించుకొని నిద్దుర మత్తున పడియుండెను.

క. కామమదంబున నొకర్తుక, కామిని ప్రియుతము రహస్సు • గ్రహియించినటుల్
తామరసాక్షి యొకర్తుక, ప్రేమంబునఁ గౌఁగిలించి • వేణువుఁ బండెన్. ౩౧౧

అర్థములు. రహస్సు = రహస్యాంగము, లింగము.

తాత్పర్యము.

కామాతిశయమున నొకకామిని తనకు మిక్కిలి ప్రియుఁడగు వాని లింగమును

శేతఁబట్టుకొని నిద్రించు నట్టు లొకతె పిల్లంగ్రోవిని కేతఁ బట్టుకొని నిదురించెను.

క. కాంతునితోడఁ బరుండిన, కాంతామణి నా విపంచి ♦ గౌఁగిట నొవరన్
 దంతిగమన నృత్తకళా,త్యంతనిపుణ యొర్తు నిదుర ♦ నంగము వ్రాల్చెన్. ౩౧౨

తా త్ప ర్య ము.

మగనితోడఁ బండుకొనిన కాంతవలె నృత్తమునందు మిగుల నేర్పుగల యొకతె వీణను గౌఁగిలించి నిదురచే దేహము వ్రాల్చి పరుండెను.

నిద్దుర మబ్బుచే వీరికి నీ కొలఁదులు దూరముగ నుంచి పండుకొనుటకు నవకాశము దొరకినది కాదు. ఎవరిపని వారు చేయుచు నట్టులే పడి నిద్రించిరి.

క. బంగరుజిగి మృదువును హృద,యంగమమును బీవరంబు ♦ నగు నంగములన్
 రంగార నొత్తి యొక్క-మృ,దంగ మొక కురంగనయన ♦ తద్దయుఁ గూర్కెన్.

అర్థములు. పీవరము=బలిసినది, మృదంగము=మద్దెల.

తా త్ప ర్య ము.

బంగారు కాంతి, మృదుత్వము, మనోహరత్వము బలుపుగల యవయవములచే నొకతె మృదంగమును నొత్తుకొని పండుకొని నిదురించెను.

క. మద్దెల మొరయించుచు నొక,ముద్దియ శ్రమ మొంది బాహు♦మూలంబులచేఁ
 దద్దయుఁ గట్టంబున నది, గ్రద్దన బిగియించి సోలె ♦ గాటపు నిదురన్. ౩౧౪

తా త్ప ర్య ము.

ఒకతె మద్దెల వాయించుచు బడలి దానిని చంకలచే బిగించి గాఢనిద్రచే సోలెను.

క. డిండిమముఁ గ్రుచ్చి వెనుకను, నొండొక డిండిమము గ్రాల ♦ యువవల్లభుతోఁ
 గొండొక బిడ్డనితోడఁ బ,రుండిన కకుభోరు వనఁ బ♦రుండెను నిదురన్. ౩౧౫

అర్థములు. డిండిమము = రాయిడి గిడిగిడి, ఢక్క. కొండొక = చిన్న, కకుభోరువు=కకుభమువంటి తొడగలది.

తా త్ప ర్య ము.

ఒకతె ముం దొక ఢక్క, వెనుక నొక ఢక్క యుంచుకొని చిన్నబిడ్డను ముందు, వయస్సుమగని వెనుక నుంచుకొని పరుండిన స్త్రీవలెఁ బరుండెను.

క. మదనమదభృశవిమోహిత,మదకలమదిరాక్షి యొర్తు ♦ మతి తెలియక తా
 మృదుకరముల నాడంబర,ము దగఁ గవుంగిటను జేర్చి ♦ మునిఁగెను నిద్రన్. ౩౧౬

అర్థములు. మదన మద = కామమదముచే, భృశవిమోహిత = మిక్కిలి మోహము చెందిన, మదకల = మదముచే నందమైనది, మదిరాక్షి = మద్యము వలె నెదుటివారిని మత్తుఁగొనఁ జేయు కన్నులుగలది. ఆడంబరము=తూర్యవిశేషము.

ఆడంబర స్సమారంభే గజగర్జిత తూర్యయోః విశ్వము.

తా త్ప ర్య ము.

కామ మదమున మిగుల మోహముచెందిన యొకతె దేహము తెలియక తన మృదుకరములఁ నాడంబరమును గౌఁగిలించి నిదురలో మునిఁగెను.

క. జలకలశ మొరగ్గ వసుధా,తలమున దొరలించి దానఁ దడిసెన్ సురభిన్
 చెలువటి వాడమికై ని,ర్మలజలసిక్త మగు శబల•మాల్యము మాడ్కిన్. ౩౧౭

అర్థములు. జలకలశము = నీటిపాత్ర, సురభిన్ = వసంతకాలమందు, చెలువటి = అందముచెడి, వాడమికై=వాడిపోకయుండుటకై, శబలమాల్యము=నానావర్ణములు గల పూలదండ, మాడ్కిన్=వలె.

తా త్ప ర్య ము.

రావణాసురునకు నీళ్ళుపోసెడి పనికత్తె నీటిపాత్ర నిద్ర మబ్బున నేల దొరలించి యా నీటియందే పండుకొని వసంతకాలమున వాడిపోకుండుటకై నీళ్ళచేఁ దడుపఁబడిన పెక్కురంగుల పూలదండవలె నుండెను.

శబల శబ్దస్వారస్యముచే నీళ్లు వట్టివేరు మొదలైన వాని వాసన గలవై కుంకుమ పూవుతోఁ గలసి యుండె నని భావము.

క. బంగరు గిండుల మేలిహొం,రంగులు గల నిజపయోధ•రంబులఁ గేలన్
 భృంగీకురళ యొకర్తుక, పొంగుగ బిగఁ బట్టికొనుచుఁ బొండెన్ నిదురన్. ౩౧౮

అర్థములు. భృంగీకురళ=ఆఁడు తుమ్మెదలవంటి ముంగురులు గలది.

తా త్ప ర్య ము.

బంగరు గిన్నెలవంటి శ్రేష్ఠ మగు విలాసము గల తనకుచములను సంతోషముతో గట్టిగాఁ బట్టికొనుచు నొక యాఁడుతుమ్మెదలఁబోలు ముంగురులు గల సుందరి నిద్రించెను.

క. మదవిహ్వల యగు నొక్క ప్రమద శారదపూర్ణ చంద్రు • మణిపించెడి స
 ద్వదనముఁగలయొకహరికటి, నిదురను బిగియారఁ గ్రుచ్చె • నెఱమోహమునన్.

అర్థములు. మదవిహ్వల=మదముచే వికలమైన మనస్సుగలది, హరికటిన్ = సింహమధ్యను.

తా త్ప ర్య ము.

మదముచేఁ జెదరిన మనస్సుగల యొకపడుచు శరత్కాల చంద్రునితో సమానమైన ముఖముగల యొక సింహమధ్యను నిండు మోహముచే నిదురఁబోవుచు గట్టిగాఁ గౌఁగిలించుకొనెను.

తే. కామినులు కామమదమునఁ గాముకులను, జన్నులను బిగ్గ నొత్తెడి•చందమునను
 తతఘనానద్ధసుషిరవా•ద్యములఁ గ్రుచ్చి, మత్తకాశిను లయ్యెడ • నత్తమిలిరి.

అర్థములు. తత = వీణాదిక వాద్యము - తంతెలుగల వాద్యము, ఘన = తాలాదికము-వాయించునవి - కంచుతాలములు, ఆనద్ధము = మద్దెల మొదలయినవి,

సుషిరములు = పిల్లఁగ్రోవులు - మేళములు మొదలయినవి, మత్తకాశినులు=మదముచేఁ బ్రకాశించు స్త్రీలు, అశ్వపిలిరి=పండుకొనిరి.

తా త్ప ర్య ము.

కామముగల స్త్రీలు కామముగల తమ భర్తలను గాఢాతిశయమునఁ జన్నులచే గట్టిగా నొత్తు విధముగాఁ గొందఱు స్త్రీలు వీణెలను, మద్దెలలను, తాళములను, వెదురుగొట్టములతో వాయించు పిల్లఁగ్రోవులు మొదలగు వాద్యములను గట్టిగాఁ గౌఁగిలించుకొని పండుకొని నిద్రపోయిరి.

రావణాసురుని యంతఃపురస్త్రీ లందఱు సొమ్ము లూడిపోయినవారుగను, చీర లూడిపోయిన వారుగను, ముఖముమీఁదఁ బైఁటకొంగు వేసికొనినవారుగను వర్ణింపఁబడిరి. ఇందు శృంగారరసము వర్ణితమైనను ని వన్నియు రాఁగల వైధవ్య చిహ్నములని ధ్వనిత మని తెలియంగ వగు.

క. వారల నెల్లరఁ జూచుచు, వీరుఁడు కపివరుఁడు పోయి వే ఱొకచోటన్
 జారుతరరూపవిభవో, దారను నేకాంతసీమఁ • దరుణిని గాంచెన్. ౩౨౧

తా త్ప ర్య ము.

వీరుఁ డగు నాంజనేయుఁడు వారి నందఱఁ జూచుచు బోయి పోయి వేఱొక చోట నేకాంతస్థలమున మిగుల మనోహరమైన సౌందర్యాతిశయము గల యొక వయస్సు స్త్రీని జూచెను.

ఇచట వీరుఁ డనఁగా నింద్రియజయము గలవాఁ డని భావము. ఇందఱ నందగత్తెలఁ గామమత్తల నేకాంతమునఁ జూచినను ఆయన మనస్సు చలింపలే దని భావము. ఈమె పట్టపుదేవి గనుక ఈ మూకలో గలియక వేరుగ నొంటిగఁ బండుకొనెను.

—• హనుమంతుఁడు మందోదరిని జూచుట. •—

శా. రాణ న్మించిన మంచిముత్తియపు హా•రాల్ దూల వక్షస్థలిన్
 మాణిక్యప్రకరప్రభాపటలశుం•భన్మండనోద్దీప్త నై
 రాణింపన్ శయనంబునం గనియె ని•ద్రాసక్త స్వర్ణాంగి మ
 త్తైణీలోచనఁ జారురూపిణిని శు•ద్ధాంతేశ మందోదరిన్. ౩౨౨

అర్థములు. తూలన్ = వ్రేలాడఁగా, మాణిక్యప్రకర = మాణిక్య సమూహములయొక్క, ప్రభాపటల = కాంతి సమూహముచే, శుంభత్ = ప్రకాశించు, మండన = అలంకారములచే, ఉద్దీప్త మై =మిగుల వెలుఁగునదియై, నిద్రాసక్తన్ = నిద్రించువానిని, స్వర్ణాంగిన్ = బంగారువలెఁ బచ్చనైన దేహము గలదానిని, మత్త+ఏణీలోచనన్ = మదించిన యాఁడుజింక కన్నులవంటి కన్నులు గలదానిని, చారురూపిణిని = మనోహరమైన సౌందర్యముగలదానిని, శుద్ధాంతేశ = అంతఃపుర ప్రభ్విని - పట్టపురాణిని, మందోదరిన్ = మందోదరి యను పేరు గలదానిని, మందో

దరి=పలుచని కడుపుగలది, మండోదరి యనియు రూపము గలదు. అప్పుడు మీఁగడ వంటి కడుపుగల దని యర్థము. చూ. ౧౩౧౭ పద్యము.

తా త్ప ర్య ము.

మంచి ముత్తియముల హారములు తోమ్మున వ్రేలాడఁగా మాణిక్యముల కాంతులచేఁ బ్రకాశించు నలంకారములచే మిగుల వెలుఁగునదియై నిద్రించుదానిని, బంగారువలెఁ బచ్చనైన దేహము గలదానిని, మదించిన యాఁడుజింకకన్నులవంటి కన్నులు గలదానిని, మనోహరమైన సౌందర్యము గలదానిని, పట్టపురాణి యగు మండోదరిని పడుక యందు దోప్పచుండఁ జూచెను.

ఉ. హత్తిన మేలిరూపమును • యౌవనసంపదఁ జూచి కంటి నే
నత్తరళాక్షి సీత నని • హర్షమునన్ భుజ మప్పళించు, ము
ద్దొత్తును దోఁక, నాఁడు, ముద • మొందును, గంబము లెక్కు, దూఁకు, గిం
చిత్తుగఁ బాడు, నైజ మగుచేష్టలు సేయుచు వానరుం డటన్. ౩౨౩

అర్థములు. హత్తిన = పొందిన, మేలి రూపమును=గొప్ప సౌందర్యమును, అప్పళించున్ = తట్టుకొనును, ముద్దు+ఒత్తును = ముద్దు పెట్టుకొనును, కించిత్తుగ = కొంచెముగ, 'కించిత్తు వల్లి గఱచిన' యని సుమతి శతకము, నైజము=సహజము.

తా త్ప ర్య ము.

ఆమెయొక్క గొప్ప సౌందర్యమును, ప్రాయమును జూచి, చూచితిఁ జూచితి సీత నని సంతోషాతిశయముచే భుజములు తట్టుకొనును. తోఁకముద్దు పెట్టుకొనును. గంతులు వేయును. సంతోషించుచు స్తంభము లెక్కి దూఁకును. మెల్లగఁ బాడును. (హనుమంతుఁడు సంగీతవిద్వాంసుఁడు) కోఁతులకు స్వభావమైన చేష్టలు చేయును.

వాస్తవపు సీతాదేవిని జూచినపు డీ చేష్టలను జేయలేదు. ఏల? తన కష్ట మంతయు ఫలించెగదా యన్న సంతోష మంతయుఁ బొంగి పొరలిపోయెను.

—• ౧౧-వ సర్గము. హనుమ సీతాదేవిని పానశాలయందు మరల వెదకుట. •—

ఉ. కాంచితిఁగా రఘూత్తముని • కామిని నంచును స్వస్థచిత్తుఁడై
యించుక యుండి యా హనుమ • యెట్లగు నీ సతి సీత? సీత ని
ద్రించునొ? యారగించునొ? ము • దించునొ? సొమ్ములు మేనఁ దాల్పఁ గాం
క్షించునొ? పాన మామెకు రు • చించునొ? రాముని బాసి యుండుటన్. ౩౨౪

అర్థములు. స్వస్థచిత్తుఁడై = కుదుటఁబడిన మనస్సుగలవాఁడై, ఇంచుక = కొంచెము, ముదించునో = సంతోషించునా?

తా త్ప ర్య ము.

అబ్బా! యిప్పటికి చూచితిని శ్రీరామచంద్రమూర్తి భార్యను అని కొంచెము సేపు మనస్సు కుదురుగా నుంచుకొని యీమె సీత యగునా యని వితర్కించి సీత యైనయెడల నామె పతివ్రతగదా! భర్తను విడిచియుండు సమయంబున నామె

నిద్దురపోవునా? ఆహారము తీసికొనునా? సంతోషించునా? దేహమున సొమ్ములు ధరించునా? పానము, తుదకు మంచినీ ళ్ళయినను ఆమెకు రుచించునా? ఇవన్నియు నీమె యొద్ద నున్నవి కావున నీమె సీత యెట్లగును? కాదు.

క. రాముని దక్కఁగ నా సు, త్రాముని నేఁ భూమికన్య • తగఁ గనుఁగొనునే?
రామునితోఁ దుల్యుఁడు స్వ, ర్ధాములనేన్ లేఁడు నిశ్చి•తం బిది యనుచున్. ౩౨౫

అర్థములు. సుత్రామునినేన్ = ఇంద్రునైనను, స్వర్ధాములనేన్ = దేవతల యందైన.

తాత్పర్యము.

సీతాదేవి రామచంద్రమూర్తిని దప్ప నింద్రుని నైనఁ గన్నెత్తియైనఁ జూచునా? చూడఁ జాలదు. ఏల? ఆమె పతివ్రత. ఎట్టి నికృష్టుఁడైనను ఆ పతియే దైవ మని పరు లెట్టివారైనను దన పతికంటె నికృష్టు లని యుండునది కదా పతివ్రత. అట్టు లుండ రామచంద్రమూర్తితో సమానుఁడు దేవతలందైన లేఁడే. ఇఁక నీ రాత్రు లని మాట చెప్పనేల. ఉత్తమోత్తమ వస్తువు లభించిన వారధమవస్తువు నాశింతురా? కావున నీమె సీత గాదు. ఇది నిశ్చయము, అనుచు,

సీ. ఆవల నరిగి పా•నాలయంబునయందు, వెదకంగఁ దొడఁగె నా•వీరవర్యుఁ
డాటలఁ బాటలఁ • నలసినవారిని, మధుపానమున మేను • మఱచువారి
మర్దలమురజముల్ • మఱి కీఁకి కౌఁగిలి, తలదిండ్లు గాఁగను • దనరువారి
నుచితాస్తరణాళి • నత్తమిల్లినవారి, వాలుఁగంటులఁ గాంచి • వానరేంద్రుఁ
తే. డమలమణిహేమకాలంకృ•తాంగు లైన, రూపసల్లాపశీలతా•రూఢ లైన
కాలదేశాభియుక్త లౌ•కాంత లెల్ల, బలియఁగ రతాభిరతసుప్త•వాసవారి. ౩౨౬

అర్థములు. పానాలయంబు = మద్యపానము చేయు నిల్లు, మర్దలమురజముల్ = మద్దెల మృదంగములు, ఆస్తరణాళి = నేలఁ బఱచిన కంబళ్ళు మొదలయినవి, అత్తమిల్లినవారిని = పండుకొనిన వారిని, రూపసల్లాపశీలతా రూఢలు = సౌందర్య విషయమైన ముచ్చటలు చెప్పు స్వభావమందుఁ దేఱినవారు, కాలదేశాభియుక్తలు = యుక్తమైన దేశకాలముల నెఱిఁగినవారు, రతాభిరతసుప్తన్ = సురతమున నిష్టముగలవానిని, నిద్రించిన వానిని, విశేషణోభయపదము. రతశబ్దము బాహ్యసురతమును, అభిరతశబ్దము కరణ బంధాదులను సూచించునని కొందఱు. రతాభిరతసుప్త = స్నాతానులిప్తశబ్దమునందువలె రతాభిరతశ్చ అసౌ సంసుప్తశ్చ యని సమాసము గ్రహింపనగు. 'బాహ్య మాభ్యంతరం చేతి ద్వివిధం రతముచ్యతే తత్రాద్యం చుంబనాశ్లేష నఖదంతక్షతాదికం, ద్వితీయం సురతం సాక్షాన్నానా కరణ కల్పితమ్. ఆదౌ రతం బాహ్య మిహ ప్రయోజ్యం తత్రాపి చాలింగన మేవ పూర్వమ్॥ రతి రహస్యే. బాహ్య మనియు అభ్యంతరమనియు రతి రెండు విధములు. ముద్దు పెట్టుకొనుట, కౌఁగిలించుట, నఖక్షత, దంతక్షతములు లోనైనవి బాహ్యమనఁ

బడును. నానాబంధకల్పిత సాత్త్వికోత్సురతము అభ్యంతర మనఁబడును, బాహ్యముతో నందు నాలింగనముతో రతి నారంభింపవలయును. ఇం దీ రెండు తెగలవారు చెప్పఁబడిరి. వాసవారిన్=ఇంద్రద్వేషిని - పై పద్యముతో నన్వయము.

తా త్ప ర్య ము.

మందోదరిని దాఁటి యావలఁ బోయి మద్యము త్రాగు నింటియందు హనుమంతుఁడు వెదక నారంభించెను. ఆట లాడి పాటలు పాడి, యలసినవారిని, మద్యము త్రావి దేహములు మఱచినవారిని, మర్దెలలు, మృదంగములు, పీటలు, తలదిండ్లుగాఁ గలవారిని కంబళ్ళు, తివాచీలు పఱచుకొని పండుకొనినవారిని, స్త్రీలను జూచి నిర్మలమైన రత్నాభరణములచే నలంకరింపఁబడినవారై, సౌందర్యలక్షణ ముపన్యసించు స్వభావము గలవారై, దేశకాలముల యుచిత జ్ఞానము గలవారైన స్త్రీలు చుట్టుకొన బాహ్యాభ్యంతర రతుల నలసి నిద్రించు రావణుని,

ఉ. ఆవులమందలో వృషము•నట్టులు కావలలోఁ గ రేణుపూ
గావృత మైన దంతిగతి • నబ్జముఖపరివారకీర్ణునిన్
రావణుఁ గాంచి దాఁటి చని • రమ్యసమ స్త సువస్తుపూరితం
బౌ వరపానభూమి, గది•యం జని యందు సమీరసూతియున్. ౩౭

అర్థములు. వృషము = ఎద్దు, క రేణుపూగావృతము=ఆడేనుఁగల సమూహముచేఁ జుట్టఁబడినది, దంతి = ఏనుఁగు, అబ్జముఖ పరివారకీర్ణునిన్ = స్త్రీ పరివారముతోఁ గూడియుండువానిని.

తా త్ప ర్య ము.

ఆవుల మందలో నెద్దువలె, ఆఁడేనుఁగుల గుంపులో నేనుఁగువలె స్త్రీ పరివారములో నుండువానిని రావణుఁ గాంచి దాఁటిపోయి, మనోహరమైన సమస్త వస్తువులచే నిండిన మద్యపాన గృహప్రదేశము చేరఁబోయి యందు హనుమంతుఁడు.

సీ. మహిషసూకరమృగ•మాంసంబు లచ్చట, నచ్చటఁ ద్రోవులై • హెచ్చి యుండ
మీఁగడ పెరుఁగున • మేలిమి సౌవర్చ,లమునఁ దీరిచిన కో•ళ్ళయు నెమిళ్ళ
కిరుల ఖడ్గంబుల • వరశల్యముల లేళ్ళ, క్రకరచకోరసం•ఘము నెఱచుల
సామిభక్షితకల•శంబుల బహువిధ, పక్వలేహ్యసుభోజ్య•పటలములను

తే. నుప్పు పులుసుల వండుట • నొప్పు మీఁఱు.రాగషాడబములను దో•రంగ నైవఁ
బడినసరగలు నందెలుఁ దోడపు లెల్లఁ బానభాజననిక్షి ప్త•ఫలచయముల. ౩౮

అర్థములు. సౌవర్చలము=సౌవర్చ మను పేరుగల లవణము, శల్యము=ఏదుపంది, క్రకరము=కక్కెర, ఎఱచులన్ = మాంసములను, సామిభక్షిత = సగముతినఁబడిన, రాగషాడ్బములన్; రాగ=తెల్లయావాలు, 'రాగసిద్ధార్థకో జ్ఞేయః' అని పాకశాస్త్రము. షాడబము=మద్రసములుగల యట్లు చేయఁబడిన భక్ష్యము. (౨) రాగ=పలుచగా నున్న మధురరసము - షాడబము = చిక్కఁగా నున్న మధురాదిరసము.

చక్కెర లేని ద్రాక్ష దానిమ్మ - వీని రస మని భావము. సితా మధ్వాదిమధురో ద్రాక్షా దాడిమయో రసః। విరళశ్చేత్ కృతో రాగః సాంద్రశ్చేత్ షాడబ స్స్మృతః॥ పానకం ద్రాక్షమాధూకం ఖార్జూరం తార మైక్షవం। మధూత్థం శీధుమాధ్వీకం మైరేయంనారికేళజమ్। అర్ణవము. అను వాక్యము ప్రమాణము. తోరంగన్=దోరలు వట్లు, పసగలు = హారములు, తొడవులు = ఆభరణములు, పానభాజన = పాన పాత్రములందు, నిక్షిప్త = ఉంచఁబడిన.

తాత్పర్యము.

దున్నపోతులు - పందులు - జింకల మాంసము లందందుఁ గుప్పలు కుప్పలు గాఁ బడియుండెను. మీఁగడ పెరుఁగులో సౌవర్చలవణము కలిపి సిద్ధము చేసిన కోళ్ళ - నెమిళ్ళ - పందుల - ఖడ్గముల - ఏదుల - లేళ్ళ - కక్కెరల - చకోరముల మాంసములను సగము భక్షింపఁబడిన పాత్రములందు నానావిధములుగఁ బాకము చేసిన లేహ్యములను, భోజ్యములను ఉప్పు పులుసువేసి వండిన రాగషాడబములను తొరలిపడిన హారములను, నందెలను అన్నివిధముల యాభరణములను, పానపాత్రలం దుంచఁబడిన ఫలములను హనుమంతుఁడు చూచెను.

తే. అచ్చు టచ్చట నునిచిన • హరువుమీఱు
నవ్య కనకమణీశయ్య•నముల నాస
నములకాంతులఁ బావగే•హము కృశాను
రహిత మయ్యుఁ బ్రదీప్త మా • రమణఁ దోఁచె. ౩౨౯

అర్థములు. కృశాను రహితమయ్యున్ = అగ్నిహోత్రము లేకున్నను ప్రదీప్తము = మండుచున్న, రమణ = విధము.

తాత్పర్యము.

అక్కడక్కడ నుంచిన యందముచే నతిశయించు క్రొత్తబంగారు రత్నములచే చేయఁబడిన శయ్యలయు నాసనములయుఁ గాంతులచే నా గృహము నిప్పులేకున్నను గాలు చున్నట్లు లుండెను.

క. వెరవరులగు నడబాలలు, సరసంబుగఁ దీర్చు నామి•షంబులు సుమశ
ర్కరలను మధుఫలములచే, సురుచిరముగఁ దీర్చినట్టి • సురలం గాంచెన్. ౩౩౦

అర్థములు. వెరవరులు = వెరవు + అరి=ఉపాయశాలులు, అడబాలలు = వంటవాండ్రు, ఆమిషంబులు = మాంసములు, సుమశర్కరలను = పూలరసము చేతను చక్కెరచేతను, మధుఫలములచేన్ = ద్రాక్ష మొదలగు తీయని పండ్లచే, సురలన్ = సారాయములను.

తాత్పర్యము.

పాకము చేయు నుపాయము తెలిసిన వంటవాండ్రు రుచిపుట్టునట్లు వండిన

మాంసంబులను పూలచేతను చక్కెరచేతను ద్రాక్ష ఇప్పపూవు లోనగు తియ్యని ఫలములచేతను ఇంపుగ సిద్ధముచేసిన సారాయములను జూచెను.

క. బుక్కాములు పలు తెగ లగు, స్రక్కులు బంగారు వెండి • స్ఫటికంబులఁ జెం
పెక్కిన కలశంబులు రుచి, పెక్కవ పానీయములఁ గ•పిప్రభువు గనెన్. ౩౩౧

అర్థములు. బుక్కాములు=గందవొడులు, స్రక్కులు=హారములు.

తా త్ప ర్య ము.

గందవొడులు నానావిధములైన హారములు బంగారు వెండి స్ఫటికంబులఁ జేసిన పాత్రములు విశేషము రుచి గల పానీయములను హనుమంతుఁడు చూచెను.

క. అఱ్ఱావిన నెఱ ద్రావిన, కొఱగానని కమ్మరసముఃగూడినపాత్రల్
నెఱమెక్కిన యఱ చిక్కిన, కొఱ దక్కని భక్ష్యములయుఁ•గుప్పలు గాంచెన్.

అర్థములు. నెఱద్రావిన = పూర్ణముగఁ ద్రావిన, కొఱగానని = కొఱఁత లేక నిండియున్న, కమ్మరసము = సారాయము, నెఱ=పూర్ణముగ, మెక్కిన=తినిన అఱచిక్కిన=సగము మిగిలిన, కొఱదక్కని=కొదువలేక నిండియున్న.

తా త్ప ర్య ము.

కొన్నిపాత్రము లందలి సారాయము సగము త్రావఁబడియుండెను. కొన్నిఁటి యందుఁ బూర్ణముగఁ ద్రావఁబడి యుండెను. కొన్నిటియందు నేమియుఁ ద్రావఁ బడక నిండియుండెను. భక్ష్యములు కొన్ని సగము దినఁబడినవి, పూర్ణముగఁ దినఁ బడినవి, ఏమియుఁ దినఁబడనివి కుప్పలు కుప్పలుగాఁ బడియుండెను. ఇవియన్నియు హనుమ చూచెను.

మనోరంజని. పగిలిన గిన్నెలు దొరలెడి కుండలుఁ•బొఱలు జలంబులు దండలుఁ బల్
తెగ లగు పండులు బిగి గల కౌఁగిటఁ•దేల్చుచు నొండొరు నిద్దుర మై
వగ గల కన్నెలచెలు వగుచిన్నెలు • వారక వేళ్లొక తొయ్యలిచీ
ర గరిత యొక్కతె నిదురను లాగి యు•రంబునఁ గప్పికొనం గనియెన్.

తా త్ప ర్య ము.

పగిలిన గిన్నెలు, దొరలుచున్న కుండలు, నేలఁబొఱలుచున్న నీళ్ళు, దండలు, నానావిధములయిన పండ్లు నిద్దురచే గట్టిగా నొకరి నొకరు గౌఁగిలించుచున్న సుంద రుల చిన్నెలు, నొకదాని చీర తీసికొని వేఱొకతె యీడ్చుకొని తొమ్ములపైఁ గప్పు కొనుటలు హనుమంతుఁడు చూచెను.

మనోరంజని: నజనలు నైదు సగణంబులు, పదేనింట యతి.

క. సుందరుల మేనివలువలు, నందపుసరములును నూర్పు•టనిలమున దర
స్పందము లయి మందానిల,కందళముల సుఖముఁ జెందు క్రైవడి నమ్మెన్. ౩౩౪

అర్థములు. దరస్పందములు = కొంచెముగాఁ గదలినవి, మందానిల కందళ ములన్ = మందమారుతముయొక్క మొలకలు అనఁగా మెల్లఁగా వీచుపిల్లగాలులు.

తా త్ప ర్య ము.

అందగత్తెలు దేహముల ధరించిన చీరలు సొగసైన దండలు వారి వారి యూర్పుగాలిచేఁ గొంచెముగాఁ గదలుచు మెల్లని పిల్లగాలులచే సుఖించు విధముగ నుండెను.

ఉ. కమ్మని చందనంబు కసు•గందని పూలసరాలు శీధుపా
నమ్ములు స్నానలేపములు • నవ్యసుధూపము లీనుచున్న ఘం
ఘమ్మను కమ్మఁదావు లెస•కంబునఁ గైకొని తన్మహావిమా
నమ్మున నించె సౌరభము • నవ్యముగాఁగ మరుత్కిశోరముల్. ౩౩౫

అర్థములు. కసుగందని = వాడిపోని, శీధుపానమ్ములు = సారాయము త్రాగుటలు, 'శీధు రిక్షురసైః పక్వై రపక్వై రాసవో భవేత్, మైరేయం ధాతకీ పుష్ప గుడధాన్యాంబు సంహితమ్.' చెఱకు పాలతోఁ గాచిన సారాయము శీధు వనియు, కాఁచక సిద్ధము చేసినది ఆసవమనియు, ఆరెపూలు బెల్లము ధాన్యము (ధనియాలు) నీళ్ళు కలిపి కాఁచినది మైరేయ మనియుఁ బేరు. స్నానలేపములు=స్నానము చేయునపుడు రుద్దుకొను నలుగుపిండులు, ఎసకంబుగన్ = విస్తారముగ, సౌరభము = పరిమళము, మరుత్కిశోరముల్=గాలిపిల్లలు.

తా త్ప ర్య ము.

మంచి వాసనగందము, వాడని పూలదండలు, సారాయి రసములు, సున్నిపిండి మొదలగు నలుగు పిండులు, క్రొత్త మంచి ధూపములు - వీనివలనఁ గలుగు మంచి వాసనలను విస్తారముగఁ గొని పిల్లగాలు లా విమానమ్మును మంచి సువాసనలతో నించు చుండెను.

క. నల్లని తెల్లని పచ్చని, మొల్లం బగు వన్నెలొప్పు • మోహానవతు లం
దెల్లెడఁ గూర్చియుఁ గూర్కిన, హల్లకలత లట్టు లొప్పి • రంగజుగాసిన్. ౩౩౬

అర్థములు. నల్లని తెల్లని పచ్చని మోహానవతు లనుటచే నానాదేశ స్త్రీలు చెప్పఁబడిరి. హల్లకలతలు=తామరతీఁగలు.

తా త్ప ర్య ము.

నల్లని - తెల్లని - పచ్చని వర్ణముగల స్త్రీ లందందుఁ గామకేళియం దలసినవారై నిద్రించు తామరతీఁగలవలెఁ బడి నిద్రపోవుచుండిరి.

—• పరాంగనాదర్శనంబునకు హనుమంతుఁడు చింతించుట. •—

క. అంతయు దశకంధరు నే, కాంతగృహం బిటులు కడిగి • గాలించియు భూ
కాంతాత్మజ యడపొడ గన, కెంతయుఁ జింతించె వాన• రేశ్వరుఁ డాత్మన్. ౩౩౭

అర్థములు. ఏకాంతగృహము = అంతఃపురము, కడిగి గాలించి = చక్కఁగాఁ బరిశోధించి, అడపొడ = ఆకారముజాడ.

తా త్ప ర్య ము.

రావణాసురుని యంతఃపురమంతయు నిటుల చక్కఁగా శోధించి సీతాదేవి రూపముగాని యామె యుండు స్థలము జాడగాని తెలియక హనుమంతుఁడు మిగుల జింతించెను.

ఉ. అచ్చట నిద్దురించు కమ•లాక్షుల నెల్లరఁ జూచి యయ్యయో
వచ్చెను ధర్మహాని పర•వారిజలోచన లందు నాదుచూ
పెచ్చట నేని వర్తిలద • యిచ్చటిమేడలఁ గూర్కు కాంతలన్
జొచ్చెము మీఱఁ జూచితిని • బోవఁగఁ ద్రోచితి ధర్మమార్గమున్. ౩౩౮

తా త్ప ర్య ము.

అక్కడ నిదురించుచున్న స్త్రీలను పైటలు దొలఁగిన వారిని చీరలు దొలఁగిన వారిని తక్కిన వారి నందఱను జూచి యయ్యో నే నెంతటిధర్మ విరుద్ధమైన కార్యము చేసితిని. పరస్త్రీలయందు నాదృష్టి పాఱునదిగాదు. అటులుండ నిప్పుడు మేడ లందు నొడ లెఱుఁగక నిద్రించు స్త్రీలను గపటవిధముగఁ జూచితిని. నిద్రించు స్త్రీలనందుఁ బరస్త్రీలను అందు దేహము తెలియక చీరలు తొలఁగిపడి యుండు స్త్రీలను జూడరా దను ధర్మమునకు హాని కలిగించితిని. 'నేక్షేతార్కం న నగ్నాం స్త్రీమ్'.

క. పరదారల నెయ్యెడనే, నరసి కనుట ఘోరపాప • మందును నిద్రా
పరవశలై యొడ లెఱుఁగని, పరసతులంగంటి నెంత•పాపం బకటా. ౩౩౯

అర్థములు. దారలను=భార్యలను.

తా త్ప ర్య ము.

మేలుకొని తిరుగు చున్నప్పుడే పరుల భార్యలను మోఁకాటికి మీఁదఁ బాలించి చూడరాదు. అది మహా పాపకార్యము. అటు లుండ నిద్రచేఁ బరవశలై దేహము లెఱుఁగక యుండు పరస్త్రీలను జూచితిని. అయ్యో! యెంత పాపము చేసితిని.

తే. అనుచుఁ దలపోయు చున్న మ•హాత్మునకు, నిశ్చితైకాంతమతికి ని•ర్నిద్రగతికిఁ
గార్యనిశ్చయదర్శన•క్షమము నైన,బుద్ధి జనియించెఁ గ్రమ్మఱఁ•బూతగతిని. ౩౪౦

అర్థములు. మహాత్మునకు = గొప్ప మనస్సు గలవానికి, జితేంద్రియునకు, నిశ్చిత + ఏకాంత + మతికిన్ = నిశ్చయించు టే స్వభావము గాఁగల మనస్సుగల వానికి, 'వ్యవసాయాత్మికా బుద్ధి రేకేహ కురునందన' యన్నట్లు - ఏకాంతము=ఏక + అంతము = ఒకటే అంతము గాఁగలది. అనఁగా నిటునటు చలింపని, మతికిన్ = మనస్సుగలవానికి. సీతాదేవిని జూచుటయందే మన స్సంతయు నిశ్చయమై యుండుటచే నెవతెను జూచినను 'ఈమె సీతయా, ఆమె సీతయా' యని సీతాదేవియందు దృష్టి, సీతాదేవి స్మరణము తప్ప వేఱు భావము వేఱు దృష్టి లేనివాఁ డని భావము. ఆ కారణము చేతనే, నిర్నిద్రగతికి = హెచ్చరికతోఁ గూడిన గమనము గలవానికి, అనఁగాఁ బ్రతిస్త్రీయొద్దకుఁ బోయి యవయవ పరీక్ష చేయ లేదు. అవును గాదని నిశ్చ

యించుకొనుటకు నెంతకావలయునో యెంతవఱకుఁ బోవచ్చునో యంతమాత్రమే పోవుచుండెను. కార్యనిశ్చయ దర్శన క్షమము=చేయవలసిన కార్యము నిశ్చయించి తీర్మానింప సామర్థ్యము గలది. ఈ సందేహముచేఁ బని చాలించిన యెడలఁ దాను బూనిన కార్యము చెడిపోవును. అట్లు కార్యము చెడిపోకుండఁ జేయు బుద్ధి- పూత గతిని = పవిత్రమైన విధముగ.

తా త్ప ర్య ము.

అని యాలోచించు గొప్పమనస్సుగలట్టియు, నిశ్చయింపఁబడిన యేకాంతమైన మనస్సుగలట్టియు, హనుమంతునకుఁ బవిత్రమైన మార్గమున నిది చేయఁదగినది, యిది చేయరానిది యని నిశ్చయించి తీర్మానింప సామర్థ్యము గల బుద్ధి మరలఁ గలిగెను. చేసిన పని తప్పొ యొప్పొ యని మనస్సు సందేహించును. దానిని నిర్మలబుద్ధి యించుచున్నది.

ఉ. కాంచితి రావణాసురుని • కాంతల నెల్లర నైన నేమి నా
కించుక నైన బుద్ధి చలి • యింపద; యింద్రియవర్తనంబు సా
గించుఁ గదా మనంబు గడుఁ • గీడున కేనియు మేలు సేతకే
నెంచఁగ నట్టి నా మన మొ • కింతయుఁ గ్రాలదు సాభిలాష మై. ౩౪౧

తా త్ప ర్య ము.

రావణాసురుని స్త్రీల నందఱను జూచితిని. చూచుటచే వచ్చిన హాని యేమి? నా బుద్ధి కొంచెమైనఁ జలించినది కాదు. పాపకార్యమందో పుణ్యకార్యమందో యింద్రియ వ్యాపారము జరుపునది మనస్సు. చూచినంత మాత్రమున విసినంత మాత్రమునఁ బుణ్యముగాని, పాపముగాని రాదు. మనసు పాపాభిలాషగలదయ్యెనేని ప్రత్యక్షముగఁ జూచినను జూడకున్నను బాపము వచ్చును. పుణ్యాభిలాష గల దయ్యెనేని పుణ్యము వచ్చును. ఏ యభిలాష లేకున్నవారి కేదియు రాదు. 'మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయో' యని కలదు గదా. కావున మనోవ్యాపారము ప్రధానము, గాని యింద్రియవ్యాపారము మాత్రము ప్రధానము గాదు. అట్టి నామనస్సు నందు నభిలాష యనునది లేదు. నేను వీరిని గామాసక్తిని జూడను లేదు. చూచిన కారణముచేఁ గామ ముదయింపను లేదు. ఇఁక నాకేమి భయము.

ఉ. ఇయ్యెడఁ గాక యిం కెచట • నే వెదకం దగు భూమికన్యకన్ ?
దొయ్యలులందుఁ గా కెచటఁ • దొయ్యలి యుండఁగ నేర్చుఁ జూడఁగా ?
నెయ్యది జాతి దేని కది • యేర్పడ నందులఁ గాదె గోయ నా ;
నెయ్యెడ నష్టకాంత నగు • నే నెమకం జని జింకమందలన్. ౩౪౨

తా త్ప ర్య ము.

ఈ విచార మేల. ఇది విడిచి మఱియొకచోట వెదుకవలయుందునా? ఆఁడుది యాఁడువారి యం దుండక మఱి యెందుండఁ గలదు? ఏ జాతి వస్తువును ఆ జాతిలో

వెదకవలయును గాని వేఱొక జాతిలో వెదకిన లాభ మేమి! పోయిన యావును నాలమందలోఁగాక మఱి యే పశువుల మందలో వెదకిన దొరకును. అట్టిదే కాన రాని స్త్రీ స్త్రీల గుంపులోఁ గాక యింకమందలో వెదకవచ్చునా! కావునఁ గర్తవ్య మును జేయవలయును, మానరాదు. నిష్కాముఁడనై చేయవలయును. అది యకార్య మైనను బాపము రాదు. శ్రీకృష్ణభగవానుఁడు అర్జునున కుపదేశించిన దాని సారాంశ మిదియే. అకార్యమో సుకార్యమో చేయువలసివచ్చినప్పుడు చేయవలయును. నిష్కా ముఁడై చేయవలయునుగాని కర్మము స్వరూపత్యాగము చేసెద ననరాదు. పరస్త్రీ దర్శనము పాప మను సామాన్యశాస్త్రవిధి ననుసరించి హనుమంతుఁడు సీతాన్వేషణ కార్యము చాలించియుండిన నేది యెట్లయి యుండునో యూహింపవచ్చును. కావునఁ గామము త్యాజ్యము గాని కర్మము త్యాజ్యము గాదు.

క. శుద్ధం బగు మనమున నే, శుద్ధాంతం బెల్ల వెదకి • చూచితి నధిక
శ్రద్ధను నెచ్చటఁ గానను, నద్ధారిణీతనయ ననుచు • నాతఁడు మఱియున్. ౩౪౩

అర్థములు. అద్ధారిణీ తనయ – అద్ధారిణీ, ఇబ్బంగి యని రూపము రాదు. రావలయు నని కొందఱు సందేహించిరి గాని యీ విషయము తొలుత సులభవ్యాకర ణము పరిష్కరించెను. తరువాతఁ బండితులు దానినే తమ వ్యాఖ్యానాదుల నామోదించిరి. చూ. సు. వ్యా. సమాస. ౩౭. సూ.

తాత్పర్యము.

నేను నిష్కల్మషమైన మనస్సుతో నంతఃపురమంతయు మిగుల శ్రద్ధతో వెదకి తిని. సీతాదేవి యెచ్చటను గానరాలేదు, అనుకొని మఱియు హనుమంతుఁడు,

తే. నాగకన్యల యందును • నాకకన్య,లందు గంధర్వకన్యల • యందు వెదకెఁ
గాని కానక సీతఁ ద • త్పానశాల,విడిచి యంతఃపురంబున • వెదకె మరల. ౩౪౪

తాత్పర్యము.

నాగకన్యక లందును, దేవతాస్త్రీలయందును, గంధర్వ స్త్రీల యందును మరల వెదకెఁ గాని సీత గానరాలేదు. కావున నా పానశాల విడిచి మరల నంతఃపురంబున వెదకెను.

—• ౧౨-వ సర్గము. హనుమంతుఁడు సీతాదేవిని గానక విచారపడుట. •—

క. ఆ యంతిపురము నడుమ ల, తాయతనంబుల విచిత్ర • తాయతనములన్
వాయుతనూజుఁడు వెదకియు, మాయురె! కనఁ డయ్యె రాము • మహిళామణినిన్.

అర్థములు. లతాయతనంబులన్ = తీఁగల యిండ్లయందును, విచిత్రతాయతన ములన్ = చిత్రముల నలంకరింపఁబడిన యిండ్లయందును, మాయురే = ఆశ్చర్యార్థ కము.

తాత్పర్యము.

ఆ యంతఃపురము నడుమ తీఁగలచే నేర్పఱుపఁబడిన యిండ్లయందును, చిత్ర

ములచే నలంకరింపఁబడిన యిండ్లయందును నెంత వెదకినను ఓరా! సీతాదేవి కాన రా లేదు.

క. ప్రాంతమునం దీ విధమున, జింతించెను రాముదేవి • సీతను గన నే
నెంతయు వెదకితిఁ దత్సతి, యంతముగనెఁ గాక యున్న • నగపడ కున్నే? ౩౮౬

తా త్ప ర్య ము.

అప్పుడు హనుమ తన మనస్సున నిట్లు లాలోచించెను. శ్రీరామచంద్రమూర్తి భార్యను సీతాదేవిని జూడవలయు నని నేనెంతో వెదకితిని. కానరా లేదు. ఆమె మరణించెనేమో, అటుగాకున్నఁ గానరాక యుండునా?

క. కా కున్న రాక్షసేంద్రుం, డాకట! నిజశీలరక్ష•ణాసక్తను స
ల్లోకనుత సుగుణ, సీతఁ జి,రాకున వధియించె నేమొ • క్రౌర్యరతుండై. ౩౮౭

అర్థములు. నిజశీల రక్షణాసక్తను = తన పాతివ్రత్యమును రక్షించుకొనఁ గోరు దానిని, చిరాకునన్=కోపముచే.

తా త్ప ర్య ము.

ఆమె తానై యాత్మహత్య చేసికొని యుండునా? ఉండదు. అటుకాని యెడల నయ్యో! తన పాతివ్రత్యమును రక్షించుకొనుట యం దాసక్తి గలదియు, ఆ కారణముచే సత్పురుషులచే స్తోత్రము చేయఁబడు సుగుణములను గలదియును, నగు సీతను తన కోర్కె నెఱవేర్ప లే దను కారణముచేఁ గ్రూరుఁడై రావణుడు చంపెనేమో!

చ. కనుఁగొన ఘోర మా వికృత•కాయములం బెనపెద్ద మోములన్
ఘనములు దీర్ఘముల్ గనుచి•కారము లై భయపెట్టు కన్నులన్
దనరిన రాక్షసాంగనల • దైన్యమునం గని బెగ్గడిల్లి యా
జనకతనూజ దేహమును • జయ్యన వీడెనొ యేమి చేయుదున్. ౩౮౮

తా త్ప ర్య ము.

కామాసక్తుఁడై తెచ్చినవాఁడు తన కామమును నయభయములఁ నెట్టులైన దృప్తిపడఁ జేసికొనఁ గోరునుగాని, హింసించిన నేమిలాభము పొందఁగలఁడు. కావున వాఁడు హింసించి యుండఁడు. భయంకరములై, వికారములైన దేహములును, పెద్ద పెద్దముఖములును, పెద్దవియు దీర్ఘములు నైన కన్నులును గల రాక్షసస్త్రీలఁ జూచి భయపడి సీతాదేవి ప్రాణములు వదలిపెట్టెనేమో. నే నేమి యిప్పుడు చేయుదును?

ఉ. సీతను జూడ లేక మును • చెప్పిన బీరము లెల్లఁ దీర్ప కే
రీతినిఁ గ్రుప్తకాలముఁ బొ•రింబొరి మీఱఁగ భానుపుత్రు మో
మే తగ వెంచి చూచుటకు • నేగుదునో? బలియుం డతండు నా
జ్ఞాఽతిచరిష్ణులం గినిసి • యంతన దండన చేయుచుండు నే. ౩౮౯

అర్థములు. బీరములు = పౌరుష వాక్యములు, అజ్ఞాతి చరిష్ణులన్ = అజ్ఞ మీఱి చరించు వారిని, కినిసి = కోపించి.

తా త్ప ర్య ము.

సీతను జూడలేక మునుపు చెప్పిన పౌరుష వాక్యముల నెల్ల నెఱవేర్పక సుగ్రీవుఁడు పెట్టిన గడువుమీఱి యాయనను జూచుటకు నేమి ధర్మము ననుసరించి పోదును? పోయితినిబో యతఁడు బలవంతుఁడు; తనయాజ్ఞ మీఱి వర్తించిన వారిని దండింపక విడుచునా ?

క. చూచితి నంతిపురంబును, జూచితి దశకంఠు సకల•సుందరులను సీ
తాచపలాక్షీమణి దా, నే చోటను లేదు శ్రమము • వృథ వోయెఁ గదే. ౩౫౦

తా త్ప ర్య ము.

అంతఃపురమును జూచితిని. రావణాసురుని స్త్రీల నందఱఁ జూచితిని. ఎక్కడ సీతాదేవి కాన రాలేదు. నేను జేయవలసిన కృషియంతయుఁ జేసితిని. శ్రమమంతయు వ్యర్థ మయ్యెఁ గదా.

ఉ. ఏమి యొనర్చితో హనుమ ! • యేది ధరాసుత! యన్నఁ గ్రోఁతు లే
నే మని యుత్తరం బిడుదు • నేగి సురారిపురంబుఁ జొచ్చి శ్రీ
రాముని దేవిఁ గాన కిటు • గ్రమ్మఱితిన్ వృథ యంచు నందునా ?
హా ! మరణించు వానరచ•యంబులు నే నిట నాలసించినన్. ౩౫౧

తా త్ప ర్య ము.

వానరుల యెదుట నన్ని పౌరుషములు పలికితిని గదా! ఇప్పుడు నేను మరల పోఁగానే హనుమంతా ! యేమి చేసి వచ్చితివి? సీతను దెచ్చెద నంటివే. ఏదీ సీత యని క్రోఁతులంద అడిగిన నే నేమని ప్రత్యుత్తర మిత్తును. పోయితిని, లంకలో వెదకితిని, కానరాలేదు, పోయినవాఁడను బోయినట్లు మరలి వచ్చితి నందునా? ఎట్లందును ? కావున నేను బోను. ఇందే యుందును. ఇందు నెంతకాల మని యుందును ? నేను ఆలస్యము చేసితినా? హనుమంతుఁడు రావణుచే హతుఁడయ్యెనో మఱి యేమయ్యెనో, కావుననే రాలేదు. మనము బ్రతికి లాభ మేమి? సుగ్రీవుని చేతిలోఁ జచ్చుటకు మాఱు ప్రాయోపవేశమున నిందే మరణింత మని యందఱు నిశ్చయముగఁ జత్తురు.

ఉ. ఆవలియొడ్డు చేరఁ గపు • లందఱు గుంపుగఁ గూడి జానకీ
దేవిని గాన నైతి ననఁ • దెల్పుచు నా జననంబు భంగిఁ దా
వావిరి మెచ్చినట్టి గుణ•వంతుఁడు వృద్ధుఁడు జాంబవంతుఁడున్
శ్రీవిభవుండు నంగదుఁ డి•సీ యనరే ప్లవగాగ్రగణ్యులున్. ౩౫౨

తా త్ప ర్య ము.

కావున నే నిచ్చటఁ దడయ రాదు. మరలి పోవలసినదే పోయితినిబో-అందఱు వానరులు గుంపులై వచ్చి జానకీదేవిని నేను జూడలేను అని చెప్పఁగానే నేను బుట్టిన

విధమూ అప్పుడు నేను చేసిన కార్యము శ్లాఘించి శ్లాఘించి చెప్పిన గుణవంతుఁడు పెద్దవాఁడు నగు జాంబవంతుఁడు అంగదుఁడు ఇంకను వానర ముఖ్యులు ఛీ ఛీ యనరా.

—• హనుమ యుత్సాహంబు వహించి మరల సీతాదేవిని వెదకుట. •—

శా. ఉత్సాహంబె సిరిన్ ఘటించు మఱి యా•యుత్సాహమే సౌఖ్య మా
నుత్సాహంబె సతంబు నెల్ల కెలసం • బొప్పారఁగాఁ దీర్చు నా
యుత్సాహంబునె యాశ్రయించి పనికై • యుంకింతు నింకొక్కమా
టుత్సాహంబుఁ ద్యజింతురే పనికి ను•ద్యోగించు ధీరాత్మకుల్. ౩౫౩

అర్థములు. కెలసము = కార్యము, ఉంకింతున్ = ప్రయత్నింతును. త్యజింతురే = వదలుదురా. ధీరాత్మకుల్ = ధైర్యవంతులు.

తా త్ప ర్య ము.

కావున నే నిందుండను రాదు. వ్యర్థుఁడనై పోనురాదు. ఈ విధముగ నే నధైర్య పడనురాదు. కార్యమెట్టులైన సాధింపవలెను. కార్యసాధనమునం దుత్సాహము ప్రథమ సాధనము. దానిని విడిచి నే నేమి చేయఁగలను. సంపద సంపాదించి యిచ్చునది యుత్సాహమే. ఉత్సాహమే సౌఖ్యము. ఆ యుత్సాహమే సకల కార్యముల నెఱ వేర్చును. కావున నా యుత్సాహము నాశ్రయించి మఱియొకసారి ప్రయత్నించెదను. కార్యము చేయు ధీరు లుత్సాహమును వదలుదురా.

"క్లైబ్యం మా స్మగమః పార్థ, నై తత్త్వ య్యుపపద్యతే
క్షుద్రం హృదయ దౌర్బల్యం, త్యక్త్వోత్తిష్ఠ పరంతప."

అను భగవద్వాక్యము స్మరించునది.

ఉ. చక్కఁగఁ జూతు నెండి యొక•సారి సురారిసురక్షితంబు లౌ
నిక్కవ లెల్లఁ బానగృహ•మేడ్తఱఁ జిత్రగృహాళి తోఁటలున్
జక్కని కేళిశాలలును • సందులు వీథులు నవ్విమానముల్
దక్కక యుండ నొక్కటియుఁ • దత్పరవృత్తి నటంచు నెంచుచున్. ౩౫౪

అర్థములు. ఇక్కవలు=ప్రదేశములు.

తా త్ప ర్య ము.

రావణాసురుఁడు రక్షించు ప్రదేశము లన్నియు మఱియొకసారి చూచెదను. అని పానగృహములు చిత్రగృహములు తోఁటలు కేళిశాలలును సందులు వీథులు విమానములు నన్నియు నొక్కటినైన విడువక నదియే పనిగా వెదకెదను అని యాలోచించుచు;

చం. వెదకుటకుం గడంగెఁ బృథి•వీగృహవర్గము చైత్యగేహముల్
సదనసమీపకేళివన•శాలలు నొండొకచోట నెక్కువే
యుదలల డిగ్గఁ దాఁ బలుమ•ఱుం జనుచోటికె పోవు ద్వారముల్
వదలిచి దల్పులం దెఱచి • వచ్చును బోవును నెక్కు దూఁకెడిన్. ౩౫౫

అర్థములు. పృథివీ గృహవర్గము = భూమిలోనుండు యిండ్ల సమూహము, నేల మాళిగలు, చైత్య గేహములు=నాలుగు వీథులు కలియుచోట నుండు యిండ్లు - సదన సమీప కేళి వనశాలలు = రావణు నింటికి సమీపమున నుండు నాటపట్టులు.

తా త్ప ర్య ము.

వెదుకఁ బ్రారంభించెను. నేలమాళిగలు, నాలుగు వీథులు కలియుచోట నుండు మందిరములు, రావణుని యింటి సమీపమున నుండు నాటపట్టులు - చూడ నారంభించి యొకచోట నెక్కుచుండును, ఒకచోట దిగును, పోయినచోటికే పోవును, వాకిండ్లు గడియలు దీసి తలుపులు దెఱచి వచ్చును, బోవును, నెక్కును, దూఁకును.

తే. కొంచె మైనను విడక శో♦ధించె హనుమ, రావణాసురు నంతిపు♦రంబునందు
నాలుగంగుళముల యేని ♦ గాలికొడుకు, చొచ్చి చూడని దేశ మ♦చ్చోట లేదు.

తా త్ప ర్య ము.

ఈ ప్రకారము వదలక రావణుని యంతఃపుర మంతయు శోధించెను. ఆ యంతఃపురమున హనుమంతుఁడు చొచ్చి చూడని ప్రదేశము నాలు గంగుళముల మాత్రమైనను లేదు.

సీ. ప్రాకారములు నడి♦బాటలు వేదికల్, దిగుడుబావులు సర♦స్తీరములును
వివిధవికారరూ♦పవిశేషలను బోఁకుఁ, జెలువలఁ గనె నందు ♦ సీత లేదు
అసమానసౌందర్య ♦ లసమానవిద్యాధ, రీతతు లందు శ్రీ♦సీత లేదు
పూర్ణచంద్రాస్యలౌ♦భోగినులం దంద, గత్తెలలోన భూ♦కన్య లేదు
తే. పంక్తికంఠుఁడు బలిమిని ♦ బట్టి వట్టి, నాగకన్యలలోన జా♦నకియు లేదు
సుందరుల నటఁ బెక్కురఁ ♦ జూచెగాని,కమలలోచన మైథిలి ♦ గాన రాదు. ౨౪౭

అర్థములు. సరస్+తీరములు = కొలఁకులయొడ్డులు, పోఁకుచెలువలన్ = రాక్షసస్త్రీలను.

తా త్ప ర్య ము.

ప్రాకారములు, ఇండ్లకు నిండ్లకు నడుమ నుండు వీథులు, అరుఁగులు, దిగుడు బావులు, కొలఁకుల యొడ్డులు, నానావిధ వికారవేషములు గల రాక్షసస్త్రీలను జూచెఁగాని యం దెందును సీత లేదు. అసమానమైన చక్కఁదనముచేఁ బ్రకాశించు విద్యాధరస్త్రీలను జూచెఁగాని, వారియందు సీత లేదు. నిండుపున్నమనాఁటి చంద్రుని వంటి ముఖములు గల భోగినీస్త్రీల యం దందగత్తెలలో సీత లేదు. రావణుఁడు బలాత్కారముగాఁ బట్టి తెచ్చిన నాగకన్యక లందు సీతమాత్రమే లేదు. అందు సుందరుల నెందఱినో మహనుమంతుఁడు చూచెఁగాని భూనందన గానరాలేదు. ఇందుఁ జెప్పఁబడినవారు మునుపు చెప్పబడిన రావణున కనుకూల లగు స్త్రీలు గారు. బలాత్కారముగఁ దెచ్చి, వారు వశపడమిని నందఱ వేఱొకచో వేసియుంచె నని యెఱ్పడుచున్నది. రెండవపాదమునఁ జెప్పఁబడినవారు కావలియుండు స్త్రీలు.

ఉ. ఇంతయుఁ జూచి యా హనుమ • యెంతయు దుఃఖవిషాదసంభ్రమ
స్వాంతత నంది కుందుచును • వానరవర్యుల యెత్తికోలు వి
క్రాంతి సముద్రలంఘనము • గాంచి వృథా చనుటల్ మనంబులో
మంతన ముండి డిగ్గెను వి•మానవరంబుఁ దటిజ్జవాఢ్యుఁడై. ౩౫౮

అర్థములు, ఎత్తికోలు = ప్రయత్నము, విక్రాంతి = పరాక్రమముచే; మంతన ముండి = ఆలోచించి.

తాత్పర్యము.

ఈ విధముగ రావణునికి ననుకూలలైన స్త్రీలను, ప్రతికూలలైన స్త్రీలను, అందఱను జూచి సీత గానరామిని మిగుల దుఃఖము, శోకము, సంభ్రమము చెందిన మనస్సు గలవాఁడై వ్యసనపడి వానరశ్రేష్ఠుల ప్రయత్నము, పరాక్రమించి తాను సముద్రమును దాటుట యంతయు వ్యర్థమై పోవుట యాలోచించి మెఱుగు మెఱసి నట్లు శీఘ్రముగ నా విమానము దిగెను.

-• ౧౩-వ సర్గము. హనుమ ప్రాకారంబుఁ జేరి సీతాదేవి గానరామికి వ్యసనపడుట.•-

క. ప్రాకారము మీఁదికి జని, కాకుత్స్థకులాభరణుని•కాంతామణి నా
లోకింపఁగఁ గానక చిం,తాకులితమనస్కుఁ డగుచు • పవనసుతుఁడున్. ౩౫౯

తాత్పర్యము.

ప్రాకారము మీఁదికిఁ బోయి సీతాదేవిని జూడలేక హనుమంతుఁడు చింతచేఁ గలఁత నొందిన మనస్సుగలవాఁ డయ్యెను.

తే. కడిగి గాలించి చూచితిఁ గాని లంక
గుంటలును, జెర్వులును, గొలం•కులును, నదులు
వంకలును, వాఁగులును, మలల్ • డొంక లెల్ల
తలములును దిమ్మఁదిరుగుచు • ఫలము లేదు. ౩౬౦

తాత్పర్యము.

లంకలో నుండు గుంటలు, చెఱువులు, సరస్సులు, నదులు, వంకలు, వాగులు, కొండలు, డొంకలు సమస్తప్రదేశములు దిమ్మఁదిరుగుచుఁ గడిగి గాలించి చూచితిని గాని వ్యర్థ మయ్యెను.

క. కాననుగా వైదేహిని, దానవుని నింటఁ గలదు • ధరణిజ యనుచుం
దా నాడఁడె సంపాతియు, జానకి యిట లేద యేమి • సలుపుదు నింకన్. ౩౬౧

తాత్పర్యము.

సీతను జూడలేక పోయితిని. సీతాదేవి రావణు నింట నున్నది యని సంపాతి నమ్మకము చెప్పెను. ఇచ్చటఁ గాన రాలేదు. ఏమి చేయుదును? అతఁ డసత్య మాడె నందునా? అంతటి యకార్య మతని కేల కలిగెను? దాని వలన నతనికి రాఁగల లాభమేమి? కాఁబట్టి యుండే యామె యుండవలె; నెందున్నదో!

క. జనకజ మైథిలి రాముని, వనిత విదేహాభవ సీత • వశ మతి దుష్టున్
దనుజున్ మనుజాశను నే,మనుచుం బ్రాపించు నట్టి • యాగడ మున్నే. ౩౬౨

అర్థములు. జనకజ = జనకరాజుకూఁతురు, 'కర్మణైవ హి సంసిద్ధి మాస్థితా జనకాదయ' యన్నట్లు సదాచారసంపన్నులలో నుత్తముఁ డైన వానికూఁతురు. కులముఁ బట్టి గుణములు. అట్టివాని కూఁతురు రావణునకు లోఁబడునా? మైథిలి = ఆయన యొక్కఁడే కాదు 'యథా రాజా తథా ప్రజా' యన్నట్టు లా దేశము వారందఱు నట్టివారే. అట్టి మిథిలయందుఁ బుట్టినది. అట్టి సదాచార సంపన్ను లుండెడి చోట దుష్టస్త్రీ పుట్టునా?

పుట్టిన యింటి సమాచార మిటుండ మెట్టిన యింట రాముని వనిత. ధర్మ విగ్రహమగు రామచంద్రుని భార్య. గుణవత్సంబంధముచేతఁ బరుసవేదిచే నినుము బంగారమైనట్లు చెడువారు కూడ మంచివారగు చుండ బంగా రినుమగునా? విదేహభవ=విదేహులు = దేహాభిమానము లేనివారు, బ్రహ్మజ్ఞాన పరాయణులు. అట్టి దేశము విదేహ దేశము. అట్టి దేశ మందుఁ బుట్టిన సీత, తుచ్ఛమైన దేహసౌఖ్యము నకై చేయరాని పని చేయునా? సీత = అందు మనుష్యస్త్రీలు పుట్టినట్లు పుట్టినది కాదు. అయోనిజ - కావుననే అమానవి - అట్టిది యకార్యము చేయఁబూనుకొనునా? వశమతి=తన మనస్సును దన స్వాధీన మందుంచుకొనలేక - దుష్టున్= దోషకార్యములే చేయువానిని, దనుజున్ = రాక్షసుని, మనుజాశనున్ = మనుష్యులను బీఁకి తినువానిని, దుష్టు ననుటచే దుష్టస్వభావము- దనుజున్- అనుటచే దుష్ట జాతి - మనుజాశనుని అనుటచే క్రియయుఁ, జెడ్డది. మనుష్య స్త్రీ మనుష్యులఁ దిను వానిని గామించునా? ఆగడము = విపరీతవర్తనము, ఉన్నే = ఉండునా? - ఉండదు.

తాత్పర్యము.

రావణాసురునకు వశపడుటచే వాఁడామెను వీరిలోఁ గలుపక మఱి యెందైన నుంచినాఁ డనుకొందునా? ఛీ ఛీ యది యేమి యాలోచన. జనకరాజు కూఁతురు, మిథిలయందుఁ బుట్టినది, రాముని భార్య, విదేహసంబంధముగలది, భూమియందుఁ బుట్టినది, సీత యను పేరు గలది, కామవశురాలై గుణమున దుష్టుఁడు, జాతిచే నీచుఁడైన దనుజుఁడు, క్రియలచేఁ గ్రూరుఁడై మనుష్యులఁ దినువాఁడు నగు వాని నే మని కామించును? అట్టి విపరీతముకూడ నుండునా? ఎప్పటికి నుండదు.

క. సీతఁ గొని రామమార్గణ, భీతి న్వడి నెగుర నసుర•వీరుఁడు నీరే
జాతాక్షియు నడి త్రోవను, భీతిం బడిపోయె నోటు • భీరువుగానన్. ౩౬౩

అర్థములు. మార్గణ = బాణములవలని, భీతిన్ = భయమున, భీరువు = పిఱికిది.

తా త్ప ర్య ము.

సీతాదేవి యిందులేదాయె, యందులేదాయె, యసుమ నెక్కడ బోయెనందునా, రావణుఁడు రామ బాణములకు భయపడి సీత నెత్తుకొని యాకాశమున నెగురునప్పుడు భయశాలిని కావున సీత సముద్రములోఁ బడిపోయె నేమో.

ఉ. అట్టులుగాక యున్న ఖచ•రాధ్వమునం జనుచోట రావణుం
డిట్టల మైన భీతి మిధి•లేశ్వరుకన్యక యబ్ధిలోన లోఁ
దొట్టిన నిర్వాలం బడెనొ • తోరపువేగము సైఁప లేక తా
నెట్టన మే న్వణంక ధృతి•నిల్పఁగ నేరక మేను వాసెనో? ౩౬౮

అర్థములు. ఖచరాధ్వమునన్ = ఆకాశమార్గమున, ఇట్టలమైన = అధికమైన, దృఢమైన, 'తలఁకెడువాఁడు గాఁడు భగదత్తుఁడు భీమతనూజుతోడ నిట్టలముగఁ బోరఁజాలు నకటా కరి యోరువ దేమి సేయు' భార. నిర్వాలన్ = పారవశ్యముచే.

తా త్ప ర్య ము.

అట్లు సముద్రములోఁ బడిపోక యుండినచో రావణుఁ డాకాశమార్గమునఁ బోవునపుడు సీత నిండారు భయముచే సముద్రమును జూచి భయపడి పరవశురాలై దానిలోఁ బడిపోయెనేమో! అటుగాక యుండెనా, వాఁడు పోవువేగమును సైరింపలేక ధైర్యము విడిచి వణఁకుచు నాకాశమందే దేహమును విడిచెనేమో.

క. రాముని రాకావేళా, సోముని నిరసించు ముఖము • సురుచిరకంజా
తామలదళనయనములను, వేమఱు స్మరియించుకొనుచు • విడిచెనొ మేనిన్.

అర్థములు. రాకావేళాసోముని = నిండుపున్నమనాఁటి చంద్రుని, రాక = పదునాఱు కళలు గల చంద్రుని గల రాత్రి.

తా త్ప ర్య ము.

అటుగాక యుండెనా, రాముని నిండు పున్నమనాఁటి చంద్రునిఁ దిరస్కరించు ముఖమును, మనోహరములైన కమలముల రేకులవంటి కన్నులను స్మరించుచు ప్రాణము విడిచెనేమో.

సీ. చుట్టపక్కములు లే•నట్టి సాధ్వి సుశీల, సీత రావణుఁడు భ•క్షించె నేమొ!
యీసున రావణు • నిల్లాండ్రు రవహూత్మఁ, బట్టి భక్షించిరో•పాపరతలు!
హా! రామ! హా!లక్ష్మ•ణా!హా! యయోధ్య!యం,టంచు నేడ్చుచుమర•ణించెనొక్కొ!
పంజరంబున గోరు•వంక నా వసురుండు, నేలమాళిగ నుంచి•యేలు నేమొ!
ఆ. జనకరాజతనయ • సాధ్వి సుమధ్యమ, రాము పత్ని సీత • రావణాసు
రాధిపతికి నెట్లు • స్వాధీన యయ్యెడు! నట్టి దెన్నఁడైన • నగుట గలదె. ౩౬౬

అర్థములు. చుట్టపక్కములు = చుట్టములు + పక్కములు. ఒకానొకచో ద్వంద్వంబునఁ బూర్వపదంబు క్లీబసమం బగు. అగుచో నా మువర్ణకమునకు లోపం

బగు (త్రి.స.౭౫ సూ) పతిశబ్ద భవము పత్కము. ఈసున = సవతిమాత్సర్యముచే, సుమధ్యమ = సన్నని నడుము గలది.

తాత్పర్యము.

సుగమము.

ఉ. దానవుఁ డింద యొమ్మెడనొ • డాఁచెనొ, కాక సుశీల మిత్తికిన్
లోనయి పోయెనో వనధి•లోఁ బడి ఛీ!? హ్రీకేశకూటమిన్
మాని మనంగలేక మర•ణంబునె తా శరణంబుఁ గాంచెనో
మానిని, యిష్టభార్యునకు • మానుగ రామున కేమి చెప్పుదున్. ౩౬౭

అర్థములు. మిత్తికిన్ = మృత్యువునకు, మనంగలేక = బ్రదుకలేక, ఇష్టభార్యునకు = భార్యయందుఁ బ్రేమ గలవానికి, ఇష్టురాలగు భార్యగలవానికి.

తాత్పర్యము.

రావణుఁ డిందే యొండైన సీతను డాఁచెనో లేక పతివ్రత గావున రావణునకు వశపడక సముద్రములోఁబడి నశించెనో, భర్త సాంగత్యమును విడిచి బ్రదుకలేక తానే మరణించెనో, భార్యయందుఁ బ్రేమఁగల రామునకు నే నేమని చెప్పుదును?

—{ సీతాదేవి లేదని శ్రీరామునితోఁ జెప్పినఁ గలుగు ననర్థంబుల హనుమంతుఁడు యోజించుట }—

క. చెప్పిన ననర్థకం బగు, జెప్పమినిం దోష మెట్లుఁ • జేకుఱుఁ గావన్
జెప్పుదున; చెప్పకుందున? యిప్పగిది ఘటిల్లె విషమ•మే మొనరింతున్.

తాత్పర్యము.

సీత కానరాలేదని చెప్పితినా కీడు తప్పదు. చెప్పకుందునా దోషము తప్పదు. చెప్పినను గీడే, చెప్పకున్నను గీడే. చెప్పుదునా చెప్పకుందునా? విషమ సంకటము ప్రాప్తించెనే, యేమి చేయుదును?

క. అని యన్యోన్యవిరుద్ధము, గను దోఁప సమర్థ మగుదుఁ • గాలార్హం బౌ
ఘనసీతి యెద్ది యంచును, మనమునఁ దలపోయఁ దొడఁగె • మారుతి మఱియున్.

అర్థములు. అన్యోన్యవిరుద్ధము=ఒకదాని కొకటి సరిపడనిది.

తాత్పర్యము.

ఏ యాలోచన చేసినను మనస్సునకు సమాధానము కుదిరినది కాదు. ఒక యాలోచనను బాధించు నాలోచన వేఱొకటి తోఁచుచున్నది. ఇట్టి సందర్భమందుఁ గాలయోగ్యమై కార్యసాధక మైన నీతి యెద్ది యని హనుమంతుఁడు మఱియు నాలోచింపసాగెను.

ఉ. ఏమిఫలంబు గల్గుఁ దర•శింపఁ గాక నేను వానర
స్వామి పురంబుఁ జేరఁ జన • వారిధి దాటుట, లంకఁ జొచ్చుటల్,

భూమిజ రోయుటల్, దనుజ•పుంగవులం గనుటల్, వృథా చనన్
భూమిజఁ గాన కే మనుచుఁ బోవుదుఁ బుణ్యమొ పూరుషార్థమో. ౩౭౦

అర్థములు. తరళేక్షణ = చలించు కన్నులు గలది - సీత.

తా త్ప ర్య ము.

నేను కిష్కింధకుఁ బోయెద ననుకో, దానివలన రాఁగల లాభమేమి ! సముద్రము దాటుట, లంకఁ బ్రవేశించుట, సీతను వెదకుట, రాక్షస శ్రేష్ఠులఁ జూచుట యివన్నియు వ్యర్థమై పోవఁగా సీతను జూడక యక్కడికిఁ బోయిన పుణ్యమా, పూరుషార్థమా ! ఫలహీనమైన కష్ట మేటఁ జేసిన కృషియే గదా.

ఉ. ఏ మన యందురో వనచ•రేశ్వరులున్ రవిజుండు నేఁ జనన్
రాముఁడు లక్ష్మణుండుఁ గన•రాదు సుఁడీ జనకాత్మజాత నా;
రాముఁడు ప్రాణముల్ విడుచుఁ • గ్రచ్చుటఁ, గ్రూరము తీక్ష్ణ మింద్రియ
స్తోమసుతాపనంబు చెవి•సూఁడు నుడుల్ వినియున్ సహించునే ! ౩౭౧

తా త్ప ర్య ము.

నేను బోయి సీత గానరాలేదు అని చెప్పఁగానే వానరవీరులు సుగ్రీవుఁడు రాముఁడు లక్ష్మణుండు నన్నేమందురు? లేని వస్తువును జూడలేదని నన్ను దండింతురా ? దండింపరు గాని రామచంద్రమూర్తి యామాట చెవిలోఁ బడఁగానే వెంటనే ప్రాణము విడుచుట సిద్ధము. క్రూరమై తీక్ష్ణమై ఇంద్రియములకు సంతాపకరమై చెవులలో కరగించి పోసిన సీసమువంటి మాటలు విని యేమని ప్రాణము పట్టుకొని యుండఁగలఁడు ?

క. మరణకృతనిశ్చయాత్మని, వరగుణునిన్ రాముఁ జూచి • భ్రాతృసుహృత్త్వ
స్ఫురితుం డగు సౌమిత్రియు, మరణంబును బొంద కేల • మఱి జీవించున్. ౩౭౨

అర్థములు. మరణకృతనిశ్చయాత్మునిన్ = మరణింప నిశ్చయము చేసికొనిన వానిని; భ్రాతృసుహృత్త్వస్ఫురితుండు = అన్నయందు స్నేహభావముచే నిండి యుండువాఁడు.

తా త్ప ర్య ము.

రామచంద్రమూర్తి మరణింపవలె నని నిశ్చయము చేసికొనఁగానే యాయన కంటె ముందుగ నాయన యందు నిండారు సోదరప్రేమగల లక్ష్మణుఁడు మరణించును, గాక నేల జీవించును. రాముని మరణమని వినుటకు కనుటకు ముందే యాయన ప్రాణములు పోవును.

క. అన్నయుఁ దమ్ముఁడుఁ జచ్చిన, యన్నుడి విన్నంతమాత్ర•నట భరతుండున్
మన్నగఁ బ్రాణము విడుచును, సన్నుతశత్రుఘ్నుఁడు బడిఁ•జను చేరంగన్. ౩౭౩

తా త్ప ర్య ము.

అన్నయుఁ దమ్ముఁడు మరణించిరని వినఁగానే యయోధ్యలో భరతుఁడు శత్రుఘ్నుఁడు తోడరాఁగా ముందుగనే ప్రాణము విడుచును.

క. కొడుకులమరణము విని వగఁ,బడి కౌసల్యయు సుమిత్ర ♦ భరతుజననియున్
విడుతురు వెంటనె ప్రాణముఁ, బడమిని జీవింప నెల్లు ♦ బుద్ధియుఁ బుట్టున్. ౩౨౪

తా త్ప ర్య ము.

కొడుకులచావు విన్నంతమాత్రముననే కౌసల్య సుమిత్ర కైకేయియుఁ జత్తురు. వారు కొడుకులఁ బోఁగొట్టుకొనియు బ్రదుక నెట్లు బుద్ధి పుట్టును ?

క. కృతి మెఱుఁగును సత్యముఁ దన,మతిఁ బాయఁడు కపివిభుండు♦మార్తండజుఁడున్
క్షితిశతనయావల్లభుఁ డా,గతిఁ బట్టుటఁ జూచి తాను ♦ గాలముఁ జెందున్. ౩౨౫

తా త్ప ర్య ము.

పరులు తనకుఁ జేసినమేలు మఱువనివాఁడు, చెప్పినమాట దప్పనివాఁడు నగు సుగ్రీవుఁడు రామచంద్రుని గతిఁజూచి తాను మరణించును.

క. శోకోపహతయు భృశదుః, ఖాకులిత యపాస్తనిర్భ♦రానందమహా
శోకాకుల యయి రుమ పతి, శోకంబున మేను విడఁగఁ ♦ జూడక యున్నే. ౩౨౬

అర్థములు. శోకోపహత = మగఁడు చచ్చిన శోకముచేఁ గొట్టఁబడినది, భృశదుఃఖాకులిత = మిగుల దుఃఖముచేఁ గలఁత నొందిన మనస్సు గలది, అపాస్త= పోయిన, నిర్భర = అధికమైన, ఆనంద = సంతోషము కలిగినది.

తా త్ప ర్య ము.

మగఁడు చచ్చిన శోకదుఃఖములచేఁ గలఁత పడిన మనస్సు గల రుమాదేవి దేహము వదలు నాలోచన చేయకయుండునా !

తే. వాలి మరణంబునకె కడు♦వగఁ గృశించు, తార సుగ్రీవుగతిఁ జూచి♦తా నశించుఁ
దల్లియును దండ్రియును బిన్న♦తండ్రిచావఁ,జూచి యంగదుఁ డేటికిఁ♦బ్రోచు మేను.

తా త్ప ర్య ము.

వాలి చచ్చినాఁడని యేడ్చు తార సుగ్రీవుఁడుకూడఁ జచ్చుట చూచి తాను నశించును. తలిదండ్రుల బిడ్డలు మరణించుట చూచి యంగదుఁడు నశించును.

చం. వనచరవీరు లెల్ల నిజ♦వల్లభసంస్థితి దుఃఖతప్తులై
ఘనతరముష్టిగాఢతల♦ఘాతములన్ నిహతోత్తమాంగులై
చనఁ జిరసాంత్వనాదృతులు ♦ చత్తు రరణ్యచరుల్ సపుత్రకుల్
వనచరు లార్తిఁ గూరి భృగు♦పాత మొనర్చి నిజప్రియాళితోన్. ౩౨౭

అర్థములు. నిజవల్లభ సంస్థితిన్ = తమ ప్రభువు మరణించుటచే, ముష్టిఘాతములన్ = పిడికిళ్ళ గ్రుద్దులచే, తలఘాతములన్ = అఱచేతి దెబ్బలచే, నిహతోత్తమాంగులై = పగులఁ గొట్టఁబడిన శిరస్సులు గలవారై, చిర = దీర్ఘకాలముగ, సాంత్వన = మంచిమాటలచే, ఆదృతులు = ఆదరింపఁబడినవారు, అరణ్యచరుల్ = అరణ్యమం దుండువారు, భృగుపాతము = కొండమీఁదనుండి క్రిందఁ బడుట, నిజప్రియా+ఆళితోన్ = తమ ప్రియురాండ్రతో.

తాత్పర్యము.

కిష్కింధ యందుండు ముఖ్యవానరు లందఱు తమ రాజు చచ్చినాఁడన్న వార్త విన్నంతమాత్రముననే దుఃఖముచేఁ దపించినవారై గట్టిపిడికిళ్ళచేతను దృఢమైన యఱచేతి దెబ్బలచేతను దమ తలలు పగులఁగొట్టుకొని మరణింపఁగా నరణ్యమందుఁ జిరకాలముగ మంచిమాటలచే నాదరింపఁబడుచుండినవారు ఇఁకఁ దమ్ము నాదరించువారు లేమిని కొడుకులతోను బ్రియురాండ్రతోను గొండల మీఁదినుండి క్రిందఁ బడి మరణింతురు.

క. శైలంబుల వివిధవనీ, జాలంబులఁ గీశవరులు • సంఘము లగుచున్
హేలఁ జరింపరు తమి వా, హ్యాళిం గ్రీడలను దుఃఖ • తాత్మకు లగుచున్. ౩౮

అర్థములు. శైలంబులన్ = పర్వతములందును, వివిధ వనీ జాలంబులన్ = నానావిధములయిన యడవుల గుంపులందును, కీశవరులు = వానరశ్రేష్ఠులు, కీశ = 'కః' యనఁగా వాయువు. ఆయన కుమారుఁడు 'కి' యనఁగా హనుమంతుఁడు. ఆయనను ముఖ్యుఁడు గాఁగలవారు కీశులు, గురుబాలప్రబోధికయం దిట్లుత్పత్తి వ్రాయఁబడెను గాని కీస్, కీస్ అనువారు గనుక కీసులయిరేమో యని తోఁచుచున్నది. వాహ్యాళి = వినోద సంచారము, తద్భవము వయ్యాళి.

తాత్పర్యము.

అట్లు చావఁగా మిగిలిన క్రోఁతులు కొండలందు నడవులందు గుంపులై దుఃఖముచే మునుపటివలె విలాసముగా సంచరింపరు.

క. ఉరిపోఁతలఁ జెనుమంటలఁ, బరువవిషంబులను నిట్టు • పాసంబులచే
మరణింతు రొండె నుసులులు, తరవారుల నుఱికి యొండెఁ • దలఁగుదురు కపుల్.

అర్థములు. నిట్టుపాసంబులు = శుష్కోపవాసములు, తరవారులు=కత్తులు, 'తరవారి ర్మండలాగ్రః ఖడ్గః కౌక్షేయకః స్వసూః' యాదవ.

తాత్పర్యము.

కొంద ఱురిపోసికొని చత్తురు. కొందఱు మంటలలో దూఁకి చత్తురు. కొందఱు విషముత్రావి చత్తురు. కొందఱు కత్తులపైఁబడి ప్రాణములు విడుతురు.

సీ. కిష్కింధ కిప్పు డే • గితి నేని యెవ్వేడ, హా యను నేడుపు • టులివు వినఁగఁ
బడు నంతె, యిక్ష్వాకు • వంశనాశంబును, గపికులనాశంబుఁ • గలుగు నిజము
కావునఁ గిష్కింధ • కడకు నే నిట నుండి, చన కుండుటయె చూడ • సమ్మతంబు
చూచు నే నెట్టులు • సుగ్రీవుముఖమును, జానకిఁ బోఁబడిఁ • గాన లేక

తే. నేను బోకుంటి నేని వ • నేచరులును, దాశరథులును బ్రాణముల్ • దాల్చువార
లాశచే నైనఁ గొన్నాళ్ళ • లట్టుగాన, నటకుఁ బోకుంటయే మేల • టంచుఁ దోఁచె.

అర్థములు. ఏడుపు + ఉలివు = ఏడుపుటులివు=ఏడుపుధ్వని.

తాత్పర్యము.

ఇప్పుడు నేను కిష్కింధకుఁ బోయితినా యెక్కడఁ జూచినను నేడుపు ధ్వనులే వినవచ్చును. అంతమాత్రమే ప్రయోజనము. ఏల? ఇక్ష్వాకు వంశనాశంబు, వానర కులనాశము తప్పక కలుగును. కావున నిచ్చటనుండి కిష్కింధకుఁ బోకుండుటే సమ్మత మైన కార్యము. జానకి పోఁబడి తెలిసికొనలేక పోయి సుగ్రీవు ముఖ మేమని చూతును. అంత సిగ్గు బిడియము లేని వాఁడనా? కావున నేను పోకుండితినేని హనుమంతుఁ డింకను వచ్చును, రేపు వచ్చును, ఎల్లుండి వచ్చును, అను నాశచే నింకను గొన్ని నాళ్ళైన జీవించి యుందురు. కాఁబట్టి నేను బోకుండుటే మేలు.

హనుమంతుఁడు సీతాదేవిని జూడకయే యుండెనేని యెంత కీడు మూఁడి యుండునో చూచుటచే నెంత కీడు తొలఁగెనో పాఠకు లూహింపవచ్చును. అయినను నొక సందేహము. ఇంత కీడు సీత కానరాలే దనఁగానే రాముఁడు మరణించు ననునూహమీఁద నాధారపడియున్నది. ఆయన సీతావియోగముచే మరణించిననే యింత యనర్థము సంభవించును గాని యాయన జీవించి యుండిన నింత యనర్థము పొసఁగదు. భార్య కానరాలే దనఁగానే రామచంద్రమూర్తి ప్రాణము విడుచునా? సీతాదేవి రెండవసారి శపథము చేసి భూమిలోనికిఁ బోయిన తరువాత రామచంద్రమూర్తి మరణించెనా? అవల నెన్నియో నూర్ల సంవత్సరములు బ్రదికియుండెఁ గదా. కావున రామచంద్రమూర్తి సీతకై ప్రాణము విడుచు ననునూహ సరియైనది కాదు. కావున నీ యూహాపరంపర నిరాకరము. సమాధానము రెండవసారి సీతావియోగము స్వబుద్ధి పూర్వకముగఁ జేసినకార్యము. అందు దుఃఖ మతిశయించి యుండదు. భార్యమరణించిన నేడుచువాఁడు తాను సన్న్యాసియై భార్యను వదలెనేని యేడువఁడు. అబుద్ధి పూర్వకముగ నొక రూపాయ పోఁగొట్టుకొనినవాఁడు దేవురు లాడినట్లు బుద్ధి పూర్వకముగ వంద రూపాయలు దానముచేసిన వాఁ డేడువఁడు. కావున రెండవసారి సీతా వియోగమున రామచంద్రమూర్తికి వ్యసనము తక్కువ. ఇంత తీవ్రవ్యసనము లేదు. సీతాదేవి భూమిలోఁ బ్రవేశించుటకు ముందు పండ్రెండు సంవత్సరముల నాఁడే భార్యాభర్తృవియోగము సంభవించెను. ఇన్ని సంవత్సరములు వియోగము ననుభవించిన వాని మనస్సున శోక మెంతమాత్ర ముండఁగలదు. వాల్మీకి రామాయణము వ్రాయుచుండిన నాఁడె యావజ్జీవ మట్లుండవలసినదే కదా. వియోగ మక్కడైన నేమి? ఇక్కడైన నేమి? వియోగము వియోగమే. ఇప్పటిస్థితి యట్టిది కాదు. కావున హనుమంతుని యూహ తప్పన రాదు.

మఱియొక విధముగ నాలోచింతము. హనుమంతుఁడు సీతను గానక మరలి పోయి వానరులకీ వార్త చెప్పఁగానే వానరు లందఱు సుగ్రీవు భయమున బ్రాయోపవేశము చేసియుందురు. హనుమంతుఁడు మాత్రము బ్రహ్మ వరబలమున జీవించి యుండి కిష్కింధకుఁ బోయి యీవార్త చెప్పియుండవలసి వచ్చును అప్పు డెంతటి.

యల్లకల్లోలము పుట్టియుండునో. అటుగాక వానర లూరకపోయిరా రాజాజ్ఞ మీఱిన వా రని వీరినందఱ సుగ్రీవుఁడు దండింపఁ బూనిన నెంత యనర్థము పుట్టియుండునో ? ఇక్కడ సీత యేమై యుండునో! ఇవన్నియు హనుమంతుఁ డాలోచించిన విషయములే. ఈ కారణముచేఁ బోయి యనర్థకారి యగుటకంటెఁ బోకుండుటే మే లని తీర్మానించుకొనెను. ఇట్లు తీర్మానించుకొని తరువాతఁ జేయవలసిన కార్య మాలోచించుచున్నాఁడు.

—• హనుమంతుఁడు ప్రాణత్యాగముఁ జేయ నాలోచించుట. •—

శా. ఏ నిందుం గన నైతి నేని మిథిలా•ధీశాత్మజాతం గరా
దానుండన్ నియతవ్రతంబుగ ముఖా•దానుండ నై యుంద నొం
డేనిన్ భూరుహమూలవాసి నయి జీ•వేచ్ఛన్ విసర్జించుచున్
వానప్రస్థుఁడ నై చరించుటయె భ•వ్యం బైన మార్గం బగున్. ౩౮౨

అర్థములు. కరాదానుండన్ = చేతిలోఁబడిన దానిని దినువాఁడను, ముఖాదానుండను = నోటిలోఁబడిన దానిని దినువాఁడను, భూరుహమూలవాసిని = చెట్టుక్రిందఁ బడియుండువాఁడను, జీవేచ్ఛన్ = బ్రదుకవలదెని కోరికను.

తాత్పర్యము.

నేను మరలిపోను. ఇందే యెందో యుండెద ననుకో. ఉండి చేయవలసిన దేమి ? ఇం దుండి సీతాదేవినే కనుఁగొనలేక పోయితినా యొక చెట్టు క్రింద బ్రదుకు మీఁది యాశ వదలి దోసిలి పట్టుకొనియో నోరు తెఱచికొనియో కూర్చుండును. చేతిలోఁ బడినదో నోటిలోఁ బడినదో కాయో పండో తిందును. పడకుండిన నూరకుందును. ఈ విధముగ వానప్రస్థుఁడనై యుండుటే క్షేమంకరమైన మార్గము.

క. మెచ్చుగు ఫలమూలంబుల, హెచ్చుగు జలనిధితటంబు • నే నరిగి యటన్
జిచ్చుటికెదఁ జితి పేరిచి, చచ్చుట మేల్ సీతఁ గనక • చనుకంటె నిటన్. ౩౮౩

తాత్పర్యము.

ఫలములు, మూలములు విశేషముగ నుండు సముద్రతీరముఁ జేరి యచ్చటఁజితి పేరిచి దానిలో దూఁకి చచ్చుట మేలుగాని సీతను జూడక మరలిపోవుట మేలుగాదు.

చిచ్చు + ఉటికెదన్ = సప్తమ్యర్థమునఁ బ్రథమ. చనుకంటెన్ = చనుటకంటె, భావార్థక ట వర్ణలోపము.

క. అంగములు వ్యాఘ్రకాకపతంగంబులు దినుచు నుండఁ • దలఁగక ధృతిమీ
ఱంగ మరణోపవిష్టత, లింగిని సాధించువాఁడ • లీలగ నిచటన్. ౩౮౪

అర్థములు. వ్యాఘ్రకాకపతంగంబులు=పులులు, కాకులు లోనగు పక్షులు, మరణోపవిష్టత = మరణము నిమిత్తమై కూర్చుండుట, లింగిని = లింగ మనఁగా సన్న్యాసము=నిరాహారము అది కలది లింగిని. అనఁగా నిరశన వ్రతము, లీలగన్ = అవలీలగ.

తా త్ప ర్య ము.

చెట్టుక్రిందఁ గూర్చుండి కాయలు పడునా, పండులు పడునా యని దేహాభిమానముచేఁ గాచి యుండుట యెవఁడు చెప్పిన పని. అదియు సరిగాదు. ఒక చెట్టు క్రింద మరణము నిమిత్తమైనిరాహారినై ధీరుఁడనై నా దేహమును పులులు, కాకులు గ్రద్దలు లోనగు పక్షులు తినినను గదలక కూర్చుందును.

తే. అవనిసంభవ నిటుఁ గాన • నైతి నేని,నీళ్ళ నుఱికి త్యజించెద • నేను మేని
నిట్టినిర్వాణగతికి ము•నీంద్రు లెల్ల, సమ్మతింతుర యని తోఁచె • స్వాంతమునను.

తా త్ప ర్య ము.

సీతాదేవిని నే నిందుఁ జూడఁజాలక పోయితినా నీళ్ళలో దూఁకి దేహము వదలెదను. ఇట్టి కార్యము రామార్థమై చేయుట మునీశ్వరు లెల్ల సమ్మతింతు రనియె తోఁచుచున్నది. స్వామికార్యమునకై అందు రామకార్యమునకై ప్రాణము విడుచుట పాపకార్య మగునా? జటాయువువలె నందునా? జటాయువు కార్యము చేయలేక బుద్ధిపూర్వకముగ మరణింప లేదు. ఆయనది వీర మరణము. నా స్థితి యట్టిది కాదుగదా.

ఉ. హా యెటు సేయుదున్ వరశు • భావహశాలిని యై మనోజ్ఞచం
ద్రాయతచంద్రికాసుభగ • యాచు యశోవిభవాభిరామ యై
పాయుట నిద్ర దీర్ఘయయి • బాధసుకీర్తిద యైనరాత్రి వే
పోయెడిఁగా వృథా జనక•పుత్రిఁ గనుంగొను భాగ్య మేదఁగన్. ౩౮౬

అర్థములు. పరశుభావహశాలిని=మేలైన శుభమును గలుగఁజేయు దానిలోఁ గూడినది, మొట్టమొదట లంకాధి దేవతా జయము, శుభ సూచకము, చంద్ర = చంద్రునియొక్క, ఆయత = గొప్పది యగు, చంద్రికా = వెన్నెలచేత, సుభగ = సుందరమైనది. ఇట్లు చెప్పుటచే నిప్పటికి వెన్నెల దట్టముగా నున్నది. కాని పలుచఁబాఱలే దని భావము. యశోవిభవ = కీర్తి సంపదవలె, అభిరామమై = మనోహరమై, కీర్తి తెలుపని కవిసమయము. ఈ రాత్రి గదా హనుమంతుఁడు లంకలోఁ బ్రవేశించె నని కీర్తిగలది, ఏదఁగన్ = తోఁయింపఁగా.

తా త్ప ర్య ము.

అయ్యో! నేనేమి చేయుదును. ప్రారంభమందు లంకా జయములో శుభము గలిగించి మనోజ్ఞమై చంద్రుని విస్తారమైన వెన్నెలచే నంద మయిన యశస్సువలెఁ దెల్లనై నిద్ర లేకుండుటచే దీర్ఘమై యీరాత్రి లంకయందు హనుమంతుఁడు ప్రవేశించె నను కీర్తి తెచ్చునదియైన రాత్రి సీతాదేవిని జూచు భాగ్యము లేకయే వృథాగాఁ బోవుచున్నది గదా.

క. వ్రతి నై భూరుహమూల,క్షితిపైఁ బడి యుండువాఁడ • సీతం గనకే
మతి లేక చనిన నంగద, పతిముఖ్యులుఁ గీశవరులు • బ్రదుకం గలరే. ౩౮౭

అర్థములు. భూరుహమూలక్షితిపై = చెట్టుమొదట నుండు నేలమీఁద.

తాత్పర్యము.

నేను చేయఁదగిన దేదియు నాకుఁ గానరాలేదు. కావున వ్రతము పూని చెట్టు మొదళ్ళఁబడి యుందును. అటుగాక బుద్ధిలేని వాఁడనై పోయితినా యంగదుఁడు మొదలగు వానరులు బ్రదుకఁజాలరు.

ఆ. ప్రాణములను విడువ • బహుదోషములు గల్గు
బ్రదికి యున్నఁ గాద • పడయు శుభముఁ
గానఁ దాల్చువాఁడ • మేనఁ బ్రాణంబులు
బ్రదికి యున్న భద్ర • మొదవు నిజము.

తాత్పర్యము.

ఆహారము లేక దేహము విడిచెద మనుకో, చచ్చి సాధించునది యే మున్నది ! ప్రాణములను వదలితినా పెక్కుదోషములు గలవు. బ్రదికియుండినఁగదా మే లనుభవింప వచ్చును. చచ్చిన తరువాత మే లేమి గలదు. కావునఁ బ్రాణముల విడువరాదు. బ్రదికి యుండిననే శుభము గలదు.

'జీవితం మరణా చ్ఛ్రేయో జీవన్ ధర్మ మవాప్నుయాత్.' (భారత. విశ్వామిత్ర చండాల సంవాదము)

శరీరం ధర్మసర్వస్వం, రక్షణీయం ప్రయత్నతః
శరీరాత్ స్రవతే ధర్మః, పర్వతా త్సలిలం యథా. శంఖుఁడు.

బ్రదికియుండిన శుభములు బడయువచ్చు. భార.

'శరీర మాద్యం ఖలు ధర్మసాధనమ్' కాళిదాసుఁడు.

ఈ కారణముచే దానై దేహము విడువ రాదు. ధర్మార్జనము కొఱకై జీవింపఁగోరవలయును గాని కామార్థములకై కాదు.

చ. అని యిటు మాటిమాటికి దు•రంతపుఁజింతలఁ జిక్కి దుఃఖనీ
రనిధికి వేల గాన కెదఁ • గ్రమ్మఱ యోజనసేయు, ధారిణీ
తనయ మొకైన నౌత, మఱి • దానవనాథుని బట్టి త్రుంతునా !
దనుజుని దుష్కృతంబునకుఁ • దద్దయు నయ్యది పాచితం బగున్. ౩౯

అర్థములు. దురంతపు = అంతములేని, వేల = చెలియలికట్ట, పాచితంబు = ప్రాయశ్చిత్తము.

తాత్పర్యము.

అని యీ ప్రకారము పలుమా ఱాలోచించి యంతములేని చింతలకు లోనై దుఃఖసముద్రమునకుఁ దీరము గనలేక బ్రతికి నే నేమి చేయవలయును అని మరల నాలోచించి సీత బ్రిదుకనీ చావనీ - ఇందుండనీ - లేక పోనీ - ఆమె మొకైనఁగానీ ముందు రావణాసురునిఁ బట్టుకొని చావఁ దన్నుదునా ! ఏలన వాఁడు చేసిన పాప కార్యమునకు నదియే ప్రాయశ్చిత్తము.

క. రావణుని నీడ్చికొనుచుం, బోవుదునా జలధిమీఁద • భూపతికడకున్
వేవేగము పశుపతికై, వావిరిఁ గొనిపోవు పశువు • వడువున బలిమిన్. ౩౯౦

అర్థములు. పశుపతి=అగ్నిహోత్రుఁడు, "ఇమం పశుం పశుపతే తే అద్య బధ్నామ్యగ్నే" ఇది శ్రుతి. పశువు = మేఁక.

తాత్పర్యము.

రావణునిఁ జంపిన రాఁ గల లాభ మేమి? రామచంద్రమూర్తి తాను జంపెద ననెనే. అట్టివాని నేనెట్లు చంపుదును. కావున నది సరియైన యాలోచన కాదు. యజ్ఞము చేయునపు డగ్నికొఱకు మేఁకను నీడ్చికొని పోయినట్లు రావణునిఁ బట్టుకొని సముద్రముమీఁద వేసి యీడ్చికొనిపోయి రామచంద్రమూర్తి యెదుటఁ బెట్టెదను. ఆవలఁ జేయవలసిన కార్య మాయనయే చేయనీ.

ఉ. సారెకుఁ గుందు, వందు, నిట • జానకి గానఁగ రాదిఁ కేదిరా
తీరగు నంచు నెంచు, సుద • తీమణిఁ గన్గొనుదాఁక నీ పురిన్
వారక చూతుఁగాక యను • బాధపరాక్రము రాము గృధ్రరా
డ్భారతి నమ్మి యిందుఁ గొని • వచ్చితినా సతిఁ గాన కిమ్మెడన్. ౩౯౧

అర్థములు. గృధ్రరాట్ + భారతి = గ్రద్దరాజు సంపాతి వాక్కు.

తాత్పర్యము.

పలుమా అధైర్యపడి విచారించును. వ్యసన పడును. ఇచ్చట జానకి కాన రాలేదే, ఇఁక నేమి చేయ నగు ననుకొనును. సీత కనఁబడు దాఁక వెదకెద ననుకొనును. సంపాతి మాట నమ్మి రామచంద్రమూర్తిని దోడి తెచ్చితినా యిచ్చట సీత లేక పోయెనా,

క. దారుణ మగు రోషంబున, మారణహోమంబు సేయు • మార్గణవహ్నిన్
వీరకపివారముల రఘు, వీరుఁడు పోవిడుచు నెట్లు • వృథ వంచకులన్. ౩౯౨

అర్థములు. మార్గణ వహ్నిన్ = బాణాగ్నియందు.

తాత్పర్యము.

భయంకర మగు కోపంబుచే వానర వీరుల నందఱను బాణాగ్ని యందు మారణహోమము చేయును. మోసగించినవారి నటుచేయక రామచంద్రమూర్తి యూరకవిడచునా?

క. నియతాహారుఁడ నగుచును, నియతేంద్రియవృత్తి నిందె • నివసించెద నా
కయి యేల మడియవలయును, నయగుణులగు నృపతివరులు • నగచరవర్యుల్? ౩౯౩

అర్థములు. నియతాహారుఁడను = ఆహారనియమము గలవాఁడను, నియతేంద్రియ వృత్తి=ఇంద్రియవ్యాపారముల నియమించిన వాఁడనై, మడియవలయును= చావవలయును.

తా త్ప ర్య ము.

ఆహారనియమము, ఇంద్రియవ్యాపార నియమము గలవాఁడనై యుండే యుండె దను. నేను వ్యర్థుఁడనై పోనేల? సుగుణ సంపన్ను లగు రామలక్ష్మణులు వానరులు చావనేల?

—• హనుమంతుఁ డశోకవనంబును జూచుట. •—

కం. అదిగో మహాద్రుమాన్వితే, మది యొక్క యశోకవాటి•యం దిందనుక
వెదకంగ లేదు సీతను, వెదకెదఁ గా కందు నేల • విడువఁగ వలయున్. ౩౯౪

అర్థములు. మహాద్రుమాన్వితము = పెద్దచెట్లతోఁ గూడినది. అదిగో = దూరమునందుఁ గానవచ్చు చున్నదని భావము.

తా త్ప ర్య ము.

ప్రాకారము మీఁద నుండు హనుమంతుఁడు నలువంకలు పాఱఁజూచి యదిగో నచటఁ బెద్దచెట్లుగల యశోకవన మొకటి గానవచ్చుచున్నది. దానియందు నిందనుక వెదకలేను. అక్కడఁగూడ వెదకెదను. ఏల విడువవలయును?

క. మ్రొక్కెద వసురుద్రులకును, మ్రొక్కెద నాదిత్యులకును • మ్రొగి మరుతులకున్
మ్రొక్కి చని యశ్వులకు నేఁ, గ్రక్కఁగొనెద నోఁకుకండ•గరువం బెల్లన్. ౩౯౫

అర్థములు. నోఁకు=రాక్షసునియొక్క – కండగరువంబు = బలముగలవాఁడ నను గర్వము. రాము కార్యమందుఁ దనకుఁ దోడుపడుటకై దేవతలఁ బ్రార్థించు చున్నాఁడు. ఏలన వారును రామకార్యమునందు రామసేవ యందు నాసక్తిగల వారే.

కం. రాముఁడు సుఖయగుఁ గావుత
రాముఁడు చిరజీవి యగుచు – రంజిలు గాతన్
రాముఁడు నిరామయుండగు
రామునకును దేహబలము – గ్రాలెడి నెపుడున్. అహో. ౭౩

కం. అనివేల్పులు గంధర్వులు
జనములుఁ బన్నగులు రాష్ట్ర – జనపదములఁ బ
ట్టనములఁ బరదేశంబుల
మనసీమను గోరుచుంద్రు – మహిపా! సతమున్. ౭౪

ఉ. రాముని మేలు కోరి నగ•రంబున రాష్ట్రమునందుఁ బక్కణ
గ్రామములందు నిత్యముఁ • త్రికాలములందును నెల్లవేల్పులన్
సేమమునన్ భజింతు రె తరు•ణీమణులున్ ముదుసళ్ళు స్త్రీలునుం
గ్రామజనాదినాగరులు • రామునిఁ దప్ప స్మరింప రెవ్వనిన్. ౭౫

ఏకకార్యాసక్తు లగుటచే నొకరి కొకరు సహాయపడుట యొకరి నొకరు సహాయము కోరుట యుక్తమే కదా!

తా త్ప ర్య ము.

వసువులకు, రుద్రులకు, ఆదిత్యులకు, మరుత్తులకు అశ్వులకు నమస్కరించి పోయి రావణుని బలగర్వమును వదలించెదను.

క. మక్కించి రక్కసుల నే, నుక్కున వా రెల్లి నేడ్వ • హా యని సీతన్
మక్కువ గల పతిఁ గూర్చెదఁ, జక్కఁగఁ దపసికి ఫలం బొ•సంగెకురీతన్. ౫౬

అర్థములు. మక్కించి = బాధపెట్టి, ఉక్కున = పరాక్రమముచే, ఎల్లి = రేపు.

తా త్ప ర్య ము.

రక్కసుల నందఱను నా పరాక్రమముచే బాధించి వారందఱు హాయని యేడ్చుచుండ సీతాదేవిని నామె ప్రేమగల భర్తతోఁ దపసికి ఫలము నర్పించి నట్లు కూర్చెదను.

ఈ యుపమానము కార్యసాఫల్యమును సూచించు చున్నది.

క. అని చింతాసందానిత, మనమున నొండొకముహూర్త•మాత్రము నాలో
చన నొనరిచి యుత్సాహం,బున లేచి మరుత్తనూభ•వుం డిటు పల్కన్. ౫౭

అర్థములు. చింతాసందానితమనమునన్ = ఆలోచనతోఁగూడిన మనస్సుతో.

తా త్ప ర్య ము.

ఈ ప్రకారము చింతచేఁ గుందిన మనస్సుతోఁ గొంచెముకాల మాలోచించి యీ వనమున సీత యుండును, దప్పదు, అని నిశ్చయించుకొని యుత్సాహవంతుఁడై లేచి.

ఉ. మ్రొక్కెద రామచంద్రునకు • మోడ్చెదఁ గేలు సుమిత్రపట్టికిన్
మ్రొక్కెదఁ దద్విదేహపత•నూజకు శ్రీరఘురాము దేవికిన్
మ్రొక్కెద ధర్మవాసవము•రుద్గణ మారుత రుద్రపాళికిన్
మ్రొక్కెద సూర్యచంద్రులకు • మ్రొక్కెదఁ దామరసా ప్తసూతికిన్. ౫౮

అర్థములు. విదేహప = విదేహ రాజ్యపతియొక్క, తనూజకు = సీతాదేవికి.

తా త్ప ర్య ము.

రామచంద్రమూర్తికి నమస్కారము. లక్ష్మణస్వామికి నమస్కారము. విదేహ రాజపుత్రికయు శ్రీరామచంద్రమూర్తి ధర్మపత్ని యగు సీతాదేవికి నమస్కారము. ధర్మరాజునకు ఇంద్రునకు మరుత్తులకు వాయువునకు రుద్రులకు సూర్య చంద్రులకు సుగ్రీవునకు నమస్కరించెదను. హనుమంతుఁడు లంకను జయించుట, యోగి దేహమును జయించుట యని ముందు చెప్పఁబడెను. దేహము వశపడగానే యాత్మావలోకనము లభింపదు. లంకయందు హనుమంతుఁడు విసుగు వేసట లేక 'అన్వేషితవ్యమ్' అని యుపనిషత్తులు చెప్పినట్లు శోధించి యన్నిఁటిని బరిహరింపవలెను. ఇట్లు శోధించుట

యందు కొన్ని స్థలములందు శోధించు సమయంబున ఆత్మజ్యోతివంటి తేజస్సు గాన వచ్చును. మందోదరిని జూచి సీత యనుకొన్నట్లు ఆ తేజస్సే యాత్మయని భ్రమింప రాదు. సకారణముగ దానిని బరిహరింపవలయును. ఇట్లు మిక్కిలి హెచ్చరికతో నిష్కాముఁడై జితేంద్రియుఁడై వెదకవలయును. ఇట్లు వెదకుటయందు స్వప్రయత్న సాధ్య మను భావ ముండువఱకు ఆత్మ దర్శనము లభింపదు. కావునఁ గార్యసిద్ధికై సీతారామలక్ష్మణులకుఁ దొలుత నమస్కరించి భారము వారిపై వైచి దేహాధిష్ఠిత దేవతలకు మ్రొక్కి కార్య మారంభింపవలెను. దేవతలకు నమస్కరించుట న్యాయమే, సుగ్రీవున కేల నమస్కార మనిన సుగ్రీవు నాశ్రయము కలుగుటచేఁగదా హనుమంతునకు సీతాదర్శనము రామచంద్రమూర్తి దర్శనము లభించెను. కావున నెవరి యాశ్రయమువలనఁ బ్రత్యగాత్మ దర్శనము పరమాత్మ దర్శనము లభించెనో యట్టివారికిఁ గృతజ్ఞుఁడై నమస్కరింపవలెను. కావున ముముక్షువు లగు నే యోగుల కయినను బోధకులు వందనీయులే యగుదురు. సంపాతి రావణు నంతఃపురంబున సీతాదేవియున్నది యని చెప్పెను. హనుమంతుఁ డా మాట యందు శ్రద్ధగలవాఁడై సీతను వెదకినట్లు సాధకుఁడు గురువాక్యమునందు శ్రద్ధగల వాఁడై దేహమునం దాత్మాన్వేషణము చేయవలయును. కానరాకుండుట ప్రయత్న లోపమేకాని యాత్మలేమిని గాదు. కానఁ గానవచ్చువరకు వెదకవలయును. నిరు త్సాహ పడరాదు. సం+పాతి = చక్కఁగాఁ బాలించువాఁడు, గురు వని యర్థము.

చ. అని ప్రణతుల్ ఘటించి దిశ • లన్నియుఁ జూచి యశోకకాననం
బునఁ దనదృష్టి నిల్పి చనఁ బూని మతిన్ మది నెంచు నీగతిన్
వనచరలోకనాథుఁడు ధ్రు•వంబు నిశాచరకోటిరక్షితం
బును బరిసంస్కృతంబుఁ బరు•భూరుచిరంబు నశోకవాటికన్. ౩౯౯

అర్థములు. ప్రణతుల్ = నమస్కారములు.

తా త్ప ర్య ము.

ఈ ప్రకార మందఱకు నమస్కరించి దిక్కు లన్నియుఁ బాఱఁజూచి యశోక వనమునందుఁ దనదృష్టి నిల్పి హనుమ యిట్లనుకొనెను. ఈ వనమందు సీత యుం డుట నిశ్చయము ఏలన—అనేకులు రాక్షసులు దీనిని గాపాడుచున్నారు. మిగుల సంస్కరింపఁబడి చక్కఁజేయఁబడి యున్నది. పరిశుద్ధముగా నుంచఁబడి యున్నది. నే నిదివఱకుఁ జూచిన వనముల కంటె నిది మిగుల మనోహరమై యున్నది. ఈ యశోక వనమును,

ఉ. కావలివారు వృక్షములఁ • గాచుచు మిక్కిలి యున్నవార, లం
దా విభుఁ డైన మారుతుఁడు • మెల్లన వీచుచు నున్నవాఁడు, సీ
తావిభు నర్థ మై తనువు • దానవనేత కగోచరంబుగా
వావిరి సంగ్రహించి రఘు•వల్లభు వల్లభ నందు రోసెదన్. ౪౦౦

తా త్ప ర్య ము.

కావలివారు విశేషముగఁ జెట్లను రక్షించుచున్నారు. ఆ వనమందు సర్వవ్యాపి యైన వాయుదేవుఁడు మెల్లగా వీఁచుచున్నాఁడు. కావున నిందు సీత తప్పక యుండును. రావణునకుఁ గాన రాకుండు నట్లు దేహ మింతకంటె సంగ్రహపఱచి సీతాదేవిని వెదకెదను.

చ. మునులును వేల్పులున్ దివిజ•ముఖ్యుఁడు వజ్రి స్వభుండు బ్రహ్మవా
యు్వనలశశిప్రభాకరజ•లాధిపశర్వమరుత్తు లశ్వులున్
గనులకుఁ దోఁచువారు మఱి • కాననివారును సర్వభూతముల్
ఘనతరభూతనాయకుఁడుఁ • గార్యము సిద్ధి కొనర్తు రిమ్మెడన్. ౧౪౦

అర్థములు. అనల = అగ్ని, ప్రభాకర = సూర్యుఁడు, జలాధిప = వరుణుఁడు, శర్వ = రుద్రుఁడు, ఘనతరభూతనాయకుఁడు = వీరి కందఱకంటె మిగుల గొప్పవాఁడును, వీరికందఱకు నాయకుఁడు నైన పరాత్పరుఁడు, భగవంతుఁడు, పరిశేష న్యాయముచే విష్ణువు.

తా త్ప ర్య ము.

మునులును, సామాన్య దేవతలు, వారిలో ముఖ్యుఁడు వజ్రధరుఁడైన యింద్రుఁడు స్వయంభు వగు బ్రహ్మ, వాయువు, అగ్ని, చంద్రుఁడు, సూర్యుఁడు, వరుణుఁడు, రుద్రుఁడు, మరుత్తులు, అశ్వులు, కన్నులకుఁ గానవచ్చువారు, కానరానివారు సమస్త భూతములు, వీరి కందఱకు నాయకుఁడగు పరాత్పరుఁడు భగవంతుఁడు కార్యము ఫలింప జేయుదురు గాక. తోఁచువారు కానరానివారు అన్నచోట, "యచ్చ కించిత్ జగత్సర్వం దృశ్యతే శ్రూయతేపి వా। అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః", అను శ్రుతి యనుసంధించునది. శర్వ శబ్దము ముందు చెప్పఁబడియుండుటచే నిచట భూతనాయకశబ్దము రుద్రపర్యాయము గాదు.

సీ. ఎప్పుడు చూతునో • యే నున్నసంబును, బాండురదంత మ•వ్రణము నగుచు
మందహాసాంకూర•సుందరం బయి పద్మ, దళలోచనంబులఁ • దెలువు గాంచి
నిర్మల తారేశ • నిభదర్శనం బగు,నమ్మహాదేవి యా•స్యమ్ము నేను
ఏగతిఁ గందునో • హీనుండు క్షుద్రుండుఁ, బరమపాపియుఁ గ్రౌర్య•పరుఁడు దులువ
తే. దారుణుం డయ్యును సువేష•ధారియయిన, యసురపతిచే బలాత్కృతి•నపహరింపఁ
బడిన సాధ్విఁ దపస్విని • బడమికూఁతు, రామదేవుని దేవి స•తీమతల్లి. ౧౪౧

అర్థములు. ఉన్నసము = ఉన్నత నాసిక గలది. ఉన్నసము బహువ్రీహి సమాసము. ఉన్నత నాసిక కలది యేదో యది ఉన్నసము. అచ్ నాసికాయాః సంజ్ఞాయాన్నసం చాస్థూలాత్. ఉపసర్గాచ్చ. పాణిని. V. 4-118-119. ఇచ్చట ఉత్ ఉపసర్గ కావున నాసిక నస మయ్యెను. పాండుర దంతము=తెల్లని దంతములుగలది, అవ్రణము=ఏ కొఱతయు లేనిది. మందహాసాంకూర సుందరము=

చిఱునవ్వు మొలకలచే నంద మైనది. పద్మదళలోచనంబులన్=తామర రేకులవంటి కన్నులచే, నిర్మల = మలినములేని, తారేశనిభ = చంద్రునితో సమానముగ, దర్శనము = కానవచ్చునది, ఆస్యమ్ము=ముఖము.

తా త్ప ర్య ము.

సీతామహాదేవియొక్క యున్నతమైన నాసికయు, తెల్లని దంతములును గలిగి యే లోపమును లేక చిఱునవ్వు మొలకలచే నందమై తామరరేకులవంటి కన్నులు గల కళంకము లేని చంద్రుని వంటి ముఖారవిందమును నే నెప్పుడు చూతునోకదా! గుణహీనుఁడు, నీచుఁడు, పరమపాపి, క్రూరుఁడు, తులువ,నిర్దయుఁడయ్యును సాధువగు సన్న్యాసివేషమును ధరించిన రావణుచే బలాత్కారముగ నపహరింపఁబడిన పతివ్రతను, అన్నురాలిని, భూ పుత్రిని, శ్రీరామచంద్రమూర్తి దేవిని, స్త్రీలయందు త్తమురాలిని నే నెట్లు చూతునో కదా.

—• ౧౪-వ సర్గము. హనుమంతుఁ డశోకవనంబునఁ బ్రవేశించుట. •—

క. అని యీగతి మనమునఁ బావని యించుకసేపు లోన • వనరుచు నాలో
చన మొనరిచి యా ప్రమదావని ప్రాకారమున కంత•వలనుగ దాఁటెన్. ౪౦౩

తా త్ప ర్య ము.

ఈ విధముగ నాంజనేయుఁడు తన మనస్సులోఁ గొంతసేపు వగచి యాలోచించి యా యుద్యానముయొక్క ప్రాకారము మీఁదికి దాఁటెను.

సీ. ప్రాకారమున నిల్చి • పావని సంహృష్ట, సర్వాంగుఁ డగుచును • సంతసమునఁ
జూడ వసంతాది • సురుచిరవికసిత,శాఖ లై నట్టి భూ•జములతోడ
సాల తమాల త•క్కోల హింతాల కో,ద్దాల కాశోకర•సాల చంప
క కపిముఖానేక•కమనీయతరలతా,భవ్యాగయుతవృక్ష•వాటిఁ గాంచి
తే. యల్లె విడిచిన బాణంబు • ననుకరించి, చివ్వునను దాఁటి యచటికిఁ•జేరఁబోయి
చారునీడజనిస్వనో•దార మగుచుఁ, గనకరాజితపాదపా•క్రాంత మగుచు. ౪౦౪

అర్థములు. సంహృష్ట సర్వాంగుఁడు = గగ్గురు పొడిచిన యన్ని యవయవములు గలవాఁడు, వసంతాది = వసంతారంభమున, ఫాల్గుణ పున్నమ మొదలు నెల గణింతురు. కావున వసంత కాలము ఫాల్గున శుద్ధ పూర్ణిమతోనే ప్రారంభము. దీనికిఁ బ్రపూర్వ దిన మని గోవింద రాజీయమునఁ గలదు. పున్నమకుఁ బూర్వదినము చతుర్దశి. ప్రపూర్వదినము త్రయోదశి కావున నీ దినము త్రయోదశి యని నిశ్చయము.

సురుచిర = అందముగా, వికసిత = వికసించిన, శాఖలై = కొమ్మలు గలవై, సాల = మద్ది, తమాల = చీఁకటిమ్రాఁకులు, హింతాల = గిలక తాటి చెట్లు, ఉద్దాలక = విరిగి మ్రాను, రసాల = తియ్యమామిడి, చంపక = సంపెంగ, కపిముఖ = క్రోఁతిమూఁతి గల కాయలు గాచు చెట్లు, అనేక = నానావిధములైన, కమనీయతర = మిగుల నందమైన, లతా = తీఁగలచే, భవ్య=శుభమైన, అగ =

చెట్లచే, యుత = కూడిన, వృక్షవాటిన్=తోఁటను, చారు=అందమైన, నీడజ= పక్షులయొక్క, నిస్వనోదారము = గొప్పధ్వనులు గలది. కనక రాజత పాదప + ఆక్రాంతము=బంగారు వెండి చాయ గల చెట్లచే నిండినది.

తా త్ప ర్య ము.

ఆ యశోకవనముయొక్క ప్రాకారమందు నిలఁబడి యాంజనేయుఁడు దేహమంతయు సంతోషముచేఁ బులకరింపఁగా పాఱఁజూడఁగా వసంతము మొదట పూలచే వికసించు కొమ్మలుగల చెట్లతోడను, మద్దులు, చీఁకటి మ్రాఁకులు, తక్కోలములు, గిఱుకత్రాటిచెట్లు, విరిగిమ్రాఁకులు, అశోకములు, తియ్యమామిడిచెట్లు, సంపెఁగలు, క్రోఁతిమూఁతి కాయలు కాచుచెట్లు, అనేకము లయిన మిగుల నందమయిన చెట్లతోఁగూడిన తోఁటనుజూచి యల్లెత్రాడు విడిచిన బాణమువలె సూటిగ వేగముగ వచ్చుటకిఁ జివ్వున దాఁటి పోయి పక్షుల కలకల ధ్వనులతోను, బంగారు వెండి చెట్లతోను నిండినదై.

సీ. వింతవింతలు గొల్పు • విహగమృగంబుల, నవు రయి యుదయభా•స్కరనిభంబు
నగచుఁ జిగుళ్ళు లే•యాకులు పూవులు, పూపలు పిందెలు • పొలుపు మీఱు
పసరుగాయలు దోర•పండులు పండులు, గల పెక్కు తెగలవృ•క్షముల వెలసి
కోకిల హిందోళ • కేకిరవంబుల, నానాశకుంతసం•తానకలన
తే. నవ్య మైన యశోకవ•నంబునందు,
ధారిణీసుత వెదకుచో • మారుతాత్మ
జుండు సుఖసుప్తములను ప•క్షులను మేలు
కొలుప నవి మొల్ల గలకల • కూయఁ దొడఁగె. ౪౦౫

అర్థములు. విహగమృగంబులన్ = పక్షులచే, మృగములచే, ఉదయభాస్కరనిభంబు = ప్రాతఃకాల సూర్యునితో సమానము, హిందోళ = తుమ్మెదలు, 'బంభరశ్చ మిళింద శ్చ హిందోళ భసలౌ సమౌ' అని నిఘంటువు. సుఖసుప్తములు= సుఖముగా నిద్రించునవి.

తా త్ప ర్య ము.

క్రొత్త క్రొత్త యాశ్చర్యములు గలిగించు పక్షులచే, మృగములచే నందమై, ప్రాతఃకాల సూర్యునిఁబోలి చిగుళ్లు, లేఁతయాకులు, పూవులు, లేఁతపిందెలు, పసరు విడిచినపిందెలు, పసరుగాయలు, దోరపండులు, పండులు, గల బహువిధవృక్షములు గలిగి కోకిలలు, తుమ్మెదలు, నెమిళ్లు- వీని ధ్వనులచేతను అనేకవిధము లైన పక్షిజాతులచేతను మనోహరమైన యశోకవనముఁ జూచి యందు సీతను వెదకుచు నాంజనేయుఁడు నిద్రపోవు పక్షులను మేలుకొలుపఁగా నవి కలకల కూయ నారంభించెను.

పక్షులను నిద్రలేపె ననుటచే హనుమంతుఁడు చెట్టునుండి, చెట్టునకు దాఁటుచు చెట్లమీఁదనే సంచరించె నని యేర్పడుచున్నది. పలువ-కొందఱు రాక్షసులు తోఁట

కావలి కాచుచున్నట్లు ముందు చెప్పఁబడెను. సీతాదేవి యుండెనా, యామె మేలు కని యుండునే కాని నిద్రించుచుండదు. ఆమె నిమిత్తమై మఱి కొందఱు కావలి కత్తెలు మేలుకని యుందురు. తాను నేల నడచిపోయిన నెవరో వచ్చిరని వారు గుర్తించి కలవరపడుదురు. ఆ నిమిత్తముగఁ జెట్లమీఁదనే సంచరించెను. ఆ కారణ ముచేఁ బక్షులు నిద్ర లేచుట సంభవించెను. నేల నడచిపోయిన నవి మేలుకొనుటకుఁ గాని, యెగిరి పోవుటకుఁగాని కారణ ముండదు.

సీ. నింగికి నెగురు ప•తంగకోటుల యెఱ,కల తాఁకునను జల•జల మటంచు
రాలఁ బూవులు వాని•రాసుల నడుమను, బుష్పమయాద్రినాఁ • బొలిచెఁగపియు
దిక్కు-దిక్కుల నున్న•యక్కు-జంబుల కేగు,కపి వసంతునిఁ గాఁగఁ • గనియె భూత
తతులు భూమీరుహ•పతిత పుష్పాకీర్ణ,వసుధ, భూషితయోష • పగిది వెలిఁగె
తే. గంధవహసుతగమనవే•గప్రకంపి, తావనీరుహపాళి వా•తాత్మజాతు
మీఁద వర్షించెఁ బుష్పముల్ • మేలిమిగను,బుష్పపర్ణఫలావళుల్ •పొనుఁగుపడియె.

అర్థములు. నింగికిన్ = ఆకాశమునకు, పతంగ = పక్షులయొక్క, ఎఱకల = తెక్కలయొక్క, పుష్పమయాద్రి = పూలకొండ, భూమీరుహపతిత = చెట్లనుండి రాలిన, పుష్ప = పూలచే, ఆకీర్ణ=వ్యాపింపఁబడిన, వసుధ=భూమి, భూషితయోష= అలంకరించుకొన్నస్త్రీ, గంధవహసుత = వాయుపుత్రునియొక్క వేగ = వేగముచే, ప్రకంపిత = మిగులఁ గదలింపఁబడిన, అవనీరుహపాళి=చెట్ల సమూహము, వాతాత్మ జాతు మీఁదన్=వాయుపుత్రుని మీఁద, పొనుఁగు పడియె=రాలి పోయెను.

తాత్పర్యము.

హనుమంతుఁ డొక చెట్టునుండి మఱియొక చెట్టునకు దాఁటునప్పుడు కొమ్మలు కదలఁగా నందు నిద్రించు పక్షులు లేచి కలకల కూయుచు నాకాశమునకు నెగురఁగా వాని తెక్కల తాఁకున పూవులు జలజల రాలఁగా వాని నడుమ నున్న హనుమం తుఁడు పూలకొండవలె నుండెను. మఱియు నన్ని ప్రక్కలనుండు చెట్లకై యొక్కొక్క చెట్టునకై పోవు హనుమంతుఁడు వసంతునివలె భూతకోటులకుఁ గానవచ్చెను. చెట్ల నుండి రాలినపూలచే నిండిన భూమి యలంకరించుకొన్న స్త్రీ వలె నుండెను. వాయు పుత్రుని వేగముచేఁ గదలిన చెట్లు హనుమంతునిమీఁదఁ బుష్పవర్షము గురిపించెను. పూలు, పండ్లు, నాకులు రాలిపోయెను. పుష్పవృష్టి అలంకృత స్త్రీ దర్శనము లోనై నవి శుభ శకునములు.

క. రాలిన యాకులతో నిలఁ, దూలిన పూవులను బండ్ల•గుటుములతోఁ బై
చేలలు సొమ్ములు నోడిన, యాలరిజూదరియుఁ బోలె • నమరె నగంబుల్. ౪౦౭

అర్థములు. గుటుములు = సమూహములు, చేలలు = వస్త్రములు ఆలరి = దుష్టుఁడు, ఈ యాలరి శబ్దమే కాఁబోలు నిప్పు డల్లరి యయ్యెను. నగం బుల్ = చెట్లు.

తా త్ప ర్య ము.

రాలిన యాకులతో, నేలరాలిన పూవులతోఁ, బండ్లతోఁ జెట్లు చూచుటకు పైగుడ్డలు సొమ్ములు నొడిన చెకు జాదరివలె నుండెను.

ఆ. శకునినికర మేది • స్కంధమాత్రాశ్రయ,ద్రుపు లసేవ్యము లయి• తోఁచెనపుడు
సకలమిత్రబంధు•సంపరిత్యక్త మా,నవుల పగిది నింపు • మివుల లేక. ౪౦౮

అర్థములు. శకుని నికరము = పక్షిసమూహము, ఏది = లేకుండుటచే, స్కంధమాత్రాశ్రయద్రుపులు = బోదెలు మాత్రము మిగిలిన చెట్లు, ద్రు = చెట్టు, తెనుఁగున = ద్రుపులు.

తా త్ప ర్య ము.

పక్షులన్నియు నెగిరిపోయి బోదెలు మాత్రము మిగిలినచెట్లు బంధువు లందఱు వదలిపెట్టి పోఁగా మిగిలిన మానవునివలె సేవింపరానివై యుండెను.

చ. విరిసిన కేశపాశముల • వీడిన కుంకుమపత్ర రేఖలన్
ఖరనఖరాంకురక్షతయు • గాఢరదక్షతి విహ్వలాత్మయున్
వరపరిపీతశుభ్రరద•నచ్ఛద యౌ జవరాలిఁ బోలె వా
నరవరవాలహస్త చర•ణంబులఁ దద్వని యల్లు రాట్పడెన్. ౪౦౯

అర్థములు. విరిసిన కేశపాశముల = విరియబోసికొనిన వెంట్రుకలచేతను, వీడిన = వదలిపోయిన, కుంకుమపత్ర రేఖలన్ = కుంకుమ రసముతో వ్రాయఁబడిన మకరికా పత్ర రేఖలతోను, ఖరనఖరాంకుర = వాఁడి గోళ్ళ మొనలచేనైన, క్షత = గాయములు గలదియు, గాఢ రదక్షతి=గొప్ప దంతక్షతముచే, విహ్వలాత్మయున్= విరివిరఁబోయిన మనస్సు గలదియు, వర = వరునిచే, పరిపీత = చక్కఁగా ముద్దిడఁబడినది, గనుకనే, శుభ్ర=తెల్లనైన, రదచ్ఛద = పెదవులు గలదియు, జవరాలు= వయసు స్త్రీ, జవ్వని + ఆలు = జవరాలు, జవ్వని శబ్దమునకు ఆలు శబ్దము పరమైనపుడు జవ ఆదేశ మని యెఱుంగునది. 'ఏకాంతమునందునున్న జవరాండ్ర నెపం బీడి' యని మనుచరిత్ర. కర్మధారయ సమాసము గావున 'ఆలు' శబ్దము పరం బవునపుడు రుగాగమంబగు. సు. వ్యా. సంధి ౫౮. వానరవర = వానరశ్రేష్ఠుని యొక్క, వాల హస్త చరణంబులన్ = తోఁకచేతను, చేతులచేతను, కాళ్ళచేతను, అ వని= తోఁట, రాట్పడెన్ = ఉపద్రవ పడెను.

ఇది రతాంత స్త్రీ వర్ణన మని కొంద అభిప్రాయ పడిరి. కాని యిది లంకకు, అశోకవనమునకు రాఁబోవు దుస్థితి సూచించు చున్న దని తోఁచుచున్నది. తల విరియఁబోఁతలు, కుంకుమ పత్రభంగములు తెల్లని పెదవులు దంతనఖాయుధు లగు వానరులచేఁ గలుగు బాధలు, విహ్వలత్వము, ఇవి వన భంగము, లంకా వైధవ్యము సూచించెడి వనుట సముచితము. అస్థానవర్ణనము వాల్మీకి చేయఁడు.

—• హనుమంతుఁ డశోకవనంబున విహరించుట. •—

క. వింజము శిఖరంబుల వృష్టిం జెలఁగెడి యాగడపలఁ • జెదరఁగ ననిలుం
డుం జిమ్మిన వడువునఁ గపి, కుంజరుఁడును జెదరఁ దీఁగ•గుంపులఁ జిమ్మెన్. ౪౧౦

అర్థములు. వింజము = వింధ్యపర్వతము, వృష్టిన్ = వానచే, ఆగడపలన్= మేఘముల గుంపులచే.

తా త్ప ర్య ము.

వింధ్యపర్వత శిఖరంబు లందు వాన గురిసెడి దట్టపు మబ్బులను వాయువు చెదరఁ జిమ్మినట్లు హనుమంతుఁడు తీఁగ గుంపులను జిమ్మెను.

సీ. అమ్మేడ మగరాల • ననువైన భూముల, వెండియుఁ బైఁడియు • వెలయు స్థలుల
మంచినీళ్ళల నింపు • మించిన బావుల, మణిమయసోపాన•మండలముల
మౌక్తికవిద్రుమ•మంజులసికతాసు,కూలముల్ స్ఫాటిక•కుట్టిమములఁ
దీరజకనకమ•హీరుహాన్వితములఁ, బద్మినీకుముదినీ•భాసురములఁ
తే. జక్రచక్రాంగ నత్యూహ•సారసాళి
కూజితంబుల వాహినీ•రాజితముల
నమృతనిభతోయములఁ గుసు•మావృతవ్ర
తతుల నగు నూతులను గనెఁ • దరుచరుండు. ౪౧౧

అర్థములు. మగరాలన్=వజ్రములచే, సికతాసుకూలముల్ = ఇసుక గట్టులు, తీరజ = ఒడ్డునందుఁ బుట్టిన, కనక మహీరుహ = బంగారు వన్నెగల చెట్లచే, అన్వితములన్ = కూడినవానిని, పద్మినీ = తామర తీఁగలచే, కుముదినీ = కలువ తీఁగలచే, భాసురములన్ = ప్రకాశించు వానిని, చక్ర = చక్రవాకములయొక్కయు, చక్రాంగ = హంసలయొక్కయు, నత్యూహ='నత్యూహో జలరంకు స్స్యాత్,' నీటి యుర్రుల యొక్కయు, సారస=బెగ్గురులయొక్కయు, ఆళి = పంక్తులయొక్క, కూజితంబులన్ = ధ్వనులచేతను, వాహినీ = ఏళ్ళచే, రాజితములన్ = ప్రకాశించునవియు, అమృతనిభతోయములన్ = అమృతముతో సమానమైన నీళ్ళను, కుసుమావృత= పూలచే నిండిన, వ్రతతులన్ =తీఁగలను, అగు=కల, నూతులను=బావులను.

తా త్ప ర్య ము.

ఆ చోట వజ్రాలు బంగారు వెండి గల స్థలములను, మంచినీళ్ళ బావులను, వానిలోనికి దిగిపోవుటకుఁ గట్టఁబడిన మణిమయములైన మెట్లను, వానికి ముత్తెములచేఁ బగడములచే నేర్పరుపఁబడిన యిసుక యొడ్డులను, వానికిఁ బ్రక్కనఁ గూర్చుండుట కయి యేర్పఱుపఁబడిన స్ఫటిక ప్రదేశములను, వానియొడ్డునందుఁ బుట్టిన బంగారు వన్నె చెట్లను ఆ బావులయందుఁ గల తామర తీఁగలను, కలువ తీఁగలను, అందుఁ గూయుచున్న హంసలను చక్రవాకములను, నీటియుఱ్ఱులను, బెగ్గురులను, వానిలోనుండి

పాఱు నేఱ్లను, వానియందలి యమృత తుల్యమైన నీళ్లను, చుట్టు నల్లఁబడిన పూల తీఁగలను హనుమంతుఁడు చూచెను.

క. ఆ యాటతోఁటలోపల, వాయుతనూజుండు గాంచె • వరశిఖరవిచి
త్రాయతకూటాగయుతశి,లాయతనం బైన కేళి•కావనిధరమున్. ౪౧౨

అర్థములు. ఆటతోఁట=కేళీవనము, ఉద్యానవనము; వరశిఖరవిచిత్రమును = ఇంపైన శిఖరములచే నలంకరింపఁబడినది, ఆయతకూట=దీర్ఘములైన యిండ్లు గలదియు, అగయుత = చెట్లుగలదియు, శిలాయతనము = రాతిగృహము గల, కేళికావనిధరమున్ = ఆట మలను - క్రీడాపర్వతమును.

తాత్పర్యము.

ఆ యుద్యాన వనము నందు నింపైన శిఖరములు గదులు, చెట్లుగల రాతి యిల్లు గల క్రీడాపర్వతమును హనుమంతుఁడు చూచెను.

సీ. ఆ నగాగ్రమునుండి • యవనికి నరుదెంచు, సెలయేటి నొప్పఁ గాం•చినను నచట,
బతిమీఁదఁ గినిసి యం•కతలంబు డిగి యేగు, కోపనవైఖరి • కొమరు మీఱె
నందు వ్రేలాడు శా•ఖాగ్రంబు లా క్రుద్ధ, వారించు చుట్టాల•పగిదిఁ దోఁచె
ఝురమప్డు వెనుకకు • మరలెడివహి చూడఁ, గినుక చల్లారఁ గాం•తుని గనంగ
తే. మెల్లఁ గ్రమ్మఱి పోయెడి • మెలఁతఁ బోలె
దానికి నలంతి దవ్వునఁ • దతశకుంత
రాజిరాజితకాసార • మోజఁ గాంచె
మారుతసుతుండు భృశహర్ష•మాణుఁ డగుచు. ౪౧౩

అర్థములు. కినిసి = కోపించి, అంకతలంబు = తొడ, కోపన = కోపము గలస్త్రీ, క్రుద్ధన్ = కోపించిన దానిని, ఝురము = ప్రవాహము. వహి = విధము, అలంతి = కొంచెము, తత = విస్తారమైన, శకుంతరాజి = పక్షిసమూహముల చేత, రాజిత = ప్రకాశించు, కాసారము = కొలను, హర్షమాణుఁడు = సంతోషించుచున్నవాఁడు.

తాత్పర్యము.

ఆ పర్వతము మీఁది నుండి క్రిందికి నొక సెలయేఱు పాఱుచుండెను. అది చూచుటకు మగనిపైఁ గోపించి వాని తొడనుండి దిగిపోవు కోపించిన స్త్రీ వలెఁ దోఁచెను. ఆ నది వ్రేలాడు కొమ్మలచే నడ్డగింపఁబడిన నీ క్రైదు రెక్కి-పోవుట చూడఁగా నా నాయిక బంధువులు సమాధాన పెట్టి వారింపఁగా శాంతిపడి మగని యొద్దకుఁ బోవు నట్లుండెను. దాని సమీపమందు విస్తారముగఁ బక్షులు గల కొల నుండెను. దానిని సంతోషముతో హనుమంతుఁడు చూచెను.

క. చిత్రపురతనపుమెట్లు ప,విత్రశిశిరజలము వివిధ•వికిరమృగంబుల్
కృత్రిమవనములు గల పలు,కృత్రిమశిఖికలఁ ద్వాష్ట్ర•కృతసౌధములన్. ౪౧౪

అర్థములు. వికిరమృగంబుల్ = పక్షులు మృగములు, కృత్రిమ దీర్ఘికల = కల్పితము లయిన దిగుడు బావులను, త్వష్టృకృత = విశ్వకర్మచేఁ జేయఁబడిన, సౌధములన్ = మేడలను.

తా త్ప ర్య ము.

రతనపుమెట్లు,నిర్మలమై చల్లనైన నీళ్లు, నానావిధములైన పక్షులు,మృగములు, కల్పితములైన వనములు గల కల్పితములైన దిగుడు బావులు విశ్వకర్మ నిర్మించిన మేడలు.

క. ఫలపుష్పభరితకుజపా,ళులు గొడుగులు పసిడి జగతు•లున్ సోపానం
 బులు గ్రాల నందు వల్లీ,దళ మేదురశింశుపోరు•తరువు నొకండున్. ౪౧౫

అర్థములు. కుజపాళులు = చెట్ల సమూహములు, జగతులు = అరుఁగులు, వల్లీదళ = తీఁగలచేతను, ఆకులచేతను, మేదుర=దట్టమైన, శింశుపా+ఉరుతరువు = పెద్ద యిరుగుడు చెట్టు.

తా త్ప ర్య ము.

ఫలములచేఁ బుష్పములచే నిండిన చెట్లవరుసలు గొడుగులు,బంగారుటరుఁగులు, మెట్లు ప్రకాశింపఁగా నందు హనుమంతుఁ డొక పెద్ద శింశుపావృక్షమును జూచెను.

క. బంగరుటరుఁగు లోలిఁ జె,లంగఁగఁ దనచుట్టు కనువి•లసితము గాఁగన్
 బొంగుచుఁ దనలో వానర, పుంగవుఁ డటఁగాంచె వహ్ని•బోలు తరువులన్.

తా త్ప ర్య ము.

ఆ ప్రదేశమునందు బంగారువన్నెగల యరుఁగులు తమ చుట్టునుండఁగ నెఱ్ఱని పూవులు చిగుళ్లుగల అగ్నివంటి చెట్లను హనుమంతుఁడు సంతోషముతోఁ జూచెను.

ఉ. గుంటల మిట్టలన్ వనులఁ • గ్రొందళుకుం గనకంపుఁ జెట్లు మి
 న్నంటు వెలుంగులొడఁ దన•రారఁ గనుంగొని వీని డాలు మై
 నంటుటఁ బైఁడిగుంటి రుచు • లంటిన వేఁడి వెలుంగు నట్లు నే
 నుంట లభించెఁగా యనుచు • నూహ యొనర్చెఁ గపీంద్రుఁ డాత్మలోన్. ౪౧౭

అర్థములు. గుంటల మిట్టలన్ వనులన్ = దీనికిఁ గ్రియ ౪౧౮వ పద్యములోని కాంచెను అనునది. క్రొందళుకున్ = క్రొత్త+తళుకు = క్రొందళుకు, క్రొత్త కాంతిగల, మిన్నంటు = ఆకాశము దాఁకు, డాలు = కాంతి, మైన్ = దేహమునందు, అంటుటన్ = తగులుటచే, పైఁడిగుంటి = బంగారు కొండ, రుచులు = కాంతులు, వేఁడి వెలుంగు = సూర్యుడు.

తా త్ప ర్య ము.

క్రొత్తమెఱుఁగు గల బంగారు చెట్లు లాకాశము తగులు కాంతులతో నుండుట

చూచి వీని కాంతులు నాపైఁబడుటచే నేను బంగారు కొండ కాంతులు పడిన సూర్యునివలె నుండుట లభించెఁగదా యని హనుమ తలంచెను.

క. అచ్చెరుపడెఁ దనచుట్టును, నచ్చపుటపరంజిచాయ ♦ నమరు కుజంబుల్
హెచ్చుఁగ బంగరుగజ్జెలు, నిచ్చ మొరయు శింశుపావ♦నీరుహవరమున్. ౪౧౮

తా త్ప ర్య ము.

తనచుట్టు బంగారు చాయ గల చెట్లు చుట్టుకొనఁగా బంగారు గజ్జెలు ధ్వనించు శింశుపావృక్షమును జూచి హనుమంతుఁ డాశ్చర్య పడెను.

సీ. సురుచిరకోమలాం♦కురపల్లవంబుల, నవ్యమౌ శింశుపా♦నగము నెక్కి
యిచ్చట నుండి నే ♦ వీక్షింతుఁ గాక శ్రీ,రామదర్శనలోల ♦ రమ్యశీల
నిట నట నలమట ♦ నటమట గొనుబాల, జనకేశ్వరునిపుత్రి ♦ చారుగాత్రి
ధూర్తు రావణు వని ♦ తోరంపుఁజందన, చంపకవకుళవృ♦క్షములచేత
తే. సొంపు నింపెడి పక్షుల ♦ గుంపుచేతఁ
గ్రమతర మైన వరతటా♦కములచేత
నింపు నిండారఁ గూర్చెడి ♦ హృదయమునకు
తన్మారమాథవ యిందు రా♦గలదు నిజము. ౪౧౯

అర్థములు. అంకుర = మొలకలెత్తు, పల్లవంబులన్=చిగుళ్ళచేతను, అలమటన్ = చింతచే, అటమట = దుఃఖము, ధూర్తురావణు వని = దుష్టుఁ డగు రావణు నుద్యానము. ధూర్తశబ్దము వృద్ధాదులలోఁ జేరినది. కావున డుక్ విభాష నగు. సు. వ్యా. తత్సమ. ౨౦ సూ.

తా త్ప ర్య ము.

మిగుల మనోహరములు, మృదువులునై, మొలకలెత్తు చిగుళ్ళచేతను మనోహరమైన శింశుపావృక్షము నెక్కి యిచ్చటనుండి శ్రీరామునిజూడఁ గోరిక గలదియు మంచి స్వభావము గలదియు, చింతచే దుఃఖించు నదియు జనకరాజకూఁతురు మనోహర మగు దేహము గలదియు నగు సీతాదేవిని నేను జూతును గాక. ఏలనః— ధూర్తుఁడైన రావణుని యీ యశోకవనము చందన వృక్షములచేతను సంపెంగ పొగడ వృక్షములచేతను, మనోహరముగఁ గూయు పక్షులచేతను, అందమైన కొలఁకుల చేతను మిగుల సంతోషము గలిగించుచున్నది. కావున సీత యిచ్చటికి రాఁగలదు. ఇది నిజము.

క. ఆరామ రాముదేవెరి, శ్రీరాముఁడు గూర్చు సాధ్వి ♦ శ్రీరాఘవ చిం
తారత మృగలోచన కాం,తారవిహారచణ యిటకుఁ ♦ దప్పక వచ్చున్. ౪౨౦

తా త్ప ర్య ము.

సీతాదేవి యిచ్చటకు వచ్చుట యేమి నిజ మందువా. సుందరియు, రాముని రాణియు, శ్రీరామచంద్రమూర్తి ప్రేమించు పతివ్రతయు, శ్రీరామునే ధ్యానించు నదియు నగు సీత, జింకకన్నులవంటి కన్నులు గలది, వనములయందుఁ దిరుగు నేర్పు గలది, యిచ్చటి కెట్లు రాకుండును ?

క. శ్రీరామశోకతప్తయుఁ, జారువిలోచన యరణ్య • సంచారిణి కాం
తారవిహారాసక్త, మహీరమణీతనయ సత్య • మిట కరుదెంచున్. ౪౨౧

తా త్ప ర్య ము.

శ్రీరామచంద్రుని విడిచి యుండుటచేఁ దపించునది, అందమైన కనులు గలది యడవులందుఁ దిరుగునది, అడవు లందు దిరుగు నాసక్తి గలది, భూదేవి కూఁతురు సత్యముగా నిచ్చటికి వచ్చును.

క. మున్నీ యుద్యానంబున, నున్న వనేచరుల సేమ • మెల్లంబునఁ దా
నెన్నుచు నున్నది సత్యము, సన్నుతరఘురాము దేవి జానకి యిచటన్. ౪౨౨

తా త్ప ర్య ము.

తక్కిన యన్నిటికంటె ముందుగ సీతాదేవి యీ యుద్యానవనమున సంచరించు మృగాదుల సేమమును దాను విచారించుచున్నది. ఇది నిజము కావున నిచటికి వచ్చును;

క. సంధ్యాకాలంబునఁ దా, సంధ్యావందనముఁ జలుపఁ • జనుదెంచును ని
ర్వంధ్యోదక యీనది కడ, కుం ధ్యాన మొనర్చికొనుచుఁ•గూర్మిహృదీశున్. ౪౨౩

అర్థములు. నిర్వంధ్యోదక=ఎడఁదెగని నీరు గలది.

తా త్ప ర్య ము.

సంధ్యావందన మింటికి వెలుపల చెఱువునందో, గుంటయందో, నదియందో వార్చవలయును గావున సంధ్యవార్చుటకై యెడఁదెగక పాఱు నీ నది యొద్దకుఁ దన భర్తను శ్రీరామచంద్రమూర్తిని స్మరించుకొనుచు రాఁగలదు.

పూర్వయుగములందు స్త్రీలకు సంధ్యావందనము ఉపనయనము గలదు. స్త్రీల యుపనయనము గుఱించి వైద్యనాథీయంబున వర్ణాశ్రమాచారకాండమం దీ వాక్యములు గాన నగు.

'స్త్రీణాం వివాహ ఏవ ఉపనయన మిత్యాహ మనుః'

శ్లో॥ వైవాహికో విధిః స్త్రీణా మౌపనాయనికః స్మృతః
పతిసేవా గురౌ వాసో, గృహార్థోగ్ని పరిక్రియా. మను. ౨-౬౭.

వివాహమే స్త్రీల కుపనయనము. పతిసేవయే గురుకులవాసము, గృహ కృత్య నిర్వాహకమే యగ్నిహోత్రము. గనుక వారికి వివాహములే యుపనయనాదులు. ఇది యిప్పటికాలమున విధి. కల్పాంతర విషయమున హారీతుఁడు 'ద్వివిధా స్త్రియో బ్రహ్మ వాదిన్య స్సద్యో వధ్వశ్చ। తత్ర బ్రహ్మవాదినీనా ముపనయన మగ్నీంధనం వేదా ధ్యయనం స్వగృహే భిక్షాచర్యేతి। సద్యోవధూనాం తూపస్థితే వివాహే కథంచి దుపనయనం కృత్వా వివాహః కార్యఇతి తత్కల్పాంతరాభిప్రాయం', స్త్రీలు రెండు విధములు, (౧) బ్రహ్మవాదినులు. (౨) సద్యోవధువులు. అందు బ్రహ్మవాది నుల కుపనయనము, అగ్నీంధనము, వేదాధ్యయనము, స్వగృహమందు భిక్షాచర్య- వీరికి వివాహములేదు. ఇఁక సద్యోవధువులకు వివాహకాలమం దేదో యొక విధముగ నుపనయనము చేసి యావల వివాహము చేయవలయును. ఇది కల్పాంతర వ్యవస్థ. మంగళసూత్రధారణము స్మార్తము గావున నుపవీతములకు బదులు మంగళ సూత్రము లేర్పడినవి.

యమస్మృతి యం దిట్టులే యున్నది. "పురా కల్పే కుమారీణాం మౌంజీ బంధన మిష్యతే। అధ్యాపనంచ వేదానాం, సావిత్రీ వచనం తథా। పితా పితృవ్యో భ్రాతావా నైనా మధ్యాపయే త్పరః। స్వగృహే చైవ కన్యాయా భైక్షచర్యం విధీ యతే, వర్జయే దజినం చీరం జటాధారణ మేవ చ॥

పూర్వకల్పమందుఁ గన్యకలకు మౌంజీబంధనము చెప్పఁబడెను. వేదాధ్య యనము గాయత్రీజపము గలదు, గాని తండ్రి పినతండ్రి, అన్న మాత్రమే యివి చెప్ప వచ్చును గాని పరుఁడు చెప్పరాదు. కన్య తన యింటి యందే భిక్ష మెత్తవలయును. కృష్ణాజినము నారచీరలు ధరింపరాదు. జడలు మాత్రము ధరింపవలెను. ఈ కారణ మునఁ ద్రేతాయుగ మందలి సీతాదేవికి సంధ్యావందనము గలదు.

క. ఆ యంబకు రఘురామునిఁ, ప్రేయసికిన్ రాజవర్యుఁ బ్రియ కనురూపం
బై యమరె సమ్మతం బై, యీ యతులాశోకవనము • హృదయంగమ మై.

తా త్ప ర్య ము.

అటువంటి తల్లికి రఘురాముని ప్రియురాలికి రాజవర్యుఁ డగు రామునందుఁ బ్రీతిగలదానికి నీ యసమానమైన యశోకవనము తగి యున్నది. కావున నిందు సీత యుండఁ గలదు.

క. జీవిత యేనియు రాముని, దేవియుఁ దా నిందు వసుగు•రెంచుట నిజ మం
చీ విధిఁ దలఁచుచుఁ బావని, యావృక్షంబునను డాఁగి • యటు నిటు గనుచున్.

తా త్ప ర్య ము.

సీతాదేవి ప్రాణములతోనే యుండెనా యిచ్చటికి వచ్చుట నిజము, అని యీ విధి నాలోచించును. ఆ చెట్టునందు డాఁగి యీ ప్రక్క నా ప్రక్క చూచెను.

—• ౧౫వ సర్గము. హనుమంతుఁ డశోకవనంబున సీతాదేవిని వెదకుట. •—

సీ. సంతానకలతోరు•సంతానములచేత, రాజిత భూరుహ•రాజిచేత
దివ్యగంధరసాఢ్య•శుభాకృతులచేత, నందనతుల్య సుం•దరతచేత
సలలితమృగపక్షి•కులచయంబులచేతఁ, బ్రాసాదహర్మ్యాగ్ర•పాళిచేతఁ
గోకిలాలాపన•కోలాహలముచేతఁ, గనకాంబుజోత్పల•గణముచేతఁ
తే. బలువిధంబులు మేలికం•బళులచేత, నతులితవిశాలభూమిగృ•హాళిచేత
సర్వఋతుపుష్పఫలగభూ•జములచేత, మీఱెడు నశోకవనిని సా•మీరి గనియె.

అర్థములు. సంతానకలతా = తీఁగలుగా నున్న కల్పవృక్షములయొక్క, ఉరు సంతానములచేత = గొప్ప సమూహముచే, రాజిత = ప్రకాశించు, భూరుహ రాజిచేత = చెట్ల సమూహముచే, దివ్య = దేవలోక సంబంధమైన, గంధ = సువాసనగల, రస = పండ్లరసముచే, ఆఢ్య = నిండినదియు; శుభాకృతులచేతన్ = శుభకరములయిన యాకారములచే, నందనతుల్య=ఇంద్రు నుద్యాన వనమగు నందనముతో సమానమైన, సుందరతచేతన్ = అందముచే, సలలిత = అందముగల, మృగపక్షికుల చయంబులచేతన్ = మృగములయు, పక్షులయు జాతుల సమూహములచే, ప్రాసాద హర్మ్యాగ్రపాళిచేత = రాజులయు, ధనికులయు, శ్రేష్ఠములయిన యిండ్లచేత, కోకిలాలాపన కోలాహలముల చేత = కోకిలధ్వనుల సందడిచే, కనకాంబుజోత్పలగణముచేతన్ = బంగారు కమలములచేత, కలువల సమూహముచేత, సామీరి = హనుమంతుఁడు.

తాత్పర్యము.

శింశుపా వృక్షముపైనుండి చూడఁగాఁ గనఁబడిన యశోకవన మున్న విధము చెప్పుచున్నాఁడు.

తీఁగలుగా నున్న కల్పవృక్షములతోను, ప్రకాశించు చెట్లచేతను, దేవలోక సంబంధమైన పరిమళము గల ఫలరసముతోఁగూడి శుభాకారములైన వానితోను నందనవనమువంటి సౌందర్యముతోను అందములైన మృగపక్షిజాతులతోను మంచి మిద్దెలు మేడలతోను, కోకిలల కూఁతల సందడితోను బంగారు కమలములతోను కలువలతోను నానావిధములైన గొప్పకంబళ్ళతోను అసమానమై విశాలములైన నేలమాళిగల చేతను అన్ని ఋతువులందు పూచు కాచు చెట్లచేతను, నతిశయించు నశోకవనమును హనుమంతుఁడు చూచెను.

క. ఫుల్లాశోకవ్రతతులఁ, బెల్లగు నెఱపూలు మించె • వేకువప్రొద్దు
న్నొల్లపుంగాంతుల నగుచుం, గొల్లగ నెఱమంటఁ జిక్కి • కొనియె ననంగన్. ౪౨౭

అర్థములు. ఫుల్లాశోకప్రతతులన్ = వికసించిన యశోకవృక్షసమూహముల చేతను, ఉత్ప్రేక్షాలంకారము.

తా త్ప ర్య ము.

వికసించిన యశోకవృక్షముల యధికమైన మెఱ్ఱకాంతి ఉదయవేళ సూర్యుని కాంతులను బోలి పెద్దమంటలోఁ జిక్కుకొన్నదో యున్నట్లుండెను.

ఉ. రాలెడు పూలు సొమ్ములవఁ • గ్రాల శిరంబుల నన్ని యొక్కచో
కాలమునందుఁ బక్షు లెఱ•కల్ నెఱవిచ్చికొనం దదీయ ప
త్రాళివిలీనపుష్పదళ • మై ద్రుమపాళి విహీనపత్రశా
ఖాళియుతంబు నట్లు గన•నయ్యె మరుత్సుతు కన్ను దోయికిన్. ౪౨౮

తా త్ప ర్య ము.

పూవులు పక్షుల శిరంబులం దొక్కసారిగ రాలఁగా నా పక్షులు వానిని బోఁగొట్టుకొన రెక్కలు విచ్చగా ఆ తెక్కల సందున డాఁగిన పూలు నాకులు గలవై చెట్లు ఆకులుపూలు లేనివానివలె హనుమంతునకుఁ గన్నులకుఁ గానవచ్చెను.

క. ఆమూలపుష్పనిచితం, బై, మంజులరంబు నయి వ్య•థాపహ మగుచున్
శ్రీమత్కుసుమభరంబున, భూమిని సోకెను నశోక•భూరుహశాఖల్. ౪౨౯

అర్థములు. ఆమూల = మొదలువఱకు, అవ్యయీభావసమాసము. పుష్ప నిచితంబై = పూలతో నిండినదై, వ్యథాపహము = వెత పోఁగొట్టునది, శ్రీమత్కుసుమభరంబునన్ = శోభకల పూవుల యాధిక్యముచే.

తా త్ప ర్య ము.

వేళ్ళవఱకుఁ బూచినవై ఆ కారణముచే మిగుల నందమై ఆ కారణముచే చూచువారి మనస్సులోని సంతాపము పోఁగొట్టునవియై కాంతిగల పూల బరువుచే అశోకవృక్షముల కొమ్మలు నేల తాఁకుచుండెను.

చ. కుసుమితకర్ణికారములుఁ • గ్రొన్ననలం గల కింశుకంబులున్
బసగల సప్తపర్ణములు • బాగగుపొన్నలుఁ జంపకంబులున్
పసి గల శాతకుంభనిభ•చారునగంబులుఁ గొన్ని కొన్ని య
గ్గిసిగలఁ బోలు చెట్టులను • గేసరిసూనుఁడు చూచె నయ్యెడన్. ౪౩౦

అర్థములు. కుసుమిత = పూచిన, ఇది తారకాదిగణములలోఁ జేరినది. 'సంజాతాని కుసుమా న్యేష్వితి కుసుమితాః' అని వ్యుత్పత్తి. ఇతచ్ప్రత్యయాంతము. కర్ణికారములు = కొండగోఁగులు, కింశుకములు = మోదుగులు, సప్త పర్ణములు = ఏడాకుల యరఁటిచెట్లు, శాతకుంభనిభ = బంగారుతో సమానమైన, చారునగంబులు=మనోహరములైన చెట్లు, అగ్గిసిగలన్ =అగ్ని శిఖలను.

తా త్ప ర్య ము.

పూచిన గోఁగులను క్రొత్తపూలుగల మోదుగులను, సారవంతము లయిన యేడాకుల యరఁటులను, పొన్నలను, సంపెఁగలను, బంగారు కాంతిగల చెట్లను, అగ్నిజ్వాలలవలె నెఱ్ఱనైన కొన్ని చెట్టులను నాంజనేయుఁ డంతఁ జూచెను.

సీ. కాంచనాలునఁ • గ్రాలు చెట్టులు కొన్ని, వేవేలుగ నశోక•వృక్షములును
సపురొప్ప నందన • చైత్రరథంబుల, నతికరించిన కాంతి • నంద మగుచు
వాక్కున కందని•ప్రాప్తరూపం బయి, కుసుమతారావళిఁ • గొమరు గనుట
రెండవయూకాశ•మండలం బనఁ బుష్పమణుల నేనవ పెను•మడుఁ గనంగ

తే. సర్వఋతుఫలనిచిత మై • చారుగంధి, పాదపంబులఁ దనరారి • బహుమృగాళి
కలితమగుచును రెండవ•గంధమాద,నాద్రియనఁ బుణ్యగంధ మై • యమరుదాని.

అర్థములు. అతికరించిన = అధఃకరించిన, తక్కువగాఁ జేసిన, ప్రాప్త రూపంబయి = సౌందర్యము గలిగి, 'ప్రాప్తరూప సురూపాభిరూపాః పండిత సౌమ్యయోః' నానా॥ ర॥ కుసుమతారావళి = పూ లనెడి నక్షత్రసమూహములు = పుష్పమణులన్ = పూలనెడి రత్నములచే, ఏనవ పెనుమడుఁగు = ఐదవ రత్నాకరము, సముద్రము అనునట్లు, సర్వఋతుఫలనిచితమై = అన్నిఋతువుల యందుఁ బండు పండ్లు గలదై, చారుగంధి = కమ్మనివాసన గల, పాదపంబులన్ = చెట్లచే.

తా త్ప ర్య ము.

వన్నని కాంతిగల వేవేలశోకవృక్షములును, ఇంద్రు నుద్యాన మగు నందనము, కుబేరుని యుద్యాన మగు చైత్రరథమును మించిన సౌందర్యమును, వాక్కుచే వర్ణింప సాధ్యముగాని సురూపము గలిగి, పూ లనెడి నక్షత్రములను గల దగుటచే రెండవ యూకాశమో యనునట్లును పూలనెడి రత్నములచే నిండియుండుటచే నైదవ రత్నాకరమో యనునట్లును నొప్పి, యన్ని ఋతువు లందు ఫలించు ఫలములతో నిండి, సువాసన గల చెట్టు లనేకములయిన జింకలు లోనగు మృగములు గలదై రెండవ గంధమాదన పర్వతము వలె మంచి వాసనలఁ గలదానిని.

తే. ఆ యశోకవనంబు వా•తాత్మజుండు, చూచి నడుమను గైలాస • శుద్ధమగుచుఁ
బగడపు న్మెట్లు తప్తసు•వర్ణవేది,కలును వెలయఁగ లక్ష్మీప్రకాశ మొనరె. ౪౩.

తా త్ప ర్య ము.

అటువంటి యశోకవనమును హనుమంతుఁడు చూచి, దాని నడుమఁ గైలాస పర్వతమువలెఁ దెల్లనై, నిర్మలమై పగడాల మెట్లు, బంగారు టరుఁగులు గలిగి లక్ష్మీదేవివలెఁ బ్రకాశము గలదై.

సీతాదేవి యందుండుటచే లక్ష్మీప్రకాశము చెప్పఁబడెను.

ఈయశోక వనము నేటికి నున్నదని చూచిన వారు వ్రాసిన వాక్యము లిది వఱకే యనువదింపఁ బడినవి.

క. మి న్నొరయుచు రమ్యం బై, కన్నులకును మేలి విందు • ఘటియించుచు సం
పన్న స్తంభసహస్రము, చెన్నారెడు నొక్క మేడఁ • జేరువఁ గాంచెన్. ౪౩౩

అర్థములు. మిన్ను + ఒరయుచు = ఆకాశముతో రాచుకొనుచు, స్తంభసహస్రము = వేయి స్తంభములు.

తాత్పర్యము.

ఆకాశ మంటుచు రమ్యమై కన్నుల పండుగై వేయి స్తంభములు గల యొక మేడను సమీపమందే చూచెను.

—• హనుమంతుఁడు సీతాదేవిని జూచుట •—

ఉ. మాసిన చీరతోడ, ధృతి • మాలిన చిత్తముతోడ, వింతయేన్
గ్రాసము లేమిఁ జిక్కిన సు • కాయముతోఁ, బయి పై నిగుడ్చు ని
శ్వాసచయంబుతో; గుఱుతు • పట్టఁగరాని స్వరూపకాంతితో,
గాసి నొసంగు రాత్రిచర • కాంతలచేఁ బరివేష్టమాన యై. ౪౩౪

తాత్పర్యము.

మాసిన చీరతో, ధైర్యము చెడిన మనస్సుతో, కొంచె మైన నాహారము లేకుండుటచే శుష్కించిన దేహముతో, మీఁద మీఁద వెలువరించు నిట్టూర్పులతో నీమె సీత యని గుర్తింపరాని దేహకాంతితో, బాధపెట్టుచున్న రాక్షస స్త్రీలతోఁ జుట్టఁబడినదై.

ఆహారము కొంచెమైన లేదనుటచే కిష్కింధాకాండ మందు ఇంద్రుఁడు పాయస మిచ్చె నను కథ కల్పితము.

ఉ. క్రొన్నెలవోలె నున్న యొక • కోమలగాత్రిని, హోమధూమసం
ఛన్నహుతాశనార్చి గతి • జానతి యుండెడిదాని, నైజమా
యున్నతిరూప మంచు మది • నెంతో విచారముఁ జేసి కాని లో
నెన్నఁగరాని దానిని, న • హీనతరవ్యథితాత్మ, సుందరిన్. ౪౩౫

అర్థములు. క్రొన్నెల = క్రొత్తచంద్రుఁడు, హోమధూమ = హోమము పొగచే, సంఛన్న = కప్పఁబడిన, హుతాశనార్చిగతిన్ = అగ్నిశిఖవలె, జానతి = అందముచెడి, నైజము = స్వభావసిద్ధము, అహీనతర = మిగుల నధికమైన, వ్యథితాత్మన్ = బాధపడు మనస్సు గలదానిని.

తాత్పర్యము.

క్రొత్తచంద్రుని వలెఁ గోమలమైన దేహముగలదానిని, ఇట్లు చెప్పుటచే నిది మొదలుకొని కాంతి హెచ్చునని భావము. హోమధూమముచేఁ గప్పఁబడిన యగ్ని శిఖవలె నందము చెడినదానిని, వెలుపలికిఁ దెలియ రాకున్నను లోపల నంతఃకరణము శుద్ధముగా నున్న దని భావము. ఈమె కీ రూపము స్వభావమున వచ్చినదా లేక, కారణాంతరమున వచ్చినదా యని మిక్కిలి యాలోచించిగాని తీర్మానింప రాని దానిని, మిక్కిలి బాధపడుచున్న దానిని, సుందరిని.

ఉ. ధూళిని గ్రుంగియున్న మెయి • తోఁ గమలంబులు లేని కొల్కు నా
శ్రీశ నలంకృతిం దొఱఁగి • పీతరుచిం గల యొంటిచీరతో
వాలిన దుఃఖభారమున • వాడి తపస్విని యై కుజగ్రహం
బోలిని బట్టుకొన్న చెలు • వూడిన రోహిణి నాఁగ నొప్పుచున్. ౪౩౭

తాత్పర్యము.

పదినెలలుగా స్నానము లేక దుమ్ములో మునిఁగిన దేహముతోఁ గమలములు లేని కొలనువలె సిగ్గుచే నలంకారమును విడిచి పచ్చని యొంటి చీరతో నతిశయించిన దుఃఖాతిశయముచే వాడి శుష్కించి యంగారకుఁడు పట్టుకొనుటచేఁ గాంతిచెడిన రోహిణి వలెనై.

ఓయి! పదినెలలుగా స్నానములే దంటివే. స్నానము చేయక సంధ్యావారువ రాదుగదా. ఎట్లు చేసెను? ఇది యాపద్ధర్మము. ఆతురవిధి యామెకు నన్వయించును. స్నానముచేసినచో రెండవ చీర లే దామె. తడి చీరతో సంధ్యావారువరా దామె. దేహముమీఁదనే చీర యుపపూఁట నాఱు టెప్పుడు? సంధ్యవార్చు టెప్పుడు? కావున మానసిక - మాంత్రికస్నానములు చేసె నని యెఱుఁగ నగు.

సీ. కాలువలై పాఱు • కన్నీళ్లు మొగ మెల్ల, నావరింపఁగఁ గడు • నడలుదానిఁ
దలపోఁతలకుఁ జిక్కి • తతశోకమున స్రుక్కి, యెప్పుడు వెకివెక్కి • యేడ్చుదానిఁ
దనవారి మొగములఁ గనలేక రక్కసి, పింజుమోములు చూచి • బెగడుదాని
వేటకుక్కలలోన • వేర్పడి చిక్కిన, యాఁడుజింక నఁగ న • ల్లాడుదాని

తే. వల్లఁ ద్రాఁ చన దిగి జఘ • నంబు నొరయు, నొంటిజడతో శరస్తున • నుదయవేళఁ
గాఱుటడవుల నొప్పారు తమ్మితలంబుఁ, బోని దానిని నెఱమాపు • మేనిదాని. ౪౩౮

తాత్పర్యము.

మొగమెల్ల నావరించు నట్లు కాలువలుగాఁ గన్నీళ్ళు కార్చుదానిని, ఆలోచనలకు వశపడి మిక్కిలి దుఃఖమున శోషించి యెప్పుడు వెక్కివెక్కి ఏడ్చుచుండుదానిని, తన బంధువుల ముఖములు చూడఁజాలక రాక్షసస్త్రీ సమూహములు చూచుచుండు

దానిని, ఒంటిగా వేఁటకుక్కలలోఁ జిక్కిన యాఁడుజింకవలె నల్లాడుదానిని, నల్లని త్రాచుపామువలె వ్రేలాడి నడుము నంటుచున్న యొంటి జడతో శరత్కాలము నుదయంబున కా అడవు లందలి భూమిని బోలుదానిని, స్నానము లేమిచేఁ బూర్ణముగ మాసిన దేహముగల దానిని.

క. వ్యసన మెఱుంగనిదానిని, వ్యసనంబున మాఁడుదానిఁ • బరమసుఖార్హన్
బస దొఱఁగి ధ్యానపరయై, వసివాడినదాని దీన • వనజదళాక్షిన్. ౪౩౮

తాత్పర్యము.

ఇంతవరకు వ్యసన మెట్టిదో తెలియని దానిని ఇప్పుడు తీవ్రవ్యసనముచే మాఁడిపోవుచున్నదానిని, మిగుల సుఖమునకు యోగ్య మగు దానిని, పసచెడి చింతలకుఁ జిక్కి మిగుల వాడి దుఃఖించు స్త్రీని,

—• హనుమంతుఁడు సీతాదేవిని జూచి తనలో వితర్కించుకొనుట. •—

క. కని యీ కృశమలినాంగియె, ఘనుఁ డగు జనకుని తనూజ • గాఁబోలు నోకో
యని యీ కారణముల నా,హనుమ వితర్కింపఁ దొడఁగె • స్వాంతమునందున్.

తాత్పర్యము.

హనుమంతుఁడు చూచి యీ యాహారము లేక శుష్కించి పదినెలలుగా స్నానము లేమిని మాసిన దేహము గలది సీతగా నుండునా? యని యీ కారణములచే నాలోచింపసాగెను.

క. ఏ రూపముఁ గల సుందరి, నా రావణుఁ డపహరించి • యరుగుచు నుండన్
వారక కంటిమొ యూనాఁ, డా రూపము యీమెయందు • నయ్యెం గనఁగన్. ౪౪౦

తాత్పర్యము.

ఈమె సీతాదేవియే యని నిశ్చయించుటకుఁ దగినకారణములఁ జెప్పుచున్నాఁడు. మొదటిది ప్రత్యభిజ్ఞ. మొదటఁ జూచిన జ్ఞప్తితో మరలఁ జూచి సరిపోల్చుట ప్రత్యభిజ్ఞ.

౧. ఆనాఁడు ఋశ్యమూకమం దుండి మేము రావణుఁ డపహరించుకొని పోవుచున్న సుందరి రూపము చూచితిమి గదా. ఆ రూపమే యీమె యందుఁ గానవచ్చుచున్నది.

సీ. నిండుఁజందురుఁబోలు • నెమ్మోముఁ గలదానిఁ, సొలుపులీనెడి కను•బొమలదాని
లలివృత్తయౌవన•లక్షణంబుల దాని, నిడుద లౌ నీలంపు•నెఱులదాని
నిరుల గ్రమింగెడికాంతి • నెసఁగుచుండెడిదాని, బింబంబు డం బగు • పెదవిదాని
సింహమధ్యంబు హా•సించుమధ్యముదాని, నొప్పుఁదీర్చిన పాద•యుగముదానిఁ

తే. దోయజంబులఁ దోలు క • న్దోయిదానిఁ, బుష్పబాణుని యలివేణి • బోలుదానిఁ
నిండు నెలడాలునాఁగను • నిఖిలజగతి, కనుపమానేష్ట యగుచును • జనెను దాని.

అర్థములు. యౌవన లక్షణంబులు = స్తనములు. 'లావణ్యేచ స్తనే చ స్యా త్స్త్రీ-బే యౌవన లక్షణం॥ నానా॥ర॥ పుష్పబాణుని యలివేణి=రతీదేవి. నెలడాలు= చంద్రకాంతి, అనుపమాన + ఇష్ట = అసమానమైన ప్రీతిగలది. లోకమున నామె యందప్రియము గలవారు లేరని భావము.

తాత్పర్యము.

పూర్ణచంద్రుని వంటి ముఖము, అందములైన కనుబొమలు, వట్రువ లగు స్తనములు, నిడుపాటు నల్లని తల వెంట్రుకలు, చీఁకటిని హరించు దేహకాంతి,దొండ పండువంటి పెదవులు, సింహము నడుమువంటి సన్నని నడుము, తీర్చి నట్లుండు పాదములు, తామరలవంటి కన్నులు గలిగి రతీదేవివలె సుందరమై నిండు చంద్రుని వలె సర్వజనులకు నభీష్టమై యుండుదానిని.

అవివేకు లందును రామచంద్రునిఁ దప్పు పట్టెడువారు గలరుగాని సీతాదేవిని దప్పుపట్టువారు లేరు.

ఉ. తాపసిఁబోనిదాని, వసు • ధం బడియుండెడిదాని, నూరుపుల్
పై పయిఁ బాఁపలేమ యనఁ • బర్వఁగఁజేసెడిదాని, ధూమమా
లాపరితాగ్ని నాఁగ విపు • లవ్యథ సొంపటి యుండుదాని, మి
థ్యాపరిభూతకీర్తి నిహ • తం బగు నాశను బోలు తొయ్యలిన్. ౪౪౨

అర్థములు. తాపసిఁ బోనిదాని = తపస్సుచేయుచుండుదానివలె నుండు దానిని, పాఁపలేమ = ఆఁడు పాము, సమాసంబుల నొప విభక్తికంబుల దీర్ఘ పూర్వకద్విత్వ మువర్ణంబులకు ఖండపూర్వబిందుపూర్వకంబుగను లఘుపూర్వక మువర్ణంబునకుఁ గేవలమును పవర్ణం బగు. పాము+లేమ = పాఁపలేమ. వేము + చెట్టు = వేఁపచెట్టు. మొ॥ ధూమమాలా = పొగగుంపుచే, పరితాగ్ని = సర్వతః కప్పఁబడిన యగ్ని, మిథ్యాపరిభూతకీర్తి = అసత్యపు టపవాదముచేఁ జెఱుపఁబడిన కీర్తి, తొయ్యలిన్ = స్త్రీని. ఇది మొదలు కులకము.

తాత్పర్యము.

తపస్సు చేసికొను దానివలె, తివాచీలు చాపలు లేక నేలఁబడి యుండుదానిని, ఆఁడుపాము బుసకొట్టు నట్లు మీఁద మీఁద నిట్టూర్పులు విడుచుదానిని, పొగ గ్రమ్ముటచేఁ దెలియరాని యగ్నివలె విస్తారతాపముచే సొంపుచెడి యుండుదానిని, అసత్యమైన యపకీర్తిచేఁ జెడిన యాశవంటి దానిని, నొకస్త్రీని.

తపస్సుచేసికొను స్త్రీ యనుటచే యమ సంపత్తి జితేంద్రియత్వము భోగవిరా

గము, తపశ్శక్తియు, బుసకొట్టు నాఁడుపామనుటచే, కోపించిన పామును జెనకు వాఁడెట్లు జీవింపఁడో యట్లామెను జెనకువాఁడు జీవింపఁజాలఁడనియు, ధూమమాలా పరీతాగ్ని యనుటచే సైన కాంతి కానరాకున్నను మనస్సగ్నివలె పరిశుద్ధమై యున్న దనియు మిథ్యాపవాదముచేఁ జెడిన కీర్తియనుటచే నీమెయందు నింద యారోపించువా రసత్యవాదు లని సూచన—

ఆ. కుదుటఁ బడని శ్రద్ధ•మదికి సందిగ్ధమౌ, స్మృతియు, క్షీణమైన•సిరియుఁ గలుష
యుక్తమైన బుద్ధి, •యుపహతిఁ గూడిన, కార్యసిద్ధి నాఁగఁ •గ్రాలుదాని. ౪౪౩

అర్థములు. కుదుటఁబడని శ్రద్ధ = స్థిరపడని శాస్త్రవిశ్వాసము, శాస్త్రమందుఁ జెప్పిన యీ పని చేసిన నీ ఫలము గలుగు నను నమ్మకమునకు శ్రద్ధ యని పేరు. అట్టి శ్రద్ధ దృఢముగాఁ గుదురదేని శాస్త్రప్రతీకారము చేయుదమా, వలదా; ఫలము వచ్చునో, రాదో యనుకొనుట. హనుమంతుని విషయమున నిట్లే. మునుపు నేను జూచిన స్త్రీవలెనే యున్నది. అయినను ఆమె యౌనో కాదో. ఒక స్త్రీవంటిది మఱియొకతె లోకమున నుండరాదా ? యని సందేహము. సందిగ్ధమౌ స్మృతి = మనుస్మృతి లోనగువాని యందలి వాక్యముల కు అది సరియైన అర్థమా, యిది సరియైన యర్థమా యని సందేహించుట. ఇదియు హనుమంతుని సందేహమునే తెలుపుచున్నది. అనఁగా సీతాదేవి స్థితి యట్లున్న దని యెఱుఁగవలయు. క్షీణమైన సిరి = క్షయించిన సంపద, ఒకఁ డైశ్వర్యయుక్తుఁడై యున్నప్పటి వేషము దరిద్రుఁడైనప్పు డుండదు. అప్పుడు చూచినవా డిప్పుడు చూచినచో వేషము మాఱుటచే వాఁడు వీఁ డగునా కాదా యని సందేహముతోఁచును. కలుష యుక్తమైన బుద్ధి= బుద్ధి నిష్కల్మషమై యుండినచే నిశ్చయజ్ఞానము తోఁచును. కల్మషముతోఁ గూడినప్పుడు యథార్థ జ్ఞానము కలుగదు. సందేహమే తోఁచును. ఉపహతిఁగూడిన కార్యసిద్ధి = విఘ్నముచేఁ జెడిన కార్యఫలము. ఒక కార్యము చక్కఁగాఁ జేసిన ఫలహాని లేదు. అది విఘ్నమై పోయిన నా కార్యము చేసినవాని కా ఫలము ప్రాప్తించదు. అట్టులే సీత సీతాత్వమున కే హానియులేదు. ఆమె సీత యని తెలిసికొనలేని లోప మా మూఢునిదే. ఆత్మావలోకన మగుటకు ముందు నాత్మజ్యోతివలె వెలుగుచు హనుమంతునకు మందోదరివలెఁ గానవచ్చును. దానికి భ్రమపడరాదు. అదియే యాత్మ యనుకొని సంతోషించువాఁడు భ్రష్టుఁడే కావున నాచార్యుఁడు శాస్త్రములు చెప్పిన గుఱుతులచే స్వబుద్ధి బలముచేఁ దర్కించి యూహించి నిశ్చయించుకొనవలెను.

తాత్పర్యము.

స్థిరపడని శ్రద్ధ, సందేహము కలిగించు స్మృతి వాక్యము, క్షయించిన సంపద, కల్మషముతోఁ గూడిన బుద్ధి, విఘ్నమైన కార్యఫలము వలె నుండుదానిని.

సీ. కౌసలేయునిఁ జూడ ♦ గానక తపియించి, యసురచేతఁ జిక్కి ♦ యడలుదాని
వచ్చునా నా ప్రియ♦వల్లభుం డంచును, నలుదెస లరికించి ♦ తలఁచుదానిఁ
బొదలుచు నొంటి మై ♦ బెదరి చూచెడిలేడి, కన్నె కన్నులఁబోలు ♦ కనులదానిఁ
గాలువలై పాఱు ♦ కన్నీటివఱదతోఁ, బుల్కు పుల్కను గను♦పొలుపుదాని

తే. వాడువాఱిన మోమున ♦ వగచుదాని, వేడినిట్టూర్పు లైపయి ♦ విడుచుదాని
ధూళి గ్రుంగిన మేనను ♦ దూలుదాని, విన్న దనమున మలమల ♦ వేఁగుదాని.

అర్థములు. కౌసలేయుఁడు = కౌసల్యాకుమారుఁడు, పొలుపు = అందము.

తా త్ప ర్య ము.

శ్రీరామచంద్రుని జూడఁ జాలమిని తపించి రావణాసురునిచేతఁ జిక్కి వ్యసన పడు దానిని, నా భర్త వచ్చునా యని నాలుగు దిక్కులు చూచుదానిని, ఒంటరిగాఁ జిక్కి బెదరుచుఁ జూచుచున్న యాఁడులేడి కన్నులవంటి కన్నులు గలదానిని, కాలువలుగాఁ గన్నీరు పాఱుచుండఁగా తెప్పల మీఁద మీఁద మూయుచుఁ దెఱచుచుఁ జూచుచుండు దానిని, వాడిపోయిన ముఖముతో దుఃఖించుదానిని, వేఁడి నిట్టూర్పులు మీఁద మీఁద విడుచు దానిని, దుమ్ములో మునిఁగిన దేహముగల దానిని, శోకముచే మలమలమాఁడుచుండు దానిని.

సీ. ఉత్తమాలంక్రియా♦యోగ్య యయ్యును మేన, మండనంబులు లేక♦యుండుదాని
గాఱుమబ్బుమఱుంగుఁ ♦ గనిన చుక్కలఱేని, వడువున మాసిన ♦ ప్రభలదాని
నభ్యాస మెడలుట ♦ నాత్మ విస్మృతి గన్న, చదివిన చదువు నాఁ ♦ బొదలుదాని
విగతసంస్కారమై ♦ వే ఱర్థ మొసఁగెడి, పదము నా వికట మై ♦ పరఁగుదాని

ఆ. నగున్కొ కాదొ సీత ♦ యనుచు శంకించుచుఁ, గలఁగి చూచి చూచి♦కష్టమునను
గారణంబు లెల్లఁ ♦ గలయునాలోచించి, నెలఁత సీత యనుచు♦నిశ్చయించె.౪౦

అర్థములు. ఉత్తమాలంక్రియా యోగ్య = శ్రేష్ఠమైన యలంకారమునకు నర్హురాలు, మండనంబులు = ఆభరణములు, విస్మృతి = మఱపు, విగత సంస్కారమై = వ్యాకరణ ప్రకారము శుద్ధముగాక గ్రామ్యమై, వికటమై = వికారమై.

తా త్ప ర్య ము.

శ్రేష్ఠమైన యలంకారమునకు నర్హురాలయ్యును నాభరణములు లేక యుండు దానిని, వానమబ్బు చాటున నుండు చంద్రుని వలె ప్రభ మాసినదానిని (చంద్రుని ప్రభ మాయలేదు. చూచువారికి కా ప్రభ యను భావము లేదు. అట్లులే యిచ్చట) అలవాటు తప్పిపోవుటచే మఱపు దగిలిన చదువు వంటి దానిని (కష్టముపై మరల స్మృతికిఁ దేఁదగిన దానిని) వ్యాకరణ శుద్ధము గాకుండుటచే మఱియొక యర్థ మిచ్చెడి మాటవలె విరుద్ధముగ నుండుదానిని, హనుమంతుఁడు చూచి

యీామె సీత యగునో, కాదో రావణాసురుఁడు బలాత్కారముగఁ దెచ్చి యిక్కడుంచెనో యని బాధించుచున్నాఁడు. వారిలో నెవతెయో యేమో యని సందేహించి సందేహించి చూచి చూచి యీామె సీతయే యనుటకుఁ గారణముల నాలోచించి తుద కీమె సీతాదేవియేయని నిశ్చయించెను. ఆకారణము లీ క్రింద పద్యముల వివరింపఁబడును.

—• హనుమ తాను జూచినస్త్రీ సీతాదేవి యని నిశ్చయించుకొనుట. •—

క. జానకి సొమ్ము లటంచును, మానవవిభుఁ డెవి పలికె • మా కవి మెల్లన్
గానఁగ నయ్యెడిఁ గుజశా, ఖానికరములందు వ్రేలి • కలికికి నటుతన్. ౪౪౬

తా త్ప ర్య ము

తొలుత రావణాసురుఁ డెత్తికొని పోవుచుండఁ దాము చూచిన స్త్రీవలె నీమె యున్నది కావున సీతయై యుండునని తలఁచి, యొకతెను బోలి మఱి యొకతె యుండవచ్చును, కావున నది నిశ్చయింపఁ జాలునంత ప్రమాణము కాఁజాలదని తర్కించి యితర ప్రమాణములచే నిశ్చయించుచున్నాఁడు. దీనివలనఁ గేవల ప్రత్యక్ష ప్రమాణము ప్రమాణము గాదని యేర్పడు చున్నది. రామచంద్రమూర్తి యివి జానకి సొమ్ము లని నేనిని మాకుఁ జూపెనో యవి యన్నియు నీమె సమీపమునఁ జెట్ల కొమ్మలందు వ్రేలాడు చున్నవి.

సీతాదేవి యాభరణములు కపులముందటఁ బాఱవైచినపు డొక పక్కవి మాత్రమే తీసి మూటగట్టి వైచెను. ఇచ్చట రెండవ ప్రక్కవి తీసి కొమ్మలకుఁ దగిలించినవి. ఎవరైనఁ దన్ను వెదకుచు వచ్చిన యెడల వారు వీనిని బట్టి తన్ను గుర్తింతురుగాక యని యీామె యభిప్రాయము. ఈమె సీతయే యనుట కిది రెండవ కారణము. దీనినే వివరించు చున్నాఁడు. ప్రత్యక్షమును ననుమానప్రమాణముచే బలపఱచు చున్నాఁడు ?

ఉ. చక్కని చేతకమ్మలును • జావగు మేల్ బొగడల్ సుకాంతిఁ జెం
పెక్కిన రత్నవిద్రుమమ•హిష్ఠవిభాకరభూషణంబులున్
మక్కియు నల్లపాతియును • మానక పెక్కుదినాలు దాల్చుటన్
జక్కఁగ గుర్తు తేర్పతిచె • స్వామి వచించిన సొమ్ము లివ్వగన్. ౪౪౭

అర్థములు. చక్కని చేత = నాణెపుఁబని చేసిన, రత్నవిద్రుమ = రత్నములయుఁ బగడములయు, మహిష్ఠ = మిక్కిలి గొప్పదగు, విభాతి = కాంతికి, ఆకర =స్థాన మైన, భూషణంబులున్=సొమ్ములు, మక్కియు = ముఱికి యయ్యును.

తా త్ప ర్య ము.

చెట్లకొమ్మలందు సొమ్ములు వ్రేలాడుచున్నవి నిజమే, అవి యీామెవియే

యని యెట్లు నిశ్చయింప వచ్చును ? అని సందేహించి దాని నివర్తిచేసికొను చున్నాఁడు. నాగెముగాఁ బనిచేసిన కమ్మలు, బాగడలు, రత్నములు, పగడములు వీనిచేఁ బ్రకాశించు భూషణంబులు ఇవి ముఱికియయి నల్లవాఱె కూడ చాలదినములు ధరించుటచే నవి యీమె దేహముమీఁద గుర్తు లేర్పఱిచినవి.

అనఁగా నచ్చట శ్రీరామచంద్రమూర్తి సీత సొమ్ము లివి యని వేనిని జెప్పెనో యవి ధరించియుండిన దేహమునం దెట్టి గుర్తులు పడియుండునో యాగుర్తు లీమె దేహమునం దున్నవి. పనిలేనప్పుడు సొమ్ములు దీసిపెట్టుటకుఁ బెట్టెలు లేకుం డుటచే దేహమునందే విడువక ధరించి యుండుటచే దేహమునఁ గాయలు కాచె నని భావము. సీతాదేవి పాఱవైచినవి కాక యప్పుడు తొందరకుఁ దీయుటకు సాధ్యము గానివి దేహమందే యుంచుకొనెను. రామచంద్రమూర్తి తాను జూచిన నగలు గాక సీతాదేవి దేహముమీఁద నింకను నీ యీ సొమ్ము లుండెనని చెప్పెను. ఆ సొమ్ము లిందున్నవి. ఇది యాప్తవాక్యము.

క. అక్కడ నేఁ జూచిన నగ, లిక్కడఁ గనరావ; యున్న • విట నచ్చోటన్
జిక్కని సొమ్ములె; దీనికి, నొక్కింతయు సందియంబు • నొవరదు చూడన్. ౪౪౭

తాత్పర్యము.

• అక్కడ నే నేయే నగలు చూచితినో యా నగ లిచ్చటలేవు. ఇక్కడ నుండు నవి యచ్చట లేవు. ఇందు సందేహములేదు. అనఁగా నక్కడ నెడమ చెవి, ఎడమ ముక్కు, ఎడమచేయి, ఎడమ కాలికిఁ బెట్టుకొను సొమ్ములుండిన నిక్కడ నవి లేవు, ఇక్కడ కుడి ప్రక్కనే యున్నవి.

మఱి యెవ రైనను దన సొమ్ములు చెట్లకుఁ దగిలించె ననిన నిట్లుండుటకుఁ గారణములేదు. కావున నందు నేను జూచిన సొమ్ము లీమె ధరించినవే.

చ. పసిమికడానిడాలున శు•భం బయి యప్పుడు పోవువేళ నా
కసమున నుండి రాలుచు న•గంబునఁ గొంచ దొక చిక్కి త్రెస్సి తా
వెసఁ గపిపంక్తి చూడఁగను • ప్రేలిన చీరయు మేలిసొమ్ములున్
వసుమతి నీమెయే విడిచె • వంచనతే దొకయింత యేనియున్. ౪౪౮

ఇఁక మూఁడవ కారణ మూహించు చున్నాఁడు.

అర్థము. పసిమికడాని డాలు=పచ్చని బంగారు కాంతి, కొంచొక=కొంచెము.

తాత్పర్యము.

ఈమె యిప్పుడు పోవు సమయంబున నీమె వైచుటచే నాకసంబున నుండి పడుచు చెట్లకొమ్మలకుఁ దగులుకొని కొంచెము చినిగి కోఁతులు చూచుచుండఁగా పడిన పచ్చని బంగారు వన్నెగల యుత్తరీయము సొమ్ములు నీమెయే విడిచెను.

ఇందును మోసములేదు. సుగ్రీవుఁడు సీతాభూషణములను శ్రీరామునకుఁ జూపినపుడవి చెడకయుండెను. ఆకాశమునుండి కొండమీఁద వైచి నపుడు సొమ్ములు విఱిగి తునుకలై పోకుండునా యను సందేహమును వాల్మీకి యిచ్చటఁ బరిష్కరించుచున్నాఁడు. సీతాదేవి బండలమీఁదఁ బాఱ వైవ లేదు. చెట్టుమీఁదఁ బడునట్లు మూటను వేసెను. అది చెట్టు కొమ్మలకుఁ దగిలి యచ్చటనుండి నేలఁబడెను, గావున సొమ్ములు తునుకలు గాలేదు.

క. చిరకాలం బీ వసనము, ధరియింపంబడుట మాపు • తగిలియు రంగుల్
బరికింపఁగ నా చీరకు, సరియై యొప్పారె కాంతి • సంపద వన్నెన్. ౪౫౦

తాత్పర్యము.

అది యెట్టులందువా? అక్కడ చీరకెంగే పచ్చని వన్నెగలదో యా పచ్చని వన్నెగలది గానే యీమె చీరయున్నది. అయినను ఇది చిరకాలము ధరింపఁబడుటచే నుతుకుట లేకుండుటచే నీచీర రంగు మాసినను కాంతియందు వన్నెయందు నా చీరకు సరిపోలి యున్నది.

ఉ. ఈ కనకాంగి రాము హృద • యేశ్వరి దేవెరి దూరవిప్రవా
సాకుల యయ్యు రామహృద • యంబున నెప్పుడుఁ బాయ కున్న, ద
స్తోకము రామచంద్రు నెడఁ • దోఁచు సురూపము నంగసౌష్ఠవం
బీ క్షవలాక్షి యందుఁ బరి • దృశ్యము లయ్యెను యుక్తమే కదా! ౪౫౧

ఈమె సీతయే యనుటకు మఱికొన్ని కారణములు చెప్పుచున్నాఁడు.

అర్థములు. దూర విప్ర వాసాకుల = దూరదేశమున మగని విడిచి కలఁత చెందినది, సురూపము = సౌందర్యము, అంగసౌష్ఠవము = అవయవ పరిపూర్తి, పరిదృశ్యము లయ్యెను = చక్కఁగాఁ గానవచ్చుచున్నవి, యుక్తము = న్యాయము, రాము హృదయంబునన్ = రామునిన్ దన హృదయంబున - అనియు, తాను రాముని యొక్క హృదయము నందుండి యనియు నర్థము గ్రహింపవలెను. ఇట్లు చెప్పుటచేఁ బరస్పరానురాగము చెప్పఁబడెను. ఈ యర్థము బాలకాండమున ౧౩౬౪ వ పద్యము నందు 'శ్రీరఘురామ చంద్రుఁడును....మనం బా రమణీలలామ పయి నారని కూరిమి నిల్పి యామెయున్ గూరిమిఁ బేరిమిం జెలఁగఁ గూర్చె మనంబు సదా హృదీశుపై" అని చెప్పఁబడెను.

ఇట్లు చెప్పుటచే శ్రీరామచంద్రునకు హృదయేశ్వరి సీతాదేవి, శ్రీ సీతాదేవి హృదయేశ్వరుఁడు శ్రీరామచంద్రమూర్తి యని యేర్పడెను. ఈకారణమున నిరువురు నేకాభిప్రాయము గలవారే యని యేర్పడు చున్నది. ఆమె యూనినది ఆయన కాదనఁడు. ఆయన యూనినది యామె కాదనదు. సీతానుగ్రహము వచ్చిన రామానుగ్రహము వచ్చినట్లే. రెండవ వారి యందపూయలేక యుండవలెను.

తాత్పర్యము.

ఈమె సీతయే యనుటకు నాలుగవ కారణ మేమనిన:— ఈమె రామునకు హృదయేశ్వరి. రాణి కావున దూర దేశమందు మగని విడిచి యుండినను రామచంద్ర మూర్తిని హృదయమునందు వదలక నిలిపియున్నది. రామునియొక్క హృదయమునందు నీమె యెడఁబాయకున్నది. ఇఁక నైదవకారణమేమన - సాముద్రికశాస్త్రప్రకారము రామునం దేయవయవసౌష్ఠవము గలదో యట్టి సౌష్ఠవముగలవానికి నెట్టి యవయవ సౌష్ఠవము గలది భార్యగా నుండవలయునో, యట్టి యవయవసౌష్ఠవ మీమె యందుఁ గానవచ్చుచున్నది, కావున శాస్త్రప్రకార మాయన కీమెయే భార్యయయి యుండ వలె, నీమె కాయనయే భర్తయై యుండవలెను. ఇది న్యాయ్యమే కదా. ఇది శాస్త్రప్రమాణము.

ఈ పద్య మందు శ్రీరామచంద్రుని నెడఁ దోఁచు నంగసౌష్ఠవము లీ కువలాక్షి యందుఁ బరిదృశ్యము లయ్యె నని సీతారాముల కైక్యము చెప్పఁబడెను. మగవాని చిహ్నము లాఁడుదానియందు, నాఁడుదాని చిహ్నములు మగవాని యందున్న వని చెప్పరాదు. కావున నిక్కడ సామ్యమే గ్రహింపవలెను.

క. శ్రీరాఘవుఁ డీమెనుఁగాఁ, గారుణ్యం బానృశంస్య• గరిమయుఁ గదు దు
ర్వారపుశోకము మదనుఁడు, గావింపఁగ వేఁగునట్టి• కాంత యిదే యౌ. ౪౫౨

అర్థములు. కారుణ్యము=దయ, ఆనృశంస్యము = క్రూరత్వము లేకుండుట, వేఁగు = పరితపించు.

తాత్పర్యము.

పైఁ గ్రింద వివరించిన నైదుకారణములచే నీమె రాముని భార్య సీతాదేవియే యని నిశ్చయించుచున్నాఁడు. శ్రీరామచంద్రమూర్తి యేమె నిమిత్తము దయ, యక్రూరత్వము, వారింపరాని శోకము, కామము బాధింపఁగాఁ బరితాప పడు చున్నాఁడో యామె యీమెయే. రామచంద్రమూర్తి భార్య నిమిత్తమై శోకించుట కీ నాలుగు కారణములు. ఇవి క్రింది పద్యమున వివరింపఁబడు చున్నవి.

సీ. ఆపదవేళల • నంగన నొక్కర్తుఁ బ్రోవలే దనెడి కా•రుణ్యమునను
నన్ను నమ్మినదాని • కిన్ని పా ట్లబ్బిన, నైఁచితి నను నానృ•శంస్యమునను
నర్ధాంగలక్ష్మిని • నకట కోల్పడితిఁగా, సుందరి ననియెడి•శోకమునను
నొద్ద లే దాయెఁగా • యొప్పులకుప్ప నా, ప్రియ యన్న వెరవేఁకి•వేఁకరమున

తే. నకట యీ నాలుగింటను • నడలు చుండు
రామచంద్రుండు హృదయ మీ•రామయంద
నిలిపె నీమెయుఁ బతియంద • నిలిపె మనముఁ
గాన బ్రదికిరి వీరలు • గడియ నైన. ౪౫౩

అర్థములు. అర్ధాంగలక్ష్మిని = తనదేహమునందు సగభాగమైన దానిని, కోల్పడితిగా = పోగొట్టుకొంటిని, రూ. కోలుపోవు - కొల్లపోవు - కోల్పోవు. వెరవేకి వేకరమునన్ = విరహజ్వరముచే.

అర్ధాంగలక్ష్మి - 'లోకే వేదే చ శాస్త్రే చ ధర్మశాస్త్రేషు చైవ హి, శరీరార్ధం స్మృతా జాయా, పుణ్యాపుణ్యఫలే సమే.

లోకవ్యవహారమందు వేదమందు స్మృతులందు ధర్మశాస్త్రమందు భర్త దేహములో సగము భార్య. అట్లులే పుణ్యపాపములందు నని యర్థము.

అర్ధోవా ఆత్మనో యత్పత్నీ॥
శాస్త్రప్రయోగా ద్వివిధాచ్చ వేదా
దాత్మాహ్యానన్యః పురుషస్య దారా॥

ద్వేధాకృత్వాత్మనో దేహ, మర్ధేన పురుషోఽభవత్ । అర్ధేన నారీ తస్యాం సవిరాజ మసృజత్ప్రభుః॥ మమ నైనైవ రేమే తస్మా దేకాకీ నరమతే । సద్వితీయ మైచ్ఛత్ । సహైతావా నాస యథా స్త్రీపుమాంసౌ సంపరిష్వక్తౌ । స ఇమే మేవా త్మానం ద్వేధా పాతయత్తతం పతిశ్చపత్నీచాభవతాం తస్మాదిద మర్ధబృగల మివ స్వ ఇతిహస్మాహ యాజ్ఞవల్క్య స్తస్మాదయ మాకాశః స్త్రియా పూర్యత ఏవతాగం సమభవత్తతో మనుష్యా అజాయంత । బృహ. దా. ౪. బ్రా, 3 వ మంత్రము.

యో భర్తా సా స్మృతాంగనా । మను ౯. ౪౫.

యోభర్తా సైవ భార్యా స్మృతా - వాజసనేయ బ్రాహ్మణము.

కస్సవితా! కా సావిత్రీ! పురుషఏవ సవితా, స్త్రీ సావిత్రీసయత్ర పురుష స్తత్ స్త్రీ । యత్రవాస్త్రీ సపురుష । స్తేద్వేయోనీ తదేకం మిథునమ్॥ సావిత్ర్యుపనిషత్తు.

ఈ ప్రమాణములు పురుషునిలో సగము భార్య యని చెప్పుచున్నవి. కావున భార్యా భర్తృ సంబంధము జన్మాంతరము లందును తప్పదు. ఈవిషయ మయోధ్యా కాండము నందుఁ గిష్కింధాకాండము నందుఁ జర్చింపఁ బడెను.

తాత్పర్యము.

శ్రీరామచంద్రమూర్తి సీతాదేవికై దుఃఖించుటకు హనుమంతుడు నాలుగు కారణములు చెప్పుచున్నాఁడు.

౧. పురుషుఁ డగువాఁడు ఆఁడుకొయిలు ఆలకొయిలు విన్నంత మాత్రముననే దన ప్రాణమిచ్చియైన వారిని రక్షింపవలయును. ధర్మశాస్త్రమిట్లుండఁగా నాపదవేళ నొక్క యాఁడుదానిని నేను క్షత్రియుఁడనై యుండియుఁ గాపాడలేక పోయితిని గదా యను సర్వ భూతదయ.

౨. ఆ స్త్రీయైనను అన్యస్త్రీ గాదు. నేను దన్ను రక్షింపఁ గలవని నమ్మి తన రక్షణభారము నామీఁద వైచి వేఱు రక్షణము గోరక సర్వ సౌఖ్యములు వదలి యన్ని కష్టములు పడుచు నావెంట వచ్చినది. అట్టి దానికి నెట్టి కష్టము రానీయక కాపాడవలసి యుండఁగా నిన్ని కష్టము లామె పడుచుండినను ఆశ్రయ మగు నేను చేరగాని వలె సహించితిని. నే నెంత క్రూరుఁడను ?

౩. నన్ను నమ్మి వచ్చినది దాసిన కాదు. రక్త బంధువు కాదు. నా దేహములో సగమైనది. నా కుడిభాగము నేను రక్షించుకొను విధముగా నెడమ భాగము రక్షింపవలయును. అట్లు రక్షింపకుండిన నాకే హాని ! అంతటి భారము నాయం దుండియు నటువంటి సుందరిని బోఁగొట్టుకొంటిని. నా దేహము నే కాపాడుకొన లేనివాఁడను. నే నేమి మగవాఁడను, నే నేమి క్షత్రియుఁడను ?

౪. మాకుఁ బరస్పరానురాగ ముండినను, లేకుండినను అది భార్య-భర్తవ్య యని, నేను భర్త – పతి యని యుండు వఱకు దానిని భరింపవలసిన పాలింపవలసిన భారము నాయం దున్నది. అంతమాత్రమే కాదు. సీతాదేవి యొప్పుల కుప్ప. సమస్త సద్గుణరాశి. అవగుణము లేనిది. ప్రియురాలు. నాయందు ప్రేమగలది. ఇట్టిది సమీపమం దుండినను 'ఒవరభార్యాసమేతుఁడై యున్న వాని కెంత లాభ మయ్యెను నెఱుకపడవు' అన్నట్లు లామె సాన్నిధ్యమాత్రమే నా కష్టములు కష్టములుగాఁ దోఁపనీయదు. విశేషము లేకున్నను ఆమెతో నింపుగా మాటలాడుచుండినను జాలు. అదియు లేకుండఁ జేసికొంటిని గదా. లక్ష్మణునకు వలె వెంట లేకుండిన నే వ్యసనములేదు. ఉండిపోయిన దుఃఖ మెక్కువ. ఈ వియోగము నే నెట్లు సహింతు ననియెడి మదన తాపమునను.

ఈ నాలుగింట రామచంద్రమూర్తి బాధపడుచున్నాఁడు. ఈ నాలుగవది లేకుండిన రామచంద్రమూర్తి నపుంసకుఁడో, మందుఁడో, మనుష్య స్వభావ శూన్యుఁడో యని చెప్పవలసి యుండును. ఈ కారణములచే రామచంద్రమూర్తి కేవల కాముకుఁడై దుఃఖింపలే దని యేర్పడుచున్నది. రామచంద్రమూర్తి యీయామెయందుఁ దన మనస్సు నిలిపెను. ఈమె రామచంద్రమూర్తి యందు మనస్సు నిలిపెను. కావున వీరి మనస్సు లెచ్చట న్యాయముగా నుండవలయునో యచ్చటనే యున్నవి. దేహములు మాత్రము వేఱుగా నున్నవి కాని మనస్సు లేకముగా నున్నవి. కావుననే వీ రిరువురు బ్రతుకఁ గలిగిరి. ఆయన మనస్సు ఈమె యందు లేకుండినను ఈమె మన సాయన యందు లేకుండినను ఇరువురు మరణించి యుందురు. జీవాత్మ పరమాత్మల కీ సంబంధము నెఱుంగునది.

క. ఎంతటిదుష్కరమును భూ, కాంతుఁడు ఘటియించె నీమెఁ • గనకయు బ్రదికెన్
జింతావ్యథఁ జిక్కుండును, వింత గదే మిగుల రామ•విభుచరితంబుల్. ౪౫౪

అర్థములు. దుష్కరము = చేయుటకు మిగులఁ గష్టమైనది.

తాత్పర్యము.

ఈమెతో సరస సల్లాపము లాడకుండిన బోనీ, సంభోగింప కుండినను మానీ, కనులనైనం జూడక యీమెను విడిచి యిన్ని దినములుగ బ్రదికి యున్నాఁడే. బ్రదికి యుండుటే కాదు, చింతచే బాధపడ కున్నాఁడే. రామచంద్రమూర్తి యెంతటి యసాధ్య కార్యమును జేసెను.

ఆయుస్సు తన స్వాధీనము గాదు. కావున బ్రదికియున్నాఁ డనుకొందునా. చింతచేతఁ గూడ కృశింపకున్నాఁడే. ఏడువలేదా యందునా. ఏడుపున కేమి. ఏమాత్రము ప్రీతిగలవారు పోయినను దుఃఖము వచ్చును. అంతియ కాని యట్టి దానిని బోఁగొట్టుకొని యీమెవలె నిద్రచాలించెనా? ఆహారము చాలించెనా? పడుక పెట్టెనా? ఈ వియోగమునకుఁ దగినంత కార్శ్య మేమి చేసెను. రామచంద్రమూర్తి నడవడి మిగుల నాశ్చర్యకర మైనదే. ఏమి యీయన యింద్రియ జయము. ఋశ్యమూక మందు రామచంద్రమూర్తి యీమెకై యేడ్చుచుండుట చూచి యయ్యో యింతటి ధీరోదాత్తుఁడు మహానుభావుఁడు ఒకయాఁడుదానికిఁ గా నిట్లేడ్చు చున్నాఁడే. ఎంత కామదాసుఁడు, ఎంత యింద్రియజితుఁ డని తలఁచితిని గాని యీమెను జూచిన తరువాత రామచంద్రమూర్తి పాషాణ హృదయుఁడనియే చెప్పవలసి యున్నది.

రాముఁడు భూకాంతుఁడు గనుక బ్రదికెను. 'నిండు మనంబు నవ్యనవనీత సమానము, పల్కు దారుణాఖండల శస్త్రతుల్యము, జగన్నుత విప్రులయందు నిక్కమీ రెండును రాజు లందు విపరీతము' రాజులకు వాక్కు తీపేగాని, మనస్సు వజ్రకఠినము. కావున బ్రదికెను. భూకాంతుఁడు అచేతనమైన భూమిని అశ్వగజరథాదుల నామోదింపఁజేయుఁవాఁడే కాని ప్రథమ ప్రణయపాత్రమైన భార్యను రంజింపఁజేయు నంతటి రసికుఁడు గాఁడు కావున బ్రదికెను.

బ్రదికెన్ = బ్రదికియున్నాఁడే. అది యాశ్చర్యము. సీతాదేవిని విడుచుట వలన నెంత దుఃఖము కలుగవలయునో యంత దుఃఖము రామున కున్న యెడల బ్రదికియుండునా? బ్రదుకక యేమిచేయు మనెదవు? ఆత్మహత్య చేసికొను మనెదవా? అక్కఱలేదు. ఈమెను విడుచుటవలన నెంతదుఃఖము కలుగవలయునో యంతదుఃఖము కలవాఁ డయ్యేనేని ప్రాణములు తమంతటఁ దామే యీశరీరమును విడిచి కాలుచున్న యింటిలోఁ మనుష్యు లుండక పోవునట్లు పోయి యుండును. ఈయన ప్రయత్న మక్కఱయే లేదు. అట్లైన సీత ప్రాణ మేల పోలేదు. ఆమెకు దుఃఖము లేమికదా యందువేమో? సీత పరతంత్ర, భర్త యాజ్ఞ లేక మరణించుటకు నధికారములేదు. ఆమె దేహము, ప్రాణము రాముని సొత్తే. ఆమె యొట్లు పోఁగొట్టం గలదు. అవి పోయెద మన్నను నామె బిగఁబట్టవలెను. రాముఁడు స్వతంత్రుఁడు. దేహము వదలిపెట్టవలసి యుండెను. వదలిపెట్టక బిగఁబట్టి యున్నాఁడే. అదియే యసాధ్యకార్యము.

అన్యత్ర భీష్మా ద్గాంగేయా । దన్యత్ర చ హనూమతః

హరిణీఖురమాత్రేణ । చర్మణా మోహితం జగత్.

గంగానందనుఁడైన భీష్ముఁడు హనుమంతుఁడు వీ రిరువురు తప్ప దక్కిన ప్రపంచమంతయు నాఁడు జింకగిట్టంత చర్మమునకు మోసపోయియున్నదియని జితేంద్రియుఁడని ప్రసిద్ధిగన్న హనుమంతుఁడుకూడ రామచంద్రమూర్తి సీతాదేవిని విడిచియుండుట చెడుకార్య మని నిందించుచున్నాడు. ఎంతటి దుష్కరమును రామవిభుఁడు సలిపెను. ఎంతటి దుష్టకార్యమును రామభూవిభుఁడు చేసెను. ఏమి చెడుకార్యము చేసె నందువా? ఏ ట్లీమెను విడిచి యల్పకాలమైన మాయామృగము వెంటఁ బోయెను. సీతాదేవి కోరినఁగదా పోయెను, అందువా? సీతాదేవి స్త్రీ. బుద్ధి చపలత స్త్రీస్వభావము. 'పెడతలనుండుంగా యువతీ బృందము కెల్లను బుద్ధి' యన్నట్లు వారు కోరికలు కోరుదు రేకాని దానివలన వచ్చు మేలు కీళ్ళ నాలోచింప శక్తి గలవారు గారు. నిజముగ నీమె మీఁదఁ బ్రేమయే యుండిన నీమెను విడిచి తుచ్ఛమృగమునకై పోవునా? ఆమె కోరిక నెఱవేర్పవలసి యుండినఁ దానే పోవలయునా? లక్ష్మణుని బంపరాదా? అది మూర్ఛపోయి పడు నట్లు అప్పటినుండియే కాకిమీఁద వైచినట్లు సమ్మోహనాస్త్రము వేయరాదా? అటుచేయక, యిటుచేయక యీమెను విడిచి పోయెనే. అదియే చెడ్డకార్యము. అట్లు చేసినకదా యిప్పు డీమె యింత కష్ట పెట్టుచున్నాఁడు. రాముఁడు గనుకఁ జేసెను. రాముఁడనఁగా పైకి రమణీయమైన యాకారము గలవాఁడే కాని లోపలఁ దెలివి తేటలు గలవాఁడు కాఁడు. కనుకనే కదా నీవు పురుష వేషము వేసికొన్న యాఁడుదాని వని సీత చెప్పెను. అంతటి తెలివి లేని వాఁడైనచో భూకాంతుఁ డెట్లయ్యె నందువా. విభుఁడు గదా. వి + భు = భూ సత్తాయాం అన్నట్లు సామర్థ్యము లేని వాఁడు గదా విభుఁడు. అది యే మట్టు లనెదవు? ప్రేమము తెలివి తేటలు సామర్థ్యము లేనివాఁడు తన తోడ నరణ్యమునకుఁ బిలుచుకొని వచ్చెనా యందు వేమో? ప్రేమగలవాఁడయ్యెనేని నే నరణ్యమునకుఁ బోయెద ననఁగానే నేను వచ్చెద నని సీతాదేవి చెప్పినట్లు చెప్పక నీవు నా వెంట రావల దనునా? ఇది ప్రేమగలవాని లక్షణమా? ఆమె యీయనయం దత్యంత ప్రేమగలది కావున నీయనను విడిచి యుండలేక వెంట వచ్చెదనని పోరాడి బలాత్కరించి సాధించెను. ఆమె పోరాటము పడలేక పిలుచుకొని వచ్చెనుగాని లేకున్నఁ బదునాలుగేం డ్లామెను విడిచియుండ ప్రయత్నించెను గదా. ఇదిగూ ప్రేమలక్షణము. పదునాలుగేం డ్లుండఁ గలవానికిఁ బదినెల లేమి లెక్క? కావున రాముఁడు చేసినది చెడుకార్యమే. అక్కడ రాముఁ డేడ్చుటఁజూచి యాయన నిజమైన నిండుప్రేమ గలవాఁడని తలఁచితిని గాని యీమె యుండు స్థితిఁజూచిన నాకు నిప్పు డాయన దయలేనివాఁ డనిగూ తోఁచుచున్నది.

ఘటియించెన్ = ఎంత మతిమాలినవాఁ డైనను దనసంసారమును దాను

తెలుచుకొనునా యుండువేమో ! తెలుచుకొనునా యని సందేహమేల ! ఘటియించెన్=చేయనే చేసెనుగదా. మంకేటి శంకగాని కద్దు మేల ! తన తెలివిలేమికిఁ దా ననుభవించునుగాక ! నిష్కారణముగ నిటువంటి నిష్పాపను నింత కష్టములపాలు చేసెఁగదా. దానికై నే నేడ్చెదను !

తన తండ్రి కాముకుఁడై భార్యకు వశపడి తన్నిట్లు కష్టపెట్టె ననికదా రాముఁడు చెప్పెను. (అయోధ్య స.) తానో భార్యయం దుంచవలసిన ప్రేమ యుంచకకదా నిష్కారణముగ నీమె నింత కష్టపఱచెను. తమ్ముఁడు, పెండ్లాము మనవును తనకు సేవ చేయ నుండినను ఊరువిడిచి రావలయుననిన నంత కష్టపడినవాఁ డొంటరిగ మనుష్య ముఖదర్శన ప్రాప్తి లేక రాక్షసులచేతిలోఁ జిక్కి యెంత కష్టపడుచున్నదో యాలోచించెనా ? కావున రామచంద్రమూర్తి చేసినది చెడుకార్యమే. ఏల యిట్లు చేసెను! ప్రణయవిద్య యందు నాయనకు ఓనమాలుకూడ రావు. గనుక ప్రణయ మనునది తెలియక చేసెనేకాని తెలిసి చేసినవాఁడు కాఁడు.

దుష్కరమును = భార్యను విడిచియుండుట దుష్కరమేని లోకములో భార్యలులేనివా రెందఱు లేరు. వా రందఱును దుష్కరమును జేసినవారా ? కారు. 'అనన్యా హి మయా సీతా భాస్కరేణ ప్రభా యథా' సూర్యునకు నెండవలె సీత నా కనన్య; నన్నువిడిచి యుండదు; ఆమెను విడిచి నే నుండను అని చెప్పినవాఁడు కదా రాముఁడు. ఎండనువిడిచి సూర్యుఁ డుండుట సుకరమా? ఎండను విడిచి సూర్యునివలె సీతను విడిచి రాముఁ డుండుట దుష్కరము కాదా. ఎండలేని సూర్యుఁడు తేజోహీనుఁడు, పూజ్యుఁడు కాఁడు. ఎండవలని మేలునకై కదా లోకులు సూర్యుని బూజించుట. ఎండలేని సూర్యుని నెవరు పూజింతురు. అట్లులె సీతాదేవి తనతోడ లేదేని దాను తేజోహీనుఁడు, అపూజ్యుఁడు అని కూడ నాయనకుఁ దోఁచినది కాదు కదా. అట్లయిన నెట్లు విడిచి యున్నాఁ డనిన, భూకాంతుఁడు గనుక భూమి (రాజ్యము) ఆయనకుఁ గాంతను = ప్రియమైన నట్లు సీత కాలేదు. కావున మృగమునిఁదది కాంక్షచే సీతను విడిచి పోయి నట్లు రాజ్యకాంక్షచే సీత నుపేక్షించెను.

క. ఎంతటి దుష్కరమును దుర్దాంతపరాక్రముఁడు సల్పు • రాముఁడు సీతా
కాంత మదిరాయతాంబక, చెంతను లేకున్నఁ ద్రుటియు • జీవముఁ దాల్చెన్.

అర్థములు. దుర్దాంత పరాక్రముఁడు = అణఁపరాని విక్రమము గలవాఁడు, మదిర + ఆయత + అంబక = సారాయము వలె మోహింపఁజేయు దీర్ఘములైన నేత్రములు గలది. త్రుటియు = అల్పకాలమైనను.

తాత్పర్యము.

రామచంద్రమూర్తి నిజముగ దుష్కరకార్యమే చేసెనని దృఢపఱుప, దానినే మఱియొక విధముగఁ జెప్పుచున్నాఁడు. 'అదరా ద్ద్వియుక్తి' యని కలదు గదా.

దుర్దాంత పరాక్రముఁడు = అణఁపరాని పరాక్రమము గలవాఁడు. ఇచ్చట శత్రువుల కని చెప్పుట యప్రస్తుతము. ఇచ్చట శత్రువు లింద్రియములే. ఇంద్రియము లను నణఁపరాని మనోబలము కలవాఁడు కావుననే కామమునకు వశపడక బ్రదుకఁ గలిగెను.

మదిరాయతాంబకా:— మదిరా = సారాయమువలె, మత్తును గలిగించు, ఆయత+అంబక=దీర్ఘములైన కన్నులు గలది. మదమనఁగా సంతోషము. సంతోషాతిశయముచే దేహము దెలియకుండఁ జేయునది మదిర, అట్టి గుణముగల దీర్ఘనేత్రములుగలది. సారాయము త్రావిన వానికి దేహము తెలియకపోవునట్లు లామెకన్నులు చూచిన నంతటి సంతోషము గలుగు ననీ భావము. సారాయమువలెఁ ద్రాగ వలసిన పనిలేదు. దగ్గఱ నుంచుకొని చూచుచుండినఁ జాలును. దానివలె నల్పకాల ముండునది కాదు శాశ్వతముగ నుండునది. చెంతను లేకున్న = అనుభవింపక పోయినను ఊరక సమీప మందుండినను జాలును. త్రుటియున్ = మత్తు వస్తువులు సేవించువారు దానిని వేళకుఁ దీసికొనక క్షణ మాలసించినను వెఱ్ఱి యెత్తినట్లయి మిగుల బాధ పడుదురు. విశేషాభ్యాసముగలవారు చావనే చత్తురు. అట్లుండ నిన్ని సంవత్సరము లనుభవించుచుండి యిప్పుడు తటాలున నీమెను వదలి క్షణమైన నెట్లు బ్రదుకు చున్నాఁడు. ఇది దుష్కరమే కదా. సారాయము మనుష్యుఁడైన వానికెట్టివానికైన దేహ విస్మృతి కలిగించి తబ్బిబ్బు పడఁజేయును. బండమీఁద బోసిన నే మగును? అట్టులే యీమె కన్ను లాయనకు మత్తు కలిగింపలేవు. కావున ఆయన హృదయము గుండో, రాయియో యై యుండవలెను.

జీవనముఁ దాల్చెను=జీవుని ధరించెను. జీవితేశ్వరి యగు నామె పోయినపిమ్మట నాకేమిపనియని జీవుఁడు పోవఁదలఁచినను బోనీయక బిగఁబట్టెను. ఇదిదుష్కరమేకదా. ఇంతటి యసాధ్యకార్యములు సాధించు రామచంద్రమూర్తి సామాన్యుఁ డని యెట్లు చెప్పవచ్చును. ఇది చేయఁగలిగినవాఁ డెంత యసాధ్యమైన కార్యమైనను జేయఁ గలవాఁడే.

దుష్కరమును హేమాహేమీలు ఘటాఘటీ లగు వానరు లందరు మాచేతఁ గాదు మాచేతఁగాదని చెప్పినదానిని సముద్రముదాటి లంక ప్రవేశించి రావణునకు దెలియకుండ లంకయంతయు శోధించి సీతను జూచి నేనే యసాధ్య కార్యమును జేసితి నని గర్వించితిని కాని రామచంద్రమూర్తి చేసిన కార్యము నెదుట నేను జేసినది గొప్పగాదు.

క. అని జానకిఁ గని పావని, మనమున సంతోషమగ్న•మానసుఁ డగుచున్
ఘనుఁ బ్రభుని రాము నెంతయుఁ, గొనియాడె నదెంతవాఁడొ•కో యతఁడనుచున్

తా త్ప ర్య ము.

అని తలఁచుచు జానకీదేవిని జూచి మాసినచీరతో స్నానములేని దేహములో నిద్రాహారములు విడిచి భర్తనే ధ్యానముచేయు నిట్టి పరమపతివ్రతను జూచు నదృష్టము నాకుఁ గలిగెఁగదా. వానరు లందఱు బ్రదికిరిగదా. సుగ్రీవుఁడు కృతజ్ఞుఁ డయ్యెఁగదా. రామలక్ష్మణుల కార్యము నెఱవేఱెఁ గదా యని సంతోషములో మునిఁగిన మనస్సు గలవాఁడై ఘనుఁడును ప్రభువును నగు రామచంద్రమూర్తిని 'ఆహా యీయన యెంత గొప్ప వాఁడో, గాకున్న నిట్టిస్త్రీకి భర్తయగునా! ఎంతటి జితేంద్రియుఁడు గాకున్న నీమెను విడిచి బ్రతుకునా? ఎంతటి ప్రభువు = సమర్థుఁడు గాకున్నఁ బోనున్న ప్రాణముల నిలుపఁ గలుగునా! ఇంత కార్యము చేయఁగలుగునా? ప్రభుః = ప్రభవతి సమర్థో భవతీతి ప్రభుః - భూ సత్తాయాం - సమర్థుఁడగువాఁడు ప్రభువు. అని రామచంద్రమూర్తి సామర్థ్యమును బొగడెను.

—• ౧౬-వ సర్గము. హనుమంతుఁడు సీతాదేవి స్థితికి దుఃఖించుట. •—

ఉ. రాము గుణాభిరాము నల•రామ నుతించి ప్రశంసితవ్యఁ జిం
తామథితాత్ముఁడై పవన•నందనుఁ డశ్రులు గ్రమ్మ కన్నులన్
రాముని దేవిఁ గూర్చి యపు•రా యనుచున్ విలపించి మూర్తి మి
ట్లా మహిమాఢ్యుఁ డుండి తద•నంతర మి ట్లని యేడ్చె దుఃఖియై. ౭౫౭

అర్థములు. గుణాభిరామున్ = గుణములచే నభిరాముఁ డగు వానిని, అల = ప్రసిద్ధికెక్కిన, ప్రశంసితవ్యన్ = గుణములచేఁ బొగడఁ బడఁదగినదానిని, ఆయన రాముడు, ఈమె రామ; ఆయన గుణాభిరాముఁడు, ఈమె ప్రశంసితవ్య కావున నిరువురు సమాను లని భావము. సీతారాములు గుణము లందు సమానులు. వాత్సల్య సౌలభ్యముల యందు సీత రాముని కంటె శ్రేష్ఠురాలు కావున నిరువురు కలసిననే గుణసంపూర్తి. లేకున్నఁ గొఱఁతయే. పరతంత్రగావున రాముని కంటెఁ దక్కువ. చింతామథితాత్ముఁడు = చింతచేఁ జిలుకఁబడిన మనస్సుగలవాఁడు. అశ్రులు = కన్నీళ్ళు, మహిమాఢ్యుఁడు = మహిమ యను సంపత్తిగలవాఁడు. గొప్ప గుణములను నవి లోకమున నేవికలవో యవి యన్నియు హనుమంతునందుఁ గలవు. దుఃఖియై = దుఃఖము గలవాఁడై.

తా త్ప ర్య ము.

గుణాభిరాముఁ డగు రాముని గుణములచేఁ బ్రశంసింపఁదగిన ప్రసిద్ధి కెక్కిన సీతను హనుమంతుఁడు పొగడి చింతచే వ్యాకులపడిన మనస్సుగలవాఁడై యాంజనేయుఁడు కన్నీళ్ళు కారఁగా రామచంద్రమూర్తి భార్య యగు సీతాదేవి నుద్దేశించి యౌరా యీమె యెటువంటి యుత్తమురాలు. ఇటువంటి యీమె కెటువంటికష్టము వచ్చెను, అని యేడ్చి యీ ప్రకార మీ గొప్ప గుణసంపత్తిగల హనుమంతుఁడు కొంచెము సే పుండి మరల దుఃఖము సైఁపలేక యిట్లేడ్చెను.

క. శీలవతి గురువినీతుం, డౌ లక్ష్మణునకును మాన్య • యతని గురునకున్
మేలిప్రియ సీత వగచినఁ, గాలము దురతిక్రమంబె • కా యెవ్వరికిన్. ౪౨౮

అర్థములు. శీలవతి = పతివ్రత, గురువినీతుండు = మిక్కిలి జితేంద్రియుఁడు. (౨) మిక్కిలి వినయము గలవాఁడు (3) గురువులచే శిక్షింపఁబడినవాఁడు. లక్ష్మణునకును = లక్ష్మణు నంతవానికిని, మాన్య = పూజింప నర్హురాలు. దురతిక్రమంబెకా=అతిక్రమింపరానిదే కదా. ఎవ్వరికిన్=ఎంతటివారికైనను.

తాత్పర్యము.

ఈమె మహాపతివ్రత. ఆ కారణముచేతనే యీమె కెట్టి యాపదయు రాఁగూడదు. అంతియగాక, మిక్కిలి జితేంద్రియుఁడు 'తరుణీ కుణప మన్నట్లు పరస్త్రీలను శవములవలెఁ జూచువాఁడు. అటువంటి లక్ష్మణునకు మాన్య- పెద్ద లగు జ్ఞానులచేఁ జక్కఁగా శిక్షింపఁబడిన మనస్సు గలవాఁడు. కావున పరిపక్వమైన మనస్సుగలవాఁడు. అటువంటి లక్ష్మణునకును మాన్య, 'యస్య దేవే పరాభక్తి ర్యథా దేవే తథా గురౌ' అన్నట్లు భగవంతునం దెంత భక్తియో యంతభక్తి యన్న యందుఁ గలవాఁడు. అటువంటి వానికిని మాన్య. అంతియ కాదు. అటువంటి లక్ష్మణుని గురువునకు మిక్కిలి ప్రియురాలు. అంతటివాని గురు వీమె యందెంత గొప్పతనము లేనిదే యీమె యందుఁ బ్రియము గలవాఁ డగునా? అటువంటి సీత. ప్రకృతి కతీత. అందఱవలెఁ బాంచభౌతికమైన గర్భమునుండి కర్మానుభవమునకై పుట్టినది కాదు. అట్టి యీమెకే వ్యసనము ప్రాప్తించిన నిఁక లోకము నందుఁ గాలము నతిక్రమించువాఁ డెవఁడు? అది యెవ్వని కెంతవానికి సాధ్యము గాదు.

కాలము దురతిక్రమం బను నీతి రామాయణమునఁ బలుతావుల బోధించుచున్నది. కావున నా నీతిని నెక్కువగ మనస్సునం దుంచికొని సర్వము కాలాధీనము గదా యని దుఃఖ సంతోషములకుఁ బాలుపడ రాదు. జగద్రక్షకులైన రామ లక్ష్మణులు రక్షించు నప్రాకృతయైన సీతకే యీ లోకమునకు వచ్చిన కారణమున నిన్ని కష్టములు ప్రాప్తించెనే, ఇఁక మన మనఁగా నెంత యని సముద్రమున పైపై నలలు కదలిన లోఁతున నీళ్లు కదల నట్లు మనస్సు పరితాపపడినను బుద్ధిని వ్యాకుల పడనీయరాదు. సహింపవలెను. యుద్ధ. ౨౬. ౨౫ పద్యముజూచునది.

క. రాముని వ్యవసాయంబును, ధీమత్సౌమిత్రిమతముఁ • దెలియుట సీతా
భామామణి కలఁకం గన, దేమియు వావలకు వేల్పు • లేటి విధమునన్. ౪౨౯

అర్థములు. రాముని వ్యవసాయంబును = రామచంద్రమూర్తి నిశ్చయమును, రామచంద్రమూర్తి తన యాశ్రితులను వారి ప్రయత్నము నపేక్షింపకయే తానే సర్వప్రయత్నములు చేసి వారి నేవిధముగ నైన రక్షించువాఁడు'వ్రతమిదినాకున్ విడిచెద బ్రాణము లైనను' అని యాశ్రితరక్షణమును దనప్రాణ మిచ్చియైనఁ జేయువాఁడు.